# సాయి దీవెన

## సాయిపథం ప్రచురణలు

శ్రీసాయితత్త్వాన్ని దర్శింపజేసే **శ్రీబాబూజీ** విరచిత "సాయిభక్తి సాధన రహస్యం"
**ముద్రణ:** గురుపూర్ణిమ, 1996

శిరిడీ ఆరతుల్లోని భావసౌందర్యాన్ని ఆస్వాదింపజేసే **శ్రీబాబూజీ** విరచిత
ఆంగ్ల గ్రంథం *Arati Sai Baba*
**ముద్రణ:** 1996

శ్రీదాసగణు మహరాజ్ విరచిత గ్రంథాల్లోని కొన్ని భాగాలకు తెలుగు అనువాదం,
**శ్రీబాబూజీ** వివరణాత్మక పీఠికతో "శ్రీసాయి గురుచరిత్ర"
**ముద్రణ:** గురుపూర్ణిమ, 1996

శిరిడీ ప్రాశస్త్యాన్ని వివరించే ఆంగ్ల గ్రంథం
*Experiencing Sai Baba's Shirdi: A Guide,* by Alison Williams
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2002

శ్రీబి.వి.నరసింహస్వామిగారి *Devotees Experiences of Sri Sai Baba*
ఆంగ్ల గ్రంథానికి ఆంధ్రానువాదం "శ్రీసాయిభక్త అనుభవ సంహిత"
**ముద్రణ:** విజయదశమి, 2008

**శ్రీబాబూజీ** మహాసమాధి సమయంలో, అనంతరం భక్తుల అనుభవాలు
"స్మృతిసుమాలు" (*Smriti Sumalu - Flowers of remembrance)*
**ముద్రణ:** గురుపూర్ణిమ, 2011

# సాయి దీవెన

*పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీతో*
*భక్తుల అనుభవాలు*



*సాయిపథం పబ్లికేషన్స్*

**శిరిడీ | చెన్నై | హైదరాబాద్**

Sai Deevena (Telugu)

# సాయి దీవెన


| | |
|---|---|
| ప్రచురణ: | సాయిపథం పబ్లికేషన్స్<br>సాయిపథం, శిరిడీ – 423109<br>*Saipatham Publications*<br>*Saipatham, Shirdi - 423109*<br>*publications@saimail.com* |
| *ISBN:* | *978-81-88560-04-2* |
| ప్రథమ ముద్రణ: | విజయదశమి, అక్టోబర్ 2011<br>Vijayadasami, October 2011 |
| ద్వితీయ ముద్రణ: | మే 27, 2012<br>27th May, 2012 |
| ప్రాసెసింగ్: | సాయిముద్ర, శిరిడీ<br>*Sai Mudra, Shirdi* |
| ముద్రణ: | సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్<br>చెన్నై – 106<br>*Saibonds Print Systems*<br>*Chennai - 106* |
| *Website:* | *www.saibaba.com* |

పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ

చరణారవిందములకు ప్రేమపూర్వక సమర్పణ



*శ్రీబాబూజీ, తిరుమల, 1995*

# ప్రకాశకుల ముందుమాట

"నా చర్యలు అగాధాలు. ఎవరైతే నా లీలలను మననం చేస్తూ అందులో మునిగిపోతారో వారికి జ్ఞానరత్నాలు లభిస్తాయి" అని ఉద్బోధించారు శ్రీసాయిబాబా. "శ్రీసాయి సచ్చరిత్ర" సర్వమూ శ్రీసాయి దివ్య లీలాప్రబోధమే! భక్తుల అనుభవాల నేపథ్యంగా సాగే శ్రీసాయి అగాధతత్త్వసారమే! శ్రీసాయి నోట పలికిన ప్రతి మాట సాయిభక్తులకు శృతివాక్యమే. *"నిరంతరం హరి(భగవంతుని) నామాన్ని స్మరించి సాక్షాత్తూ హరినయ్యాను"* అన్న శ్రీసాయి, *"ఎవరైతే నిరంతరం నన్నే స్మరిస్తూ, నా లీలలను మననం చేస్తారో, వారు నేనుగా మారిపోతారు"* అని అభయాన్నిచ్చి, తన స్థితిని చేరుకోగలరని, ఆ స్థితిని చేరుకునే మార్గం ఉందని స్పష్టం చేశారు.

శ్రీసాయిబాబా అభయం అక్షరసత్యమని నిరూపించిన మహామహితాత్ములు – పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ.

శ్రీబాబూజీ మాటల్లో సాయి(తత్త్వం), మౌనంలో సాయి(చింతన), స్మరణలో సాయి(నామం), స్ఫురణలో సాయి(రూపం) మనసంతా నిండి, హృదయంలో కొలువుదీరి ఉన్న ఆ సాయినాథుడే ఆ మహనీయుని సర్వస్వం. శ్రీసాయి పట్ల ఎనలేని ప్రేమతో, తమ ప్రతీ స్పందనను సాయిలో లయించి, తాదాత్మ్యం చెందిన మహాత్ములు – శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ. శ్రీబాబూజీ జీవితం సమస్తం శ్రీసాయి భాష్యాలకు సజీవ వ్యాఖ్యానమై నిలచింది. ఆ మహాత్ముని జీవన గమనంలోని ప్రతి అడుగు శ్రీసాయి అనే గమ్యానికి, కైవల్యపదానికి దారి తీసింది. ఆ మహిమాన్వితుని అడుగుజాడలే 'సాయిపథ'మనే ఆనందమార్గమై, భక్తులకు అనుసరణీయమైంది. శ్రీసాయిబాబా దీవెన శ్రీబాబూజీ రూపంలో భక్తులకు అనుభవమైంది.

శ్రీసాయి అనుగ్రహానికి, దివ్యత్వానికి, ప్రేమకు నిలువెత్తు రూపమైన పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీతో భక్తులకు గల అనుభవాల, అనుభూతుల, మధుర స్మృతుల సమాహారం– ఈ సాయి దీవెన.

తమ జీవితాలను ఆనందమయం చేసిన ఆ మహాత్ముని ప్రేమను చవిచూసిన అశేష భక్త జనావళి గుండె చప్పుడు– ఈ సాయి దీవెన.

భక్తుల జీవితాల్లో ఆనందాన్ని పరిమళింపజేసి విరబూసిన అనుభవ సుమాలతో ఆ మహనీయుని పాదాలకు చేసిన అక్షరార్చనం– ఈ సాయి దీవెన.

తమ జీవన జ్యోతులను సాయి అనుగ్రహధారతో వెలిగించిన మహితమూర్తికి భక్తులు హృదయజ్యోతులను హారతిగా చేసి అర్పించిన నీరాజనం– ఈ సాయి దీవెన.

బాబా దివ్యత్వాన్ని గుర్తించిన దాసగణు మహరాజ్ "భగవంతుని మహిమకు సాక్ష్యం చెప్పడానికి వచ్చావా, *బాబా!"* అని ఆశ్చర్యానందానికి లోనవుతారు. అలా తమ అనుభవాలే ప్రమాణంగా ఎందరో భక్తుల్లో నెలకొన్న భావం: "బాబా మహిమకు సాక్ష్యం చెప్పడానికి వచ్చిన మహితాత్ములు – *శ్రీబాబూజీ!"* అని.

ఆ మహిమాన్వితుని మహత్యాన్ని, ఔన్నత్యాన్ని చాటి చెప్పే భక్తుల భావాలు, అనుభవాలు ఎన్నో.. ఎన్నెన్నో... అందులో మచ్చుకి కొన్ని...

## స్పందన–ప్రతిస్పందన

"మానవమాత్రుడైన వ్యక్తి నా సమస్యలు ఏమి తీర్చగలడని నేను మొదట శంకించాను. కానీ నా శ్రేయోభిలాషి పదేపదే చెప్పడంతో శ్రీబాబూజీని దర్శించుకుని నా సమస్యలు విన్నవించుకున్నాను. నేను శ్రీబాబూజీ గురించి విన్నది చాలా తక్కువ అనిపించింది. అసలు ఎంత చెప్పినా తక్కువే అనిపించింది. నా సమస్యలు, కష్టాలు క్రమంగా తీరిపోయాయి. అప్పుడనిపించింది నాకు – భగవంతుడు ఎలా ఉంటాడో తెలియదు. ఒకవేళ ఉంటే ఆయన బాబూజీలానే ఉంటాడని!"

"మా నాన్న ఇక బ్రతికే అవకాశం లేదని, ఇంటికి తీసుకెళ్ళమని డాక్టర్లు చెప్పారు. నాకు మా నాన్న కావాలి, ఆయన బ్రతకాలి. బాబూజీని ఇదే ప్రార్థించాను. బాబూజీ మహిమాన్వితులే కాకపోతే మా అమ్మ ముఖంలో ఇప్పుడు ఈ నవ్వు చూసేవాడిని కాదు. మా నాన్నతో కలిసి ఇలా భోజనం చేస్తూ ఉండేవాడిని కాదు".

"మా అమ్మాయికి ఎన్నో సంబంధాలు చూశాను. కాని పెళ్ళి కాలేదు. వయస్సు మీద పడుతోంది. ఏమి చేతకానివాడినైపోయాను. బాబూజీకి అన్ని విషయాలతో వివరంగా ఉత్తరం వ్రాశాను. అంతకుముందు చూసి అన్ని విధాల బాగుందనుకున్న సంబంధం ఊహించని రీతిలో కుదిరి పెళ్ళి చేశాను. నా ఆనందానికి అవధులు లేవు. మా బాధ్యతలేకాక, మా పిల్లల బాధ్యతను వహించిన ఆ మహాత్మునికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం?"

"జీవితంలో అన్నీ పోగొట్టుకున్నాను. ఆర్థికంగా, మానసికంగా చితికిపోయాను. బ్రతికి ఏం ఉద్ధరించాలనిపించింది. బ్రతకాలన్న ఆశ పోయింది. నన్ను తీసుకుపొమ్మని

బాబాను ప్రార్థించాను. ఆ సమయంలో బాబూజీ గురించి ఎవరో చెప్పగా విని దర్శించుకున్నాను. వారిని చూడగానే ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు. బాబూజీ ఓదార్పుగా నన్ను చూస్తూ "బాబా ఉన్నారు (బాబా తప్పక మేలు చేస్తారు) బాబా చూసుకుంటారు" అని చెప్పిన మాటతో ఏదో తెలియని ధైర్యం, ఆనందం కలిగింది. నాకు జీవించాలనిపించింది. నేను పోగొట్టుకున్నవన్నీ నాకు తిరిగి దొరికాయి. శ్రీబాబూజీ దైవమో, సద్గురువో మరొకరో తెలియదు. ఆయన ఎవరైనా కానీ ఆయన లేకుండా, ఆయనను చూడకుండా నేనుండలేను".

"నాతో 40 సంవత్సరాలు కలసి జీవించి, సుఖదుఃఖాలను కలసి పంచుకున్న నా భార్యకు గుండెనొప్పి వచ్చి, నా ముందే అకస్మాత్తుగా వాలిపోయి, జీవచ్ఛవంలా పడి ఉంది. నేను తట్టుకోలేకపోయాను. ఆ ఆపద సమయంలో నాకు శ్రీబాబూజీనే గుర్తొచ్చారు. నా భార్య బ్రతకాలని ప్రార్థించాను. డాక్టర్లు కూడా ఆశ వదిలేసిన ఆమె తిరిగి బ్రతికింది. నిజంగా ఆమెకు ఇది మరుజన్మే. ఆమెతో కలిసి ఇప్పుడు జీవిస్తున్నానంటే అదంతా శ్రీబాబూజీ కృపే!"

"సెలవుల్లో కొద్దిరోజులు శ్రీబాబూజీ సన్నిధిలోనే ఉన్నాను. నా కన్నతల్లి ప్రేమ కూడా ఆ మహాత్ముని ప్రేమకు సరికాదు. ఇంటికి వెళ్ళాల్సిన సమయం వచ్చింది. శ్రీబాబూజీని దర్శించుకునేందుకు వెళ్ళాను. కళ్ళ నిండా నీళ్ళు నిండాయి. బాబూజీని సూటిగా చూడలేకపోయాను. దిక్కులు చూస్తూ 'అమ్మ వెళ్ళామంది. నాకు వెళ్ళాలని లేదు. మీ దగ్గరే ఉండిపోతాను' అని పొంగివస్తున్న కన్నీటిని ఆపుకుంటూ అన్నాను. *"మరలా అమ్మ తీసుకుని వస్తుందిగా. వద్దువుగానిలే. బాబా నీతోనే ఉన్నాడు కదమ్మా!"* అని ఓదార్చారు. అపారప్రేమ, రక్షణ, ప్రశాంతత చవిచూపిస్తున్న ఆ మహాత్ముని సన్నిధి – అనేకమంది సాయిభక్తులకు సాయిమావులి ఒడి".

"మొదట్లో జాతకాల పట్ల నాకు నమ్మకముండేది. ఒకరు నా జాతకం చూసి నా జీవితంలో ఉన్నత చదువులు చదివే రాత లేదని తేల్చి చెప్పారు. కాని పై చదువులు చదవాలని ఆశ నాకుండేది. అయితే నాకు ఎటువంటి ఆధారం, ప్రోత్సాహం లేదు. శ్రీబాబూజీకి ఉత్తరాల ద్వారా నా కోరికలు, సమస్యలు నివేదించుకునేవాడిని. బాబూజీనే నా ధైర్యం, ఆధారం. అమ్మ లేని నాకు బాబూజీనే అన్నీ. వారిని దర్శించుకున్నప్పుడు ఊదీ పెట్టి "జాతకాలు చూడవద్దు. హస్తసాముద్రికాన్ని నమ్మవద్దు" అన్న బాబా మాటను గుర్తు చేసి *"బాబా నీతోనే ఉన్నారు. అంతా శుభమే జరుగుతుందని"*

ఆశీర్వదించారు. ఆ మహాత్ముని కృప వల్ల నేను ఎమ్.ఎస్‌సి. పూర్తి చేయడమే కాదు. డాక్టరేట్ పట్టా కూడా పుచ్చుకున్నాను. రీసెర్చ్ వర్క్ మీద విదేశాలకు వెళ్ళాను. సైంటిస్ట్‌గా విదేశాల్లో ఉన్నతోద్యోగం చేస్తున్నాను. సద్గురుకృప ముందు గ్రహాలు, జాతకాలు ఏవైనా తలొగ్గాల్సిందేనని నిరూపించి, నాలాంటి అభాగ్యుల విధిని మార్చిన శ్రీబాబూజీనే నా సర్వస్వం".

"రోజూ నన్ను పసినవ్వుతో పలకరించే, సంవత్సరం కూడా నిండని నా బిడ్డకు గుండెలో రంధ్రం ఉందని తెలిసింది. ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని, అయినా గ్యారంటీ లేదని డాక్టర్లు చెప్పారు. దేవుడిచ్చిన బిడ్డను అప్పుడే ఆయన తీసుకుని వెళతాడని ఊహించుకుంటేనే ఏడుపు వచ్చింది. ఫోనులో మరొకరి ద్వారా బాబూజీకి ఈ విషయాన్ని తెలిపి నా బిడ్డను బ్రతికించమని ప్రార్థించాను. ఆపరేషన్‌కు అంతా సిద్ధమయ్యింది. ఆపరేషన్ ముందు మరోసారి తిరిగి పరీక్ష చేశారు. అమితాశ్చర్యం. నా బిడ్డ గుండెకు ఎటువంటి లోపం లేదని తెలిసింది. నాతో పాటు డాక్టర్లు ఆశ్చర్యపోయారు. కొడిగడుతున్న మా జీవిత ఆశాదీపాన్ని వెలిగించిన ఆ మహితాత్ముడు ఏమై ఉంటారు?"

"నేను బాగా చదువుకున్నాను. అతి గారాబంగా పెరిగాను. నా వయస్సుతో పాటు నాలో అహంకారం పెరిగింది. ఎదుటివాళ్ళు నా మాటకు ఎదురు చెబితే ఎంత మాత్రం సహించలేను. దాంతో అహంభావినన్న ముద్ర పడింది. కోరుకుని పెళ్ళి చేసుకున్న భర్తతో పెళ్ళైన కొద్దిరోజుల నుండే తరచూ గొడవపడేదానిని. అవి పెద్దవై మా మధ్య అంతరాన్ని పెంచాయి. దాంతో యాంత్రికంగా మారిన సంసారంలో నాలో అసహనం పెరిగిపోయింది. ఒక బిడ్డకు తల్లినయినప్పటికీ కూడా విడాకులే నా సమస్యలకు తగిన పరిష్కారంగా తోచింది. ఎవరెన్ని చెప్పినా వినలేదు. తెగేదాకా లాగాను. ఆ గొడవలతో నా జీవితంలో ఆనందం, ప్రశాంతత కొరవడ్డాయి. బాబా గుడికి వెళ్ళనారంభించాను. అక్కడ బాబూజీ గురించి విని శిరిడీలో దర్శించుకున్నాను. బాబూజీని చూస్తూనే అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు నిండాయి. ఏమీ చెప్పలేక పోయాను. అయినా మనసెరిగిన వ్యక్తిలా తల ఊపారు. పొంగి వచ్చిన కన్నీటిలో నా అహంకారం కరిగిపోయింది. ప్రశాంతంగా ఉండడంతో ఆ మహాత్ముని సన్నిధిలో చాలా రోజులు ఉన్నాను. తిరిగి వచ్చిన తర్వాత సత్సంగాలకు క్రమం తప్పకుండా వెళ్ళాను. నన్ను, నా ఆలోచనలను తరచి చూసుకోవడం ఆరంభించాను. నా ఆలోచనా

ధోరణిలో నాకే తెలియనంత మార్పు వచ్చింది. నిజంగా ప్రేమంటే ఏమిటో తెలియవచ్చింది. శ్రీబాబూజీ కృప వల్ల అందరూ గుర్తించే స్థాయిలో నా ప్రవర్తనలో మార్పు వచ్చింది. నా భర్త కూడా నన్ను అర్థంచేసుకోసాగారు. ఆయన హృదయానికి చేరువయ్యాను. అంతవరకు నరకప్రాయమైన జీవితం స్వర్గధామమైంది. నా అహాన్ని కరిగించి సాయి అనుగ్రహధారతో మా జీవితాలను వెలిగించిన ఆ తండ్రికి మేము జీవితాంతం ఋణపడివుంటాం".

"నాకు పెళ్ళయి పది సంవత్సరాలు కావస్తున్నా పిల్లలు లేరు. ఆ లోటు మమ్మల్ని కలచివేసేది. నేనూ ఓ బిడ్డకు తల్లినవ్వాలన్న కోరిక. ఆ బిడ్డతో ఆడుకోవాలని ఆశ. ఎక్కడికి వెళ్ళినా పిల్లలు ఇంకా పుట్టలేదేమిటన్న ప్రశ్న. అనేకమంది డాక్టర్లకు చూపించాము. గుళ్ళు గోపురాల చుట్టూ తిరిగాము. ఫలితం లేదు. పరిసరాల ప్రోద్బలంతో మా వారు మరో పెళ్ళికి సిద్ధమయ్యారు. అవసరమైతే విడాకులు తప్పవని తేల్చిచెప్పారు. నా మాతృత్వ కల చెదరిపోసాగింది. నా ఊహల ప్రపంచంలో శూన్యత ఆవరించింది. బాబా మందిరంలో ఉన్న నాకు బాబూజీ గురించి ఎవరో చెప్పుకుంటుండగా విన్నాను. ఆ సంవత్సరం విజయదశమికి శిరిడీలో బాబూజీని దర్శించుకుని నా మనోవేదన నివేదించి బిడ్డను ప్రసాదించమని, నా జీవితాన్ని నిలబెట్టమని ప్రార్థించాను. వారు ఒక పండును ప్రసాదంగా ఇచ్చి "శుభం" అంటూ ఆశీర్వదించారు. తొమ్మిది నెలలు తిరగకుండానే పండంటి బిడ్డకు తల్లినయ్యాను. ఆ దేవుడిచ్చిన వరం నన్ను, నా జీవితాన్ని నిలబెట్టింది. నా మాతృత్వపు కల ఫలించింది. ఆ బిడ్డే నా లోకం, నా సర్వస్వం. మా జీవితాల్లో నవవసంతాన్ని నింపిన మా దైవానికి శతకోటి నమస్కారాలు".

"ఆచారాలకు, వ్యవహారాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే అత్యంత నిష్ఠాగరిష్టులైన సనాతన సాంప్రదాయకుటుంబంలో పుట్టాను. శాస్త్రాలెన్నో చదివాను. వేదాలు వల్లెవేశాను. దేవతా ఉపాసనలు చేశాను. నా నరనరాల్లో అగ్రకులాభిమానం ఇతర కులాల పట్ల, మతాల పట్ల చెప్పలేనంత ద్వేషం జీర్ణించుకునిపోయాయి. నా జీవితంలో అనుకోకుండా చెప్పలేనంత కష్టం వచ్చింది. సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోయాను. అహంకారం కప్పిన నా కళ్ళకు దారీ తెన్నూ తెలియలేదు. నేను చేసినవేవీ నన్ను ఆదుకోలేకపోయాయి. దిక్కుతోచక అచేతనుడనయ్యాను. అంతకు ముందెప్పుడో మిత్రుడి ద్వారా బాబూజీ గురించి విన్న మాటలు గుర్తుకువచ్చాయి.

బాబూజీ పట్ల అప్పటికి సరైన అవగాహన కాని, సదభిప్రాయం కాని లేవు. అయినా నా చుట్టూ ఉన్న సమస్యలు బాబూజీని దర్శించుకునేలా చేశాయి. దాచుకోకుండా నా మనస్సులో ఉన్నదంతా చెప్పి, కష్టాలు నివేదించి నాకు సానుకూల దృక్పథాన్ని, ఆలోచనలను కలుగజేయమని ప్రార్థించాను. అనుకోకుండా అనూహ్యరీతిలో నా కష్టాలన్నీ ఒక్కొక్కటి తీరిపోయాయి. దాంతో బాబూజీ పట్ల కృతజ్ఞత, ఆత్మీయత పెరిగి ఆ మహాత్ముని రచనల పట్ల నాలో ఆసక్తి కలిగింది. రచనలన్నీ చదివాను. నాలోని శేషప్రశ్నలకు, ఉదయించిన ప్రతి ప్రశ్నకు సమాధానం లభించింది. నాలోని ఛాందసభావాలు, జాత్యాభిమానం, అహంకారం, వాస్తు, జాతకాల పట్ల ఉన్న మమకారం అన్నీ తుడిచిపెట్టుకుని పోయాయి. ఎంతో సాధన చేసినా సాధ్యంకాని దానిని, వారి సన్నిధి ప్రభావంతో మార్చిన ఆ మహాత్మునికి సాష్టాంగప్రణామాలు".

దిక్కు తోచక దిగాలుపడ్డ వ్యథార్త జీవుల యథార్థ అనుభవ దృశ్యాలే ఇవన్నీ. కడగండ్లమయమైన వారి జీవన వ్యథలను, వేదనలను, వారి కన్నీరు కూడా విలువ కట్టలేదు. శోకసంద్రమయిన వారి జీవితాల్లో ఎగసిన కడగండ్ల కెరటాలు కర్కశ హృదయులనైనా కదిపివేస్తాయి. కంటతడి పెట్టిస్తాయి.

అంతటి ఆవేదనాభరితమైన జీవితాలకు శ్రీసాయి ప్రేమను చవిచూపించి, శ్రీసాయి అనుగ్రహధారలతో ఎన్నో జీవనజ్యోతులను వెలిగించి, వారి కన్నీటిని తుడిచిన మహిమాన్వితులు– శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ.

## సాయిదీవెనే అదంతా..

శ్రీబాబూజీ తన అస్తిత్వానికి ఆధారమైన ప్రతిదీ సాయి అనుగ్రహంగానే భావించారు. *"నా నుండి ఏదైతే పొందుతున్నామని అనుకొంటున్నారో అదంతా సాయి అనుగ్రహిస్తున్నదే"* అని, వారు ఆ మహిమనంతా సాయికే ఆపాదిస్తారు. *"మీరు నన్ను పట్టుకున్నా చివరకు నేను పట్టించేది బాబా పాదాలనే!"* అని శ్రీబాబూజీ అనేవారు.

## అను'భవ సాగరం'– అంకురార్పణ

శ్రీసాయిబాబా గురించి తెలిపి, సాయి ప్రబోధాన్ని పంచి, తమ జీవితాలను సాయి దివ్యానుగ్రహంతో అర్థవంతంగా తీర్చిదిద్ది, ఆనందమయం చేసిన శ్రీబాబూజీతో తమకు గల అనుబంధాన్ని, అనుభవాలను, అనుభూతులను వేలాదిమంది భక్తులు వ్యక్తం చేశారు (ఇంకా చేస్తున్నారు). ఈ నేపథ్యంలో ఆ మహామహిమాన్వితుని

మహత్త్వపు ఔన్నత్యం – కాలగర్భంలో కలిసిపోకుండా, ఆ దివ్యానుభవాలను పదిలం చేసుకోవాలన్న – తమ చిరకాల కోరికను సాకారం చేసుకునేందుకు కొందరు భక్తులు కార్యరూపాన్నిచ్చారు.

ఆ మహాత్ముని దర్శనభాగ్యం, వారిని ఆశ్రయించి, వారి పదాలననుసరించడంతో భక్తుల జీవితాల్లో జరిగిన శుభపరిణామాలు, సంస్కరింపబడిన జీవితాల తీరు, వారి కష్టాలు, సమస్యలు వైదొలగిన వైనం, తద్వారా భక్తులకు కలిగిన ఆనందం... ఇలా ఇవన్నీ కలబోతగా ప్రసాదితమైన అనుభవాలను సేకరించి, సంకలనం చేసి, వాటిని పదిమందితో పంచుకుని, సాయితో అనుబంధాన్ని పెంచుకోవాలన్న సత్సంకల్పంతో కొందరు భక్తులు ఉద్యుక్తులయ్యారు. సత్సంగాల్లో ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుంటూ, అనుభవాలను సేకరిస్తున్న సందర్భంలో అప్పటికప్పుడే వ్రాసి ఇచ్చిన అనుభవాలే 2500 పైగా ఉన్నాయి. అవి క్రమంగా వేల సంఖ్యకు చేరాయి. కొన్ని సత్సంగాల నుండి అనుభవాల వ్రాతప్రతుల ఫోటో కాపీలైనా కావాలని అభ్యర్థనలు అనేకం వచ్చాయి. దాంతో ఈ 'సాయి దీవెన' రూపంలో భక్తుల అనుభవమాలికను మీ ముందుకు తెచ్చే ప్రయత్నం జరిగింది.

## అత్యున్నత అనుబంధం

*"నాకు, ఆ వ్యక్తికే సంబంధించిన ఓ ప్రత్యేకమైన ప్రపంచం ఉంటుంది. ఎవరి ప్రపంచం వారిదే. ఒకరితో మరొకరికి పోలిక లేదు, వ్యత్యాసం ఉండదు"* అంటారు శ్రీబాబూజీ. సద్గురువుతో ఉన్న అనుబంధం మహోన్నతమైనది. ఎవరికి వారికి ఆ అనుబంధం ఎంతో విశిష్టమైనది. ప్రతి అనుభవం ప్రత్యేకమైనదే. అముద్రితంగా ఉన్న వాటిలో ఎన్నో అత్యున్నతమైనవి ఉన్నాయి. అయితే అసంఖ్యాకంగా ఉన్న అనుభవాలన్నింటినీ ప్రచురించడం ఈ సంకలన పరిమితులకు మించినది. స్థలాభావం దృష్ట్యా కొన్నింటిని మాత్రమే ప్రచురించడం సాధ్యపడింది. అందువల్ల ప్రచురితమైనవే గొప్పవి, ప్రచురితం కానివి అల్పమైనవన్న భావనకు ఎంతమాత్రం ఆస్కారం లేదు.

## సత్సంగసుధ

శ్రీబాబూజీ సముపార్జించిన జ్ఞానసంపదనంతా సత్సంగాల ద్వారా పంచిపెట్టారు. సాయి అగాధతత్త్వ అంబుధిలో దాగిన రహస్యాలను వెలికితీసి అందరికీ అర్థమయ్యే రీతిలో సరళంగా చెప్పారు. మనకు తెలిసిన చిన్న ఉదాహరణలతోనే ఎంతో గొప్ప

సత్యాన్ని వివరించారు. జీవితాన్ని ఎలా చూడాలో, ఒక సందర్భాన్ని ఎలా విశ్లేషించాలో, మన ఆలోచనావిధానం ఎలా ఉండాలో సత్సంగాల ద్వారానే నేర్పారు. మన అవగాహన పెంపొందించుకొనేందుకు- వివిధ సత్సంగాలలో నుండి సంగ్రహించిన భాగాలను ఈ అనుభవాలతో పాటు పొందుపరచడం జరిగింది.

## ప్రతి అనుభవం - సద్గురు దివ్యప్రబోధమే!

*"సద్గురు సంస్కరణాకార్యంలో భాగంగానే మనకు అనుభవాలు ప్రసాదిస్తారు. సద్గురువు ప్రసాదించే ప్రతి అనుభవం వల్ల మనలో మార్పు, సంస్కార పరిణతి రావాలి"* అంటారు శ్రీబాబూజీ. ఈ జీవితపుస్తకంలో ప్రతి పేజీ, ప్రతి సన్నివేశం, ప్రతిక్షణం సద్గురు అనుగ్రహ ప్రసాదమే. ఆ సృష్టికర్త చిద్విలాసమే! అందులోని దివ్యసందేశం మనకూ, భావితరాలకు సద్గురుదివ్య ప్రబోధమే.

ఈ సంకలనంలోని ప్రతి అనుభవంలో సద్గురుని అగాధతత్త్వ నేపథ్యముంది. సాయితత్త్వసారం, ప్రబోధం ఉన్నాయి. జీవితచిత్రాలు - విచిత్రాలు, జీవిత పాఠాలు - గుణపాఠాలు, జీవిత సంస్కరణలు ఉన్నాయి. అంతేగాకుండా వ్యధాకలిత భక్తుల హృదయస్పందన ఉంది. అందుకు సద్గురు ప్రతిస్పందనా ఉంది. అందువల్లనే ఈ అనుభవ సంకలనంలోని ప్రతి అక్షరం, ప్రతి పదం సద్గురు అవ్యాజప్రేమను తమ గుండె చప్పుడుగా నినదిస్తాయి. ఈ అనుభవామృత రసగుళికల మాధుర్యాలు మనలో ఓ దివ్య భావావేశాన్ని, ఉద్వేగానందాన్ని కలిగిస్తాయి. ఆనంద పరవశంతో తాదాత్మ్యం చెందిస్తాయి.

## కృతజ్ఞతాభినందనలు

సద్గురువు ప్రసాదించిన అనుభవాలను పంచుకుని తద్వారా సద్గురువు పట్ల తమకున్న ప్రేమను వ్యక్తంచేసిన భక్తులకు, ఆ అనుభవాల సేకరణలో సహకరించిన, వ్రాతప్రతులను టైప్ చేసి, అందంగా, శ్రద్ధగా అక్షరాలంకరణ చేసిన, అక్షర, భావ దోషాలను సరిదిద్ది సరిచేసిన, కవర్ పేజీ, లోపలి పేజీలను అందంగా ముస్తాబుచేసిన, అంతే అందంగా సకాలంలో ప్రింటింగ్ చేసిన అందరికీ మనఃపూర్వకంగా కృతజ్ఞతాభినందనలు. శ్రీబాబూజీ సత్సంగ భాషణలను ఏర్చి కూర్చిన, అనువదించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. అందరిపై అనుగ్రహాశీస్సులు నిత్యం కురవాలని ఆ సాయినాథుని ప్రార్థిస్తోంది- సాయిపథం.

ఓ సద్గురూ! మీ మమతానుబంధలహరిలో మైమరచిన ఆ క్షణాలు మళ్ళీమళ్ళీ అనుగ్రహించు! సంతోషం వెల్లువెత్తే మీ సాన్నిధ్యాన్ని ప్రసాదించు! వేదనలు తీర్చి వెతలు బాపే మీ స్వరూపాన్ని సాక్షాత్కరించు! అనుక్షణం అందరిపై మీ కృపావర్షం కురిపించు! అనునిత్యం మీ ప్రేమప్రవాహంలో ఓలలాడించు!

**– సాయి సీకర్స్**



*శ్రీబాబూజీ, శిరిడీ, 2006*

# విషయ సూచిక


| | |
|---|---|
| ప్రకాశకుల ముందుమాట | 7-15 |
| పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ | 23-67 |
| **అ'పూర్వ'మా సాన్నిధ్యం** | |
| అనితరసాధ్యుని సాన్నిధ్యం | 71 |
| యంత్రమూ మంత్రముగ్ధమే | 83 |
| ఎవరికున్నది అంత శక్తి | 87 |
| శిరస్సు వంచె ప్రకృతి | 91 |
| మమత సమతల హేల | 100 |
| సాకోరీ మాతాజీ | 111 |
| **శరణన్న వారిని కరుణించు** | |
| క్రొత్త జీవితం | 116 |
| సద్గురు కృపకు సాకారం | 119 |
| చూపు తాకిన చాలు | 123 |
| కృపావర్షం | 124 |
| దిగివచ్చె దయతోడ దైవమే | 127 |
| ఆలోచనొద్దు - అన్నీ పెట్టు | 130 |
| కరుణానుబంధమే ఇది | 131 |
| కరుణించిన కనుచూపు | 134 |
| అద్భుత సాన్నిధ్యం | 135 |
| అనుగ్రహ జలం | 137 |
| చెప్పకనే బాధంతా మటుమాయం | 138 |

**చిన్నవైనా చిరస్మరణీయాలు**

| | |
|---|---|
| మనసెరిగిన మహాత్ములు | 142 |
| ఊదీ | 143 |
| మనోహరం ఆ దరహాసం | 144 |
| తీరిన కోరిక | 146 |
| ఏవీ మచ్చలు! | 147 |
| మాతృమూర్తిని మరిపించే అమృతమూర్తి | 148 |
| అడగటమే ఆలస్యం | 150 |
| తిరిగి వచ్చిన దైవం – తీర్చెను మనోరథం | 152 |
| వికసించిన హృదయసుమం | 153 |
| సద్గురు వాక్కు శిరోధార్యం | 155 |

**'గురువు' ఎందుకంటూ దరి చేరిన 'పిచ్చుకలు'**

| | |
|---|---|
| అంతా గురువుగారి అనుగ్రహమే | 160 |
| మారిన దృక్పథం – చేర్చెను సాయిపథం | 166 |
| ప్రయత్నాలన్నీ విఫలం – సద్గురుకృపతో సఫలం | 169 |

**అపు'రూప' దర్శనం**

| | |
|---|---|
| నా దైవం | 174 |
| ప్రత్యక్ష ప్రసారం | 178 |
| బాబాను స్మరించు | 181 |
| గురువే నా సర్వస్వం | 182 |
| ఫోటో కాదది సజీవరూపం | 186 |

**భక్తవత్సలుని లోగిలిలో...**

| | |
|---|---|
| ఆచరించిన ఆనందమే | 190 |
| స్కూల్ సీటు | 191 |
| దైవ స్వరూపమే | 192 |

బాబా పథంలో... 194
కోరినదే ప్రసాదం 198
అడగనిది కూడా అందించే అమ్మ 201
అనూహ్యానందం 204
సద్గురువు ఇచ్చిన ఆత్మవిశ్వాసం 206
ఎన్నో నేర్పిస్తున్నారు 208
ఇంట్లో నేనున్నానుగా 211
వినూత్నాధ్యాయం 213
కళ్ళజోడు వద్దు 216

**అనుక్షణం శిక్షణం**

బాబాపై కోపం 220
అపరిగ్రహంతోనే అనుగ్రహం 224
భక్తి గానం 230
ఎఱుక మరపుల హేల 233
గ్రహబలమా? సద్గురు అనుగ్రహమా? 241
అహం వదిలేయుటే బాబా హితం 244
నివేదనతో తీరిన వేదన 247
సాయి ఊసే – సాయి ధ్యాసే 249
ఎందుకొచ్చాము? 252
గుంట త్రవ్వి గుంట పూడ్చు 254

**స్వప్నాలలో 'సత్' దర్శనం**

ఏమడిగినా... 260
దయాజలధి 261
ఏదీ అసంభవం కాదు 263
కలలో దర్శనం – ఇలలో అనుగ్రహం 267
కృపాదృష్టి 268

ఫలించిన కల 269
అనుగ్రహ ప్రవంతి 270
కల నిజమైన వేళ 271
ఆ రెండు స్వప్నాలు 273

**మరుగైన వ్యసనాలు**

బ్రతుకు భిక్ష 278
నాడు వ్యసనానికి బానిస,
నేడు గురుచరణాల పైనే ధ్యాస 281
కిళ్ళీ వద్దు మళ్ళీ 284
చిరునవ్వే ఆయుధం 285

**బాబా చూసుకుంటారు**

మోడల్ స్కూల్ 288
సాయి అనుగ్రహ ప్రతిష్ఠ 291
ఆ కరుణామయుని చూపు – కష్టాలను రూపుమాపు 292
పవిత్ర స్పర్శ 295
సాయి నిలయం 296
శుభం 299
జీవనాధారం 302
సాధ్యమైన అసాధ్యం 304
అంధకార జీవితంలో అనుగ్రహ దీపం 307
నలుగురికి కాదు, నలభై మందికి 310
సాయి రచన 313
చూపుతోనే స్వస్థత 316
అపార మహిమ 317
బాధలు బాపిన భవరోగ వైద్యులు 319
అభయవరం 321

**బాబా పథంలో...**


| | |
|---|---|
| పరివర్తనాక్రమంలో... | 328 |
| అనుభవాలు కావవి అందదండలే | 330 |
| ప్రేమను పెంచుకో | 337 |
| సవ్యమార్గంలో... | 345 |
| శిక్ష కాదిది శిక్షణ | 359 |
| ఆ చల్లని ముంగిట – తీరిన అలసట | 379 |
| దర్శనమా? వారి కరుణకు నిదర్శనమా? | 381 |


**జ్ఞాపకాల పెన్నిధులు**


| | |
|---|---|
| తరలి వచ్చెను గురువే | 386 |
| నమస్కారమండీ! | 389 |
| లేదు నీ కరుణకు పోలిక | 390 |
| గురుచరణ్ | 395 |



*శ్రీబాబూజీ, సాయిపథం, శిరిడీ, 1999*

# పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ

*అది శిరిడీ. శ్రీసాయినాథుని ప్రేమ లోగిలి. 1954వ సంవత్సరం, అక్టోబర్ 7వ తేదీ గురువారం, విజయదశమి పర్వదినం.*

36వ 'బాబా మహాసమాధి ఉత్సవాలు' ఘనంగా జరుగుతున్నాయి. సమాధి మందిరంలో అప్పటివరకు ఉన్న శ్రీసాయిబాబా చిత్రపటం స్థానే, శిల్పకారుడు 'బాలాజీ వసంత తాలిం' అత్యంత మనోహరంగా, నేత్రపర్వంగా మలచిన, సజీవ కళ ఉట్టిపడే శ్రీసాయిబాబా విగ్రహానికి ప్రతిష్ఠ జరిగింది. ఈ నేపథ్యంగా ఆ రోజు చారిత్రాత్మకంగా ప్రాధాన్యత సంతరించుకున్న సుదినం. అదే పర్వదినాన సకల సృష్టి, జగత్తుకు రూప 'శిల్పి'యైన శ్రీసాయి తన అవ్యాజ ప్రేమనంతా ప్రోది చేసి మలచిన ఓ మహాత్మునికి ప్రాణప్రతిష్ఠ జరిగింది. దక్షిణ భారతావనిలో శ్రీసాయితత్త్వభావనా బీజాలకు అంకురార్పణ జరిగిన మద్రాసు (ఇప్పటి చెన్నై)లోని మైలాపూర్‌లోనే, శ్రీసాయి ప్రేమతత్త్వం మూర్తీభవించిన ఆ ప్రేమ స్వరూపం పురుడు పోసుకుంది. మైలాపూర్ లోని 'సెయింట్ ఇస్‌బెల్లా' హాస్పిటల్‌లో శ్రీసురేంద్రబాబు, శ్రీమతి వెంకటరత్నమ్మ పుణ్యదంపతుల ప్రేమ పంటగా శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ జన్మించారు. బాబాతో శ్రీబాబూజీకి ఉన్న దివ్యబంధానికి, జన్మజన్మల సంబంధానికి మంగళకరమైన శుభసూచికలవి.

ఆ కారణజన్ముని జననంతో శ్రీసాయితత్త్వ భావనలు, ప్రబోధాలే పునాదిగా, ఓ నవశకం ఆవిర్భావానికి అంకురార్పణ జరిగింది. ప్రపంచంలోనే ఓ వినూత్న సాయి ఆధారిత పథానికి, పంథా ఆవిష్కరణకు నాంది ప్రస్తావన జరిగింది.

నెల్లూరు వాస్తవ్యులైన శ్రీసురేంద్రబాబు, శ్రీమతి వెంకటరత్నమ్మగార్లకు కలిగిన అయిదుగురు సంతానంలో శ్రీబాబూజీ అగ్రజులు. బెంగాల్‌కు చెందిన సుప్రసిద్ధ రచయిత 'శరత్' సాహిత్యాన్ని అమితంగా ఇష్టపడే శ్రీసురేంద్రగారు, ఆ అభిమానాన్ని చాటుకుంటూ తన ప్రథమ కుమారునికి "శరత్‌బాబు" అని నామకరణం చేశారు.

## బాబా పిలుపు – దివ్యత్వం మేలుకొలుపు

సద్గురుదర్శనం తరచు దివ్యరూపంలో కలుగుతుందని, ఆ దివ్యరూపం నిర్మల హృదయంగల సిద్ధపురుషుడే చూడగలరని మహాత్ముల ఉవాచ. అలాంటి దివ్యదర్శనం శ్రీబాబూజీకి పసిప్రాయంలోనే కలిగింది.

"కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ తెట్టలాయ మహిమలే తిరుమల కొండ" అని పదకవితాపితామహుడు శ్రీఅన్నమయ్య కీర్తించిన పవిత్ర తిరుమల సన్నిధానానికి, శ్రీబాబూజీని (శరత్‌బాబుని) పసితనంలో వారి నాయనమ్మ తీసుకుని వెళ్ళారు. తిరుమలకు వెళ్ళడం శ్రీబాబూజీకి అదే మొదటిసారి. అప్పటికి వారి వయస్సు మూడు సంవత్సరాలు. మూలవిరాట్ దివ్యసన్నిధిలో ఆ పసిబాలుడు అడుగు పెట్టాడు. గోవింద నామంతో తిరుమల హృదయం పులకించిపోతోంది. ఆ పసివాడు నాయనమ్మకు ఆ మూలవిరాట్టును చూపిస్తూ "తాతయ్య పిలుస్తున్నాడు" అని అంటూ చేతులు విడిపించుకొని గర్భగుడిలోకి వెళ్ళబోయాడు.

అబద్ధం చెప్పడం తెలియని ఆ పసివాడు విగ్రహాన్ని చూపిస్తూ "పిలుస్తున్నాడని" అనడంతో, నాయనమ్మతో సహా అర్చకులు, అక్కడ వాళ్ళు విస్మయులయ్యారు. తేరుకున్న వారి నాయనమ్మ, మనమడిని అద్దుకొని వెలుపలకు తీసుకొని వచ్చారు. అయినా ఆ పసివాని చూపు మాత్రం దివ్యమంగళరూపం పైనే! అసలు విషయం రాబట్టాలని, నాయనమ్మ ఎన్ని ప్రశ్నలు వేసినా, మనమడి సమాధానం మాత్రం "తాతయ్య పిలుస్తున్నాడు" అనే!

కొంత వయసు వచ్చిన తరువాత శ్రీబాబూజీని విచారిస్తే, అందరికీ విగ్రహం కనబడే స్థానంలో జటాఝూటధారియైన ఓ వ్యక్తి (దివ్యమంగళరూపం) రెండు చేతులు పైకెత్తి రమ్మని సైగ చేస్తూ శ్రీబాబూజీకి కనిపించారని తెలిసింది. ఆ తర్వాత దాదాపు 10 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు కూడా, తిరుమల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు, తనకు ఆ విగ్రహస్థానంలో కనిపించిన మహాత్ముని దర్శించుకునేందుకే అందరూ వెళుతున్నారని శ్రీబాబూజీ అనుకుంటుండేవారు. సకల దేవతాస్వరూపులైన శ్రీసాయి పిలుపు, ఆ బిడ్డను తన అక్కున చేర్చుకోవడానికేనని, అది వారి దివ్యత్వానికి మేలుకొలుపని ఆ తర్వాతగాని తెలియలేదు. ఆ విధంగా శ్రీసాయి అనుగ్రహం పసిప్రాయంలోనే శ్రీబాబూజీ హృదయాన్ని స్పృశించింది.

# ప్రథమ దర్శనం

ఓ పాశ్చాత్య భక్తురాలు "నేనెందరినో గురువులను చూశాను. కాని వారిలో నేనెవరిని నా సద్గురువుగా ఎంచుకోవాలో అర్థంకాక చాలా మథనపడుతున్నాను. నాకు దారి చూపించండి" అని శ్రీబాబూజీని ప్రార్థించారు.

శ్రీబాబూజీ చిరునవ్వుతో ఇలా చెప్పారు: "మన సద్గురువును మనం ఎంపిక *చేసుకోగలమా? అది మన చేతుల్లో ఉందా? సమర్థ సద్గురువైన బాబానే 'నా భక్తుణ్ణి నేనే ఎన్నుకుంటాను! నా భక్తుడు ఎంత దూరాన ఉన్నా– పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కొన్నట్లు – రకరకాల మిషల మీద నేనే వారిని నా దగ్గరకు రప్పించుకుంటాను. ఎవరూ వారంతట వారుగా నా వద్దకు రారు!'* అని అన్నారు. సద్గురువే నిన్ను *ఎన్నుకుంటారు. అయితే సద్గురువును తెలుసుకోవలసిన బాధ్యత మాత్రం మనదే. ఎందుకంటే బాబానే అన్నారు – "సద్గురువుని తెలుసుకో! ఎందుకొచ్చినట్లు, పిడకలు ఏరుకోవడానికా!"* అని.

"మరి నా సద్గురువుని నేనెలా తెలుసుకోగలను?" అని ఆ భక్తురాలడిగారు.

అందుకు శ్రీబాబూజీ సమాధానమిస్తూ "ఎవరి సన్నిధిలో మన మనస్సుకు *అప్రయత్నంగా ప్రశాంతత చేకూరుతుందో, అపార రక్షణ, ఆనందం, ప్రేమ, తృప్తి అనుభవమవుతాయో అదే మన సద్గురు సన్నిధి*" అన్నారు.

"అయితే మీ సద్గురువు ఎవరు? ఆయనను మొట్టమొదట మీరు ఎప్పుడు చూశారు?" అని ఆ భక్తురాలు ఉత్సుకతతో అడిగారు.

*"మనందరికీ సమర్థ సద్గురువు శ్రీసాయిబాబానే. బాబా దగ్గరే నేను అవన్నీ పొందాను. నా చిన్నతనంలో మా నాయనమ్మ వాళ్ళ ఇంట్లో బాబా చిత్రపటాన్ని మొట్టమొదటగా చూశాను. అక్కడ ఎందరో దేవుళ్ళ పటాలు ఉన్నప్పటికీ, వాటి మధ్యనున్న ఆ బాబా చిత్రపటమే నన్ను అమితంగా ఆకర్షించేది. నా పసిమనస్సుకు, బాబా చూడడానికి వాస్తవరూపంగా, మానవాకృతిలో అత్యంత సహజంగా కనిపించే వారు. అదే సమయంలో, నిగూఢమైన అద్భుత వ్యక్తిగానూ అనిపించేవారు. ఎంతో పరిచయం ఉన్న తెలిసిన వ్యక్తిగాను, అసలు ఎంత మాత్రం పరిచయం లేని తెలియని వ్యక్తిగాను అనిపించేవారు (నవ్వుతూ). బహుశా అది బాగా తెలిసిన తెలియని పరిచయం కావచ్చు. బాగా తెలియని తెలిసిన పరిచయమూ కావచ్చు. బాబా తెలిసిన,*

తెలియని వ్యక్తిగా అనిపించడంతో, ఎవరా వ్యక్తి – అని ఆలోచిస్తూ ఆ పసితనంలో ఆ పటాన్నే ఎక్కువగా చూస్తుండేవాడిని. ఏదో తెలియని ఆకర్షణ నన్ను కట్టిపడేసేది. బాబాపట్ల నా ప్రేమ అత్యంత సహజంగా ఏర్పడింది. అంతే!" అన్నారు బాబూజీ.

ఆ పాశ్చాత్య భక్తురాలు, కొద్దిరోజులు దేశంలో అనేక చోట్ల తిరిగి తిరిగి శ్రీబాబూజీ దగ్గరకే వచ్చి "మీ దగ్గరే నా మనసు ఎన్నో విధాలుగా సమాధానపడుతూ ఉంది. ఆనందంగా, ప్రశాంతంగా ఉంది. మీరే నా సద్గురువు. నన్ను ఎలా సాధన చేసుకోమంటారో, ఏమి చేయమంటారో చెప్పండి" అని అభ్యర్థించారు.

వెంటనే శ్రీబాబూజీ "నేను ఇంతకు ముందు అనేకసార్లు చెప్పాను. మరలా చెప్తున్నాను. నేనెవరికీ సద్గురువును కాను. కనీసం గురువును కూడా కాదు. నా దగ్గర మీకు అనుభవమవుతున్నదని అనిపిస్తున్నదంతా, మీకు బాబా ఇస్తున్నదే! అది మీకు బాబా ప్రసాదిస్తున్న అనుగ్రహమే!" అన్నారు.

## అన్వేషణాపథం

"తాను శ్రీసాయిబాబా గురించి వినకముందే, బాబాను దర్శించకముందే తనను అనుక్షణం కాపాడి, తన జీవితాన్ని నడిపిస్తున్నారన్న సత్యం అనుభవపూర్వకంగా తెలుసుకోవడం భక్తులకు అన్ని లీలలకన్నా అమోఘమైనది", "మన దృష్టిలో సద్గురువును ఆశ్రయించడంతోనే 'సాధన' మొదలైనట్లు లెక్క. కానీ, సద్గురుదర్శనానికి 'దారితీసే' పరిస్థితులను తమ దివ్యశక్తిచే మలచడంలో శ్రీసాయి వంటి సద్గురుమూర్తి ప్రసాదించే 'మార్గదర్శకత్వం' పూర్తిగా ఆ సద్గురుమూర్తికే ఎఱుక", "ఆ సమర్థ సద్గురుని సన్నిధిని ఆర్తితో ఆశ్రయించే 'అవసరం' కలగడానికి దోహదం చేసే వివిధ సంఘటనలు, అనుభవాలే 'నిజానికి' సద్గురు ప్రభావం వల్ల మన అంతరంగంలో జరిగే సాధన యొక్క మొదటి దశ!" అని అంటారు శ్రీబాబూజీ. శ్రీబాబూజీకి బాబాను ఆశ్రయించాల్సిన ఆ 'అవసరం' ఎలా కలిగింది?

శ్రీబాబూజీ బాల్యమంతా దాదాపు వారి నాయనమ్మగారైన రమణమ్మగారి దగ్గర గడిచింది. ప్రాథమిక విద్యాభ్యాసం అప్పట్లో నెల్లూరులో ప్రైమరీ టీచర్‌గా పనిచేస్తున్న నాయనమ్మగారి దగ్గరే కొంతకాలం సాగింది. 1960–68 మధ్యకాలంలో తండ్రిగారైన సురేంద్రబాబుగారు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన నెల్లూరుజిల్లాలోని నర్రవాడ, బాలిరెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు, కావలిలలో

శ్రీబాబూజీ ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాభ్యాసం కొనసాగింది. విద్యానగర్ కాలేజీలో ఇంటర్, బి.ఏ.(ఇంగ్లీష్ లిటరేచర్) చదివారు. ఆ సమయంలో వారు కనబరచిన అసాధారణమైన ధారణ, అనుపమానమైన ఏకసంథాగ్రాహ్యం లాంటి అసమాన శక్తిసామర్థ్యాలు అందరినీ ఆశ్చర్యపరచేవి. విద్యార్థి దశలోనే వారిలోని బహుముఖ ప్రజ్ఞ వెలుగు చూసింది. చురుకైన విద్యార్థిగా అందరి మన్ననలను పొందారు. చలాకీ విద్యార్థిగా అభిమానాన్ని చూరగొన్నారు. అందరి సమస్యలకు సమర్థవంతంగా ప్రతిస్పందించే విద్యార్థి నాయకునిగా అభినందనలందుకున్నారు. సమస్యను స్పృశించడంలో, చూసే దృక్పథంలో శ్రీబాబూజీది ప్రత్యేక శైలి అంటారు వారి సన్నిహితులు.

ఒకవైపు తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఎన్నో సమస్యలు, పతనమవుతున్న నైతిక విలువలు, మరుగునపడిన మానవతా విలువలు శ్రీబాబూజీని కలచివేశాయి. వీటన్నింటికి అసలు పరిష్కారం ఉందా? వీటి మూలాలు ఎక్కడ ఉన్నాయి? అనే శోధన, అన్వేషణ మొదలయింది.

మరోవైపు అసాధారణంగా, అలౌకిక నేపథ్యంలో ఉన్న భావాలు అంతరంగాన్ని చుట్టుముట్టేవి. ఈ సృష్టికి, విశ్వానికి సంబంధించిన అనేక ప్రశ్నలు మనస్సును తీవ్రసంఘర్షణకు లోనుచేసేవి. “అసలు నేనేంటి? ఈ అనంత కోటి జీవరాశుల్లో నేనెంతటివాణ్ణి? నా పుట్టుకకు ఏమైనా ప్రయోజనం లేక అర్థం స్ఫురిస్తుందా? ఉంటే అదేమిటి? దేని కోసం పాటుపడుతున్నాను?”– ఇలాంటి ప్రశ్నలెన్నో తరచుగా శ్రీబాబూజీ అంతరంగాన్ని కుదిపివేసేవి. మనస్సు కడలిలో అలలై పోరు చేసేవి.

ఒకవైపు అంతరంగంలో అలౌకిక ప్రశ్నల మథనం. మరోవైపు సామాజిక పరిస్థితులు, సమస్యల పరిభ్రమణం. వెరసి చిన్నతనంలో శ్రీబాబూజీలో ఏదో తెలియని వెలితి, అసంతృప్తి, సంఘర్షణ, అలజడి. తనలో అస్పష్టంగా ఉన్న ఆ భావనలకు రూపునిచ్చి సంపూర్ణంగా సాకారం చేసుకోవాలనే తపన. ఆ తపన తపస్సయ్యింది. అంతర్మథనం అన్వేషణకు దారితీసింది. అది ఒక అవసరంగా పరిణమించింది.

## తొలి అడుగులు

సాధకునికి దారి చూపడంలో శ్రీసాయి ఎన్నుకునే మార్గాలు, వ్యక్తులు, పరిస్థితులు, సంఘటనలు, వాహకాలు ఉత్కృష్టమైనవి. అది 1970వ సంవత్సరం. శ్రీబాబూజీ విద్యానగర్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న రోజులవి. మొదటి నుండి

మహాత్మాగాంధీజీ పట్ల ఎంతో పూజ్యభావం ఉన్న శ్రీబాబూజీకి– స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో, గాంధీజీ గురించి ఆంగ్లంలో ప్రసంగించాల్సి వచ్చింది. ఆ విషయంలో వారిని గైడ్ చేయడానికి ఆ కాలేజీ ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న మాస్టర్ శ్రీఎక్కిరాల భరద్వాజగారు నియమింపబడ్డారు. దాని నిమిత్తమై మాస్టర్‌గారి దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో మాస్టర్‌గారు భక్తులకు వేదాంతోపదేశాలు చేస్తున్నారు. ఆ సందర్భంలో శ్రీబాబూజీ వేసిన ప్రశ్నలు చర్చకు దారి తీశాయి. వారిరువురి మధ్య వివిధ అంశాల గురించి జరిగిన సంభాషణలో– మాస్టర్‌గారు వివరించిన తీరుకు శ్రీబాబూజీ ఆకర్షితులయ్యారు. అది మొదలు శ్రీబాబూజీకి మాస్టర్‌గారి పట్ల గురుత్వభావం కలిగి, సాన్నిహిత్యం ఏర్పడింది. శ్రీసాయిబాబా భక్తులైన మాస్టర్‌గారు నిత్యం సత్సంగం చేసేవారు. సాయిలీలావిశేషంగా శ్రీబాబూజీ అతి కొద్దికాలంలోనే మాస్టర్‌గారి ద్వారా శ్రీసాయిబాబాకు సంబంధించి అనేక అంశాలు సమగ్రంగా తెలుసుకున్నారు. సాయిబాబా పట్ల, సాయితత్త్వం పట్ల శ్రీబాబూజీ ఎంతగానో ఆకర్షితులైనారు. బాబా గురించి తెలుసుకొనే కొద్దీ అంతవరకు తాను వెదకుతున్నది, కావలసినదేదో అది వారికి స్పష్టమవుతూ వచ్చింది. శ్రీసాయి దివ్యప్రేరణతో అంతవరకు శ్రీబాబూజీలో అంతర్వాహినియై ప్రవహిస్తున్న ఆధ్యాత్మిక స్రవంతి ఉప్పొంగి, సాయిలో ఐక్యమే గమ్యంగా సాయి వైపు మరలింది. శ్రీసాయి దివ్యమంగళరూపమే శ్రీబాబూజీ అంతరంగాన్ని సంపూర్ణంగా ఆక్రమించింది.

శ్రీబాబూజీ త్రికరణశుద్ధిగా చేస్తున్న అన్వేషణకు శ్రీసాయి అనుగ్రహం వెన్నంటి నిలిచింది. వారికి వచ్చిన సంశయాలు తీర్చడానికి బాబా ఎంచుకున్న విధానం మహిమాన్వితంగా ఉండేది. దీనికి సంబంధించి శ్రీబాబూజీ ఒక సత్సంగంలో ఇలా వివరించారు: *నాకు అప్పుడు 18 లేక 19 సంవత్సరాల వయస్సు ఉంటుంది. వేదశాస్త్రాలను బాగా చదువుతుండేవాడిని. వాటిల్లో పుణ్యక్షేత్రాల దర్శనాన్ని, తీర్థాల మహిమను ఎంతో గొప్పగా వర్ణించేవారు. అది చదివినప్పుడు నాకు 'మహాత్ములు తీర్థాలను ఎందుకు దర్శించేవారు?' అన్న సందేహం కలిగింది. నేను ఓ రోజు ఆరుబయట ప్రదేశంలో ఉన్నప్పుడు, దాని గురించి వివిధ శ్లోకాలు, పురాణాల్లో చెప్పబడిన విషయాలను ఆలోచిస్తున్నాను. ఇంతలో హఠాత్తుగా పెద్ద గాలి వీచింది. బాగా చీకిపోయి పాతదైన కాగితం ఒకటి ఎగిరొచ్చి నా ముందు పడింది. నేను దానిని తీసుకుని చూశాను. అది 'నారదభక్తి సూత్రాల'లోని ఒక పేజీ. సరిగ్గా అదే పేజీలో*

ఉన్న సూత్రంలో ఒకరు "మహాత్ములు పుణ్యక్షేత్రాలను ఎందుకు దర్శిస్తారు?" అని నారదుని అడిగారు. దానికి నారదుడు "పుణ్యక్షేత్రాలను మరింత పవిత్రం చేయడానికే మహాత్ములు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు" అని సమాధానమిచ్చారు. అదీ శ్లోకం. బాబా తలచుకొంటే మనమెక్కడున్నా సమాధానమివ్వగలరని అప్పుడనుకొన్నాను.

సాయి స్వరూప స్వభావాలను సంపూర్ణంగా తెలుసుకోవాలని శ్రీబాబూజీ చేయని ప్రయత్నంలేదు. అందులో భాగంగానే వేద వేదాంగాలను అధ్యయనం చేసి, వాటి సారాన్ని తెలుసుకొన్నారు. మహాభారతం, రామాయణం, భాగవతం, భగవద్గీత, ఉపనిషత్తులు, అష్టాదశపురాణాలు, యోగశాస్త్రాలు ఇలా ఒకటేమిటి? అన్నింటిని సమగ్రంగా చదివి, శ్రీసాయి కృపావిశేషంగా అందులోని సూక్ష్మాలను తెలుసుకొని, రహస్యాలను పరిచ్ఛేదించారు. ఎన్నో శేషప్రశ్నలకు సమాధానాలు కనుగొని సమన్వయపరచుకొన్నారు.

## 'ఆకాశం'లో శరశ్చంద్రుడు

మాస్టర్‌గారు, శ్రీబాబూజీ ఒకరిపట్ల ఒకరు ఎంతో ప్రేమానురాగాలు, ఆదరాభిమానాలు చూపేవారు. మొట్టమొదట 1973లో 'ది మాస్టర్' అనే శీర్షికతో మాస్టర్‌గారి గురించి ఇంగ్లీష్‌లో ఒక వ్యాసాన్ని శ్రీబాబూజీ వ్రాశారు. అదే మొత్తం మీద మాస్టర్‌గారి గురించి వ్రాయబడ్డ మొట్టమొదటి వ్యాసం.

1980 ఏప్రిల్‌లో విద్యానగర్ సాయిమందిరం ప్రారంభోత్సవ సందర్భంగా తెలుగులో 'సద్గురు దర్శనం' పేరున, ఇంగ్లీష్‌లో 'దత్తాత్రేయ– ది గ్లోరీ ఆఫ్ ది డివైన్ ఇన్ మాన్' పేరున విడుదలైన రెండు సావనీర్లకు శ్రీబాబూజీయే సంపాదకత్వం వహించారు. అదే సంవత్సరంలో శ్రీబాబూజీ రచించిన 'సాధన సోపానాలు' అనే చిన్న గ్రంథం ప్రచురితమైంది. వారి రచనలో మాస్టర్‌గారి గురించి "ఆకాశం" అని తరచూ పేర్కొన్నారు.

దాదాపు 14 సం॥ల పాటు మాస్టర్‌గారి సన్నిహిత సాహచర్యంలో శ్రీబాబూజీ గడిపారు. ఆ సమయంలో మాస్టర్‌గారి అంతరంగ 'ఆకాశం'లో 'శరశ్చంద్రుని' ప్రేమ వెన్నెల పరచుకొని శోభిల్లింది. మాస్టర్‌గారి దగ్గర శ్రీబాబూజీ స్థానం ప్రత్యేకంగా ఉండేది. ఎంతోమంది ఉన్నా, శ్రీబాబూజీ మాటకు, అభిప్రాయానికి మాస్టర్‌గారు చాలా విలువనిచ్చేవారు. కొన్ని సమయాల్లో సలహాలు తీసుకొనేవారు. కొన్నిసార్లు

నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు అక్కడ వారిని, శ్రీబాబూజీని సంప్రదించమని చెప్పేవారు. బయట ప్రపంచానికి, వారి మధ్య బంధం గురుశిష్యుల సంబంధంగా అనిపించినా వాస్తవానికి ఆ 'సాయి బంధం' అనిర్వచనీయమైనది. వారు మంచి స్నేహితుల్లా, అంతకు మించిన అనుబంధంతో ఎంతో ఆత్మీయంగా ఉండేవారు.

మాస్టర్‌గారి పట్ల శ్రీబాబూజీకి ఉన్న ప్రేమాభిమానాలకు చిన్న ఉదాహరణ ఇది– మాస్టర్‌గారు సాయిలో ఐక్యం చెందినప్పుడు వారి పార్థివదేహాన్ని శ్రీబాబూజీ కడసారిగా దర్శించుకొని, నమస్కరించి నుదుటిపై నిలువుగా ఊదీని రాశారు. మాస్టర్‌గారికి చివరిసారి చేసుకొన్న ఆ సేవకు ఒక జ్ఞాపకంగా, స్మరణగా, గుర్తుగా, శ్రీబాబూజీ జీవితపర్యంతం బాబా ఊదీని, తమ నుదుటిపై నిలువుగానే ధరించేవారు. మాస్టర్‌గారి పట్ల వారికున్న ప్రేమ అంతటిది.

## సాధనాప్రస్థానం

సాధకుని అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ, తమ అనుభవాల నేపథ్యంలో శ్రీబాబూజీ వెలువరించిన పలు సాధనారహస్యాలు – గతి తప్పిన సాధనా ప్రయాణంలో ఉన్న సాధకులకు గమ్యంవైపు నడిపించే దిక్సూచిలా, దీపపు స్తంభాల్లా దారి చూపిస్తాయి. శ్రీబాబూజీ జీవిత పుస్తకంలోని అక్షరాలు ఆ సత్యాన్వేషకుని దృఢ సంకల్పానికి, కఠోర సాధనకు, లక్ష్యం చేరుకోవాలన్న తపనకు అద్దం పడతాయి.

శ్రీబాబూజీ తమ పరిశోధనాంశాలను తెలియపరుస్తూ "జాగ్రత్తగా పరిశీలిస్తే, అన్ని పవిత్రక్షేత్రాలు, మూలంలో మహర్షుల – మహాత్ముల తపోభూములు, వారి సమాధి స్థానాలుగానే ఉండి కాలగతిలో వాటి మూలరూపం మరుగునపడి, ఆ స్థానే వివిధ క్షేత్రపురాణాలు, క్షేత్రమహాత్మ్యాలు పుట్టుకొచ్చాయి", "మహాత్ముల తపోప్రభావంతో నిండి నిబిడీకృతమైయున్న ఆ ప్రదేశాల్లోనికి అడుగిడగానే మనస్సు అప్రయత్నంగా ధ్యానస్థమవుతుంది. అందువల్ల అలాంటి పవిత్రక్షేత్రాల్లో కూర్చొని సాధన చెయ్యడం ఎన్నో రెట్లు సులభతరం అవుతుంది" అని సాధనాపరమైన సుళువును వివరించారు.

శ్రీబాబూజీ సాధనాప్రస్థానంలో తిరువణ్ణామలై, తిరుమల, పూండీ, శిరిడీ పవిత్రక్షేత్రాలు ప్రధాన వేదికలుగా నిలిచాయి. తిరుమల, తిరువణ్ణామలైలతో ఉన్న సుపరిచయాన్ని వివరిస్తూ శ్రీబాబూజీ "నేను చదువుకుంటున్న రోజుల్లో నాకు సమీపంలో ఉన్న క్షేత్రాలవి. సెలవులు వచ్చినప్పుడల్లా శిరిడీకి పోవడానికి చేతిలో

సరిపోయినంత డబ్బులుండేవి కాదు. తిరువణ్ణామలై వచ్చిపోవడానికి ఆ రోజుల్లో పదహారు రూపాయలుంటే సరిపోయేది. నేను ఎస్.వి.యూనివర్సిటీలో ప్రైవేటుగా పి.జి. చేసే రోజుల్లో తిరుమలలో ఎక్కువగా గడిపేవాడిని. ఆ క్షేత్రాల్లో ఉండి బాబా స్మరణ చేసుకుంటూ ఉండేవాడిని" అని తెలిపారు.

## సాయి జ్ఞానదీపం వెలిగించిన అరుణగిరి

శ్రీబాబూజీ చదువుకునే రోజుల్లో వీలున్నప్పుడల్లా, చేతిసంచిలో ఒక జత బట్టలు, ఒక తువ్వాలు పెట్టుకొని అరుణాచలం(తిరువణ్ణామలై) వెళ్ళేవారు. అరుణాచలం చుట్టుప్రక్కల సాధన చేసుకొంటూ బాహ్యస్మృతిని మరచి ఎంతోకాలం గడిపేవారు. స్నానానికి వెళ్ళినప్పుడు తువ్వాలు కట్టుకొని ఆ బట్టలు ఉతికి ఆరేసేవారు. అవి ఆరిన తరువాత వాటినే వేసుకొనేవారు. ఎప్పుడూ మౌనంగా ఉంటూ ఎంతో నిష్ఠగా సాధన చేసుకొనే శ్రీబాబూజీని అక్కడివారు "మౌన స్వామి" అని, ఏదైనా అడిగినప్పుడు ఇంగ్లీష్‌లో సమాధానం చెప్పడం వల్ల "ఇంగ్లీష్ స్వామి" అని పిలిచేవారు.

"తాత్త్వికపరమైన వివరణలను, ఆధ్యాత్మిక చర్చలను బాబా ఎప్పుడూ చేయలేదు. బాబా తమ లీలల ద్వారా, ఆచరణ రూపంలో, చిన్న చిన్న కథల రూపంలో, సూత్రప్రాయమైన అలతి అలతి మాటలతో మహోన్నత ఆధ్యాత్మిక సత్యాలు ప్రబోధించారు. అది వారి పద్ధతి. అలా సూక్తులరూపంలో సంక్షిప్తంగా చెప్పిన ఆధ్యాత్మిక సూత్రాలను, రమణమహర్షి వంటి పరిపూర్ణ జ్ఞానుల వివరణాత్మకమైన బోధనల వెలుగులో వ్యాఖ్యానించుకొని సమన్వయం చేసుకుంటే శ్రీసాయి బోధ ఇంకా సుబోధకమవుతుంది" అంటారు శ్రీబాబూజీ.

అరుణాచలంలో సాధన చేసుకొంటున్న ఆ రోజుల్లో శ్రీబాబూజీని అత్యంత ప్రభావితం చేసింది– శ్రీరమణమహర్షి చరిత్ర. సాయి అగాధతత్త్వాన్ని విశ్లేషించుకొనే దానిలో భాగంగా వారు భగవాన్ చరిత్ర, బోధనలపై విశేష అధ్యయనం చేశారు. భగవాన్ చరిత్ర వల్ల, ఈ జీవితకాలంలోనే ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితిని చేరుకోవచ్చన్న విశ్వాసం వారిలో కలిగింది.

ఒకసారి రమణాశ్రమ గ్రంథాలయంలో, భగవాన్ రమణమహర్షి వ్రాత ప్రతులన్నింటినీ ఒక క్రమంలో తీర్చిదిద్దే అవకాశం శ్రీబాబూజీకి కలిగింది. భగవాన్ రమణమహర్షి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యమైనది వారికి కలిగిన "మరణానుభవం".

భగవాన్ స్వయంగా చెప్పగా బి.వి.నరసింహస్వామిగారు రికార్డ్ చేసిన 'శ్రీరమణుల మృత్యానుభవం' వారికి అక్కడే లభ్యమైంది. తద్వారా రమణమహర్షి అనుభవాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోగలిగారు.

శ్రీరమణుల జీవితంలో అంతవరకు వెలుగుచూడని అనేక అరుదైన విషయాలను పొందుపరుస్తూ, భగవాన్ తమ గురించి తాము స్వయానా చెప్పిన వివరాలను క్రోడీకరిస్తూ 'భగవాన్ శ్రీరమణమహర్షి చరిత్ర'ను మహర్షి ఆత్మకథగా శ్రీబాబూజీ ఆంగ్లంలో వ్రాశారు. అది అముద్రిత గ్రంథం. ఒక విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడంలో, సమన్వయపరుచుకోవడంలో వారికున్న అత్యున్నత ప్రతిభకు ఆ గ్రంథం దర్పణం పడుతుంది.

## సిద్ధులు

శ్రీబాబూజీ సాధన చేసుకొంటున్న తొలి రోజులలోనే వారికి సిద్ధులు ప్రకటమయ్యాయి. ఇతరులు తమ మనస్సులో ఏమనుకొంటున్నారో తెలిసిపోయేది. వారనుకున్నవి జరిగేవి. ఎవ్వరి గురించయినా, వాళ్ళు ఇక్కడి నుండి లేచి వెళ్ళిపోవాలి అని అనిపిస్తే చాలు, వాళ్ళు అకస్మాత్తుగా ఏదో పని మీద లేచి వెళ్ళిపోయేవారు! ఇలాంటి సిద్ధులెన్నో పొందినా, అవి తమ ఆధ్యాత్మిక పురోగతికి ప్రతిబంధకమని గ్రహించి, లక్ష్యశుద్ధితో వాటినన్నింటిని తృణప్రాయంగా త్యజించి, గమ్యం వైపు పయనం సాగించారు.

## బాబా గురువును గుర్తుకుతెచ్చే సద్గురువు
## పూండీస్వామి సన్నిధిలో సాధన

సాధకుని అంతరంగంలో సాగే సంతాప సంఘర్షణా రూపమైన 'మథనమే' అసలైన 'తపస్సు' అంటారు శ్రీబాబూజీ. సత్యాన్వేషిగా శ్రీబాబూజీ సాగించిన జీవన పయనంలో ఆ తపస్సు నిర్విరామంగా సాగింది. ఆ తపస్వి తపఃఫలంగా, వారి అన్వేషణను ఫలప్రదం చేసేందుకు సాయియానంలో తటస్థించిన మహాత్ములు శ్రీపూండీస్వామివారు.

అరుణాచలానికి చుట్టూ 30 మైళ్ళ వ్యాసంలో ఉండే ప్రదేశాన్ని అరుణాచల తేజోమండలం అనీ, ఆ మండలంలో ఎప్పుడూ ఎవరో ఒక జీవన్ముక్తుడు ఉంటారనేది

మహాత్ముల ఉవాచ. ఆ తేజోమండలంలో అరుణాచలానికి 22 మైళ్ళదూరంలో ఉన్న కుగ్రామం 'పూండీ'. "బాబా గురువును గుర్తుకు తెచ్చే సద్గురువు – పూర్ణ అవధూతకు నిదర్శనం" అని శ్రీబాబూజీ ప్రస్తుతించిన 'శ్రీపూండీస్వామి' 70వ దశకంలో అశేష భక్తులచే మంగళనీరాజనాలందుకున్నారు.

మనలో జన్మజన్మల నుండి పేరుకుపోయిన మలిన వాసనలను సైతం పూండీస్వామి క్షాళన చేస్తారని, వారి సాన్నిధ్యంలో హృదయం పవిత్రమవుతుందని సాధకుల అనుభవం. అయితే అక్కడ ఎక్కువ రోజులు సాధన చేసుకొని నిలువగలగడం క్లిష్టసాధ్యమని పలువురి అనుభవ నేపథ్యం. రెండు మూడు రోజులు సాధన చేసేసరికే, అంతరంగంలో పేరుకుపోయిన మలినాలు, వాసనలు పైకెగసిపడి మనసును అల్లకల్లోలం చేస్తాయని, ఆ స్థితిలో అక్కడే ఉండి మనోనిబ్బరం, నిగ్రహం కోల్పోకుండా సాధన కొనసాగించడం కష్టసాధ్యమని సాధకులు భావించేవారు.

సమర్థ సద్గురుని సన్నిధిలో సాధకుని అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ, శ్రీబాబూజీ *"సద్గురు కృప ఉంటే ఆ సద్గురు సాన్నిధ్యంలో ఉండి సాధన చేసుకోవాలన్న తలంపు నెరవేరుతుంది. ఆ దివ్యసన్నిధిలో కొంతకాలం గడిచేసరికి క్రమంగా సాధకుని అంతరంగంలో నిద్రాణంగా ఉన్న మలినవాసనలు ఎప్పుడూ లేనంత భావతీవ్రతతో ఉధృతరూపం దాల్చి విజృంభిస్తాయి. అనంతరం వాసనలు బహిర్గతమయ్యే వేగం తగ్గగానే అంతకు ముందు కంటే ఎక్కువ స్థిరమైన, నిర్మలమైన వ్యక్తిత్వాన్ని వారు సంతరించుకుంటారు. శ్రీసాయి వంటి సద్గురుమూర్తుల సన్నిధిలో జరిగే ఈ వాసనా చక్రభ్రమణ విజృంభణాన్ని తట్టుకొని 'శ్రద్ధ–సబూరీ'లతో ఎంతవరకు తనను తాను నిలువరించుకోగలడన్న దానిపై సాధనలో జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. శ్రీసాయిబాబా వంటి సమర్థ సద్గురువు తన దివ్యశక్తి చేత సాధకుని అంతరంగంలో* పేరుకొని ఉన్న మలిన వాసనలను కొన్ని దివ్యానుభవాల ద్వారా నిర్మూలిస్తారు" అని వివరించారు.

శ్రీబాబూజీ సాధనా పయనంలో, శ్రీసాయి సంకల్పంగా శ్రీపూండీస్వామి సన్నిధిలో చేసిన సాధన సద్గురు అగాధతత్త్వలోతులను చవిచూపించింది.

అది 1974వ సంవత్సరం. ఆగష్టు మాసం. సాయి ప్రేమ దాహార్తియై, సాయి ప్రేమామృతాన్ని ఇంకా ఆస్వాదించాలనుకున్న ఆ తపస్వికి, మాస్టర్‌గారు శ్రీపూండీ స్వామి సన్నిధిలో సాధన చేసుకోమని సూచించారు. అప్పటికి డిగ్రీపట్టభద్రులయిన

శ్రీబాబూజీ మరో ఆలోచన లేకుండా వెనువెంటనే బట్టలు, తుండుగుడ్డను చేతి సంచిలో వేసుకొని పూండీకి పయనమయ్యారు. చేతిలో సరిపడినంత డబ్బు లేదు. తినడానికి సరియైన తిండి లేదు. అయినా అవేవీ ఆ అవిశ్రాంత అన్వేషికి అవరోధం కాలేదు. పూండీ చేరిన ఆ సత్యాన్వేషి, అక్కడ ఒక ఇంటి అరుగు మీద ఆశీనులైవున్న పూండీస్వామికి నమస్కరించారు. తనను తాను పరిచయం చేసుకొని, ఆ పవిత్ర సన్నిధిలో సాధన చేసుకోవాలని ఉందని, ఆశీర్వదించమని ప్రార్థించారు. వారి రాక కోసమే ఎదురు చూస్తున్నట్లు ఉన్న ఆ స్వామి, చల్లని చూపుతో బాబూజీని ఆప్యాయంగా చూస్తూ "నల్లదు నల్లదు" (మంచిది, మంచిది) అని ఆశీర్వదించారు. అనుమతినివ్వడమే తడవుగా, ఎదురుగా రోడ్డుకు ఆవలివైపున మండపం గట్టు మీద కూర్చుని, ఆ స్వామిని చూస్తూ ధ్యానంలో మునిగిపోయారు శ్రీబాబూజీ. ఇరవై సంవత్సరాల లేత వయస్సు యువకుని కఠోర సాధనను గమనించి ఆశ్చర్యచకితులైన పూండీ ప్రజలు, రెండో రోజు వచ్చేసరికి 'చిన్నస్వామి' వచ్చారని అనుకోసాగారు.

అయితే మరో రోజు గడిచేసరికి బాబూజీ అంతరంగంలో అలజడి మొదలైంది. అంతవరకు బాగా కుదురుతున్న ధ్యానం, కొనసాగుతున్న సాధన, ఎందువల్లనో సరిగా జరగకపోవడాన్ని శ్రీబాబూజీ గమనించారు. పూర్తిగా జయించి వేశామనుకున్న మనోదౌర్బల్యాలు ఒక్కొక్కటిగా పైకి వస్తున్నాయి. మనస్సు చంచలమవుతోంది. తీవ్రంగా ఆకలి వేసి ఏదైనా తినాలనిపించింది. కళ్ళు తెరిచి చూశారు. అప్పుడే అటుగా వెళ్తున్న ఓ మధ్యవయస్కురాలు 'ఇవిగో, ఇడ్లీలు తినండి చిన్నస్వామీ' అని సొంత తమ్మునికి ఇచ్చినట్లు ఆ చేతిలో ఇడ్లీలు పెట్టి వెళ్ళింది. వాటిని నోట్లో పెట్టుకోబోతూ "ఇంత చిన్న మనోచాపల్యాన్ని కూడ జయించలేకపోయానా" అనిపించి, ఆ ఇడ్లీలను అక్కడే ప్రక్కన పెట్టేశారు. నిరంతరంగా, నిరాటంకంగా సాధన చేసుకోవాలన్న సంకల్పం ఇంకా బలపడింది. సరిగా సాధన జరగడం లేదన్న విషయాన్ని స్వామికి విన్నవించుకున్నారు. అందుకు పూండీస్వామి చిరునవ్వు నవ్వి, చిన్నగా తల ఊపుతూ ఆశీర్వదించారు. క్రమంగా మనస్సు స్థిరమయింది. నిర్మలమయింది.

ఇతరులకు రెండు మూడు రోజులు ఉండడమే దుస్సాధ్యమైన ఆ మహోన్నత సన్నిధిలో శ్రీబాబూజీ అన్ని మనోచాపల్యాలను అధిగమించి దాదాపు నెలరోజులు సాధన కొనసాగించారు. ఆ తపనకు సాయికృపానుగ్రహం వర్షించింది. పవిత్ర

నిర్మల హృదయం పులకించింది. ఏదో తెలియని భావోద్వేగం, తన్మయత్వంతో మైమరచిపోతున్న ఆ మౌని అంతరంగం, మనస్సు, భావ సంఘర్షణల కల్లోలం తర్వాత స్థిమితపడిన కడలిలా సమాధానపడింది. ఏ శక్తికి, యుక్తికి తలవంచని ఆ ధీరుడు, సాయి ప్రేమతత్త్వానికి తలొగ్గి మోకరిల్లాడు. ఎప్పుడూ విరుచుకుపడే కడలి అలలా ఉండే ఆ యువకెరటం, నిశ్శబ్దంగా సాయి ప్రేమసాగరంలో సంగమిస్తున్న అలలా తనను తాను అర్పించుకుంది. నిరంతరం సాయి తత్త్వాన్వేషణ, ధ్యాస తప్ప, అన్నపానీయాల ధ్యాసలేక– అనంత ప్రేమ పిపాసతో సాగిపోతున్న ఆ బాటసారి, సాయి ప్రేమలోగిలిలో సేదతీరి ఆదమరచి ఆనందించారు. సాయి దివ్య జ్ఞానప్రకాశం ఆ సత్యాన్వేషికి దారి చూపింది. చేరుకోవలసిన గమ్యం స్పష్టమవుతూ అన్వేషణ, సాధన ఫలప్రదమయ్యాయి.

"మీ జీవితంపై సాయిబాబా, రమణమహర్షి, పూండీస్వామిల ప్రభావం ఎలా ఉంది" అని ఒకసారి వారిని అడిగినప్పుడు, *"నా జీవితం ఒక పాత్ర అనుకుంటే, ఆ పాత్రలో ఏముందో రమణమహర్షి చూపారు. దానిని పూండీస్వామి శుభ్రపరిచారు. సాయిబాబా దానిని సంపూర్ణంగా నింపారు"* అని శ్రీబాబూజీ వివరించారు.

## పెద్దాయన ఆప్యాయత

శ్రీబాబూజీ పూండీ నుండి వస్తూ మధ్యలో 'పెరియవర్' (పెద్దాయన) అనీ, 'నడమాడుం దైవం' (నడయాడే దైవం) అనీ, 'కంచి పెద్దస్వామి' అనీ భక్తులు ప్రేమగా పిలిచే కంచిపీఠాధిపతి శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీస్వామివారి దగ్గరకు వెళ్ళారు. అప్పుడు స్వామివారిని దర్శించుకోవడానికి పండితుల బృందం వచ్చింది. ఆ బృందం వెనుక శ్రీబాబూజీ ఉన్నారు. అక్కడున్న వారినందరినీ స్వామివారు కలియజూస్తూ, వెనుకనున్న శ్రీబాబూజీని ముందుకు పిలిచి, ఆప్యాయంగా చూస్తూ, దుబాసీ ద్వారా శ్రీబాబూజీ వ్యక్తిగత వివరాలనన్నింటిని అడిగి తెలుసుకొన్నారు. మాటల మధ్యలో, పూండీ నుండి వస్తున్నారని తెలిసి ఎంతో సంతోషించి ఆశీర్వదించారు. శ్రీబాబూజీతో మాట్లాడిన తర్వాత ఇంకెవరితోనూ మాట్లాడకుండా స్వామివారు ధ్యానస్థులయ్యారు. అన్ని వివరాలను శ్రీబాబూజీ నుండి అడిగి తెలుసుకోవడాన్ని చూసి అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు. బాబా ముద్దుబిడ్డయైన శ్రీబాబూజీ ఎక్కడకు వెళ్ళినా, ఓ ప్రత్యేకమైన ఆత్మీయాభిమానాన్ని మహాత్ములు చూపేవారు.

## వెంకూసా ఒడిలో సాధన

తిరుమల క్షేత్రంతో శ్రీబాబూజీకి, బాబా పరంగా ఓ ప్రత్యేకమైన అనుబంధం ఉన్నట్లు కనిపిస్తుంది. 1976లో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో 'సోషియాలజీ' విభాగంలో మాస్టర్ డిగ్రీ చేశారు. ఆ సమయంలో వారు తరచుగా తిరుమలకు వెళ్ళి ధ్యానం చేసుకొంటూ గడిపారు. ఒక సందర్భంలో దాదాపు 11 నెలలు తిరుమలలోనే ఉండి సాధన చేసుకొన్నారు. ఆ రోజుల్లో జరిగిన కొన్ని సంఘటనలు అప్పటికే శ్రీబాబూజీ మహోన్నత ఆధ్యాత్మికశిఖరాలను చేరుకున్నారన్న విషయాలను తెలియజేస్తాయి.

ఒకరోజు శ్రీబాబూజీ తోటివారితో కలసి స్వామి దర్శనానికి వెళ్ళారు. స్వామిని చూస్తూనే ఉన్నవారు ఉన్నట్లుగా బాహ్యస్మృతిని మరచి ధ్యానస్థులయ్యారు. శ్రీబాబూజీ, వారితోపాటు ఉన్న ఒక గురుబంధువు తప్ప అక్కడ మరెవరూ లేరు. ఆశ్చర్యంగా ఇంకెవరూ ఆ సమయంలో దర్శనానికి రాలేదు. శ్రీబాబూజీ ఆ ధ్యానస్థితి నుండి బాహ్య స్ఫురణలోకి వచ్చిన తర్వాత విచారిస్తే, అక్కడే ఒక మూల చాలాసేపు ధ్యానస్థులైన అనుభూతి కలిగిందని చెప్పారు. అప్పుడు అక్కడే ఉన్న అర్చకులు ఒకరు 'నేను చాలా సంవత్సరాల నుండి ఇక్కడ పూజారిగా ఉన్నాను. ఇంతసేపు ఒక్క భక్తుడు కూడా దర్శనానికి రాకుండా ఉండడం నేనెప్పుడూ చూడలేదు' అన్నారు. అలా ఒకసారి కాదు, శ్రీబాబూజీ వెళ్ళిన ప్రతిసారి అలానే జరగడంతో అక్కడివారు చాలా ఆశ్చర్యపడేవారు. సర్వదేవతా స్వరూపులైన శ్రీసాయి తమ ప్రియ తనయుని ఏకాంతంలో చూసుకోవాలనేమో అలా అరుదైన ప్రత్యేక దర్శనాలు ప్రసాదించారు.

శ్రీసాయిబాబా తమ గురువు 'వెంకూసా' అని చెప్పి ఉన్నారు. అందువల్ల శ్రీబాబూజీ తిరుమల గురించి, అక్కడ కొలువైన మూలవిరాట్టుకు సంబంధించి పరిశోధనలు చేశారు. వేంకటేశ్వరస్వామికి సంబంధించి ఎవరైనా వారిని అడిగినప్పుడు, తాము పరిశోధించిన అంశాలను సమన్వయపరచి ఎన్నో అద్భుతమైన సూక్ష్మాలను, నూతన విషయాలను తెలియజేశారు.

గొప్ప మహాత్ములు, అవధూత, సిద్ధపురుషులుగా ఎందరో ఆరాధించే భగవాన్ శ్రీవెంకయ్యస్వామివారిని దర్శించుకునేందుకు శ్రీబాబూజీ ఒకసారి గొలగమూడికి పయనమయ్యారు. శ్రీబాబూజీ అక్కడకు వెళ్ళకముందే శ్రీవెంకయ్యస్వామిగారు "వేంకటేశ్వరస్వామి కమతానికి చెందినవారు వస్తుందారయ్యా" అని అక్కడున్న

వారితో అన్నారు. ఆ మాట అన్న కొద్దిసేపటికే శ్రీబాబూజీ అక్కడికెళ్ళడం జరిగింది. శ్రీవెంకయ్యస్వామి వారంతటి గొప్ప మహాత్ములు శ్రీబాబూజీ రాకను ఉద్దేశించి అలా అనడం శ్రీవేంకటేశ్వరస్వామి (వెంకూసా)తో బాబా పరంగా శ్రీబాబూజీకున్న దివ్యానుబంధాన్ని సూచిస్తుంది.

## సత్సంగ సౌరభాలు నింపుకున్న వెంకటగిరి

1977లో తమ తండ్రిగారికి వెంకటగిరికి బదిలీకావడంతో శ్రీబాబూజీ అక్కడకు వెళ్ళారు. సాయి సుజ్ఞానసర్వస్వానికి నిలువెత్తు రూపమైన శ్రీబాబూజీ, అక్కడ వివిధ నేపథ్యాలున్న వారికి– సాయిబాబా గురించి, అనేక అంశాల గురించి చెప్పేవారు. శ్రీబాబూజీ మిత్రులందరూ అనేక విషయాలపై వారిని సలహాలడిగి, ఆ సూచనలను పాటించేవారు. ఆ సహచరులందరికీ శ్రీబాబూజీ పట్ల ఎనలేని గౌరవభావం ఉండేది. సచ్చరిత్రలోనే కాకుండా ఏ అంశంపైనైనా ఇతరులకున్న సందేహాలను నివృత్తి చేసేవారు. ఆ సత్సంగ పరిమళాలను ఆస్వాదించినవారు శ్రీబాబూజీకి, సాయిబాబా గురించేకాక అన్ని విషయాలలోనూ ఉన్న సాధికారత చూసి ముగ్ధులయ్యేవారు. శ్రీబాబూజీ సత్సంగాలు ఆ ప్రాంత ప్రజల్లో బాబా పట్ల భక్తిని, అనురక్తిని కలుగజేశాయి. అక్కడున్న సహచరులతో కలసి 'సాయి బ్రదర్ హుడ్' అనే సంస్థనొకటి ఏర్పాటుచేశారు. ఆ సంస్థలోని వారు సోదరభావంతో, ప్రేమాదరణలతో మెలగుతూ, భేదాభిప్రాయాలు, వ్యత్యాసాలు లేకుండా ప్రవర్తించాలని నిశ్చయించారు.

ఎవ్వరిపై ఆధారపడకుండా జీవితం సాగించాలనేది వారి అభిమతం. విద్యారంగంపై వారికున్న అభిరుచి వల్ల వెంకటగిరిలోనే ఒక పాఠశాలను స్థాపించి మూడు సంవత్సరాలు నడిపారు.

## జగత్కళ్యాణం

శ్రీబాబూజీకి వివాహం చేయాలని తల్లిదండ్రులు భావించి ఆ విషయాన్ని అనేకసార్లు శ్రీబాబూజీ వద్ద ప్రస్తావించారు. కాని శ్రీబాబూజీ వివాహం చేసుకోవాలన్న ఆలోచనకు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. వారి తల్లిదండ్రులు వారికి ఎన్నో విధాలుగా చెప్పి చూసినా, శ్రీబాబూజీ వివాహం చేసుకోవడానికి సుముఖత చూపలేదు. సంసారబంధాల కంటే సమర్థ సద్గురువుతో ఉన్న అనుబంధమే అత్యున్నతమైనదిగా భావించారు. ఏ బంధాలలో చిక్కుకోకుండా తన జీవితసర్వస్వం సాయికే అంకితం

చేయాలనేది వారి అభీష్టం. తీవ్రసాధనలో శ్రీబాబూజీ తమదైన లోకంలో గడుపుతూ ఉండేవారు. కానీ జగత్కళ్యాణ సూత్రధారియైన శ్రీసాయి నిర్ణయం మరోలా ఉంది.

అప్పట్లో ఒంగోలులో స్థిరపడిన మాస్టర్ ఎక్కిరాల భరద్వాజగారిని శ్రీబాబూజీ తరచు కలిసేవారు. శ్రీబాబూజీని వివాహం చేసుకోమని మాస్టర్‌గారు చెప్పారు. అంతేగాకుండా శ్రీబాబూజీ జీవిత విధానానికి, వారి ఆధ్యాత్మిక సాధనకు అన్ని విధాలా అనుకూలవతియైన వధువును కూడా సూచించారు. ఆమె ఎవరో కాదు, మాస్టర్‌గారికి స్వయానా మరదలైన (భార్య చెల్లెలు) అనసూయమ్మగారు. అనారోగ్యంతో ఉన్న తన అక్కకు సహాయపడుతూ అనసూయమ్మగారు మాస్టర్‌గారింట్లో ఉండేవారు. భక్తిప్రపత్తులు, వినయవిధేయతలు, అణకువ, అంతఃసౌందర్యం, సేవాభావం, పెద్దలయందు వినమ్రత, గౌరవమర్యాదలు- ఇవన్నీ కలగలసిన సుగుణాలరాశి- అనసూయమ్మగారు. అత్యంత భక్తి, సదాచార కుటుంబ నేపథ్యం వారిది. మాస్టర్‌గారి మాట మీద ఉన్న గౌరవంతో మరో ఆలోచన లేకుండా శ్రీబాబూజీ వివాహానికి సమ్మతించారు. శ్రీబాబూజీ అంతకు ముందెన్నడూ అనసూయమ్మగారిని చూడలేదు. మాట్లాడనూ లేదు. కులాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే ఆ రోజుల్లో, వారు కులాంతర వివాహానికి సిద్ధం కావడం చూసి అందరూ అభినందించారు.

సాయిపథ వసుధైక కుటుంబానికి తల్లిదండ్రులైన పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ, అనసూయమ్మ దంపతుల కళ్యాణ మహోత్సవం ఒంగోలులో మే 27, 1982 గురువారంనాడు కన్నులపండుగగా జరిగింది. 'ఆలిండియా సాయి సమాజ్' వారు బాబా ప్రతిమ ఉన్న వెండి డాలర్‌ను శ్రీబాబూజీకి సాయి ప్రసాదంగా పంపారు. అది సరిగ్గా వివాహానికి ముందు శ్రీబాబూజీకి అందింది. ఆ బాబా డాలర్‌ను వివాహానికి సాయి అనుగ్రహ చిహ్నంగా భావించి, మంగళసూత్రంలో దానిని ఉంచి, సూత్రధారణ గావించారు. అనసూయమ్మగారి తండ్రి అప్పటికే పరమపదించడంతో, మాస్టర్‌గారే తండ్రియై కన్యాదాతైనారు.

శ్రీబాబూజీ వివాహానికి ముందురోజు పురోహితులతో వివాహం జరగాల్సిన విధానం గురించి చర్చించారు. వివాహంలో చొప్పించిన అర్థం లేని తంతులను ప్రస్తావించి, వివాహ మంత్రాలను, మంత్రార్థాన్ని వివరించి, ఏది ఎందుకు చేయాలో, ఎందుకు చేయకూడదో చాలా విపులంగా చెప్పి, పురోహితులకు కూడా తెలియని విషయాలను వివరించి, పురోహితులతోపాటు అక్కడున్న వారిని ఆశ్చర్యపరచారు.

వివాహ సమయంలో తంతులకు ఆస్కారం లేకుండా శ్రీబాబూజీ సూచించిన రీతిలోనే అన్నీ జరిగాయి. ఇలాంటి ఘట్టాలెన్నో వారికున్న విషయపరిజ్ఞానాన్ని ప్రతిబింబింపజేస్తాయి.

సాయి భక్తురాలు, సాధకురాలైన అనసూయమ్మగారు, శ్రీబాబూజీ జీవన విధానానికి, జీవిత లక్ష్యానికి సరియైన జోడిగా నిలిచారు. శ్రీబాబూజీకి అన్ని విధాలా సహకరిస్తూ, వారిని సద్గురువుగా కూడ భావించి, పవిత్ర సాన్నిధ్యంలో ఉండి సేవ, సాధన చేసుకొని చరితార్థులయ్యారు. ఆ పుణ్యదంపతుల అనురాగకృతి 'శృతి'పాప అక్టోబర్ 8, 1987లో జన్మించారు. ఆ దంపతుల అసాధారణ ప్రతిభకు, మార్గదర్శకానికి ప్రతీకయై నిలిచారు.

## విద్యా'ప్రకాశం'

సాయిబాబా పట్ల ఉన్న అనన్యమైన భక్తి, ప్రేమానురక్తి వలన తాము సాయిబాబాకు మాత్రమే చెందిన వారమని, తమ ఇంటిపేరుని సాయినాథునిగా మార్చుకున్నారు శ్రీబాబూజీ.

'సాయిబాబా' మాసపత్రిక స్థాపించాలని భావించిన మాస్టర్‌గారు, ఆ గురుతర బాధ్యతను శ్రీబాబూజీకి అప్పగించడంతో, వారు 1982లో వెంకటగిరి నుండి ఒంగోలుకు వచ్చారు. 1983లో స్థాపించిన 'సాయిబాబా' మాసపత్రిక 'సంపాదకులు'గా వ్యవహరించారు. యోచన శీర్షికలో 'సత్యకామ' అనే కలం పేరుతో ముద్రితమైన వ్యాసాలు శ్రీబాబూజీ యొక్క భిన్నశైలికి, అనేక విషయాలపై వారికున్న పరిజ్ఞానానికి దర్పణం పట్టాయి.

విద్యపట్ల శ్రీబాబూజీకున్న విలక్షణమైన ఆలోచనావిధానం, దృక్పథమే పునాదిగా 1983లో సాయిబాబా సెంట్రల్ స్కూల్ స్థాపించి, స్వీయ పర్యవేక్షణలో ఆధునిక విద్యాలయంగా తీర్చిదిద్దారు. "లవ్ ఆఫ్ లెర్నింగ్ – లెర్నింగ్ టు లవ్" ప్రాతిపదికగా, విద్యాసక్తి, జిజ్ఞాస మూలాలుగా రూపొందించిన ఉత్కృష్టమైన బోధనాపద్ధతులు, విద్యాప్రణాళికలను శ్రీబాబూజీ స్కూల్‌లో ప్రవేశపెట్టి, విద్యారంగంలో ఓ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు.

అత్యున్నత విద్యాప్రమాణాలు, విలువలతో కూడిన విద్యనందించి అనతి కాలంలోనే, ప్రకాశం జిల్లాలోనే అత్యుత్తమ పాఠశాలగా గుర్తింపు తీసుకొచ్చారు.

ఒకవైపు స్కూల్ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, మరోవైపు సాయిబాబాకు సంబంధించిన విషయాల్లో, రచనావ్యాసంగంలో నిత్యం నిమగ్నమై ఉండేవారు.

## నడయాడే గ్రంథాలయం

శ్రీబాబూజీ పుస్తకపఠనంపట్ల ఎంతో ఆసక్తి కనపరిచేవారు. 5000కి పైగా అత్యంత అరుదైన పుస్తకాలతో కూడిన శ్రీబాబూజీ వ్యక్తిగత గ్రంథాలయం – వారి పఠనాశక్తికి, విచారణాసామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఒక విషయాన్ని లోతుగా అధ్యయనం చేసి అట్టడుగున దాగిన ఆణిముత్యాల వంటి సత్యాలను వెలికితీయడంలో శ్రీబాబూజీకి సాటిలేరు.

పుస్తక పరిజ్ఞానం పుస్తకాలు బాగా పఠించిన వారికెవరికైనా ఉంటుంది. కానీ ఒక సత్యాన్ని తెలుసుకొని, సత్యానుభవం పొంది, ఆ సత్యానుభవాన్ని తోటివారికి ప్రసాదించే శక్తి ఒక్క సద్గురువుకు మాత్రమే ఉంటుంది. బాబా నిత్యసత్యం. తాను తెలుసుకొన్న సత్యాన్ని అందరితో పంచుకొని, ఆశ్రయించిన వారికి ఆ సత్యానుభవాన్ని, సాయి అనుగ్రహాన్ని ప్రసాదించిన మహాత్ములు – శ్రీబాబూజీ.

## పరిపూర్ణత్వం

మనం ఏ పని చేసినా మన శక్తిసామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించి నేర్పుగా, పరిపూర్ణంగా చేయాలన్న స్ఫూర్తిని తమ ఆచరణ ద్వారా కలుగజేసేవారు శ్రీబాబూజీ. ఏ పనైనా సరే అది పూర్తయ్యేవరకు వారు శక్తివంచన లేకుండా అహర్నిశలు అవిశ్రాంతంగా శ్రమించి, ఏకాగ్రదృష్టితో చేసేవారు. వారు చేసే పని ఏదైనా దాని నేపథ్యం మాత్రం బాబానే. బాబాపై ఉన్న అపారమైన ప్రేమ వారిని అట్లా పని చేసేలా చేస్తుంది. "ఏ పనైనా మొదలు పెడితే పరిపూర్ణంగా చేయాలి" అని చెప్పేవారు.

శ్రీబాబూజీకి ప్రాచీన సంస్కృతి, ఆవిష్కృతాలు, సత్సాంప్రదాయాల పట్ల ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అది ఆధునిక ప్రపంచపు నూతన ఆవిష్కరణలను అధ్యయనం చేయడానికి వారికి అవరోధం కాలేదు. "*మనకు తెలిసిన పాత విషయాలనే పట్టుకొని వ్రేలాడడం ఎందుకు? నూతన విషయాలకై అన్వేషిద్దాం, పరిశోధిద్దాం, పరిశీలిద్దాం. మనకు ఉపయోగపడే వాటిని గ్రహిద్దాం*" అంటారు శ్రీబాబూజీ.

అదే స్ఫూర్తితో చాలా తక్కువ వ్యవధిలోనే శ్రీబాబూజీ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని నేర్చుకుని, అటు హార్డ్‌వేర్‌లోనూ, ఇటు సాఫ్ట్‌వేర్‌లోనూ నిష్ణాతులయ్యారు. వారు ఆ ప్రజ్ఞనంతా, సాయిచరిత్రకు సంబంధించిన అంశాల పరిశోధనకు, సాయిబాబా ఒరిజినల్ ఫోటోలను పునరుద్ధరించడానికి, తమ ఇష్టదైవమైన సాయిబాబాను ఇంకా ఆరాధించేందుకు ఉపయోగించేవారు.

## సంస్కరణా పథం

భక్తుల ఆధ్యాత్మిక జీవన ప్రవంతిలో శ్రీసాయిబాబా ఎంత త్వరితగతిన మమేకమయ్యారో, కాలగతిలో అంతే వేగంగా శ్రీసాయి మహిమలో అంతర్భాగమైన శ్రీసాయి దివ్యప్రబోధం, అగాధమైన శ్రీసాయితత్త్వం మరపులోనికి నెట్టబడ్డాయి. అంతేగాకుండా శ్రీసాయి నిరసించిన మృతసాంప్రదాయాలు, మూఢనమ్మకాలు, “మా సంప్రదాయమే వేరు” అన్న సాయి సంప్రదాయంలో క్రమంగా చొప్పించబడ్డాయి. శ్రీసాయి అవతారకార్యంలో భాగమైన సర్వమతసమరస భావన స్థానంలో మత ఛాందసభావాలు వేళ్ళూనుకున్నాయి. శ్రీసాయిచే సుభిక్షం కావించబడిన ఆధ్యాత్మిక క్షేత్రం ఇలా కొందరు స్వార్థపరుల కమతమైపోవడంతో అజ్ఞానపు కలుపు మొక్కలు మానులై ఎదిగాయి. అనంత సాయి దివ్యలీలాప్రబోధ వాహినిలో మూఢభాష్యాల, మెట్ట వేదాంతాల మురికి చేరి ఏరులై పారింది. సాంప్రదాయం పేరిట మూసధోరణులతో యాంత్రికమయిన ఆధ్యాత్మిక ప్రపంచంలో ఒక విధమైన స్తబ్ధత, నిస్తేజం, శూన్యత ఆవరించింది. చివరకు భక్తుల మనస్సును ఆవరించిన ఆ అజ్ఞానం, మహిషతత్త్వం వారి పాలిట అడ్డు గోడయై, శ్రీసాయి అవ్యాజ ప్రేమను, మహిమను, ప్రబోధాన్ని గుర్తించలేని దుస్థితికి కారణ‘భూత’మయ్యాయి.

ఈ నేపథ్యంలో శ్రీసాయి అమృతతత్త్వాన్ని సంపూర్ణంగా ఆస్వాదింప జేయాలంటే– సమాజంలో అంతవరకు పేరుకుపోయి, క్రుళ్ళిపోయి, ప్రజా భావ వాహినిలో మిళితమై, మనస్సంతా ఆవరించి పొంగి పరవళ్ళెత్తిన భావదారిద్ర్యాన్ని నిర్మూలించవలసిన అవసరాన్ని శ్రీబాబూజీ గుర్తించారు. సాయితత్త్వంపై అలముకుంటున్న మత ఛాందసభావాలు, ఛాయలు, సాంప్రదాయం ముసుగులో అనాదిగా మనిషి భావాలను శాసిస్తున్న మూఢాచారాలపై శ్రీబాబూజీ బహుముఖంగా పోరు సలిపి సంస్కరించారు.

## శ్రీబాబూజీ మానస పుత్రిక - సాయిపథం మాసపత్రిక

శ్రీబాబూజీ మానస పుత్రికగా 'సాయిపథం' మాసపత్రిక 1988 సంవత్సరం జనవరిలో ఆవిర్భవించింది. జనవరి 14వ తేదీన, శిరిడీ ద్వారకామాయిలో సాయిపథం పత్రికను సాయి పాదపద్మములకు సమర్పించి విడుదల చేశారు.

సాయి స్మృతిసాగరంలో దాగివున్న అపురూప ఆణిముత్యాలను శ్రీబాబూజీ వెలికితీసి 'సాయిపథం' ద్వారా వాటిని పంచారు. శ్రీసాయి చరిత్ర, తత్త్వంపై ఎన్నో సంవత్సరాలు పరిశోధించిన శ్రీబాబూజీ– శ్రీసాయిచరిత్రలో చోటుచేసుకొని ఉన్న నిరాధారమైన ఎన్నో అసంబద్ధ అంశాలను, విరుద్ధమైన విషయాలను పరిష్కరించి, సమగ్రమైన సాయి సచ్చరిత్రను భక్తులకు 'సాయిపథం' ద్వారా అందించారు. అంతవరకు వెలుగుచూడని శ్రీసాయిలీలలెన్నింటినో 'సాయిపథం'లో ప్రచురించారు. అలభ్యంగా ఉన్న సాయి సాహిత్యాన్ని, అరుదైన శ్రీసాయి ఫోటోలను సాయిభక్త ప్రపంచానికి శ్రీబాబూజీ ప్రసాదించారు. భక్తులకు వారి వారి సంస్కారం, ఆయా సమయాలలో వారికి గల ఆధ్యాత్మిక అవసరాలను బట్టి వివిధ ఆధ్యాత్మిక గ్రంథాలు చదవమని బాబా సూచించారు. భక్తుల ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడే ఆ గ్రంథాలను వెలుగులోనికి తెచ్చి, తెలుగులో అనువదించి 'సాయిపథం'లో ప్రచురించారు.

అత్యంత సన్నిహిత సాయిభక్తుల చరిత్రలను 'సాయిభక్త విజయం' పేరిట ప్రచురించారు. శ్రీసాయిబాబా సమాధి చెందిన వైనాన్ని కళ్ళకు కట్టినట్టు వర్ణించారు. శ్రీసాయి సమాధి చెందినప్పుడు జరిగినవి 'మతసంఘర్షణలు కావని అభిమతాల సంఘర్షణలే'నని ఆధారాలతో వివరించారు. బాబా ఎవరి ఒడిలో ఒరిగి దేహత్యాగం చేశారు? బాబా జన్మరహస్యం పట్ల ప్రచారంలో ఉన్న కథల్లో నిజానిజాలేమిటి? బాబా గురువు ఎవరు? – ఇలా అంతవరకు వెలుగు చూడని ఎన్నో విషయాలను 'సాయిపథం'లో ప్రచురించారు. శ్రీసాయిని సశరీరులుగా దర్శించిన భక్తులను, వారి సంతతిని కలసి ఇంటర్వ్యూ చేసి, సాయిచరిత్రకు సంబంధించిన అమూల్య విషయాలను భక్తలోకానికి తెలిపారు. శిరిడీ సంస్థాన్ ఆధ్వరంలో ప్రచురించే సాయిలీలా మాసపత్రిక పాత ప్రతులను సంపాదించి, తెలుగులో అలభ్యంగా ఉన్న బాబా లీలలను అనువదించి ప్రచురించారు.

తమిళనాడులోని కోయంబత్తూర్, పురవిపాళ్యం తదితర ప్రాంతాల్లో– భక్త కోటికి కోటికోటి దీవెనలిచ్చే 'కోటిస్వామి'గా సుప్రసిద్ధులైన మహాత్ముని గురించి

'సాయిపథం' పత్రికలో ప్రచురించాలని భావించి వారిని కలుసుకునేందుకు, 1989 ఫిబ్రవరి 12న శ్రీబాబూజీ అక్కడకు వెళ్ళారు. శ్రీబాబూజీని చూడగానే "గాంధీ తాత, గాంధీ తాత" అని శ్రీకోటిస్వామివారు సంతోషంతో పెద్దగా కేకలు పెట్టారు. స్వాతంత్ర్యసమర సారథి– జాతిపిత శ్రీబాపూజీ, సంస్కరణోద్యమానికి సాయిపథ సారథి– పూజ్యశ్రీ బాబూజీ. భారతావని దాస్య శృంఖలాలు త్రెంచి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన మహాత్ములు గాంధీగారైతే, మూఢభావాలతో బందీలైన సాయి భక్తులను భావ దాస్యం నుండి విముక్తుల్ని చేసి మానసిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదించి, సాయి నిజతత్త్వాన్ని దర్శింపజేసిన మహామహితాత్ములు – శ్రీబాబూజీ.

శ్రీసాయి దివ్య సామ్రాజ్యాన్ని పరిరక్షించే ఆ మహాయోధుని అక్షర తూణీరం నుండి సంధించిన శ్రీసాయి ప్రబోధ వ్యాసాస్త్రాలు మనిషిలోని మహిషతత్త్వాన్ని తరిమి కొట్టాయి. అదో 'ఆధ్యాత్మిక విప్లవం'. సాయితత్త్వంలో చొచ్చుకుపోయిన మూఢత్వంపై 'సమరం'. ఒక వైపు ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలను వివరిస్తూ, మరో వైపు సాయి సంప్రదాయంలో చొప్పించబడ్డ మూఢాచారాలను తూర్పారబడుతూ, శ్రీబాబూజీ రచించిన వ్యాసాలు భక్తులను సరైన మార్గంలో పయనింపజేశాయి.

## సాయి ప్రేమ ఒడి – శిరిడీ

సాయి పట్ల అనన్య చింతన, అగాధమైన సాయితత్త్వాన్వేషణలో నిత్య పరిశోధన, పరిశోధనామూలాలకై సకల శాస్త్రాధ్యయనంతో జ్ఞానసముపార్జన, శాస్త్రాల ఆమూలాగ్ర ఆస్వాదనతో నిక్షిప్త రహస్యాల పరిశ్ఛేదన, పరిశ్ఛేదనలో నిగ్గు తేలిన నిజాల సత్యానుభవసిద్ధి సాధన, అధ్యయన, అనుభవాల ప్రమాణంగా అక్షరసుమాలతో అపూర్వ సాహితీ సేవన, అకుంఠిత దీక్ష, లక్ష్యశుద్ధితో పరితపించి, సుదూర సాధనా ప్రస్థానంలో – తన జీవిత సర్వస్వాన్ని సర్వాంతర్యామి పదసన్నిధికి సమర్పించి, సర్వస్య శరణాగతి చెంది – సదా సాయినామ స్మరణ, స్ఫురణతో మహామహిమాన్వితులైన శ్రీసాయిలో మమేకమై, తాదాత్మ్యం చెందిన మహితాత్ములు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ.

1977 నుండి శ్రీబాబూజీ తరచుగా శిరిడీవచ్చి సాయిబాబాను దర్శించు కొనేవారు. చాలాసార్లు వస్తూ ఉండడంతో, 1988లో శిరిడీలో ఒక చిన్న గదిని అద్దెకు తీసుకొన్నారు. 1989 ఏప్రిల్‌లో మాస్టర్‌గారు సాయిపదైక్యం చెందారు. సాయిబాబా

పిలుపు అందిందో ఏమో– తమ సద్గురు స్థానమైన శిరిడీలో నివాసముండాలని తలచి, అదే సంవత్సరం మే నెలలో కుటుంబంతో సహా శిరిడీ పయనమై వెళ్ళారు. ఎంతో అభివృద్ధిలో ఉన్న స్కూల్‌ను, సాయిపథం పత్రికను సాయిభక్తుల నిర్వహణలోని 'సాయిబాబా ఫౌండేషన్'కు అప్పగించి, సర్వాన్ని త్యజించి సాయి ప్రేమ ఒడిలో ఒదిగిపోయారు.

సాయిబాబా మందిరానికి పది నిమిషాల నడకలో చేరుకునేంతటి దూరంలో, పింపుల్‌వాడీ రోడ్ ప్రక్కన ఇరుకైన వీధిలో ప్రహరీగోడ కూడా లేని గృహసముదాయంలో, రేకుల కప్పుతో ఉన్న ఒకటిన్నర గదుల చిన్న ఇంటిలోనే శిరిడీకి వచ్చిన మొదట్లో శ్రీబాబూజీ వారి కుటుంబంతో సహా నివాసముండేవారు. అదే వారి పూజామందిరం, పఠనాలయం, భోజనశాల, శయనమందిరం. సాయి చూపిన మార్గంలో పయనించాలనుకునే భక్తులు, సాయితత్త్వాన్ని గురించి తెలుసు కోవాలనుకునే జిజ్ఞాసువులు, సమర్థసద్గురుని సన్నిధిలో సాధన చేసుకోవాలనుకునే సాధకులు, శ్రీబాబూజీని ఆ చిన్న గదిలోనే కలుసుకునేవారు. వారందరూ శ్రీబాబూజీ చెంతనే తమ సందేహాలు నివృత్తి చేసుకుని, సలహాలు అడిగి, తదనుగుణంగా నడచుకునేవారు. అలా అతిసామాన్యమైన ఆ చిన్న ఇల్లే సాయి నిజతత్త్వపరిమళాలు వెదజల్లే వేదికైంది. బాబా చూపిన మార్గంలో పయనించాలనే వారికి అది ముఖ్య కేంద్రమైంది. అందువల్ల శ్రీబాబూజీ నివాసం 'సాయిపథం'గా వ్యవహరించబడేది. మహాత్ముల, యోగుల, ఋషిపుంగవుల నివాసాలు 'ఆశ్రమాలు'గా ప్రసిద్ధి చెంది, నిత్యం అన్వేషణ, సాధనలతో ఆధ్యాత్మిక సౌరభాలతో నిండి ఉంటాయి. సాధకులు, జిజ్ఞాసువులకు ఆశ్రయం కల్పిస్తాయి. ఆ రీత్యా శ్రీబాబూజీ నివాసం 'సాయిపథ ఆశ్రమం'గా సుప్రసిద్ధమయింది.

## బాబా ముందు అందరూ సమానులే

*"శిరిడీలో అర్థవంతంగా ఒక గంట గడిపినా ఫలితం ఎన్నో రెట్లు ఉంటుంది"* అని శ్రీబాబూజీ చెప్పేవారు. అర్థవంతంగా ఎలా గడపాలో ఆచరించి చూపారు. శిరిడీలో వారు సమాధిమందిరానికి దర్శనానికి బయల్దేరినప్పటి నుండి తిరిగి వచ్చే వరకు ఎవరితోనూ మాట్లాడేవారు కాదు. సంస్థాన్‌లో ఎంతోమంది తెలిసినవారున్నా సమాధి మందిరానికి ఎప్పుడూ క్యూలోనే వెళ్ళేవారు. సమాధిమందిరంలో, వారికి

అత్యంత ప్రాముఖ్యతనిచ్చినా, అవేమీ పట్టించుకోకుండా బాబాపై మాత్రమే దృష్టి నిలిపేవారు. *"బాబా ముందు వి.ఐ.పి.లు ఎవరు? బాబాకు అందరూ సమానులే"* అన్నది వారి అభిప్రాయం. శ్రీబాబూజీ బాబాకు నమస్కరించుకునే తీరు ఎంతో కమనీయంగా ఉంటుంది. తమ పంచప్రాణాలను దృష్టిలో నిలిపి, ప్రేమతో, తన్మయత్వంతో చూస్తూ, రెండు చేతులు జోడించి వారు బాబాకు నమస్కరిస్తుంటే, విశ్వంలోని ప్రేమంతా ఆ మహాత్మునిలో ఒదిగి నమస్కరిస్తున్నట్లు ఉంటుంది. ఎంతో సమయం గురుస్థాన్‌లో వారు ప్రదక్షిణలు చేస్తూనే ఉండేవారు. ప్రదక్షిణలు మొదలు పెట్టినప్పటినుండి చివరివరకు చేతులు జోడించి నమస్కరిస్తూనే చేసేవారు. 'ప్రదక్షిణ' అంటే ఏమిటని ఒక సత్సంగంలో అడిగినప్పుడు *"మన ఆలోచనలు, మన చేతలు మనం ఎవరినైతే ఇష్టపడుతున్నామో, ప్రేమిస్తున్నామో ఆ వ్యక్తి చుట్టూ నిరంతరం పరిభ్రమించడమే– ప్రదక్షిణ"* అని వివరించారు. శ్రీబాబూజీ శిరిడీకి వచ్చిన తొలి రోజుల్లో బాబా మందిరానికి వెళ్ళి కాలగతి మరచి గడిపేవారు. ఆ తర్వాత వారు మందిరానికి వెళ్ళినప్పుడల్లా అశేషసంఖ్యలో భక్తులు అనుసరిస్తుండడంతో అలా దర్శనానికి వెళ్ళడం సులభ సాధ్యమయ్యేది కాదు.

## హస్తవాసి కాదది – సాయి అనుగ్రహ రాశి

శ్రీబాబూజీ ప్రతి చర్యలో బాబా పట్ల ఉన్న అపారమైన ప్రేమ, వారి ఆచరణ, ప్రబోధంలో మానవీయతా కోణం ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. శిరిడీలో స్థిరపడిన తొలిరోజుల్లో వారు ఉచితంగా హోమియో వైద్యం చేసేవారు. ఎంతోకాలంగా నయంకాని రుగ్మతలు సైతం వారి వైద్యంతో నయమయ్యేవి. అనతికాలంలోనే శిరిడీ, దాని చుట్టుప్రక్కల గ్రామాల వారు శ్రీబాబూజీని 'డాక్టరు సాహెబ్', 'డాక్టర్ బాబు' అని పిలువసాగారు.

ఆధ్యాత్మికసాధనకు, ఉచిత వైద్యానికి సంబంధమేమిటని ప్రశ్నించిన వారితో శ్రీబాబూజీ, *"స్థూలంగా చెప్పాలంటే ఆధ్యాత్మికత పరంగా వైద్యం యొక్క లక్ష్యం దుఃఖనాశనమే! మనో సంబంధమైన దుఃఖాన్ని తొలగించేది ఆధ్యాత్మికత. దేహ సంబంధమైన దుఃఖాన్ని తొలగించేది వైద్యం. మొదటిది సూక్ష్మము, రెండవది స్థూలము. వ్యక్తి మొదట తన దేహ సంబంధమైన దుఃఖం తొలగించుకోవాలని ఆరాటపడతాడు. అది తొలగిన తరువాత, దానికంటే సూక్ష్మతరమైన దుఃఖాన్ని*

గుర్తించి, దాన్ని కూడ తొలగించుకోవాలని ఆయత్తమవుతాడు. సర్వజీవుల్లోను ఉన్న ఒకే భగవతత్త్వాన్ని గుర్తించమని, వారి దుఃఖాన్ని చేతనైనంతవరకు తొలగించమని బాబా ఉద్బోధించారు. సరైన అవగాహనతో సాటి వ్యక్తి యొక్క బాధను గుర్తించి, దాన్ని తొలగించేందుకు ప్రయత్నం చేయడం కూడా ఆధ్యాత్మిక సాధనలో భాగమే అవుతుంది. దుఃఖంతో మన వద్దకు వచ్చిన వారికి చేతనైనంతలో సాంత్వన కల్గించడానికి యత్నించడం మన ధర్మం. నా దృష్టిలో మందు కేవలం మిషే! వ్యాధిని తగ్గించే అసలు ఔషధం సాయి కృపే! ఈ మందు సాయి కృపకు ఒక వాహకం. ఈ వైద్యం సాయి కృపాశక్తిని నిరూపించే ఒక సాధనం" అని విశదపరచారు. ఆ తర్వాత రోజులలో, మందులతో నిమిత్తం లేకుండా శ్రీబాబూజీ పవిత్ర హస్తాల మీదుగా 'బాబా ఊదీ' తీసుకున్నా ఉపశమనం కలగడం భక్తులకు అనుభవమయింది.

## ఆత్మీయ అనుబంధం

శారీరక రుగ్మతలే కాదు, మానసిక రుగ్మతలు సైతం వారి సన్నిధిలో తొలగిపోయి ప్రశాంతత చవిచూడడంతో, తరచుగా శ్రీబాబూజీని కలిసేందుకు ఏదో ఒక మిషతో భక్తులు రాసాగారు. వారి చెంత అందరిదీ ఒకే విధమైన అనుభవం. కష్టాలు తీరడం, అడ్డంకులు తొలగడం, ఆనందం అనుభవమవడం. అలా వచ్చిన వారందరూ శ్రీబాబూజీలో ఒక ఆత్మీయుడిని, మనస్సు తెలిసిన స్నేహితుడిని, సర్వం సమకూర్చగల తండ్రిని, జీవితాన్ని తీర్చిదిద్దగల గైడ్‌ని, వీటన్నింటినీ మించి సాయిప్రేమను చవిచూపించగల సద్గురువును చూశారు.

తమ కష్టనష్టాలు, వెతలు, వేదనలు, సమస్యలు, కోరికలు, సుఖసంతోషాలు, మంచిచెడులు.. ఇలా ప్రతి ఒక్కటి శ్రీబాబూజీతో భక్తులు చెప్పుకొనేవారు. తోటివారి కష్టాలకు స్పందించే మహితాత్ములుగా భక్తుల హృదయాలకు శ్రీబాబూజీ చేరువయ్యారు. ఎవరైనా విన్నవించుకున్నప్పుడు, ప్రతిగా శ్రీబాబూజీ క్లుప్తంగా, సూటిగా సాయి నేపథ్యంగానే వారికి బదులిచ్చేవారు. అలా ప్రతిస్పందనగా పలికే ఒకటి రెండు మాటలే భక్తులకు కొండంత ధైర్యాన్ని కలిగించేవి. సాయి అనుగ్రహం ఎల్లవేళలా వెన్నంటి ఉందన్న గుర్తింపును, ఎఱుకను స్థిరం చేసేవి. భక్తులు పొందుతున్న అనుభవాలు ఆ నోట ఈ నోట విని శ్రీబాబూజీ దర్శనార్థం వచ్చే భక్తులు రోజురోజుకూ పెరుగసాగారు. శ్రీబాబూజీని దర్శించుకోవాలని, వారి సన్నిధిలో గడపాలని భావించి

వచ్చిన వారు ఎండ, వాన, చలి ఇవేమి లక్ష్యపెట్టకుండా అక్కడున్న అరుగులపైన, ఆ రోడ్డుపైనే ఉండేవారు. ఆ ఇరుకు వీధిలో స్థలాభావం చేత సత్సంగం చేసుకొనేందుకు ఇబ్బందిగా ఉండేది. తమ కోసం వచ్చినవారి ఇబ్బందిని, తమ ఇరుగుపొరుగు వారికి కలుగుతున్న అసౌకర్యాన్ని శ్రీబాబూజీ గమనించారు. ఈ ఇబ్బందిని అర్థం చేసుకొన్న ఒక గురుబంధువు- సమీపంలోని కొంత స్థలాన్ని కొనుగోలు చేయగా, అందరూ కలసి సత్సంగం చేసుకొనేందుకు వీలుగా వెదురు కప్పుతో ఒక హాల్‌ని భక్తులందరూ ఒక కరసేవగా చేసి మనోహరంగా నిర్మించారు. సత్సంగహాల్ నిర్మాణం 1996లో పూర్తయింది. అప్పటి నుండి సత్సంగం అక్కడే జరిగేది. కాని సత్సంగం తర్వాత అందరూ శ్రీబాబూజీ దర్శనం కోసం, వారి సన్నిధిలో ఉండడం కోసం వారి నివాసం చేరేవారు. దాంతో ఇబ్బంది మొదటికే వచ్చింది. పై పరిస్థితిని నివారించేందుకు శ్రీబాబూజీ సత్సంగహాలు ప్రక్కనే నిర్మించబడ్డ గదుల్లో రెండింటిని అద్దెకు తీసుకున్నారు. అవి అప్పుడుంటున్న రేకుల గదుల ఇంటి కంటే చిన్నవి. అయినా భక్తులకు, చుట్టుప్రక్కల వారికి అసౌకర్యం కలుగకూడదని భావించి శ్రీబాబూజీ ఆ నిర్ణయం తీసుకున్నారు. కొందరు గురుబంధువులు ఆ ప్రక్కనే స్థలాలు కొనుగోలు చేశారు. కొంతమంది ఇళ్ళు కట్టుకున్నారు.

శ్రీబాబూజీ మాత్రం తాము అద్దెకు తీసుకున్న ఆ రెండు గదుల్లోనే తమ కుటుంబంతో ఉండేవారు. ఆ తర్వాత వారుంటున్న గదుల పైన సకల సౌకర్యాలతో ఇల్లు నిర్మించారు. వారు అంత సౌకర్యమైన ఇంటిని వదలి, ఆ సమీపంలో ఉన్న గురుబంధువు నివాసం 'గురుచరణ్' మొదటి అంతస్తుని అద్దెకు తీసుకుని, ఏప్రిల్ 11, 2003 శ్రీరామనవమి రోజున అక్కడకు మారారు.

## సాన్నిధ్యం

నిర్మలమైన ఆకాశం, గంభీరమైన సముద్రం చూస్తుంటే ఎటువంటి అనుభూతి చెందుతామో, శ్రీబాబూజీని దర్శించుకున్నప్పుడు అంతకన్నా అద్వితీయమైన అనుభూతికి భక్తులు లోనయ్యేవారు. శ్రీబాబూజీతో భక్తులకున్న అనుబంధం అనిర్వచనీయమైనది. శ్రీబాబూజీని దర్శించుకోవాలని, ఆ మహాత్ముని సాంగత్యంలో, ప్రత్యక్షసన్నిధిలో గడపాలని భక్తులు పరితపించేవారు. ప్రతిరోజూ రాత్రి సాయిపథం సత్సంగహాల్‌లో నిత్యప్రార్థన, సచ్చరిత్ర పారాయణ, సాయిబాబా నామస్మరణ

జరుగుతాయి. రాత్రి 8-9 గంటల ప్రాంతంలో సాయిభక్తులందరితో కలసి సాయి నామ స్మరణలో పాల్గొనేందుకు శ్రీబాబూజీ సత్సంగహాల్‌కి వచ్చేవారు. ఆ సమయంలో వారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో సాయిపథ ప్రాంగణం క్రిక్కిరిసిపోయేది. అక్కడ చేరిన వారందరికీ రోజు మొత్తంలో బాబూజీ ప్రత్యక్ష సన్నిధిలో గడపగలిగే ఆ కొన్ని నిమిషాలు అత్యంత విలువైనవి. శ్రీబాబూజీ సన్నిధిని అనుభవిస్తూ, ఆశీస్సులు అర్థిస్తూ, ఆనందాన్ని ఆస్వాదిస్తూ అక్కడ వారందరూ తమను తాము మరచిపోయేవారు. ఆ మహనీయుని పరిచయంతో, జిజ్ఞాసువులు తమ చిరకాల అన్వేషణ పూర్తయిందని అనిర్వచనీయమైన ఆనందానికి లోనయ్యేవారు. సాధనాపరమైన ఎన్నో అవరోధాలను ఆ సన్నిధిలో అప్రయత్నంగా అధిగమించేవారు. తాము పొందిన అనుభవాలు, అపారప్రేమ, ఆనందం, రక్షణ తోటివారు పొందాలని తమ బిడ్డలను, స్నేహితులను, పరిచయస్తులందరినీ ఆ సన్నిధికి తీసుకుని వచ్చేవారు. ఏమీ కాని, ఏమీ చేతకాని, ఏ అర్హతా లేని తమపై ఆ మహితమూర్తి చూపుతున్న కరుణరసప్రవాహపు వెల్లువలో భక్తులు కరగిపోయేవారు.

## ఆదర్శాల ఆ'దర్శనం'

'దర్శనమిచ్చేందుకు మీరు సత్సంగహాల్‌కి వచ్చినప్పుడు అన్ని వేలమంది దృష్టి మీ మీదుంటుంది కదా! అప్పుడు మీకేం అనిపిస్తుంది?' అని ఒకరోజు సత్సంగంలో అడిగినప్పుడు దానికి శ్రీబాబూజీ, *"ఎవరికో దర్శనమిచ్చేందుకు నేను సత్సంగహాల్‌కి రావడం లేదు. నేనొచ్చేది దర్శనం చేసుకునేందుకు. అయినా ఒకరికి దర్శనమిచ్చేందుకు మనమెంతటివారం? బాబానే దర్శనీయుడు. అంతమంది సాయిభక్తుల ముందున్నప్పుడు నాకు 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్...' అన్న వేదసూక్తం స్ఫురణకు వస్తుంది. సహస్ర శిరస్సులతో, సహస్ర నేత్రాలతో శ్రీసాయి తమ విరాట్‌స్వరూపంతో దర్శనమిచ్చి, ప్రసన్న దృష్టితో చూస్తున్నారనిపిస్తుంది. అలా, ఆ విరాట్‌స్వరూపాన్ని దర్శించుకోవడమే నేను చేసేది!"* అని అన్నారు.

## ప్రేమకు వ్యక్తీకరణే

"మీ దగ్గరకు ఎంత మంది వచ్చినా, వారందరి ప్రార్థనలకు ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా మీరు స్పందిస్తున్నారు. అందుకు కారణం తెలుసుకోవాలని ఉంది" అని

అడిగినప్పుడు, "నా బిడ్డ అడిగితే ఎలా తన సమస్యలకు స్పందిస్తానో అలానే మీరడిగినా మీ సమస్యలకు, సందేహాలకు స్పందిస్తాను. అలా స్పందించడం మిమ్మల్ని ఉద్ధరించడానికో, నా కర్తవ్యమనో నేను భావించడం లేదు. మీ సమస్యలకు తగిన పరిష్కారం చూపడం, కష్టాల్ని చేతనయినంతవరకు తీర్చడం ఇదంతా మీ పట్ల, బాబాపట్ల నాకున్న ప్రేమకు వ్యక్తీకరణగానే భావిస్తాను. ప్రేమను వ్యక్తం చేసే కొలది పెరుగుతుంది. మీరందరూ నాకు బాబా ప్రతిరూపాలే. మీపట్ల నా ప్రేమను వ్యక్తపరచుకొంటూ బాబాతో బంధాన్ని, అనుబంధాన్ని ఇంకా పెంచుకొంటున్నాను. మీ కష్టాలు, సమస్యలు తీరితే మీరు చాలా ఆనందిస్తారు. అలా అందరూ ఆనందంగా ఉండడమనేది నాకెంతో సంతోషాన్నిస్తుంది. ఆనందస్వరూపులైన బాబాతో మమేకం చేస్తుంది. బాబా ఏమన్నారు? 'ఋణానుబంధాన్ని గుర్తుంచుకో. ఎవరూ నీ వద్దకు ఋణానుబంధం లేనిదే రారు' అని. శ్రీసాయితో ఉన్న ఋణానుబంధమే మీ అందరినీ నా వద్దకు రప్పిస్తున్నది. కాబట్టి నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావిస్తాను. మరి నేను మిమ్మల్ని ఒట్టి చేతులతో ఎలా పంపగలను? బాబా నాకు ఇచ్చినదేదో అది మీతో పంచుకోవడం ద్వారా శ్రీసాయితో అనుబంధం పెంచుకోగలుగుతున్నాను" అని విశదపరచారు శ్రీబాబూజీ.

## నమస్కారం

"ఏ స్థితిలో అహంకారం తనను తాను కోల్పోవడానికి సిద్ధంగా ఉంటుందో ఆ స్థితిని నమస్కారం సూచిస్తుంది" అని నమస్కరించడంలోని అంతరార్థాన్ని వివరించారు శ్రీబాబూజీ. జీవితంలోని ప్రతి క్షణం సాయి అనుగ్రహ ప్రసాదంగా భావించే శ్రీబాబూజీ నిరంతరం బాబా స్మరణలో ఉంటూ– ఏమి చేస్తున్నా, బాబాకు పలుమార్లు నమస్కరించుకునేవారు. బాబాకు రెండు చేతులతో నమస్కరించడమో, హృదయంపై చేయి ఉంచి బాబాను చూస్తూ తలవంచడమో, కళ్ళు మూసి బాబాను స్మరించడమో– ఇలా ఏదో ఒక విధంగా బాబాకు నమస్కరించనిదే ఏదీ చేయరు. ఏదైనా పని మొదలు పెట్టినప్పుడు, ఆ తర్వాత మధ్యమధ్యలో, ఆ పని పూర్తయిన తర్వాత, ఎవరితోనైనా మాట్లాడవలసి వచ్చినా, ఒక పుస్తకం తీసుకునే ముందు, చదివే సమయంలో, చదవడం ముగిసిన తర్వాత– ఇలా ప్రతి కదలికలో బాబాకు నమస్కారం చేసుకునేవారు. చివరకు మంచినీళ్ళు, కాఫీ త్రాగాలన్నా, భోజనానికి

కూర్చున్నప్పుడు, భోజనం చేసే సమయంలో, అయిన తర్వాత, ఒక గది నుండి మరో గదికి వెళ్ళినప్పుడు, ఆ గది నుండి వచ్చాక– ఇలా ప్రతి చర్యలో బాబాకు నమస్కరించుకునేవారు. అలా బాబాకు అనన్య శరణాగతి చెందడం శ్రీబాబూజీకే సాధ్యమయింది.

'మీ వద్దకు ఎందరో వచ్చి మీ పాదాలకు నమస్కరించి ఆశీస్సులు కోరుతున్నారు కదా! అప్పుడు మీకేమనిపిస్తుంది?' అని అడిగారు ఓ పాశ్చాత్యభక్తుడు. అందుకు చిరునవ్వు నవ్వుతూ శ్రీబాబూజీ "నాకేమనిపించదు. అసలు వారు నాకు నమస్కారం చేస్తున్నారు అన్న భావన ఉంటే కదా! ప్రతి ఒక్కరిలోనూ ఏదో పొందాలనే తపన. ఆ పొందాలనే దానికి ఓ రూపునివ్వలేని అస్పష్టత. ఆ అస్పష్టతకు శ్రీసాయి వంటి సద్గురు సన్నిధిలో ఓ స్పష్టమైన రూపు వచ్చి, తనకు కావలసినదేదో తెలుసుకునే సామర్థ్యం కలిగి, అవి తీరగల పరిస్థితులు సంభవిస్తాయి. అక్కడ శరణాగతి చెందగలుగుతారు. నిజంగా వారు శరణాగతి చెందేది వారు తీర్చుకోవలసిన ఆర్తికి, తపనకు, దాహానికే. వారికే తెలియని దాహం ఇక్కడ తీరుతుంది. ఒక స్పష్టత, స్వచ్ఛత, అనుభూతి ఇక్కడ కలుగుతాయి కనుకనే నమస్కరిస్తారు. పరోక్షంగా వారి నమస్కారం, శరణాగతి, వారిలోని కోరికలకే! అవి ఇక్కడ తీరుతాయి అన్న వారి భావనకే! నాకు చేసిన ప్రతి నమస్కారం శ్రీసాయికి సమర్పించడమే నేను చేస్తున్న పని" అని తెలిపి సందేహనివృత్తి చేశారు.

## ఊదీ దర్శనం

శ్రీబాబూజీ దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా బాగా పెరిగింది. ఆ మహాత్ముని పాదాలు తాకి పావనమవ్వాలని వచ్చే ఆ భక్తజనప్రవాహం ఉధృతి 1996 వచ్చేసరికి పోటెత్తింది. దాని వల్ల శ్రీబాబూజీని కలసి స్వయంగా మాట్లాడే మహదవకాశం అన్ని సమయాల్లో సాధ్యమయ్యేదికాదు. భక్తుల విజ్ఞాపనలకు స్పందించి అప్పుడప్పుడు, కొన్ని ప్రత్యేక సందర్భాలలో సత్సంగహాలు ప్రక్కనున్న కుటీరంలాంటి చిన్న గదికి శ్రీబాబూజీ వచ్చినప్పుడు, భక్తులు తమకున్న కష్టసుఖాలు చెప్పుకుని, అవసరాలు, కోరికలు, ఆశలు, ఆశయాలు విన్నవించుకొని ఆశీస్సులు కోరేవారు. బాబా అప్పజెప్పిన కార్యంగా భావించి వారందరు చెప్పేది శ్రీబాబూజీ చాలా బాధ్యతాయుతంగా వినేవారు. "బాబా చూసుకుంటారు", "శుభం" – ఇలా

ఒకటి రెండు మాటలతో వారికి సాంత్వన చేకూర్చేవారు. ఆ సమయంలో వారి పాదాలను తాకి నమస్కారం చేసుకోవాలని తపించే వారికి ఆ మహద్భాగ్యం లభించేది. శ్రీబాబూజీ బాబా అనుగ్రహ ప్రసాదంగా అందరికీ ఊదీ ఇచ్చేవారు. మగవారికి నుదుటిపై ఊదీ పెట్టి, చేతిలో ఊదీ ఉంచేవారు. ఆడవారికి మాత్రం వారి చేతుల్లోకే ఊదీని ఇచ్చేవారు. ఆ సమయంలో భక్తులు సమర్పించే పండ్లు, బిస్కెట్లు తిరిగి ప్రసాదంగా, వచ్చిన వారికే ఇచ్చేసేవారు. ఆ విధమైన మహదవకాశాన్ని 'ఊదీ దర్శనం' అనీ, 'పాద దర్శనం' అనీ భక్తులు వ్యవహరించేవారు. శ్రీబాబూజీకి తమ కష్టాలు, సమస్యలు చెప్పుకున్న తర్వాత, ఒక్కసారిగా భక్తులకు లోపల ఉన్న బాధంతా తీసేసినట్లు పోయేది. మనస్సంతా తేలికయ్యేది. "అంతా వారే చూసుకుంటారు" అనే భరోసా భక్తులకు కలిగేది.

ఒక సత్సంగంలో "మీరు ఊదీ ఎందుకు ఇస్తారు" అని అడిగిన ఒక పాశ్చాత్య భక్తునితో బాబూజీ "ఊదీ బాబా కృపకు గుర్తు. ఊదీ సాయి అవ్యాజ కరుణకు వాహకం. అది నా సద్గురు స్పర్శ" అని వివరించారు.

శిరిడీలో సాయిపథం భక్తసంద్రం కావడంతో, ఎవరినీ నిరాశపరచకుండా– శ్రీబాబూజీ వరుసగా రెండు, మూడు రోజులు విరామం లేకుండా ఎన్నో గంటలు అలాగే కూర్చుని, భక్తులు చెప్పేది వింటూ, వారికి సాంత్వన చేకూర్చిన సందర్భాలు అనేకం. ఒక సామాన్య మానవునికైతే అంతసేపు విసుగు, విరామం లేకుండా కూర్చోవడమన్నది అసాధ్యం.

ఆ తర్వాత సంవత్సరాల్లో వేలాదిగా భక్తులు తరలిరావడంతో, అంతకు ముందులా శ్రీబాబూజీతో వ్యక్తిగతంగా మాట్లాడి విన్నవించుకోవడమన్నది గతకాలపు మధురస్మృతిగానే మిగిలిపోయింది. సాయినామ సంకీర్తనలో పాల్గొనడానికి శ్రీబాబూజీ వేదిక మీదకు వచ్చినప్పుడు, భక్తులు తమ కష్టాలు, సమస్యలు, కోరికలు వారికి మనస్సులో చెప్పుకున్నా నెరవేరేవి. శ్రీబాబూజీ సత్సంగహాలు నుండి వెళ్ళేటప్పుడు భక్తులు బారులు తీరి తమ సమస్యలు, కోరికలు నివేదించుకునేవారు.

## ఒకే దైవం, ఒకే ధ్యానం, ఒకే ధ్యేయం

మన ఇష్టదైవాన్ని అనన్యంగా ప్రేమించగలిగిననాడు మరే ఇతర సాధనా మార్గాలు అవసరం లేదంటారు శ్రీబాబూజీ. ఏ దైవాన్ని ఆశ్రయించినా ఆ దైవాన్నే

అనన్యంగా ఆరాధించాలని ప్రబోధిస్తారు. 'అనన్యమైన ప్రేమే– భక్తి' అని నారద భక్తి సూత్రాల్లో చెప్పిన నిర్వచనాన్ని, అనిర్వచనీయమైన రీతిలో శ్రీబాబూజీ ఆచరించి, ఆచరింపజేశారు. అనన్యమైనదంటే– వేరొకటి లేనిదని అర్థం.

"సాయిభక్తులకు శ్రీసాయినాథుడే దైవం, సాధన, మార్గం, గమ్యం", *"మనస్సు వివిధ రూపాలు ధరించడం మాని, ఒకే రూపం ధరించడం ద్వారా చైతన్యఘనత లేక బ్రహ్మతథాకారవృత్తి సిద్ధిస్తుందని బాబా చెప్పిన ఉపాసనారహస్యం మరవడం వల్ల, ఎందరో సాయిభక్తుల పూజామందిరాలు వివిధ దేవతామూర్తుల చిత్రపటాల ప్రదర్శనశాలలుగా మారుతున్నాయి. సాయిభక్తులందరూ వివేకంతో ఈ పరిణామాలను గమనించి ఆత్మవిమర్శన చేసుకుంటూ, నిజమైన సాయిసాంప్రదాయమేమిటో తెలుసుకుని ముందుకు పోవాలి"* అని ఏకదేవతోపాసన ప్రాముఖ్యాన్ని శ్రీబాబూజీ వివరించారు.

భక్తులు రకరకాల నేపథ్యాల నుండి వచ్చినా, వారు క్రమేణా శ్రీబాబూజీ ద్వారా సాయిబాబా గురించి తెలుసుకుని, అనుగ్రహాన్ని చవిచూసి, బాబా భక్తులయ్యారు. మనసు రకరకాల వాటి మీదకు మరలకుండా, బాబాయే ధ్యానానికి ఆలంబనై నిలిచే సాధనమార్గాలను శ్రీబాబూజీ ప్రబోధించారు. సర్వదేవతాస్వరూపులైన బాబాను మనసా, వాచా, కర్మణా తమ సర్వస్వంగా ఆరాధించి, ప్రేమించే విధంగా భక్తుల అంతరంగాన్ని శ్రీబాబూజీ తీర్చిదిద్దారు. బాబాపైనే ఆధారపడి జీవించడం ఎలానో తమ జీవితాంతం ఆచరించి చూపారు.

## సాయిపథం

"ఇది బ్రాహ్మణ (బ్రహ్మజ్ఞానం కలిగినవాడు) మసీదు. ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాదిమందిని శుభ్రమార్గాన నడిపించి, చివరికంటా గమ్యం చేరుస్తాడు" అని అభయం ఇచ్చారు శ్రీసాయిబాబా. బాబా అనుగ్రహ శుభ్రమార్గం, శ్రీబాబూజీ ఆచరించి ప్రబోధించిన బాబా పథం – 'సాయిపథం'.

శ్రీబాబూజీ మాటల్లో సాయిపథం అంటే – *"శ్రీసాయిబాబా చూపిన మార్గం, బాబా నడిచిన బాట, 'సాయి' అనే గమ్యానికి రహదారి. ఏ ఒక్క మతసాంప్రదాయానికి చెందక, ప్రపంచంలోని అందరు మహాత్ములు ఆచరించి బోధించిన విశ్వజనీన ఆధ్యాత్మిక సాంప్రదాయమే ఈ సాయిమార్గం; మరో మాటలో సాయిపథం అంటే*

సద్గురు పథం". సాయిపథానికి సాయియే ఆధారం, జీవం, మార్గం, గమ్యం, సర్వం. శ్రీబాబూజీ మానసం నుండి ఉద్భవించి భక్తి రసగంగ ఉప్పొంగిన ఆనంద పథం– సాయిపథం. బాబాను కేంద్రంగా చేసుకుని అల్లుకున్న జీవన విధానం– సాయిపథం".

"ప్రతి వ్యక్తికి లక్ష్యం ఉండాలి. మన లక్ష్యం, గమ్యం ఎంత ఉన్నతమైనదో, పవిత్రమైనదో వాటిని చేరే మార్గం అంతే పవిత్రంగా, ఉన్నతంగా ఉండాలి" అంటారు శ్రీబాబూజీ. శ్రీబాబూజీ విశిష్ట వ్యక్తిత్వానికి, అంతరంగానికి ఈ ప్రబోధమే ఒక ప్రమాణంగా నిలుస్తుంది. అడ్డుత్రోవలో, వక్రమార్గంలో, అక్రమంగా, ఎలాగైనా సరే త్వరితగతిన లక్ష్యాన్ని చేరాలనే భావనలకు, శ్రీబాబూజీ నిర్దేశించిన సాయిపథంలో చోటు లేదు. "లక్ష్యాన్ని చేరడం ఒక్కటే ప్రధానం కాదు. ఆ లక్ష్యాన్ని బాబా చూపిన శుభ్రమార్గంలోనే చేరామా? లేదా? అనేది కూడ ప్రధానం" అంటారు శ్రీబాబూజీ. మనం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని త్వరితగతిన చేరగలిగినా అది బాబా చూపిన పవిత్రమార్గం కానపుడు నిష్ఫలమే అవుతుంది. ఆ అపవిత్రపు మార్గం, బాబా చేర్చాలనుకున్న గమ్యానికి చేరువ కానీయక, మనమే ఏర్పరచుకున్న అడ్డంకియై, గమ్యానికి మరింతగా దూరం చేస్తుందంటారు శ్రీబాబూజీ.

## సాధనామార్గాలు

శ్రీసాయిబాబా పట్ల మనకున్న ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి, సాయిబాబా మన పట్ల చూపించే ప్రేమానుగ్రహాన్ని, ప్రసాదించిన ఆనందాన్ని చవిచూడడానికి, అనుభవించడానికి శ్రీబాబూజీ సూచించిన సాధనామార్గాల్లో ప్రధానమైనవి– సత్సంగం, సాయిబాబా నామస్మరణ (భజన), పారాయణ. "ఇటు మితిమీరిన భోగాన్ని, అటు అలవిమాలిన హఠయోగాన్ని శ్రీసాయి ఆమోదించలేదు. బాబా మనకు ఆదేశించింది మధ్యే మార్గం" అని వివరించిన శ్రీబాబూజీ, సాధనా పరంగా భక్తులను అదే మార్గాన్ని అవలంబింపజేశారు. వారు సూచించిన మార్గాలన్నీ అందరికీ సులభతరమైనవి, ఆచరణాత్మకమైనవి. సాయిపట్ల ప్రేమను పెంపొందించి, సదా శ్రీసాయి ఊసు, ధ్యాసలో ఉండేట్లు చేయడమే సాధనామార్గాల పరమలక్ష్యమని, మన హృదయాంతరాళాల్లో ఉన్న ప్రేమను పైకి వచ్చేట్లు చేయడమే కాకుండా, సాయి ప్రేమానుగ్రహాన్ని గుర్తించే హృదయయోగ్యతను మనకు ఈ సాధనలు ప్రసాదిస్తాయి అని శ్రీబాబూజీ సాధనాఫలాలను వివరించారు.

నిరంతరం మనలను సాయి స్మరణలో ఉంచి, సాయి సాన్నిధ్యాన్ని, ప్రేమను అనుభవింపజేసేది– సత్సంగం. శ్రీబాబూజీ కాలేజీలో చదివే రోజుల నుండి నిత్యం సత్సంగానికి వెళ్ళేవారు. వాతావరణం అనుకూలించకున్నా, చివరకు తుఫాను వచ్చినా సరే– నియమం తప్పకుండా సత్సంగం చేసుకునేవారు. క్రమం తప్పకుండా సత్సంగానికి వెళ్ళమని అందరికీ శ్రీబాబూజీ సూచించేవారు. *"మన హృదయాల్లో నాటబడ్డ బాబాపట్ల ప్రేమ, జీవితతత్త్వం పట్ల అన్వేషణ అనే విత్తనాలు ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్నాయి. అవి సరిగా పెరిగి, పుష్పించి, ఫలాలనివ్వాలంటే, ఆ మొలకలను కంచె కట్టి కాపాడుకోవాలి. ఆ కంచే సత్సంగం"* అని సత్సంగం ఆవశ్యకతను శ్రీబాబూజీ తెలిపారు. వారు ప్రసాదించిన స్ఫూర్తితో ఊరువాడలా, దేశవిదేశాల్లో స్వచ్ఛందంగా సాయిబాబా సత్సంగ కేంద్రాలు నెలకొల్పబడ్డాయి.

"నన్నందరూ సాయిబాబా అంటారు" అన్న శ్రీసాయి మాటే శృతి ప్రమాణంగా, శ్రీబాబూజీ ప్రపంచానికి ప్రసాదించిన దివ్యసాధనం– 'సాయిబాబా సాయిబాబా' అనే నామస్మరణ. సాయిబాబాకు అనేక దేవతానామాలను, బీజాక్షరాలను జోడించి చెబుతున్న నేపథ్యంలో సాయిని సాయిగానే దర్శింపజేస్తుంది–శ్రీబాబూజీ సూచించిన రీతిలో చేసుకునే 'సాయిబాబా' నామస్మరణ. *"నామస్మరణ అంటే కేవలం నోటితో ఉచ్చరించేది కాదు. నామం పలుకుతున్నామంటే బాబాను పిలిస్తున్నామని అర్థం", "బాబా, బాబా అని నీ గుండె లోతుల నుండి పిలువు. నీ హృదయంలో దాచుకున్న వేదనలు, కోరికలు ఆ పిలుపుగుండా బయటపడేటట్లు పిలవాలి. అదే నామస్మరణ– భజన", "మన హృదయాల్లో బాబాపట్ల ఉన్న ప్రేమను, ఆర్తిని, ఆర్ద్రతను వ్యక్తం చేసుకునే సాధనే– భజన"* అని వివరించారు శ్రీబాబూజీ.

మనకు ప్రియమైన బాబా గురించి, బాబాతత్త్వం గురించి తెలుసుకొనేందుకు శ్రీబాబూజీ సూచించిన ఒకానొక సాధనం– పారాయణ. *"పారాయణ ఒక మ్రొక్కుబడి తంతుగా చేయరాదు. బాబాలో వ్యక్తమయ్యే తత్త్వం ఏమిటి? బాబా ఏం చెప్పారు? ఒక లీల జరిగినప్పుడు ఆ భక్తుని స్థానంలో నేనుంటే ఎలా ఫీలవుతాను? – ఇలా ప్రతి విషయాన్ని తరచి తర్కించుకుంటూ చదవాలి. బాబా లీలను చదివినప్పుడు ఆ సందర్భంలో అక్కడున్న భక్తులలో ఒకడివై ఆ సన్నివేశాన్ని చూడగలగాలి. ఆ లీలావిలాసంలో మైమరచి ఆనందిస్తూ మమేకమవగలగాలి. అలా పరాయణత్వం కలిగించినప్పుడే అది పారాయణ అవుతుంది"* అని శ్రీబాబూజీ విశదపరిచారు.

## సాయిపథంలో పండుగలు

సాయిపథంలో జరుపుకునే పండుగలు ప్రధానంగా రెండు. ఒకటి– బాబానే స్వయంగా ఆచరించమని సూచించిన పర్వదినం– గురుపూర్ణిమ. రెండవది బాబా మహాసమాధి చెందిన పవిత్రమైన రోజు– విజయదశమి. ఎవరికి వారు సాధన చేసుకునే కన్నా అందరూ కలసి చేసుకున్నప్పుడు, భక్తుల్లోని ప్రేమ, భక్తి జాగృతమై, ఆ ప్రభావం వల్ల మనలోని బలహీనతలను అధిగమించి, వ్యక్తిత్వపరిమితులను దాటి, సాధన చేసుకోవడం సుళువవుతుందని విశదపరచారు శ్రీబాబూజీ. సద్గురు సన్నిధిలో అందరూ కలసి సాధన చేసుకునేందుకు, ఆనందోత్సవాల్లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుండి భక్తులు ఈ పండుగల సమయంలో శిరిడీకి తరలివస్తారు. ఆ సందర్భాలలో భక్తులు సాయి స్మరణలో భాగంగా సత్సంగం, అనుభవాలను పంచుకోవడం, సాయినామ ఏకాహాలు, సప్తాహాలు నిర్వహిస్తారు. ఈ మహోత్సవాల్లో భాగంగా శిరిడీ ప్రదక్షిణగా సాగే "సాయి పల్లకీ ఉత్సవం" అత్యంత వైభవంగా జరుగుతుంది. శ్రీబాబూజీ పూజామందిరంలో కొలువుండే బాబా చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగింపుగా సాయిబాబా సమాధిమందిరం వరకు తీసుకెళ్ళి, బాబా ఫోటోను బాబా సమాధి దగ్గర తాకించి, తిరిగి సాయిపథ ఆవరణ వరకు ఊరేగింపుగా తీసుకొస్తారు. ఊరేగింపు ప్రారంభంలో శ్రీబాబూజీ తమ స్వహస్తాలతో బాబా ఫోటోను అందజేసి, చివరలో మరలా బాబా ఫోటోను అందుకునేవారు. ఈ పండుగల సందర్భంలో శ్రీబాబూజీ సాన్నిధ్యంలో ఏ తంతులు లేకుండా వివాహాలు, అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు కన్నులపండుగగా జరిగేవి.

## శ్రీబాబూజీ సాహితీ వైభవం

శ్రీసాయి ఎడల ఉన్న అవ్యాజప్రేమను ప్రతి అక్షరంలో పొదిగించి, సాహితీ సింధూరంతో సాయి పాదాలకు పారాణి అద్ది, అక్షర సుమాలతో సాయి పదార్చన చేశారు శ్రీబాబూజీ. శిరిడీకి రాక మునుపు 1983–89 మధ్యకాలంలో బాబాకు సంబంధించి రచనలెన్నో చేశారు. భక్తుల నుండి వచ్చిన అనేక విజ్ఞప్తుల దృష్ట్యా, వాటిలో కొన్నింటిని సంకలనం చేసి 'సాయిభక్తి సాధన రహస్యం' అనే మహోత్కృష్టమైన గ్రంథాన్ని 1996వ సంవత్సరం గురుపూర్ణిమకు 'సాయిపథం పబ్లికేషన్స్' తరఫున ప్రథమ ముద్రణ చేశారు. శ్రీసాయి అగాధతత్త్వ సాగరంలో దాగిన సాధన రహస్యాలు,

జ్ఞానరత్నాలను వెలికితీసి శ్రీసాయికి అలంకరించిన సాహితీ సమాహారం– సాయిభక్తి సాధన రహస్యం.

బాబాకు నిత్యం ఇచ్చే ఆరతుల్లోని భావసౌందర్యాన్ని దర్శింపజేసిన, శ్రీబాబూజీ విరచిత ఆంగ్ల గ్రంథం 'ఆరతి సాయిబాబా' అదే సంవత్సరం ముద్రితమైంది.

సంత్‌కవి శ్రీదాసగణు మహరాజ్ రచించిన మరాఠీ మూలానికి అనువాద గ్రంథం 'శ్రీసాయి గురుచరిత్ర'కు వివరణాత్మక పీఠికను రచించారు శ్రీబాబూజీ. అందులో శ్రీసాయిబాబా పుట్టుపూర్వోత్తరాలు, సాయిబాబా గురువు, దాసగణు మహరాజ్‌కు సంబంధించిన పరిశోధన అంశాలు, మనకు తెలియని ఎన్నో ఆసక్తిని రేకెత్తించే విషయాలను శ్రీబాబూజీ ప్రస్తావించారు. శ్రీసాయిబాబా జన్మరహస్యానికి సంబంధించి, అంతవరకు ప్రచారంలో ఉన్న నిరాధారమైన కథలకు శ్రీబాబూజీ విశ్లేషణాత్మక పీఠికతో కాలం చెల్లిపోయింది.

బాబాపై శ్రీబాబూజీ రచించిన గీతాలే– సాయిపదాలు. సాయితత్త్వాన్ని, ఆధ్యాత్మిక రహస్యాలను, సూక్ష్మాలను అలతి అలతి మాటలతో 'సాయిపదాలు'లో పల్లవింపజేశారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ రచనలు పండితులను, పామరులను ఒకే విధంగా రంజింప జేస్తాయి. చదవడం మొదలుపెడితే, చివరకంటా చదవనిదే లేవలేని పారవశ్యానికి గురిచేసే కవితాత్మకమైన శైలి వారి సొంతం. అనవసరమైన ఒక్క వాక్యం కూడా వారి రచనలో కనపడదు. పడికట్టు పదాలకు ప్రాధాన్యతనివ్వక భావసౌందర్యానికే వారు పెద్దపీట వేశారు. వారి రచనల్లో ఒకరి శైలిని లేదా భావాన్ని అనుకరించినట్లు లేదా అనుసరిస్తున్నట్లు ఎక్కడా కనిపించదు. వారు వ్యాసాలకు పెట్టే శీర్షికలు ఆయా వ్యాసాలలోని అంతరార్థాన్ని ప్రతిబింబిస్తూ విలక్షణంగా ఉండేవి.

తెలుగు, ఆంగ్లభాషల్లో వారికి అసాధారణమైన సాధికారత ఉండేది. అంతే కాకుండా సంస్కృతభాషను అధ్యయనం చేసి, అందులో విశేష ప్రావీణ్యం సంపాదించారు. మేధావులు వారి ప్రజ్ఞ చూసి అబ్బురపడేవారు. భాషా పండితులు సైతం తమకు గల సందేహాల నివృత్తి కోసం శ్రీబాబూజీని సంప్రదించేవారంటే వారికి ఆయా భాషలపై ఉన్న పట్టు ఎంతటిదో విస్పష్టమవుతుంది. పాశ్చాత్యులు శ్రీబాబూజీ దగ్గరకు రావడం ఆరంభించిన తర్వాత, వాళ్ళ వాళ్ళ సంస్కృతి, సాహిత్యం, చరిత్ర పట్ల శ్రీబాబూజీకి ఉన్న అపరిమిత పరిజ్ఞానం, అవగాహన చూసి వాళ్ళు ఎంతో

ఆశ్చర్యపడేవారు. శ్రీబాబూజీ ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడడం, తమకంటే వారికే తమ భాషపై పట్టు ఉండడం చూసిన పాశ్చాత్యులు అమితాశ్చర్యానికి లోనయ్యేవారు.

## శ్రీబాబూజీ సత్సంగం

శ్రీబాబూజీ సత్సంగం– ఆనంద తరంగాలు ఉవ్వెత్తుకు ఎగసే సుజ్ఞానసాగరం. శ్రీబాబూజీ సహజంగా ఏకాంతంలో ఉండడానికి ఇష్టపడతారు. అయితే వారి సన్నిధిలో అప్రయత్నంగా అనుభవమయ్యే ప్రశాంతతను, ఆనందాన్ని, మాధుర్యాన్ని అనుభవించిన భక్తులు, శ్రీబాబూజీ ప్రత్యక్షసన్నిధిలో ఎక్కువ సమయం గడిపే మహదవకాశాల కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తారు. ఆ అవకాశాలు ప్రధానంగా రెండు సందర్భాల్లో వస్తాయి. ఒకటి – గురుపూర్ణిమ, విజయదశమి పర్వదినాల సమయంలో వివాహాలు, అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు జరుగుతున్నప్పుడు శ్రీబాబూజీని దర్శిస్తూ, ఆ పవిత్రసన్నిధిలో ఎంతో సేపు ఉండే భాగ్యం అందరికీ లభించేది. రెండవది– జ్ఞానరత్నాలను పంచే శ్రీబాబూజీ సత్సంగం.

శ్రీబాబూజీ తిరువణ్ణామలై, తిరుమల, అప్పుడప్పుడు ఉత్తర భారతదేశానికి వెళ్ళేవారు. తరచుగా తిరువణ్ణామలైలో, చాలా అరుదుగా తిరుమలలో వారి దర్శన భాగ్యం భక్తులకు కలిగేది. తమ కుమార్తె చదువు విషయమై 2003 నుండి చెన్నైలోనే ఉంటూ, అప్పుడప్పుడూ శిరిడీ వచ్చేవారు. గురుపూర్ణిమ, విజయదశమి పర్వదినాలకు తప్పకుండా శిరిడీ వస్తుండేవారు.

ఆ మహాత్ముని దివ్యసాన్నిధ్యంలో ఉండడం ఓ మహత్తరమైన 'సత్సంగం'. ఆ మహితాత్ముని వాక్సుధను ఆస్వాదించడం మరో అద్భుతమైన 'సత్సంగం'. ఆ సన్నిధిలో సత్స్వరూపానందం అనాయాసంగా అనుభవమవుతుంది. అంతటి మహనీయులు సత్సంగానికి భక్తులతో కూర్చొన్నప్పుడు– మనలో ఒకరై, ఒక ఆత్మీయునిలా, స్నేహితునిలా హాస్యమాడుతూ, చిన్న చిన్న ఉదాహరణలు, ఉపమానాలతో గొప్ప గొప్ప ఆధ్యాత్మిక సత్యాలను తెలియజేస్తూ, ఎంతో మహోన్నతస్థితిలో ఉన్న మహాత్మునితో మాట్లాడుతున్నామన్న భావాన్ని మరిపింపజేస్తారు.

వారు మనం అడిగిన దానికి సమాధానం చెబుతారు తప్పితే ఉపన్యాసాలు ఇవ్వరు. బాబా పట్ల, మన పట్ల ఉన్న ప్రేమే వారిని అక్కడ మాట్లాడేటట్లు చేస్తుంది. నేను చెప్పేవాడిని, ఎదుటి వాళ్ళు వినేవాళ్ళు అన్న భావన ఇసుమంతయినా వారి

దగ్గర కనిపించదు. సత్సంగం ఆరంభిస్తూనే 'చెప్పండయ్యా' అని భక్తులను ఉద్దేశించి అనేవారు. ప్రశ్నకు సమాధానం చెప్పడం పూర్తయిన ప్రతిసారీ, భక్తులు చెప్పేవి తాను వినడానికి వచ్చినట్లు 'ఇంకా చెప్పండయ్యా' అని అనేవారు. వారిలో– ఎంత తెలిసినా, ఎదిగినా ఒదిగి ఉండే ఔన్నత్యం కనబడుతుంది.

బాబా జీవితం, లీలాప్రబోధం – ఇలా ఏ విషయం గురించైనా చెబుతున్నప్పుడు వారి కళ్ళల్లో బాబాపట్ల ఉన్న ప్రేమ ప్రస్ఫుటంగా కనబడేది. బాబా లీలలను వారు విశ్లేషిస్తుంటే ఎన్నో ఆసక్తికరమైన అంశాలు తెలిసేవి. బాబా అగాధతత్త్వంలోని ఎన్నో ఆణిముత్యాలను, జ్ఞానరత్నాలను తమ సత్సంగాల ద్వారా భక్తులకు వారు పంచారు. ఒక్క బాబా గురించే కాదు, ఏ మహాత్మునికి సంబంధించిన అంశాన్ని అడిగినా సవివరంగా చెప్పేవారు. సాధనాపరమైన విషయాలలో మనకు ఉండే అవగాహనాలేమిని వారు పోగొట్టేవారు. ఇదంతా ఒక ఎత్తయితే – మన జీవితం, ఆలోచనా విధానం, ఆనందం, తృప్తి – ఇలా అనేక విషయాల గురించి వారు చెప్పే వివరణ, ఇచ్చే విశ్లేషణ మరో ఎత్తు.

శ్రీబాబూజీ సత్సంగ సాన్నిధ్యం ఎన్నో అనుభవాలను అనుగ్రహించేది. వారు చెబుతున్నప్పుడు మన అంతరంగాన్ని ఆసాంతం చదివారా అనిపించేది. ఒకరు అడిగిన ప్రశ్నకు, వారిచ్చిన సమాధానం అక్కడున్న చాలా మందిలో అవ్యక్తంగా ఉన్న అనుమానాలను నివృత్తి చేసేది. ఆ ఒక్క సమాధానమే, ఎవరికి ఎలా చేరాలో అలా చేరేది. ఎవరికి వారు తమను ఉద్దేశించే ఇదంతా చెబుతున్నారని భావించేవారు.

ఎప్పటినుండో మనలో పేరుకుపోయి భద్రంగా ఉన్న మనలోని సంకుచిత భావాలను వారు సున్నితంగా ప్రశ్నించి, మనలను సరైన రీతిలో ఆలోచింపజేసేవారు. వారి సన్నిధిలో– మనకిష్టమున్నా, లేకున్నా మన వ్యక్తిత్వం స్పష్టంగా కనిపించి– మన ఆలోచనావిధానమేమిటో, మన స్థితి ఏమిటో తెలియజేస్తుంది.

శ్రీబాబూజీతో సత్సంగం ఒక విశేష అధ్యయన అనుభవాన్నిస్తుంది. ఒక ప్రశ్న అడిగినప్పుడు, దాని తాలూకు మూలాల నుండి మొదలుపెట్టి సమగ్రంగా వివరిస్తారు. ఆధ్యాత్మిక గ్రంథాల నుండి అరువు తెచ్చుకొన్న ముక్తి, మోక్షం, ఆత్మజ్ఞానంలాంటి పదాలు వారి మాటల్లో వినిపించవు. ఒక విషయాన్ని విశ్లేషించే క్రమంలో మన చుట్టూ జరిగే చిన్న చిన్న ఉదాహరణలతోనే అడిగినవారి అవసరం, ఆర్తి, ఆసక్తిని బట్టి సందర్భోచితంగా మనలో సదాలోచనలు ప్రేరేపింపజేస్తారు. ఆ ప్రశ్న అడిగినవారిని

మధ్య మధ్యలో తిరిగి ప్రశ్నలు వేస్తూ, వారికి ఆ విషయంపట్ల ఉన్న అవగాహనను పెంపొందించడానికి లోతుగా ఆలోచింపజేస్తారు. మనకంతా తెలుసుననుకున్న ఆ అంశాల్లోని ప్రాథమిక విషయాలు కూడా మనకు తెలియవని, వారి సమాధానం విన్న తర్వాత అర్థమవుతుంది. ఒక ప్రశ్న అడిగినప్పుడు, వారిచ్చే సమాధానం వినగానే అప్పటివరకు మనకు అర్థంగాని విషయాలు ఒక్కసారిగా అవగతమవుతాయి.

శ్రీబాబూజీ ఎక్కడకు వెళితే అక్కడకు కొందరు పాశ్చాత్యులు అనుసరిస్తూ ఉండేవారు. భిన్నమైన నేపథ్యాల నుండి, భాషాసంస్కృతులు, దేశాల నుండి వచ్చిన వారందరినీ కలిపింది, కలిసివుండేలా చేసింది సద్గురు బంధమే! వేరు వేరు దేశాల నుండి రావడం వల్ల వారు పలికే విధానం, ఉచ్చరించే తీరు సహజంగానే చాలా వేరువేరుగా ఉంటుంది. అయినా వారు అడిగేదంతా అవలీలగా అర్థం చేసుకొని, అంతరంగాన్ని చదివి, వారి మనస్సుకు చేరే విధంగా సమాధానం చెప్పేవారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ తమ చుట్టూ చేరిన వారితో సరదాగా మాట్లాడుతూ, అప్పుడప్పుడు మనలోని లోపాలు, తప్పులు, అలవాట్లు, ప్రవర్తన మీద హాస్యోక్తులు వేసేవారు. శ్రీబాబూజీ హాస్య చతురతతో చెప్పే విషయాలు విని సత్సంగంలో నవ్వుల పువ్వులు పూసేవి. సత్సంగం ఆసాంతమూ ఆ గంటన్నర, రెండు గంటల పాటు భక్తులందరూ పెద్దపెద్దగా నవ్వుతూనే ఉండేవారు. వారు హాస్యానికన్నా ఆ మాటలోని మర్మం అర్థం కావలసిన వారికి అర్థమై, అది సద్గురు ప్రబోధంగానే తోచేది. ఆ సునిశిత హాస్యం మనలోని అహంకార పొరలను కరిగించేది. మనకూ, వారికి మధ్య అడ్డుగా ఉండే తెరలను తొలగించి దూరాన్ని తగ్గించేది.

## అపరిగ్రహం

శ్రీబాబూజీ ఆచరణ, ప్రబోధం, జీవితం– అత్యున్నత విలువలకు, ధర్మానికి నిలువుటద్దం పడుతుంది. శాస్త్రసమ్మతంగా ఉండాలనో, విధి విధానాలు అనుసరించి, నియమాల కోసంగా ఏర్పరచుకున్న జీవిత విధానం కాదది.

శ్రీబాబూజీ ఎవరి నుండి దక్షిణలు, విరాళాలు స్వీకరించరు. ఎవరి నుండి ఒక్క పైసా కూడా ఆశించరు. నివేదించేది ఏమైనా కనీసం తాకను కూడా తాకరు. చివరకు భక్తులు సమర్పించిన పండ్లు, బిస్కెట్లు ఇలా ఏమైనా కాని, వాటిని తిరిగి భక్తులకే పంచివేయమని చెబుతారు. భక్తులు ఎవరైనా తెలియక, చెప్పినా వినిపించుకోకుండా

అక్కడ దక్షిణ పెట్టి వెళితే, దానిని ఎవరికైనా చెప్పి సమాధిమందిరంలోనో లేక మసీదులోనో హుండీలో వేయమంటారు.

ఒంగోలులో తాము స్థాపించిన సాయిబాబా సెంట్రల్ స్కూల్ నుండి ప్రతి నెల వచ్చే గౌరవ వేతనమే శ్రీబాబూజీ జీవనభృతి. సాయి అనుగ్రహమే వారికి ఆధారం. వారి భార్యాబిడ్డల అవసరాలు, ప్రయాణపు ఖర్చులు అన్నీ దానితోనే! శిరిడీలో మొదట్లో ఉన్న రేకుల షెడ్ గదులయినా, తరువాత సాయిపథం ఆవరణలోని రెండు చిన్న గదుల్లో ఉన్నప్పుడైనా, ఆ తరువాత ఉన్న 'గురుచరణ్' అయినా – ఇలా ఎక్కడైనా శ్రీబాబూజీ ఉన్నది అద్దె ఇళ్ళలోనే.

బాబాపై సంపూర్ణంగా ఆధారపడి జీవించే శ్రీబాబూజీకి ఈ సువిశాల ప్రపంచంలో వీసమెత్తు భూమి కూడా తమదంటూ లేదు. ఎటువంటి బ్యాంక్ బ్యాలెన్సూ లేదు. కనీసం బ్యాంక్ ఎకౌంట్ కూడా లేదు. రేపటి గురించి ఆలోచన లేదు. ఎవరైనా దీని గురించి ప్రస్తావిస్తే – "ఇంతవరకు అన్నీ చూసుకున్న బాబా రేపటి రోజుల్లో *మన బాగోగులు చూసుకోరా?"* అని నవ్వేసేవారు. డొనేషన్ల ప్రస్తావన వచ్చినప్పుడు *"ఎవరైనా డొనేషన్లు తీసుకొంటుంటే వారు తప్పు చేస్తున్నారు – అని నేననడం లేదు. డొనేషన్లు తీసుకోవడం నా పద్ధతి కాదని మాత్రం స్పష్టం చేయదలచుకున్నాను. నా కష్టం మీద జీవించడాన్ని నేను ఇష్టపడతాను. అలా ఉండడాన్ని ప్రేమిస్తాను. కోట్లాది రూపాయలు మీరిచ్చినా వాటిని కాదని, బాబా పాదాల వద్ద నిలబడి అర్థిస్తాను. చేయి చాస్తే అది బాబా ముందే చాస్తాను"* అని స్పష్టం చేశారు శ్రీబాబూజీ.

## నిజమైన పూదండ

మొదట కొందరు భక్తులు పుట్టినరోజునో లేక పెళ్ళిరోజునో తమ ప్రేమకు వ్యక్తీకరణగా శ్రీబాబూజీకి పూలదండలు వేస్తుంటే, వారి ప్రేమను, భావోద్వేగాన్ని కాదనలేక అడ్డు చెప్పలేకపోయేవారు. క్రమేపీ అనేక మంది భక్తులు అదే దారి అనుసరించి శ్రీబాబూజీని పూలదండలతో ముంచెత్తడంతో, అవి వేయవద్దని వారు సున్నితంగా తిరస్కరించేవారు. అయినా వినక మాలలు వేయడానికి ప్రయత్నిస్తే, ఇక చివరకు ఇలాంటివి నాకు నచ్చవని నిష్కర్షగా చెప్పారు. దాంతో ఓ భక్తుడు 'మా ప్రేమ వ్యక్తం చేసుకునేందుకు ఈ పూలదండలు వేస్తున్నాము. అందుకు అంగీకరించమ'ని ప్రార్థనాపూర్వకంగా అభ్యర్థించాడు. అందుకు శ్రీబాబూజీ స్పందన ఇది: "మన

ప్రేమ పేదవారి ప్రేమను అవహేళన చేయకూడదు. వారి లేమిని గుర్తుచేసి, ఎత్తి చూపి వెక్కిరించకూడదు. ప్రేమ వ్యక్తీకరణకు ఆర్థిక స్థోమత కొలమానం కాకూడదు. స్థోమత కలవారు పూలదండలు వేయగలుగుతున్నారు. అది చూసి స్థోమత లేనివారు తాము వేయలేకపోతున్నందుకు లోలోన కుమిలిపోతున్నారు. అది మీకు ఆనందాన్నిస్తుందా? ఆ పూలదండకు ఖర్చు చేసే 50 రూపాయలతో పేదవారికి రోజంతా గడుస్తున్నది. నన్ను నిజంగా సంతోషపెట్టాలని ఉంటే ఆ డబ్బుతో వారికి ఒక పూట అన్నం పెట్టండి. లేదా నలుగురికి ఉపయోగపడేదేదైనా చేయండి. బాబా సంప్రీతులవుతారు. నలుగురికి సహాయపడుతూ ఆపదలో, కష్టాలలో అండగా నిలవడమే శ్రీసాయికి మనం అర్పించే నిజమైన పూదండ".

## ఆధ్యాత్మికత

అసలు 'ఆధ్యాత్మికత' అంటే ఏమిటి? అదేదో సనాతన సంప్రదాయం, ఆచార వ్యవహారాలకే పరిమితమైనదని భ్రమిస్తాం. ప్రాపంచిక జీవితానికి, వ్యవహారాలకు అతీతమైనదని భావిస్తాం. ప్రాపంచిక విషయాలను వదలుకుంటేనే ఆధ్యాత్మికత వంటబడుతుందని విశ్వసిస్తాం. ఈ భావనలతో బందీయైన మనస్సును శ్రీసాయితత్త్వభావనలతో శ్రీబాబూజీ విముక్తి చేశారు. ఆధ్యాత్మికతను సాయి పరంగా సరిక్రొత్త కోణంలో దర్శింపజేసారు. లెక్కలేనన్ని అపప్రథలతో కలుషితమైన ఆధ్యాత్మిక పరిభాష, వాడుకను క్రమబద్ధీకరించి, భావ ప్రక్షాళన చేసి, సాయి భావనలతో శ్రీబాబూజీ పరిపుష్టం కావించారు. ఆధ్యాత్మికతపట్ల సరియైన దృక్పథాన్ని అలవరచారు.

ఆధ్యాత్మికతను సంక్షిప్తంగా వర్ణించాలంటే – "ప్రేమను అనుభవించడం.. ప్రేమను వ్యక్తపరచడం" అని తెలిపారు శ్రీబాబూజీ. "ఏదైతే మనలను అన్ని రకాలుగా ఉత్తేజపరుస్తుందో అదే ఆధ్యాత్మికత", "నిజమైన ఆధ్యాత్మికత స్పష్టమైన ఆనందం, తృప్తి అనుభవమయ్యే దిశగా మనలను నడిపించగలగాలి", "ఈ జీవితం మాయ, మిథ్య, అసత్యం, నిరుపయోగమైనదని త్రోసిపుచ్చవద్దు. జీవితంలో సంపూర్ణంగా పాలుపంచుకోవడమే ఆధ్యాత్మికత. సంపూర్ణంగా జీవించడమే ఆధ్యాత్మికత", "జీవితాన్ని ఆధ్యాత్మికత సాధ్యమైనంత సంపూర్ణంగా అనుభవించేటట్లు చేస్తుంది. ఇంకా జీవితానికి నిండుదనాన్నిస్తుంది" అని ఆధ్యాత్మికతలోని సరిక్రొత్త కోణాన్ని పూజ్యశ్రీ బాబూజీ స్ఫురింపజేశారు.

## కోరికలు – బాబాతత్త్వం

ప్రాపంచికమైన కోరికలను, వ్యామోహాలను వదలుకుంటేనే ఆధ్యాత్మికత సిద్ధిస్తుందన్న వాదనను శ్రీబాబూజీ త్రోసిపుచ్చారు. "అనుగ్రహించడమే నా పని. నాకు సంబంధించినంతవరకు మొదట ప్రాపంచికమైన కారణాలతోనే నా వద్దకు వస్తారు. వారి కోరికలు తీరి సౌఖ్యం చిక్కాక నన్ను అనుసరించి ఆధ్యాత్మికంగా పురోగమిస్తారు" అన్న బాబా ప్రబోధాన్ని గుర్తు చేసి, "ఎవరికైనా ప్రాపంచిక కోరికలు, అవసరాలు వారి ఆధ్యాత్మిక పురోగతికి అవరోధమేమోగాని, సాయిభక్తునికి అవి అవరోధం కాదు" అని శ్రీబాబూజీ స్పష్టం చేశారు. "నిజంగా నీకు ఏది అవసరమో, అది తెలుసుకో! బాబా దానిని తప్పక నెరవేరుస్తారు" అని చెప్పేవారు. "వివిధ విషయవాసనలతో, కోరికలతో, ప్రాపంచిక వ్యామోహాలతో సతమతమవుతున్న మనకు ఒకవైపు వాటిని తీరుస్తూ, సంతృప్తిని, ఆనందాన్నిస్తూనే, మనలను మనసు యొక్క సహజ స్వభావానికి అనుగుణంగా సంస్కరించి, ఉద్ధరించి, సద్గతిని అందజేయడమే సాయి అవతారకార్యం యొక్క పరమార్థం" అని బాబా తత్త్వంలోని విశిష్టతను శ్రీబాబూజీ ఎఱుకపరచారు.

## ఆచారమా? అపచారమా?

"ఆచారాల వెనుక నిద్రాణంగా ఉన్న ఆధ్యాత్మిక పరమైన అంశాలను, సూక్ష్మాలను మేల్కొలిపి, వెలికి తీసి, మనం ఆచరించి, సాటివారికి తెలియజెప్పడం మన కనీస బాధ్యత – సిసలైన సదాచార పాలన!" అంటారు పూజ్యశ్రీ బాబూజీ. తదనుగుణంగానే ఆచార, సాంప్రదాయాల వెనుకనున్న ఆధ్యాత్మిక రహస్యాలను, అర్థపరమార్థాలెన్నెంటినో వెలికి తీసి, 'వెలుగు'లోకి తెచ్చి, ఆ వెలుగులో సాయి సత్సాంప్రదాయాన్ని ఆవరించిన అంధకారాన్ని శ్రీబాబూజీ రూపుమాపారు.

"జైసాదేశ్ – వైసావేష్" అన్నారు శ్రీసాయిబాబా. "ఏ కాలానికి అనుగుణమైన ధర్మాన్ని, ఆ కాలంలో పాటించడం వివేకం. కాలధర్మం చెందిన ఆచారాలను పట్టుకుని వ్రేలాడడం అవివేకం" అంటారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ సంప్రదాయాలకు, ఆచారాలకు వ్యతిరేకి కాదు. సంప్రదాయం ముసుగులో ఆచరించే కాలం చెల్లిన మూఢాచారాలను శ్రీసాయి సత్సాంప్రదాయంలో చొప్పించి, శ్రీసాయి ఆమోదించని మూఢాచారాలను సాయి పేరున ఆచరించడాన్ని

శ్రీబాబూజీ నిరసిస్తారు. *"మనం మన సంప్రదాయాలను గౌరవిద్దాం! అయితే వాటిలో శ్రీసాయిచే ఆమోదయోగ్యమైన వాటిని ఆచరిద్దాం"* అంటారు శ్రీబాబూజీ.

సాయి ప్రీతి కోసమని ఉపవాసముండడాన్ని ప్రస్తావిస్తూ, *"బాబా నిరసించిన వ్యర్థ ఆచారాల్లో ఉపవాసం ఒకటి. ఉపవాసమంటే మనస్సును, వ్యర్థమయిన విషయాలతో నింపక, ఖాళీగా ఉంచుకొని, అందులో మన ఉపాసనా దైవాన్ని ప్రతిష్ఠించుకొని, ఆయనకు అంతరంగంలో దగ్గరవడం అన్నమాట. ఉపవాసం అనే పదానికి అర్థం: 'ఉప' అంటే దగ్గరగా లేదా సమీపంలో, 'వాసం' అంటే ఉండడం. ఇష్టదైవానికి దగ్గరగా ఉండడం. కాని ఆ అసలైన అర్థం పోయి, ఉపవాసమంటే నిరాహారంగా ఉండడంగా మారింది"* అని వివరించారు.

జాగరణ ప్రధానుద్దేశ్యాన్ని మరచి, రాత్రిళ్ళు 'ఎలాగైనా' మేలుకొని సినిమాలు చూడడంగా మారిన వైనాన్ని నిరసిస్తూ, శ్రీబాబూజీ *"నిద్రను – తద్వారా మనస్సును నియమించే ప్రయత్నంలో జాగరూకులమై (అంటే జాగ్రత కలిగి) ఉండడమే జాగరణ అంటే. యోగసంప్రదాయంలో నిద్రను నియమించే సాధనలకు, కాలాంతరంలో కలిగిన వికృత రూపమే మనమీనాడు చూస్తున్న, చేస్తున్న జాగరణలు"* అని వివరించి, ఆచారాల అంతరార్థం విస్మరించి నిద్రలో జోగుతున్న సమాజాన్ని మేల్కొలిపారు. ఇలా ఎన్నో విషయాలను వివరించి, ఆధ్యాత్మిక పదాల వాడుకలో మనకుండే 'భావ దారిద్ర్యాన్ని' పోగొట్టి, దృక్పథాన్ని సంస్కరించి, భావ సుసంపన్నం చేశారు.

## గ్రహమా! అనుగ్రహమా!!

జాతకాలు, వాస్తు, ప్రశ్నలు, గ్రహశాంతులు తదితర మూఢవిశ్వాసాలు అనాదిగా ప్రజల భావాలపై తీవ్రంగా దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. ఎంతగానంటే తాము ఆశ్రయించిన దైవాన్ని (సద్గురువును) మరపులోనికి నెట్టి, ఆ విశ్వాసాలకే అనివార్య ప్రాముఖ్యతను ఇచ్చేంతగా! ఈ తరుణంలో భక్తుల్లో మానసికంగా పాతుకు పోయిన ఆ విశ్వాసాలను కూకటివ్రేళ్ళతో పెకలించేందుకు శ్రీబాబూజీ బృహద్యజ్ఞం కావించారు. సాయి దివ్యలీలా ప్రబోధాలను సోదాహరణగా వివరిస్తూ, అనుభవాలను క్రోడీకరిస్తూ, భక్తుల్లో మూఢవిశ్వాసాల పట్ల ఉన్న భయాందోళనలను తొలగించారు.

"ద్వారకామాయి బిడ్డలను గ్రహాలేం చెయ్యగలవు?" అని తన బిడ్డలైన భక్తుల మీద తన అనుగ్రహం తప్ప, ఏ గ్రహాల ప్రభావం ఉండదని అభయాన్నిచ్చి

"జన్మకుండలిని చుట్టచుట్టి అవతల పారెయ్! జాతకాలు చూడొద్దు! సాముద్రికాన్ని నమ్మొద్దు!" అన్న శ్రీసాయి అభయాన్ని శ్రీబాబూజీ గుర్తు చేశారు. "సాయి మాటలను విశ్వసించక, సాయి భక్తులే జ్యోతిష్కుల చుట్టూ, వాస్తు సిద్ధాంతుల చుట్టూ తిరగడం, కొందరు ప్రముఖ సాయిభక్తులే జాతకాలను ప్రోత్సహిస్తూ జోస్యాలు చెప్పడం, ఎందరో జోస్యాలరాయుళ్ళు, 'ప్రశ్నల' పరమహంసలకు శ్రీసాయి 'కులదైవం' కావడం – శోచనీయం! సద్గురు చరణాలను ఆశ్రయించి, వారిని శ్రేయోభిక్ష పెట్టమని అర్థించిన చేతులను హస్తసాముద్రికుల ముందు దేబిరిస్తూ చాచడం – మనం ఆశ్రయించిన సద్గురువునే అవమానించి, కించపరచడం కాదా?" అని మనలోని వికృతభావాల్ని శ్రీబాబూజీ ప్రశ్నించారు. "తమకేది మంచిదో అది సద్గురువు తప్పక చేస్తారనే విశ్వాసం సాధనాపథంలో ప్రథమ సోపానం. సద్గురువు మన భూత భవిష్యద్వర్తమానాలు తెలిసిన త్రికాలజ్ఞులు. మన శ్రేయస్సు కోసం అవసరమైతే 'విధి'నే మార్చగల సమర్థులు" అని సద్గురు సమర్థతను శ్రీబాబూజీ తెలియపరిచారు.

## మతం – అభిమతం

"మనిషి దైవంగ పెరగడం బాబా మతం" అని శ్రీసాయి అభిమతాన్ని ఎలుగెత్తి చాటారు– పూజ్యశ్రీ బాబూజీ. మానవునిలోని పశుసంస్కారాలను సంస్కరించి, మానవత్వాన్ని మేలుకొలిపి, క్రమంగా దైవస్వరూపునిగా రూపొందించడమే మతం యొక్క ముఖ్య ప్రయోజనమని, మత మూలధర్మాన్ని శ్రీబాబూజీ ఎఱుకపరచారు.

"మనిషిని మనిషిగా చూడనీయలేని కులమతాలెందుకు? సాయికి లేని కులం, మతం సాయిభక్తులకు మాత్రం ఎందుకు?" అని శ్రీబాబూజీ మనలోని కుల, మత భేదభావాలను ప్రశ్నించారు. కులమతాల ఆధారంగా విడిపోవడాన్నే కాదు, కలవడాన్ని కూడా నిరసించారు. దేనికి కూడా కులం, మతం ప్రాతిపదిక కాకూడదు అన్నారు. "మత రహిత సమాజంకాదు. మతాతీత సమాజం రావాలి" అని పిలుపు నిచ్చారు. "కులాల కుళ్ళు, మతాల మళ్ళు – మానవతకే ముళ్ళు, ముక్తికి సంకెళ్ళు" అని కుల, మత భావాలతో బందీయైన మనస్సులను బంధవిముక్తి చేశారు.

శ్రీబాబూజీ చూపిన 'సాయిపథం'లో మతచిహ్నాలు ప్రదర్శించడం కాని, ప్రత్యేకించి ఒక మతభావనలను ప్రతిబింబిస్తున్నట్లుగాని ఉండదు. శ్రీబాబూజీని అనుసరించి ఉన్న భక్తుల్లో భిన్న మతాలు, కులాలు, విభిన్న సంస్కృతుల వారెందరో

ఉన్నారు. వారందరూ తారతమ్యాలు మరచి, ఆనంద జీవనయానం సాగించడం ఆ మహితాత్ముని దివ్యసన్నిధి ప్రభావాన్ని సూచిస్తుంది.

"సాయిబాబా అవతారకార్యంలో ప్రధాన అంశమైన సర్వమత సమరస భావాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించలేనిదే మనం ఎన్నటికీ సాయిభక్తులం కాలేము. సాయి భక్తులందరూ తమ కులం సాయి కులమని, తమ మతం సాయి మతమని సగర్వంగా చెప్పుకొనగలగాలి" అని శ్రీబాబూజీ తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆ మహనీయుని ఆకాంక్షకు అనుగుణంగా, నేడెందరో భక్తులు కుల, మత, భాష, సంస్కృతి విభేదాలను మరచి, ఆ హద్దులను చెరపి గురుబంధువులయ్యారు. అన్ని మతాలు, కులాలు, సంస్కృతుల సంగమమై శ్రీసాయి 'వసుధైక' కుటుంబాన్ని 'సాయిపథం' తలపింపజేస్తుంది. ఏ ప్రవచనాలతో, ప్రబోధాలతో సాధ్యం కానిది సాయిబంధంతో, సద్గురు పదసన్నిధిలో సాధ్యం కావడం ఆ మహితాత్ముని దివ్యసన్నిధి లీలా విశేషమే!

## మహాసమాధి

శ్రీసాయి ఏ ఆదర్శాలను నెలకొల్పి తమ జీవితపర్యంతం ఆచరించి చూపారో, ఆ ఆదర్శాలకు, తద్వారా ఆవిష్కరించిన సాయిధర్మసంస్థాపనకై శ్రీబాబూజీ తమ జీవితాన్ని అంకితమిచ్చారు. సాయిని ఆరాధించి, ప్రేమించి, సాయిపైనే ఆధారపడి జీవించి, తమ ప్రతి స్పందనను సాయిలో లయించి, సాయితో ఇక ఎడబాటు భరించలేకేమో - 13 నవంబర్ 2010, శనివారం మధ్యాహ్నం 1.51 నిమిషాలకు పూజ్యశ్రీసాయినాథుని శరత్‌బాబూజీ మహాసమాధి చెందారు. ఎన్నో మధుర స్మృతులను, అనుభవాలను భక్తులకు ప్రసాదించి, సాయిలో ఐక్యమయ్యారు. ఆ రోజు మాస్టర్ ఎక్కిరాల భరద్వాజగారి జన్మదినం (తిథుల ప్రకారం). అంతేగాకుండా ఆ రోజు 'కోటిసోమవార' పర్వదినం. శ్రీబాబూజీ పవిత్ర దేహాన్ని శిరిడీలో సమాధి చేసిన రోజు నవంబర్ 17, బుధవారం, కార్తీకమాసం ఏకాదశి పర్వదినం, అదే రోజు ముస్లింలకు పవిత్రమైన బక్రీద్ కావడం విశేషం.

మహాసమాధికి చాలా రోజుల ముందు నుండే శ్రీబాబూజీ తమ దేహ పరిసమాప్తి గురించి సూచనాప్రాయంగా చెబుతున్నప్పటికీ, అది ఆ కోణంలో ఎవరికీ అర్థం కాలేదు. జనవరి 1, 2010 అనంతరం శ్రీబాబూజీ దర్శనాలు, వారి సమక్షంలో

వివాహాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు ఉండవని అది శ్రీబాబూజీ అభీష్టమని తెలిసి, వారు ఏకాంతంలో ఉండాలనుకొంటున్నారనే అందరూ భావించారు. భక్తులు శ్రీబాబూజీని తమకు వారి దర్శనం ఎప్పటిలాగే కావాలని, తమను వదిలివెళ్ళవద్దని ప్రాథేయపడ్డప్పుడు, "నేను మిమ్మల్ని ఎక్కడ వదులుతున్నాను. బాబా చేతుల్లోనే కదా!" అన్నారు శ్రీబాబూజీ.

మహాసమాధికి ముందు, అక్టోబర్ మాసంలో – వరుసగా మొదట తమకు పసిప్రాయంలో జటాఝూటధారియైన మహాత్ముని దివ్యదర్శనమైన తిరుమల క్షేత్రంలో, అనంతరం తమ సాధన ఫలప్రదమైన పూండీస్వామి దివ్య సన్నిధిలో, చివరలో సమర్థ సద్గురుక్షేత్రం శిరిడీలో గడిపారు. అక్టోబర్ 27, 2010న శ్రీసాయి సమాధిని దర్శించుకొని, బాబా సమాధిమందిరంలో సాయిబాబా విగ్రహం ప్రక్కన గదిలో కొంత సమయం కూర్చొన్నారు. అప్పటినుండి శ్రీబాబూజీ ధ్యానస్థితిలోనో లేక భిన్నమైన మనఃస్థితిలో ఉన్నట్లుగానో– దగ్గరగా గమనించిన వారికి అనిపించింది. మహాసమాధికి కొద్దిరోజుల ముందే తమ అంతిమ విశ్రాంతి ప్రదేశాన్ని గురించి శ్రీబాబూజీ ప్రస్తావించారు. సాయిపథం ఆవరణలో సత్సంగ హాలు ప్రక్కన శ్రీబాబూజీ తమ సమాధిస్థానాన్ని సూచించిన ప్రదేశంలోనే– అప్పట్లో మొట్టమొదట శ్రీసాయిబాబా చిత్రపటాన్ని ఉంచి, 'సాయిపథం' నిర్మాణానికి పునాదిరాయిని వేశారు. 1995లో శ్రీబాబూజీ అభీష్టానుసారం వారి సతీమణి శ్రీమతి అనసూయమ్మగారు(అమ్మగారు) రోజుకి రెండుసార్లు దీపారాధన చేయడం సరిగ్గా ఆ ప్రదేశంలోనే ఆరంభించారు. 2007లో విజయదశమి పర్వదినాన సత్సంగ హాలులో శ్రీబాబూజీ అఖండజ్యోతి ప్రజ్వలన చేసేంతవరకు నిరంతరంగా పన్నెండు సంవత్సరాలు అదే ప్రదేశంలో దీపారాధన జరిగింది. అదే స్థలాన్ని శ్రీబాబూజీ తమ అంతిమ విశ్రాంతి ప్రదేశంగా సూచించడం ఆ మహితాత్ముని త్రికాలజ్ఞతకు నిదర్శనంగా భక్తులు భావించారు. మహాసమాధికి ముందు, ఆ తర్వాత– అనేక మంది భక్తులకు దివ్య స్వప్నాలు వచ్చి శ్రీబాబూజీ దివ్య దర్శనం కలిగింది.

డిసెంబర్ 31, 2010 నుండి మూడు రోజులపాటు 'శ్రీబాబూజీ సన్నిధానం'లో 'శ్రీబాబూజీ ఆరాధనోత్సవాలు' జరిగాయి. శ్రీబాబూజీ మహాసమాధి సమయంలో, అనంతరం భక్తులకు ప్రసాదించిన అనుభవ సంకలనం – 'స్మృతి సుమాలు' గురుపూర్ణిమ, 2011 సందర్భంగా ప్రచురితమైంది.

మహాత్ములు దేహాతీతులు. వారు దేహాన్ని త్యజించిన అనంతరం వారి మహిమ ఇంకా విస్తృతంగా ప్రకటమవుతుంది. ఎందుకంటే దేహానికి పరిమితులుంటాయి. ఆ పరిమితులు దాటితే వారు అపరిమితులు. అనంతులు. వారు చూపిన సన్మార్గంలో పయనించే ప్రతి ఒక్కరికి వారి దివ్యసన్నిధి అనుభవమవుతూనే ఉంటుంది. రమణీయమైన శోభతో అలరారుతున్న శ్రీబాబూజీ మహాసమాధిని దర్శించుకొంటున్న భక్తులు పొందిన అనుభవాలే అందుకు నిదర్శనం.

పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికీ మనతోనే ఉన్నారు, ఉంటున్నారన్నది భక్తుల అనుభవం.



అపూర్వమా సాన్నిధ్యం

# అనితరసాధ్యుని సాన్నిధ్యం

బావన కొండయ్య
గవర్నమెంట్ ఉద్యోగి, నెల్లూరు
జన్మించిన సం॥ 1947

శిరిడీ, నవంబర్ 2002

1974వ సంవత్సరంలో మేము నెల్లూరులో బాలాజీ నగర్‌లోని ఒక ఇంట్లో అద్దెకు చేరాము. ఆ ఇంటిలోని ఒక వాటాలో మేముండేవాళ్ళం. రెండవ వాటాలో ఇల్లుగలవారైన వి.టి.రావు గారి కుటుంబం ఉండేది. మా రెండు కుటుంబాలు కొద్ది రోజుల్లోనే సన్నిహితమయ్యాయి. తీరిక సమయాల్లో మా మధ్య జరిగే కబుర్లలో వి.టి.రావుగారి భార్య శ్రీమతి సుచిత్ర తన అన్నగారైన శరత్‌బాబు గురించి ఎంతో ఉత్సాహంగా చెబుతుండేది. డిగ్రీ చదివే రోజుల్లోనే కాలేజీ విద్యార్థులకు ఇంగ్లీషు ట్యూషన్ చెప్పేవారని, వాళ్ళ కాలేజీలోని ఒక లెక్చరర్‌కు ఎమ్.ఎ. ఇంప్రూవ్‌మెంట్ ఎగ్జామ్ కొరకు నోట్స్ తయారుచేసుకోవడంలో సహాయం చేసేవారని, సబ్జక్టుకు సంబంధించి ఆ లెక్చరర్ తన అన్నయ్యతో చర్చించేవాడనీ గొప్పగా చెబుతుంటే విని నాకు ఆశ్చర్యమేసేది.

ఒకసారి వాళ్ళింటికి వచ్చిన ఒక యువకుణ్ణి చూశాను. అతనే శరత్‌బాబు అని తెలిసింది. సుచిత్ర మాటల ద్వారా మేమూహించుకొన్న వ్యక్తికి, ఈ ఇరవై ఏళ్ళ కుర్రాడికి అసలు పొంతనే లేదు. సన్నగా, ఒక మోస్తరు ఎత్తులో చూపులకు అతి సామాన్యంగా ఉన్న ఈ అబ్బాయే ఆమె చెప్పే ఆ అపురూపమైన వ్యక్తి అంటే నమ్మలేకపోయాను. ఏదో అన్నగారి మీదుండే అభిమానంతో ఈ అమ్మాయి గొప్పలు చెబుతుందేమో అనిపించింది. అందుకే అప్పట్లో వారిపై నేనంతగా ఆసక్తి చూపలేదు.

1976లో నాకు వెంకటగిరిలోని ప్రభుత్వ ఐ.టి.ఐ. కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా వెంకటగిరికి వెళ్ళిపోయాను. అక్కడికి వెళ్ళిన రెండు నెలల తర్వాత ఒక రోజు బజారులో గురువుగారి తండ్రిగారైన సురేంద్రబాబుగారు కనిపించి, తనకూ ఈ మధ్యనే కోట నుండి వెంకటగిరి జడ్.పి. హైస్కూల్‌కు ట్రాన్స్‌ఫర్ అయిందని, ఇక్కడే నివాసముంటున్నానని చెప్తూ, వీలైనప్పుడు ఇంటికి రమ్మని పిలిచారు. తెలిసినవారు, పెద్దాయన పిలిచారు కదా అని ఒకరోజు వారింటికి వెళ్ళాను. అక్కడ శరత్‌బాబును మళ్ళీ కలవడం జరిగింది. క్రమంగా

మా పరిచయం మంచి స్నేహంగా మారింది. తర్వాత బాబు నా కోసం మా ఇంటికి రావడం, ఇద్దరం కలిసి మాట్లాడుకుంటూ బజారుకు వెళ్ళడం అలవాటైంది. రోజులు గడిచే కొద్దీ కుర్రవానిలా కనిపించే అతనిలో ఒక మహావ్యక్తి నాకు గోచరించసాగాడు. వారి మేధస్సు, విషయ పరిజ్ఞానము, వయసుకు మించిన పరిణతి, వారి మహోన్నత వ్యక్తిత్వం నాలో వారి పట్ల గౌరవాన్ని, అభిమానాన్ని పెంచాయి. ముఖ్యంగా బాబు మాటల్లో వెల్లివిరిసే హాస్యచతురత, కలుపుగోలుతనం వలన వారి సమక్షంలో గంటలు క్షణాల్లా దొర్లిపోయేవి. అట్లా బాబు సాహచర్యం నాకు చాలా ఇష్టంగా మారింది.

ఒకరోజు మాటల మధ్యలో నన్ను వేధిస్తున్న సమస్య గురించి బాబుతో చెపితే వారు నన్ను సాయిబాబాను ప్రార్థించమని, బాబా తప్పక సహాయం చేస్తారని చెప్పారు. నేను "మా ఇలవేల్పు వేరే ఉన్నారు" అన్నాను. "మీ ఇష్టం" అన్నారు బాబు.

ఒక గురువారంనాడు వారు నాకొక బాబా ఫోటో ఇచ్చి "ఫ్రేము కట్టించుకో" అన్నారు. బాబా అంటే అప్పటివరకు అంత ఆసక్తి చూపని నేను, ఏ దివ్య శక్తి అలా ప్రేరేపించిందో తెలియదుగాని, ఆ రోజే ఫోటోకు ఫ్రేము కట్టించి పూజలో పెట్టాను. అప్పటి నుండి ఆ పటాన్ని ప్రతిరోజూ పూజించుకొంటున్నాము. ఆ ఫోటో మా ఇంటికి వచ్చిన తర్వాత నాలో మార్పు వచ్చింది. బాబా పటం వంక చూచినప్పుడల్లా మనస్సుకు ఎంతో ప్రశాంతత కలిగేది.

***గురువుగారు:*** *భగవంతుడు ఇక్కడ ఉన్నవాళ్ళలో చాలామందికి అన్నీ ఇచ్చాడు. తిండికి లేకుండా ఉండేవాళ్ళు ఎవరూ లేరు ఇక్కడ. కానీ అన్నీ ఉన్నప్పటికీ ఇంకా ఏదో పొందాలనే తపన, ఏదో తెలియని వెలితి. మనకు ఏదో కావాలి. అదేమిటో మనకు తెలియదు. అది పొందితే మనకు తృప్తి వస్తుందేమో, ఇది పొందితే మనకు తృప్తి వస్తుందేమో అని అనుకుని ట్రయల్ అండ్ ఎర్రర్ మెథడ్స్ మీద పోతున్నాము. నాకు ఇప్పుడు ఇంత అసంతృప్తి ఎందుకు ఉందంటే, నాకు ప్రమోషన్ కావాలి అని ఈయన అనుకుంటాడు. ఇదిగో నాకు ఫలానా సాఫ్ట్‌వేర్ కాంట్రాక్ట్ రావాలి అని మీరు అనుకుంటారు. ఇదిగో ఇంకొక కాంట్రాక్ట్ వస్తే నాకు ఇంకా బాగుంటుంది అని ఆయన అనుకుంటాడు. ఇట్లా ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా అనుకొంటారు. ఆ కోరిక తీరుతుంది, కాని*

వెలితి మాత్రం అలాగే మిగిలి ఉంటుంది. మరలా ఇంకోటి. దాన్నీ తీర్చుకోవడానికి ప్రయత్నిస్తాం. ఇలా జీవితం అంతా గడిపేస్తాం. ప్రతి ఒక్కరిలో కూడాను ఏదో తెలియనటువంటి అసంతృప్తి ఉంది. ఏదో పొందాలి, ఏది పొందాలో తెలిసీ తెలియనట్లు ఉంటుంది. అస్పష్టంగా ఉంటుంది. దానికి స్పష్టత లేదు. కాబట్టి ఏది పొందాలి అని మనస్సు ఆలోచించినప్పుడు ఏమవుతుంది? ఇంతవరకు మనము (ఇంద్రియాల ద్వారా) పొందినటువంటి అనుభవాలను ఆధారం చేసుకుని, ఆ అనుభవాల దృష్ట్యా ఉండేటువంటి గోల్‌నే పెట్టుకుంటాము.

శిరిడీకి పోయి బాబా దగ్గర కూర్చున్నపుడు పై కారణాలు ఏవీ కాకుండా, ప్రాపంచికంగా ఇంతవరకు మనము అలవాటుపడినటువంటి ఏ మీన్స్ ద్వారా కాకుండా, తెలియనటువంటి ఒక భద్రతాభావం, ఒక శాంతి, ఒక ఆనందం మన మనస్సులో కలుగుతాయి. ఇంతవరకు అటువంటి అనుభూతి మనము ఎప్పుడూ పొంది ఉండము. మనకు ఒక కోరిక ఉండి, అది తీరితే అంటే దురద పుడితే గీరుకుంటే వచ్చేటువంటి ఆనందంలాంటిదే మనకు ఇంతవరకు అలవాటు. దురద పుట్టకుండా, మనం గీరుకోకుండా ఆనందం రావడమనేది మనకు అనుభవంలో లేనిది. అది ఒక్క సద్గురువు సన్నిధిలోనే అనుభవం అవుతుంది. అబ్బా ఇక్కడ ఏదో ఉన్నట్లుంది, ఇదే మనము కావాలనుకున్నటువంటిది అనే భావన మొదలవుతుంది. అప్పటిదాకా మనకున్న అస్పష్టమైన భావన ఏదో బాబాతో లింక్ అవుతుంటుంది. కానీ అప్పుడు కూడా అది స్పష్టమవదు. అది బాబా పట్ల మనకు నిజంగా ఉండేటువంటి ఎట్రాక్షన్.

కాబట్టి ఏమి చేస్తాం? ఇమ్మీడియేట్‌గా బాబాను కూడా 'ఓహో ఈ కోరికలు అన్నీ తీరే దాని కోసంగా ఆయన ఏమైనా ఉపయోగపడతాడేమో!' అని ముందు గట్టిగా ప్రయత్నం చేస్తుంది మన మనస్సు. కోరికలు ఇంకా ఉన్నాయి కనుక బాబా ఏమి చేస్తున్నారంటే, వాటిని కూడా ఫుల్‌ఫిల్ చేయడానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అలా తీరుస్తూనే, వీటి ద్వారానే కాక వీటికంటే అతీతమైనది, వీటి వేటికీ సంబంధం లేకుండా నిజంగా వచ్చేటువంటి సెక్యూరిటీ ఒకటి ఉన్నది అని చూపిస్తున్నారు. అలా పోను పోనూ దీని యొక్క స్పష్టత పెరుగుతూ పోయి, పూర్తి స్పష్టత వస్తుంది. అంటే మనలో అస్పష్టంగా ఉండేటువంటి బాబా యొక్క స్ఫురణ పూర్తిగా

*ప్రకటమై స్పష్టరూపం ధరించడం. అదే బాబా సాక్షాత్కారం. దానిని మీరు ముక్తి, మోక్షము అనండి, నిర్వాణం అనండి.*

ఆ రోజుల్లోనే బాబుగారు వారి గురువుగారైన శ్రీభరద్వాజ మాస్టరుగారిని నాకు పరిచయం చేశారు. మాస్టరుగారు విద్యానగర్ కాలేజీలో ఇంగ్లీష్ హెచ్.ఓ.డి.గా ఉద్యోగం చేసేవారు. చక్కని ముఖవర్చస్సుతో, సదా చిరునవ్వుతో ఉండే ఆయన, ప్రముఖ సాయిభక్తునిగా ఎంతోమందికి తెలుసు.

మాస్టరుగారికి ఎందరో శిష్యులున్నా వారికి శరత్‌బాబు అంటే ప్రత్యేకమైన అభిమానం, వాత్సల్యం ఉండేవి. అందువల్ల తరచూ బాబును కలుసుకొనేందుకై వెంకటగిరి వచ్చేవారు. వారు వచ్చినప్పుడల్లా రోజంతా సత్సంగాలు జరిగేవి. నేను ఆ సత్సంగాలన్నింటికీ తప్పకుండా హాజరయ్యేవాడిని. మాస్టరుగారు ఎప్పుడు వెంకటగిరి వస్తున్నా, వారికి స్వాగతం పలకడానికి బాబు ఎంతో ఘనంగా ఏర్పాట్లు చేసేవారు. ఆ ఏర్పాట్లలో మమ్ములను కూడా పాలుపంచుకోమని కోరేవారు. నేను ఒకసారి బాబుగారిని "మాస్టరుగారు ఇక్కడకు తరచూ వస్తూనే ఉన్నారు కదా! వారు వచ్చిన ప్రతిసారి ఇంత ఆర్భాటంగా వేడుకగా ఏర్పాట్లు చేయాలా?" అని అడిగాను.

దానికి వారెంతో ఉద్వేగంగా *"కొండయ్యా, మాస్టరుగారు ప్రతి వారం కాదు ప్రతి రోజూ వచ్చినా సరే, నేను ఆయనకు ఇలాగే స్వాగతం పలుకుతాను!"* అన్న మాటలు నేనెప్పటికీ మరచిపోలేను.

అప్పుడు వారి సమాధానం కాస్త వింతగా తోచినా, క్రమంగా అది మాస్టరుగారి పట్ల వారికి గల పూజ్యభావానికి, అవ్యాజ ప్రేమానురాగానికి ప్రతీకగా గుర్తించాను. వారు మాస్టరుగారికి సంబంధించిన ఏ కార్యక్రమమైనా నిస్సారంగా, యాంత్రికమైన ఒక తంతులా కావడానికి అంగీకరించేవారు కాదు. వారికి మాస్టరుగారు వచ్చిన ప్రతిసారి నిత్యనూతనంగానూ, అత్యంత ఉత్తేజభరితంగానూ ఉన్నట్లు గ్రహించాను.

1977లో గురువుగారు వెంకటగిరిలో ఒక ఇంగ్లీష్ మీడియమ్ స్కూలును స్థాపించారు. అప్పటివరకు బాబు వేరే ఎక్కడికన్నా ఉద్యోగం పేరిట వెళ్ళిపోతారేమో అనుకొనే నాకు, వారు వెంకటగిరిలోనే స్కూలు ప్రారంభించడంతో, ఇకపై వారి సాహచర్యం ఎప్పటికీ లభిస్తుంది కదా అని ఎంతో సంతోషం కలిగింది. బాబుగారిని

వెంకటగిరిలో సత్సంగం చేయమని మాస్టరుగారు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం ఐదు గంటలకు సత్సంగం చేసేవారు. 'నారద భక్తి సూత్రాలు' వంటి గ్రంథాల నుండి ఆధ్యాత్మిక విషయాలెన్నో వివరించేవారు. సాయంత్రం 7 గంటలకు మళ్ళీ సత్సంగం ఉండేది. అందులో సాయిబాబా తత్త్వం, లీలాప్రబోధాల గురించి చెప్పేవారు. నాకు ఆ సత్సంగాల ద్వారా బాబా జీవితచరిత్ర పట్ల చక్కటి అవగాహన కలిగింది.

***భక్తుడు:*** *పూజ అంటే ఏమిటసలు? మనం చేసేటటువంటి పూజలు దేవుడికి చేరుతాయా?*

***గురువుగారు:*** *భగవంతుడికి చేరడం అనే విషయానికొస్తే మనం చేసే పూజే కాదు, మనమేం చేసినా ఆయనకు చేరుతుంది. భగవంతుని యొక్క అనుగ్రహాన్ని మనకు అనుకూలంగా మలచుకోవడమే పూజ యొక్క ఉద్దేశ్యం. సమతలంలో ఉన్న నీరు పల్లానికి ప్రవహిస్తుంది కదా! భగవంతుని అనుగ్రహం మనవైపుకు ప్రవహించడానికి మన మనసు పల్లం చేసుకోవడమే పూజలో జరిగేది. భగవంతునికి చేరుతాయనే భావంతో ఆయన కోసం మనం చేసే ఏ పనైనా ఆయనకు చేరుతుంది.*

***భక్తుడు:*** *సాంప్రదాయంగా చేసే పూజను వదులుకోవాలంటారా? అసలు పద్ధతి ఏంటి?*

***గురువుగారు:*** *ఈ సాంప్రదాయ పూజలు మొదలుపెట్టిన ఉద్దేశ్యం మంచిదే. భగవంతుని కృపను పొందడానికి, అందరి జీవుల్లో ఉన్న చైతన్యాన్ని గుర్తించడానికే వాళ్ళు ఈ టెక్నిక్స్ పెడుతూ వచ్చారు. మన మనస్సుకున్న సాధారణమైన అలవాటు కొద్దీ – ఈ సాంప్రదాయమైన పూజలన్నీ, పోను పోను యాంత్రికమైనాయి. అర్థం తెలియకుండా చేయడానికి అలవాటుపడతాము. కొంతకాలానికి అది ఆచారం క్రింద మారుతుంది. దాని వెనుకనున్న అసలు లక్ష్యం, ఉద్దేశ్యం లుప్తమౌతాయి. కాలక్రమేణా ఆచారం కూడా అనేక మార్పులకు లోనౌతుంది. ఈ క్రమంలో, అసలైన ఆచారం మూలపడిపోతుంది. సరే అసలైన ఆచారం తెలుసుకుని ఆచరిస్తే మంచిదే కదా అని అంటారనుకో! మంచిదే. కాని వచ్చిన సమస్య ఎక్కడంటే కొన్ని వందల సంవత్సరాలుగా కాలానుగుణంగా మారుతూ*

*వస్తున్న ఆచారాల యొక్క– ప్రారంభం లేక వాస్తవ స్వరూపం మనకెలా తెలుస్తుంది? ఏదో శ్రమపడి మనం ఒక నిర్ణయానికి వచ్చినా అది మన సొంత అన్వయం అవుతుంది తప్పితే నిజానికి వాళ్ళు ఎందుకు పెట్టారో మనకు తెలియదు. ఇంత కష్టపడి పాత ఆచారాలను అన్వయం చేసుకొనే బదులు మన మనసుకు సులభంగా ఉండే పద్ధతిలో ప్రార్థన చేస్తే నష్టమేమిటి? ఎందుకంటే ఈ ప్రార్థన, పూజ, ఆచారాల యొక్క లక్ష్యం – అందరిలో ఉన్న చైతన్యాన్ని గుర్తించడమే కదా!*

*విష్ణుసహస్రనామం ఉంది. వెయ్యి నామాల యొక్క భావమేమిటి? అంతటా వ్యాపించి ఉన్నదానిని, నిండి ఉన్నదానిని, ఎలా పొందాలనే కదా? కాని ఈ ఉద్దేశ్యంతో ఎంత మంది విష్ణుసహస్రనామాన్ని చేస్తున్నారు? గడగడ ఎక్కాలు అప్పజెప్పినట్లు చెప్పడం తప్పితే? అంత కష్టపడే బదులు మనకీ రోజు సులభమైన మార్గముంది కదా? బాబా – వారి రూపము, ఆచరణ, వారి జీవితంలోని ప్రతి కదలిక ద్వారా అంతటా ఉన్న చైతన్యం తానేనని గుర్తింపు ఇచ్చారు. సాయి, సాయి అన్నప్పుడల్లా అదే భావం మనసులో నిలబడుతుంది. అయితే యాంత్రికంగా చేస్తే ఇదీ తప్పే. అర్థవంతంగా చేస్తే ఏదైనా సరియైనదే. అన్నింటి ఉద్దేశ్యమూ అదే.*

ఆ రోజుల్లోనే మాస్టరుగారి ఆదేశం మేరకు గురువుగారు, భగవాన్ రమణమహర్షి జీవితచరిత్ర ఆంగ్లంలో రచించారు. వ్రాతప్రతిని టైపు చేసే పనిని గురువుగారు నాకప్పగించారు. పని ప్రారంభించే ముందు పేరాలు ఎక్కడ మొదలుపెట్టాలో, పేజీలో రెండువైపులా మార్జిన్ సమానంగా ఎంత వదలాలో అన్నీ దగ్గరుండి ఓపిగ్గా నాకు వివరించి చెప్పారు. నేను చేసే టైపింగ్‌లో ఎటువంటి తప్పులు లేకుండా ఉండడమే కాకుండా, పేజీ చూడడానికి అందంగా కూడా ఉండాలనేవారు. నేను ప్రతి రోజు రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో కూర్చుంటే నాలుగైదు గంటలు నిర్విరామంగా టైపు చేసేవాడిని. నేను ఒక గదిలో కూర్చుని టైప్ చేస్తుంటే, ప్రక్క గదిలో గురువుగారు, మా మిత్రుడు సాయిప్రసాద్ ఆధ్యాత్మిక చర్చలు మొదలుకొని పలు విషయాలను గూర్చి మాట్లాడుకొంటూ మధ్యమధ్యలో ఛలోక్తులతో బిగ్గరగా నవ్వుకుంటుండేవారు. నాకదంతా అసహనంగానూ, వారిరువురిపై అసూయగానూ ఉండేది. గురువుగారికి

తరచూ స్ట్రాంగ్‌గా కాఫీ త్రాగడం అలవాటు. వారెప్పుడు కాఫీ త్రాగినా, ప్రతిసారీ నాకూ కాఫీ తెచ్చి ఇచ్చి, నేను చేస్తున్న పనిని గమనించేవారు.

యథాలాపంగా చూస్తున్నట్లున్నా, వారి సునిశిత దృష్టికి చిన్న చిన్న తప్పులు కూడా కనిపించేవి. వారిని మోసగించడం అసాధ్యం అని తెలిసినా, ఒక్కోసారి ఆ తప్పులు కనిపించకుండా పేజీలు త్రిప్పేయడమో లేదా వాటిపై చేతులు అడ్డు పెట్టడమో చేసేవాడిని. అయితే అలా తప్పులు దొర్లిన వెంటనే ఆ పేజీని చింపేసి, మళ్ళీ మరో పేజీలో క్రొత్తగా టైపు చేయమనేవారు. పగలంతా నా ఉద్యోగ బాధ్యత నిర్వహించుకొంటూనే రాత్రిళ్ళు టైప్ చేసేవాడిని. అట్లా పగలు, రాత్రి పని చేసినా నాకేమాత్రం అలసట ఉండేది కాదు. అప్పట్లో నాకా శక్తి ఎలా వచ్చిందో నేను ఊహించలేకపోయాను. కానీ నాకు ఇప్పుడు స్పష్టంగా తెలుస్తుంది, నాకంతటి శక్తి, శ్రద్ధ ఇచ్చింది ఖచ్చితంగా గురువుగారేనని! అంతేకాదు, ఒక పనిని అంకిత భావంతో చేయడమంటే ఎలాగో, నాకు వారు దగ్గరుండి మరీ నేర్పించారు. ఒప్పుకొన్న పని సక్రమంగా పూర్తి చేస్తే కలిగే ఆనందమేమిటో అప్పుడే నాకు తెలిసింది.

ఆ రోజుల్లో గురువుగారు స్కూల్ భవనం మిద్దె మీద నివసించేవారు. వారి దగ్గర ఫర్నిచరంటూ పెద్దగా ఏమీ ఉండేది కాదు. ఒక టేబులు, పుస్తకాల షెల్ఫ్, అతిథుల కోసం రెండు కుర్చీలు, పడుకొనేందుకు ఒక చెక్క బెంచీ, కొన్ని చాపలు ఉండేవి. షెల్ఫ్ మొత్తం పుస్తకాలతో నిండిపోయి ఇంకా ఎన్నో పుస్తకాలు దొంతర్లుగా పేర్చబడి ఉండేవి. అంత నిరాడంబరమైన జీవితం వారిది.

ఆ స్కూల్‌కు సమీపంలో పిచ్చిమొక్కలు, ముళ్ళపొదలతో నిండిన ఒక స్థలము, అందులో ఒక పాడుబడిన ఇల్లు ఉండేది. ఆ స్థలము సాయిబాబా మందిరానికి అనువైనదని గురువుగారు భావించారు. అదంతా ఒక ట్రస్టుకు సంబంధించినదని, బాబా మందిరానికివ్వడానికి వారికెటువంటి అభ్యంతరం లేదని తెలిసింది.

గురువుగారి ఆధ్వర్యంలో మేమందరమూ ఆ స్థలాన్ని బాగుచేసి, ఆ ఇంటికి రిపేర్లు చేశాము. త్వరలోనే మందిర నిర్మాణం పూర్తయింది. అందులో సాయిబాబా ఫోటో పెట్టాము. మాస్టరుగారు వచ్చి మందిరానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ విధంగా గురువుగారి ఉత్సాహ ప్రోత్సాహాలతో వెంకటగిరిలో బాబా మందిరం వెలసింది.

గురువుగారి నివాసం మా ఇంటికి దగ్గర్లోనే ఉండేది. నేను ఆఫీసుకు వెళుతూ దారిలో వారింటికి వెళ్ళేవాడిని. ఒక్కోసారి నేను వెళ్ళేసరికి వారు నిద్రపోతూ ఉండేవారు.

వారి పడక గోనెసంచి పరిచిన కొయ్య బల్ల, ఒక దిండు మాత్రమే. నేను వారి నిద్ర డిస్టర్బ్ చేయడం ఎందుకని లేపకుండా వెళ్ళేవాడిని. కానీ వారు గాఢ నిద్రలో ఉన్నా, నాకెందుకో వారు మెలకువతోనే ఉన్నట్లనిపించేది. ఇదే భావాన్ని సాయిప్రసాద్ కూడా వ్యక్తం చేసేవారు. ఏ చిన్న సవ్వడికైనా, ఎవరైనా నిశ్శబ్దంగా అటు ఇటు నడచినా గాఢ నిద్రలో ఉన్న వారి పాదాలు మెల్లగా కదిలేవి. ఆ రోజు సాయంత్రం మళ్ళీ వారి దగ్గరకు వెళ్ళగానే గురువుగారు *"ఉదయం వచ్చి, నిద్ర లేపకుండా వెళ్ళిపోయారేం?"* అని అడిగేవారు. అంత నిద్రలో కూడా మమ్మల్ని గమనించడం ఎలా సాధ్యమని మేము ఆశ్చర్యపోయేవాళ్ళం.

1982లో మాస్టరుగారు, తమ శ్రీమతి చెల్లెలైన అనసూయను వివాహం చేసుకోమని గురువుగారిని ఆదేశించారు. తీవ్ర ఆధ్యాత్మికసాధనలో ఉన్న గురువుగారు వివాహం చేసుకోరని అనుకుంటున్న మాకు వారి అంగీకారం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఒంగోలులో జరిగిన వారి వివాహానికి మా స్నేహబృందమంతా వెళ్ళి ఎంతో సంతోషంగా వివాహ వేడుకలలో పాల్గొన్నాము.

1982వ సంవత్సరంలో, మాస్టరుగారి సూచనపై వెంకటగిరిలో స్కూలు మూసివేసి ఒంగోలు వెళ్ళిపోయారు గురువుగారు. కానీ, తరచూ వెంకటగిరి వచ్చి మమ్మల్నందరినీ కలుస్తూనే ఉండేవారు. గురువుగారు ఎప్పుడు వెంకటగిరి వస్తున్నా, ఆ ముందురోజు నాకు కలలో కనిపించేవారు. నేను వెంటనే సంతోషంగా గురువుగారు వస్తున్నారని సాయిప్రసాద్‌కు చెప్పేవాడిని. గురువుగారు అలాగే మర్నాటికల్లా వచ్చేసేవారు. వారి రాక మా అందరికీ చెప్పలేని ఆనందాన్ని కలిగించేది. మేమంతా మా పనులన్నీ ప్రక్కనబెట్టి వారి వద్దే ఉండేవాళ్ళము. వారు తిరిగి ఒంగోలు వెళ్ళి పోతుంటే అందరికీ ఎంతో దిగులుగా అనిపించేది. మళ్ళీ ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తుండేవాళ్ళం.

1989లో మాస్టరుగారు పరమపదించిన తర్వాత గురువుగారు కుటుంబ సమేతంగా తమ నివాసాన్ని ఒంగోలు నుండి శిరిడీకి మార్చారు. శిరిడీ వెళ్ళిన తర్వాత కూడా వారికి మాపై మునుపటి ప్రేమ, ఆప్యాయతలలో ఏమాత్రం మార్పు రాలేదు. ఒకసారి నేను శిరిడీ వెళ్ళినప్పుడు గురువుగారు ఒక రోజంతా నన్ను తమ దగ్గరకు పిలువలేదు. వారి పిలుపుకై ఎదురుచూస్తున్న నాకు లోలోపల బాధ అసహనంగా మారింది. ఆ బాధతో సత్సంగంలో కూడా పాల్గొనకుండా బయట అరుగుమీదే వేచి

ఉన్నాను. సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో అమ్మగారు బయటకొచ్చి నన్ను చూస్తూ "ఏమిటండీ, గురువుగారిపై కోపంగా ఉన్నారా?" అని అడిగారు.

"అవును. చాలా కోపంగా ఉన్నాను" అని అలిగినట్లుగా సమాధానమివ్వడంతో నవ్వుకొంటూ లోపలకు వెళ్ళిపోయారు.

ఒక గంట తర్వాత ఆమె మళ్ళీ బయటకొచ్చి "గురువుగారు పిలుస్తున్నారు" అని చెప్పారు. నేను లోపలకెళ్ళి గురువుగారికి పాద నమస్కారం చేసుకుని సమీపంలో మౌనంగా కూర్చొన్నాను.

గురువుగారు నా వాలకం చూసి నవ్వుతూ *"ఊఁ. అంతా అయిపోయిందా, ఇంకా ఏమన్నా మిగిలి ఉందా?"* అని అడిగారు.

"అవును మరి. నేను ఉదయమనగా వచ్చాను. ఇంతవరకూ నన్ను లోనికి పిలువకపోతిరి. పన్నెండు గంటలుగా ఎదురుచూస్తున్నాను" అన్నాను ఉక్రోషం నిండిన స్వరంతో.

*"సర్లే. ఇప్పుడు మాట్లాడు"* అంటూ, నాకూ వారితో పాటు భోజనం వడ్డించమని చెప్పారు. ఇద్దరం కలిసి భోంచేశాము. కొంతసేపటి తరువాత నేను మరల నమస్కారం చేసుకుని సెలవు తీసుకుని వచ్చేస్తుండగా గురువుగారు *"రాగానే ఉదయమే నిన్నెందుకు పిలవలేదో అర్థమయ్యిందా? నేను కనుక అప్పుడే పిలిపించి ఉంటే ఆదరాబాదరాగా ఏవో రెండు మాటలు మాట్లాడి వెళ్ళిపోయుండేవాడివి. ఇప్పుడు చూడు"* అని నవ్వుతూ అన్నారు.

ఉదయం నుండి గురువుగారి పిలుపుకై నిరీక్షిస్తూ నేను చేసిందేమిటి? నిజానికి ఆ నిరీక్షణలోని ప్రతిక్షణమూ వారి సన్నిధిని అనుభవిస్తూ గడిపాను. వారి దగ్గర్నుండి పిలుపు ఏ క్షణమైనా రావచ్చని అనుక్షణం అప్రమత్తంగా వేచివున్నాను. అంటే వారి పిలుపు అనే ఎఱుకతో వారి సాన్నిధ్యంలోనే ఉండగలిగాను. వాస్తవానికి వారు తమ సన్నిధి ప్రసాదించి అనుగ్రహించగలరు లేదా ఎదురుచూడడంలోనే తమ ఆలోచనా పరిధిలో ఉంచి అనుగ్రహించగలరు. వారేం చేసినా అనుగ్రహమే.

అప్పటికిగాని వారికి నాపై గల అభిమానం నాకర్థం కాలేదు. మానవమాత్రులం కనుక కొద్దిసేపు మామూలుగా పలుకరించకపోతేనే వేయి అపార్థాలు, లక్ష అనుమానాలతో అలకలు తెచ్చేసుకొంటాం. కానీ, గురువుగారి దివ్య ప్రేమ అందరిపై ఎప్పుడూ ఒకేలా ప్రసరిస్తుంటుందని గ్రహించగలమా? అది అనుభవపూర్వకంగా

ఆ రోజు తెలుసుకున్నాను. అంతటి ప్రేమమూర్తిపై అలిగి, కోపం తెచ్చుకొన్నందుకు నాలో నేనే సిగ్గుపడ్డాను.

మరోసారి, నేను నెల్లూరులో ఉండగా నాకో చక్కని కల వచ్చింది. ఆ కలలో నేను శిరిడీలో సాయిపథంకు వెళ్ళాను. లోపల గదిలో అమ్మగారు, గురువుగారు మాట్లాడుకొంటున్నారు. నేను గుమ్మం దగ్గర చప్పుడు చేశాను. అప్పుడు గురువుగారు *"ఎవరు?"* అని అడిగారు.

'నేను కొండయ్యను' అన్నాను. *"ఎందుకక్కడే ఆగిపోయావు, లోపలకు రా!"* అన్నారు. అంతలో మెలకువ వచ్చేసింది.

ఆ కల వచ్చిన కొంతకాలానికి నేను శిరిడీ వెళ్ళాను. నేను గురువుగారిని చూడడానికి వెళ్ళేసరికి, వారు అప్పుడు అమ్మగారితో మాట్లాడుతూ గదిలో ఉన్నారు. ఆ సన్నివేశం హఠాత్తుగా నా కలను గుర్తుకు తెచ్చింది. అయితే కలలో వలె తలుపు చప్పుడు చేసేందుకు నాకు ధైర్యం చాలలేదు. అక్కడ తచ్చాడుతుండగా లోపల నుండి గురువుగారు అచ్చం కలలోలాగా *"ఎవరు?"* అని అడిగారు.

నేను వెంటనే 'కొండయ్యను' అన్నాను.

*"ఎందుకక్కడే ఆగిపోయావు? లోపలకు రా!"* అని కలలో అన్న మాటలనే అన్నారు. నాకొక్క క్షణం ఆనందంతో పాటు ఆశ్చర్యం కూడా కలిగింది. లోపలకెళ్ళి నమస్కారం చేసుకుని ఆ విషయం, ఈ విషయం మాట్లాడుతూ నాకొచ్చిన కల సంగతి, అచ్చం కలలోలాగా జరగడం గురించి చెప్పాను. గురువుగారది విని చిరునవ్వుతో తల పంకించారు. నాకు మాత్రం ఆ స్వప్నానుభవం ఒక వింత అనుభూతిగా హృదయంలో మిగిలిపోయింది.

***భక్తుడు:*** *జపధ్యానాలు సరిగా కుదరాలంటే ఏమి చేయాలి?*

***గురువుగారు:*** *చాలామంది మనసుకు ప్రధానంగా ఉండే ధర్మమేమిటో తెలియకుండానే, ఈ జపధ్యానాలు చేస్తుంటారు. ఇది సరియైన పద్ధతి కాదు. మనసు యొక్క సహజమైన ధర్మమేమిటంటే, అతిగా ప్రేమించే వ్యక్తి మీదగాని లేదా అతిగా ద్వేషించే వ్యక్తి మీదగాని – అప్రయత్నంగానే లగ్నమవుతుంది. వద్దనుకున్నా దాని మీదికి మనసు వెళుతుంది. ఎవరో రోడ్డు మీద పోతూ ఉంటే ఇన్‌సల్ట్ చేశాడు. మరచిపోతారా? ఇంటికి*

*వచ్చి పూజలో కూర్చున్నా, ఎవరితోనైనా మాట్లాడుతున్నా, ఏమి చేస్తున్నా సరే లోపల తొలిచేస్తుంది. ఎవరినైనా ప్రేమించాము, దానిమీదకే మనసు పోతుంది. ప్రయత్నమే అవసరం లేదు. ఆలోచించకుండా ఉండలేదంతే.*

*నీవు దేనినైతే ధ్యానమూర్తిగా పెట్టుకున్నావో, ఆ మూర్తి పట్ల నీకు ప్రీతి, ప్రేమ లేకపోవడం వల్లనే మనసు ఒక సెకండు కూడా నిలవడం లేదు. మనసులో ప్రేమ ఉంటే కుదిరి తీరుతుంది. దానికి ఏ యోగం అవసరం లేదు. ఏ ప్రాణాయామం, జపం అవసరం లేదు. ఎందుకంటే మనసుకు సహజంగా ఉండే ధర్మమది. మనకు బాబా పట్ల ప్రేమ కలిగితే, అసలు బాబాను మరచిపోవడం ఎట్లా? నువ్వు చెయ్యాలిగనుక వ్యవహారాలన్నీ చేస్తున్నప్పటికీ, బాబా మాత్రం మనసులో నుంచి పోరు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లా ఉంటూనే ఉంటారు. ఈ ప్రీతి పెంచుకోకుండా, మనం ధ్యానమూర్తి పట్ల ఏమాత్రం అవగాహన లేకుండా ధ్యానం, జపం, పూజ చేయడం – ఏదో మ్రొక్కుబడి తంతుగా తయారవుతుంది.*

పూర్వపు రోజులను తలచుకొంటే నాకిప్పుడు ఎంతో విస్మయంగా ఉంటుంది. మా అందరితో అతి మామూలుగా స్నేహంగా ఉంటూనే, తమలోని శక్తిని ఏ మాత్రం బయటపడనివ్వక అతి సామాన్యునిలా మాలో ఒకరుగా కలసిమెలసి తిరిగినవారేనా వీరు అని! వారంతటి మహిమాన్వితులని ఆనాడు తెలుసుకోలేకపోయాము. వారు గొప్ప ఆధ్యాత్మికసాధనలో ఉన్నారని మాత్రమే అనుకొనేవాళ్ళం. అయితే మాలో ఒకరిగానే ఉంటున్నా, వారిలోని విశిష్ట గుణాలు వారి పట్ల మమ్మల్ని ఆకర్షితుల్ని చేసేవి. వారి సాన్నిధ్యానికి మమ్మల్నందరినీ పట్టి తీసుకెళ్ళేవి. వారి వ్యక్తిత్వం, కార్యదక్షత, ఆధ్యాత్మిక గమ్యం పట్ల అచంచల దీక్ష, వారి గురువు శ్రీభరద్వాజగారిపట్ల వారికి ఉన్న ఆరాధనా భావం, బాబా పట్ల గల అనన్యప్రేమ ఎంతో ఉన్నత స్థాయిలో ఉండి మమ్మల్నెంతో ప్రభావితం చేసేవి.

బాహ్యానికి వారు అందరిలాగానే లౌకికమైన ప్రపంచంలో ఉన్నట్లున్నా, ఆంతర్యంలో ఎవ్వరూ అందుకోలేనంత ఎత్తులో తమదైన విలువలతో కూడిన ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపేవారు. వారి సాహచర్యంలో పూర్వం ఎన్నడూ కలగని అనుభవాలు మాకు కలిగినా, అవి వారి ప్రమేయంతో జరిగినవిగా అప్పుడు మేము

గుర్తించలేదు. క్రమంగా వారి పట్ల మా దృక్పథం మారింది. వారెంత ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలను అధిరోహించినా, అది బహిర్గతపరచకూడదన్న సచ్ఛిష్యుని సంప్రదాయానికి అనుగుణంగా అలా గుంభనంగా ఉండిపోయారు. ఇప్పుడు కూడా వారి అనుగ్రహం వేలాది జీవితాలను వెలుగుతో నింపుతున్నా, వారు ప్రసాదించిన అనుభవాలు ఎన్నున్నా, వాటన్నింటిని కూడా గురువుగారు బాబా ప్రేమకు, శక్తికి వినమ్రతతో ఆపాదిస్తారు. "బాబా చూసుకుంటారు", "బాబాను ప్రార్థించు", "బాబా కృపకు కృతజ్ఞుడవై ఉండు" అంటారు.

గురువుగారిని ఆరాధించే ఎంతోమంది బాబాకు, వారికి ఏ భేదం లేదని తమ అనుభవంగా చెబుతున్నా, వారు దానిని నిర్ద్వంద్వంగా ఖండించేవారు. "*నేను కూడా మీలాంటి సాయి భక్తుణ్ణే. సాయిబాబా అనే ఉద్గ్రంథంలో నేను ఒక పేజీని మాత్రమే. బాబాతో ఎవ్వరూ సరితూగరు. ఆయనకు ఆయనే సాటి*" అంటారు.

అనునిత్యం వారి సాంగత్యం లభించే రోజుల్లో మేము దాని విలువను గుర్తించ లేకపోయాము. నేడు తండోపతండాలుగా వారి వద్దకు వస్తున్న భక్తులు అనేకులు, మాకు వారితో గల సాన్నిహిత్యాన్ని తెలుసుకుని ఆశ్చర్యపడుతూ 'మీరు ఎంత అదృష్టవంతులో' అంటారు. గురువుగారికి సన్నిహితులు, బంధువులు, దగ్గరివారు, దూరంవారు, క్రొత్తగా వచ్చినవారు అనేటటువంటి తారతమ్యాలు ఎప్పుడూ లేవు. వారికి అందరూ సమానమే!

తమ దగ్గరకు వచ్చే అందరినీ సమదృష్టితో చూడడం, ప్రియమార పలుకరించి ప్రేమగా వారికేం కావాలో చేయడం గురువుగారి అమృత స్వభావం.

# యంత్రమూ మంత్రముగ్ధమే

పద్మనాభుని శివశంకర్
బిజినెస్ మాన్, హైదరాబాద్
జన్మించిన సం॥ 1952

హైదరాబాద్, జూన్ 1999

నేను గురువుగారి దగ్గరకు వచ్చినప్పటి నుండి వారు ఎక్కడకు ప్రయాణం చేస్తున్నా, వీలయినప్పుడల్లా వారితో కలిసి వెళ్ళేందుకు నాకు అవకాశం లభించింది. వారి ఆశీర్వాదం వలన వారితో కలిసి చేసిన ప్రయాణాలలో ఎన్నో మరపురాని అనుభవాలు పొందాను. ఆ అనుభవాలలో, వారెంత గుంభనంగా దాచుకొన్నా దాగని వారి మహిమను బహిర్గతం చేసేవి కొన్నయితే, కొన్ని ఆ మహిమాన్వితుని శక్తిని మరచి లౌకికమైన ఆందోళనలతో సతమతమయ్యే మన ప్రవర్తనను సరిచేసుకొనేవిగా ఉండేవి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, ఆ ప్రయాణ సమయాలలో అంతటి మహాత్మునితో సన్నిహితంగా గడపగలగడం, వారి అమూల్యమైన మాటలు వినగలగడం ఇవన్నీ నా మనసులో నేను జాగ్రత్తగా భద్రపరుచుకొన్న జ్ఞాపకాల నిధులు.

1999 జనవరిలో, గురువుగారు శిరిడీ నుండి తిరువణ్ణామలైకి బయల్దేరారు. వారితో కలిసి నేనూ ప్రయాణిస్తున్నాను. శిరిడీ నుండి పూనాకు కారులో, అక్కడ నుండి బెంగుళూరుకు ఫ్లయిట్‌లో, తిరువణ్ణామలైకి మళ్ళీ కారులో ప్రయాణం నిర్ణయమైంది. పూనాలో ఫ్లయిట్ మధ్యాహ్నం రెండు గంటలకు. అంటే ఒంటిగంటకల్లా ప్రయాణీకులందరూ ఎయిర్‌పోర్టులో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి శిరిడీలో ఉదయం ఎనిమిదిన్నరకల్లా బయలుదేరితే సరిపోతుంది అనుకొన్నాము.

అయితే, గురువుగారు తొమ్మిదైనా బయలుదేరలేదు. "టైం సరిపోతుందా" అని నేను కంగారుపడుతుండగా, తొమ్మిదిన్నరకు గురువుగారు వెలుపలకు వచ్చారు. ఎక్కడా ఆగకుండా వేగంగా వెళితే టైమ్ సరిపోతుందిలే అనుకున్నాను. ఎప్పుడూ లేనిది ఆ రోజెందుకో దారంతా ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. దారిలో అహ్మద్‌నగర్‌లో ఐదు నిమిషాలు ఆగాము. అక్కడ నుండి నేను పూనా ఎయిర్‌పోర్టుకు ఫోన్ చేద్దామని ప్రయత్నించాను. కానీ ఎంతకీ లైన్లు దొరకలేదు.

ఇంతలో మా డ్రైవరు కారు టైర్ పంక్చరవడం గమనించాడు. ఆ టైరు మార్చడానికి ఇంకో అరగంట పట్టింది. కొద్దిదూరం వెళ్ళామో లేదో మరో టైరు

పంక్చరయింది. నాకిక ఆందోళన ఎక్కువైపోయింది. నేను పడుతున్న ఆదుర్దా చూసి గురువుగారు చాలా శాంతంగా *"టెన్షన్ పడకండి"* అన్నారు.

ఆ పంక్చరు కూడా వేయించుకుని మళ్ళీ బయలుదేరాము. గురువుగారు సీట్‌లో పడుకుని హాయిగా నిద్రపోతున్నారు. నాకయితే పూనాలో ఎవరికైనా ఫోన్ చేసి, ఫ్లయిట్ టికెట్స్ కాన్సిల్ చేయిద్దామనిపించింది. కానీ, గురువుగారు నిద్రపోతూ ఉండడంతో నేను ఆ మాట చెప్పే సాహసం చేయలేదు. దాదాపు ఒకటిన్నరప్పుడు గురువుగారు నిద్రలేచి *"పూనాకు ఇంకా ఎంత దూరంలో ఉన్నాం?"* అని అడిగారు. ఎంత దూరం ఉందో చెప్పాను.

*"ఎయిర్‌పోర్టు చేరడానికి ఎంత సేపు పడుతుంది?"* అని అడిగారు.

"ఈ ట్రాఫిక్‌లో కనీసం 40 నిమిషాలు పడుతుందండి" అన్నాను నేను.

*"ఫ్లయిట్ రెండుగంటలకు అన్నారు కదా. చేరగలమంటారా?"* అని అడిగారు నింపాదిగా.

"అంతా మీ దయసార్" అన్నాను నేను.

సమయం రెండుగంటలు అయిపోయింది. కానీ దరిదాపుల్లో ఎక్కడా ఎయిర్‌పోర్టు కనిపించలేదు. ఎయిర్‌పోర్టుకు సరైన దారిలోనే వెళుతున్నామా అనే అనుమానం కలగడంతో, కారు ఆపి విచారిస్తే, మేము దారి తప్పామని తెలిసింది. మళ్ళీ అందర్నీ దారి అడుగుతూ చివరకు ఎయిర్‌పోర్టు చేరేసరికి సమయం మూడు గంటలయింది. ఇంక లోపలకు వెళ్ళి ఏం లాభం లేదని, కారు దిగడం కూడా అనవసరం అనుకొంటూ గురువుగారు ఏం చెప్తారా అని చూస్తున్నాను.

అయితే గురువుగారు ఏమీ మాట్లాడలేదు. కారు దిగి మామూలుగా ఎయిర్‌పోర్టు ఎంట్రన్స్ వైపు వెళ్తుంటే మేమూ నిశ్శబ్దంగా అనుసరించాము. మేము లోపలకు అడుగు పెడుతుంటే, ఒక ఫ్లయిట్ అప్పుడే వచ్చి లాండ్ అవుతున్నది. నాకు తెలిసినంతలో ఆ టైమ్‌లో అక్కడ ఇంకే ఫ్లయిట్ షెడ్యూల్‌లో లేదు. అందుకని అక్కడున్న ఉద్యోగిని అడిగాను. "అది ఏ ఫ్లయిట్?" అని.

"బెంగుళూరుకి వెళ్ళాల్సిన ఫ్లయిట్, లేటుగా వచ్చింది" అని అతను చెప్పిన సమాధానానికి ఆశ్చర్యపోయాను.

మేము చెకిన్ అయిన తర్వాత అక్కడున్న స్టాఫ్ మమ్మల్ని "ఫ్లయిట్ ఇంత లేట్ అవుతుందని మీకు ముందే తెలుసా? సరిగ్గా ఫ్లయిట్ లాండయ్యేటప్పుడు వచ్చారు!"

అనడిగారు. ఆందోళనంతా పోయి తేలికపడిన మనసుతో ఉన్న మేము చిరునవ్వుతో "మేము మా గురువుగారితో వచ్చాము!" అని చెప్పాము.

---

***భక్తుడు:*** *ఊరక కూర్చోవడమే సాధనా సార్?*

***గురువుగారు:*** *ఊరక కూర్చోవడమంటే – నిశ్శబ్దంగా అట్లా కదలకుండా కూర్చోవడమని కాదు. అది idiomatic usage అన్నమాట. లోపల ఎటువంటి చింతలు లేకుండా, ఎటువంటి ఆందోళన లేకుండా, ఆయనే చేస్తాడు, ఆయనే నడిపిస్తాడు అని నిశ్చింతగా ఉండడం.*

***భక్తుడు:*** *అది అవగాహన ఉంటేనే కదా సార్?*

***గురువుగారు:*** *అవగాహన ఉంటేనే సాధ్యమవుతుంది. అవగాహన పెంచుకోవడమే కావలసింది. అవగాహన పెంచుకుని కొన్ని పనులు చేయడం, కొన్ని చేయకపోవడం ద్వారా వస్తుంది.*

---

1996 వేసవిలో గురువుగారితో పాటు ఉత్తర భారత యాత్రకు వెళ్ళాము. నేపాల్, భైరవ, కపిలవస్తు, కుషినగర్, కబీర్ సమాధి చూసుకుని, చివరగా గోరఖ్‌పూర్ వచ్చాము. అక్కడ నుండి వారణాసి ఎక్స్‌ప్రెస్ సెకండ్ ఏ.సి. టికెట్స్ తీసుకొన్నాము. రాత్రి ఏడుగంటల నలభై అయిదు నిమిషాలకు రైలు బయలుదేరుతుంది. లగేజి ఎక్కువగా ఉండడంతో అవన్నీ తీసుకుని మేము ముందుగా స్టేషన్‌కు వచ్చేశాము. మా అందరివీ కలిపి ఇంచుమించు నలభైకి పైగా సూట్‌కేసులు ఉన్నాయి. అవన్నీ కంపార్ట్‌మెంటులో సర్ది, మేమంతా గురువుగారి రాక కోసం ఎదురు చూస్తున్నాము. రైలు బయలుదేరాల్సిన టైము దాటిపోయినా గురువుగారు వస్తున్న జాడే లేదు. గార్డు దగ్గరకు వెళ్ళి "దయచేసి కొద్దిసేపు రైలు ఆపమ"ని అడిగాము. అతడు కొద్దిసేపు ఆపాడు కానీ గురువుగారు ఇంకా రాలేదు. రైలు మెల్లగా కదిలింది.

మా ఆదుర్దాకైతే అంతే లేదు. గురువుగారు రాలేదు కదా అని రైలు దిగేద్దామా అంటే అప్పటికే లగేజి మొత్తం సీట్ల క్రిందా, పైనా అంతా సర్దేసి ఉన్నాము. అదంతా దించుకోవడమంటే వీలయ్యే పనికాదు. ఏం చేయాలి? మేము ఊపిరాడని కంగారుతో సతమతమవుతుండగా, ప్లాట్‌ఫారమ్‌పై మూడువందల అడుగుల దూరంలో

గురువుగారు నెమ్మదిగా నడచి వస్తూ కనిపించారు. వారిలో ఎటువంటి కంగారూ లేదు. నడకలో వేగమూ పెంచలేదు. రైలు కదిలిపోతుందన్న ఆందోళనే లేదు.

రైలు మెల్లగా వేగం అందుకోబోతోంది. గురువుగారు మాత్రం ప్రశాంతంగా నడచి వస్తున్నారు. వారలా నడిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ రైలు అందుకోలేరు. మధ్యలో మా టెన్షన్ చూడాలి. ఏం చేయాలో తోచక అందరం అలాగే గుడ్లప్పగించి వారి వంకే చూస్తున్నాము. అంతలో ఒక్కసారిగా ట్రాక్ అంతా కరెంటు ఫెయిలయింది. కీచుమన్న శబ్దంతో రైలు ఆగిపోయింది. ఆగడం ఆలస్యం, మేము ఒక్క గెంతులో రైలు దిగి గురువుగారి దగ్గరకు పరుగెత్తాము. వారు అదే చిరునవ్వుతో చిన్నగా నడుస్తూ వచ్చి రైలు ఎక్కారు.

"హమ్మయ్య, బాబా!" అని మేము తేలిగ్గా నిట్టూరుస్తున్నాము, కరెంట్ వచ్చింది. రైలు కదిలింది. ఏమని చెప్పగలమా అనుభవాన్ని? ప్రకృతి యావత్తు యోగీశ్వరుల సేవకై సిద్ధంగా ఉండగా, వారికి విరుద్ధంగా నడిచేందుకు యంత్రాలేపాటివి?

# ఎవరికున్నది అంత శక్తి

పర్నా కిషోర్
కెమిస్ట్రీ లెక్చరర్, ఒంగోలు
జన్మించిన సం॥ 1970

ఒంగోలు, ఏప్రిల్ 2002

శ్రీసాయిని గురించి చిన్నప్పటి నుండే వింటున్నా, ఆయన పట్ల ఇష్టం నాకు సుమారు 14 సంవత్సరాల వయస్సులో మొదలైంది. అప్పటి నుండి దాదాపు ఏడు సంవత్సరాలు సాయిసచ్చరిత్ర పారాయణ, గురువారం ఉపవాసం, నిత్యాభిషేకాలు, సాయి అష్టోత్తర, సహస్రనామావళి పఠనం... ఇత్యాది కార్యక్రమాలు శ్రద్ధగా చేసుకొనే వాడిని. కానీ, ఈ తంతంతా బాబాకు ఇష్టమైన రీతిలో ఉందా? అని తెలుసుకోవాలనే తపన, తెలుసుకొనే ప్రయత్నంలాంటి వాటి గురించి నేనెన్నడూ ఆలోచించలేదు.

1991లో ఒకరోజు, మా ఇంటి ప్రక్కన ఉంటున్న హోమియోపతి వైద్యులు డా॥ శ్రీనివాసులురెడ్డిగారు, గురువుగారి గురించి ఎంతో గొప్పగా చెప్పడం వల్ల వారిని చూడాలనే కుతూహలం కలిగింది. గురువుగారు శిరిడీ నుండి ఒంగోలు వచ్చారని చెప్పి, నన్ను కూడా దర్శనానికి రమ్మని పిలిచి, గురువుగారి వద్దకు తీసుకెళ్ళారు. వెళ్ళకముందు నా మనసులో 'బాబా ఉండగా ఇంక వేరే గురువులెందుకు?' అనే సంకోచముంది. కానీ గురువుగారిని దర్శించుకొన్నాక, ముఖ్యంగా అద్భుతమైన వారి చిరునవ్వులో దాగివున్న ఆప్యాయతను చూశాక వారిపట్ల ఏదో తెలియని ఆకర్షణ ఏర్పడింది. తెల్లని కోరాగుడ్డలు ధరించి, నిరాడంబరంగా ఒక చిన్నచాప మీద కూర్చొని సాయి రచనావ్యాసంగం చేస్తున్న వారిని చూస్తే ఏదో తెలియని గౌరవభావం కలిగింది. అప్పుడు నేను బి.ఎస్సి. పాసై, ఎమ్.ఎస్సి.లో చేరాలని ప్రయత్నిస్తున్నాను. ఆ కోరికనే వారికి విన్నవించగా, చిరునవ్వుతో "బాబా ఉన్నారు" అన్నారు.

ఆ తరువాత మూడు, నాలుగు నెలలలోనే నా ప్రయత్నాలు ఆసక్తికరమైన మలుపులు తిరుగుతూ కోపర్‌గాంలో ఎమ్.ఎస్సి.లో చేరడం జరిగింది. ఆ రెండు సంవత్సరాలు శిరిడీలో గురువుగారి వద్దనే ఉండి, రోజూ కోపర్‌గాంకు వెళ్ళి వస్తుండే వాడిని. గురువుగారి నిరాడంబరమైన జీవనవిధానాన్ని, తన వద్దకు వచ్చినవారి పట్ల వారు చూపించే ప్రేమను, వారి మహిమను చాలా సన్నిహితంగా చూసే అపూర్వమైన అవకాశం నాకు లభించింది. ఆ సమయంలోనే ఎంతోమంది గురుబంధువుల

అనుభవాలను తెలుసుకొనే భాగ్యం నాకు కలిగింది. నిజానికి బాబాకు దగ్గరవడం ఎలా అన్నది గురువుగారి దగ్గరకు వచ్చిన తర్వాతే తెలుసుకున్నాను. అప్పటివరకు బాబాను నాకు తెలిసిన సాంప్రదాయపు చట్రాలలోంచి చూశానని నాకు అర్థమైంది. ఉదాహరణకు.. ఉపవాసం ఉండడాన్ని బాబా నిరసించారు. కానీ, నేను ఏడు సంవత్సరాలు క్రమం తప్పకుండా గురువారం ఉపవాసాలు చేశాను. బాబాకు ఇష్టంలేని దాన్ని వారిపట్ల ప్రేమ పేరుతో ఒక తంతులా చేయడం ఎంత అవివేకమో నాకు గురువుగారి దగ్గరకు వచ్చిన తర్వాతనే తెలిసింది.

బాబా అనుగ్రహానికి అడ్డుగోడలుగా నిలుస్తున్న ఎన్నో బలహీనతలు నాలో ఉన్నాయని, వాటి నుండి బయటపడితే వారి అనుగ్రహాన్ని సంపూర్ణంగా ఆస్వాదించ గలనని నాకు అర్థమయింది. ఆ బలహీనతలను గురువుగారు మన నుండి తీసివేసే పద్ధతి ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఉదాహరణకు నేను ఏదయినా తప్పుచేస్తే, వెంటనే ఏదో ఒక సంఘటన జరిగేది. నిశితంగా పరిశీలిస్తే, ఆ సంఘటనలో నాలాగే తప్పు చేస్తున్న పాత్ర కనిపించేది. తద్వారా నా తప్పు నాకు అర్థమయ్యేది. వారు సృష్టించిన ఆ సంఘటనల కూర్పు ఎంత సహజంగా, యాదృచ్ఛికంగా ఉంటుందంటే, ఆ సంఘటన తన కోసమే కల్పించబడిందన్న సంగతి, అనుభవం వచ్చిన ఆ వ్యక్తి తప్పితే, ఇంకెవరూ లేశమాత్రమైనా ఊహించలేరు. అలా వారు మనకు నేర్పించే పద్ధతి అత్యంత సహజంగాను, సమయోచితంగాను ఉండేది. నువ్వు ఆ తప్పు చేశావు అని కోప్పడడం, దండించడంలాంటివి మచ్చుకైనా కానరావు.

ఆ విధంగా ఎంతో మహిమాన్వితమైన శక్తి కలిగివుండి, అంత సాధారణంగా ఉండే గురువుగారిని చూసి, అసలిదంతా వారి వల్లనే జరిగిందా అనే అనుమానం అప్పుడప్పుడు నాకు వచ్చేది. కానీ ఆ రెండు సంవత్సరాల కాలంలో ఆ అనుమానాలకు ఆస్కారం లేని సంఘటనలు ఎన్నో జరగడం వలన నాకు గురువుగారి దైవత్వం పట్ల పూర్తి విశ్వాసం కలిగింది.

ఒకసారి నేను గురువుగారి దగ్గర కూర్చొని ఉన్నప్పుడు తెనాలి నుండి వచ్చిన దంపతులు తమకు సంతానం ప్రసాదించమని కన్నీళ్ళతో గురువుగారిని వేడుకున్నారు.

గురువుగారు ఒక జామపండు తీసుకుని, బాబాకు నమస్కారం చేసుకుని "నువ్వు తినమ్మా" అంటూ ఇచ్చారు.

మరునాడు, వాకాడు నుండి మరో దంపతులు వచ్చారు. వాళ్ళు గురువుగారికి నమస్కరించుకుని కూర్చున్న తర్వాత, ఆమె ‘మీకన్నీ తెలుసు, నా కోరిక తీరేలా ఆశీర్వదించండి’ అని గురువుగారిని ప్రార్థించింది. గురువుగారు చిరునవ్వుతో “*రెండు రోజులు శిరిడీలో ఉండి గురుస్థాన్‌లో ప్రదక్షిణలు చేసుకోండి*” అని ఊదీ ఇచ్చారు.

పై ఇద్దరి భక్తుల కోరికలు నెరవేరాయని కొద్దిరోజుల తరువాత వారే వచ్చి చెప్పగా ఆశ్చర్యపోయాను. ఒకరు తమ కష్టాన్నంతా మాటలతో చెప్పుకున్నారు. ఇంకొకరు ఏమీ చెప్పలేదు. అయినా ఇరువురి కోరికలు నెరవేరాయి. గురువుగారికి ఏమీ చెప్పనక్కరలేదని, వారికి చెప్పుకోవడం కేవలం మన తృప్తి కోసమేగాని వారికి అన్నీ తెలుసనీ నాకప్పుడు అర్థమయింది.

ఒకరోజు ఒక మిత్రునితో, నాకు బాధ కలిగించిన కొన్ని విషయాలు చెప్పాను. తరువాత కొద్దినిమిషాలకు గురువుగారి వద్దకు వెళ్ళాను. గురువుగారు నేను మాట్లాడిన మాటలనే పొల్లుపోకుండా వేరే సందర్భానికి అన్వయిస్తూ చెప్పారు. నేను అవాక్కయ్యాను. కారణం గురువుగారికి ఆ మాటలు చేరే అవకాశం లేదని నాకు ఖచ్చితంగా తెలుసు. ఈ అనుభవంతో నేను ఎక్కడ ఏం చేస్తున్నా, మాట్లాడుతున్నా గురువుగారికి తెలుస్తుందనీ, వారి దగ్గర ఏమీ దాచలేమని అర్థమయ్యింది.

***గురువుగారు:*** *కిండర్‌గార్టెన్‌లో పసిపిల్లలకు మనం నేర్పిస్తున్నాము అని తెలియకూడదు. వారికి ఆటలు, పాటలు, బొమ్మలు వంటి విషయాల ద్వారా నేర్పించాలి. బయట నుండి చూసేవారికి అక్కడ ఏమీ బోధించటం లేదు అనిపిస్తుంది. “ఏమిటీ ఆటలు, పాటలు, నృత్యాలు? ఇదంతా ఏంటి, ఇంట్లో చేయలేమా, దీనికి డబ్బుకట్టి స్కూల్లో చేర్పించాలా” అనిపిస్తుంది. కాని అక్కడ పిల్లలు చాల సహజంగా నేర్చుకుంటారు. పెద్దవాళ్ళు కూడా అలా సహజంగా నేర్చుకోవటమే నాకిష్టం.*

ఒకసారి గురువుగారి వద్దకు శిరిడీ వాస్తవ్యుడైన 80 ఏళ్ళు పైబడిన వృద్ధుడు వచ్చాడు. ఆయన చిన్నతనంలో బాబాను దర్శించుకుని, స్వయంగా బాబా చేతుల మీదుగా ఊదీ పొందిన భాగ్యశాలి. ఆయన గురువుగారికి నమస్కరించి, ఊదీ తీసుకుని

వెలుపలకు వచ్చి "గురువుగారిలో ఎంతో మహాత్మ్యం ఉంది. వారి చేతులమీదుగా ఊదీ తీసుకొన్నప్పుడు నన్ను నేను మర్చిపోయాను" అన్నారు. ఆయనే వారం తర్వాత మరలా వచ్చి, గురువుగారి దర్శనంతోనే తన ఆరోగ్యం చాలా మెరుగైందని చెప్పారు.

సాక్షాత్తూ బాబాను దర్శించుకొన్న వ్యక్తే, గురువుగారి మహత్తును హృదయ పూర్వకంగా స్తుతించడంతో, "బాబాను ప్రత్యక్షంగా దర్శించుకుని ఉంటే ఎలాంటి ఆనందం పొందేవాళ్ళమో" అని అప్పటివరకు నా మనసులో ఉన్నటువంటి వెలితి ఆ క్షణంలో మటుమాయమయింది. "బాబా, గురువుగారు ఒక్కరే" అనే నమ్మకం నాలో స్థిరపడింది.

నాకు చాలా ఆశ్చర్యం కలిగించేదేమిటంటే, గురువుగారి ద్వారానే అందరి సమస్యలు తీరుతున్నా, వారు మాత్రం ప్రతి విషయాన్ని, ప్రతి అనుభవాన్ని తమ దైవమైన సాయిబాబాకే ఆపాదించడం! ఆ సత్సాంప్రదాయం సాయి సంప్రదాయమని నాకు క్రమేణా అవగతమయింది. అందుకే బాబా "అల్లామాలిక్ హై", "అల్లా అచ్ఛాకరేగా" అనేవారేమో!

*"దైవలీలలు అర్థం చేసుకోవటం కష్టం. చూడు! నిజంగా నేను ఏమీ చేయనూ లేదు. చేయించనూ లేదు. కానీ జనులు కర్తృత్వం నా తలపై వేస్తారు. చేసేవాడు, చేయించేవాడూ అనంతుడొక్కడే. కృపావంతుడూ ఆయనొక్కడే. నేను దేవుడినీ కాను, ఈశ్వరుడినీ కాను. నేను వారి దీనుడనైన సేవకుడను, ఎల్లప్పుడూ వారిని స్మరిస్తాను" అని బాబా సమాధానమిచ్చారు.*

*... శ్రీసాయి సచ్చరిత్ర, 34వ అధ్యాయము*

# శిరస్సు వంచె ప్రకృతి

అద్దంకి శివరామ్
వ్యాపారస్థుడు, చెన్నై
జన్మించిన సం॥ 1963

తెనాలి, జనవరి 2000

పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీని మొదటిసారి నేను 1988, నవంబర్ 24న దర్శించుకున్నాను. తర్వాత 1991లో శిరిడీ వెళ్ళాను. గురువుగారు తెనాలిలో సాయి పూజోత్సవాలకు, మారీసుపేటలోని శ్రీసాయిబాబా విగ్రహప్రతిష్ఠకు వచ్చినప్పటి నుండి గురువుగారితో నాకు సన్నిహితం పెరిగింది. నా దృష్టిలో బాబా, గురువుగారు వేరు వేరు కాదు. ఇద్దరూ ఒక్కటేనన్నది నాకు ఎన్నోసార్లు అనుభవపూర్వకంగాను, స్వప్న సందేశాల ద్వారాను నిరూపితమైంది. నా నిత్యజీవితంలో ప్రతి సంఘటన, అది చిన్నదైనా, పెద్దదైనా జరిగిన తర్వాత ఒక్కసారి వెనుదిరిగి ఆలోచించి, ఆ సంఘటన జరిగిన తీరును గమనిస్తే, అది కేవలం గురువుగారి అనుగ్రహప్రభావమేనని నాకు స్పష్టంగా తెలుస్తుంది.

నేను గురువుగారి దగ్గరకు రాకమునుపుకి, ఇప్పటికి నా మానసిక స్థితి, ఆత్మ విశ్వాసంలో ఎంతో వ్యత్యాసం నాకు స్పష్టంగా తెలుస్తోంది.

నాకు దైవస్వరూపులైన పూజ్య గురుదేవులు ప్రసాదించిన ఆణిముత్యాల్లాంటి అనుభవాలలో కొన్ని:

1990 సంవత్సరం వరకు నాకు బాబా గురించి, గురువుగారి గురించి అంత ఎక్కువగా తెలియదు. అప్పటికి నేను శిరిడీ కూడ వెళ్ళలేదు. ఒకసారి బొంబాయికి కొరియర్‌లో పెద్ద మొత్తం విలువగల డ్రాఫ్ట్ పంపాను. మధ్యలో ఆ డ్రాఫ్ట్ ఎవరో దొంగిలించి, ఖాళీ కవర్ డెలివరీ ఇచ్చారు. ఈ విషయం తెలిసిన వెంటనే నేను బొంబాయి బయలుదేరి వెళ్తూ, డ్రాఫ్ట్ దొరికితే రిటర్న్‌లో శిరిడీ వెళదామనుకున్నాను. బాబా కరుణించి నా డ్రాఫ్ట్ నాకు దొరికేలా చేశారు. దొంగిలించినవారు ఆ డ్రాఫ్ట్ మార్చుకోలేక ఆ బ్యాంక్‌లోనే నలిపి పారేశారు. నేను బ్యాంక్‌కి ఎంక్వయిరీకి వెళ్ళగా ఆ విషయం చెప్పి, నా డ్రాఫ్ట్ నాకిచ్చారు.

వెంటనే అదే రోజు, బొంబాయి నుండి శిరిడీ వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాను. మొదటిసారిగా 'సాయిపథం'లో బస చేశాను.

మేము మా ఇంటికి దగ్గరలో వేరొక ఇల్లు కొన్నాము. ఆ ఇంటిని అద్దెకు ఇవ్వడానికి ఎన్నో నెలలు ప్రయత్నించాము. చాలామంది వచ్చి చూసి వెళ్ళేవారు కానీ ఎవ్వరూ చేరడానికి రాలేదు. చాలా నెలలు అలా ఖాళీగా ఉండడంతో ఏమీ చేయలేక ఊరుకున్నాము.

1993లో గురువుగారు మా ఇంటికి వచ్చారు. వారి పాద స్పర్శతో మా ఇల్లు పావనమయింది. గురువుగారి ఆధ్వర్యంలో ఆ రోజు నుండి మా ఇంట్లో సత్సంగం ప్రారంభింపబడింది. సత్సంగం గురించి ఏమాత్రం తెలియని మేము, సత్సంగం ఏ విధంగా నిర్వహించగలమా అని భయపడ్డాము. సర్వజ్ఞులైన గురువుగారు, నేను చెప్పకనే నా మనోభావాన్ని గ్రహించి, సాయివరప్రసాద్‌గారిని, కృష్ణామాస్టర్‌ను సత్సంగం చేసే ఏర్పాటు చేశారు. ఆనాటి నుండి మా ఇంటిలోని వారందరమూ గురువుగారి అనుగ్రహం, రక్షణ పొందుతున్నాము. గురువుగారు ఆ ఇంటిలో పాదము మోపిన రెండు మూడు రోజులకే, ఒకరు అద్దెకు చేరారు.

1994వ సంవత్సరం డిసెంబర్ 15, 16 తేదీలలో నేను తిరువణ్ణామలైలో గురువుగారి దర్శనం చేసుకున్నాను. ఆ సమయంలో గురువుగారు నా మనస్సులోని మాట విప్పి, భావాన్ని గ్రహించి, నన్ను ఆనందపరిచారు. 'సాయి అంటే ఓయీ!' అన్న సత్యానికి నిదర్శనంగా, పూండీలో "సాయిబాబా సాయిబాబా" అని భజన చేస్తుండగా, గురువుగారు పూండీకి వచ్చి దర్శనమిచ్చారు.

ఆ ట్రిప్‌లో గురువుగారు నన్ను "నువ్వు ఢిల్లీ ఎప్పుడు వెళుతున్నావు?" అని అడిగారు. నేను 'ఇప్పుడు అక్కడ పనేమీ లేనందున, వెళ్ళడం లేదు' అని చెప్పాను. రెండు రోజుల తరువాత తెనాలి వచ్చాను. కానీ అప్పటికి నాలుగు రోజుల క్రితమే నన్ను వెంటనే ఢిల్లీ బయలుదేరి రమ్మని టెలిగ్రామ్ వచ్చి ఉన్నది. నాకు ఈ విషయం తెనాలి వచ్చిన తరువాత తెలిసింది. సర్వజ్ఞులైన గురువుగారికి తెలియనిదేమున్నది?

ఒకసారి మేము అద్దెకు తీసుకుని ఉన్న గోడౌన్‌ను ఖాళీ చేయమని ఓనర్ చెప్పాడు. ఎంత వెదకినా మాకు వేరే గోడౌన్ దొరకలేదు. ఆ సమయంలో గురువుగారు ఒంగోలు వెళ్తూ, విజయవాడలో కొద్దిసేపు ఆగారు. అప్పుడు నేను గురువుగారిని "మాకు ఒక గోడౌన్ కావాల"ని అడిగాను. గురువుగారు వెంటనే "మీరే ఒక స్వంత *గోడౌన్ కట్టించుకుంటే ప్రాబ్లెమ్ ఉండదు కదా!"* అన్నారు. గురువుగారు అలా చెప్పిన తరువాత, ఇరవై రోజులకి నేను శిరిడీకి వెళ్ళాను. అదే రోజు మాకు గోడౌన్‌కి

ఉపయోగపడే ఒక ఖాళీ స్థలం బేరం కుదిరినట్లుగా తెనాలి నుండి ఫోన్ వచ్చింది. కొద్దికాలంలోనే బిల్డింగ్ కూడా కట్టించాము.

1994లో సంక్రాంతికి నేను శిరిడీ వెళ్ళి, అక్కడ నుండి గురువుగారి అనుమతితో, నా వ్యాపారం పని మీద త్రివేంద్రం వెళ్ళాను. అంతక్రితం అక్కడ ఉన్న మా బిజినెస్ పార్టీతో విభేదాలు వచ్చి, వారితో వ్యాపారం ఆపివేసి ఉన్నాము. కానీ నేను ఊహించని విధంగా వారిలో మార్పు వచ్చి, వారు ఎంతో ఆదరణ, గౌరవ మర్యాదలు, రెస్పాన్స్ ఇచ్చారు. ఈ విధంగా ఎన్నో వేల మైళ్ళ దూరంలో ఉన్న వారిని కూడా ప్రభావితం చేయగలగడం గురువుగారికే సాధ్యం.

1995, ఏప్రిల్‌లో వారణాసిలో నాకు గురువుగారి దర్శనం లభించింది. వారితో అలహాబాద్, గయ-ప్రయాగ, బుద్ధగయ వెళ్ళాను. తర్వాత కొంతకాలానికి నార్త్ ఇండియా, 1996లో దత్తక్షేత్రాలు గురువుగారితో కలసి దర్శించుకున్నాను. బిడ్డ ఆనందాన్ని చూసి తల్లి సంతోషించినట్లుగా, మేము ఆనందంగా ఉంటే గురువుగారు ఎంతో సంతోషించేవారు.

1995, సెప్టెంబర్ 7వ తేదీన నేను తిరుమలకు కాలినడకన వెళ్ళాను. ఆ సమయంలో గురువుగారు తిరువణ్ణామలైలో ఉన్నారు. గురువుగారిని దర్శించుకొనే అవకాశం రావాలని బాబాకు నమస్కరించి, 'సాయిబాబా' నామం చెప్పుకుంటూ కొండపైకి నడిచి వెళ్ళాను. గురువుగారు నా కోరిక మన్నించి, సెప్టెంబర్ 9వ తేదీన తిరువణ్ణామలై రావడానికి నాకు అవకాశమిచ్చి, దర్శనం ప్రసాదించారు. ఇలా సకల దేవతా స్వరూపమైన సాయిబాబాకు, గురువుగారికి భేదం లేదనే అనుభవాన్నిచ్చారు.

తిరువణ్ణామలైలో గురువుగారు ఒకసారి నాకు కేక్ ఇచ్చారు. నేను దాన్ని వెంటనే తినకుండా ప్రక్కనుంచగా, గురువుగారు "ఏం ప్రక్కన ఉంచావు, తిను" అని ప్రేమగా అన్నారు. నేను తింటుండగా ఆ కేక్ నా చేతికి ఎక్కువగా అయింది. తుడుచుకోవడం ఎలా అని ఆలోచిస్తుండగా, గురువుగారు వెంటనే తన మీద కప్పుకున్న కండువా తీసి "తుడుచుకో" అన్నారు. సాక్షాత్తూ భగవత్స్వరూపమైన గురువుగారి నిరాడంబరతను, ప్రేమానురాగాలను మనం జీవితంలో ఎక్కడా చూడలేము.

మనకు గురువుగారంటే ఎంత ఇష్టమో, గురువుగారికి మనమంటే అంతకు ఎన్నో రెట్లు ఇష్టం. ఎన్నోసార్లు మనలను చూడాలని కోరుకుంటారు. ఇది నాకు ఎన్నోసార్లు అనుభవం.

1995, అక్టోబరులో సుమారు 30 రోజులు శిరిడీలో ఉన్నాను. ఆ సమయంలో మా వ్యాపారంలో చాలా నష్టం వచ్చేలా ఉన్నది. అయినా నేను బాబాపై భారం వేసి శిరిడీలో ఉన్నాను. నేను తెనాలిలో లేనప్పటికీ, గురువుగారు నా పనులన్నీ ఎంతో చక్కగా జరిగేలా చేసి, తప్పనిసరిగా నేను ఎక్కువ కాలం శిరిడీలో ఉండేలా చేశారు. గురువుగారు నన్ను ఆ విధంగా ఎక్కువ రోజులు శిరిడీలో ఉంచని ఎడల నాకు ఖచ్చితంగా వ్యాపారంలో నష్టం వచ్చేది. ఎందుకంటే, ఆ నెల రోజులు నేను తెనాలిలో ఉంటే, నేను మా వద్దనున్న సరకు అమ్మకం చేసి ఉండవలసి వచ్చేది. అలా నష్టపోకుండా గురువుగారు నన్ను రక్షించారు.

మా వ్యాపారంలో, మేము సాధారణంగా ఇతర ఊర్లకు సరకు పంపే ప్రతి లారీకి ఇన్సూరెన్స్ చేస్తుంటాము. బాబా దయ వలన ఎప్పుడూ ఏ లారీకీ యాక్సిడెంట్ జరగలేదు. కాని 2000వ సంవత్సరం, ఏప్రిల్‌లో నార్త్ ఇండియాకు సరకు పంపిన లారీకి పొరపాటున ఇన్సూరెన్స్ చేయలేదు. దురదృష్టవశాత్తు ఆ లారీకి యాక్సిడెంట్ జరిగి డ్రైవర్‌కి, క్లీనర్‌కి బాగా దెబ్బలు తగిలాయి. లారీ పడిపోయి, సరకు బయటపడిపోయింది. ఈ విషయం తెలిసిన వెంటనే గురువుగారికి చెప్పుకున్నాను. గురువుగారి దయ వలన ఏమీ నష్టం రాలేదు. ఇన్ని సంవత్సరాల నుండి ప్రతి లారీకి ఇన్సూరెన్స్ చేస్తూ, పొరపాటున మరచిన ఈ లారీకి యాక్సిడెంట్ జరగడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. గురువుగారి అనుగ్రహం వలన ప్రమాదం తప్పింది.

ఒకసారి నేను మద్రాసులోని మైలాపూరు బాబా మందిరానికి మొదటిసారిగా వెళ్ళి, బాబా పాదాలకు నమస్కరించుకొనేటప్పుడు, నా తల బాబా పాదాలకు గట్టిగా తగిలింది. పాపం! బాబాకు కూడా నొప్పి పుట్టి ఉంటుందని అనుకున్నాను. మద్రాసు నుండి రాగానే శిరిడీ వెళ్ళాను. ఒకరోజు శిరిడీలో, గురువుగారికి గ్లాసులో మంచినీరు ఇస్తుండగా, నా తల గురువుగారి తలకు తగిలింది. కరెక్ట్‌గా నాకు మద్రాసులో బాబా పాదాలు ఎక్కడ తగిలాయో, అక్కడే గురువుగారి తల నా తలకు తగిలింది. తిరిగి శిరిడీ నుండి తెనాలికి బస్‌లో వస్తున్నప్పుడు, గురువుగారు బాబాగా మారిపోయినట్లు కల రావడంతో "గురువుగారు బాబాగా మారిపోయారు" అని పెద్దగా అరిచాను. గురువుగారికి, బాబాకు ఏ మాత్రం భేదం లేదని తెలుసుకున్నాను.

ఒకసారి నేను గురువుగారిని, ఒక టెండర్ నాకు వచ్చేటట్లు అనుగ్రహించమని ప్రార్థించాను. కాని ఆ టెండర్ నేను అడిగిన మొత్తం కాక చాలా చిన్న మొత్తంలో

మాత్రం నాకు కన్‌ఫర్మ్ అయింది. అది నాకు చాలా అసంతృప్తి కలిగించింది. టెండర్ మొత్తం కావాలని గురువుగారిని అర్థించాను. "బాబా ఎందుకు చేశారో చూద్దాం" అన్నారు గురువుగారు. అయినా నేను తృప్తిగా లేను. కాని సరిగ్గా సరకు సప్లై చేయవలసిన సమయానికి మార్కెట్లో పరిస్థితులు మారి, నేను ఆ కొద్ది టెండర్ కూడా చాలా కష్టంగా సప్లై చేయవలసి వచ్చింది. గురువుగారు సర్వజ్ఞులు కనుక నేను ఎంత అడిగినా నాకు ఆ మొత్తం టెండర్ రాలేదు. ఆ టెండర్ పూర్తిగా వచ్చి ఉంటే నాకు చాలా నష్టం వచ్చేది.

1997-98 మధ్యకాలంలో గురువుగారితో, ఇతర గురుబంధువులతో కలిసి ఉత్తరభారత యాత్రకు వెళ్ళే భాగ్యం కలిగింది. వారి వెంట తిరిగిన ఆ ప్రదేశాలు, జరిగిన సన్నివేశాలు ఎంతో అపురూపంగా, అపూర్వంగా నా మనసులో నిలిచిపోయాయి అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా చిత్రకూట్‌లో జరిగిన సంఘటన!

ఎందరో మహర్షుల, తపస్సంపన్నుల పాదస్పర్శతో పునీతమైన ఆ ప్రదేశాలను సందర్శిస్తూ, గురువుగారు ఒక చోట కొద్ది సేపు విశ్రాంతి తీసుకోదలచి, ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. వెంట ఉన్న మేమంతా వారికి కొద్ది దూరంలో కూర్చున్నాము. ఇంతలో పెద్ద కోతుల గుంపొకటి అక్కడికొచ్చింది. సహజంగా కిచకిచమంటూ చేసే అల్లరేమీ చేయకుండా చాలా బుద్ధిమంతుల్లా నిశ్శబ్దంగా ఉన్నాయవి. వాటిలో నుండి ఒక కోతి వెళ్ళి, గురువుగారు కూర్చున్న చోట, ఆ చెట్టు పైకెక్కి సరిగ్గా గురువుగారు ఉన్న వైపు కొమ్మల్ని బలంగా ఊపింది. అంతే, వందలకొద్ది పసుపుపచ్చని పువ్వులు జలజలమంటూ మెత్తగా గురువుగారిపై రాలుతూ వారి చుట్టూ పరచుకొన్నాయి, మా అందరికి కన్నుల పండుగ చేస్తూ!

ఒకనాటి సాయంత్రం మేమంతా మినీ బస్సులో 'కౌసాని' అనే ప్రదేశానికి వెళ్తున్నాము. కౌసానిలో మహాత్మాగాంధీజీ ఆశ్రమం ఉంది. రాత్రికి అక్కడికి చేరుకుని, అక్కడే ఉందామన్నారు గురువుగారు. మా బస్సు ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తోంది. ఒక వైపు ఎత్తైన కొండలు, మరో వైపు లోతైన లోయలతో దారంతా మలుపులు తిరుగుతూ, మా ప్రయాణం గమ్మత్తుగా సాగుతూ ఉంది.

అంతలో గురువుగారు ఉన్నట్లుండి మాతో *"ఏమిటా శబ్దం? అదోలా ఉంది! బస్సు ఆపించి చూడండయ్యా ఒకసారి"* అన్నారు. అలాగేనని చెప్పి, మేము బస్సు ఆపి చూస్తే, ఒక వైపు టైరుకు నట్లు పూర్తిగా ఊడిపోయి ఉన్నాయి. నట్లు

ఊడినప్పటికీ బస్సు అప్పటిదాకా అంత సురక్షితంగా ఎట్లా ప్రయాణించిందో, మాకు ఏమాత్రం అర్థం కాలేదు. ఆ సమయంలో బస్సు లోయ అంచున ఉంది. టైరు ఊడి బస్సు లోయలో పడివుంటే జరిగే ఘోరాన్ని ఊహించడానికే భయమేసింది. కొద్దిసేపటిదాకా ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయాము.

తర్వాత సర్దుకుని మామూలు ధోరణిలో పడ్డాక, మా బృందంలోని విదేశీయులు "ఇప్పుడేం చేయాలి గురువుగారూ? ఇంత లగేజీతో మనమందరం ఇక్కడ నుంచి కౌసాని చేరేదెలా?" అని గురువుగారి వద్ద తమ ఆందోళన వ్యక్తం చేశారు.

వారి మాటలు పూర్తి అయ్యాయో లేదో మా వద్దకు మూడు ఖాళీ జీపులు వచ్చి ఆగాయి. విచారించగా అవన్నీ కౌసానికి వెళుతున్నట్లుగా తెలిసింది. వారితో మాట్లాడి బస్సులోని సామానంతా జీపుల్లో సర్దుకుని, మేమంతా క్షేమంగా ముందనుకున్నట్లు ఆ రాత్రికే కౌసానికి చేరుకున్నాము. గురువుగారు మమ్మల్ని ప్రాణాపాయం నుండి తప్పించడమే కాకుండా, ఎటువంటి ఇబ్బంది కలుగకుండా కౌసానికి చేర్చారు.

1996 జనవరిలో, గురువుగారితో కలిసి సిమ్లాకు వెళ్ళే అవకాశం కలిగింది. సిమ్లా అనగానే మనలో ఎవరికైనా మనసులో మెదిలేది చలితో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం, మంచుతో కప్పబడిన పర్వతాలు. అందులోనూ, దక్షిణ భారతదేశంలో ఉండే మనకు మంచు గురించి ఏం తెలియదు కదా! అందుకే సిమ్లాలో మంచు చూస్తామనే ఉత్సాహంతో వెళ్ళిన మాకు, అక్కడికి చేరుకున్నాక తెలిసిన నిరుత్సాహకరమైన వార్త ఏమిటంటే, ఆ సీజన్‌లో మంచు పడనేలేదట. కనుచూపుమేరలో ఎక్కడా కూడా మంచు కనిపించలేదు.

ఆ రోజు మధ్యాహ్నం రెండుగంటలప్పుడు, గురువుగారు మమ్మల్నందర్నీ తమ గదిలోకి పిలిపించారు. మేమంతా సంతోషంగా వెళ్ళి వారి గదిలో కూర్చున్నాము. ఆ సమయంలో గురువుగారెంతో ప్రసన్నంగా ఉన్నారు. మాతో ఉల్లాసంగా మాట్లాడుతూ, విశేషాలు చెప్పమన్నారు. ఆ విధంగా చక్కని సత్సంగం మొదలయింది. సంభాషణలో సిమ్లా గురించి రాగానే, మాలో నుండి చిన్నగా ఎవరో "ఇంత దూరం వచ్చినందుకు ఇప్పుడిక్కడ మంచు ఉండి ఉంటే ఎంత బాగుండేదో కదా!" అన్నారు.

*"ఎందుకంత నిరాశ? బాబా తలచుకుంటే మంచు ఎంతసేపట్లో కురవాలి?"* అన్నారు గురువుగారు చిన్నగా నవ్వుతూ. సుమారు నాలుగు గంటలప్పుడు, అంత వరకు లేనిది చిరుజల్లులతో వర్షం మొదలైంది. అది మెల్లగా మంచు తుంపర్లుగా

మారి రాత్రంతా కురుస్తూనే ఉంది. మరునాటి ఉదయం, మేమంతా నిద్ర లేచి వెలుపలకు వచ్చి చూస్తే ఇళ్ళు, చెట్లు, చేమలు ఎటు చూసినా తెల్లని మంచు! దూది గుట్టలు గుట్టలుగా ఆరబోసినట్లు దట్టంగా పరచుకుని ఉంది. ఒక్క క్షణం మేము చూస్తున్నది కలా, నిజమా అన్నది మాకర్థం కాలేదు. కానీ కళ్ళ ముందున్న మంచు వాస్తవమంటూ ఆహ్వానిస్తూ, కల కాదు సుమా! అంటోంది. పోత పోసిన ఆ 'శ్వేత సౌందర్యాన్ని' చూసిన మా బృందంలోని వారంతా తమ వయస్సును మరచి చిన్న పిల్లల్లా మంచులో పరుగులు, ఆటలు మొదలెట్టారు.

హొటల్లోని పరివారమూ, ఆ పరిసరాలలోని వారందరూ కూడ హఠాత్తుగా అంత మంచు కురవడం చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. సీజను అయిపోయిన తర్వాత అంత మంచు కురవడం, ఇంతకు ముందెన్నడూ జరగలేదన్నారు. అంతేకాదు, గత మూడు సంవత్సరాలలో అంత దట్టంగా మంచుపడడం ఇదే మొదటిసారి అని, ఇదంతా తమ హొటల్‌కి విచ్చేసిన గురువుగారి మహిమేననీ, వారిక్కడికి రావడం, తమ హొటల్‌లో బస చేయడం తమ అదృష్టమని, ఆ హొటల్‌లోని వారందరూ ఎంతో ఆనందించారు. ఆ మంచులో ఆటపాటలతో పోటీలు పడుతూ ఫోటోలు తీసుకుంటున్న మాలో కొందరికి, 'అయ్యో ఇంత ఆనందాన్ని తిరిగి చూసుకునేందుకు స్టిల్‌ఫోటోలతోనే సరి పెట్టుకోవాల్సి వచ్చిందే, వీడియో కెమెరాలు తెచ్చుకోలేకపోతిమే' అనిపించింది. అదే మాట తర్వాత గురువుగారితో అన్నారెవరో "వీడియో కెమెరా ఉంటే భలే ఉండేదని".

కొద్దిసేపైన తర్వాత నేను, గురుబంధువైన శ్రీను గురువుగారికి మంచి కాఫీ తేవాలని కాఫీస్టాల్ కోసం చూస్తూ, కొంతదూరం కాలినడకన వెళ్ళాము. అట్లా రెండు కిలోమీటర్లు వెళ్ళాక కాఫీ స్టాల్ కనబడింది. అక్కడ వీడియో కెమెరాలు పట్టుకొన్న ఇద్దరు వ్యక్తులు, స్థానికులను హఠాత్తుగా పడిన మంచును గూర్చి ఇంటర్వ్యూ చేస్తూ కనిపించారు. వాళ్ళిద్దరూ 'ఢిల్లీ దూరదర్శన్' రిపోర్టర్స్ అని తెలిసింది. మా షర్టులకున్న 'సాయిపథం' బ్యాడ్జిలు చూసి కుతూహలంగా 'ఎవరు? ఏమిటి?' అని ప్రశ్నించారు. గురువుగారి గురించి చెప్పిన వివరాలు విని 'వారు నిజంగా అంత మహాత్ములా? మనమేం అడిగినా ఇవ్వగలరా?' అని ఆశ్చర్యంతో అడిగారు. "వారు తలచుకుంటే ఏమైనా అనుగ్రహించగలర"ని మేమన్నాము. ఆ ఇద్దరిలో ఒకతను "అలాగా! ఒకవేళ నేను డబ్బు కావాలంటే వారివ్వగలరా?" అని తమాషాగా అడిగాడు.

"ఆఁ! వారికేదీ అసాధ్యం కాదు!" అని మేము దృఢంగా జవాబిచ్చాము.

గురువుగారిని ఇంటర్వ్యూ చేయాలనుంది అన్నారు వాళ్ళు ఆసక్తిగా. అయితే గురువుగారికి ఇటువంటి ప్రచారాలు ఇష్టముండవని, అది వీలుపడదని చెప్పాము. అయినప్పటికీ వాళ్ళు గురువుగారితో మాట్లాడాలన్న ఆసక్తితో 'మా ప్రయత్నం మేము చేసుకుంటామ'న్నారు. మేము కాదనలేక 'సరే పద'మన్నాము. కాఫీ తీసుకుని, మేము హోటల్‌కు తిరిగి వస్తుండగా 'మీ గురువుగారు డబ్బడిగినా ఇస్తారా?' అనడిగిన రిపోర్టర్‌కి, దారిలో మంచు మీద ఒక రూపాయి నాణెం కనిపించింది. దానిని అతడు తీసుకోవడం చూసి నవ్వుతూ 'గురువుగారు డబ్బిస్తారా అని మీరు ఇప్పుడేగా అడిగారు, వెంటనే ఇచ్చారు చూశారా! లేకపోతే మా ముగ్గురికీ కనిపించని కాయిన్ మీకే కనబడటమేంటి?' అన్నాను.

'అవును. నిజమే!' అన్న అతని కళ్ళల్లో ఆశ్చర్యం, పెదవులపై చిరునవ్వు చోటు చేసుకొన్నాయి. మేము ఊహించినట్లుగానే, గురువుగారు వారికి ఇంటర్వ్యూ ఇచ్చేందుకు ఇష్టపడలేదు. వాళ్ళు చాలాసేపు నిరీక్షించారు. కానీ వాళ్ళ ప్రయత్నం ఫలించలేదు. ఇక చేసేది లేక మా బృందంలోని మిగిలిన వారందర్నీ ఇంటర్వ్యూ చేసి, వీడియో తీసుకుని వెళ్ళిపోయారు. వెళ్ళేముందు ఆ ప్రోగ్రామ్ ఢిల్లీ దూరదర్శన్‌లో ఎప్పుడు ప్రసారం చేసేది మాకు తప్పక తెలియజేస్తామన్నారు. చెప్పినట్లుగానే వారు ఆ తర్వాత ప్రోగ్రామ్ ప్రసారం చేసే తేదీ, సమయం ఫోన్ చేసి చెప్పడమే కాక, ఆ వీడియో క్యాసెట్ కాపీ కూడా పంపించారు.

తర్వాత ఒకరోజు సత్సంగంలో, గురువుగారు ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ "చూశారా, మీరు ఆ రోజు సిమ్లాలో వీడియో తీసుకోలేకపోయామే అనుకున్నారు. *బాబా మన చేత పైసా ఖర్చు పెట్టించకుండా వీడియో తీయించడమే కాదు, మీ అందరినీ టి.వి.లో కూడా చూపించారు!*" అన్నారు నవ్వుతూ.

***భక్తుడు:*** *గురువుగారూ! ధ్యానం ఎలా చేసుకోవాలి?*

***గురువుగారు:*** *నీ సద్గురువు మీద నువ్వు మనస్సు కేంద్రీకరించడానికి చేసేదంతా ధ్యానమే. ఇరవై నాలుగు గంటలు నువ్వు కూర్చుని ఫోకస్ చేయలేవు. శరీరానికి ఒక యాక్టివిటీ కావాలి. ఎందుకంటే మనకు*

కొన్ని అలవాట్లు (patterns) ఉంటాయి. మన అలవాట్లు, మన పుల్స్ ఎలా ఛానలైజ్ అవ్వాలంటే, మనం చేసే పనులన్నీ చివరకు ఆయనకు సంబంధించినవై ఉండాలి. ప్రతి పని చేసేటప్పుడు ఆయననే గుర్తు చేసే విధంగా, ఆయన కోసం చేస్తున్నామనే సంతృప్తితో, ఆయననే జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉండాలి.

పనిచేయడం, ధ్యానము రెండూ సాధనలే. నువ్వు కళ్ళు మూసుకుని కూర్చున్న సమయం ఒక్కటే సాధన అని అనుకోవద్దు. పని చేస్తూండు. మనస్సు ప్రశాంతమైనప్పుడు కూర్చుని ఆ ఆనందానుభూతిని, సంతోషాన్ని నీకు చేతనైనంతవరకు అనుభవించు. కొంతసేపు తర్వాత మనస్సు తిరిగి డిస్టర్బ్ అవుతుంది. తిరిగి మరల పని చెయ్యి. ఇలా చేస్తూ పోతే లేచి వెళ్ళే అవసరం లేకుండా, నిలకడగా ఉండగలిగే సమయం పెరుగుతూ పోతుంది. తర్వాత లేచి పని చేస్తున్నా, కూర్చుని ధ్యానం చేస్తున్నా ఒకటిగానే ఉంటుంది. ఏదైనా ఫరవాలేదు. ఎందుకంటే రెండూ ఒకటే.

చాలామంది ధ్యానంలో నిలకడగా ఉండడానికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. "మేము ధ్యానం చేస్తున్నాము. రెండు, మూడు, ఐదు సంవత్సరాల నుండి ధ్యానం చేస్తున్నాము. ఏమీ కాలేదు" అంటుంటారు. ఎందుకంటే వాళ్ళు ధ్యానంలో ఉన్నంతసేపు మాత్రమే సరిగా ఉండడానికి ప్రయత్నిస్తారు. కానీ ధ్యానంలోని నీ స్థితి, నీవు ధ్యానంకు వెలుపల గడిపే సమయం ఎలా గడుపుతున్నావు అనే దాని మీద ఆధారపడి ఉంది. ఎవరూ దాన్ని పట్టించుకోరు. ధ్యానం చేయని సమయాన్ని సరిచేసుకోగలిగితే, ధ్యానం సునాయాసంగా కుదురుతుంది. ధ్యానం ఎలా జరుగుతుంది, ఎలా మారుతుంది, ఎలా పాడవుతుంది, ఎలా నిలుస్తుంది అనేది నీవు ధ్యానం చేయని సమయంలో నీ సమయాన్ని ఎలా గడుపుతున్నావు అనే దానిమీద ఆధారపడి ఉంటుంది.

# మమత సమతల హేల

అద్దేపల్లి సుచిత్రాదేవి
రచయిత్రి, చెన్నై
జన్మించిన సం॥ 1958

చెన్నై, జనవరి 2001

దైవస్వరూపులైన సద్గురుశ్రేష్ఠులు పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీకి తోడబుట్టిన సోదరినయ్యే అదృష్టాన్నిచ్చిన శ్రీసాయినాథ్ మహరాజ్‌కు ముందుగా శతసహస్ర సాష్టాంగ వందనాలు అర్పించుకుంటున్నాను.

ఈనాడు శ్రీబాబూజీ, నాకూ మా కుటుంబానికంతా గురుస్వరూపమే. ఏనాటి కరుణానుబంధమో ఈనాడు ఈ అపురూపానుబంధముగా వారి చల్లని నీడలో అందరం ఆనందంగా జీవిస్తున్నాము. ప్రాపంచిక ప్రభంజనంలో కొట్టుకుపోతున్న మా జీవన గమనాలకు 'శ్రీసాయిబాబా' అను ఒక మహోన్నతమైన గమ్యాన్ని చూపి 'సాయిపథం'లో మమ్ము నడిపిస్తున్న ప్రేమమూర్తి గురుదేవులు.

గురువుగారు ఒంగోలులో ఉన్నంతవరకు వారికీ మాకూ బాగా రాకపోకలు ఉండేవి. కానీ, వారు 1989లో శిరిడీలో స్థిరనివాసం ఏర్పరుచుకొన్న తర్వాత మేము 1996 వరకూ శిరిడీ వెళ్ళనేలేదు. మధ్యలో ఒకసారి వెళ్ళాలనుకొన్నా వీలుకాలేదు. మరొకసారి మేము శిరిడీ వెళ్ళినా, వారు అదే రోజు ఊరికి వెళ్ళడం వలన కలవలేక పోయాము. 1997 విజయదశమికి మా అమ్మ, నాన్నగారు, ఇద్దరు తమ్ముళ్ళు, చెల్లెలు వాళ్ళ కుటుంబాలతో శిరిడీ వెళుతున్నారు. మనమూ వెళదామని మావారిని అడిగాను. అప్పుడు కోవూరులో ఒక స్థలం కొనబోతూ, ఆ రిజిస్ట్రేషన్ మరో పదిహేను రోజుల్లో చేసుకోవాల్సి ఉండడం, దానికి కట్టవలసిన డబ్బు చేతికందక కాస్త టెన్షన్ పడుతూన్న ఆయన "రిజిస్ట్రేషన్ అయిపోనీ. మనం తర్వాత వెళ్దాము" అన్నారు.

అంతలో కోట నుండి విజయభాస్కర్ ఫోన్ చేసి "శిరిడీకి ఇంట్లో అందరూ వస్తున్నారట, మీరు తప్ప. ఏమ్మా, ఎందుకు రావడం లేదు?" అని అడిగాడు. రావాలనే ఉంది, ఏవో సమస్యలు, తర్వాత వద్దామనుకొంటున్నాము అని నేను అనగానే "శిరిడీకి వెళితే సమస్యలన్నీ వాటంతటవే సమసిపోతాయి బయలుదేరండి" అన్నాడు.

నిజంగా భాస్కర్‌కు కృతజ్ఞతలు చెప్పాలి. ఆనాడు ఆ ఫోన్ రాకపోతే నేను వెళ్ళేదాన్ని కాదేమో. మా జీవితాలు ఈ మలుపు తిరిగి ఉండేవి కావేమో? ఏ దైవికశక్తో

అతని ద్వారా ఆ మాటలు పలికించింది. అతనలా అనడంతోను, నాకూ వెళ్ళాలనే కోరిక బలంగా ఉండడంతోను 'అమ్మావాళ్ళతో నేనొక్కదాన్నన్నా ఇప్పటికి వెళ్ళిరానా?' అని మావారిని అడిగాను. సరే అన్నారు మా వారు. అలా నేను శిరిడీ వెళ్ళాను. దగ్గర దగ్గర ఏడేళ్ళ తర్వాత మా అన్నను చూడబోతున్నానన్న ఆనందోద్వేగం ఒక వైపు, ఇంకో వైపు ఇన్నాళ్ళు చూడలేకపోయానే అన్న బాధ రెండూ కలిసి లోనుండి దుఃఖం పొంగుకువస్తోంది. అన్నను "గురువుగారంటున్నారు, దైవం అంటున్నారు". నాకేమీ అర్థం కావడం లేదు.

హోటల్లో దిగి స్నానాలవీ కానిచ్చుకుని గురువుగారు మొదట్లో ఉన్న పాత సాయిపథం (వరుసగా పది రూములు రేకుల పై కప్పుతో ఉండేవి. అక్కడ గురువుగారు 6వ నెంబర్ గదిలో నివసించేవారు) దగ్గరకు వెళ్ళాము. "ఏం సుచీ, బాగున్నావా?" అని ఆప్యాయంగా పలుకరించింది వదిన. ఆమె అలా అడగ్గానే "ఇన్నేళ్ళా?! నేను సరే రాలేదు, మీకెవ్వరికీ నన్ను చూడాలనిపించలేదా?" అని పెద్దగా ఏడ్చేశాను.

ఆమె నన్ను ఓదార్చుతూ "పద, మీ అన్న సాయియానాలో ఉన్నారు. అక్కడికి వెళదాం" అన్నది. అందరం సాయియానాకు వెళ్ళాము. అప్పటికి ముందు రెండు గదులు తప్ప ఈ కట్టుబడి అంతా లేదు. ఇప్పుడు రౌండు గది ఉన్న స్థలంలో పెద్ద స్టేజ్ ఏర్పాటు చేసి ఉన్నారు. అది చక్కని పుష్పాలంకరణతో శోభాయమానంగా ఉన్నది. ఎదురుగా విశాలమైన షామియానాల్లోనూ, వెలుపలా కూడా వేలాదిమంది జనం కూర్చొని ఉన్నారు. స్టేజిపైన చూశాను. తెల్లని పంచె, బనీను వంటి సామాన్య ఆహార్యంతో, ప్రసన్న వదనంతో, మూర్తీభవించిన ఆనందస్వరూపంలా కూర్చుని ఉన్నారక్కడ గురువుగారు. వారు "నేనెరిగిన, నాతో చనువుగా మాట్లాడే మా అన్నేనా?!"

ఊహుఁ. పుట్టినప్పట్నుండీ చూస్తున్నాను. కానీ అదివరకెప్పుడూ చూడని ప్రశాంతత, దివ్యత్వం ఉన్నాయి ఈ రూపంలో. నెమ్మదిగా జనమందరితో పాటు క్యూలో నడుస్తూ వారిని సమీపించేకొద్దీ ఆ తేడా స్పష్టంగా కనిపిస్తున్నది. పాదనమస్కారం చేసుకొంటున్న వారిని ఆశీర్వదిస్తూ, ఊదీ ఇస్తూ చిరునవ్వుతో పలుకరిస్తున్న ఆ మూర్తి ఎంత మహోన్నతంగా ఉందంటే, అక్కడ కూర్చొని ఉన్నది లోకపాలకుడే అనిపిస్తోంది. నాకు ఏదో క్రొత్త ప్రపంచంలో అడుగిడినట్లుంది. వరుసలో నా వంతు వచ్చింది. అన్ని సంవత్సరాల తర్వాత మా అన్నను అంత దగ్గరగా చూస్తున్నాను. అప్రయత్నంగానే పాదాలు తాకి నమస్కరించుకున్నాను. చల్లని ఆ పాదాలు తల్లి

ఒడిలా అనిపించాయి. నా గొంతు పూర్తిగా మూగబోయింది. కన్నీళ్ళు ధారాపాతంగా చెక్కిళ్ళను తడుపుతుంటే అలా చూస్తుండిపోయాను. వారు నా వంక ఎంత ప్రేమగా చూస్తున్నారో చెప్పలేను.

ఊదీ ఇస్తూ *"మందిరానికి వెళ్ళావా?"* అని అడిగారు. ఆ స్వరంలో ఎంతో ప్రశాంతత, ఎంతో మృదుత్వం!

'లేదు' అన్నట్లుగా తలూపాను.

*"మందిరానికి వెళ్ళి రా!"* అన్నారు.

అలాగేనని అక్కణ్ణుంచి వచ్చేశాను. అన్నేళ్ళ తర్వాత కలుసుకొన్న నన్ను చూసి వారు పలికిన ఆ మొట్టమొదటి మాట నాకు ఇప్పటికీ ఆశ్చర్యాన్నే కలుగజేస్తుంది. మా అన్నంటే నాకెంత ప్రేమో, దానికి రెట్టింపు ప్రేమ వారికి నేనంటేనని నాకు తెలుసు. మేము అయిదుమంది తోబుట్టువులమయినా, నేను వారి తర్వాత దాన్ని కావడం వలన, మిగిలిన ముగ్గురికీ వయసు ఎడం వలన చిన్నప్పటి నుండి ఇంట్లో నాతోనే ఎక్కువగా మాట్లాడేవారు. ఆడుకొన్నా, పోట్లాడుకొన్నా మేమిద్దరమే. నేనూ అంతే. ఏ సందేహమైనా, సలహా అయినా అన్ననే అడిగేదాన్ని. ఆంతరంగిక విషయమైనా సరే అమ్మకన్నా ముందు అన్నతోనే చెప్పేదాన్ని. ఇప్పుడు నన్ను చూడగానే 'బాగున్నావా' అనవచ్చు, పిల్లల గురించి అడగవచ్చు లేదా మరేదైనా అడగవచ్చు. కానీ చూడగానే అడిగిందీ, చెప్పిందీ "మందిరానికి వెళ్ళిరా!" అని. నిజానికి చెప్పాలంటే నేను అప్పుడు శిరిడీ వెళ్ళింది నూటికి నూరు పాళ్ళు మా అన్న కోసమే.

అమ్మా, నాన్న తమ్ముళ్ళతో కలిసి బాబా మందిరానికి వెళ్ళి, తిరిగి మళ్ళీ సాయియానాకే వచ్చి కూర్చున్నాను. మా చెల్లెలు మాత్రం నాతో ఉంది. మిగిలిన అందరూ హోటల్‌కి వెళ్ళిపోయారు. వెనుక గదిలో వదిన ఉందని తెలిస్తే వెళ్ళాను. ఇంతలో శ్రుతి వచ్చింది. సంతోషంగా 15, 20 నిమిషాలు అలా మాట్లాడుకుంటూ కూర్చుని ఉండగా, హఠాత్తుగా మా గదిలోకి అన్నయ్య వచ్చారు. ఒక ఆనంద కెరటం గదిలోకి వచ్చినట్లనిపించింది. విశ్రాంతిగా తమ ఆసనంపై కూర్చుంటూ నవ్వుతూ మా వంక చూశారు. *"ఊc! చెప్పు సుచ్చీ. పిల్లలు, మామయ్య (మా వారు) బాగున్నారా?"* అని ఆప్యాయంగా అడిగారు.

ఇంకా ఇంటి విషయాలు అడుగుతున్నారు. నేను సమాధానాలు చెబుతున్నాను. వారు ఎప్పటిలా మామూలుగానే మాట్లాడుతున్నా, నా మనసుకేదో తేడా మాత్రం

తెలుస్తూనే ఉంది. అది వారి ముఖంలో, ముఖ్యంగా ఆ కన్నుల్లో తొణికిసలాడుతున్న ప్రేమ! ఆ ప్రేమ కూడా మనకు బాగా ఇష్టమైనవారిపట్ల మనం చూపే ప్రేమ వంటిది కాదు, దానికన్నా విశిష్టమైనది. ఇంకా చెప్పాలంటే మాటల్లో వర్ణించలేనంత అనిర్వచనీయంగా ఉందది. మానవమాత్రుల్లో చూడలేని దివ్యప్రేమ అని చెప్పవచ్చు. అంతకు ముందుండే ఆ మాట, నవ్వూ తెలుసు. కోపం, విసుగూ తెలుసు. ప్రేమ, ఆప్యాయతలూ తెలుసు. హాస్యం, గంభీరత కూడా చూశాను. కానీ, ఇప్పుడు కనిపించే ఈ మూర్తిలో ఆ భావాలన్నింటికీ అతీతమైన ప్రేమామృతశక్తి ఏదో కనిపిస్తోంది.

చిన్నప్పట్నుంచి కూడా అన్న నవ్వుతూ, నవ్విస్తూ తమాషాగా మాట్లాడుతున్నా, తను గంభీరంగా ఉన్నప్పుడో, ఏదైనా ఆలోచిస్తున్నట్లు ఉన్నప్పుడో దగ్గరకెళ్ళి పలుకరించడానికి మాకు కొద్దిగా జంకుగానే ఉండేది. నేను తనకన్నా చిన్న అనేకాదు, ఎంత పెద్దవాళ్ళైనా సరే ఆయన గంభీరంగా ఉన్నప్పుడు దరిదాపులకెళ్ళే సాహసం చేసేవారు కాదు. ఇప్పుడు నాకెందుకో లోపల నుండి ఆ జంకే కలుగసాగింది. నవ్వుతూనే ఉన్నా కాస్త దూరమైన భావన. బహుశా వారున్న ఆ అత్యున్నత స్థాయి మనకు తెలియకుండానే మనలో భీతి కలుగచేస్తుందేమో!

***భక్తుడు:*** *'మమత సమతల హేల' అంటే ఏమిటి సార్?*

***గురువుగారు:*** *మన బిడ్డ, మనవాడు, మన దూరపు బంధువు అనుకోవడం మమత. అందరిపట్ల సమానమైన ప్రేమ ఉండడం సమత. ఒక ప్రక్క నా వాడిని నేనే ఎన్నుకొంటాను అన్నారు బాబా. తన భక్తునికి అంత రక్షణ ఇస్తున్నారు. మరొక ప్రక్క నాకందరూ సమానమే అంటున్నారు. ఏది కరెక్ట్? ఒక రకంగా చూస్తే మన పట్ల ఆయనకు మమత ఉంది. ఎందుకంటే నా వాడు, నాకు వాడికి ఋణానుబంధముంది అని చెబుతున్నారు. కాబట్టి మన పట్ల మమత చూపిస్తున్నారు. ఆయన చెప్పడంలో మాత్రం సమతే చెబుతున్నారు. ఈ మమత సమతలు ఎక్కడున్నాయి. మన చేత ఆలోచింపచేస్తుంది. అది మమతగా కనిపిస్తుంది కానీ – మామూలు మమత కాదు. పోనీ సమత అందామా అంటే మామూలు సమత కాదు. అదే ఆయన యొక్క హేల (ఆట) మరియు లీల అని చెప్పటం.*

***భక్తుడు:*** *మనసు మబ్బులమాటు మురిపించు నీ మోము అంటే సార్?*

**గురువుగారు:** ఆయన మనలోనే ఆనందస్వరూపంగా ఉన్నాను అన్నారు కదా! కానీ ఆ స్వరూపాన్ని దర్శించకుండా, మనలో ఏం అడ్డమొస్తున్నాయి? మన ఆలోచనలు, మన మనస్సు, రకరకాల టెన్షన్స్, మన కోరికలు ఇవన్నీ అడ్డుకొంటున్నాయి. ఆనందస్వరూపాన్ని మనం చూడలేకపోతున్నాము. ఆ అడ్డాలు మబ్బులలాగా ఉన్నాయి. ఆ మనసులోని మబ్బుల చాటు నుండి, అప్పుడప్పుడు ఒక fraction of second దర్శనమిచ్చి మనలను మురిపించి మరలా మాయమవుతుంటుంది బాబా మోము.

ఈ మురిపాన్ని జాగ్రత్తగా గమనించినట్లయితే మబ్బులు, మబ్బుల మాటు నుండే చంద్రుడు (బాబా) కూడా అందంగానే కనిపిస్తాయి. అపుడు మనసు మబ్బులు కూడా అడ్డుకోవు, బాధించవు. ఒక రకంగా చెప్పాలంటే ఆ దోబూచులాట మురిపెమే అవుతుంది. అది ఒక తమాషా! హేల. మామూలుగా ఉన్న చంద్రుని కంటే మబ్బుల మాటు చంద్రుని చూడండి ఎంత హాయిగా ఉంటుందో! తమాషాగా ఉంటుందో! దాంట్లో కూడా ఒక అందం, ఆనందం ఉంది. మబ్బులు (అడ్డంకులు) ఉంటే మాత్రం ఏమిటట, నాకు అది ఒక మురిపెంలాగా కనిపిస్తుంది.

**భక్తుడు:** అంటే ఈ ఆలోచనలు, ఈ అనుబంధాలు కూడా మనకు అడ్డాలు కావా? మనలను ఆపవా?

**గురువుగారు:** ఆపుతాయి. చంద్రుడున్నాడు. మబ్బుల్లోంచి వచ్చే చంద్రుడి beauty వేరు. మధ్య మధ్యలో కనిపించి మాయమవుతాడు. అయితే చంద్రుడి (బాబా) మీద దృష్టి లేకపోతేనే మనకు ఇబ్బంది. మనకంతా మబ్బులే కనిపించి చీకటి అవుతుంది. అలా కాక మబ్బుల మాటు ఉన్నా సరే మన దృష్టి చంద్రుడి మీద ఉందనుకోండి, అది చంద్రుడి ఆటలాగా ఉంటుంది. హేలలాగా ఉంటుంది. మన మనసులోని మబ్బులు అప్పుడప్పుడు అడ్డం వస్తే రానీకాక, మనలను బాధించవు.

మమత: మనకు, ఆయనకు ఉన్న ఋణానుబంధం, ఆయన పట్ల మనకు ఉన్న అటాచ్‌మెంట్, ఆయన పట్ల మనం పెంచుకొనే ప్రేమ– ఇదే మమత.

మబ్బులు: మనసులోని కోరికలు, ఆలోచనలు, టెన్షన్స్ – ఇవే మబ్బులు.

ఈ కోరికలను తీర్చి, టెన్షన్స్‌ను తీర్చేది కూడా బాబానే. వాటికి మూలం కూడా ఆయనే. ఆయన పట్ల మనకున్న మమత పెరిగి, పెరిగి

*ఈ మబ్బులు మనలను బాధించడం మాని మమత జల్లులే అవుతాయి. ఆ మబ్బులన్నీ (మనోబలహీనత) పోయేటప్పటికి – సమతగా వెలుస్తుంది. ఆ మబ్బులు పోయేదెట్లా అంటే – మమత జల్లులు కురిస్తేనే. అదే దాని భావం. ప్రాస కోసం పెట్టిన పదముల మాయాజాలం కాదది.*

అర్థం చేసుకోలేని రకరకాల భావాలతో నేను అలా సతమతమవుతుండగానే రెండు రోజులు గడిచిపోయాయి.

చాలా రోజుల తర్వాత అన్నను చూశానన్న సంతోషం కన్నా ఏమిటో చెప్పలేనంత దూరంలో నేనున్నానేమో అనే దిగులు ఏర్పడింది. ఆయనెక్కడో ఆకాశంలో ఉన్నారు, ఇంకెప్పటికీ చనువుగా ఉండే ఆ పాతరోజులు రావు కదా అనే ఆవేదన కలిగింది. అయినా ఆ తేజోమూర్తి సన్నిధిలో లభించిన ప్రశాంతత, ఆనందం మాత్రము చాలా గొప్పగా ఉన్నాయి. అలా వారివంక చూస్తూ కూర్చొంటే చాలు ఇంకేమీ అక్కర్లేదు అనిపిస్తుంది. ఆ సన్నిధి ఎంత పెన్నిధో నాకు తెలుస్తుండగానే, మేము వెళ్ళిపోయే రోజు రానే వచ్చింది.

అందరం సాయంత్రం బయలుదేరుతున్నాము. గురువుగారు స్టేజ్‌పై అలసట అన్నది లేకుండా భక్తులకు దర్శనం ఇస్తూనే ఉన్నారు. వెళ్ళేముందు మాతో ప్రత్యేకంగా మాట్లాడడం ఉంటుందో, ఉండదో అనుకొంటూ కూర్చున్నాము. గురువుగారి దగ్గరకు వెళ్ళి ఊదీ తీసుకునే జనం ఏ మాత్రం తగ్గడం లేదు. మాకు టైమ్ అవుతుండడంతో, ఇంక మేము మళ్ళీ క్యూలో వెళ్ళి నమస్కారం చేసుకుని 'వెళ్ళివస్తామని' చెప్పాము. నేనూ, అమ్మా, నాన్న, ఇద్దరు తమ్ముళ్ళు మాత్రం సాయియానాలోనే ఉన్నాము. మిగిలిన వాళ్ళంతా గదికెళ్ళారు. చూస్తుండగానే గురువుగారు లేచి లోపలకు వెళ్ళారు. మమ్మల్ని పిలుస్తున్నారనే కబురు వచ్చింది. ఆనందంగా గదిలోకి వెళ్ళాము. అందరికీ మళ్ళీ ఊదీ ఇచ్చారు. అయిదు పది నిమిషాలు కూర్చుని ఉంటామేమో, టైమ్ అవడంతో "సరే వెళ్ళి రండి" అని సెలవిచ్చారు.

అందరం ఒక్కొక్కరుగా గదిలో నుండి వెలుపలకు వెళుతుంటే, నేను చివరన ఉన్నాను. అప్పుడు 'అయ్యో! వెళ్ళిపోతున్నాన'నే దుఃఖంలో కళ్ళనీళ్ళపర్యంతంగా ఉన్నాను. వెలుపలకు వచ్చి తలుపులు చేరవేస్తుండగా 'సుచ్చీ' అనే పిలుపు వినవచ్చింది.

నా భ్రమేమో అనుకున్నాను, కానీ గురువుగారు మళ్ళీ కాస్త పెద్దగా పిలిచారు. నేను సంభ్రమంగా లోపలికెళ్ళాను. వారు నాతో ఏం మాట్లాడలేదు. తదేకంగా అలా చూస్తూ ప్రక్కనున్న ఒక తెల్లని పూసల దండను తీసుకుని, కన్నులు మూసుకుని ధ్యానం చేసుకుని, బాబా వంకోసారి చూసి దాన్ని మౌనంగానే నా చేతికిచ్చారు. నేను పదిలంగా అందుకున్నాను. 'వెళ్ళిరా' అన్నట్లు ప్రేమగా తల ఊపారు. అంతే వచ్చేశాను. ఆ దండనెంతో అపురూపంగా హ్యాండ్‌బ్యాగ్‌లో దాచుకున్నాను.

నేను శిరిడీ నుండి రావడం, స్థలం రిజిస్ట్రేషన్‌కుగాను పనులు చకచకా పూర్తి అయ్యాయి. ఎలాగో డబ్బు చేతికి అందింది. మాకు స్థలం అమ్ముతున్న వ్యక్తి కాస్త పేచీకోరు. అతనికి మేము లక్షరూపాయలు అడ్వాన్సు ఇచ్చి మూడు నెలలకుగానూ అగ్రిమెంటు వ్రాసుకున్నాము.

'ఆ మూడునెలలలోపు మిగిలిన డబ్బు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే అగ్రిమెంట్ రద్దవుతుంది. ఇంక అడ్వాన్సు మీకివ్వను' అన్నాడట అతను. ఆ అగ్రిమెంట్ గడువుకు ముందురోజు సరిగ్గా డబ్బు మా చేతికి వచ్చింది. ఉదయాన్నే నేను, మా వారు, పిల్లలిద్దరినీ తీసుకుని కారులో కోవూరుకు బయలుదేరాము. "మేము వస్తున్నాము. మధ్యాహ్నానికి నేరుగా రిజిస్ట్రారు ఆఫీసుకొస్తాము. పేపర్లన్నీ రెడీగా వ్రాయించి ఉంచమ"ని నాన్నకు ఫోన్ చేసి చెప్పాము.

కారు గుమ్మడిపూండికి చేరబోతుండగా, నేను మా వారితో "శిరిడీలో అన్నతో ఈ సమస్య గురించి చెప్పాను. అందుకే ఇదింత వెంటనే సానుకూలపడింది. అన్న నాకు దండ ఇచ్చారు. ఆ దండను తీసుకొస్తున్నాను. ఇక మీదట ఏదన్నా ముఖ్యమైన పనులమీద వెళ్ళేటప్పుడు ఆ దండను దగ్గరుంచుకొందాం!" అన్నాను.

మా వారూ 'అలాగే చేద్దాం' అన్నారు.

మేమిలా మాట్లాడుకొంటూనే ఉన్నాము. మా కారు వేగంగా వెళ్ళి ఎదురుగా వస్తున్న లారీకి గుద్దుకొంది. పెద్దశబ్దం, విండో గ్లాసెస్ అన్నీ భళ్ళున పగిలి పొడిగా రాలడం మాత్రమే తెలిసింది. తర్వాత తేరుకుని చూస్తే డ్రైవరుకు బాగా దెబ్బలు తగిలాయి. కాళ్ళూ, ఛాతీ అదుముకోవడంతో అతడు రక్తసిక్తంగా ఉన్నాడు. ఫ్రంట్ సీటులోనే కూర్చొని ఉన్నా మా పెద్దపాపకి ముఖాన కొద్దిగా గీరుకోవడం తప్ప ఏమీ కాలేదు. మా వారికి రిబ్స్ దగ్గర చిన్న క్రాక్ ఏర్పడ్డది. నాకూ చిన్న గాయాలే, చిన్న పాపకైతే అసలు చిన్న గీతంత కూడా దెబ్బలేదు. యాక్సిడెంట్ అని పరుగున

చేరిపోయిన జనమంతా ఆ ప్రమాదంలో నుండి అతి స్వల్ప గాయాలతో బయటపడిన మమ్మల్ని చూసి, ఇంత పెద్ద యాక్సిడెంట్ అయింది. కారు వెళ్ళి లారీకి గుద్దుకొన్నది. అయినా వీళ్ళకేమీ కాలేదే? అని ఆశ్చర్యపడ్డారు!

తర్వాత మమ్మల్ని ఒకతను తన కారులో ఎక్కించుకుని తీసుకెళ్ళి ఫస్ట్ ఎయిడ్ చేయించి, మా కోసం మద్రాస్‌కు ఫోన్‌చేసి మరో కారు తెప్పించి, మమ్మల్నీ మా లగేజిని భద్రంగా అందులో ఎక్కించి మరీ వెళ్ళాడు. ఇదంతా జరిగిన రోజు గురువారం కావడం, ఆ సహాయం చేసిన వ్యక్తి కారులో ముందు చక్కని సాయిబాబా విగ్రహం ఉండడం ఇక్కడ గమనించాల్సిన విషయం. ఊరికి బయలుదేరబోతున్న తరుణంలో నన్ను ఒక్కదాన్ని వెనక్కి పిలిచి, సాయిబాబా వంక చూసి ప్రార్థించి గురువుగారు ఆ దండ నాకు ఎందుకిచ్చారో అప్పుడర్థమయింది. జరుగనున్న ఈ ఘోరప్రమాదాన్ని తప్పించడానికే రక్షణ కవచంగా మాకు ఆ దండను ప్రసాదించారు. ఆనాడు గురువుగారలా కాపాడకపోతే మా కుటుంబం మొత్తం అంటే నలుగురమూ ఆ మేజర్ యాక్సిడెంట్‌లో చనిపోయి ఉండేవారమేమో! ఆ విధంగా తొలిసారి మా కుటుంబానికి వారిచ్చిన పెద్ద అనుభవం, ప్రాణదానం! వారిచ్చిన పునర్జన్మతోనే 'సాయిపథం'లోకి మా అందరి జీవితాలు ప్రవేశించాయని చెప్పవచ్చు.

అది అక్టోబర్‌లో జరిగింది. జనవరి ఫస్టుకు మా వారు ఒక్కరే శిరిడీ వెళ్ళారు. ఆయనకు అక్కడి వాతావరణము, పద్ధతులు అన్నీ క్రొత్తగా కనిపించాయి. తాను వచ్చాననగానే తనను గురువుగారు పిలిపించుకొంటారనుకొంటే, ఎంతకీ లోపల నుండి పిలుపు రావడంలేదు. ప్రొద్దుననగా వెళితే సాయంత్రందాకా కూడా పిలువక పోవడంతో మా వారికి కోపంగా, అసహనంగా అనిపించసాగింది. గురువుగారికి ఇప్పుడు అందరూ సమానమేనన్నది మనకు ఎలా తెలుస్తుంది? మన బంధాలు, బాంధవ్యాల చట్రంలో నుండే కదా మనం చూస్తాము.

మా వారూ, గురువుగారూ చిన్నప్పటి నుండి ఒకరితో ఒకరు ఎంతో ఆత్మీయంగా ఉండేవారు. మేనమామ, అల్లుడులానే కాకుండా ప్రాణస్నేహితుల్లా మెలిగేవారు. అరమరికలు, దాపరికాలు లేని సాన్నిహిత్యం వారిది. అటువంటిది తాను వచ్చానని తెలిసీ ఇంతవరకూ పలుకరించకపోవడమేమిటని ఈయనకు లోలోపల బాధ పెరిగి పోతున్నది. దర్శనాలు ఏమీ అక్కర్లేదు వెళ్ళిపోదాం అనుకుంటున్నంతలో లోపల నుండి 'గురువుగారు పిలుస్తున్నారు' అన్న కబురు వచ్చింది. వెళ్ళి మామూలుగా,

ఎప్పటిలాగానే చనువుగా మాట్లాడారు కానీ నమస్కారం కూడా చేసుకోలేదు. దైవాన్ని మనమెలా పిలిస్తే అలా పలుకుతారు. అందుకే గురువుగారు ఈయనతో మామూలుగానే మాట్లాడారు. ఆ మరునాటి నుండి మొదలైంది 'మార్పు' అనే ప్రహసనం. రోజంతా ఖాళీగా ఉంటున్నాను కదా అని గురువుగారి సత్సంగం క్యాసెట్లు వినడం మొదలుపెట్టారు మా వారు. మొదటి నుండీ గురువుగారు తెలివైనవానిగా, బ్రిలియంట్ స్టూడెంట్‌గా, వాదనల్లో దిట్టగా, విషయ పరిజ్ఞానమున్నవానిగా తెలిసే ఉన్నా, ఆ క్యాసెట్లలో గురుబంధువుల ప్రశ్నలకు వారిచ్చే సమాధానం వింటుంటే ఈయనకు మహా ఆశ్చర్యం కలుగసాగింది. ఆంగ్లేయుల సత్సంగంలో అయితే అసలు ఒక్కోసారి వారి ప్రశ్నే అర్థం కాకపోతుంటే, దానికి వారిచ్చే సమాధానం ఎంతో విశ్లేషణాపూర్వకంగా మహత్తరంగా ఉంది.

కొన్ని ప్రశ్నలప్పుడు 'ఆ ప్రశ్న అలా కాదు అడగవలసింది' అని ప్రశ్న అడిగే తీరునూ సవరిస్తుంటే, 'అవును గురూజీ. నిజానికి మా ప్రశ్న అదే కానీ, ఎలా అడగాలో అర్థం కాలేదు!' అని అడిగినవాళ్ళు నీళ్ళు నములుతున్నారు.

ప్రశ్న మహాగొప్పదేమి కాకపోవచ్చు. కానీ దానికొచ్చే సమాధానం మాత్రం మహా అద్భుతంగా ఎంతో సమాధానపరిచేదిగా ఉంది. ప్రొద్దున్నుండి సాయంత్రం దాకా ఒక క్యాసెట్టు తర్వాత మరొకటి అలా సత్సంగాలన్నీ వింటున్నకొద్దీ మా వారిలో ఏవో అపోహల తెరలు తొలగిపోతున్నట్లుగా అనిపించసాగింది. ఆ తొలగిన తెరల వెనుక ధవళవస్త్రధారి అయిన ఒక దివ్యరూపం కనిపించసాగింది. అదే గురువుగారి రూపం!

ఆ రోజే బయలుదేరి వచ్చేయాలి మా వారు. ఊరికి వెళ్ళేముందు అందరికీ ఊదీ దర్శనం ఇచ్చినట్లుగానే, మా వారిని కూడా గురువుగారు పిలిచారు. ఒక్క రోజులో ఈయనలో ఎంతో పరిణతి వచ్చింది. గదిలోకి వెళ్ళగానే ముందురోజు ఎలా చిరునవ్వుతో ఆహ్వానించారో అలానే పిలిచారట గురువుగారు. ఈయనకు మాత్రం అక్కడ ఒక దైవస్వరూపమే కూర్చొని ఉన్నట్లు తోచిందట. తెల్లని బట్టల్లో పైకి అతి సామాన్యంగా కనిపించే ఆ రూపంలోనే ప్రస్ఫుటంగా కనిపిస్తున్న ఒక మహాత్ముని దర్శనం చేసుకోగలిగారు. వెళ్ళి నమస్కారం చేసుకున్నారట. ప్రసన్నంగా, ఆప్యాయంగా నిన్నటిరోజున ఎలా మాట్లాడారో అలాగే మాట్లాడారు గురువుగారు. కానీ ఈయన ముందురోజు మాట్లాడినంత ఫ్రీగా మాట్లాడలేకపోయారు. కొద్దిసేపయిన తర్వాత సెలవు తీసుకుని మా వారు లేచి వచ్చేస్తుంటే, గ్లాస్‌డోమ్‌తో ఉన్న చిన్న సాయిబాబా

విగ్రహాన్ని "పూజలో పెట్టుకోమ"ని చేతికిచ్చారట గురువుగారు. అంటే మొదట మాకు జీవితాన్ని ఇచ్చారు. ఆ తర్వాత జీవితాలు అర్థవంతమయ్యేందుకు చేసుకోవలసిన సాధనగా శ్రీసాయిబాబాను ఇచ్చారు!

మా వారు శిరిడీ నుండి సంపూర్ణమైన ఆనందంతో, తృప్తితో ఆ విగ్రహాన్ని తీసుకుని మా వద్దకు వచ్చారు. గురువుగారు ఇచ్చిన బాబా విగ్రహాన్ని మా వారు ప్రతి రోజూ పూజించుకొంటున్నారు.

ఒకసారి గురువుగారు మద్రాసులో ఉండగా మేమందరం వెళ్ళాము. ఆ మరునాటి ఉదయమే గురువుగారు శిరిడీ ప్రయాణమవుతున్నారు. ప్రయాణానికి కావలసిన ఆహారపదార్థాలు తయారుచేసేందుకని నేను అక్కడే ఆగిపోయాను. పిల్లలు ఇంటికి వెళ్ళిపోయారు. అప్పుడు మాతో మా అమ్మ కూడా ఉంది. కొద్దిసేపటికి గురువుగారు అమ్మనీ, మమ్మల్నీ పిలుస్తున్నారని కబురు వచ్చింది. నేను, మా వారు, మా అమ్మ పైకి వెళ్ళాము. మేడపైన బాల్కనీలో ఒక సోఫా ఉంది. ఎదురుగా తివాచీ పరచి ఉంది. అమ్మని చూడగానే గురువుగారు "రా అమ్మా" అంటూ ఆప్యాయంగా చేయి పట్టుకుని తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టి, తనూ మా ఇద్దరితోపాటూ తివాచీపై కూర్చున్నారు.

తనకు బిడ్డే కావచ్చు కానీ వారు లోకమంతా పూజించే మహాత్ముడు! అందుకే అమ్మ కంగారుగా 'అయ్యో, నువ్వు కూర్చో నాయనా ఇక్కడ' అంటూ లేవబోయింది.

"కూర్చో అమ్మా" అంటూ చిరునవ్వుతో ఆమెను వారించి ఆమె ఆరోగ్యం, నాన్న ఆరోగ్యం గురించి అడుగసాగారు.

ఎంత మనోహరదృశ్యమది! జగద్గురువే అయినా తల్లి దగ్గర ఒక తనయునిలానే ఉన్నారు. నిజంగా పరిపూర్ణత్వం అంటే ఏమిటో నాకా సద్గురుమూర్తిలో అప్పుడు కనిపించింది. తరువాత మా విషయాలన్నీ అడుగుతూ పిల్లల ప్రస్తావన రాగానే *"గురుపూర్ణిమకు వాళ్ళనూ శిరిడీ తీసుకొస్తున్నారా?"* అని అడిగారు.

మేమింకా అప్పటికేమీ అనుకోలేదు. అదే చెబుదామనుకొంటున్నంతలో వారే అన్నారు *"తీసుకురండి, నన్ను అదే పనిగా అడుగుతున్నారు"* అని. మేము 'అలాగే'నని తల ఊపాము. మరికొద్దిసేపు మాట్లాడుకొన్న తర్వాత సెలవు తీసుకుని, మేము ముగ్గురమూ వచ్చేశాము. ఇంటికి వచ్చిన తర్వాత మాకు అనుమానం వచ్చింది. పిల్లలు వేరుగా గురువుగారిని ఎప్పుడూ కలుసుకొన్నది లేదు. ఎప్పుడైనా వెళితే

మాతో పాటు వస్తారు, మళ్ళీ అందరం కలిసే వచ్చేస్తాము. అలాంటిది, "నన్ను అడుగుతున్నారు గురుపూర్ణిమకు రావాలని" అన్నారే గురువుగారు, మాకు తెలీకుండా వీళ్ళెప్పుడడిగారా అనుకొంటూ అదే మాట పిల్లల్ని అడిగాము.

"నేరుగా అడగలేదు. 'ఫోటో' దగ్గర చెప్పుకొన్నాము" అన్నారు వాళ్ళు.

మేము నివ్వెరపోయాము. 'ఫోటో దగ్గర అడిగారా?!' కానీ గురువుగారెంత క్యాజువల్‌గా చెప్పారంటే, స్వయంగా తననే అడిగినట్లు చెప్పారు!

పైన ఉదహరించినవే కాదు, అసలు మాకు ఏ సమస్య వచ్చినా, కష్టం కలిగినా స్వయంగా వెళ్ళి చెప్పుకొనే అవకాశముంటే సరి లేదా గురువుగారి ఫోటో దగ్గర చెప్పుకున్నా సరే వెంటనే ఆ సమస్య తొలగిపోతుంది. ఆర్థికంగా, ఆరోగ్యపరంగానే కాదు చిన్న చిన్న మానసిక ఆందోళనలు, చిరాకు తెచ్చే విషయాలైనా కొద్దిసేపటికే దూదిపింజల్లా ఎగిరిపోతున్నాయి. సమస్యలు సమసిపోవడమే కాదు కోరికలు తీరడమూ అంతే. ఆనందంగా జీవించడంలోనూ పరిపూర్ణ ఆనందంతో జీవించడం ఎలానో నేర్పిస్తారు. నాకు చిన్నతనం నుండి రచనా వ్యాసంగం మీదుండే ఆసక్తి కొద్దీ నాకు ఏదైనా పని కావాలి, నేను మంచి రచనలు చేయగలగాలి అని అడిగాను. నాకు 'సాయిపథం' పత్రిక పని చెప్పారు.

ఈ విధంగా మనసులోని కోరిక పెదవి దాటకముందే తీర్చే వరదాతలయిన సద్గురునీడలో ఉండగలగడం నిజంగా పూర్వజన్మ సుకృతమే! ఇవన్నీ కాదు ప్రతి రోజూ ప్రతిక్షణమూ వారి సన్నిధిలో అద్భుతంగా గడిచిపోవడమే అన్నిటికీ మించిన అపురూపానుభవంగా నిలిచిపోవాలన్నదే మా ఆకాంక్ష. అయినా సద్గురు చరణాలకు ఒక్కసారి శరణన్నాక, ఇక ప్రతిక్షణమూ ఓ దివ్యానుభవమే కదా!

# సాకోరీ మాతాజీ

సంకా మోహన్‌రావు గుప్తా
కాంట్రాక్టర్, ఒంగోలు
జన్మించిన సం॥ 1950

శిరిడీ, డిసెంబర్ 2001

1992 ఆగష్టులో నేను శిరిడీలో గురువుగారి వద్ద కొన్ని రోజులున్నాను. అప్పుడు జరిగిన ఒక అద్భుత సంఘటనను కనులారా చూడగలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఒకరోజు సాయంత్రం, మూడుగంటలప్పుడు శిరిడీ సంస్థాన్ హాస్పిటల్లో హెూమియోపతి డాక్టరైన శ్రీబాక్లీవాలా ఫోన్‌చేసి మరికొద్దిసేపట్లో సాకోరి మాతాజీ గురువుగారి దగ్గర మందు తీసుకోవడానికి సాయిపథంకు రాబోతున్నారని చెప్పారు.

“సాకోరీ మాతాజీ?!” ఒక్క నిమిషం నన్ను నేను నమ్మలేకపోయాను. కారణం ఆమె ఉపాసనీబాబా చేత నియమించబడిన గోదావరి మాతాజీ వారసురాలు. వారు తమ ఆశ్రమం నుండి ఎప్పుడూ బయటకు రారు.

సాయంత్రం నాలుగు గంటలకు మాతాజీ, ఇద్దరు కన్యల (సన్యాసినుల)తో కలసి గురువుగారు నివసిస్తున్న “సాయిపథం”కు విచ్చేశారు. ఆమెకు దాదాపు అరవై ఏళ్ళుండవచ్చు. ఆరోగ్యం బాగున్నట్లు లేదు. ఆమె బలహీనంగా ఉన్నందున వెంట వచ్చిన సన్యాసినులు చెరోవైపు పట్టుకుని నడిపించుకొచ్చారు.

వాళ్ళు వచ్చి గురువుగారి దగ్గర కూర్చున్న తర్వాత, అమ్మగారు (గురుపత్ని) వాళ్ళకు మంచినీరు, బోర్న్‌విటా తీసుకొచ్చి ఇచ్చారు. మాతాజీ ఎవరేం ఇచ్చినా తినరు, తాగరు. అటువంటిది అమ్మగారిచ్చినవి సేవించడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆ తర్వాత మాతాజీ, తనను బాల్యం నుండి వేధిస్తున్న కడుపునొప్పి గురించి గురువుగారికి చెప్పి మందు ఇవ్వమని అడిగారు. ఆ రోజులలో గురువుగారు హెూమియో వైద్యం చేస్తూ, రోగులకు ఉచితంగా మందులిచ్చేవారు. ఎక్కడా నయం కాని దీర్ఘ వ్యాధులు సైతం గురువుగారి చేతి మందుతో నయమయ్యేవి.

గురువుగారు ఆమె జబ్బు లక్షణాలన్నీ వివరంగా అడిగి మందు ఇచ్చారు. ఏయే వేళల్లో, ఎంతెంత మోతాదు వేసుకోవాలి అన్న వివరమంతా తెలుసుకుని, మాతాజీ గురువుగారికి ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయారు. ఒక వారం తర్వాత మాతాజీ దగ్గర నుండి గురువుగారికి ఒక ఉత్తరం వచ్చింది.

ఉత్తరం మరాఠీలో ఉండడంతో పొరుగున ఉన్న భరత్‌పాటిల్‌గారిని ఉత్తరం చదివి చెప్పమన్నాము. ఉత్తరం చదివి, అందులోని సారాంశాన్ని ఆనందోద్వేగంతో ఆయనిలా చెప్పారు "గురువుగారి ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నప్పుడే మాతాజీని దీర్ఘ కాలంగా బాధిస్తున్న కడుపునొప్పి తగ్గిపోయిందని, అది కేవలం గురువుగారి దర్శన మహిమ వలననే జరిగిందని, అందుకని మందు కూడా వాడలేదని" ఆమె వ్రాశారట. మరొక అద్భుత విషయం: "గురువుగారి సన్నిధిలో కూర్చున్నంతసేపూ ఆమెకు గురువుగారి స్థానంలో శ్రీసాయిబాబానే దర్శనమిచ్చారట".

చివరగా, కొద్దిరోజుల్లో వారి ఆశ్రమంలో జరుగనున్న యజ్ఞయాగాదుల్లో తాను గంటలకొద్దీ కూర్చోవలసి వస్తుందనీ, తనకు ఆ శక్తినీ, బలాన్ని అనుగ్రహించమని గురుదేవులనర్థిస్తున్నాననీ వ్రాశారట.

భరత్‌పాటిల్ ఉత్తరం చదవడం పూర్తయిన కొద్దిసేపటిగ్గాని నేను ఆశ్చర్యం నుండి తేరుకోలేకపోయాను. మాతాజీ అంటే సాకోరి ఆశ్రమాధికారిణిగా ఉన్నత స్థానంలో ఉన్నామె. అటువంటి మాతాజీకి గురువుగారు ఒకే ఒక దర్శనంతో బాల్యం నుండీ వేధిస్తున్న కడుపునొప్పి నుండి విముక్తినివ్వడమే కాదు, శ్రీసాయి దర్శన భాగ్యాన్ని కూడా ప్రసాదించారు.

ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన నాకు, ఇంతటి శక్తిసమన్వితమైన గురువుగారి సాన్నిధ్యాన్ని పొందగలగడం ఎన్ని జన్మల పుణ్యఫలమో! అనిపించింది.

***గురువుగారు:*** *మహాత్ముల ద్వారా ప్రకటమయ్యే అలౌకిక, అద్భుత చర్యల వెనకున్న మెకానిజమ్ గురించి భగవాన్ చెప్పే ఉన్నారు. జ్ఞాని మనస్సును కోరినవన్నీ ఇచ్చే చింతామణితో పోల్చారు భగవాన్. ఒకసారి జ్ఞాని వద్దకు వెళ్ళి వారికి మీకున్న బాధలు గురించి చెప్తే, అది వారికి చేరిన వెంటనే ఒక్కొక్కటీ నివృత్తి అవటం ప్రారంభం అవుతాయి. జ్ఞాని విశ్వం అంతటా వ్యాపించిన చైతన్యంతో తాదాత్మ్యం చెంది ఉంటారు కాబట్టి ఆయన సంకల్పానుసారం జగత్తులో మార్పులు వచ్చి మీ బాధలు తీరుతాయి. ప్రజలు వాటినే లీలలు (మిరకల్స్) అంటారు. అవి ఒక సందర్భానికి అనుగుణంగా వ్యక్తమవ్వాలి. అది ఒక చమత్కారం కాగూడదు. బాబా*

ఏం చమత్కారాలు చేశారు? ఆయన ఎప్పుడయినా విభూది, ఇంకా ఏదైనా సృష్టించారా? అటువంటి వాటిని ఆయన చమత్కారాలన్నారు. ఆయన 'నేనెప్పుడూ చమత్కారాలు చేయను' అని నిర్ధారణగా చెప్పారు. అటువంటి చమత్కారాలు చూసి మోసపోవద్దని ప్రజలను హెచ్చరించే వారు. ఆర్తితో వచ్చిన భక్తుడికి వెంటనే మహాత్ముడి పట్ల నమ్మకం కలిగించాలి. ఆయనే ఈ సృష్టి మొత్తం ఆవరించి ఉన్న చైతన్యమని ఆ ఆర్తుడికి తెలియాలి. అదే ఆ ఆర్తుడి అన్వేషణకి చివరి మజిలీ కూడా. లీల ఎప్పుడూ ప్రబోధాత్మకంగానే ఉండాలి. అది చవిచూచిన ఆర్తునిలో పరివర్తన తీసుకుని రావాలి. బాబా చేసిన ఏ లీలనైనా చూడండి. ఆయన లీల ఎప్పుడూ ప్రబోధాత్మకంగానే ఉండేది. లీలలంటే ఇంద్రజాల, మహేంద్రజాల విద్యలు కాదు. ఆయనెప్పుడూ అలా చేయలేదు.



శరణన్న వారిని కరుణించు

# క్రొత్త జీవితం

పట్నం మునికోటి
చేనేతకారుడు, వెంకటగిరి
జన్మించిన సం॥ 1980

వెంకటగిరి, జూన్ 2004

నాకు పదిహేను సంవత్సరాలు నిండేవరకు అందరు కుర్రవాళ్ళ వలె హాయిగా ఆడుతూ పాడుతూ కులాసాగా తిరిగేవాడిని. నా పదహారవ ఏట నుండి తరచూ జ్వరం వస్తుండడంతో ముందు మా ఊరిలోను, తర్వాత నెల్లూరు, తిరుపతిలోను డాక్టర్లకు చూపించాము. అందరూ ఎక్సరేలు చూసి, నాకు వెన్నెముక సరిగా లేదని మద్రాసులో స్పెషలిస్టుకు చూపించమన్నారు. అక్కడ ఎమ్.ఆర్.ఐ. స్కాన్ చేశారు. అప్పటికే నేను కాళ్ళు పట్టిన వాడిలా నడిచేవాడిని. ఆ రిపోర్ట్స్ ప్రకారం వెన్నుపూసలో వంపు ఉన్నట్లు తెలిసింది. "క్రమేణా రక్తప్రసరణ ఆగిపోయి, కాళ్ళు పూర్తిగా చచ్చుబడతాయి. ముందు ముందు ఇక ఈ అబ్బాయి నడిచేది కష్టం" అని చెప్పారు డాక్టర్లంతా.

"ఆపరేషన్‌కు నాలుగైదు లక్షలు అవుతుందని, చేసినా నయమయ్యే అవకాశాలు చాలా తక్కువని, ఒక్కోసారి ప్రాణాపాయం కూడా సంభవించవచ్చని" చెప్పారు.

దాంతో మా వాళ్ళు భయపడి నన్ను ఊరికి తీసుకొచ్చేశారు. ఆ తర్వాత నేను పూర్తిగా గదిలోని మంచానికే పరిమితమైపోయాను. నా రెండు కాళ్ళు చచ్చుబడి పోయాయి. కాలకృత్యాలకు వెళ్ళాలన్నా, పైకి లేవాలన్నా ముగ్గురు మనుషుల సహాయం కావలసి వచ్చేది. అట్లా ఆరు సంవత్సరాలు గడిచాయి. మా ఇంట్లోవాళ్ళు రకరకాల పూజలు చేయించారు, మంత్రాలు వేయించారు. ఏవీ పని చేయలేదు. మా ఇంటి ఎదురుగానున్న మా మామయ్య వాళ్ళింటిలో సాయిబాబా సత్సంగం జరుగుతుండేది. నేను రోజూ బాబా ఊదీ పెట్టుకొని, వాళ్ళతో పాటు బాబా నామం చెప్పుకొనేవాడిని. బాబా, గురువుగారి ఫోటోలను చూస్తూ నాకు కాళ్ళు బాగవ్వాలని ప్రార్థించుకొనేవాడిని.

2001 డిసెంబరు 9వ తేది గురువుగారు సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ చేయడానికి తిరుపతి వచ్చారు. మా వాళ్ళు నన్ను తిరుపతి తీసుకెళ్ళారు. అక్కడ గురువుగారు అంత జనసమూహంలో కూడా మా సత్సంగంలోని ఒకరికి స్వీట్

ప్యాకెట్ ఇచ్చారు. ఆ ప్రసాదాన్ని మేమందరమూ ఆనందంగా పంచుకొని తిన్నాము. నేను 'నాకు కాళ్ళు బాగవ్వాలని, నడవగలగాలనీ' గురువుగారిని వేడుకుంటూ ఉత్తరం వ్రాసి సత్సంగంలో పెట్టాను.

గురువుగారి దర్శనం చేసుకున్న తర్వాత నా ప్రార్థనలు ఫలిస్తూ నాకు క్రమంగా కాళ్ళలో స్పర్శ తెలియసాగింది. నేను కొద్దిగా కాళ్ళు కదల్చగలిగాను.

ఒకరోజు ఉదయం, మా అన్న రోజూలాగ దగ్గరకు వచ్చి నేను కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం నన్ను లేపేందుకు ఇంట్లో మరొకర్ని పిలుస్తుంటే, నేను మా అన్న ఒక్కడి సహాయంతోనే పైకి లేవగలిగాను. మా ఇంట్లో అందరూ ఇదంతా నేను గురువుగారికి ఉత్తరం వ్రాసుకొన్నందువల్లే జరిగిందని అన్నారు. ముగ్గురు మనుషుల సహాయంతో కానీ పైకి లేవలేని నేను, నా అంతట నేనే కాళ్ళు కదల్చడం చూసి వాళ్ళందరి సంతోషం చెప్పనలవి కాలేదు.

'గురువుగారి దయ వలన నువ్వు త్వరలోనే మామూలుగా నడుస్తావు చూడు' అంటూ అందరూ నా చుట్టూ చేరి నన్నెంతో ఉత్సాహపరిచారు. నా చేయి పట్టుకొని గది వెలుపలకు, అటు ఇటూ కొద్దిసేపు నడిపించారు. సత్సంగం జరిగే ఇంటిదాకా గోడ పట్టుకొని మెల్లగా నేనే నడిచి వెళ్ళాను. తర్వాత గోడ వదిలేసి చిన్నగా అయిదారు అడుగులు వేయగలిగాను. నన్నట్లా చూస్తున్న అందరికీ ఎంతో విస్మయం! నేనలా సత్సంగంలోని బాబా, గురువుగారి ఫోటోలదాకా నడవగలిగాను. ఆ రోజు అందరి కళ్ళల్లోనూ ఆనందభాష్పాలే. రోజులో ఇరవై నాలుగు గంటలూ మంచంపైనే గడిపిన నేను ఆరు సంవత్సరాల తర్వాత బయట ప్రపంచంలోకి అడుగుపెట్టగలిగానన్న మహదానందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఏప్రిల్‌లో ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవానికి వచ్చిన అమ్మగారిని కలిసి, నా విషయమంతా గురువుగారికి విన్నవించమని మనవి చేసుకున్నాను.

ఆ తర్వాత మూడు నెలల్లో ఎంతో అభివృద్ధి కనిపించింది. అంతకు ముందు కాళ్ళలో సూదితో పొడిచినా చలనం ఉండేది కాదు. వ్రేలాడిపోతుండేవి. క్రమంగా కాళ్ళలో నవజీవం వచ్చింది. మెల్లగా నేను నడవగలుగుతున్నాను. మగ్గం పని చేస్తూ నా జీవనోపాధికి సరిపడా సంపాదించుకోగలుగుతున్నాను. ప్రతిరోజూ సాయంకాలం, సాయిబాబా సత్సంగం జరిగే చోట మందిరంలో మైక్ సెట్ అమర్చడం, భక్తులందరూ

కూర్చునేందుకు చాపలు పరవడం వంటి పనులు కూడా చేయగలుగుతున్నాను. నాకు ఇలా క్రొత్త జీవితాన్ని ప్రసాదించిన గురువుగారినే స్మరించుకొంటూ, బాబా నామాన్ని జపించుకోవడం నాకు ఎనలేని ఆనందాన్ని కలిగిస్తోంది.

***భక్తుడు:*** *మాకు ఎందుకు అభద్రతా భావం (insecurity) ఉంటుంది?*

***గురువుగారు:*** *మనం అయిదు నిమిషాలు ఊపిరి ఆపివేయగలమా? ప్రయత్నించు. మనం ఊపిరి పీల్చాలా వద్దా అనేది కూడా మన చేతిలో లేదు. మనం ఎక్కడ పుట్టాలో, ఎప్పుడు పుట్టాలో, ఏ కుటుంబంలో పుట్టాలో మనకు తెలియదు. మన జీవితానికే అర్థం తెలియదు. మరి ఇన్‌సెక్యూరిటీకి అది చాలదా? అందుకనే secureగా, control ఉండే బాబాను ఆశ్రయిస్తాం. ఆయనకు ఏమైనా చేయగలిగే శక్తి ఉంది. ఆయన్ని ఆశ్రయించడం వల్ల పరోక్షంగా ఆయన శక్తి మనకూ వస్తుంది.*

# సద్గురు కృపకు సాకారం

సుందర వెంకట సత్యనారాయణ
గవర్నమెంట్ ఉద్యోగి, హైదరాబాద్
జన్మించిన సం॥ 1948

హైదరాబాద్, జూలై 2001

నేను ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్నాను. మా అమ్మాయి రాధికకు 1989లో వివాహం జరిగింది. వివాహమైన రెండు సంవత్సరాల నుండి అమ్మాయి ఎక్కడికెళ్ళినా 'ఇంకా పిల్లలు పుట్టలేదా?' అన్న ప్రస్తావన వచ్చేది. అమ్మాయికి, అల్లుడికి పిల్లలంటే చాలా ఇష్టం. కనుక వైద్యపరీక్షలవీ చేయిస్తూ డాక్టర్ల చుట్టూ తిరగడం ప్రారంభించారు. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం ఇలా ఎందరో వైద్యులను సంప్రదించారు. చూస్తూండగానే పెళ్ళయి పది సంవత్సరాలు గడిచిపోవడంతో ఇక తనకు పిల్లలు కలగరేమోనని మా అమ్మాయి దిగులుపడుతుండేది. రాధికకు సంతానం కలగాలని ఎన్నో పూజలు, వ్రతాలు, తీర్థయాత్రలు చేశాము. కనిపించిన దేవునికల్లా మ్రొక్కుకున్నాము. రాధిక పిల్లల కోసమని కటిక పత్యాలు చేసింది, పసర్లు త్రాగింది, మందులు వాడింది, ఆపరేషన్లు కూడా చేయించుకొంది. కానీ ఫలితం కనబడలేదు.

ఎవరైనా పిల్లల ప్రస్తావన తెస్తారేమోనని, రాధిక బంధువుల ఇళ్ళకుగాని, ఎక్కడికైనా వెళ్ళడంగాని మానుకుంది. ఇంట్లో మేమెవ్వరమూ మా అమ్మాయి బాధ చూడలేకపోయేవాళ్ళం. ఒకసారి మేము తిరుపతి వెళ్ళినప్పుడు అక్కడ నా స్నేహితుడు, సహోద్యోగి అయిన భానుమూర్తిగారు కలిశారు. ఆయన మా దిగులు చూసి, మమ్మల్ని శిరిడీలో శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారి దగ్గరకు వెళ్ళమని సలహా ఇచ్చారు.

*శ్రీసాయిని ఆరాధిస్తూ, సాయిలీలలు చవిచూచిన సాయిభక్తులు, శ్రీసాయి అనుగ్రహం అందరిమీద వర్షించాలని కోరుకోవడం సహజం. తమ తమ అనుభవాలను (సాయిలీలలను) తోటివారితో పంచుకోవడం ద్వారా వారు తమకు తెలియకుండానే సాయిప్రచారం చేస్తున్నారని చెప్పాలి. కానీ ఇక్కడ జరిగేది 'పంచుకోవడమే'గాని (తమ సంఖ్యలలో) 'పెంచు*

*కోవడమ'నే ప్రచారకార్యం కాదు. ఎందుకంటే, ఎవ్వరూ ఎవ్వరినీ సాయి భక్తులుగ 'మార్చ'లేరు! మనకు బాబాను గురించి 'తెలియజేసే' వ్యక్తులు, సంస్థలు కేవలం నిమిత్తమాత్రాలు; ఆయా సంఘటనలు, లీలలు – బాబా మాటల్లో చెప్పాలంటే – వివిధ 'మిషలు' మాత్రమే!*

*... శ్రీబాబూజీ విరచిత 'సాయిభక్తి సాధన రహస్యం' నుండి*

1998 అక్టోబరులో మా కుటుంబసభ్యులందరమూ శిరిడీ వెళ్ళాము. శిరిడీలో రెండు రోజులుందామనుకొని తిరిగి వచ్చేందుకు రిటర్న్ టికెట్స్ కూడా తీసుకొన్నాము. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న నారాయణరావుగారితో మా ప్రయాణం గురించి చెప్పగానే, ఆయన నవ్వి "శిరిడీ రావడమే మీ వంతు. రిటర్న్ జర్నీ గురించి ఆలోచించవద్దు. ఎప్పుడు వెళ్ళేది బాబా నిర్ణయిస్తారు అంటారు గురువుగారు. ఇది నా అనుభవం కూడా" అన్నారు.

శిరిడీలో రోజూ మందిరానికి వెళ్ళడం, సాయంత్రం సత్సంగం అనంతరం గురువుగారి పాదదర్శనం చేసుకోవడం, గురుబంధువులు ఏర్పాటు చేసే భోజన ప్రసాదాలు తీసుకోవడం, అసలు కాలగమనమే తెలియకుండా ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా మూడు రోజులు మూడు క్షణాల్లా గడచిపోయాయి. నాలుగవ రోజు రాత్రి మాకు గురువుగారితో మాట్లాడుకొనే అవకాశం దొరికింది. మా అమ్మాయి మాత్రమే కాదు, మా కుటుంబసభ్యులందరమూ కలిసి వారి వద్ద మొరపెట్టుకొన్న ఒకే కోరిక, రాధికకు సంతాన వరమివ్వమని. మా అందరి కోరిక విని, గురువుగారు చిరుదరహాసంతో తలవూపారు.

మరునాడు ఉదయం నారాయణరావుగారు "బాబా సేవ చేసుకొనే అవకాశం వచ్చింది మీరు చేస్తారా?" అని అడిగారు.

మేము ఎంతో ఆత్రుతగా "ఏమిటది?" అని అడిగాము.

"బాబా మందిరంలో హుండీలోని డబ్బు లెక్కపెట్టే పని" అని చెప్పారు.

బాబా హుండీలోని డబ్బులు లెక్కపెట్టే అవకాశం దొరకడమేమిటి? అని మేము ఆశ్చర్యానందాలను వ్యక్తం చేశాము. "మీకెందుకు? గురువుగారి ఆనతయింది. మీరు వెళ్ళండి" అన్నారు నారాయణరావుగారు.

మందిరానికి వెళ్ళిన మమ్మల్ని 'సాయిపథం' నుండి వచ్చామని తెలియగానే సెక్యూరిటీ వారు ఎంతో సాదరంగా లోపలికి తీసుకెళ్ళారు. అక్కడ గత రెండు రోజులుగా హుండీలోని డబ్బు లెక్కించేవారు రావడం లేదని, సంస్థాన్ అధికారులు ఆ గురుతరమైన బాధ్యత నిర్వర్తించేందుకు ఎవరినైనా పంపించమని సాయిపథంను కోరారని తెలిసింది. మరికొందరు గురుబంధువులతోపాటు మాకూ ఈ అవకాశం లభించింది. గురువుగారికి మాపైనున్న ప్రేమకు, కరుణకు ఎంతో పొంగిపోయాము.

అప్పట్లో హుండీలోని డబ్బులు లెక్కపెట్టే పని సమాధి మందిరం పైనున్న గదులలో జరిగేది. సాధారణంగా అక్కడకు స్త్రీలను అనుమతించరట. మా అమ్మాయి అదృష్టమేమో ఆమెనెవ్వరూ అడ్డుపెట్టలేదు. మా కుటుంబంతో పాటు సాయిపథం సభ్యులు దాదాపు పదిహేనుమంది బాబా నామం చెప్పుకొంటూ హుండీలలో వచ్చిన డబ్బును నాణాలు, నోట్లను విడివిడిగా రాసులు పోసి సాయంత్రం వరకు లెక్కించి సంస్థాన్ వారికి అప్పజెప్పాము. వారు మమ్మల్నందర్నీ శ్రీసాయిబాబా విగ్రహం వద్దకు ప్రత్యేకంగా తీసుకెళ్ళి 'క్యూ' నిలిపివేసి బాబాకు ప్రత్యేక ఆరతి ఇప్పించారు. మాకూ బాబా ఫోటోలు, ఊదీ, ప్రసాదాలు ఇచ్చారు. మా అమ్మాయికి ప్రత్యేకంగా వీటన్నిటితోపాటు కొబ్బరికాయ కూడా ఇచ్చారు.

---

***భక్తుడు**: సార్! మనకేదన్నా సమస్యలు వస్తే పూర్వజన్మ ప్రారబ్ధకర్మ వలన జరుగుతుందని అంటారు కదా, మరి వాటిని బాబా ఎలా మార్చగలరు?*

***గురువుగారు**: మామూలుగా సామాన్యంగా జరిగేటువంటి* law *(ధర్మం) చెప్పారు– ప్రారబ్ధం అని. ఈ టేప్‌రికార్డర్ తీసుకుని పైకి విసిరేశాను. క్రింద పడుతుంది. నువ్వు విసిరేసినా పడుతుంది, నేను విసిరేసినా పడుతుంది. ఎవరు విసిరేసినా క్రింద పడడం అనేటువంటిది జరిగి తీరుతుంది. మధ్యలో నువ్వు ఠక్కున పట్టుకున్నావు. ప్రకృతి ధర్మం ఏమన్నా మారిందా!*

*మామూలుగా మన ప్రారబ్ధానుసారంగా కష్టాలొస్తాయి. కాని బాబా మధ్యలో పట్టుకుంటారు. అలా క్యాచ్ చేసినప్పుడు అవి జరగకుండా పోతాయి. ఆయన క్యాచ్‌కి మనం రెడీగా ఉండాలి. రెడీగా అంటే ఆయన దగ్గరకు వెళ్ళడమే. అందుకని ఆయనే అన్నారు మళ్ళా... "నా దగ్గరకొస్తే నీ కర్మ నశిస్తుంది. ప్రారబ్ధం నిన్నేమీ చేయలేదు" అని. వర్షం పడ్తోంది,*

*తడుస్తున్నాము. గొడుగు పట్టుకొంటాం. వర్షం ఆగదు కాని ఆ వర్షంలో మనము తడవము. కాబట్టి ప్రారబ్ధానుసారంగా మనకి ఏమన్నా రానీగాక, బాబా దగ్గరకి పోవడం ద్వారా... వాటి నుంచి మనల్ని రక్షించి భద్రత ఇవ్వగలరాయన. ఆ నేర్పుండేటటువంటివాడు, ఆ శక్తుండేటటువంటివాడే సద్గురువు. మన ప్రారబ్ధానుసారంగా జరుగుతుంటే– మళ్ళా సద్గురువు ఎందుకు మనకు? కాబట్టి బాబా ఏమన్నారంటే– మీ జాతకంగాని, కర్మలుగానీ, ఏమైనా సరే మీరు ఇక్కడకు రానంతవరకే. సద్గురువును ఆశ్రయించిన తర్వాత ఇవేవీ పనిచేయవు. ఆయనను ఆశ్రయించగలగాలి. ఆయనను పట్టుకోగలగాలి. కాబట్టి ఈ ప్రారబ్ధం సంగతేం పట్టించుకోవద్దు. మన విధాత బాబా.*

ఆ రోజు కలిగిన అదృష్టానికి మా జన్మ ధన్యమైందన్న పరమానందంతో మేమందరమూ సాయిపథంకు తిరిగివచ్చాము. కనీవిని ఎరుగని ఇటువంటి ఆనందాన్ని గురువుగారు మాత్రమే అనుగ్రహించగలరని తెలుసుకొన్నాము. శిరిడీలోని ఆ మధురస్మృతులను తలచుకొంటూ మేము విజయవాడకు తిరిగివచ్చాము.

శిరిడీ నుండి వచ్చిన రెండు నెలలకు రాధిక గర్భవతి అయింది. మా ఇంటిల్లిపాది సంతోషానికి అవధుల్లేవు. పది సంవత్సరాలుగా మేము ఎదురుచూసిన కోరిక గురువుగారి వరప్రసాదంగా మాకు చేరింది. గురువుగారి కృపావర్షం మా జీవితాన్ని మార్చేసింది. రాధికకు ఆడపిల్ల పుట్టింది. పాపాయిని మేము సాయి ప్రసాదమని 'సాయమ్మ' అని పిలుచుకొంటున్నాము. ఆ పాప ఆరోగ్యంగా, చురుగ్గా పెరిగి పెద్దవుతూ ఇంట్లో నడయాడుతుంటే బాబా, గురువుగారి అనుగ్రహానికి సజీవ రూపం అనిపిస్తుంది.

# చూపు తాకిన చాలు

కలవగుంట శేషాచార్యులు
రిటైర్డ్ ఉద్యోగి, నెల్లూరు
జన్మించిన సం॥ 1934

నెల్లూరు, జూలై 1998

మా అమ్మాయికి ఎగ్జిమా తీవ్రంగా ఉండేది. దీని వలన ఆమె చేతులనిండా నల్లని, పెద్ద మచ్చలు ఉండి, దురద చాలా ఎక్కువగా ఉండడంతో చాలా బాధపడుతూ ఉండేది. మేము అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం ఇలా అన్నీ ప్రయత్నించి చూశాము. కానీ ఫలితం లేకపోయింది. చివరగా మేము డాక్టర్ నరేంద్ర దగ్గరకు వెళ్ళాం. ఆయన మందు ఇచ్చి, వ్యాధి చాలా ముదిరిపోయిందని, మందులతో నయం కావడం చాలా కష్టమని చెప్పాడు. కానీ ఆయన, తమ గురువుగారు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ ఆశీస్సులుంటే తప్పక స్వస్థత చేకూరుతుందని చెప్పాడు.

ఇది జరిగిన ఒక వారం రోజుల తరువాత, 1992లో గురువుగారు నెల్లూరుకి వచ్చారు. డాక్టర్ నరేంద్ర మా అమ్మాయి చర్మవ్యాధి గురించి వారికి చెప్పాడు. దర్శన సమయంలో గురువుగారికి మా అమ్మాయి చేతులు చూపించి, నయం చేయమని ప్రార్థించాము. గురువుగారు ఆ ఎగ్జిమా మచ్చలను చూసి, మా అమ్మాయి చేతిలో ఊదీని ఉంచి, చేతుల మీద ఊదీని రాయమని చెప్పారు. దర్శనం తరువాత వారు చెప్పినట్లుగానే ఊదీ రాశాము. ఎన్నో సంవత్సరాలుగా వైద్యానికి తగ్గని వ్యాధి, అప్పటి నుండి శీఘ్రగతిన తగ్గిపోవడం చూసి మేము చాలా ఆశ్చర్యపోయాము. గురువుగారి దర్శనం చేసుకున్న తర్వాత వారం రోజులకి ఎగ్జిమా చాలావరకు తగ్గిపోయింది. ఆ తరువాత వారానికి పూర్తిగా నయమైంది, మళ్ళీ రాలేదు. ఇది గురువుగారి అవ్యాజ ప్రేమ మరియు వారి పవిత్ర హస్త మహిమే.

# కృపావర్షం

సుంకర నర్మద
గృహిణి, అనంతపూర్
జన్మించిన సం॥ 1958

నెల్లూరు, జనవరి 2001

చిన్నతనం నుండి నేను జలుబు, తుమ్ములతో తీవ్రంగా బాధపడేదాన్ని. జలుబు కూడా పెద్ద సమస్యా అని ఎవరైనా అనుకోవచ్చు కానీ నాకు జలుబు వచ్చిందంటే ముక్కు నుండి, కళ్ళ నుండి నీళ్ళు ధారాపాతంగా ఇరవైనాలుగు గంటలు కారుతూనే ఉండేవి. చల్లని వస్తువును తాకాలన్నా భయం వేసేది. చివరకు ఫ్యాన్ గాలి కూడా నాకు సరిపడేది కాదు.

ఇ.ఎన్.టి. స్పెషలిస్ట్‌కు చూపిస్తే వారు ఆపరేషన్ చేశారు. కొద్దిగా తగ్గినట్టుండి మరలా అది అంతకు ముందు కంటే తీవ్రంగా వచ్చింది. ఎన్నెన్నో మందులు వాడాము, ఎందరో డాక్టర్లకు చూపించాము. ఏమాత్రం ఉపశమనం కలుగలేదు.

మేము హైదరాబాదులో ఉన్నప్పుడు, 1993లో మొదటిసారిగా శిరిడీ వెళ్ళడం జరిగింది. మాకు గురుదేవుల దర్శనభాగ్యం కలిగింది. కానీ అప్పుడు నా సమస్యను వారితో చెప్పుకోలేదు. 1994లో మాకు హైదరాబాద్ నుండి చిత్తూరుకు బదిలీ అయింది. అక్కడి వాతావరణానికి నా పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా తయారయ్యింది.

1995లో గురువుగారు తిరువణ్ణామలైలో ఉన్నారని తెలిసి నేనూ, మా వారూ వెళ్ళాము. అప్పటికి రెండు వారాలుగా వదలని జలుబు, జ్వరంతో బాధపడుతున్నాను. అటువంటి అనారోగ్యస్థితిలో అంత నీరసంతో తిరువణ్ణామలైకి బస్సులో ఎలా ప్రయాణం చేశానో బాబాకే తెలియాలి. సాయంత్రం గురువుగారి దర్శనానికి వెళ్ళాము. వారి దర్శనార్థం వచ్చిన భక్తులు చాలామంది ఉన్నారక్కడ. వారందరితో పాటు కూర్చోవడానికి కూడా ఓపిక లేకపోవడంతో, అక్కడే ఒక ప్రక్కన పడుకున్నాను. అర్ధగంట తర్వాత మాకు గురువుగారి దర్శనభాగ్యం కలిగింది. వారి సమక్షంలో, నా ఆరోగ్య పరిస్థితి, అన్నేళ్లుగా పీడిస్తున్న జలుబు గురించి చెప్పుకుని, నేను పడుతున్న బాధనంతా వెళ్ళబోసుకున్నాను.

అంతా విన్న గురువుగారు *"అరుణాచలేశ్వరుని ఆలయానికి, శేషాద్రిస్వామి ఆశ్రమానికి వెళ్ళి దర్శనం చేసుకొని రండి"* అని చెప్పారు.

మేము వెంటనే బయలుదేరి వెళ్ళాము. అది వర్షాకాలం కావడంతో జోరుగా వర్షం కురుస్తోంది. పైగా రాత్రి సమయం అవడంతో ఆ చీకటిలో, ఈదురుగాలిలో అలాగే నడుస్తూ అరుణాచలేశ్వరుని గుడికి, శేషాద్రిస్వామి ఆశ్రమానికి వెళ్ళాము. అరుణాచలేశ్వరుని ప్రాంగణంలో మోకాలిలోతు వర్షం నీటిలో మా వారు నా చేయి పట్టుకొని నడిపించాల్సి వచ్చింది. అసలే జ్వరం, జలుబుతో బాధపడుతున్న నన్ను ఈ వర్షంలో, ఈ చలిలో ఎందుకిలా పంపించారు గురువుగారు అనే ఆలోచన. ఒక గంటన్నర తర్వాత తడిసిన బట్టలతోనే మళ్ళీ గురువుగారి దర్శనానికి వెళ్ళి గుడికి, ఆశ్రమానికి వెళ్ళి వచ్చామని చెప్పాము. గురువుగారు పండ్లు, ఊదీ ఇచ్చి "గిరి ప్రదక్షిణ చేసి చిత్తూరుకు వెళ్ళండి" అన్నారు.

మేము మా గదికి వచ్చాము. గిరి ప్రదక్షిణ అంటే పద్నాలుగు కిలోమీటర్లు నడిచేందుకు నాకిక అప్పుడు ఏమాత్రం శక్తి లేదనీ, ఈ వాతావరణంలో నావల్ల అసలే కాదని మా వారితో చెప్పాను. అయితే అప్పటికే నా జ్వరం పూర్తిగా తగ్గిపోయిందనే విషయం నేను తర్వాతగాని గమనించుకోలేదు. మేము గిరి ప్రదక్షిణ చేయకుండానే చిత్తూరు వచ్చేశాము.

***భక్తుడు:*** *బాబా అడిగే రెండు పైసలు దక్షిణ శ్రద్ధ, సబూరి ఎలా సమర్పించాలి గురువుగారూ? అవి మనస్సుకి సంబంధించినవి గదా!*

***గురువుగారు****: బాబాకి సమర్పించేయడం అంటే అవి మన దగ్గర ఉంచుకోకుండా ఉండడం అనిగాదు. శ్రద్ధ, సబూరి రెండూ ఆయనకు సమర్పించేశాను, నా దగ్గరిప్పుడు శ్రద్ధా లేదు సబూరి లేదు అని చెప్పడం కాదు (నవ్వులు). శ్రద్ధ, సబూరిని పాటించడం ద్వారా అవి సమర్పించడం అని. 'ఏమిరా! నీకు శ్రద్ధలేదు' అనంటే, బాబాకు సమర్పించేశానుగా (నవ్వులు) అనడం కాదు.*

***భక్తుడు:*** *గురువుగారూ! బాబా అడిగిన రెండు పైసలు శ్రద్ధ, సబూరిలను ఎలా అలవరచుకోవాలి?*

***గురువుగారు:*** *ప్రేమ ఉన్నచోట, శ్రద్ధ దానంతటదే వస్తుంది. అభ్యాసం చేస్తే వచ్చేది కాదది. ప్రేమ పెరిగే కొద్దీ శ్రద్ధ పెరుగుతుంది. మనకు ఏమైనా ఇష్టమైనప్పుడు ఆ జాగ్రత్త దానంతటదే వస్తుంది. మనకు డబ్బుంటే*

*ఇష్టం కాబట్టి దానిని జాగ్రత్తగా పదిలపరచుకొంటాము. ఇక్కడ మనకు ఆ శ్రద్ధ ఎలా వస్తోంది? వాటికి మనం ఇచ్చే ప్రాధాన్యత, మనకు వాటి పట్ల ఉన్న ఇష్టం వల్లనే కదా? ప్రేమ వలన శ్రద్ధ కలుగుతుంది. అంతేకాని, శ్రద్ధ వల్ల ప్రేమ జనించదు. అది ప్రేమలోనుండే పుడుతుంది. అది ప్రేమ యొక్క విశిష్ట లక్షణం.*

*'సబూరి'ని ఓర్పు (patience) గా అనువదిస్తారు. కాని ఓర్పు అనే పదంలోనే బాధ ఓర్చుకోవడమనే అర్థం స్ఫురిస్తుంది. అందుకే ఇంగ్లీషులో patient కు, patience కు ఒకటే పదం వాడారు. కానీ సబూరి అంటే 'సంతోషంగా నిరీక్షించడం'. అదెలాగంటే నీవు ప్రేమిస్తున్న వ్యక్తి కోసం రైలు మూడు గంటలు ఆలస్యం అయినా రైల్వేస్టేషనులో ఆనందంగా వేచి ఉండడంలాంటిది. అంతేగాని నీ బాస్ కోసం అసహనంగా వేచి ఉన్నట్లు కాదు (నవ్వులు).*

ఆ రోజు గురువుగారు చెప్పినట్లుగా చేయలేకపోయానే అని, ఇప్పటికీ అది గుర్తుకు వచ్చినప్పుడల్లా బాధ కలుగుతూనే ఉంటుంది. నేను కేవలం నా శారీరక శక్తినే అంచనా వేసుకున్నాను కానీ గురువుగారి ఆశీర్వాద బలం, అభయహస్తాన్ని గుర్తించలేకపోయాను. నేను వారి ఆనతిని పూర్తిగా నెరవేర్చలేకపోయినా, గురుదేవుల కరుణ మాత్రం అపారం కనుక ఆనాటి నుండి నన్నెంతగానో బాధిస్తున్న జలుబు తగ్గిపోయింది. ఎన్నెన్నో జన్మల పూర్వ పుణ్యఫలం ఉంటేనే తప్ప గురుదేవుల దర్శనభాగ్యం, వారి పాదాలు సేవించుకోవాలన్న ఆలోచన కలుగవు. ఆ భాగ్యం కలిగించిన మా సద్గురుదేవులను నా తలపు సదా వారి చరణాలపైనే నిలిపేలా వరమివ్వమని ప్రార్థిస్తున్నాను.

# దిగివచ్చే దయతోడ దైవమే

బేవర సరస్వతి
గృహిణి, శ్రీకాకుళం
జన్మించిన సం॥ 1950

శ్రీకాకుళం, జూన్ 2001

2000వ సంవత్సరంలో నా కుడిచేతికి విపరీతంగా దురదలు వచ్చి చేయి బాగా వాచిపోయింది. దురద భరించలేక గోకడంవలన పుండ్లు పడి, వ్యాధి చేతివ్రేళ్ళకు కూడా ప్రాకింది. మా ఊరిలోని డాక్టర్లు పరీక్షించి మందులు ఇచ్చారు. కానీ తగ్గలేదు. ఆ తర్వాత ఎందరో డాక్టర్ల దగ్గరకెళ్ళాను. ఎన్నో మందులు వాడాను. వైజాగ్‌లో చర్మవ్యాధి నిపుణులకు కూడా చూపించాను. అయినా కొద్దిగా కూడా గుణం కనిపించలేదు. రోజులు గడిచే కొద్దీ చేతి నిండా తెల్లని పొక్కులు లేచి అసలు చేయి కనిపించనంతగా వాపు వచ్చింది. ఆ చేతితో ఏ పనీ చేయలేను. విపరీతమైన బాధతో రాత్రిళ్ళు నిద్ర పట్టేది కాదు. భోజనం కూడా చేయలేను. ప్రతి పనికి నా ప్రక్కన ఒక మనిషి ఉండవలసి వచ్చేది. "బాబా, గురువుగారూ! నా బాధ తగ్గించండి" అని రోదించేదాన్ని. కొద్దిరోజులకు ఆ పుండ్లన్నీ చీము కారుతూ చేయి అంతా క్రుళ్ళినట్లు అయిపోయింది. చివరకు డాక్టర్లు ఆ జబ్బుని ఒక రకమైన 'ఎగ్జిమా' అని తేల్చారు. అది ఒళ్ళంతా వ్యాపిస్తే చనిపోతారని కూడా చెప్పారు. నాకు ఈ వ్యాధి తగ్గేది లేదు, నేనిలా చనిపోవాల్సిందే అనే దిగులుతో బాగా కృంగిపోయాను.

అట్లాంటి పరిస్థితుల్లో, 2001లో గురుపూర్ణిమకు శిరిడీ వెళుతున్న మా అమ్మాయి అక్కడ గురువుగారితో నా బాధ స్వయంగా చెప్పుకోవచ్చని, నన్నూ తనతో రమ్మన్నది. నా చేయి అలా పెట్టుకొని పదిమందిలోకి రావడానికి ఎంతో బాధ, సంకోచంగా ఉన్నా గుండె దిటవు చేసుకొని భారమంతా బాబాపై వేసి నేను శిరిడీ బయలుదేరాను. మర్నాడు బయలుదేరుతామనగా అప్పటివరకు నేను వాడుతున్న మందులన్నీ ఆపేశాను.

సాయియానాలో గురువుగారు వేదిక మీదకు వచ్చినప్పుడు వారి దగ్గరకెళ్ళి నా పుండ్ల చేతితోనే గురువుగారి పాదాలు పట్టుకొని కళ్ళ వెంబడి నీళ్ళు కారిపోతుండగా "గురువుగారూ, నాకీ బాధ నుండి విముక్తి కలిగించండి. నేను తట్టుకోలేకున్నాను" అని బిగ్గరగా ఏడ్చేశాను.

అప్పుడు గురువుగారు నన్ను, నా చేతిని అలాగే ఒక నిమిషం చూశారు. ప్రక్కన విడిపువ్వులు ఉన్నా అవి కాక దండలోని బంతిపూలు కొన్ని త్రుంచి ఊదీతో పాటు నా చేతికిచ్చారు. అవి తీసికొని అలా కూర్చున్నానో లేదో వెంటనే చలి జ్వరం వచ్చి శరీరమంతా వణికిపోయినట్లయింది. ఒక పావుగంట తర్వాత యథాస్థితికి వచ్చింది. ఈ జబ్బు వలన నా చేతి చర్మము క్రుళ్ళి, వాసన వస్తూండడంతో నా దగ్గరగా ఎవ్వరూ కూర్చొనేవారు కాదు. నన్ను చూసి అందరూ దూరంగా వెళ్ళిపోతుంటే నాకు చాలా బాధగా అనిపించి మరునాడు గురువుగారి దర్శనానికి కూడా ఉండకుండా గదికి వచ్చేశాను.

ఎందుకమ్మా వచ్చేశావు? అని మా అమ్మాయి వచ్చి అడిగితే 'అందరూ నన్ను చూసి అసహ్యించుకొంటున్నారు' అని ఏడ్చాను. "ఈ ఏడుపేదో గురువుగారి దగ్గరే ఏడ్చుకొందాం రా!" అని అనడంతో మళ్ళీ ఇద్దరమూ సత్సంగహాలుకి వచ్చాము.

ఆ రోజు కూడా జనం నెట్టేస్తున్నా, ఎలాగో గురువుగారి దగ్గరకు వెళ్ళి, మళ్ళీ నా బాధంతా చెప్పుకున్నాను. గురుదేవులు ఊదీ ఇచ్చి నా చేతివంక అలాగే చూశారు. అంతే, ఆ రోజు నుండి నా చేతిపుండ్లు తగ్గడం మొదలైనాయి. ఊదీ తప్ప నేను మరే మందులు వాడలేదు.

బాబా ఊదీ, గురుదేవుల చల్లని చూపే దివ్య ఔషధంగా పనిచేసి నా వ్యాధి పూర్తిగా నయమై పోయింది. ఇంత బాధాకరమైన జబ్బు నుండి రక్షించి, నాకు తిరిగి జీవితాన్నిచ్చిన గురువుగారి పాదాలకు వేల వేల నమస్కారములు చెప్పుకొంటున్నాను.

***భక్తుడు:*** *బాబా దృష్టి అందరి మీదా సమానంగా ఉంటుంది కదా, మరి బాబా దగ్గరకొచ్చి బాబాకి నమస్కరిస్తేనే పనులు అవుతాయి అంటాము. ఎందుకని?*

***గురువుగారు:*** *బాబా దృష్టి అందరి మీదా సమానంగానే ఉంది. మనం ఆయనను అడిగినపుడు ఆయనిస్తున్నారు, అంతే! ఇంగ్లీషులో రెండు పదాలున్నాయి. see, look అని... you see things but you look at a particular thing. అలాగే ఆయన దృష్టి ఎప్పుడూ అందరి మీదా ఉన్నా మనము చేసే ప్రయత్నం వల్ల He starts looking at us. ఇప్పుడు నేను నిన్ను చూస్తున్నానంటే, వీళ్ళందరినీ చూడడం లేదని కాదు.*

వీళ్ళందరినీ చూస్తున్నా. నాకు అందరూ కనిపిస్తూనే ఉన్నారు. కాని నిన్ను చూస్తున్నా. I see all, but I look at you. అదీ తేడా.

**భక్తుడు:** *గురువుగారూ! మనం అడగడం అనేది ఆయన్ను మన వైపుకు త్రిప్పించుకోవడంలాంటిదా?*

**గురువుగారు:** అవును, అడిగి త్రిప్పించుకోవడంలాంటిది. మన అవసరాన్ని బట్టి మనం దానిని draw చేసుకుంటున్నాము. అందుకనే బాబా అన్నది "నా భాండాగారాన్ని తెరచి పెట్టుకొని ఉన్నాను, వచ్చి తీసుకుపోండి" అంటున్నారు. మనం తీసుకోకపోతే, ఎవరో వచ్చారు – పది మంది కలిసి మొత్తం తీసుకెళ్ళారనుకో, "ఆఁ బాబా వాళ్ళకు మాత్రమే ఇచ్చాడు, నాకు ఇవ్వలేదు" అని అనడానికి లేదు. నీవు కూడా తీసుకుపో కావాలంటే. అందుకని బాబా మాటల్లో రెండు రకాలు కనిపిస్తాయి. ఒకసారి "నా దృష్టి అందరి మీదా సమానంగా ఉంటుంది" అంటూనే, ఇంకొకసారి "నన్నెవరైతే స్మరిస్తారో వాళ్ళ మీద నా దృష్టి ఎప్పుడూ ఉంటుంది. వాళ్ళ వెంట నేనెప్పుడూ తిరుగుతూ ఉంటాను, పిలిస్తే పలుకుతాను" అని అంటారన్నమాట.

పిలవకపోతే ఎలా పలుకుతాడండీ? పిలవకుండా ఊరికే 'ఆ', 'ఆ,' అనేవాళ్ళను పిచ్చోళ్ళు అనరూ (నవ్వులు)...

# ఆలోచనొద్దు - అన్నీ పెట్టు

మాకాల మునీంద్ర
టీచర్, వెంకటగిరి
జన్మించిన సం॥ 1956

వెంకటగిరి, జూన్ 1999

మా అబ్బాయి చాలా రోజులనుండి విపరీతమైన జలుబు, దగ్గుతో బాధపడుతూ ఉండేవాడు. నెల్లూరులో చిన్నపిల్లల డాక్టరుకు చూపిస్తే, వాడికి ఊపిరితిత్తుల్లో నెమ్ము ఉందని మందులు వ్రాసిచ్చారు. ఆ మందులు వాడినంత కాలం కొద్దిగా సుమారుగా ఉండేది. మందులు మానివేయగానే జబ్బు తిరగబెట్టేది. వాడిని అలా చూస్తున్న మాకు ఈ జబ్బు నుండి వీడికి విముక్తి ఎప్పుడా అనిపించేది.

గురువుగారు తిరుమలలో ఉన్నారని తెలిసి మా కుటుంబమంతా గురువుగారి దర్శనానికి వెళ్ళాము. నేను గురువుగారితో మా అబ్బాయి ఆరోగ్యం గురించి చెప్పాను. వారు అంతా విని పిల్లవాడికి ఒక కమలాపండు ఇచ్చి తినమన్నారు. గురువుగారికి కొంచెం దూరంలో కూర్చొని ఉన్న నేను 'కమలాపండు వాడి జబ్బుకు అసలు పడదు కదా, మరేంటి గురువుగారు దాన్ని తినమంటున్నారే?!' అని మనసులో అనుకున్నాను.

నేనలా అనుకోవడమే తడవుగా గురువుగారు నా వంక చూస్తూ *"వీడికి కమలాపండే మందులే!"* అన్నారు.

నా అంతరంగాన్ని చదివినట్లుగా అన్న వారి మాటలకు ముందు నివ్వెరపోయిన నేను తేరుకొని, "పెరుగు, టమోటోలన్నా వీడికి ఇష్టం. కానీ వాడి ఆరోగ్యానికి మంచివి కావని, డాక్టరు వాటిని అసలు పెట్టకూడదన్నారు!" అన్నాను మెల్లగా.

*"అలాంటివేమీ పెట్టుకోకుండా వాడికిష్టమైనవన్నీ పెట్టు"* అన్నారు వారు. అంతటితో మా అబ్బాయిని వేధిస్తున్న జబ్బు పూర్తిగా నయమైపోయింది. ఈ సంఘటన గురువుగారి పాదాలయందు మాకు భక్తి విశ్వాసాలను ఇనుమడింపజేసింది.

నాకు కుటుంబంలో ఎన్నో సమస్యలుండేవి. ఒకటి తర్వాత ఒకటి గురువుగారి దయతో అవన్నీ తొలగిపోయాయి. నాకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడినా నేను గురువుగారికి ఉత్తరం వ్రాసుకొంటున్నాను. ఇప్పుడు నాకు జీవితంపట్ల ఒక భద్రతా భావం ఏర్పడింది. నాకు ఏ సమస్య వచ్చినా తీర్చేందుకు ప్రత్యక్ష దైవం అయిన గురువుగారు ఉన్నారు. నాకు ఏది మేలో అదే గురువుగారు చేస్తారు.

# కరుణానుబంధమే ఇది

డా॥ బి. శ్రీనివాసులురెడ్డి
హోమియో వైద్యులు, ఒంగోలు
జన్మించిన సం॥ 1954

ఒంగోలు, జనవరి 2004

గురువుగారితో నా పరిచయం ఒక స్నేహితుడిగా మొదలైనా వారితో సాన్నిహిత్యం పెరిగేకొద్దీ వారిలోని విశిష్ట గుణాలకు, వారి సన్నిధిలో అనుభవించే ప్రశాంతతకు ఆకర్షితుడనై ఎప్పుడూ వారితోనే ఉండాలని కోరుకొనేవాడిని. వారిలోని సత్యసంధత నన్ను వారినంటిపెట్టుకొనేటట్లు చేసింది.

ఒంగోలులో వారితో కలిసివుంటున్న రోజులవి. ఒక సందర్భంలో ఒక తప్పు చేసి, ఆ తప్పును కప్పిపుచ్చుకొంటూ గురువుగారి దగ్గర ఏ విధంగా అబద్ధం చెప్పాలా అని నేను ఆలోచిస్తున్న సమయంలో గురువుగారు “మీ సోర్స్ ఆఫ్ థాట్ కన్నా లోతులో నేను ఉన్నాను” (జాగ్రత్త అన్నట్లు) వేలు చూపిస్తూ తీవ్రస్వరంతో అన్నారు. వారు ఎప్పుడూ నాతో అలా మాట్లాడలేదు. ఒక్కసారిగా అలా అనేసరికి నాలో వణుకు పుట్టి మనస్సు స్తబ్ధమయ్యింది. నా అంతరంగంలో నా ఆలోచనకు రూపు ఏర్పడకముందే నేను చేస్తున్నది తప్పు అని తెలుపగల వారి సర్వజ్ఞతకు అవాక్కయ్యాను.

***భక్తుడు:*** *శిష్యుడు ఎప్పుడో ఒకసారి చేసిన తప్పులు, పాపాలు అన్నీ సద్గురువుకు చెప్పాలా?*

***గురువుగారు:*** *ముఖతా చెప్పటానికి అడ్డంకి ఉన్నట్లయితే, ఖచ్చితంగా ముఖతానే చెప్పాలి. అదే మొదటి stage, తర్వాత ఎప్పుడో కాదు. ‘సద్గురువుకి అన్నీ తెలుసు. వారికి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం ఏమిటి?’ అని జనం అనుకొంటారు. వాళ్ళకేదైనా సమస్య వచ్చినప్పుడు మాత్రం అలా అనుకోరు. గురువుకి అంతా ఏకరువు పెడతారు. ఎప్పుడైతే తమ బలహీనతలను బయటపెట్టాల్సి వస్తుందో అప్పుడే వారికి సద్గురువు సర్వాంతర్యామి అని తోస్తుంది. ఇక్కడ వారికి చెప్పడానికి అడ్డం వచ్చేది వారి అహం. అలాంటప్పుడు వాచా చెప్పడమే మంచిది. దీని వెనుక ఉన్న ఉద్దేశ్యమేమిటంటే, గురువు దగ్గర భక్తుడికి దాపరికం ఉండకూడదు.*

*ఎందుకంటే ఇలా గురువు దగ్గర తప్పులను కప్పిపుచ్చే గుణం ఎన్నో ఇతర భావాలను వ్యక్తం చేస్తుంది. ego ని పోషించడం, గురువు దగ్గర positive image ఇవ్వడం. వారొక image ని maintain చేయడానికి ప్రయత్నిస్తారు. వారు చేసిన గొప్ప పనులు ఏకరువు పెడుతూనే ఉంటారు, తప్పులు చెప్పరు. subconscious గా గురువుని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు.*

*దీనికి సంబంధించి ఒక సామెత కూడా ఉంది: "వైద్యుడి దగ్గర, గురువు దగ్గర ఏమీ దాచకు".*

1991లో, ఒకసారి నాకు రక్తవిరేచనాలు మొదలై విపరీతంగా రక్తం పోతూ ఉండేది. నేను ఎన్నో మందులు వేసుకొన్నా తాత్కాలికంగా తగ్గేది కానీ రెండో రోజుకల్లా మళ్ళీ తిరగబెట్టేది. శిరిడీలో ఉన్న గురువుగారికి ఫోనులో చెప్పుకొంటే, "స్పెషలిస్టుకు చూపించమ"ని చెప్పారు. అప్పటికి దాదాపు ఒకటిన్నర నెల నుండి రక్త విరేచనాలు అవుతూనే ఉన్నాయి.

ఆశ్చర్యం ఏమిటంటే ఒకటిన్నర నెలల పాటు అంత రక్తం పోతున్నా నాకు ఏ విధమైన బాధ, నీరసం లేదంటే అది గురువుగారి అనుగ్రహమే. కాబట్టి వారే తగ్గిస్తారు అన్న నమ్మకంతో ఏ స్పెషలిస్టుకూ చూపించలేదు.

ఉన్నట్లుండి ఒకరోజు రక్తవిరేచనాలు పూర్తిగా తగ్గిపోయాయి. గురువుగారికి వెంటనే తెలియపరుద్దామనుకొంటే వారు శిరిడీలో లేరు. తిరువణ్ణామలైకి వెళ్ళారని తెలిసింది. ఏ రకమైన వైద్యం, మందులు లేకుండానే తగ్గించిన గురువుగారికి, స్వయంగా వెళ్ళి కృతజ్ఞతలు చెప్పుకొందామని తిరువణ్ణామలై వెళ్ళాను. అప్పటికి నాకు తగ్గి వారం రోజులైంది.

గురువుగారు తిరువణ్ణామలైలో రమణాశ్రమంలో దేవరాజ మొదలియార్ కాటేజీలో ఉన్నారని తెలిసి అక్కడికెళ్ళాను. గది తలుపు వెంటనే తీయలేదు. ధ్యానంలో ఉన్నారేమోనని అరగంట అక్కడే ఆగి మళ్ళీ పిలిచాను. పలుకలేదు. రెండు మూడు పిలుపులకు తలుపులు తెరుచుకున్నాయి.

గడియ తీసిన గురువుగారు, నిలబడే శక్తి కూడా లేక, నిస్సత్తువగా వెళ్ళి మళ్ళీ పడుకుండిపోయారు. అంతసేపు వారు నా పిలుపులు విని కూడా లేచే ఓపిక లేక

అలాగే పడుకొని ఉన్నారేమో! గురువుగారు గడ్డం పెరిగి చాలా నీరసంగా ఉన్నారు. గదిలో ఎప్పుడో తెచ్చిపెట్టిన ఇడ్లీలు కాబోలు అలాగే ఉన్నాయి. నాకొక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. ఎంతో ఆందోళనగా "ఏమైంది స్వామీ?" అని అడిగాను.

*"దాదాపు వారం నుండి రక్త విరేచనాలండీ, ఇక్కడకు వచ్చినప్పటి నుండీ మొదలయ్యాయి. వారానికే నాకిలా ఉందంటే పాపం యాభై రోజులుగా మీరు ఎంత బాధపడ్డారో కదా అనిపించింది"* అన్నారు.

గురువుగారి మాటలు బలహీనంగా, ఎక్కడో లోస్వరంలో నుంచి వస్తున్నాయి. ఒక్కసారిగా నాకు ఏడుపొచ్చేసింది. వారం నుండా? అంటే నాకు తగ్గినప్పటి నుండి అన్నమాట. నేను అనుభవించాల్సిన బాధనంతా గురువుగారు అనుభవిస్తున్నారు. కొద్దిసేపు నాకు మాటలు కూడా రాలేదు. అలాగే చూస్తుండి పోయాను. మెల్లగా ఎలాగో మాటలు కూడదీసుకుంటూ, "ఇప్పుడేం చేస్తే ఇవి తగ్గుతాయి?" అని మాత్రం అనగలిగాను.

గురువుగారు అంత నీరసంలోనూ వెంటనే *"ఎలా వచ్చాయో, అలానే పోతాయి!"* అన్నారు.

# కరుణించిన కనుచూపు

బావన కొండయ్య
గవర్నమెంట్ ఉద్యోగి, నెల్లూరు
జన్మించిన సం॥ 1947

శిరిడీ, నవంబర్ 2002

మా అమ్మాయి సురేఖ తన తొలి ప్రసవ సమయంలో కంటి చూపు కోల్పోయింది. వైద్యుడు పరీక్షించి మా అమ్మాయికి ఇక చూపురావడం కష్టమని చెప్పాడు. కాకపోతే కొన్ని మందులు దీర్ఘకాలం వాడితే ఒక కంటికి మాత్రం చూపు వచ్చే అవకాశం ఉందని చెప్పాడు. దీంతో హతాశురాలైన మా అమ్మాయి వెంటనే గురువుగారికి విషయం చెప్పమని కోరింది. మేము శిరిడీకి ఫోన్ చేసి అమ్మగారికి ఈ విషయం చెప్పి, గురువుగారికి తెలియజేయవలసిందిగా కోరాము. అమ్మగారు గురువుగారికి వెంటనే తెలియజేస్తానని చెప్పారు. తరువాత వారానికి సురేఖ కంటిచూపు క్రమంగా తిరిగి రాసాగి, పదిరోజులకు సాధారణ స్థితికి చేరుకుంది.

ఒకసారి మా అమ్మకు కాటరాక్ట్ శస్త్రచికిత్స జరిగిన తరువాత అసాధారణమైన రుగ్మత కలిగి ఎక్కువకాసాగింది. అది ఎంత తీవ్రమైనదంటే ఆపరేషన్ చేసిన డాక్టర్ కూడా ఇక ఏ వైద్య చికిత్స కూడా ఆమెకు సహాయం చేయదని చెప్పాడు. నేను శిరిడీకి ఫోన్ చేసి మా అమ్మ పరిస్థితిని అక్కడున్నవారికి చెప్పి, గురువుగారికి తెలియజేయమని కోరాను. ఆ తరువాత కొన్ని వారాలకు మా అమ్మకు కంటిచూపు తిరిగి మామూలు స్థితికి వచ్చింది.

# అద్భుత సాన్నిధ్యం

బిల్లిపురం విఠల్‌రెడ్డి
భూస్వామి, జహీరాబాద్
జన్మించిన సం॥ 1956

జహీరాబాద్, జనవరి 2000

నాకు 1998లో తీవ్రంగా జబ్బు చేసినపుడు ట్రీట్‌మెంట్ కోసం నేను హైదరాబాద్‌కు వెళ్ళాను. చాలా పరీక్షలు చేసిన తరువాత డాక్టర్లు వెంటనే ఆపరేషన్ చెయ్యాలన్నారు. నాకు స్కానింగ్ చేసిన స్పెషలిస్ట్ డాక్టర్, ఇన్‌ఫెక్షన్ సోకిందని నిర్ధారించాడు. ఆపరేషన్ చేయడానికి ముందుగా రెండువారాల పాటు కొన్ని మందులు వాడమని చెప్పారు. ఆపరేషన్ చేసే రోజును నిర్ణయించారు. నన్ను పొలంలో పనిచేయవద్దని సంపూర్ణంగా విశ్రాంతి తీసుకోమని సూచించారు.

ఆ సమయంలో నాకు గురువుగారి ఆశీస్సులు కోరడానికి నా భార్య శిరిడీకి వెళ్ళింది. నేను కూడా వెళ్ళాలనుకున్నప్పటికీ నా అనారోగ్యం తీవ్రంగా ఉండడంతో మా బంధువులంతా వద్దని వారించారు. మొదట వాళ్ళు చెప్పినట్టే నేను శిరిడీకి వెళ్ళలేదు. కానీ కొద్దిరోజులకు శిరిడీకి వెళ్ళాలన్న కోరిక చాలా బలంగా ఉండడంతో నేను శిరిడీకి బయలుదేరాను.

ఇదే సమయంలో, శిరిడీలో ఉన్న నా భార్యతో గురువుగారి సన్నిహితభక్తులొకరు "ఆయన ఇంట్లో ఉండి చేసేదేముంది, ఇక్కడికి వచ్చి బాబా దర్శనం చేసుకుని గురువుగారి సన్నిధిలో ఉంటే ఎంతో ఫలితం ఉంటుంది కదా... వెంటనే బయలుదేరి శిరిడీ వచ్చేయమ"ని చెప్పారు.

నేను అప్పటికే శిరిడీకి బయలుదేరేశాను. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలేవీ నాకు తెలియవు. నేను శిరిడీకి వచ్చిన తర్వాత గురువుగారి ప్రేమపూర్వక సాన్నిధ్యం, అద్భుతమైన శిరిడీ మహిమ నాపై ప్రభావం చూపనారంభించింది. నాకు రోజురోజుకు ఆనందంగా, స్వస్థత చేకూరినట్లుగా అనిపించసాగింది.

అలా రెండు వారాలు గడచిన తరువాత నేను హైదరాబాద్‌కు తిరిగివెళ్ళి నా ఆరోగ్యం మెరుగుపడిందన్న నమ్మకంతో డాక్టర్లను కలిసి, నాకు మళ్ళీ అన్ని పరీక్షలు చేయవలసిందిగా కోరాను. వారు నన్ను పరీక్షించి చూసి నాకు ఎటువంటి సమస్య లేదని తేల్చారు. అన్నింటికన్నా గొప్ప వైద్యం శిరిడీలో సాయి సన్నిధిలో,

గురువుగారి పవిత్రసాన్నిధ్యంలో ఉండడమని, వారి చేతితో ఊదీ తీసుకోవడమని నాకు అవగతమయింది.

***భక్తుడు:*** *ఋణానుబంధమంటే ఏమిటి? అసలది మొదట బాబాతో ఎలా ఏర్పడుతుంది?*

***గురువుగారు:*** *ఈ 'ఋణానుబంధము' అనే పదం బాబానే ఉపయోగ పెట్టారు. ఎలా ఏర్పడుతుందనే దానికి ఆయన చెప్పిన సమాధానం ఏమిటంటే "నాకు భగవంతుడు కొంతమందిని, కొన్ని జీవుల యొక్క బాగోగులు అప్పజెప్పాడు" అని. ఆయన బిడ్డల్లాగా అన్నమాట. "వాళ్ళ యొక్క మంచిచెడ్డలు, వాళ్ళ యొక్క తరింపు నా బాధ్యత. మళ్ళీ తిరిగి వీళ్ళ యొక్క లెక్కలు అల్లాకు అప్పచెప్పాలి" అన్నారు. అదీ ఋణానుబంధం. అది ఆయన చెప్పిన మాటే.*

***భక్తుడు:*** *బాబాతో ఋణానుబంధం పెంచుకోవాలంటే మా వైపు నుండి మేమేం చేయాలి?*

***గురువుగారు:*** *బాబాను మరింతగా స్మరించుకోవడమే. మీ ప్రేమను మరింతగా ఆయనపై కేంద్రీకరించండి. ఆయన మీద మరింతగా ఆధారపడండి. నువ్వు ఆయనపై ఆధారపడితే ఆయన నీ బాధ్యత వహిస్తారు, నువ్వు ఎంతగా ఆధారపడితే, ఎంతగా ఆయనపై భారం వేస్తే ఆయనను అంతగా ఋణగ్రస్తులను చేస్తున్నట్లు.*

***భక్తుడు:*** *"నా భక్తుని నేనే ఎన్నుకుంటాను" అని సాయి చెప్పారు కదా! మరి కొందరిని మాత్రమే తన బిడ్డలుగా తీసుకోవడం ఎందుకు? అంతటా ఆయనే ఉన్నారు కదా, మరి అందరినీ కూడా తీసుకోవాలి కదా?*

***గురువుగారు:*** *శిరిడీలో ఉన్న బాబా అనేటువంటి ఈ రూపంతో ఏ జీవులకైతే ఋణానుబంధం ఉన్నదో వారిని ఈ రూపం ద్వారా చూస్తారు. మిగతా వారికి ఇంకో సద్గురువుగా, ఇంకో రూపంలో వచ్చి ఆయనే చూస్తారు.*

# అనుగ్రహ జలం

శరత్‌బాబు రావు తోరత్
వ్యాపారస్థుడు, శిరిడీ
జన్మించిన సం॥ 1954

శిరిడీ, జూన్ 2001

నా భార్య తరచూ జ్వరంతో బాధపడుతూ ఉండేది. పరీక్షలు చేయించగా ఆమెకు క్షయ వ్యాధి సోకిందని నిర్ధారణ అయింది. ఒకసారి దర్శన సమయంలో ఆమె తన వ్యాధి తగ్గించమని గురువుగారిని ప్రార్థించింది. గురువుగారు ఆమెకు ఊదీ ఇచ్చారు. అదే రోజు రాత్రి జ్వరం తగ్గిపోయింది. అత్యంత ఆశ్చర్యకరంగా తరువాత వైద్యపరీక్షలలో, ఆమె ఊపిరితిత్తులు ఎటువంటి రుగ్మత లేకుండా చక్కగా ఉన్నాయని తేలింది. ఆమె క్షయ రోగం పూర్తిగా నయమవడానికి కారణం కేవలం గురువుగారి అనుగ్రహాశీస్సులే.

కొన్నాళ్ళ క్రితం మేము శిరిడీలో కొంత భూమిని కొని అందులో మూడు గదులు నిర్మించాము. ఆ పనంతా పూర్తైన తర్వాత అక్కడ నీటి వసతి ఏర్పాటు వీలు కాదని గ్రహించాము. సమస్య వచ్చినపుడు గురువుగారు దగ్గరకు కాక ఇంకెక్కడికి వెళతాం? దర్శన సమయంలో గురువుగారికి ఈ సమస్య గురించి చెప్పాము. దానికి గురువుగారు "మీకు నచ్చిన ప్రదేశంలో బోరు వేసుకోండి" అన్నారు. మేము అలాగే చేశాము. శిరిడీలో వాటర్ టేబుల్ చాలా తక్కువగా ఉంటుంది. కొన్ని వందల మీటర్లు త్రవ్వినాగానీ నీళ్ళు పడవు. కానీ మాకు మాత్రం గురువుగారి అనుగ్రహంతో 30 మీటర్లు త్రవ్వగానే నీళ్ళు పడ్డాయి.

# చెప్పకనే బాధంతా మటుమాయం

శెట్టిపల్లి వీరాస్వామి
కాంట్రాక్టర్, పల్‌సూద్
జన్మించిన సం॥ 1944

పల్‌సూద్, ఫిబ్రవరి 2001

1988వ సంవత్సరంలో నేను గురువుగారిని తొలిసారిగా ఒక బంధువు ద్వారా శిరిడీలో కలుసుకున్నాను. అతను గురువుగారి గురించి ఎంతో ప్రేమగా గొప్పగా చెప్పాడు. గురువులపై నమ్మకం లేకపోవడంతో నేను పెద్దగా ఆసక్తి చూపలేదు. నేను శ్రీబాబూజీని మంచి భావాలున్న వ్యక్తిగా మాత్రమే భావించేవాడిని. అంతకు మించి ఏమీ లేదనుకున్నాను. నేను రెండవసారి గురువుగారిని 1992లో సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో కలుసుకున్నాను. మా బంధువు చేసిన విధంగానే నేను కూడా గురువుగారికి సాష్టాంగ నమస్కారం చేసి ఆయన పాదాలను స్పృశించాను. కానీ తరువాత, మనలాగే కనిపిస్తూ మనలాగే ఉండే వ్యక్తి పాదాలకు నమస్కరించడంలో ఔచిత్యమేమిటని నా సందేహాలను వ్యక్తపరిచాను.

మా అబ్బాయి రమేష్ చాలా సంవత్సరాల నుండి సయాటికాతో బాధపడేవాడు. మేము చాలా నగరాలలో చాలా మంది డాక్టర్లను కలసి వారు సూచించిన రకరకాల మందులు వాడాము. కానీ ఏమీ ప్రయోజనం కనిపించలేదు. ఇక మందులతో ఎటువంటి లాభంలేదని భావించి, మేము అన్ని మందులు వాడడం మానివేశాము. అతను ఆ నొప్పితో అలానే జీవించడం అలవాటు చేసుకున్నాడు.

గురుబంధువులతో నా పరిచయం వలన వారి ద్వారా గురువుగారి గురించి వింటూ ఉండడం వలన మా అబ్బాయి రమేష్‌ను తీసుకుని శిరిడీకి వెళ్ళి త్వరలో జరుగబోయే అతని వివాహానికి గురువుగారి ఆశీస్సులడగాలనుకున్నాను. ఇది మా అబ్బాయికి గురువుగారి ప్రథమ దర్శనం.

రమేష్ తన సయాటికా గురించి గురువుగారికి చెప్పలేదు. కానీ గురువుగారి సాన్నిధ్యంలో అతని సయాటికా పూర్తిగా తగ్గిపోయింది. మా ఆశ్చర్యానికి అంతులేదు. అప్పటివరకు చీకాకు పెట్టిన సయాటికా సమస్యను, ఆ బాధను ఇప్పుడు పూర్తిగా మరచిపోయాడు.



*శ్రీబాబూజీ, శిరిడీ, 2006*



*శ్రీబాబూజీ, శిరిడీ, 2006*



చిన్నవైనా చిరస్మరణీయాలు

# మనసెరిగిన మహాత్ములు

జెఫ్ డాసన్,
డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, బ్రాడ్‌హెమ్‌స్టన్, యు.కె.
జన్మించిన సం॥ 1953

శిరిడీ, జూన్ 1999

ఒకరోజు ఉదయం నా మనస్సులో ఏవో కొన్ని ఆలోచనలు యథాలాపంగా మెదులుతూ వచ్చాయి. అప్పుడు నేను పండ్లు సరిగా తినటం లేదని, నాకున్న పొగ త్రాగే అలవాటు వల్ల అధిక మొత్తంలో డబ్బులు ఖర్చవుతున్నాయని, శిరిడీలో ఎక్కడ ఉండాలో తెలియక దాని గురించి కాస్త ఇబ్బందిపడటం వంటి విషయాల గురించి ఆలోచనలు వచ్చాయి.

అదే రోజు మధ్యాహ్నం నాకు గురువుగారిని కలవాల్సిందిగా పిలుపు వచ్చింది. తాము త్వరలో శిరిడీ నుండి బయలుదేరుతామని నన్ను మాత్రం మరికొంతకాలం శిరిడీలోనే, సాయిపథం గదులలో ఉండమని గురువుగారు చెప్పారు. నేను బయలుదేరేముందు గురువుగారు నాకొక పెద్ద ద్రాక్ష పండ్ల గుత్తిని ఇచ్చారు. నేను కాస్త దూరం నడచిన తరువాత నారాయణరావుగారు వెనుకకు పిలిచి "గురువుగారు దీనిని నీకిమ్మన్నారు" అని చెబుతూ సిగరెట్ ప్యాకెట్‌ను నా చేతిలో ఉంచారు.

తరువాత నేను, ఆ రోజు ఉదయం నా మనస్సులో మెదిలిన ఆలోచనలను గుర్తుకు తెచ్చుకున్నాను. ఆ ఆలోచనలన్నీ కేవలం నాకు గల అవసరాలకు సంబంధించినవి మాత్రమే. అవి నాకు కావాలని ప్రత్యేకంగా అడగలేదు. అయినప్పటికీ గురువుగారు ప్రతి దానినీ సంపూర్ణంగా తీర్చారు.

# ఊదీ

బాబ్ బార్నెట్
వెబ్‌సైట్ డిజైనర్, యు.ఎస్.ఎ.
జన్మించిన సం॥ 1971

చెన్నై, మార్చి 2002

2001లో నేను, నా శ్రీమతి మా ఏడాదిన్నర వయస్సు గల పాప 'నేమీ'తో గురువుగారి సన్నిధిలో కొంతకాలం గడుపుదామని ఇండియా వచ్చాము. ఆ సమయంలో మేము ఇండియాలోని కొన్ని ప్రదేశాలు చూసివద్దామని అనుకొన్నాము. క్రొత్త వాతావరణం వలన ఒంట్లో బాగాలేక ఇబ్బంది పడుతుందేమోనని నేమీని తీసుకుని ప్రయాణాలు చేయాలంటే నేను అన్ని జాగ్రత్తలూ తీసుకొంటాను. ఒకవేళ అట్లాంటి పరిస్థితులేమన్నా వస్తే గురువుగారి చేతి నుండి బాబా మందిరంలో ఇచ్చే ఊదీ ప్రసాదం తీసుకుని దగ్గరుంచుకొంటే ధైర్యంగా ఉంటుంది అనుకున్నాను. కానీ, మా ప్రయాణం అనేకసార్లు వాయిదా పడడంతో ఆ విషయం పూర్తిగా మర్చిపోయాను.

జనవరిలో క్రొత్త సంవత్సరం వేడుకల అనంతరం ఊరికి ప్రయాణమయ్యే వాళ్ళకు గురువుగారు సాయియానాలో దర్శనమిస్తున్నారు. మేము కూడా ఆ రోజే బయల్దేరుతుండడంతో దర్శనం చేసుకొందామని లైన్‌లో నిల్చున్నాము. దర్శన సమయంలో తమ కోరికలను, కష్టాలను తీర్చమని చెప్పుకొంటున్న వారందరికీ గురువుగారు తల ఊపుతూ ప్రసాదంగా ట్రేలో నుండి బిస్కెట్లు తీసి ఇవ్వడం లైన్‌లో నుండే చూస్తున్నాను నేను. నా వంతు వచ్చి నేను గురువుగారి పాదాలకు నమస్కరించుకోగానే గురువుగారు ట్రేలో అటూ ఇటూ వెతికి బిస్కెట్ బదులుగా ఒక ఊదీ ప్యాకెట్ తీసి నా చేతికిచ్చారు.

గురువుగారి సాన్నిధ్యానందాన్ని అనుభవిస్తూ, ఆ ఆనందంలోనే మైమరచి వెలుపలికి వచ్చిన నేను, కొద్దిసేపటికిగానీ గురువుగారు నాకు 'ఊదీ' ప్రసాదంగా ఇచ్చారనే విషయాన్ని గుర్తించలేదు. వారు మనలను అనుక్షణం గమనించుకొంటూ చిన్న చిన్న కోరికలను సైతం తీరుస్తున్నారు అని తలచుకోగానే నా చేతిలోని ఊదీ గురువుగారి ప్రేమకు ప్రతీకలా తోచి నా కళ్ళు చెమ్మగిల్లాయి.

# మనోహరం ఆ దరహాసం

మర్రెడ్డి దుర్గారాణి,
గృహిణి, శిరిడీ
జన్మించిన సం॥ 1970

శిరిడీ, జనవరి 2004

మేము తిరుచ్చిలో ఉన్నప్పటి సంగతి ఇది. మా వారు ఒక ఏడాదిగా బైక్ కొనుక్కోవాలని అనుకుంటుండేవారు. ఒకసారి మాటల సందర్భంలో బండి ప్రస్తావన వచ్చినప్పుడు నేను 'గురువుగారు సెలెక్ట్ చేసిన బండినే తీసుకొందాం' అన్నాను.

"గురువుగారు బండి వాడరు కదా. వారికి బండ్ల గురించి ఏం తెలుస్తుంది?" అన్నారు మా వారు. "వారికి సర్వం తెలుస్తాయి!" అన్నాను నేను.

1999 గురుపౌర్ణమికి శిరిడీ వెళ్ళలేకపోయాము. మా ప్రయాణం రోజురోజుకు వాయిదాపడుతూ వచ్చింది. మేము వెళ్ళేసరికి గురువుగారు శిరిడీ నుండి వెళ్ళిపోతారేమోనని నాకొకటే దిగులు. "మేము వచ్చేటప్పటికి మీరు శిరిడీలోనే ఉండాలి" అని గురువుగారిని మనసులో ప్రార్థిస్తూనే ఉన్నాను.

కానీ మేము సెప్టెంబర్‌లోనే శిరిడీకి వెళ్ళగలిగాము. అయితే గురువుగారు అన్నాళ్ళూ శిరిడీలోనే ఉన్నారు. మేము వెళ్ళిన మరునాడే ఊదీ దర్శనం ఇచ్చారు. మా వారు తనతో తీసుకొచ్చిన మూడు హీరో హొండా బ్రోచర్స్ గురువుగారికి చూపిస్తూ "ఏది తీసుకోమంటారు?" అని అడిగారు.

*"నేను బండి వాడను కదా! నాకు బండ్ల గురించి ఏం తెలుస్తుంది?!"* అంటూ ఆ పేపర్స్ ప్రక్కన పెట్టేసారు గురువుగారు.

అవి అచ్చంగా మా వారన్న మాటలే! ఆ మాటలు విని నివ్వెరపోవడం మా వంతయింది. ఎక్కడ తిరుచ్చి? ఎక్కడ శిరిడీ? నేను తేరుకుని "మీరేం చెపితే అదే తీసుకోవాలని ఇన్ని రోజులాగాము" అంటూ మళ్ళీ ఆ పేపర్స్ చూపించాను. గురువుగారు ఆ మూడు మోడల్స్ ఒకసారి చూసి, సి.డి.100 మెరూన్ కలర్‌ది తీసుకోమన్నారు.

మరుసటిరోజు గురువుగారు ఊరికి బయల్దేరారు. మేమూ అదే రైలు ఎక్కాము. వారి ప్రక్క కంపార్ట్‌మెంటులోనే మేమున్నాము. ధోండ్ స్టేషన్‌లో రైలు ఆగినప్పుడు గురువుగారి దగ్గరకెళ్ళాము. మా ఇద్దరిని చూడగానే ఆప్యాయంగా పలుకరించి, మా

ప్రయాణం గురించి విచారించారు. మేము తిరుపతి వెళ్ళాలి కాబట్టి రేణిగుంటలో దిగేశాము. అక్కడ రైలు చాలా సేపు ఆగుతుంది. రైలు తిరిగి బయలుదేరేంతవరకు గురువుగారిని చూస్తూండవచ్చు కదా అని వారి కంపార్ట్‌మెంట్ వద్దే నిలుచున్నాము. అక్కడ గురువుగారిని దర్శించుకొనేందుకు స్టేషన్‌కు చాలామంది గురుబంధువులు వచ్చారు. వాళ్ళతో మాట్లాడుతూ గురువుగారు ఎందుకో మధ్యలో పకపకా నవ్వారు. గురువుగారలా బిగ్గరగా నవ్వడం మేము మొదటిసారి చూశాము. మాకా నవ్వు ఎంత బాగా అనిపించిందో మాటల్లో చెప్పలేను. శ్రీఖాపర్డే తన డైరీలో బాబా నవ్వు గురించి వ్రాసింది చదువుతూ నేనెప్పుడూ 'అంత మనోహరమైన నవ్వు ఎలా ఉంటుందో, అయ్యో అటువంటి అనుభవం మనం పొందలేకపోయామే' అని అనుకొనేదాన్ని. నా మనసులోని కోరిక తీర్చడం కోసమే గురువుగారు అలా నవ్వారేమో!

***భక్తుడు:*** *సార్! బాబా ఒక ఫోటోలో ఉన్నట్లు ఇంకొక ఫోటోలో ఉండరు. చాలా వ్యత్యాసం ఉంటుంది. ఎందుకని అలా ఒకదానికొకటి సంబంధం లేకుండా ఉంటాయి?*

***గురువుగారు:*** *Different agesలో తీశారు కాబట్టి కొంచెం తేడాలు కనిపిస్తాయి. అటువంటి మహాత్ములు ఒక క్షణంలో ఉన్నట్టు ఇంకో క్షణంలో ఉండరు. అందుకని ఎంతసేపు చూస్తున్నా సరే బోర్ కొట్టదు. వాళ్ళలో ఉండేటువంటి నిత్యనూతనత్వం ఎప్పుడూ ఎట్లా అనుభవం అవుతుందనంటే... ఎంతసేపు చూస్తున్నా సరే క్రొత్తగానే ఉంటుంది. ఇంకా ఇంకా చూడాలనిపిస్తుంది. మనకు బాగా ఇష్టమైనటువంటి మన ఫేవరట్ స్టార్ అయినా సరే, ఆ సినిమా రెండు సార్లు, మూడు సార్లుకంటే చూడలేం, బోర్ కొడుతుంది. ఏం చూస్తాంలే అబ్బా అని అనిపిస్తుంది.*

*కాని మహాత్ముల దగ్గర అట్లా ఉండదు. దీనినే వాల్మీకి, రామాయణంలో రాముని గురించి "క్షణే క్షణేయన్నవతా రమణీయ రూపం" అన్నాడు. ఆయన్ను చూస్తుంటే ఎట్లా ఉంటుందంటే, ప్రతి క్షణం కూడా క్రొత్తగా ఉంటుంది. ఇందాక చూసిన వ్యక్తేనా ఆయన అన్నట్టుగా ఉంటుంది. మన మనస్సు కూడా ఆ నిత్యనూతనత్వాన్ని అనుభవిస్తూ ఉంటుంది. ఇంక ఆ ఫోటోల్లో మార్పు రావడం పెద్ద విశేషమా?*

# తీరిన కోరిక

విలాస్. కె. గుజరాతి
ఫార్మసిస్ట్, శిరిడీ
జన్మించిన సం॥ 1951

శిరిడీ, జూలై 2002

1973వ సం॥ నుండి మేము శిరిడీలో ఉంటున్నాము. శిరిడీలో సాయిబాబా మందిరానికి దగ్గరలోనే మాకు ఒక మెడికల్ షాపు ఉంది. 1990 నుండి 1998 వరకు మేము గురువుగారి ప్రక్క ఇంట్లోనే ఉన్నా, వారి గొప్పతనాన్ని నేనప్పుడు గుర్తించలేకపోయాను.

1997లో నేను మొదటిసారి శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ దర్శనానికి వెళ్ళాను. వారి దర్శనంతోనే నా జీవితంలో గొప్ప మార్పు వచ్చింది. గురువుగారు మా పట్ల చూపించే ప్రేమ మాకెంతో ఆనందాన్ని, సంతృప్తిని కలిగించింది.

ఒకరోజు నేను శ్రీసాయిసచ్చరిత్ర పారాయణ చేస్తూ, బాబా లక్ష్మీబాయి షిండేకు తొమ్మిది నాణాలు ప్రసాదించిన లీల చదివాను. నాకు కూడా అలాగే గురువుగారి చేతి నుండి ఒక రూపాయి నాణెమన్నా ప్రసాదంగా లభిస్తే బాగుండునని ఆశించాను.

2001 అక్టోబరు 30వ తేదీ నా జీవితంలో నేనెప్పటికీ మరచిపోలేని రోజు. ఆ మధ్యాహ్నం సాయియానాలో గురువుగారు దర్శనమిస్తున్నారని తెలిసి వెళ్ళాను. క్యూలో అందరితో పాటు వెళ్ళి పాదనమస్కారం చేసుకోగా, గురువుగారు ఊదీ పెట్టి ప్రసాదంగా బిస్కెట్లతో పాటు, సరిగ్గా నా మనసులోని కోరికను గ్రహించినట్లే ఒక రూపాయి నాణాన్ని ప్రసాదించారు. గురువుగారు ఎవ్వరి నుండి దక్షిణ తీసుకోరు. అటువంటిది వారి దగ్గరకు ఆ నాణెం ఎలా వచ్చిందో? వారు నాకే ఆ నాణాన్ని ఎందుకు ఇచ్చారో? అన్నది నన్ను చాలా ఆశ్చర్యానందాలకు గురిచేసింది. నేను అనుకొన్నదే తడవుగా గురువుగారు నాకు రూపాయి నాణాన్ని ప్రసాదించడం నా అదృష్టం. దానిని వెండి భరిణెలో ఉంచి మా పూజలో పెట్టుకొన్నాము. మా వ్యాపారం బాగా సాగుతున్నది. గురువుగారి కృప మాపై సర్వదా ఉంటుందని మా నమ్మకం.

# ఏవీ మచ్చలు!

పరుచూరి సుశి
గృహిణి, సంగంజాగర్లమూడి
జన్మించిన సం॥ 1983

సంగం జాగర్లమూడి, మే 2001

నా చేతులపై అలర్జీ వలన నల్లని మచ్చలు వచ్చాయి. చాలా మంది డాక్టర్లకు చూపించి వాళ్ళిచ్చిన మందులు వాడాను. కాని ప్రయోజనం కనబడలేదు. ఎవరైనా నా చేతులు చూసి ఎగతాళి చేస్తారేమోనని ఎంతో బాధపడేదాన్ని.

గురువుగారు తిరుమలకు వచ్చారని తెలిసి దర్శనం చేసుకొందామని వెళ్ళాను. దర్శన సమయంలో "గురువుగారూ, నాకు ఈ మచ్చలు పోవడం లేదు" అని చెప్తూ, నా చేతులు గురువుగారికి చూపించాను.

గురువుగారు నా చేతుల వంక చూస్తూ "ఎక్కడమ్మా మచ్చలు? ఏమీ కనిపించడం లేదే?" అన్నారు.

ఆ రోజు నుండి అలర్జీ తగ్గడం మొదలై మచ్చలు పూర్తిగా తగ్గిపోయాయి. అదీ గురువుగారి వాక్కుకున్న అమోఘమైన మహిమ!

***గురువుగారు:*** *మనం చేసే జపము, సాధన, ఆత్మ విచారణ చూసే మనలను సద్గురువు అనుగ్రహిస్తున్నారు అనుకోవటం పొరపాటు. బాబా అనుగ్రహం పొందటానికి ఏ విధమైన నిబంధనలు లేవు. ఆయనకు నీతో ఉన్న బంధము వలన, తండ్రి బిడ్డను ప్రేమించినట్లు ప్రేమిస్తారు. తండ్రి బిడ్డలో ఉండే యోగ్యత చూసి ప్రేమిస్తాడా? బిడ్డ యొక్క అర్హత ఏమిటి? ఆ తండ్రికి జన్మించడమే. అంతే. అదే ఏకైక బంధం. ఆయన బిడ్డను ప్రేమిస్తారంతే. అలాగే సద్గురువు కూడా తండ్రి లాగా మనల్ని ప్రేమిస్తూనే ఉంటారు. మనమందరము ఆయన బిడ్డలం.*

# మాతృమూర్తిని మరిపించే అమృతమూర్తి

ఇక్కుర్తి శారద
గృహిణి, తిరుపతి
జన్మించిన సం॥ 1962

తిరుపతి, జనవరి 2000

1996 జూలైలో గురువుగారు తిరుమల నుండి బయలుదేరుతున్న రోజు, మేమందరమూ గురువుగారి దర్శనానికి వెళ్ళాము. ఆ రోజు నెల్లూరు, వెంకటగిరి, కోట, ఇలా చుట్టుప్రక్కల ఊర్ల నుండి కూడా చాలామంది గురుబంధువులు దర్శనానికి వచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి విజయభాస్కర్‌గారు బాబా నామం చెప్పడం మొదలుపెట్టారు. ఆయన ఎంతో ఆర్తితో, తన్మయత్వంతో నామం చెప్పారు. సాయంత్రం ఆరు గంటలకు గురువుగారు దర్శనం ఇచ్చారు. వరుసలో పాదనమస్కారం చేసుకొంటున్న విజయభాస్కర్‌కు గురువుగారు పూల బొకే ఇచ్చారు. అది చూస్తున్న నేను "చక్కగా బాబా భజన చేశారు కాబట్టి గురువుగారతనికి పూల బొకే ఇచ్చారు. ఆయన ఎంత అదృష్టవంతులో కదా!" అని మనసులో అనుకున్నాను.

మాతో వచ్చిన వాళ్ళందరూ గురువుగారి దర్శనం చేసుకుని వెళ్ళిపోయారు. నేనూ, మా వారు, మా అమ్మాయి వాణి మాత్రం ఉండిపోయాము. ఒక వంక దర్శనం సాగుతూనే ఉంది. అట్లా రాత్రి పదిన్నర అయిపోయింది. నాకూ, మా అమ్మాయికి బాగా ఆకలివేస్తుండడంతో మా వారు ప్రక్కనే ఉన్న హొటల్‌కు వెళ్ళి త్వరగా ఏదైనా టిఫిన్ చేసి వద్దాము రండి అని మమ్మల్ని తీసుకెళ్ళారు. ఆలస్యం లేకుండా ఇస్తారని మా వారు అందరికి దోసెలు ఆర్డరు చేశారు. నాకు చాలా ఆకలిగా ఉంది. దోసెతో అసలు కడుపు నిండదు, చపాతీ తింటే బాగుండును అనిపించింది కానీ పైకి చెప్పలేదు. "టైమ్ అయిపోతుంది పదండి, గురువుగారు బయల్దేరుతారేమో" అంటూ మా వారు మమ్మల్ని తొందరచేసి తీసుకొచ్చేశారు.

గురువుగారు బయలుదేరే ముందు అందరమూ నమస్కారం చేసుకొన్నాము. గురువుగారప్పుడు నాకు ఊదీతో పాటు పెద్ద పూలదండ, ఒక చిన్న ప్యాకెట్ ఇచ్చారు. అప్పటికి కొద్దిరోజులుగా క్రమం తప్పకుండా సత్సంగానికి వెళుతూ, శ్రద్ధగా నిర్వహణ బాధ్యత చూసుకొంటున్నందుకుగాను గురువుగారు అలా నాకు పూలదండ ఇచ్చి ఆశీర్వదించారని ఎంతో ఆనందపడిపోయాను.

గురువుగారేదో పాకెట్ ఇచ్చారు, బహుశా ఏదన్నా స్వీట్ ప్రసాదంగా ఇచ్చారేమో అనుకొంటూ ఆ పొట్లాన్ని విప్పి చూశాను. ఒక్క క్షణం నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. అందులో మూడు చపాతీలున్నాయి! నేనింతకుముందు చపాతీ తినాలనుకుని, తినకుండా అర్ధాకలితో తిరిగిరావడం తాము ఎదురుగా నిల్చొని చూసినట్లుగా 'ఇదిగో తినమ్మా' అని ప్రేమగా వాటినే నాకు ప్రసాదంగా ఇచ్చారు. అనుక్షణం తన బిడ్డలు ఆనందంగా ఉండాలనుకొనే కన్నతల్లి కన్నా ఎక్కువగా చిన్న చిన్న కోరికలను సైతం తీర్చే ఆ అమృతమూర్తి ప్రేమకు నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఇలా గురువుగారు మనలను తమ కనుసన్నల్లో నిలుపుకుని కాపాడుతుండగా మనకింకేం కావాలి? మనం చేయవలసినదల్లా మరపన్నది లేకుండా గురువుగారి స్మరణలో ఉండడమే.

***భక్తుడు:*** *గురువుగారూ! మీరు బాబాను గురించి చెప్పేటప్పుడు అద్భుతం (miracle) అనే పదం వాడటానికి ఇష్టపడరు. ఎందుకు? వాటిని అద్భుతాలని చెప్పటంలో అభ్యంతరం ఏముంది?*

***గురువుగారు:*** *"నేను చమత్కారాలు చేయను" అని బాబానే చెప్పారు కాబట్టి అది నా అభ్యంతరం కాదు, బాబానే ఒప్పుకోలేదు దానికి.*

***భక్తుడు:*** *అయితే బాబా వాటిని ఏ పేరుతో పిలిచేవారు?*

***గురువుగారు:*** *వారికవి ఒక తల్లి తన బిడ్డకు ప్రేమతో చేసే పనుల్లాంటివి. బిడ్డకు ఆకలైంది, తల్లి చన్ను నుండి పాలు ధారాపాతంగా స్రవిస్తాయి. బిడ్డ ఆకలి తీరగానే పాలు స్రవించడం ఆగిపోతున్నాయి. ప్రతి తల్లి చేసే అద్భుతమే ఇది. ప్రతి బిడ్డ తల్లి నుండి పొందేదే. బాబా కూడా తాను తల్లిలాగ చేసే అద్భుతమే ఇది. బాబా కూడ తాను తల్లిలాగ, మనం ఆయన బిడ్డలలాగ అనుకొంటారు. మీరు దానిని అద్భుతమని ఎందుకంటారు? అది బిడ్డకు తల్లి సహజంగా ప్రేమతో చేసేలాంటిది అంటాను నేను.*

# అడగటమే ఆలస్యం

కిన్నెర రాజశేఖర్
స్టూడెంట్, నెల్లూరు
జన్మించిన సం॥ 1981

నెల్లూరు, సెప్టెంబర్ 2001

చాలాకాలంగా నాకు స్కూటర్ కొనుక్కోవాలని కోరిక. కానీ మా ఇంటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అది సాధ్యమవలేదు. ఒక రోజు మా అమ్మ బాబా మందిరంలోని సత్సంగానికి వెళ్ళి వచ్చి, అక్కడ విశేషాలు చెపుతూ ఒక గురుబంధువు వాళ్ళ పాప తమ ఇంట్లో కలర్ టి.వి. లేదని, అది కావాలని గురువుగారి ఫోటో ముందు నైవేద్యంగా పూరీ పెట్టి అడిగిందట. వెంటనే గురువుగారు ఆ కోరిక తీర్చారట అని చెప్పింది. అప్పుడే చపాతీ తినబోతున్న నేను, ఆ మాట వినటం ఆలస్యం, లేచి చపాతీని గురువుగారి ఫోటో ముందు పెట్టి “గురువుగారూ, నాకు ఎలాగైనా స్కూటర్ కావాలి” అని ప్రార్థించాను.

మరునాడు నేను బజారులో సైకిల్ మీద వెళుతుండగా, ఎవరో ఒకతను హీరో హోండాలో వచ్చి సైకిల్‌ను ఢీ కొట్టడంతో నేను క్రింద పడిపోయాను. అదృష్టవశాత్తు ఇద్దరికీ పెద్ద దెబ్బలేమీ తగల్లేదు కానీ సైకిల్ మాత్రం పూర్తిగా పాడయింది. అతను నన్ను పైకి లేపి, కూల్‌డ్రింక్ ఇప్పించి నా వివరాలడిగాడు. నేను ఫలానా వాళ్ళ అబ్బాయినని చెప్పగానే “మీరు మేము బంధువులమే” అని తనే నన్ను మా ఇంటికి తీసుకొచ్చాడు.

మా ఇంట్లో మాటల మధ్య యాక్సిడెంట్‌లో పాడైన సైకిల్‌ను బాగుచేయిద్దాము అని అంటుండగా, “నాకింక ఆ సైకిల్ వద్దు. స్కూటర్ కావాలి” అన్నాను నేను మా వాళ్ళతో.

ఆ వచ్చినాయన “నా దగ్గర ఒక స్కూటర్ ఉంది. నువ్వు తీసుకొంటావా?” అని అడిగాడు. “డబ్బులెలా మరి?” అని మేము తటపటాయిస్తుంటే, మా ఇబ్బంది తెలుసుకుని ‘నెమ్మదిగానే డబ్బివ్వండి. ఫరవాలేదు’ అన్నాడు. అదే సమయంలో మా షాపుకు ఒక బేరం వచ్చి 1500 రూపాయలు చేతికందాయి. ఆ డబ్బును అడ్వాన్సుగా అతనికిచ్చాము. అతను స్కూటర్ తెచ్చి ఇచ్చాడు. అంతా వెంట వెంటనే జరిగిపోయింది.

ఆ ముందురోజే నేను స్కూటరు కావాలని గురువుగారిని ప్రార్థించాను. ఒక్క రోజులోనే వారు నా కోరిక తీర్చారు. నాకు స్కూటర్ ఇచ్చారు. గురువుగారు ప్రసాదించిన ఆ స్కూటర్‌కు గురువుగారి చిన్న ఫోటోను అంటించి "సాయిపథం" అని వ్రాయించుకున్నాను.

***భక్తుడు:*** *మనమేదైనా బాబాను ఒక్కసారి అడిగితే చాలా? మళ్ళీ మళ్ళీ అడుగుతుండాలా?*

***గురువుగారు:*** *ఒక్కసారి అడిగితే చాలు అనుకుని మీరు స్థిరంగా ఉండగలిగితే, ఒక్కసారి అడిగితే చాలు. కానీ అడగకుండా ఉండలేము కనుక తీరేదాకా అడుగుతుంటాము. సమస్య పెద్దదయితే మళ్ళీ మళ్ళీ అడుగుతుంటాము. పదిసార్లు అడిగితే ఇస్తారు. ఒకసారి అడిగితే ఇవ్వరని కాదు. ఆకలికి అన్నం అడగటంలాంటిది. ఆకలవుతుంటే అడగకుండా ఉండలేము కదా! అలాంటిదే ఇది కూడా! పసిబిడ్డకు ఆకలయింది. ఏడుపు మొదలుపెట్టింది. పాపాయి ఏడవగానే పాలివ్వాలని తల్లికి అర్థమైపోతుంది. అట్లాగని అది రెండుసార్లు 'కెవ్ కెవ్'మని– తర్వాత అమ్మ అర్థం చేసుకొంటుందిలే అని ఆగిపోతుందా? పాలు ఇచ్చిందాకా ఏడుస్తుంది. పీకపెట్టిందాకా ఏడిస్తేనే నీకు పాలిస్తానని తల్లి చెప్పదు కదా!*

# తిరిగి వచ్చిన దైవం - తీర్చెను మనోరథం

సింగమ యుగంధర్
స్టూడెంట్, తిరుపతి
జన్మించిన సం॥ 1979

శిరిడీ, జూలై 2001

బాబా, గురువుగారు ఉన్న చిన్న ఫోటో ఒకటి ఎప్పుడూ నా షర్టు జేబులో ఉంచుకొనేవాడిని. శిరిడీ వెళ్ళి దాన్ని గురువుగారి ఆశీస్సులతో వారి చేతుల మీదుగా తీసుకోవాలని నాకెంతో కోరిక. అనుకొన్నట్లుగానే నేను శిరిడీ వెళ్ళగలిగాను.

సాయియానా సత్సంగహాలులో గురుదేవులను దర్శించుకున్నాను. దర్శనం తర్వాత వారు లోపలకు వెళ్ళే దారిలో ఫోటోను అందిద్దామని ముందుగా వెళ్ళి అక్కడ రెయిలింగ్ దగ్గర నిలుచున్నాను. చుట్టూ జనం త్రొక్కిసలాడుతున్నారు. గురువుగారు తమను చూడాలని, చిరునవ్వుతో పలకరించాలని అందరికీ ఆత్రుతే.

కానీ నా ఆత్రుత వేరు. మర్నాడే నా ప్రయాణం. గురువుగారు లోపలికి వెళ్ళిపోతే ఇంక నాకు అవకాశం ఉండదని నా బాధ. గురువుగారు స్టేజీపై నుండి దిగి మెల్లగా ఆ బాటలో నడుస్తున్నారు. నేను జనంలో నుంచి చేయిజాపుతూ ఫోటోను వారికి అందిద్దామని విశ్వప్రయత్నం చేస్తున్నాను. అయినా నా చేతులు వారి దగ్గరకు పోవడం లేదు. గురువుగారు అందరి వంకా చూస్తూ లోపలకు వెళ్ళిపోయారు. వారి వెనుకనే వెదురు తలుపులు మూసుకొన్నాయి.

'అయ్యో... గురువుగారు వెళ్ళిపోయారు' నా కళ్ళలో నుంచి దాచినా దాగని కన్నీళ్ళు జలజలమని రాలాయి. కళ్ళు తుడుచుకోవడం కూడా మరచిపోయిన వాడిలా ఆ తలుపుల వంకే చూస్తున్నాను. ఆశ్చర్యం! మూసుకున్న తలుపులు ఎందుకో ఠక్కున తెరచుకొన్నాయి. గురువుగారు బయటకు వచ్చారు. నా చేతిలోని ఫోటోను చూసి, చెయ్యి చాపి స్పృశించి ఎంత హఠాత్తుగా వచ్చారో అలానే వెళ్ళిపోయారు. ఆర్తితో పిలిస్తే మహాత్ములు తప్పక పలుకుతారన్న విషయం అనుభవం ద్వారా తెలుసుకోగలిగాను.

# వికసించిన హృదయసుమం

ఇవాన్ వయర్
మెడిటేషన్ టీచర్, స్విట్జర్లాండ్
జన్మించిన సం॥ 1959

శిరిడీ, జూలై 2003

నేను 1993వ సంవత్సరంలో నా భర్త కార్లోస్‌తో కలిసి తిరువణ్ణామలైకు 10 కిలోమీటర్ల దూరంలో అరుణగిరికి వాయువ్యంగా పచ్చని చెట్ల మధ్య ప్రశాంతంగా ఉండే వరుణాచలంలో ఓ కాటేజ్‌లో ఉండేదాన్ని. గురువుగారు మా కాటేజీకి ప్రక్కనుండే కాటేజీలో ఉండేవారు. అక్కడే తొలిసారి వారిని కలుసుకున్నాను.

నేను మా కాటేజీ తోటలో ఒక మందార మొక్క నాటాను. ఆ మొక్కకు తొలిసారిగా ఒక పువ్వు పూసింది. అది తెల్లగా, మధ్యలో గులాబి రంగుతో ముగ్ధమనోహరంగా ఉంది. ఆ అందమైన పువ్వును నేను గురువుగారికి ఇవ్వాలనుకున్నాను.

ఆ రోజు సాయంత్రం దర్శనానికి వెళ్ళాను. అది నాకు రెండవ దర్శనం. నేను ముందుగానే ఆ పువ్వును కోసి ఉంచడం వలన గురువుగారి కాటేజీకి చేరుకునే సమయానికి విచ్చుకున్న ఆ పువ్వు రేకులు కాస్తా ముడుచుకుపోయాయి. అప్పటి వరకు ఎంతో అందంగా ఉండిన ఆ పువ్వు తెల్లని కాడలా తయారైంది. ఏ మాత్రం ఆకర్షణీయంగా లేని ఆ పువ్వును గురువుగారికి సమర్పించాలా, వద్దా? అని సంకటపడుతూ ఉన్నాను.

ఏమైనప్పటికీ కాస్త ఇబ్బందిపడుతూనే నేను దానిని తీసుకెళ్ళి గురువుగారి పాదాల దగ్గరుంచాను. మేము అక్కడ కూర్చుంటూండగా, గురువుగారు ఆ మొగ్గను తమ చేతుల్లోకి తీసుకున్నారు. తరువాత గురువుగారు దానిని సుతారంగా తాకుతూ మెల్లగా దాని రెక్కలను విప్పుతూ ఉన్నారు. అక్కడ కూర్చున్న నేను మనసుకు అందని తన్మయమైన స్థితిని అనుభూతి చెందాను. గురువుగారు నా హృదయాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్లు, నెమ్మదిగా స్పృశిస్తూ దానిని మెల్లగా తెరుస్తున్నట్లనిపించింది. మేము సెలవు తీసుకునేటప్పుడు గురువుగారు పూర్తిగా విచ్చుకున్న ఆ పువ్వును నాకు ప్రసాదంగా ఇచ్చారు.

గురువుగారితో సత్సంగం అయిపోయిన తరువాత, తమతో కలసి భోజనం చేయమని గురువుగారు మమ్మల్ని ఆహ్వానించారు. అప్పుడు అందరికీ అరటి

ఆకులలో భోజనం వడ్డించారు. భోజన సమయంలో, గురువుగారు మాతో బాబా జీవితం గురించి మాట్లాడారు.

మా ముందు వడ్డించి ఉన్న అరిటాకును చూపుతూ, గురువుగారు "నేను ఆ అరటి ఆకులాంటి వాడిని. మీరు తింటున్న ఆహారం బాబా" అన్నారు.

భోజనం చేసిన తర్వాత ఆ గది శుభ్రం చేయడం జరిగింది. చీపురును చూపుతూ గురువుగారు "బాబా మన హృదయాలను శుభ్రం చేస్తున్నారు. నేను ఆయన చేతుల్లో చీపురును మాత్రమే! హృదయం శుభ్రమయ్యేవరకు నేను ఊడుస్తూనే ఉంటాను" అన్నారు.

నాకు భౌతికంగా నా హృదయాన్ని శుభ్రపరుస్తున్న అనుభూతి కలిగింది.

***భక్తుడు:*** *సాయిబాబా రమణులలాగా వేదాంతం చెప్పలేదు కదా? అందుకని పాశ్చాత్యుల మనస్సులకు ఆయనను పట్టుకోవడం కష్టంగా ఉంటుంది కదా?*

***గురువుగారు:*** *బాబా దగ్గరకొచ్చినవారెవ్వరూ బాబా వేదాంత బోధలు చేయాలని ఎదురు చూడలేదు. బాబా దగ్గరకు వెళ్ళగానే వారికి కనబడింది ఆయన 'శక్తి'. వారికి వారి నిస్సహాయత తెలుసు కాబట్టి బాబాను సహాయం అడిగారు. బాబా సహాయం పొందారు. ఆ సహాయంతో పాటు వారు బోధ కూడా పొందారు. ప్రతి లీలలోనూ, ప్రతి సన్నివేశంలోనూ, ప్రతి అనుభవంలోనూ ఒక మెసేజ్ (బోధ) అంతర్లీనంగా ఉంటుంది. ఏ బోధయితే ఇతర మహాత్ములు వాచా నేర్పారో అది బాబా అనుభవ పూర్వకంగా తెలుసుకొనేట్టు చేశారు. సాయిబాబా జ్ఞానం, ఆత్మ, బ్రహ్మం వంటి వాటిని గురించి బోధించలేదని ఎవరూ లోటుగా అనుకోలేదు. బాబావద్ద వారికి ఆనందానుభవం కలుగుతుండడంతో బోధకి అవసరం లేకుండా పోయింది. అసలు ఈ బోధలన్నీ మనలను నిస్సహాయ స్థితి నుండి దాటించి అనుభవం ప్రసాదించటానికే. బాబా సమక్షంలో అదంతా దానంతటదే జరుగుతున్నప్పుడు ఇక బోధ అవసరం ఏముంటుంది?*

# సద్గురు వాక్కు శిరోధార్యం

గోపవరపు శివ
వ్యాపారస్థుడు, గుంటూరు
జన్మించిన సం॥ 1960

గుంటూరు, జూలై 2000

1997లో గురుపూర్ణిమ పర్వదినం సందర్భంగా, మేము శిరిడీకి కారులో వెళ్ళాము. తిరిగి మేము శిరిడీ నుండి బయలుదేరేముందు దర్శన సమయంలో గురువుగారు, "మీ డ్రైవర్ బాగా రెస్ట్ తీసుకున్నాడా" అని అడిగారు.

నేను "అతను చాలా సేపు నిద్రపోయాడు" అని సమాధానమిచ్చాను.

గురువుగారు "మంచిది. మీరు వెనుక సీట్లో కూర్చుని రెస్ట్ తీసుకోండి. డ్రైవర్ తన పని తాను చూసుకుంటాడు" అని అన్నారు.

గురువుగారి ఆశీస్సులు తీసుకున్నాక మేము రెండు కార్లలో బయలుదేరాము. నేను కారు వెనుక సీట్లో కూర్చుని ఆ రాత్రంతా చాలాసేపు నిద్రపోయాను. తరువాత ఒకచోట ఆగినప్పుడు నిద్రలేచాను. డ్రైవర్లు ఓ కప్పు టీ త్రాగితే మిగిలిన గంట ప్రయాణంలో వారికి నిద్ర రాకుండా ఉంటుందని మాతో పాటు రెండో కారులో వస్తున్న నా ఫ్రెండ్ హనుమంతరావు అన్నారు. నేనప్పటికే చాలాసేపు రెస్ట్ తీసుకుని ఉండడం వలన మా డ్రైవర్ని వెనుక సీట్లో పడుకోమని, నేను కారు నడుపుతానని చెప్పాను. నాకు డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం. నేను చాలా బాగా డ్రైవ్ చేస్తానని అనుకుంటూ ఉంటాను. గురువుగారు ప్రయాణం చేసేటప్పుడు చాలాసార్లు నాకు డ్రైవింగ్ చేసే అవకాశం లభించింది. గురువుగారు కూడా నా ప్రావీణ్యాన్ని మెచ్చుకున్నారు.

ఇక మేము 30 నిమిషాలలో ఇంటికి చేరుకుంటామనగా, ఒక ట్రక్కు వేగంగా మా వైపుకు వచ్చి మా కారుని ఓ ప్రక్కన ఢీకొట్టి, ఆగకుండా వేగంగా వెళ్ళిపోయింది. అదృష్టవశాత్తూ మా కారులో ప్రయాణిస్తున్న ఎవ్వరికీ ఏమీ కాలేదు. నాకు మాత్రం కుడిచేతికి పెద్ద ఫ్రాక్చర్ అయి తగ్గడానికి చాలా నెలల సమయం పట్టింది.

ఈ ప్రమాదం ఎందుకు జరిగిందో నాకు అర్థంకాలేదు. గురువుగారి ఆశీస్సులు తీసుకునే బయలుదేరాం కదా! అని అనుకుంటూ ఉండగా, హఠాత్తుగా "మీరు వెనుక కూర్చుని, డ్రైవర్ పని డ్రైవర్ని చేసుకోనివ్వండి" అని గురువుగారు దర్శనసమయంలో అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

ఆ సమయంలో అవి యథాలాపంగా అన్నట్లు అనిపించినా, ఇప్పుడు ఆలోచిస్తే నాకు జరుగబోయే ప్రమాదం గురించి గురువుగారికి స్పష్టంగా తెలుసునని, వారు నన్ను కాపాడాలనుకున్నారని అర్థమయింది. నేనే గురువుగారి మాటలను పెద్దగా పట్టించుకోలేదు. కర్మానుసారమో లేక విధివశానో జరగాల్సింది జరిగినా, గురువుగారు ఇంత పెద్ద ప్రమాదం నుండి నన్ను ఒక్క ఫ్రాక్చర్‌తో కాపాడారు. అంతేకాకుండా ఇంకెవరికీ ఏమీ కాకుండా గురువుగారే రక్షించారు.

ఈ సంఘటన నాకు పెద్ద గుణపాఠం నేర్పింది. గురువుగారు ఎన్నడూ మనలాగా ఏదో ఒకటి మాట్లాడరని అర్థమయింది. వారు మనకు చెప్పే ప్రతి మాటకు ఎంతో ప్రాధాన్యముంటుంది. చూడటానికి చాలా సహజంగా, యథాలాపంగా చెబుతున్నట్లనిపించే వారి మాటల్లోని సూచనలను పట్టుకోవాలంటే వారి మాటలను మనం చాలా జాగ్రత్తగా వినాలి. ఈ సంఘటన నన్ను బాగా అప్రమత్తం చేసింది.

అంతేకాకుండా, నాకు ఎప్పుడూ అండగా గురువుగారు ఉన్నారన్న నమ్మకాన్ని మరింత బలపరచింది. వారిచ్చే సూచనలను నేను గ్రహించలేకపోయినా, వారు మాత్రం సదా నన్ను రక్షిస్తూనే ఉన్నారు. గురువుగారి ప్రేమకు పరిధులు లేవు.



శ్రీబాబూజీ అమృతహస్తాల మీదుగా అన్నప్రాసన, శిరిడీ, 2005



‘గురువు’ ఎందుకంటూ
దరి చేరిన ‘పిచ్చుకలు’

# అంతా గురువుగారి అనుగ్రహమే

డొంకిన ఉమామహేశ్వరరావు
స్టూడెంట్, కందుకూరు
జన్మించిన సం॥ 1978

కందుకూరు, డిసెంబర్ 2001

నేను తరచూ తీవ్రమైన తలనొప్పితో బాధపడేవాడిని. తలనొప్పి వచ్చిందంటే రెండు మూడు రోజులు ఏపనీ చేయలేకపోయేవాడిని. కళ్ళముందు అంతా చీకటై చూపు సరిగా కనిపించేది కాదు. బి.ఎస్‌సి. ఆఖరి సంవత్సరం, తెల్లవారితే ఫిజిక్స్ థర్డ్ పేపరు పరీక్ష రాయాలి. ఆ రాత్రి ఏడు గంటలకు తలనొప్పి మొదలైంది. "అయ్యో తలనొప్పి వస్తోందే!" అని భయపడుతున్నంతలో బాగా ఎక్కువయిపోయింది. ఇక చేసేదేమీ లేక తల పట్టుకొని పడుకున్నాను. "ఇంత కష్టపడి చదివినా ఉదయం పరీక్షకు వెళ్ళలేను కదా?" అనుకోగానే ఏడుపు వచ్చింది. నా బాధ చూసి మా అమ్మ కూడా ఏడ్చేసింది.

రోజూ నేను, నా స్నేహితుడు గణేష్ కలిసి చదువుకొనేవాళ్ళము. గణేష్ బాబా భక్తుడు. క్రమం తప్పక సాయిబాబా సత్సంగానికి వెళ్తూ, గురువుగారిని దైవంగా నమ్మిన వాడు. అలాగే మా అక్కా, బావా కూడా. వాళ్ళంతా అవకాశమున్నప్పుడల్లా శిరిడీ వెళ్ళి బాబాను, గురువుగారిని దర్శించుకొని వస్తుంటారు. అదంతా నాకు ఇష్టముండేది కాదు. నా దృష్టిలో సులువుగా మోసపోయేవాళ్ళకు, సొంత తెలివిలేని వాళ్ళకు గురువు అవసరంగాని, నాలాంటి వాళ్ళకు కాదని నా అభిప్రాయం. నేను, నా తమ్ముడు వాళ్ళందరిని గేలి చేస్తూ ఆనందించే వాళ్ళం.

***భక్తుడు:*** *నాకు గురువు మీద ఆధారపడటమంటే, ఇంక నా స్వంత నిర్ణయం తీసుకొనే అధికారం ఉండదేమోనని భయంగా ఉంటుంది...*

***గురువుగారు:*** *మనమేదో స్వంత నిర్ణయాలు తీసుకోగలమనుకొంటూ, ఒకరి మీద ఆధారపడటం వలన మన డెసిషన్ మేకింగ్ పోగొట్టుకొంటామేమోనని భయపడుతుంటాము. మీరు నిజంగా స్వతంత్రులా! మీరు ఏం చేయాలనుకొంటే అది చేయగలుగుతున్నారా? మీరు ఎక్కడికైనా వెళ్ళాలనుకొంటే వెళ్ళగలుగుతున్నారా? మీరు ట్రైన్ రిజర్వేషన్ల*

*మీద ఆధారపడి ఉన్నారు, వెళ్ళిన చోట హోటల్ రూమ్ దొరుకుతుందా లేదా అనే దాని మీద ఆధారపడి ఉన్నారు.*

*ఇక్కడ ఏం జరుగుతూ ఉందంటే నీవు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఆలోచిస్తుంటావు. ఇది చేయాలా? లేక అది చేయాలా? అని డైలమా! చివరకు ఏదో ఒకటి చేయాలి కనుక తప్పని పరిస్థితిలో ఒక నిర్ణయం తీసుకుని అది నీ డెసిషన్ అనుకొంటావు. చాలాసార్లు జరిగేదేమిటంటే తప్పనిసరిగా ఏదో ఒకటి డిసైడ్ చేయాల్సిన అవసరం ఏర్పడే దాకా ఏమీ నిర్ణయించుకోలేరు. ఎందుకంటే అది సరైనదో, కాదో వాళ్ళకు తెలియదు. అంతెందుకు మనం హోటల్‌కి వెళ్ళినప్పుడు ఏమి తినాలన్నదే డిసైడ్ చేయలేము. చేతిలో మెనూ పట్టుకొని అరగంట కూర్చుంటాము. ఇది తినాలా? అది తినాలా? అని ఆలోచిస్తాము.*

*చివరకు సహనం కోల్పోతున్న సర్వర్‌ను చూచి "సరే, ఇది తీసుకురా, అది తీసుకురా" అంటాము. అతను "లేవు సార్" అంటాడు. మళ్ళీ కథ మొదలు (నవ్వులు). అక్కడ ఏమి డెసిషన్ తీసుకొన్నట్లు? అందుకని మనం నిజంగా స్వతంత్రులమని సొంత నిర్ణయాలు తీసుకొంటామని, ఎవరినైనా ప్రేమించటం వలన మన వ్యక్తిత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని, మన డెసిషన్ మేకింగ్‌ని పోగొట్టుకొంటామని అనుకోవడం నిజం కాదు. మనకు ఇది ముందు నుండే లేదు. లేని వాటిని పోగొట్టుకునేది ఏముంటుంది?*

*నీలో ప్రేమ పుట్టి, అది నీ అనుభవంలోకి వచ్చినప్పుడు, నీకు స్వతంత్రుడవు అనే భావన పోగొట్టుకోవటం కూడా సంతోషంగానే ఉంటుంది. ఉదాహరణకు ఒక అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకున్నారు. అబ్బాయికి తెలుపురంగు ఇష్టం. ఆ అబ్బాయి ఆ కోరిక వ్యక్తీకరించక పోయినా, అమ్మాయి తనంతట తానే తెల్ల బట్టలు, తెల్ల రిబ్బన్, తెల్ల జోళ్ళు – ఇలా అంతా తెలుపులోనే ఉండటానికి ప్రయత్నిస్తుంది. ఇక్కడ ఆమె ఇష్టాయిష్టాలు ఏమైనాయి? అలాగే సద్గురువును ప్రేమించి, ఆయన మీద ఆధారపడటంలో స్వతంత్రం, వ్యక్తిత్వం ఉందా లేదా అన్న ప్రశ్నే రాదు!*

గణేష్ రోజూలాగా చదువుకొందామని వచ్చి నా పరిస్థితి చూచి వెంటనే బాబా, గురువుగారు ఉన్న ఫోటో ఇచ్చి "ఉదయం పరీక్షకు నువ్విప్పుడేం చదవలేవు,

పడుకోవడం తప్పు. ఒక పని చెయ్యి. నీకు నచ్చినా నచ్చకపోయినా ఈ ఒక్కసారి నా మాట విను. బాబా, గురువుగారు కరుణిస్తే నీ తలనొప్పి తగ్గిపోతుంది. ఇదిగో! ఈ ఫోటోకు నమస్కరించుకొని, దానిని దిండు క్రింద పెట్టుకుని పడుకో!" అన్నాడు.

నిస్సహాయస్థితిలోనున్న నేను ఆ ఫోటో తీసుకుని, నమస్కరించి 'ఉదయానికల్లా నా బాధ తొలగిపోవాలి. నేను పరీక్ష బాగా వ్రాయగలగాలి' అని ప్రార్థించి ఫోటో తలక్రింద పెట్టుకొని పడుకున్నాను. మామూలుగా తలనొప్పి వస్తే నాకు నిద్ర పట్టదు. ఆ బాధ ఒకటి రెండు రోజులు ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో రేపు ఉదయం జరిగే పరీక్షకు వెళ్ళగలనా అనిపించింది. కనీసం పరీక్షకు వెళితే ఎంతో కొంత వ్రాసి పాస్ కాగలనన్న నమ్మకముంది. కానీ చిత్రంగా ఆ రోజున అంత తలనొప్పి వచ్చినా కొద్దిసేపట్లోనే నిద్రపోగలిగాను. మరునాటి ఉదయం నిద్రలేచేసరికి ఎంతో హాయిగా, తేలిగ్గా అనిపించింది. తలనొప్పి వచ్చిన ఛాయలు కూడా కనిపించలేదు. ఆ క్షణంలోనే బాబా, గురువుగారి మీద నమ్మకం ఏర్పడింది. పరీక్ష వ్రాయగలనని అనిపించింది.

లేచి పరీక్షకు తయారవుతున్న నన్ను చూసి గణేష్ సంతోషంగా 'బాబా గుడికి వెళదాం' రమ్మన్నాడు. ఇద్దరం కాలేజీ ప్రక్కనే ఉన్న బాబా గుడికెళ్ళాము. అక్కడే కూర్చొని కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానాలు చూసుకొని, టైమవుతుండడంతో నేరుగా పరీక్ష హాలుకు వెళ్ళిపోయాము.

అప్పటికి పరీక్షలు మొదలై రెండు వారాలవుతుంది. ఆ రోజున జరిగే ఫిజిక్స్ థర్డ్ పేపరు కోసం చదివి చాలా రోజులవుతుంది. ఆ రాత్రి కనీసం ఒక్కసారి చదవడానికి కూడా వీలులేనంత తలనొప్పి. ఇన్ని చిక్కుల మధ్య పరీక్ష ఎలా వ్రాయబోతానో అని ఒక ప్రక్క మథనపడుతున్నా, గురువుగారు మీద ఉన్న నమ్మకంతో ధైర్యంగానే ఉన్నాను. అయితే ఆతృతగా పరీక్ష పేపరు అందుకొన్న నేను ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. ఎందుకంటే ఇందాక మేము బాబా గుడిలో ఏవయితే రివిజన్ చేసుకొన్నామో అవే ప్రశ్నలు వచ్చాయి. వాటికి చాలావరకు నేను సమాధానాలు వ్రాయగలిగాను. అప్పుడే నేను మొదటిసారిగా బాబాకు, గురువుగారికి మనస్ఫూర్తిగా, కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించుకున్నాను.

అప్పటి నుండి నేను సాయిబాబా మందిరానికి, సత్సంగానికి క్రమం తప్పకుండా వెళ్ళసాగాను. రిజల్ట్స్ వచ్చాయి. చూస్తే న్యూస్ పేపర్‌లో నా నెంబర్ లేదు. అంతో

ఇంతో అనుమానంగా ఉన్న మేథ్స్ పేపరులో పాసయ్యాను, కానీ సంతృప్తికరంగా వ్రాసిన ఫిజిక్స్ పేపర్‌లో ఫెయిలయ్యాను. బాబా, గురువుగారి అనుగ్రహంతో ఆ పేపర్ బాగా వ్రాశాననుకున్నానే! మరిట్లా అయిందేమిటి? తప్పక ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుందని నిర్ణయించుకొని రీవాల్యుయేషన్‌కి అప్లై చేశాను.

పదిహేను రోజుల్లో గురుపౌర్ణమి పర్వదినం వస్తోంది. మా ఊరి నుండి కొందరు సత్సంగసభ్యులు శిరిడీ వెళుతున్నారు. నాకు ఎంతగానో వెళ్ళాలని ఉంది కానీ పరీక్ష పోవడంతో మా నాన్నను అడగలేకపోయాను.

అంతలో శిరీష అక్కయ్య వాళ్ళు శిరిడీకి వెళుతూ కందుకూరు వచ్చారు. వాళ్ళను చూడగానే నాలో ఆశ కలిగింది. గురువుగారిని చూడాలని, వాళ్ళతో శిరిడీ వెళ్తానని మా అమ్మనడిగాను. నేను గురువుగారిని ప్రార్థించిన ఫలితమేమో, ఇంట్లో వాళ్ళు నన్ను అక్కా వాళ్ళతో పాటు శిరిడీ పంపించేందుకు ఒప్పుకున్నారు. కానీ నాకు రిజర్వేషన్ లేదు. హైదరాబాద్ వరకు క్రిక్కిరిసిన జనరల్ కంపార్ట్‌మెంటులో కనీసం కూర్చొనేందుకు కూడా చోటు లేకుండా రాత్రంతా డోర్ దగ్గర నిలబడి ప్రయాణించాల్సి వచ్చింది. ఆశ్చర్యంగా నాకదేమీ కష్టం అనిపించలేదు. పైగా నేను శిరిడీ వెళ్ళబోతున్నానని ఏదో తెలియని ఆనందం.

హైదరాబాద్‌లో మన్మాడు ఎక్స్‌ప్రెస్ ఎక్కాము. అదృష్టవశాత్తు మా బావ ఒక బెర్త్ సంపాదించగలిగాడు. సుఖంగా నిద్రపోయి శిరిడీ చేరుకొన్నాము.

మరునాడు కాకడ ఆరతికి వెళ్ళాము. ఆరతి సమయంలో బాబాను చూడడం అద్భుతంగా అనిపించింది. అదే రోజు సాయంత్రం సత్సంగహాలులో వేదికపై ప్రథమంగా గురువుగారిని దర్శించుకున్నాను. వారిని చూడగానే ఒక్క ఉదుటున వెళ్ళి వారి పాదాలపై పడి నా మనసులోని బాధనంతా చెప్పుకోవాలనిపించింది. రోజూ గురువుగారి దర్శనం మాత్రం లభిస్తున్నది కానీ వారికి వ్యక్తిగతంగా విన్నవించుకోవడానికి అవకాశం ఉండే ఊదీ దర్శనం మాత్రం లభించలేదు. గురువుగారి ఊదీ దర్శనం ఉండదేమోనని చాలా మథనపడ్డాను.

నేను తిరిగి కందుకూరు బయలుదేరే ముందు రోజు రాత్రంతా గురుస్థాన్‌లో ప్రదక్షిణలు చేస్తూ గడిపాను. తెల్లవారుఝామున 5 గంటలకు ప్రదక్షిణలు ఆపి సాయిపథం వైపు వస్తుండగా, మా అక్కయ్య నన్ను అల్లంత దూరంలో చూచి ఆతృతగా నా దగ్గరకొచ్చి "త్వరగా రా, ఎక్కడికి పోయావు? గురువుగారు ఊదీ

దర్శనం ఇస్తున్నారు. పద" అని తొందరపెట్టింది. ఆ మాట వినటం ఆలస్యం, చెప్పులక్కడ విసిరేసి లోపలకు పరుగెత్తాను. క్యూలో ఇక నలుగురైదుగురు మాత్రమే ఉన్నారు. నేను చివరివాడిని. గురువుగారు అప్పటికే లేచి నిల్చొని ఉన్నారు. ఇక లోపలికి వెళ్ళిపోతారేమో అని నాకు ఒక్కసారిగా భయమూ, దుఃఖమూ కలిగాయి. 'ఇట్లాంటి అవకాశం మళ్ళీ వస్తుందా? నాతో మాట్లాడుతారో లేదో, గురుదేవా! దయచేసి ఆగండి' అని నేను మనసులో ప్రాధేయపడసాగాను. గురువుగారితో మాట్లాడే అవకాశం కోసం ఆతృతగా వారి వైపు చూశాను.

గురువుగారికెంత ప్రేమ. నా మనసులోని వేడుకోలు విన్నారేమో! నా వంక చూసి రమ్మన్నట్లు తలూపారు. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. కలో, నిజమో నాకర్థం కాలేదు. నన్నేనా, కాదా అని ఒక్కసారి వెనక్కి చూశాను. నా వెనుక ఎవరూ లేకపోవడంతో సందేహంగా గురువుగారి వైపు చూశాను. అంతలో గురువుగారు మళ్ళీ పిలిచారు. నన్నే పిలుస్తున్నారని నిర్ధారణకొచ్చి సంతోషంతో లోపలికెళ్ళబోయాను. అయితే తలుపు దగ్గరవున్న గురుబంధువు ఆపడంతో నేను చిన్నబోయి అక్కడే ఆగి, గురువుగారి వైపు చూశాను.

ఈసారి గురువుగారు స్పష్టంగా "ఆ బాబుని లోపలికి పంపించు" అన్నారు.

అంతే ఒక్క ఉదుటున లోపలకెళ్ళి గురువుగారి పాదాలపై పడిపోయాను. నేను ఆ పాదాలను తాకగలగడం, గురువుగారిని దగ్గరగా చూడగలగడం అదే ప్రథమం. వారి పాదాలకు నమస్కరించి తలెత్తి గురువుగారిని చూడగానే తెలియని దుఃఖం పొంగుకొచ్చేసింది. అలాగే వారి పాదాల దగ్గర మోకరిల్లి నా హృదయ వేదనంతా తీరేలా ఏడ్చేశాను. గురువుగారెంతో శాంతంగా దయతో నావంక చూస్తూనే ఉన్నారు.

కొంతసేపటికి నేను కుదుటపడ్డాక, వారు నా వంక ప్రేమగా చూస్తూ చిరునవ్వుతో "ఊ చెప్పు" అన్నారు. నేను నా మనసులోని వేదనంతా వారికి చెప్పుకున్నాను. పరీక్ష పోయిన సంగతి, నా దిగుళ్ళు, ఆశలు అన్నీ. నాకు ఎమ్.సి.ఎ. చదవాలనుందని చెప్పాను.

గురువుగారు అన్నీ విని ఊదీ పెట్టి ఆశీర్వదించి "శుభం" అన్నారు.

నా మనసులో నుండి కొండంత భారం తొలగిపోయినట్లయింది. మనసంతా ఎంతో ప్రశాంతంగా తృప్తిగా అనిపించింది. అసలా మధుర క్షణాలను నేనెప్పటికీ మరచిపోలేను. తర్వాత శిరిడీ నుండి కందుకూరు బయలుదేరి వచ్చేస్తుంటే ఏదో ఒక

ఆనందాన్ని వదలి వెళుతున్న దిగులు నన్నావరించింది. వెళుతున్నందుకు బాధగా ఉన్నా శిరిడీ స్మృతులు కొండంత భద్రతా భావాన్నిచ్చాయి.

శిరిడీ నుండి వచ్చిన ఇరవైరోజులకు రీవాల్యుయేషన్ మార్కులు వచ్చాయి. "నువ్వు పాసయ్యావు" అని సత్సంగ సభ్యులే వచ్చి చెప్పారు. ఇది ఖచ్చితంగా గురువుగారి ఆశీర్వాద బలమే. ఆ తర్వాత కొద్దిరోజులకు నేను ఆశించినట్లుగానే ఎమ్.సి.ఎ.లో కూడా చేరగలిగాను.

*"ఎల్లప్పుడు 'సాయి సాయి' అని స్మరించుచుండిన సప్తసముద్రములు దాటించెదను. ఈ మాటలను విశ్వసింపుము. తప్పక మేలు పొందెదవు. పూజాతంతుతో నాకు పని లేదు. షోడశోపచారములుగాని అష్టాంగ యోగములుగాని నాకు అవసరం లేదు. భక్తి ఉన్నచోటనే నా నివాసము" అని శ్రీసాయిబాబా అన్నారు.*

*... శ్రీసాయిసచ్చరిత్ర, 13వ అధ్యాయము*

# మారిన దృక్పథం - చేర్చెను సాయిపథం

కావర్తపు హేమసుందర్
గవర్నమెంట్ ఉద్యోగి, కందుకూరు
జన్మించిన సం॥ 1973

కందుకూరు, డిసెంబర్ 2001

మాది ఉమ్మడి కుటుంబం. బి.యస్‌సి. వరకు నన్ను మా అన్నదమ్ములే చదివించారు. ఆపైన చదివేందుకు ఆర్థిక వసతి లేనందున అంతటితో చదువు ఆపి వేయవలసి వచ్చింది. 1995లో మా కుటుంబంలో అందరూ వేరుపడి, ఎవరికి వారుగా వెళ్ళిపోయారు. నా డిగ్రీ సర్టిఫికేట్, కొద్దిపాటి పుస్తకాలు తప్ప నా వంతు ఆస్తిగా నాకేమీ దక్కలేదు.

జీవనోపాధి వెతుక్కుంటూ నేను హైదరాబాద్ వెళ్ళాను. అతి ప్రయత్నం మీద లాబొరేటరీలో కెమిస్టుగా ఉద్యోగం దొరికింది. నాకు చిన్నతనం నుండి ఆస్తమా ఉండేది. దాని మూలంగా కొన్ని వేల మాత్రలు మింగానంటే అతిశయోక్తి కాదు. ఒక్క రోజు మాత్ర వేసుకోవడం మానినా మరునాటికల్లా ఆస్తమా వచ్చేది. ఆ పరిస్థితిలో నేను కెమికల్ కంపెనీలో పనిచేయాల్సి రావడంతో నా ఆరోగ్యం పూర్తిగా పాడయింది. జీవించాలనే ఆశ ఉంటే ఆ ఉద్యోగం వదిలేయమనీ, నా ఆరోగ్యస్థితికి ఆ ఉద్యోగ వాతావరణానికి ఎట్టి పరిస్థితిలో సరిపడదని నన్ను పరీక్షించిన డాక్టరు గట్టిగా చెప్పారు. ఇక చేసేది లేక నేను ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి మళ్ళీ కందుకూరు వచ్చేశాను.

కాలేజీ రోజులనుండి నాకు మా మాథ్స్ లెక్చరర్ సాయిప్రసాద్‌గారు తెలుసు. తరచూ వారి రూమ్‌కు వెళుతుండేవాడిని. సాయిప్రసాద్‌గారు ఎప్పుడూ సాయిబాబా గురించి, శ్రీబాబూజీ గురించి ఎంతో ఆరాధనగా, ఉన్నతంగా చెప్తూ ఉండేవారు. ఆయనెంత చెప్తున్నా నేనంతగా పట్టించుకోలేదు. నాకు మొదటి నుండి దైవం, గురువులు అంటే ఏ మాత్రం భక్తి, ఆసక్తి లేవు. నేను సైన్స్ గ్రాడ్యుయేట్‌ని, ప్రతిదీ సైంటిఫిక్‌గా ఆలోచించాలని నమ్మేవాడిని. అదే విషయాన్ని అంటే దేవుడు లేడని సాయిప్రసాద్‌గారితో సంవత్సరాలుగా వాదించి ఉంటాను. నా వాదనలు ఎలా ఉన్నా నా ఆస్తమా బాధను చూడలేక సాయిప్రసాద్‌గారు నన్ను నెల్లూరులో డా॥ నరేంద్ర దగ్గరకు పంపించారు. ఆయన నన్ను పరీక్షించి మందులు ఇస్తూనే “నీ ఆస్తమాను తగ్గించేది గురువుగారు మాత్రమే. ఈ మందుల వల్ల లాభం లేదు” అని ఎప్పుడూ

చెప్పేవాడు. ఒక్క సంవత్సరంపాటు ఆ మందులు వాడాను. అవి వాడుతున్నంత కాలం తగ్గినట్లే తగ్గి మానేస్తే యథాస్థితికి వచ్చేది.

***భక్తుడు:*** *గురువు మీద నమ్మకం ఎలా కలుగుతుంది?*

***గురువుగారు:*** *'నమ్మకం' అనేది సమస్య ఎందుకవుతుంది? నమ్మకం లేనిదే జీవితాన్ని ఎలా సాగించగలవు? దైనందిన జీవితమంతా నమ్మకం మీదే ఆధారపడి ఉంది. నీ పనివాళ్ళను నమ్మాలి. భార్యను నమ్మాలి. నీ భార్య నిన్ను నమ్మాలి. పిల్లల్ని నమ్మాలి. ఇంకా ఇలాంటివి ఎన్నో! మనం చాలా విషయాలు నమ్ముతాము. కాని సద్గురువును, భగవంతుని నమ్మము. మిగతా అన్ని విషయాల్లో మనం చాలా తార్కికంగా, తెలివిగా ఆలోచిస్తున్నామనుకుంటాం. కాని సద్గురువును నమ్మడమనే విషయంలో మాత్రం, గుడ్డిగా అవివేకంగా అనిపిస్తుంది. ఎందుకంటే సద్గురువు ఇవ్వాలనుకున్నది నీకవసరం లేదు. నీకు ఏదైనా అవసరమైతే మాత్రం నువ్వు తార్కికంగా ఆలోచించి నమ్మటానికి ప్రయత్నిస్తావు.*

*నువ్వు ఒక పనివాణ్ణి పెట్టుకొనేటప్పుడు వాడితో మాట్లాడి, వాడి గురించి తెలిసిన వాళ్ళను వాకబు చేసి, వాడిని కొంతకాలం పరీక్షించి అప్పుడు వాడిని నమ్మి నీ ఇంటిని, మిగతా వాటినన్నింటిని వాడి రక్షణలో వదిలి ఊరు వెళ్తావు. నువ్వు ఒక వాచ్‌మేన్‌ను నమ్ముతావు కానీ సాయిబాబా లాంటి సద్గురువును నమ్మవు. నీవు సందేహించాలి అనుకున్నప్పుడు జీవితంలో ప్రతి దాన్ని సందేహించి, సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించు. అది నేను అభినందిస్తాను. నీకు నీ జీవితంలో దేని మీద సందేహాలు లేనప్పుడు, ఒక్క ఆధ్యాత్మిక సాధనలోనే సందేహం ఉన్నప్పుడు అది నీ బలహీనత. సందేహించాలనుకుంటే ప్రతిదాన్ని సందేహించి ప్రశ్నించు. నీ ఉనికిని కూడా సందేహించు.*

1996లో గురుపూర్ణిమకు శిరిడీ వెళ్ళి మొదటిసారిగా గురువుగారిని దర్శించుకున్నాను. అప్పటి నుండి నా జీవితగమనం పూర్తిగా మారిపోయింది. నాకు జన్మనిచ్చింది మా తల్లిగారైతే అయితే పునర్జన్మనిచ్చింది ఖచ్చితంగా సాయిపథమే!

గురువుగారిని దర్శించుకొన్న తర్వాత ఆశ్చర్యంగా నా ఆస్తమా పూర్తిగా చేత్తో తీసేసినట్లే పోయింది. ప్రస్తుతం నేను ఆస్తమా పేషంటు తినకూడని స్వీట్స్, ఫలాలు, కూల్‌డ్రింక్స్‌తో సహా అన్నీ తీసుకొంటున్నాను. మామూలుగా తిరగగలుగుతున్నాను. కానీ ఆస్తమా తిరిగి రాలేదు.

అంతే కాదు, గురువుగారిని కలిసినప్పటి నుండి నా మానసిక స్థితిలో ఎంతో మార్పు వచ్చింది. అంతకు ముందు జీవితంలో ఆనందం అంటే ఏమిటో తెలియనట్లుండే వాడిని. ఇప్పుడు ఎంతో హాయిగా, నిశ్చింతగా ఉండగలుగుతున్నాను. గతంలో నా ఆరోగ్యం, ఆర్థిక లేమి నన్ను బాగా కృంగదీస్తుండేవి. గురువుగారి దర్శనం నా జీవిత దృక్పథాన్నే పూర్తిగా మార్చివేసింది. నా ప్రవర్తనలో, ఆలోచనావిధానంలో ఎంతో మార్పు వచ్చింది.

గురువుగారి అనుగ్రహంతో ప్రస్తుతం నేను ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.లో బస్ కండక్టర్ ఉద్యోగం చేస్తున్నాను.

# ప్రయత్నాలన్నీ విఫలం - సద్గురుకృపతో సఫలం

బచ్చలి కిరణ్
స్టూడెంట్, కందుకూరు
జన్మించిన సం॥ 1979

కందుకూరు, డిసెంబర్ 2001

నేను కందుకూరులో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. విద్యార్థి దశలో మార్క్స్ షీట్, సర్టిఫికేట్స్‌కు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో అందరికీ తెలిసిందే. నా పదవ తరగతి సర్టిఫికేట్‌లో నేను పుట్టిన సంవత్సరం 1979 బదులు పొరపాటున 1975 అని రికార్డు చేయబడింది. దాని వలన భవిష్యత్తులో ఎన్నో విద్యా, ఉద్యోగ అవకాశాలు పోవచ్చునీ, గవర్నమెంటు జాబ్‌లో కనుక చేరితే ఎంతో సర్వీసు నష్టపోతానని అందరూ భయపెట్టసాగారు. దాంతో బెంబేలు పడిపోయి నేను చదివిన స్కూలు ద్వారా దానిని ఎస్.ఎస్.సి. (S.S.C.) బోర్డుకు పంపాము. చాలా మందిని కలుసుకొని సహాయం చేయమని అడిగాము. కానీ ఫలితం లేకపోయింది. ఈలోగా నేను రెండుసంవత్సరాల ఇంటర్మీడియట్ కోర్సు ఫస్ట్ క్లాసులో పాసై, డిగ్రీలో చేరడం కూడా జరిగిపోయింది. కానీ సర్టిఫికేట్‌లో తప్పుపడిన తేదీని మాత్రం మార్చుకోలేక పోయాను. మూడేళ్ళ లోపు సరిచేయకపోతే ఇక తర్వాత మార్చుకోవడానికి వీలుపడదని గవర్నమెంటు రూల్స్ తెలిసినవారు చెప్పారు. మూడవ సంవత్సరం కూడా అయిపోతుందేమోనన్న ఆందోళన నాలో ఎక్కువ కాసాగింది.

ఇదిలా ఉండగా మా ప్రక్క ఇంట్లోనే ప్రతి వారం శ్రీసాయిబాబా సత్సంగం జరుగుతుండేది. మా పెదనాన్నగారబ్బాయి ప్రసాద్ క్రమం తప్పక ఆ సత్సంగాలకు వెళుతుండేవాడు. నాకు మాత్రం ఎప్పుడూ వెళ్ళాలనిపించలేదు. ప్రసాద్ ఎప్పుడూ గురువుగారి గురించి గొప్పగా చెబుతుండేవాడు. నా సమస్య తెలిసినవాడు కాబట్టి నా సర్టిఫికేట్ గురించి గురువుగారికి ఉత్తరం వ్రాసుకోమని సలహా ఇచ్చాడు. గురువులు ఆధ్యాత్మిక సంబంధమైన సమస్యలయితే తీర్చగలరుగాని ఇట్లాంటి ఆఫీసు విషయాలలో ఏం సహాయం చేయగలరు. అదంతా ఒట్టి వృథా ప్రయత్నం అనుకున్నాను. ఒక వైపు ఆ తేదీ మార్చుకొనే గడువు అయిపోవస్తుండడంతో తప్పనిసరై లాటరీ టికెట్టు మాదిరిగా వస్తే వస్తుంది లేకపోతే పోయేదేం లేదు అన్నట్లు ఒక ఉత్తరం వ్రాసి ప్రసాద్ శిరిడీ వెళుతుంటే అతనికిచ్చి నేను నెల్లూరు వెళ్ళాను.

పది రోజుల తర్వాత తిరిగి వచ్చేసరికి డేట్ సరిచేయబడిన నా సర్టిఫికేట్ ఇంట్లో ఉంది. నేను దిగ్భ్రాంతి చెందాను! మూడేళ్ళ నుండి సరికానిది వారం రోజులలో ఎలా సరై వచ్చిందో గురువుగారికే తెలియాలి.

నిజంగా వారి శక్తి ఏమిటన్నది నాకు అప్పుడర్థమయింది. వారిపట్ల నాకున్న సంశయ భావం తొలగిపోయింది. నేనెవరో తెలియకుండానే, నేను వారిని పూర్తిగా విశ్వసించకుండానే, మనస్ఫూర్తిగా ప్రార్థించకుండానే నా బాధ తీర్చారు. ఇదే నాకొక వండర్. అప్పటి నుండి నేను కూడా సత్సంగానికి క్రమం తప్పక వెళ్ళడం ప్రారంభించాను. గురువుగారిని తలచుకోగానే ఎలా సహాయం అందిస్తారు అన్నది అత్యంత ఆశ్చర్యకరం, ఆనందకరం. ఆ తర్వాత ఏడాది విజయదశమికి శిరిడీ వెళ్ళి మొదటిసారిగా గురువుగారిని దర్శించుకున్నాను.

***భక్తుడు:*** *గురువుగారూ! సహాయాన్ని అర్థించటానికి సరియైన పద్ధతి అంటూ ఉంటుందా?*

***గురువుగారు:*** *నీకు కోరిక ఉన్నప్పుడు, అవసరమున్నప్పుడు సహాయం అడగకుండా ఉండలేవు. నువ్వు నీళ్ళలో మునిగిపోతున్నావనుకో, నీకు ఈత రాదు. ఏం చేస్తావు? నీకు ఏది దొరికితే దాన్ని గట్టిగా పట్టుకుంటావు. "ఈ కర్ర నన్ను ఒడ్డుకు చేరుస్తుందా లేదా" అని ఆలోచించుకుంటూ ఉంటావా? దొరికిన దాన్ని గట్టిగా పట్టుకుంటావు. అంతే!*

*కాకడ ఆరతిలో "మీబుడతో భవభయ డోహీ ఉద్ధరా" అంటే, "నిరాశా నిస్పృహలతో ఈ సంసారసాగరంలో కొట్టుమిట్టాడుతున్న నన్ను దరి చేర్చు బాబా" అని బాబాను వేడుకోవడంలో సహాయాన్ని ఎలా అర్థించాలో చక్కగా వివరించారు.*

*ముందు మన అవసరం ఏంటో మనకు తెలిస్తే, సహాయం అడిగే పద్ధతి దానంతటదే వస్తుంది. దాని గురించి ప్రత్యేకంగా నేర్చుకోవాల్సిన పని లేదు. లేదూ, నీ స్వంత ప్రయత్నంతోనే శాయశక్తులా ప్రయత్నించి చూడు. మంచిదే. ఎవరినీ సహాయం కోరవలసిన అవసరమే లేదు. నువ్వేం చేసినా నీకు సాధ్యపడకపోతే ఏం చేస్తావు? నీకు వేరే ఛాయిస్ లేదు. సద్గురువును సహాయం కోరాల్సిందే. అప్పుడు గురువెందుకు?*

*గురువు సహాయం అవసరమా?"* అనే ప్రశ్నలే రావు. 'నాకు ఇంకో దారే లేదు' అనే స్థితి వచ్చేంతవరకు నువ్వేమైనా చెయ్యగలిగితే చెయ్యి.

బుద్ధుడు అంతటి మహాత్ముడు తన ప్రయత్నాలన్నీ విరమించిన తర్వాతనే నిర్వాణస్థితిని పొందాడు. ఆయన కూడా నిస్సహాయస్థితిని అనుభవించాల్సి వచ్చింది. నీ నిస్సహాయతను నువ్వు పూర్తిగా అర్థం చేసుకోగలిగితే నీకు సహాయం అందుతుంది. కాని మనకు మన అవసరాలేంటో, మనకేం కావాలో వద్దో కూడా తెలియదు. మన ప్రయత్నాలు కూడా సంపూర్ణంగా ఉండవు. మనం ఎంత నిస్సహాయులం అని తెలియచెప్పేదానికి కూడా మనకు ఇంకొకరి సహాయం అవసరం. అదీ మన స్థితి. అందుకని నేను చెప్పేదేమిటంటే, నీ నిస్సహాయస్థితిని నీవు పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకొని అర్థం చేసుకో. అప్పుడు నువ్వే సహాయాన్ని కోరి, దాన్ని పొంది అనుభవించగలవు.



అపు'రూప' దర్శనం

# నా దైవం

అళహరి వాసు
ఉద్యోగి, యు.ఎస్.ఎ.
జన్మించిన సం॥ 1972

యు.ఎస్.ఎ., సెప్టెంబర్ 2002

నా చిన్నతనం నుండి నేను బాబాను ప్రార్థించేవాడిని. నా భావాలన్నింటిని ఆయనతో పంచుకొనేవాడిని. బాబా నుండి ఏదో రెస్పాన్స్ వస్తేగాని సంతృప్తిపడే వాడిని కాదు. ఆ విధంగా బాబా నాకు ఒక తోడుగా ఉండేవారు.

1991లో నేను బి.టెక్. పూర్తి చేశాను. దాంతో అసలు సమస్య మొదలయింది. నాకు జీవితం పట్ల గొప్ప లక్ష్యాలుండేవి. వాటితోపాటు ఎన్నో బలహీనతలు కూడా ఉన్న నేను నా లక్ష్యాలను సాధించడం అంత సులభమైన విషయమేమీ కాదని మెల్లగా గ్రహిస్తూ వచ్చాను. అయినా బాబా ఏదో ఒకటి చేస్తారు అనే నమ్మకంతో ఉండేవాడిని. కానీ 1996 వరకు ఏమీ మార్పులేదు. నా మానసిక పరిస్థితి గందరగోళంగా ఉండేది. దానికి తోడు ఆరోగ్యం కూడా సరిగా ఉండేదికాదు. హైదరాబాద్‌లో ఎటువంటి సంతృప్తినివ్వని ఉద్యోగం చేస్తూ జీవితంలో ఏమీ సాధించలేక, బాబా పట్ల నమ్మకాన్ని కోల్పోతూ, బాబాను "నువ్వు నిజంగా ఉన్నావా" అని ప్రశ్నించడం మొదలుపెట్టాను. బాబాపై కోపం వచ్చేది కాని ఎన్నడూ బాబాను విడిచిపెట్టలేకపోయేవాడిని. లేక ఇలా చెబితే బాగుంటుందేమో ఆయనే నన్ను విడిచిపెట్టలేదని. కాని నా భావాలను పంచుకోవడానికి నాకు భౌతికంగా ఒకరు కావాలి. నాకు ఆయన తిరుగాడే శరీరంతో కావాలి. కానీ ఇది సాధ్యపడేదేనా? ఒకవేళ బాబా నా ముందుకు వచ్చినా నేను ఆయనను గుర్తించి అంగీకరించగలనా? నాకు ఆయన కావాలి, అదే సమయంలో నేను ఆయనను గుర్తించగలగాలి. ఈ విధంగా ఆలోచిస్తూ బాబాను అడుగుతూ ఉండేవాడిని. కొన్నిసార్లు నేను బాబాను భౌతికంగా చూడడానికి సాధ్యపడదు కనుక చచ్చిపోదామని కూడా అనుకొనేవాడిని. కానీ బాబానే ఏదో విధంగా ఆ ఆలోచన నుంచి బయటపడేసేవారు.

అటువంటి సమయంలోనే నాకు నెల్లూరులో డా॥ నరేంద్రగారి ఇంట్లో బాబా సత్సంగం జరుగుతుందని తెలిసింది. అప్పుడప్పుడూ సత్సంగానికి వెళ్తుండేవాడిని. మొదటిసారిగా అక్కడే గురువుగారి గురించి విన్నాను. ఆ రోజుల్లో నాకొక కల వచ్చింది.

కలలో నేను వంగి గురువుగారికి పాదనమస్కారం చేసుకున్నాను. గురువుగారు నా చేయి పట్టుకొని పైకెత్తి అక్కడ ఉన్న బాబా ఫోటోను చూపెడుతున్నారు. ఆ విధంగా కలలో నేను గురువుగారిని మొదట దర్శించుకున్నాను.

*__భక్తుడు:__ "గురువనుగ్రహం సంపాదించడమెలా?" అని భక్తులు భగవాన్ రమణమహర్షిని అడిగినప్పుడు వారు తరచుగా "శరణాగతి వలన" అని సమాధానమిచ్చేవారు. అది ఎలా?*

*__గురువుగారు:__ అవును. కాని ముందు శరణాగతి అనే పదానికి అర్థం తెలుసుకోవాలి. శరణాగతి అంటే మీరనుకునే సరెండర్ (ఏ గత్యంతరం లేక శరణుజొచ్చడం) కాదు.*

*శరణాగతి అంటే– నీ గురువు పట్ల నీకున్న అనన్య ప్రేమ వలన వారికి సర్వస్వం సమర్పించుకోవాలనుకుంటావు. నీ మనస్సంతా గురువే నిండిపోయి ఉంటాడు. గురువు యొక్క ఆలోచనలు తప్పితే మరేం చేయడానికి బుద్ధి పుట్టదు. వారి ప్రేమను అత్యధికంగా పొందాలని పరితపిస్తావు. ఆ ప్రేమ లభించకపోతే గురువును వదలి వెళదామను కుంటావు. కానీ వెళ్ళలేని స్థితిలో అది అసాధ్యమని తెలుసుకుంటావు. గురువు పట్ల నీకున్న అవ్యాజమైన ప్రేమతో ఆయనను వదిలి వెళ్ళలేక ఆయననే అంటిపెట్టుకొని ఉండడం, అది నిజమైన శరణాగతి.*

*__భక్తుడు:__ అంటే గురువును ఆశ్రయించడమే శరణాగతా?*

*__గురువుగారు:__ నీవు గురువు దగ్గరకు వెళ్ళడంతోటే 'శరణాగతి' జరగదు. శరణాగతి అనేది నీ చేతుల్లో కూడా లేదు. అది నీవు కావాలనుకుంటే పొందేది కూడా కాదు.*

*సద్గురువు చేత ప్రేమ ప్రేరేపింపబడి, ఆ ప్రేమానుభవం నీవు చవిచూడడం మొదలుపెట్టిన తర్వాత ఇక నీవు ఆయనను వదిలిపెట్టి పోలేవు. నీవెంత పెనుగులాడినా బయటకు రాలేవు. రమణమహర్షి చెప్పినట్లు "వారి కాలు మొసలి కోరలలో చిక్కుకున్నట్లే!" మొసలి కోరల్లో చిక్కుకొన్న జంతువు బయటకు రావడానికి తీవ్రంగా పెనుగులాడుతుంది. కానీ బయటకు రాలేదు, ఎందుకంటే అది మొసలి కనుక. ఒకవేళ*

*తప్పించుకోగలిగితే అది మొసలే కాదు (నవ్వులు). శరణాగతి ఎప్పుడు జరుగుతుందంటే, నీ గమ్యం చేరుకోవడానికి శరణువేడడం తప్ప మరే సాధనము, మార్గము లేనప్పుడు. అప్పుడు శరణా'గతి' అంటే శరణమే మార్గం. దీనినే వేదాలలో 'నాన్యఃపంథా!" అన్నారు. అంటే వేరు దారి లేదు అని అర్థం. ఇదే శరణాగతి!*

1997 నూతన సంవత్సర సందర్భంగా మా కుటుంబమంతా శిరిడీ వెళ్ళాము. అప్పుడు 1996 డిసెంబర్ 30వ తేదీన నేను మొట్టమొదటిసారిగా గురువుగారిని కలవడం జరిగింది. నేను గురువుగారితో మాట్లాడాలనుకున్నవన్నీ ఒక కాగితంలో వ్రాసుకున్నాను. గురువుగారి దర్శనం చేసుకొని ఊదీ తీసుకున్నానుగాని మా కుటుంబ సభ్యులందరూ ఉండడం మూలాన నేను చెప్పాలనుకొన్నవేవీ చెప్పలేకపోయాను. అందువలన మళ్ళీ దర్శనం లైన్‌లో నిలుచున్నాను. నేను రెండోసారి దర్శనానికి వెళ్ళడం గమనించి ఎవరైనా ఆపుతారేమోనని చాలా భయపడ్డాను. గురువుగారి దయ వలన అలా జరగలేదు. ఈసారి నేను వ్రాసుకొన్నవన్నీ గురువుగారి ముందు చదివేశాను. అప్పుడు వారు *"నీతో తర్వాత మాట్లాడతాను"* అన్నారు. నా బాధనంతా వారి ముందు వెళ్ళబోసుకోవడంతో నాకు కొద్దిగా నిశ్చింతగా అనిపించింది.

రెండురోజుల తర్వాత నేను ఊదీ దర్శనానికి వెళ్ళినప్పుడు "నేను మీతో నా బాధంతా చెప్పేశాను. మీరు మాత్రం ఏమీ సమాధానమివ్వలేదు. పోనీ నన్ను తిట్టనన్నా తిట్టండి" అన్నాను. చివరకు గురువుగారి నోటి నుండి తేనెలూరే మాటలు వెలువడినాయి. *"ఒక్క విషయం గుర్తుంచుకో! నిన్ను నీవు ఎవ్వరితోను పోల్చుకోవద్దు. నీకు నేను ఉన్నాను, మనకి బాబా ఉన్నారు"* అన్నారు.

తర్వాత నా బలహీనత గురించి అడిగాను. *"నువ్వు నీ బలహీనతల గురించి ఆలోచించొద్దు. ఎప్పుడైతే నువ్వు ఆలోచించడం మానేస్తావో అప్పుడే నువ్వు వాటి నుండి బయటపడతావు"* అన్నారు.

తర్వాత నా ఆరోగ్యం గురించి అడిగాను. *"హోమియో మందులు వాడుతూ ఉండు"* అన్నారు. అప్పుడడిగాను 'నా భవిష్యత్తు ఏం చేయాలనుకొంటున్నారు' అని. *"నువ్వు ఏది కావాలనుకొంటే అది చెయ్యి. ఫలితాన్ని నాకు వదిలిపెట్టు. అంతా నేను చూసుకొంటాను"* అన్నారు.

గురువుగారి దగ్గర నుండి వచ్చిన సమాధానాలకు నేను సంతోషపడ్డాను. ఆ రోజు వారు నాతో మాట్లాడిన మాటలు జీవితాంతం మరచిపోలేనివి. ఆ రోజు నుండి నా జీవితంలో ఊహించలేనంత మార్పు కలుగుతూ వచ్చింది. ఆ రోజున నాతో చెప్పినట్లుగానే గురువుగారు ఎప్పుడూ నాతోనే ఉన్నారు. నన్ను ఈ ప్రపంచంలో ముందుకు నడిపిస్తున్నారు. నన్ను అమెరికా పంపారు. ఉద్యోగమిచ్చారు. నేను ఇష్టపడ్డ అమ్మాయితో పెళ్ళి జరిపించడంతో సహా నాకు ఏమేమి అవసరమో అవన్నీ ఇస్తూనే ఉన్నారు. ఈ రోజున జీవితంలో నేను ఏమేమైతే పొందానో అవన్నీ కేవలం వారి అనుగ్రహం వలనే సంభవమైనాయి. నేను గురువుగారి దగ్గరకు రాకమునుపు 'అసలు నిజమైన ప్రేమ అనేది ఉందా?' అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాణ్ణి. అటువంటి ప్రేమను నేను ఇప్పుడు గురువుగారి దగ్గర పొందుతున్నాను.

గురువుగారితో ప్రతి క్షణమూ ఒక అనుభవమే. వారు లేకుండా నేను జీవించలేను. నాకు భగవంతుడంటే ఎవరో తెలియదుగాని, గురువుగారే నా జీవితం. వారే నా దైవం.

# ప్రత్యక్ష ప్రసారం

కోట హరిసుందరి
గృహిణి, టెక్సాస్, యు.ఎస్.ఎ.
జన్మించిన సం॥ 1971

టెక్సాస్, ఆగష్టు 2001

2001 ఆగష్టులో నేను కొలరాడోస్ప్రింగ్స్‌లో నా స్నేహితురాలు సువర్ణ దగ్గరకు వెళ్ళినప్పుడు అక్కడ జనార్దన్‌గారి ఇంట్లో జరిగే సాయిబాబా సత్సంగానికి వెళ్ళాను. ఆయన ద్వారా పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ గురించి విన్న నాకు వారి గురించి తెలుసుకోవాలన్న కోరిక కలిగింది. నేను అంతకు ముందెన్నడూ వారిని కలుసుకోలేదు. కనీసం వారి ఫోటో కూడా చూడలేదు. సత్సంగంలో కూడా బాబా ఫోటో మాత్రమే ఉంది. కానీ, సత్సంగంలో విన్నదాన్ని బట్టి వారెంతో గొప్ప మహాత్ములని నా మనస్సులో ముద్రించుకుపోయింది.

రోజూ నిద్రపోయేముందు, కొద్దిసేపు నా మనస్సులోని ఆలోచనలన్నీ బాబా ఫోటో ముందు చెప్పుకోవడం నాకలవాటు. 2001వ సంవత్సరం, ఆగష్టు 29న నాకెందుకో తెలియని దిగులుగా ఉండడంతో ఆ రాత్రి నా గదిలో పడుకొని బాబా పటం వంక చూస్తూ నా మనస్సులోని భావాలన్నీ చెప్పుకొంటున్నాను. 'బాబూజీ వంటి గొప్ప మహాత్ముని నేనెందుకు దర్శించుకోలేకపోతున్నాను' అని బాధపడ్డాను.

అప్పటికప్పుడు వారిని స్మరించుకొని 'గురువుగారూ! నేను మీ గురించి విన్నదంతా నిజమే అయితే మీ దర్శనం, బాబా దర్శనం కావాలి" అని ఆర్తిగా ప్రార్థించి పడుకున్నాను.

ఆ తెల్లవారుఝామున నాకొక కల వచ్చింది. కలలో ఒక వ్యక్తి తెల్లని పంచె, బనీను ధరించి తెల్లని పైపంచతో కనిపించారు. వారు ఒక కుర్చీలో కూర్చొని, తమ చుట్టూ ఉన్నవారి ప్రశ్నలకు సమాధానాలు చెప్తున్నారు. వింత ఏమిటంటే ఆ బృందంలో నేనూ ఉన్నాను. నాతోనూ వారు మాట్లాడుతున్నారు. అదేమిటో నాకు సరిగ్గా గుర్తు లేదు. అంతలో మా పాప నిద్రలో లేచి ఏడవడంతో నాకు మెలకువ వచ్చేసింది. టైమ్ సరిగ్గా 4.20గం.లు. పాపకి పాలు త్రాగించి పడుకోబెట్టాను. కలలో కుర్చీలో కూర్చున్నవారు అతి నిరాడంబరంగా కనిపిస్తున్నప్పటికీ వారు అసాధారణమైన వ్యక్తి అని నాకనిపించింది. వారు ఎవరా అని ఆలోచిస్తూ అలాగే మరలా నిద్రపోయాను.

నిద్రలో నాకు మరో కల వచ్చింది. ఆ కలలో, నేను పడుకొని ఉన్నాను. మా అమ్మ పాలను చల్లార్చాలని, పాలను ఒక ప్లేట్‌లో పోసి ఉంచింది. నేను ఆ పాలల్లో శ్రీసాయిబాబాను చూశాను. రాయిపై కూర్చుని ఉన్న ఫోటోలో మాదిరిగా బాబా కుడికాలుని ఎడమకాలుపై వేసుకొని ఆశీనులై, చాలా అందంగా, వర్ణించలేని సౌందర్యంతో చిరునవ్వులు చిందిస్తూ చూస్తున్నారు. నేను ఆనందంతో తల త్రిప్పి నాతో ఉన్నవారితో బాబా గురించి చెప్పాలనుకొంటున్నాను కానీ నా వల్ల కావడం లేదు. అసలు బాబా నుండి నా చూపు మరల్చుకోలేకున్నాను. నా నోటిలోంచి 'బా..బా..బాబా' అని మాత్రం అనగలుగుతున్నాను, అంతే. ఆ ప్రయత్నంలోనే హఠాత్తుగా నాకు మెలకువ వచ్చేసింది. మనసంతా తెలియని ఆనందం. ఆ రోజు గురువారం! చెరగని స్మృతిగా నా మనసులో ముద్రించుకుపోయింది.

బాబా కనిపించారు. నా కోరిక తీరింది. ఇంతకీ మొదటి కలలో కనిపించినవారు ఎవరో? అని ఆ మధ్యాహ్నం దాకా అదే ఆలోచనైపోయింది. మధ్యాహ్నం కొలరాడో నుండి నా స్నేహితురాలు సువర్ణ ఫోన్ చేసింది. ఆ వారం జరిగిన సత్సంగ విశేషాలు చెప్పింది. నేను నాకు వచ్చిన కల గురించిన వివరాలు చెప్పి శ్రీబాబూజీ ఫోటో ఒకటి వెంటనే పంపించమని అడిగాను. మనసులో ఏ మూలనో నాకు కలలో కనిపించింది గురువుగారే అయివుండవచ్చన్న ఆశ... వారి ఫోటో చూస్తే తెలిసిపోతుంది కదా అన్న ఆత్రుత...

సువర్ణ "ఫోటో తప్పక పంపిస్తాను. ఈ లోపు 'సాయిపథం.కామ్' అనే వెబ్ సైట్‌లో గురువుగారి ఫోటోలు చూడవచ్చ"ని చెప్పింది. నేను వెంటనే ఇంటర్‌నెట్‌లో ఆ వెబ్‌సైటు చూశాను. అందులో గురువుగారి ఫోటోలు చూడగానే నాకు కలిగిన ఆనందానికి అంతేలేదు. నాకు కలలో కనిపించింది గురువుగారే! నా ప్రార్థనను, కోరికను మన్నించి వారు నాకు తమ దర్శనమివ్వడంతో పాటు సాయిబాబా దర్శనాన్ని కూడా ప్రసాదించారు. మనసారా ప్రార్థిస్తే ఆ మహాత్ముని అనుగ్రహం మనకెప్పుడూ అనుభూతమవుతూ ఉంటుందన్న నిదర్శనాన్ని ఇచ్చారు నాకు ఆ స్వప్నానుభవంతో.

నా అనుభవాన్ని డల్లాస్‌లో ఉన్న సూర్యప్రకాష్‌గారు విని తిరువణ్ణామలైలో గురువుగారి దగ్గరే ఉంటున్న ఒక గురుబంధువుకి నా అనుభవాన్ని చెప్పారు. ఆయన ఎంతో ఆశ్చర్యంతో "అచ్చం తనకు కలలో కనిపించిన విధంగానే గురువుగారి వద్ద ఇక్కడ గత పది రోజులుగా సత్సంగాలు జరుగుతున్నాయి. గురువుగారి తోటి

సత్సంగ దృశ్యానికి ప్రత్యక్ష ప్రసారం (లైవ్ టెలీకాస్ట్) వంటిది ఆ స్వప్నానుభవం" అన్నారట. అది తెలిసిన నాకు మరింత ఆనందం కలిగింది.

గురువుగారు ఇండియాలో ఉన్నారు. నేనెక్కడో సాగరాలకవతల అమెరికా నుండి వారిని ప్రార్థించాను. నా ప్రార్థనను వారు మన్నించారు!

*__గురువుగారు:__ సాధారణంగా మన మనసు బలమైన ప్రాపంచిక వాసనలతో ఉంటుంది. ఒక్కోసారి వివిధమైన ప్రాపంచిక అవసరాలు లేక అనుభూతులు అంతరంగాన్ని గట్టిగా తాకుతుంటాయి. అలా తాకిన ఆ నిస్సహాయ స్థితిలో మనస్సు గట్టిగా sense of securityని కోరుతుంది. రక్షణ కావాలి అనే ఆర్తి, వెలితి కలుగుతుంది. ఆ వెలితి లేక అవసరం లేక ఆర్తి మన మనసులో కలిగినపుడు– బాబా దగ్గర కూర్చుంటే మనకు తెలియకుండానే కళ్ళ నీరు వస్తుంది. ఆ వెలితిని తీర్చగలిగేది ఆయనే అన్న భావన బలంగా కలుగుతుంది. అప్పుడు మనసు మన వశం తప్పుతుంది. ఎందుకంటే ఆర్తితో ప్రార్థన చేయడానికి మనసు ఆ సమయంలో సిద్ధంగా ఉంటుంది. హృదయంలోంచి వస్తుంది.*

# బాబాను స్మరించు

కమతం శిరీష
గృహిణి, నెల్లూరు
జన్మించిన సం॥ 1972

నెల్లూరు, జూన్ 2000

నేను 1996వ సం॥లో, తిరుమలలో మొదటిసారి గురువుగారిని చూశాను. గురువుగారు ఊదీ దర్శనం ఇస్తున్నారంటే పెద్ద క్యూ కడతారు గురుబంధువులు. నేను కూడా క్యూలో నిలబడి దర్శనానికి వెళ్ళాను. లోపలికి వెళ్ళగానే గురువుగారికి నమస్కారం చేసుకొని నన్ను నేను పరిచయం చేసుకోబోయాను.

వెంటనే గురువుగారు *"నువ్వు నాకు తెలుసు, లెటర్ వ్రాశావుగా!"* అన్నారు. నన్ను చూడగానే నా లెటర్ గురించి గురువుగారే చెప్పడం నాకెంతో ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించింది. వారికి రోజూ ఎన్నో వందల ఉత్తరాలు వస్తుంటాయి. అవన్నీ రోజూ చదవడమంటేనే అసాధ్యం! అటువంటిది నన్నసలు చూడకుండానే ఉత్తరం వ్రాశానన్న విషయం చెప్పారే అన్నది నా విస్మయానికి కారణం.

రెండవరోజు మరల వారి దర్శనం చేసుకొనే మహదవకాశం లభించడంతో నా సమస్యలన్నీ వారితో చెప్పుకున్నాను.

*"ఆ సమస్యల గురించి ఆలోచించడం మర్చిపో! అన్నీ నేను చూసుకొంటాను!"* అని అభయమిచ్చారు గురువుగారు. 'ఇక వాటి గురించి భయపడకు, అవన్నీ నేను చూసుకొంటాలే' అని ఒక బిడ్డకు తండ్రి ఏ విధంగా అయితే మంచి, చెడు చెప్పి లాలిస్తారో అలా నన్ను ఓదార్చారు గురువుగారు.

"మీకు, బాబాకు దగ్గరవ్వాలంటే నేనేం చేయాలి?" అని అడిగాను. నా చేతిలో ఉన్న హేండ్‌బ్యాగ్ వైపు వేలు చూపిస్తూ *"దాన్ని చదువు!"* అన్నారు గురువుగారు.

నాకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. ఎందుకంటే నా హేండ్‌బ్యాగ్‌లో ఎప్పుడూ బాబా పుస్తకం ఉంటుంది. ఈ విషయం గురువుగారికెలా తెలిసింది? దీనిని బట్టి 'బాబాకు, గురువుగారికి తేడా లేదు' అని నాకు అర్థమయింది.

అప్పుడు గురువుగారు, బాబాకు దగ్గరయ్యే మార్గం నాకిలా చెప్పారు: *"బాబా పుస్తకాలు చదువు, బాబా గురించి తెలుసుకో. సత్సంగానికి వెళుతూ ఉండు. ఖాళీ సమయంలో బాబా గురించే ఆలోచించు".* వారి మాటలు నాకు శిరోధార్యం.

# గురువే నా సర్వస్వం

పొన్నపోలు ద్వారక్‌నాథ్‌రెడ్డి
వ్యాపారస్థుడు, చెన్నై
జన్మించిన సం॥ 1955

చెన్నై, సెప్టెంబర్ 2001

ఆధ్యాత్మికత గురించిగాని, సద్గురు సంప్రదాయం గురించిగాని నాకు ఏమాత్రం తెలియదు. వాటి గురించి తెలుసుకోవాలనే కోరికగాని, అవగాహనగాని నాకుండేవి కావు. చుట్టూ ఉన్న బంధువులు, స్నేహితుల పరిధిలో యాంత్రికంగా సాగిపోతున్న నా జీవితగమనంలో మలయమారుతంలా విచ్చేశారు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ!

1998 అక్టోబరు విజయదశమికి కుటుంబసమేతంగా నేను శిరిడీ వెళ్ళడం, అప్పుడే మొదటిసారిగా "సాయిపథం"కు వెళ్ళడం జరిగింది. విజయదశమి సంబరాలలో, భక్తజన సందోహంతో కళకళలాడుతున్న సాయియానా ఆవరణ బాహ్యంగా కోలాహలంగా ఉన్నా అంతర్లీనంగా ఏదో ప్రశాంతతను నింపుకొన్నట్లుగా ఉంది. గురువులు, ఆశ్రమాలు అంటే ఒక సదవగాహన, సదభిప్రాయం లేని నాకు గురువుగారి దర్శనంతో నాలో నుంచి ఒక క్రొత్త వ్యక్తి మేల్కొన్న అనుభూతి కలిగింది. అక్కడి వాతావరణం అక్కడి వ్యక్తులు నాకు బాగా చిరపరిచితమైనట్లు అన్పించింది. గురువుగారిని కలిసి ఒక్కసారి మాట్లాడి వెళ్ళాలన్న కోరిక కలిగింది. అయితే అంతమంది జనంలో అది సాధ్యం కాదని, వీలయితే ప్రయాణం వాయిదా వేసుకోమని చెప్పారు నారాయణరావుగారు.

ఆ రోజునే పరిచయమైన వి.టి.రావుగారు మరియు ఇతర గురుబంధువులు గురువుగారి గురించి, బాబా పథంలో గురువుగారు వారిని ఎలా నడిపిస్తున్నారో చెప్పారు. వారి నిశ్చింత చూస్తే ప్రతి నిత్యం అనేకానేక సమస్యలతో తీవ్రంగా పోరాటం సాగించాల్సిన ఈ సాంఘిక జీవనంలో ఒక సామాన్య మానవుడు అంత సంతోషంగా ఎలా ఉండగలడో నాకు బోధపడలేదు. నేనేది అడుగుతున్నా, వారు దేన్ని గురించి చెప్తున్నా అన్నింటికీ కేంద్రబిందువు పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీగారే. ఒక్క మాటలో వారందరి జీవితాలకి ఆధారం "శ్రీబాబూజీ" అని ఏకకంఠంతో చెప్పారు.

దాంతో నాకు గురువుగారిని స్వయంగా కలిసి మాట్లాడాలన్న కోరిక ఇంకా తీవ్రమయింది. "ఉదయాన్నే ఊరికి వెళ్ళాలి. కానీ బాబూజీగారిని కలవకుండా వెళ్ళలేను.

ఏం చెయ్యాలో తెలియడంలేదు. నిర్ణయం మీదే" అని బాబాను ప్రార్థిస్తూ అక్కడే కూర్చొని ఉన్నాను. అంతలో ఏదో పని మీద లోపలికి వెళ్ళిన నారాయణరావుగారు వచ్చి "గురువుగారు లోపల ఉన్నారు. మీరు వెళ్ళి దర్శనం చేసుకోవచ్చు" అన్నారు.

ఇదెలా సంభవమయింది? ఒక్కక్షణం నమ్మలేకపోయాను. తేరుకొని వడివడిగా లోపలికి వెళ్ళాను. ఆ మరుక్షణం గురువుగారి పాదాలముందు సాష్టాంగపడివున్నాను! గురువుగారు మూర్తీభవించిన ప్రేమస్వరూపంలా ప్రసన్నంగా కూర్చుని తదేకంగా నావైపే చూస్తున్నారు. నన్ను కలవరపెడుతున్న సమస్యలు, అప్పటి పరిస్థితులు అన్నీ మనస్సు లోపల గిర్రున తిరుగుతున్నాయి. ఎన్నో చెప్పాలనుకొన్నా! ఇంకెన్నో అడగాలనుకొన్నా! అయితే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను కుదిపేస్తోంది. హృదయాన్నంతా కళ్ళలోకి తెచ్చుకొని రెప్పవాల్చకుండా గురువుగారినే చూస్తున్నా. అలా ఎంతసేపు వారిని చూస్తూ ఉండిపోయానో నాకే తెలీదు. నా అంతరంగమంతా చదువుతున్నట్లే ఉంది వారి దృష్టి. మధ్యమధ్యలో మెల్లగా తలూపుతూ నా వంక చూస్తున్నారు. ఆ మౌనభాషణలో పూర్తిగా నా ఆత్మనివేదన జరిగినట్లనిపించింది.

ఆ క్షణంలో గురువుగారి దివ్యసమక్షంలో ఎన్నో ఏళ్ళ తర్వాత కాదు, ఎన్నో జన్మల తర్వాత నా మనోవిహంగం మళ్ళీ నా స్వంతగూటికే చేరుకొన్నట్టు ఉంది. బాహ్య స్ఫురణే లేనట్లుండిపోయిన నాకు గురువుగారు ఊదీ నుదుటనుంచారు. అంతేకాదు, వారి ప్రక్కనే ఉన్న ఒక చక్కని పూలమాలను నా చేతుల్లో ఉంచారు. 'ఇక వెళ్ళిరా!' అన్నట్లు ఆప్యాయంగా తలూపారు. ఇన్నాళ్ళకు నా ఆనందాన్ని, కష్టసుఖాలను నేరుగా నాతో పంచుకొనేందుకు బాబానే ఒక దివ్యమంగళరూపంలో నాకు దొరికారన్న సంతోషంతో, చెప్పలేని ఉద్వేగంతో బయటకు వచ్చాను. మర్నాడు ఉదయం మేమంతా మద్రాసు తిరిగి వచ్చాము.

ఒకరోజున వి.టి.రావుగారు "తనకు హార్ట్ ప్రాబ్లెమ్ ఉన్నా, శ్రీబాబూజీ దివ్య ఆశీస్సులతో, అనుగ్రహబలంతో తానిప్పుడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నానని, ఏ మందులూ, డాక్టరూ ఇంతవరకు ఇన్ని సంవత్సరాలుగా అవసరం రాలేద"ని అన్నారు.

అది విన్న నేను నా జేబులోనున్న బి.పి. టాబ్లెట్స్ బయటపడేశాను. సంవత్సరం పైగా హై బి.పి.తో ఎంతగానో బాధపడుతున్నాను. ఒక్కరోజు మందులు మరచిపోయినా దాని ప్రభావం నా ఆరోగ్యంపై ఎంతగానో ఉండేది. అందుకే టాబ్లెట్స్ మరచిపోతాననే భయంతో జేబులో, పర్స్‌లో, సూట్‌కేస్‌లో, ఇంట్లో ఇలా ప్రతిచోట అందుబాటులో

ఉంచేవాడిని. ఈ నిర్ణయానికి నా భార్య శైలజ భయపడింది. మాటల సందర్భంలో విషయం తెలిసిన హోమియో వైద్యులైన ఒక గురుబంధువు కూడా, గురువుగారికి చెప్పి వారి అనుమతితో తర్వాత మానేద్దురుగాని, అంతవరకు హోమియో మెడిసిన్ అయినా వాడమన్నారు. కానీ నాకెందుకో నా నిర్ణయాన్ని మార్చుకోవాలనిపించలేదు.

నాకు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించమని కోరుతూ, నా జీవితం ఆ మహానుభావుని సేవలో పునీతం కావాలని హృదయపూర్వకంగా ప్రార్థించాను. ఆ రోజు నుండి ఈ రోజు వరకు బి.పి. కాదు కదా ఏ జబ్బూ నా దరి చేరలేదు.

ఇంతటి మహద్భాగ్యాన్ని శ్రీబాబూజీ నాకందించాక కూడా నాలో కొంత అసంతృప్తి నన్ను ఆలోచనలో పడేసింది. ఫిబ్రవరిలో మళ్ళీ గురువుగారిని శిరిడీలో కలిసి మాట్లాడే భాగ్యం నాకు కలిగింది. ఆ సందర్భంలో గురువుగారిని "ఇంతమంది గురుబంధువులు ఎన్నో సంవత్సరాల ముందు మీ పదసన్నిధికి చేరే అవకాశం రావడంతో వారంతా మీ సాన్నిధ్యంలో ఆనందంగా ఉన్నారు. మరి నేనెందుకు ఇంత ఆలస్యంగా వచ్చాను? మీ సన్నిధిలో మిగిలిన గురుబంధువులు పొందిన అనుభవాలు, అనుభూతుల్లో భాగం పంచుకొనే అవకాశం నాకు లేకపోయిందే" అని అడిగాను.

దానికి గురువుగారు చిన్నగా నవ్వుతూ "ఇప్పుడొచ్చారుగా" అన్నారు.

***గురువుగారు:*** *సద్గురువు అంటే, ఏదైతే నీలో ప్రేమను ప్రజ్వలింప చేస్తుందో, ఏదైతే నిన్నొక వ్యక్తిగా మలచి నీ ఆశయసిద్ధిని తెలియని రీతిలో అనుభవింపజేస్తుందో, ఏదైతే నీలో ఆనందం, ప్రశాంతి, నమ్మకము, రక్షణ మొదలైన భావాలను కలుగజేస్తుందో అదే సద్గురువు. అసలు ఏం జరుగుతున్నదో నీకు తెలియదు. జరుగుతున్న దానికి ఆధారం కానీ, ప్రమాణం కానీ ఉండదు. కానీ అది నీ అనుభవంలోకొస్తుంది. దానినే 'సద్గురువు' అంటాను.*

*నీవు సద్గురువుని నీ ఇష్టమైన రీతిలో పిలుచుకోవచ్చు. రమణ మహర్షికి సద్గురువు తండ్రి. రామకృష్ణ పరమహంసకు మాత! నీకు సద్గురువు లభించి నీవు వారి సంరక్షణలో ఉన్నావని తెలుసుకొన్నప్పుడు, నీకెన్ని కష్టాలు వచ్చినా, "వారున్నారు!" అనే అభయం లేక ధీమా ఒకటుంటుంది. కాబట్టి నీ బాధలు, కష్టాలు నిన్నెక్కువగా బాధించవు.*

*సద్గురువు లభించక మునుపు నీవనుభవిస్తున్న దానికి, ఇప్పుడు అనుభవిస్తున్న దానికి తేడా కనిపిస్తుంది. నీ పరిస్థితి రూపాంతరం చెందుతుంది. నీ బాధలయొక్క స్వభావం మారుతుంది. నీ వాంఛలు, నీ అవసరాలు, నీ ఆనందం యొక్క స్వరూపాలు కూడా మారతాయి. నీకు సద్గురువు లభించనంతవరకు నీ కోరికలు నిన్ను నిరంతరం బాధిస్తూనే ఉంటాయి. కాని నీకు సద్గురువు లభించిన తర్వాత ఆ కోరికల తత్త్వమే మారిపోతుంది.*

మహదానందమైంది నాకు. దైవస్వరూపులైన సద్గురుమూర్తుల మాట ఎంత విలువైనదో ఇప్పటికీ నాకవగతమవుతూనే ఉంది. కాలంతో పని లేదు. సంవత్సరాలు క్షణాలుగా దొర్లిపోతున్నాయి. బాబా దగ్గరకొచ్చే రోజున నా కోరికలు, నా గమ్యం వేరు. ఈ రోజున నా ఆలోచనాసరళి పూర్తిగా మారిపోయింది.

నేను వేసే ప్రతి అడుగు, నేను చేసే ప్రతి పని, నాలో మెదిలే ప్రతి ఆలోచనకు ఆ భగవత్స్వరూపుడే ఆధారం కావాలని, ఆ అభయహస్తమే నన్ను సరైన మార్గంలో నడిపించాలని హృదయపూర్వకంగా కోరుకొంటున్నాను.

# ఫోటో కాదది సజీవరూపం

బెల్లం ప్రభాకర్
వ్యాపారస్థుడు, నెల్లూరు
జన్మించిన సం॥ 1952

నెల్లూరు, డిసెంబర్ 2000

నేను గత ముప్పై సంవత్సరాలుగా సాయిబాబా గుడికి వెళుతున్నాను. ఒక సంవత్సరం క్రితం నా స్నేహితుడు నా టెన్షన్స్ తగ్గాలంటే ధ్యానం చేసుకోమని, ధ్యానం అంటే కళ్ళు మూసుకొని ఇష్ట దైవాన్ని తలచుకోవడమని చెప్పాడు.

ఒకరోజు ఉదయం నేను ధ్యానం చేసుకొందామని నా గదిలో మంచంపై కూర్చుని కళ్ళు మూసుకున్నాను. అంతలో తెల్లని పంచె బనీను ధరించిన ఒక వ్యక్తి వేగంగా నడుస్తూ నా దగ్గరకు వచ్చి, నా నుదుటన ఊదీ పెట్టి, నా ప్రక్కనే కూర్చున్నట్లు అనిపించింది. వెంటనే కళ్ళు తెరచి చూస్తే గదిలో ఎవ్వరూ లేరు. నా భార్యను పిలిచి జరిగింది చెప్పాను. నాకు కనిపించిన వ్యక్తి వివరాలు విన్న ఆమె, బైపాస్ రోడ్‌లోని బాబా మందిరంలో ఫోటోలో ఉండే గురువుగారు అయివుండవచ్చేమో అన్నది.

అంతవరకు గురువుగారి గురించి నాకేమీ తెలియదు. నాకు కలిగిన వింత అనుభవంతో వారెవరో తెలుసుకోవాలనిపించి ఆ రోజు సాయంత్రం నేను నా భార్యతో కలిసి ఆ మందిరానికి వెళ్ళాను. దూరాన్నుండే గురువుగారి ఫోటో చూసిన నాకు ఆశ్చర్యం కలిగింది. మా ఇంట్లో అంత స్పష్టంగా కనిపించి నాకు ఊదీ ఇచ్చింది వారే! ఆ మూర్తిని అలా చూస్తుంటేనే నాలో ఏదో తెలియని అనందానుభూతి. అప్పటి నుండి మేము ప్రతిరోజు మందిరానికి వెళ్తుండేవాళ్ళం. అయితే రెండు నెలల తర్వాత కూడా నాకు గురువుగారి ఫోటో తప్పితే వారి గురించి ఏమీ తెలియదు.

---

***భక్తుడు:*** *సార్, "సద్గురువుని తెలుసుకో, ఎందుకు వచ్చినట్లు? పిడకలు ఏరుకోవడానికా", "నా భక్తున్ని నేనే ఎన్నుకుంటాను" అన్న బాబా రెండు స్టేట్‌మెంటులకు సమన్వయం ఎలా కుదురుతుంది?*

***గురువుగారు:*** *'సద్గురువుని ఎన్నుకో' అనలేదుగా, 'తెలుసుకో' అన్నారు. ఆయన ఎన్నుకుంటాడు, మనం తెలుసుకోవాలి... (నవ్వుతూ) ఎన్నుకొనేది*

*ఆయనే. ఎన్నుకున్నా కూడ మనము శిరిడీకి పోయినా, బాబా దగ్గరకు పోతున్నా, మన ప్రక్క ఇంటిలో భజన జరుగుతున్నా పట్టించుకోలేదనుకో అప్పుడెలా? కాబట్టి 'తెలుసుకో' అన్నాడు. సద్గురువు అంటే ఏమిటి? బాబా ఎవరు? ఆయన ఎన్నుకొని దేనికి తీసుకున్నాడు నిన్ను? బాబా యొక్క తత్త్వమేమిటి? అనే విషయం తెలిసికొని బాబాకింకా దగ్గర కావడం. అది మాత్రం నువ్వే చెయ్యాలిగా! కాబట్టి ఆ రెండూ కరెక్టే.*

ఒక రోజు మందిరంలో ఒక వ్యక్తి "ఇక్కడ రోజూ సత్సంగం జరుగుతుంది. మీరు ఆ టైమ్‌కి వస్తే సత్సంగమూ వినవచ్చు కదా!" అన్నాడు. అది పరోక్షంగా వచ్చిన గురువుగారి ఆనతిగానే భావించి, అప్పటి నుండి సత్సంగానికి వెళ్ళడం ప్రారంభించాము.

బాబా, గురువుగారి గురించి అసలేమీ తెలియని మేము ఆ సత్సంగాల ద్వారా ఎంతో తెలుసుకోగలిగాము. ఒక రోజు గురువుగారి ఫోటో తీసుకుని వచ్చి నా గదిలో పెట్టుకున్నాను. అప్పటినుండి ఆ గదిలో గురువుగారే కూర్చుని ఉన్నట్లు బలంగా అనిపించసాగింది. అందువల్లనే ఇల్లంతా ఎలా తిరిగినా, ఎలా ఉన్నా ఆ గదిలోకి రాగానే అప్రయత్నంగానే ఎంతో జాగ్రత్తగా ఉంటాను. గురువుగారి ప్రత్యక్షానుభూతి స్పష్టంగా ఉంటుందక్కడ!



భక్తవత్సలుని లోగిలిలో...

# ఆచరించిన ఆనందమే

బియ్యపు రామకృష్ణ
బ్యాంక్ ఉద్యోగి, హైదరాబాద్
జన్మించిన సం॥ 1975

తెనాలి, సెప్టెంబర్ 2001

నాకు 21 ఏళ్ళ వయస్సప్పుడు నేను సిద్ధసమాధియోగా వారి పది రోజుల కోర్సుకి వెళ్ళాను. నేను ఆ కోర్సు అయిపోయిన తర్వాత కూడా అదే పద్ధతిలో ఆహారం తీసుకోవడం, ఎక్సర్‌సైజులవీ ఎక్కువ చేయడంతో బాగా నీరసించిపోయాను. నడిచేందుకు కూడా ఓపిక లేని నా పరిస్థితికి నా స్నేహితులు ఆందోళన చెందారు. అప్పుడు వారంతా శిరిడీ వెళుతూ గురువుగారి దర్శనం చేసుకొందాం రమ్మని, నన్ను కూడా పిలవడంతో నేను వాళ్ళతో శిరిడీ వెళ్ళాను.

శిరిడీలో గురువుగారిని నా స్నేహితులు "మేము శిరిడీలో ఎలా గడపాల"ని అడిగారు. వీలయినంతసేపు బాబా మందిరంలో ఉండమని, మిగిలిన సమయంలో సాయిపథంలో తోట పని చేయమని చెప్పారు గురువుగారు.

గురువుగారిని నేనూ అదే ప్రశ్న అడిగితే "గార్డెన్‌లో పని చెయ్యి. అదీ చెమట పట్టేదాకా చెయ్యి" అన్నారు.

నాకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. బాగా నీరసించివున్న నాతో 'మంచి ఆహారం తీసికొని బాగా విశ్రాంతి తీసుకో' అంటారు అనుకున్నాను. కానీ దానికి విరుద్ధంగా చెప్పారు. గురువుగారు చెప్పిన మాట ప్రకారం చెమట పట్టేదాకా పనిచేసేవాడిని. కొద్దిరోజుల్లోనే నేను ఎంతో ఆరోగ్యంగా, బలంగా తయారయ్యాను. నా స్నేహితుల కన్నా నేనే ఎక్కువ పని చేయగలిగేవాడిని.

ఒకసారి మా పెద్దవాళ్ళతో చిన్న మాట పట్టింపు వచ్చి నేను ఎవరితో చెప్పకుండా శిరిడీ వెళ్ళాను. నా విషయం విని గురువుగారు నన్ను ఆదరించి అనునయంగా 'ఫరవాలేదు. నువ్వు ఇక్కడే ఉండు' అంటారనుకున్నాను.

అయితే గురువుగారు నా సంగతి వినగానే "వెంటనే దొరికిన రైలో, బస్సో పట్టుకొని ముందు మీ వాళ్ళ దగ్గరకు వెళ్ళు" అన్నారు. వారి మాటను అనుసరించటం తప్ప వేరే మార్గం లేక నేను అట్లాగే చేశాను. ఇంటికి వెళ్ళగానే మా అమ్మా నాన్న ఎంతో అభిమానంతో నన్ను దగ్గరకు తీసుకున్నారు.

# స్కూల్ సీటు

పొన్నపోలు విష్వక్సేన్
స్టూడెంట్, చెన్నై
జన్మించిన సం॥ 1992

శిరిడీ, జూలై 2001

నేను సెకండ్ స్టాండర్డ్ వరకు చెన్నైలో సెయింట్ జాన్స్ స్కూల్‌లో చదివాను. ఆ స్కూల్ నాకంతగా నచ్చేది కాదు. నాకు 'సెయింట్ మైకేల్స్ అకాడమీ'లో చేరాలని ఉండేది. మా అమ్మా, నాన్న రెండు సంవత్సరాలు ఎంతో ప్రయత్నించినా ఆ స్కూల్‌లో సీటు రాలేదు.

1999 వేసవి సెలవుల్లో గురువుగారు తిరుమలలో ఉన్నారు. ఒక రోజు దర్శన సమయంలో నేను గురువుగారిని "నాకు మైకేల్స్ స్కూల్‌లో సీటు కావాలి" అని అడిగాను. గురువుగారు చిరునవ్వుతో ఊదీ ఇచ్చారు.

మేము మద్రాసుకు తిరిగి రాగానే నా సీటు కోసమని మా నాన్న మైకేల్స్‌కు వెళ్ళారు. సీటు ఉంది, చేర్చుమన్నారట ప్రిన్సిపాల్. మా ఇంట్లో అందరం చాలా ఆనందించాం. నాకు ఈ స్కూల్ బాగా నచ్చింది.

నేను గురువుగారి దగ్గరకు వచ్చిన ఈ మూడు సంవత్సరాలలో నాకు మొండితనం చాలా తగ్గింది. మా అమ్మా నాన్న చెప్పినట్లు వింటున్నాను. నేను చాలా హ్యాపీగా ఉన్నాను. థ్యాంక్యూ గురూజీ!

# దైవ స్వరూపమే

పసుపులేటి అనిల్ కుమార్
మెడికల్ స్టూడెంట్, గుడివాడ
జన్మించిన సం॥ 1977

వెంకటగిరి, జూన్ 1999

గురువుగారు నా చిన్నతనం నుండి నాకు తెలుసు. మా నాన్నగారు గురువుగారి గురించి చెబుతూ "వారు దైవస్వరూపులు" అనేవారు. నాకది నచ్చేది కాదు. కానీ మా నాన్నగారి మాటలు నిజమని నిరూపించే సంఘటన నాకు అనుభవమయింది. నాకు వ్యక్తిగతంగా గురువుగారితో అనుబంధం పెనవేసుకొనేందుకు అది నాందీ అయింది.

1992, మే నెలలో పదవ తరగతి పరీక్షా ఫలితాలు రాగానే నేను మా తల్లిగారితో కలిసి శిరిడీ వెళ్ళాను. ఒక వారం తర్వాత అందరం తిరిగి ఊరికి బయల్దేరుతుండగా, గురువుగారు నన్ను శిరిడీలో ఉండమన్నారు. నాకు వాళ్ళతో పాటు ఊరికి వెళ్ళాలని ఉన్నా గురువుగారు చెప్పారని ఆగిపోయాను. మా అమ్మ వెళ్ళేటప్పుడు నాకు నలభై రూపాయలిచ్చింది. భోజనం సాయిపథంలోనే చేస్తున్నప్పటికీ రోజంతా మందిరానికి అటూ ఇటూ తిరుగుతూ అవీ ఇవీ కొనుక్కుంటూ, నా జేబులోని నలభై రూపాయలు మూడు రోజుల్లోనే ఖర్చు చేసేశాను. తర్వాత నుండి ఇబ్బందులు మొదలయ్యాయి. బయట కనిపించినవన్నీ తినాలనిపించేది. కొనుక్కుందామంటే డబ్బులుండేవి కావు. పోనీ గురుబంధువులెవరినైనా అడుగుదామంటే మొహమాటంగా ఉండేది. అందుకే మందిరానికి వెళ్ళినప్పుడు "నాకు దార్లో ఎక్కడైనా యాభై రూపాయలు దొరికేలా చెయ్యి తండ్రీ" అని బాబానే అడిగేవాడిని.

వరుసగా రెండురోజులు బాబాను ప్రార్థించడం, మందిరం నుండి తిరిగి వచ్చేటప్పుడు రోడ్డు మీద ఎక్కడన్నా డబ్బులు పడుంటాయేమోనని వెతుకుతూ రావడం చేయసాగాను. నిజానికి ఎవరో పారేసుకొన్న డబ్బులు దొరకాలనుకోవడం తప్పని తెలిసినా నాకు అంతకన్నా మార్గం కనిపించలేదు. లేకపోతే ఇంకెలా వస్తాయి నాకు డబ్బులు అనుకొనేవాడిని. ఆ విధంగా మూడవ రోజు కూడా బాబాను యాభై రూపాయలు అడిగి 'సాయిపథం'కు వచ్చాను. రావడంతోనే గురువుగారు పిలుస్తున్నారు అన్న కబురు తెలిసింది.

నేను గదిలోకి వెళ్ళి గురువుగారి ఎదుట నిలుచోగానే *"ఏరా! నీ దగ్గర డబ్బులు ఉన్నాయా?"* అని అడిగారు.

"ఇట్లా ఎందుకడుగుతున్నారా" అని ఆశ్చర్యపోతూ లేవని చెప్పాను. అప్పుడక్కడే ఉన్న గుప్తా అంకుల్‌తో "వీడికి యాభై రూపాయలు ఇవ్వండి" అని చెప్పి నా వంక ప్రేమగా చూస్తూ ఆప్యాయంగా "నీకిష్టమైనవి కొనుక్కో నాన్నా" అన్నారు.

పది నిమిషాల తర్వాత మరలా నన్ను పిలిచి, గురువుగారే స్వయంగా నా చేతిలో యాభై రూపాయలు పెట్టారు చిరునవ్వుతో.

అద్భుతమైన ఆ నవ్వు, ప్రేమపూరితమైన ఆ పలకరింపు, ముఖ్యంగా ఆ యాభై రూపాయలను చూస్తూ కొద్దిసేపు చేష్టలుడిగినవాడిలా అయ్యాను. ఈ సంఘటనతో నాకు గురువుగారి పట్ల ప్రేమ పెరిగింది. నేనడిగింది బాబాను. ఇచ్చింది గురువుగారు!

***గురువుగారు:*** *నేను బాబాను చూసినప్పుడల్లా ఆయన దృష్టి నాకెలా ఉంటుందంటే అప్పుడే పుట్టిన బిడ్డను కన్నతల్లి ప్రప్రథమంగా, ఎంత అపురూపంగా చూసుకుంటుందో అలా అనిపిస్తుంది. ఆ చూపు ఎలా ఉంటుందో చెప్పడానికి ఇంతకంటే మంచి ఉపమానం లేదనిపిస్తుంది. ఊహించి చూడండి. మన ఊహకందదు కానీ, ఊహించడానికి ప్రయత్నించండి. అప్పటివరకు ఆ బిడ్డ తల్లి శరీరంలో ఒక భాగంగా ఆమెలో కలిసి ఉంది. కానీ ఇప్పుడు అది శరీరం నుండి విడివడి వేరొక ఉనికిని సంతరించుకుంది. ఆ బిడ్డకు తాను వేరుగా అనిపిస్తుంది, కానీ తల్లికి కొంతకాలమైనా ఆ బిడ్డ తన శరీరమని, తనలోని అంతర్భాగమనే భావనే ఉంటుంది. అందుకే నేను 'తొలిసారి చూసుకొన్నప్పుడు' అని చెప్పాను. బాబా చూపులో నాకు కనిపించేది అదే భావం. సద్గురువు ఈ సమస్త సృష్టిని తనలోని భాగంగానే ప్రేమిస్తారు. ప్రాపంచికంగా తల్లి విషయంలో ఈ అనుభవం కొంతకాలమే ఉంటుంది. బిడ్డ పెరుగుతూ ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకొనేకొద్దీ తల్లికి అది తనలో భాగమేనన్న భావన సన్నగిల్లుతుంది. కానీ సద్గురువుకు ఆ ప్రథమానుభూతి నిరంతరం ఉంటుంది. ఎప్పటికీ మారదు.*

# బాబా పథంలో...

సాయినాథుని శృతి
స్కూల్ స్టూడెంట్, శిరిడీ
జన్మించిన సం॥ 1987

చెన్నై, ఆగష్టు 2004

ఎందరో భక్తులచే 'గురువుగారు' అని ఆరాధించబడే పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ కుమార్తెను అయినందుకు నేనెంతో ఆనందపడుతున్నాను. ఇది ఎన్నో జన్మల సుకృతంగా నేను భావిస్తాను.

నాకు రెండేళ్ళ వయస్సున్నప్పుడే మేము ఒంగోలు నుండి శిరిడీ వెళ్ళిపోయాము. చిన్నప్పటి నుండి నాకు మా నాన్నగారు చెప్పే మాట "బాబాను ప్రార్థించు, నీకేం కావాలన్నా ఇస్తారు. ఎలాంటి బాధనయినా పోగొడతారు" అని.

మా ఇంట్లో సాయిబాబా ఫోటో తప్ప మరే ఇతర దేవుళ్ళ ఫోటోలు ఉండవు. శిరిడీలో జరిగే గురుపూర్ణిమ, విజయదశమి వంటి పండుగలు తప్ప సామాన్యంగా అందరూ జరుపుకునే వ్రతాలు, పండుగలు, వాటి ప్రత్యేకతలు ఏమీ నాకు తెలియవు. నాకు ఊహ తెలిసింది మొదలు అన్నీ బాబాకు, నాన్నగారికి చెప్పుకోవడమే అలవాటు. ఏదైనా క్రొత్త వస్తువు నా కోసం తెప్పించినా, దాన్ని బాబా ముందుంచి ఊదీ పెట్టిన తర్వాతే వాడుకోమంటారు నాన్నగారు. అట్లా చేయడం వల్ల "మనకు ఏం లభించినా అది బాబా ప్రసాదం" అన్నది ఎప్పుడూ గుర్తుగా ఉంటుంది అంటారు మా అమ్మా, నాన్నగారు. ఈ విషయాన్ని మా ఇంట్లో ఎప్పుడూ తప్పము.

నాకు జ్వరం వచ్చినా, ఏమొచ్చినా సరే నాన్నగారి దగ్గరకు వెళితే వారు "బాబా తాతయ్య తగ్గిస్తారులేరా" అంటారు.

ఒకరోజు నా ఎడమచేయి బాగా నొప్పి పెడుతోంది. బాబాను ప్రార్థించాను "బాబా! నా చేతి నొప్పి తగ్గించు" అని. ఇంతలో నాన్నగారు పిలిచారు. నేను గదిలోకి వెళ్ళగానే దగ్గరకొచ్చి కూర్చోమన్నారు. కూర్చొన్న తర్వాత "ఒక పాట పాడరా" అన్నారు గారాం చేస్తూ. నేను పాడడం మొదలుపెట్టగానే నాన్నగారు సరిగా నా చేయి నొప్పిగా ఉన్న చోటే తమాషాగా పాటకు అనుగుణంగా తట్టారు. అలా తడుతూ ఉండగా నొప్పి అనిపించలేదు. పాట అయిపోగానే నాన్నగారు నా చేయి వదిలేసి "వెళ్ళి ఆడుకో నాన్నా" అని పంపించారు. బయటకు వచ్చిన తరువాత గమనించుకున్నాను,

నా చేయి నొప్పి పూర్తిగా తగ్గిపోయిందని. బాబాను ప్రార్థించినా నాన్నగారికి వెంటనే తెలిసిపోతుందని నాకు అప్పుడే తెలిసింది.

ఒకసారి నేను నా స్నేహితులతో ఆడుకొని, కబుర్లు చెప్పుకుని ఇంటిలోకెళ్ళాను. ఆ రోజు నేను నాన్నగారి గదిలోకెళ్ళగానే, నాన్నగారు "శృతీ, నువ్వు మీ స్నేహితులు ఏం మాట్లాడుకొంటున్నారు?" అన్నారు.

"ఏం లేదు నాన్నగారు" అన్నాను.

ఇంక నాన్నగారు ఏమనలేదు. కానీ, ఆ రోజు మేము అక్కడ లేని మా స్నేహితురాలి గురించి చెడ్డగా చెప్పుకున్నామని నాకు వెంటనే గుర్తుకొచ్చింది. అట్లా మాట్లాడటం నాన్నగారికి ఇష్టముండదు. అందుకే ఆ రోజు ప్రత్యేకించి నన్నలా అడిగి హెచ్చరించారు. నేనెక్కడ ఏం చేస్తున్నా, ఏం మాట్లాడుతున్నా నాన్నగారికి తెలిసిపోతుందని నాకు ఆ రోజు బాగా తెలిసి వచ్చింది. నాన్నగారికి ఇష్టంలేని పనులు ఏమీ చేయలేను నేను.

మా నాన్నగారిలాంటి గొప్ప తండ్రి ఈ ప్రపంచంలో ఎవరికీ ఉండరు. నేను నోరు తెరిచి ఇది కావాలి అని అడగాలేగాని దాన్ని నాకు వెంటనే తెప్పించి ఇస్తారు. నా హెయిర్‌బాండ్ నుంచి యూరప్ ట్రిప్ దాకా అన్నీ తీర్చారు, తీరుస్తున్నారు. ఒక్కోసారి ఏదైనా కావాలి అని అడిగిన తర్వాత నేనసలు ఆ విషయమే మర్చిపోతాను కూడా. కానీ నాన్నగారు మాత్రం ఏదీ మర్చిపోరు.

కొంతమంది నన్ను "మీ నాన్నగారు అంత గొప్ప మహాత్ములు, గంభీరంగా కనపడతారు కదా. నీతో మామూలుగా కబుర్లు చెపుతారా!" అని అడుగుతుంటారు.

నాన్నగారు నన్ను ఎంత ముద్దు చేస్తారో చెబితే నమ్మలేరేమో. సామాన్యంగా భోంచేసేటప్పుడు నన్ను దగ్గర కూర్చోబెట్టుకుంటారు. అప్పుడెన్నో కబుర్లు చెపుతారు. నవ్విస్తారు. నాకు రకరకాల ముద్దు పేర్లున్నాయి. బహుశా అన్ని పేర్లు ఇంకెవ్వరికీ ఉండవేమో. ఎప్పటికప్పుడు క్రొత్త ముద్దు పేరుతో పిలుస్తుంటారు.

ఒకరోజు నాన్నగారు తిరువణ్ణామలై వెళుతున్నారు. నేనూ, అమ్మా కూడా వెళదామనుకున్నాము కానీ నాకు స్కూల్ ఉండడం వలన ఆగిపోవాల్సి వచ్చింది. నాన్నగారికి స్కూల్ ఎగ్గొట్టడం ఇష్టముండదు. మరునాడు స్కూల్‌కి వెళ్ళానే కానీ నాన్నగారితో తిరువణ్ణామలై వెళ్ళలేకపోయాననే బాధతో అదే ఆలోచనలో ఉండగా హఠాత్తుగా నా స్నేహితురాలు వెనుక నుండి వచ్చి నా ముందు ఒక ఫోటో ఉంచింది, 'ఇది నీదే కదూ' అంటూ.

నా దగ్గర బాబా ఫోటోలు తప్ప మరేమీ ఉండవు. అలా అనుకుంటూ నేను ఆ అమ్మాయి నా డెస్క్‌పై ఉంచిన ఫోటో వంక యథాలాపంగా చూశాను. అది శేషాద్రిస్వామి తాతయ్యది.

ఆ మరుసటి రోజు నేను తిరువణ్ణామలైకి వెళ్ళాను. ఈ విషయం నాన్నగారితో చెప్పగానే, వారు *"నువ్వు తిరువణ్ణామలై రాలేకపోయావని తాతయ్యే నీ దగ్గరకు వచ్చారు చూశావా?"* అన్నారు. నాకెంతో సంతోషమేసింది. అందరు మహాత్ములు నన్ను చూసుకుంటున్నారు. నాకింతకు ముందు కూడా శేషాద్రి తాతయ్య ఇలాంటి అనుభవాలనిచ్చారు. కానీ రమణ తాతయ్యకి సంబంధించి ఒక్క అనుభవమైనా లేదు. నేనలా అంటే *"మహాత్ములంతా ఒక్కటే"* అన్నారు నాన్నగారు.

ఆ తరువాత రోజు నేను ఎలిసన్ ఆంటీతో కలిసి రమణాశ్రమానికి వెళ్ళాను. మమ్మల్నిద్దరినీ ఆశ్రమంలో భోంచేయమని ఒక వ్యక్తి వచ్చి పిలిచాడు. అక్కడ నుండి శేషాద్రి తాతయ్య ఆశ్రమానికి వెళ్ళాము. అక్కడొకామె మా దగ్గరికి రెండు ప్లేట్లు ప్రసాదం పట్టుకొచ్చి ఇచ్చింది. మేమది తిన్నాము. శేషాద్రి తాతయ్య తన ఇంట్లో భోజనం తినిపించారనుకున్నాను. అదే రోజు రాత్రి మేము పూండీకి వెళ్ళాం. ఆశ్చర్యం! అక్కడా గుడిలో ఉండే స్వామి నాకు కప్పులో పాలు తెచ్చిచ్చారు. నాకెంత సంతోషం కలిగిందో చెప్పలేను. ఒకదాని తర్వాత ఒకటిగా జరిగిన ఆ సంఘటనలన్నీ నేను నాన్నగారితో చెప్పాను.

*"చూశావా! అందరు మహాత్ములు నిన్నెంత బాగా చూసుకుంటున్నారో? బాబా తాతయ్య చెప్పి ఉంటారు రమణ తాతయ్య, శేషాద్రి తాతయ్య, పూండీ తాతయ్యలతో ఈ పాపని గమనించుకోమని"* అంటూ నవ్వుతూ అన్నారు. నాన్నగారు అలా అనడం నాకు మరింత ఆనందాన్నిచ్చింది.

***భక్తుడు:*** *గురువుగారూ! ప్రేమను పెంచుకోవడం ఎలా?*

***గురువుగారు:*** *మనలో ప్రేమ యొక్క అనుభవం ఉంది కానీ, అది బలహీనంగా ఉంది. ఆ ప్రేమను ఇంకా బలీయంగా చేసుకోవడానికి మార్గం ఒకటే– అది ప్రేమను ఇంకా ఎక్కువ వ్యక్తీకరించడమే. ప్రేమను ఎంత ఎక్కువగా వ్యక్తీకరిస్తామో, అది అంతగా పెరిగి మరింతగా అనుభవంలోకి వస్తుంది.*

ప్రేమతో చేసే ఏ కార్యమయినా అది పనిలాగా అనిపించదు. అది ప్రేమను వ్యక్తపరిచే విధానమవుతుంది. తండ్రి ఆఫీసు నుండి వస్తూ ఏదో ఒక బొమ్మ, డ్రెస్ బిడ్డకు ఎలా తెస్తాడో అలాగ. బిడ్డ ఆ డ్రెస్ గురించిగాని, ఆ బొమ్మ గురించిగాని ఆలోచించకపోయినా, తండ్రి ఏదో ఒకటి ఇవ్వాలని బిడ్డ అనుకుంటుంది. ఆయన ఎంత ఎక్కువగా ఇస్తారో, అంతగా తండ్రితో బాంధవ్యాన్ని పెంచుకుంటుంది. ఆ తండ్రి కూడా అలాగే పెంచుకుంటాడు. "లేదు. నా ప్రేమను మనస్సులోనే ఉంచుకోవాలి. వ్యక్తపరచకూడదు. ఈ భావాలతో లాభమేముంది? ఇవన్నీ బాల్యచేష్టలు (ఇమ్మెచ్యూర్)" అని తండ్రి అనుకొంటాడా? అతను ప్రేమను వ్యక్తీకరించలేకపోతే, బిడ్డను హత్తుకుని ముద్దుపెట్టకపోతే కొంతకాలానికి బిడ్డతో అతని బాంధవ్యము తగ్గిపోయి సారహీనమై పోతుంది. ప్రేమను ఎప్పుడూ వ్యక్తపరచాలి.

ఈ ఆచారాలన్నీ- అందరూ నా దగ్గరకు రావడం, నమస్కారం చేసుకోవడం, ఏదైనా సమర్పించడం, ఇవన్నీ ప్రేమ యొక్క వివిధ భావప్రకటనలు. అవి ప్రేమను వ్యక్తపరచే భావమయినప్పుడు, అది నిజమైన ఆచారమవుతుంది. లేకపోతే అది వ్యర్థం. భజన కానీ, ఆచారం కానీ, ఏ విధమైన పని కానీ- అది ప్రేమను వ్యక్తపరచినపుడు పూజ అవుతుంది.

# కోరినదే ప్రసాదం

ఇక్కుర్తి గాయత్రి
స్టూడెంట్, తిరుపతి
జన్మించిన సం॥ 1980

తిరుపతి, జూలై 2001

గురువుగారితో పరిచయమైన మొదట్లో నాకు బాబా అన్నా, గురువుగారన్నా నమ్మకముండేది కాదు. ఇంట్లో అమ్మ, నాన్నగారు మాత్రం సత్సంగాలకు, గురువుగారి దర్శనానికి శిరిడీ వెళుతుండేవారు. అమ్మ ఎప్పుడూ గురువుగారి గురించి, బాబా గురించి చెబుతుండేది. కానీ పెద్దగా పట్టించుకొనేదాన్ని కాను. నాకుగా నేను గురువుగారి గొప్పతనాన్ని తెలుసుకొనే అవకాశం చాలా తమాషాగా జరిగింది. చూడడానికి ఇది చిన్న సంఘటనే అయినా నాలో పెద్ద మార్పు తీసుకొచ్చింది.

నేనప్పుడు తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. ఒకరోజు సాయంత్రం నాకు ఎందుకో కేక్ తినాలనిపించింది. అమ్మనడిగాను. "నీక్కావాల్సింది కొనుక్కో, కాని చీకటి పడకుండానే తిరిగి వచ్చేసెయ్" అన్నది. అయితే అప్పుడు బయట కుండపోతగా వర్షం మొదలవడంతో తగ్గిన తరువాత వెళదామనుకున్నాను. కానీ ఆ వర్షం చాలాసేపటి వరకు తగ్గలేదు. అప్పటికే చీకటి పడిపోయింది. అప్పుడు నేను వెళతానంటే అమ్మ "ఈ టైమ్‌లో ఒంటరిగా వెళ్ళొద్దు" అంది.

నేను వెళ్ళి కేక్ తెచ్చుకుంటాననీ, అమ్మ వద్దని. ఇలా గొడవ పడి బయటకు వెళ్ళనివ్వలేదన్న అలకతో కోపంగా పడుకున్నాను. అప్పుడు గురువుగారు తిరుమలలో ఉన్నారు. రోజూ సాయంత్రం మా నాన్నగారు గురువుగారి దర్శనానికి వెళ్ళి ప్రొద్దున్నే తిరిగి వచ్చేవారు. ఆ రోజు నాన్నగారు గురువుగారి దగ్గర నుండి సెలవు తీసుకుని వస్తుంటే గురువుగారు పిల్లలకివ్వమని ప్రత్యేకంగా కేక్ ఇచ్చారట. అది సరిగ్గా నేనడిగిన ప్లమ్ కేక్!

నేను ప్రొద్దున నిద్ర లేవగానే అమ్మ నాకు కేక్ చూపిస్తూ "ఈ కేక్ కావాలనేగా రాత్రి అంత గొడవ చేసావు. నీ గొడవ భరించలేక గురువుగారే కేక్ పంపించారు చూడు" అన్నది.

నాకెంత ఆశ్చర్యం కలిగిందో చెప్పలేను. "ప్రసాదంగా వేరే ఏదైనా ఇవ్వచ్చు కానీ ఖచ్చితంగా అదే కేక్, నిన్న నేను అంతగా తినాలనుకొన్న కేక్‌ను ఇచ్చారే! అదీ

పిల్లలకివ్వు అని కూడా చెప్పారే!” అనుకున్నాను. ఈ విషయమే అమ్మతో అంటే “అదే గురువుగారికి మన మీద ఉండే ప్రేమ. వారు ఎప్పుడూ మన అవసరాలను ఎలా గమనిస్తుంటారు అన్నది మనం ఎఱుకలో ఉంచుకొని, వారి మీద ఆధారపడడం నేర్చుకోవాలి” అన్నది.

ఆ సంఘటనతో నన్ను గురువుగారు పూర్తిగా తన వైపుకు త్రిప్పుకున్నారు. అప్పటి నుండి ఏదైనా సరే గురువుగారితో చెప్పి, ఆ విధంగానే నడుచుకోవాలని నేను అనుకున్నాను.

నాకు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఎక్కువగా ఉండేది. ఎప్పుడూ నలుగురిలోకి వెళ్ళాలన్నా, ఎవరితోనైనా మాట్లాడాలన్నా ఎంతో భయపడిపోయేదాన్ని. నా భయాన్ని గురువుగారికి చెప్పుకుని, అది పోగొట్టమని ప్రార్థించాను. మెల్లమెల్లగా గురువుగారు నాకు తెలియకుండానే నాలో ఉండే భయాలు పోగొట్టారు. ఈ రోజున మా ఇంట్లో అందరిలోనూ నేనే ఎక్కువగా మాట్లాడుతున్నాను. ఎక్కడికైనా వెళ్ళగలుగుతున్నాను.

ఇంటర్మీడియట్ తర్వాత ఎమ్‌సెట్‌లో సీటు రాక బాధపడుతూ ఇంట్లో ఉన్నాను. నన్ను ఏ కోర్సులో చేర్పించాలి అని నాన్నగారి ఆందోళన. అప్పుడు గురువుగారు నన్ను కొన్నాళ్ళపాటు శిరిడీ వచ్చి ఉండమన్నారు. నేను శిరిడీ వెళ్ళాను.

శిరిడీలో గడిపినకాలం నా జీవితాన్ని పూర్తిగా మార్చివేసిందనే చెప్పాలి. చీటికిమాటికి ఆందోళన చెందడం, కోపం, చిరాకుపడడం ఇవన్నీ చాలావరకు తగ్గిపోయాయి. రోజూ సాయిసచ్చరిత్ర చదువుకోవడం, మందిరానికి వెళ్ళి అక్కడ గురుస్థాన్ చుట్టూ ప్రదక్షిణలు చేయడం, సత్సంగంలో పాల్గొనడం, సాయిపథంకు వచ్చే గురుబంధువులందరితో కలిసిమెలిసి ఉండడం.. వీటితో రోజులు హాయిగా గడిచిపోయాయి. హాయిగా నవ్వడం, నిశ్చింతగా ఉండడం నేర్చుకున్నాను. అట్లాగే రోజులన్నీ గడిచిపోతే బాగుండుననిపించేది.

తర్వాత నా చదువు గురించి గురువుగారిని అడిగితే, నన్ను మళ్ళీ ఎమ్‌సెట్ వ్రాయమన్నారు. నేను కొద్దిగా భయపడ్డాను ఈసారి ఏమవుతుందోనని. “*ఏం భయపడకు. బాగా చదివి పరీక్ష వ్రాయి*” అన్నారు.

నేనట్లాగే వ్రాయడం, క్వాలిఫై అవడం జరిగింది. కానీ మంచి ప్రైవేటు కాలేజీలో చేరేందుకు ర్యాంకు రాలేదు. కంప్యూటర్స్ అంటే నాకు చాలా ఇష్టం. అప్పటిదాకా ఆంధ్రలో బి.సి.ఎ. కోర్సు లేదు. ఆ సంవత్సరమే ఆ కోర్సును పెట్టడం, గురువుగారు

చెప్పారని ఎంట్రెన్సు వ్రాయడం, పాసవ్వడం జరిగింది. ముందు గూడూరులో సీటు వచ్చింది. గురువుగారిని ప్రార్థించగా, మరల తిరుపతి కాలేజీలో ఒకే ఒక్క సీటు ఖాళీ ఉందని, అది నాకివ్వడం జరిగింది. ఆ సంవత్సరమే ఆ కోర్సు పెట్టడం, అందులోను తిరుపతిలో ఒకే ఒక్క సీటు మిగిలి ఉండడం, అది నాకే రావడం చూస్తుంటే, గురువుగారు నా కోసమే ఆ సీటు ఉంచారని ఖచ్చితంగా చెప్పగలను. ఆ విధంగా నా చదువు ఒక దారిలో పడింది.

గురువుగారు మనకేది మంచిదో దానిని ఎన్ని మలుపులు త్రిప్పి అయినా సరే చివరకు మనకది చేస్తారు. ఇదంతా జరిగే విధానంలో వారి ప్రేమ, మహిమ మనకవగతమవుతూ మనం ఇంకా ఇంకా వారికి చేరువవుతుంటాము.

# అడగనిది కూడా అందించే అమ్మ

అద్దంకి స్నేహిత
స్కూల్ స్టూడెంట్, చెన్నై.
జన్మించిన సం॥ 1990

చెన్నై, ఫిబ్రవరి 2004

నాకు ఊహ తెలిసినప్పటి నుండి మా అమ్మ, నాన్నలతో కలిసి గురువుగారి దగ్గరకు వెళుతున్నాను. నేను ఏది కావాలని ప్రార్థించినా వెంటనే గురువుగారు తీరుస్తారు అన్నది నా నమ్మకం, అనుభవం కూడా.

నాకు అయిదేళ్ళ వయసప్పుడు విజయదశమికి శిరిడీ వెళ్ళాము. బాబా సమాధి చుట్టూ 108 సార్లు ప్రదక్షిణలు చేస్తే నాకు మంచి బొమ్మ కొనిపెడతానన్నది మా అమ్మ. నేను చిన్నదాన్నయినా కష్టపడి 108 ప్రదక్షిణలు పూర్తి చేశాను. ఎప్పుడూ అన్నీ కొనిచ్చే అమ్మ ఎందుకో "బొమ్మ తరువాత కొనిస్తాలే" అన్నది. నాకు ఏడుపొచ్చింది. మేము ఊరికి వచ్చే ముందు గురువుగారి దగ్గరకు వెళ్ళగా, వారు నాకు మంచి బొమ్మ ఇచ్చారు ఆడుకొమ్మని. నాకెంత సంతోషమేసిందో చెప్పలేను.

నేను డాన్స్ సరిగా చేయడం లేదని, నాకు డాన్స్ రాదని ఫ్రెండ్స్ అందరూ ఎగతాళి చేసేవారు. నేను గురువుగారిని నాకు డాన్స్ బాగా వచ్చేలా అనుగ్రహించమని ప్రార్థించి ప్రాక్టీస్ మొదలుపెట్టాను. తరువాత జరిగిన డాన్స్ పోటీలలో నాకు రెండుసార్లు ఫస్ట్ ప్రైజు వచ్చింది. ఇప్పటివరకు డాన్స్‌లో నాకు 22 బహుమతులొచ్చాయి.

నేను 8వ తరగతికి రాగానే మేము తెనాలి నుండి చెన్నైకి వచ్చాము. చెన్నైలో నాకూ మా తమ్ముడికి మంచి స్కూల్‌లో సీటు రావాలని, ఇంటికి దగ్గరగా ఉన్న మంచి స్కూల్స్ అన్నింటిలోనూ మా డాడీ ప్రయత్నాలు చేశారు కానీ ప్రయోజనం లేకపోయింది. స్కూల్స్ మొదలై పది రోజులయినా మాకు ఏ స్కూల్‌లోనూ సీటు రాకపోవడంతో మా డాడీ గురువుగారితో "నేనిక ఎవరినీ అడగను, రికమెండేషన్‌కూ ప్రయత్నించను. పిల్లలకు మంచి స్కూల్లో సీటు వచ్చేలా మీరు ఆశీర్వదించండి" అని వేడుకొన్నారట!

వెంటనే మాకు బాల విద్యామందిర్‌లో సీటు వచ్చింది. అంతకుమునుపు కూడా అక్కడ ప్రయత్నించారు కానీ అప్పుడు సీటు లేదన్న ప్రిన్సిపాల్, మా డాడీ "మీదే భారం" అని గురువుగారికి చెప్పుకున్న తరువాత సీటు ఇచ్చారు. మా స్కూల్‌కి చాలా

మంచి పేరుంది. నాకు, మా తమ్ముడికి ఈ స్కూల్ ఎంతో నచ్చింది. గురువుగారు చదువులో కూడా నాకు ఎన్నో విధాలుగా సహాయం చేస్తుంటారు. ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్ళే ముందు నిత్యప్రార్థన చదువుతాను. అది నాకు ఎంతో ధైర్యాన్నిస్తుంది.

నేనెప్పుడూ ఏ పని చేస్తున్నా గురువుగారు గమనిస్తూనే ఉంటారని గుర్తుంచు కొనేందుకు ప్రయత్నిస్తాను. అబద్ధాలు చెప్పడం, తోటి పిల్లలతో గొడవలు పడడం ఇవన్నీ గురువుగారికి ఇష్టముండవు. కనుక మేమెప్పుడూ అలా చేయం. అందుకే మా టీచర్స్ అందరికీ మేమంటే చాలా ఇష్టం.

తెనాలిలో ఉండగా ఎప్పుడూ ఏదో ఒక పోటీలో పాల్గొంటూ బహుమతులు తెచ్చుకునేదాన్ని. అలా ఎంతో ఉత్సాహంగా ఉండే నేను, చెన్నై వచ్చిన తరువాత అంత పెద్ద నగరంలో జరిగే పోటీల్లో ఏ విధంగా పాల్గొనాలో తెలియక ఊరకే ఉన్నాను. నాకు బాగా డల్‌గా అనిపించేది.

ఒకరోజు "చెన్నైలో నేను చదువుకోను. నాకు ఏ పోటీలు, బహుమతులూ లేవిక్కడ" అని గురువుగారి పటం ముందు ఏడ్చాను. మరునాడే పేపర్‌లో తెలుగు అకాడమీ వారి ఉగాది పురస్కారాల గురించి ప్రకటన వచ్చింది. మా అమ్మ అప్పటి వరకు నాకొచ్చిన బహుమతుల వివరాలు, నా ఫోటోలు అన్నీ జత చేసి అప్లికేషన్ పంపించింది. ఏదో పంపించామే కానీ అందులో పాల్గొనేందుకు నాకు అవకాశం వస్తుందనుకోలేదు. కానీ ఆశ్చర్యం! నేను సెలక్టు అయినట్లు వాళ్ళ దగ్గర్నుండి మాకు ఉత్తరం వచ్చింది. ఆ ఉగాది పురస్కారాలలో నా డాన్స్ ఎంతో బాగుందని అందరూ అభినందించారు. గవర్నర్‌గారి దగ్గర నుండి పురస్కారం అందుకోవడం నేనెప్పటికీ మర్చిపోలేను. నేను గోరంత అడిగితే, కొండంత బహుమతినిచ్చారు గురువుగారు.

***భక్తుడు:*** *బాబా తన భక్తుణ్ణి తానే ఎన్నుకుంటారు కదా. మనమేదైనా కోరిక అడిగినప్పుడు కొంతమందికి వెంటనే తీరుతుంది. కొంతమందికి కొన్ని సమస్యలు ఎదురవుతాయి. అలా తేడా ఎందుకు? ఆయన ఎన్నుకున్న వాళ్ళే కదా అంతా?*

***గురువుగారు:*** *ఆయన ఎన్నుకున్న వాళ్ళు గనుకనే, కొంతమందికి ఆలస్యంగా తీర్చాలనుకుంటున్నారు. కొంతమందికి తొందరగానే తీరుస్తున్నారు. అదీ ఆయన ఇష్టమేగా. (నవ్వులు)*

అది తీరడానికి జరిగే లేట్ కూడా ఒక పద్ధతిలో– ఇంకా బాబాకు దగ్గరవడానికి మార్గంగానో లేదా ఆలస్యంగా తీరడం మనకు శ్రేయస్కరమో– మనకు తరువాత తెలుస్తుంది. ఆలస్యం చెయ్యాలని చెయ్యరు ఆయన కోరిక తీర్చడానికి. ఈ లోపల జరగాల్సినటువంటిది వాళ్ళలో సరైనటువంటి మార్పు. అది ఆయనకి ప్రధానమైన విషయం. నిజానికి మన కోరికలు ఊరికే తీర్చుకుంటూ పోవడమే కాదు, ఆయనే చెప్పారు "నా భక్తుడు అడిగినవంతా నేను తీరుస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలచుకుంది వాడు అడిగేంతవరకు" అని. కాబట్టి ఆయన ఇవ్వదలచుకుంది మనం అడిగేదానికి అనుగుణంగా– దాన్ని ప్రిపేర్ చేసే దాని ప్రకారంగానే తీరుస్తారు కోరికలు.

ఇంకా బాబా మార్గంలో కాస్త జాగ్రత్తగా ఉన్నవాళ్ళకు ఇంకొక విషయం కూడా ఇట్టే అర్థమవుతుంది. ఆయనకు మనకు మధ్య ఉన్న సంబంధం – అడగడం, తీసుకోవడం అనేదే కాకుండా – దానికి మించి మనలను ఉద్ధరించడమే అని.

# అనూహ్యానందం

సాయి సుధ
కాలేజీ స్టూడెంట్, చెన్నై
జన్మించిన సం॥ 1982

చెన్నై, మే 2004

మేము ముగ్గురు అక్కచెల్లెళ్ళం. రెండు సంవత్సరాల క్రితం మా అమ్మగారు చనిపోయారు. మాకు చెన్నైలో స్వంత ఇల్లుంది. ఆ ఇంటిని మా అమ్మ దగ్గరుండి కట్టించుకున్నారు. ప్రతి వారం ఇంట్లో సత్సంగం, భజన చేస్తుంటాము. అమ్మ పోయిన తర్వాత ఆమె జ్ఞాపకాలతో నిండి ఉన్న ఆ ఇంటిని మేము మందిరంలా భావించుకుంటున్నాము. కొన్ని కారణాల వలన మేము ఆ ఇంటి నుండి అద్దె ఇంట్లోకి మారాము. నాన్నగారు, అక్కయ్య మా ఇంటిని అద్దెకు ఇస్తామన్నారు.

మా అమ్మ జ్ఞాపకాలను, గురువుగారి సాన్నిధ్యాన్ని ఇచ్చే ఆ ఇంటిని ఎవరికో అద్దెకు ఇచ్చేకన్నా ఏదన్నా ధర్మకార్యాచరణకో లేక వృద్ధాశ్రమం వంటి వాటికి ఉపయోగిస్తే బాగుంటుందని నా అభిప్రాయము, ఆశ. వాస్తవాలతో రాజీపడాలన్నది మా నాన్న, అక్కయ్యల వాదం. చిన్నదాన్ని నేనేం చెప్పగలను? అయితే గురువుగారి ఫోటో ముందు మాత్రం ఎప్పుడూ "మీరే నాకు తల్లి, తండ్రి, సర్వస్వం. నా భావాలను అర్థం చేసుకొని మీరే నన్ను ప్రోత్సహించాలి. ఎలాగైనా మీరే దీనికి ఒక మంచి పరిష్కారం చూపండి" అని వేడుకొనేదాన్ని.

ఆ ఇల్లు మూడు నెలల వరకు అలా ఖాళీగానే ఉంది. తర్వాత ఒక ట్రస్టుకు సంబంధించిన వాళ్ళు వచ్చి వాళ్ళ సంస్థ తరఫున లేడీస్ హాస్టల్ కోసం ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. మా వాళ్ళు ఒప్పుకున్నారు. నాకు చాలా నిరాశ కలిగింది.

నేను నా భావాలన్నింటినీ గురువుగారి పటం ముందు చెప్పుకున్నాను. అంతలో వాళ్ళు మళ్ళీ వచ్చి ఆ ఇల్లు మెయిన్‌రోడ్డు నుంచి కాస్త లోపలికి ఉన్నందువలన అది వర్కింగ్ ఉమెన్ వంటి వారికి రానూపోనూ కష్టంగా ఉంటుందనీ, ఆ సంస్థ తరఫునే ఉన్న వృద్ధాశ్రమానికి ఇల్లు వాడుకొంటాము అని చెప్పారు.

మా అందరికీ వాళ్ళ నిర్ణయం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ నిర్ణయం వెనుక ఎవరి ప్రమేయమున్నదో కూడా అవగతమైంది! అటు మా వాళ్ళకి ఆర్థికంగా బాధ లేకుండా అద్దె వచ్చేలాగానూ ఉంది. ఇటు నేను కోరుకున్నట్లుగానే అందులో

వృద్ధాశ్రమమే ఉంది! నాకు చాలా ఆనందమేసింది. నిజంగా గురువుగారెంతటి చక్కని పరిష్కారాన్ని చూపారు!

నేను ఇంజనీరింగ్ చదువుతున్నాను. ఫైనలియర్‌లో ఉన్నందువలన కాలేజీలో పరీక్షలు, ముఖ్యమైన క్లాసులకు తప్పక హాజరు కావలసి ఉండడంతో గురువుగారి దర్శనానికి మా కుటుంబంలోని వాళ్ళు వెళ్ళేటప్పుడు నేను వెళ్ళలేకపోయాను.

బాబా, గురువుగారి ఫోటోల ముందు రోజూ నా ఆవేదన చెప్పుకోసాగాను. నేనలా బాధపడుతున్నప్పుడే నాకు వచ్చిన రెండు కలలు నా బాధను మరింత పెంచాయి. ఎందుకంటే ఆ కలల్లో గురువుగారున్న ప్రదేశం, గురుబంధువులు కనిపిస్తున్నారే కానీ గురువుగారు మాత్రం కనిపించడం లేదు.

అలా ఆ బాధలోనే నేను ఆదివారం సత్సంగానికి వెళ్ళాను. అక్కడకు వచ్చిన శ్రీమతి ఝాన్సీగారు నాకు ఒక ఫోటో ఇచ్చారు. ఆ ఫోటోను చూసి నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అది పోయిన సంవత్సరం తిరుమలలో తీసిన ఫోటో. అందులో గురువుగారు తమ ఆసనంలో కూర్చొని ఉండగా నేను వారితో ఏదో చెప్పుకొంటున్నాను. గురువుగారు చిరునవ్వు మోముతో ప్రసన్నంగా వింటున్నారు!

“ఎందుకురా ఊరికే బాధపడతావు నాకు దూరమయ్యానని! నువ్వు నా దగ్గరే ఉన్నావు. నువ్వు చెప్పేది అంతా నేను వింటూనే ఉన్నాను” అని వారు వాత్సల్యంగా నాతో చెప్తున్నట్లుందా ఫోటో చూస్తుంటే. ఎప్పుడో ఏడాది క్రిందట తీసిన ఫోటో. ఝాన్సీగారు, నేను సత్సంగంలో కలుసుకుంటూనే ఉంటాము. కానీ సరిగ్గా అప్పుడొచ్చి ఇచ్చారంటే, నా బాధంతా గురువుగారికి చేరి, ఆ ఫోటో రూపంలో వచ్చి నన్ను ఓదార్చినట్లుంది.

ఆ రోజు నుండి గురువుగారెక్కడో దూరంగా ఉన్నారు, నేను వెళ్ళి దర్శించుకోలేక పోతున్నానన్న బాధ కలగడం లేదు. ప్రతి క్షణం, ప్రతి చోటా గురువుగారు నాతోనే ఉన్నారన్న అనుభూతి నాలో!

# సద్గురువు ఇచ్చిన ఆత్మవిశ్వాసం

గోపతిపాళెం ప్రతిమ
కాలేజీ స్టూడెంట్, తిరుపతి
జన్మించిన సం॥ 1979

శిరిడీ, నవంబర్ 2002

1999లో నేను శిరిడీకి వెళ్ళడానికి ముందు నరసింగాపురం సత్సంగానికి వెళ్ళాను. అదే నేను మొదటిసారి సత్సంగానికి వెళ్ళడం. ఆ రోజు పారాయణలో శ్రీబాబూజీ రచించిన "సర్వవ్యాపియైన సాయి కోసం శిరిడీ వెళ్ళాలా?" అనే వ్యాసాన్ని గురుబంధువైన సాధన చదివింది. ఆ వ్యాసంలో పవిత్ర క్షేత్రాలు, తీర్థాల దర్శనం మన మనస్సులపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయనే విషయాన్ని గురువుగారు సశాస్త్రీయంగా వివరించారు. ఆ వ్యాసం నాకు ఎంతో ఆసక్తిని కలిగించింది. అలా నేను గురువుగారి గురించి మొదటిసారి తెలుసుకున్నాను. ముఖ్యంగా నేను గురువుగారిని ఒక గొప్ప స్కాలర్‌గా భావించి, వారి అభిమానినయ్యాను.

గురుపూర్ణిమ సందర్భంగా తిరుపతి నుండి చాలామంది సత్సంగసభ్యులు శిరిడీకి వెళుతున్నారు. నాకు కూడా గురువుగారి దర్శనం చేసుకోవాలనిపించి వారితో కలసి బయలుదేరాను. మేమందరం గురుపూర్ణిమ ముందురోజు శిరిడీ చేరుకున్నాము. అదే రోజు సాయంత్రం మొదటిసారి గురువుగారి దర్శనం చేసుకున్నాను.

మరుసటి రోజు అంటే గురుపూర్ణిమ నాడు, నాకు జలుబుతో పాటు తీవ్రమైన జ్వరం వచ్చింది. శ్వాస తీసుకోవడం కూడా కష్టమయింది. నేను సాయిపథం పల్లకీ ఉత్సవానికి కూడా వెళ్ళలేకపోయాను. గురుబంధువు అన్నపూర్ణ ఆంటీ (సూరారెడ్డి అంకుల్ భార్య) పాలు, మందులు తీసుకుని రూమ్‌కి వచ్చింది. అవి నాకు ఇస్తూ 'బాబా నీకు ఇవ్వమని చెప్పినట్లుగా అనిపించి తెచ్చాను' అన్నది. అది వినగానే నాకు చాలా ఆనందమేసింది. ఆ సాయంత్రం నేను పైకి లేవడం కష్టమనుకున్నాను కానీ గురుపూర్ణిమ రోజు గురువుగారి దర్శనాన్ని కోల్పోవద్దని, సాయిపథం దాకా రావడానికి ప్రయత్నించమని సాధన చెప్పడంతో శక్తిని కూడదీసుకుని సత్సంగహాలుకు వెళ్ళాను.

గురువుగారు వచ్చి వేదిక మీద ఆశీనులయ్యారు. ఆయన చూపులు సత్సంగ హాలంతా పరుచుకున్నాయి. ఒక్క క్షణం వారు చూపును నా మీద అలా నిలిపి, తర్వాత మిగతావారి వైపుకు మరల్చారు. గురువుగారు మరొక్కసారి నన్ను చూడాలని

కోరుకున్నాను కానీ అలా జరగలేదు. అకారణంగా నాకు బాగా ఏడుపొచ్చింది. దర్శనం అయిపోయిన తరువాత పైకి లేచాను. నా మనసుకు చాలా సాంత్వన చేకూరి, స్వస్థతగా అనిపించింది. శ్వాస తీసుకోవడం కూడా సులువైంది. నేనసలు అడగకుండానే వారి సాన్నిధ్యంలో జలుబు, జ్వరం తగ్గిపోయాయి. గురువుగారు గొప్ప స్కాలర్ మాత్రమే అన్న నా భావన ఒక్కసారిగా మారిపోయి, అంతకు మించింది ఇంకేదో వారిలో ఉన్నదన్న విషయం స్పష్టంగా అవగతమైంది. అందరి బాధలను బాపే ఆయన మహిమను నేను తొలిసారి చవిచూశాను. నేను అంతగా ఆత్మవిశ్వాసం గల అమ్మాయిని కాకపోవడంతో, స్టేజ్ ఫియర్‌తో బాధపడేదాన్ని. నేను శిరిడీలో ఉన్నప్పుడు ఈ భయాలను తగ్గించమని గురువుగారిని ప్రార్థించాను.

ఒకసారి నేను డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నప్పుడు మా కాలేజీలో వక్తృత్వ పోటీలు జరుగుతున్నాయి. ప్రసంగించవలసిన అంశాన్ని పోటీకి ఇరవై నిమిషాల ముందు మాత్రమే తెలియజేస్తారు. ఇందులో పాల్గొనడానికి మా క్లాస్ నుండి అమ్మాయిలెవ్వరూ ముందుకు రాలేదని మా కెమిస్ట్రీ లెక్చరర్ వేళాకోళం చేయగా, నేను తొందరపడి ఆ పోటీలో పాల్గొనేవారి జాబితాలో నా పేరిచ్చాను.

స్టేజి మీద మాట్లాడే ధైర్యమివ్వమని బాబాను, గురువుగారిని ప్రార్థించాను. “భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా ఉండాలా లేక మతాధిపత్యదేశంగా ఉండాలా?” అన్న అంశం మీద నేను ప్రసంగించాల్సి వచ్చింది. ఈ విషయం గురించి నాకు ఏ మాత్రం అవగాహన లేకపోయినా ఏదో తెలియని ఆత్మవిశ్వాసంతో నేను వేదిక మీదకు వెళ్ళి ప్రసంగించాను. పదిమందిలో మాట్లాడటానికి వణికిపోయే నేను సెకండ్ ప్రైజ్ గెలిచాను. ఇది నా తెలివితేటల వల్ల వచ్చింది కాదని నాకు స్పష్టంగా తెలుసు. నాలో క్రొత్తగా రేకెత్తిన ఈ ఆత్మవిశ్వాసం బాబా, గురువుగారి అనుగ్రహ విశేషమే. వారు నా మొర ఆలకించి నేను ధైర్యంగా ప్రసంగించేలా చేయడమే కాకుండా, బహుమతిని కూడా ప్రసాదించారు. తరువాత పై చదువులలో కూడా ఆ ఆత్మవిశ్వాసం నాలో అలాగే కొనసాగింది. ఇప్పుడు నేను ఎంతమంది ఉన్నా వారి ముందు చాలా సులభంగా మాట్లాడగలుగుతున్నాను. నాలో ఈ మార్పుకు కారణమైన బాబా, గురువుగారికి నేనెంతో ఋణపడివుంటాను.

# ఎన్నో నేర్పిస్తున్నారు

సాయినాథుని భానుతేజ
మెడికల్ స్టూడెంట్, హైదరాబాద్
జన్మించిన సం॥ 1977

చెన్నై, మే 2004

నేను 6వ తరగతి చదువుతున్నప్పుడు మా నాన్నగారి స్నేహితునిగా గురువుగారు నాకు పరిచయమయ్యారు. అప్పుడు నా వయసు పదకొండు సంవత్సరాలు. వారిని నేను 'అంకుల్' అని పిలిచేవాడిని. నేను మొదట వారిని అందరి అంకుల్స్‌లాగానే అనుకున్నాను. కానీ రోజులు గడిచేకొద్దీ ఈ అంకుల్ మాత్రం సాధారణ వ్యక్తి కాదు, ఎంతో మహోన్నతమైన వ్యక్తిత్వం కలవారు, గొప్పవారు అని బోధపడింది.

గురువుగారు ఒంగోలు నుండి శిరిడీ వెళుతున్నప్పుడు, తరచూ మేము కూడా వారితో శిరిడీ వెళుతుండేవాళ్ళం. వేసవి సెలవులంతా నేను సాయిపథంలో అంకుల్ దగ్గరే గడిపేవాడిని. వారు నా సంశయాలన్నీ తీర్చేవారు. తప్పొప్పులను ఎంతో మృదువైన రీతిలో వివరించేవారు. ముఖ్యంగా నా చదువు విషయంగానే కాదు, అన్నింటిలోను నన్నెంతో ప్రోత్సహించేవారు. ఏ పని చేస్తున్నా పూర్తి చేయాలన్న పట్టుదల, చేయగలనన్న ఆత్మవిశ్వాసం ఉంటే ఎవరైనా తప్పక ఆ పని సాధించగలరని చెప్పేవారు. అలా నేను చేయలేననుకున్న ఎన్నో పనులను నా చేత చేయించి చూపారు.

పదవ తరగతి తరువాత ఏ గ్రూప్ తీసుకోవాలని గురువుగారినడిగాను. వారు నన్ను బై.పి.సి. తీసుకోమని చెప్పారు. నాకు మాత్రం ఎమ్.పి.సి. తీసుకోవాలనుంది. అంతే కాకుండా బయాలజీ అంటే కష్టమనే భావన కూడా ఉండేది. అప్పుడు అంకుల్ (గురువుగారు) నాకు తన విద్యార్థి దశలోని విషయాలన్నీ ఇలా వివరించారు:

*"నేను బి.ఎ.లో స్పెషల్ ఇంగ్లీష్ మెయిన్‌గా తీసుకుంటుంటే అందరూ 'వద్దు అది చాలా కష్టం' అన్నారు. దాంతో ఒక రకంగా నాలో పట్టుదల పెరిగింది. ఏమిటి కష్టం? చూద్దాం అని నేను ఇంగ్లీష్ లిటరేచరే తీసుకున్నాను. ఆ సబ్జెక్టులో కాలేజి ఫస్టు వచ్చాను. అలా ప్రతి విషయాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకోవాలి తప్ప, నిరుత్సాహంతో భయపడిపోకూడదు.*

*అందరికీ సులభమైనది నువ్వూ చదివి మార్కులు తెచ్చుకోగలిగితే నీ గొప్పతనం ఏముంది? అందరికీ కష్టమన్నది నువ్వు సాధించగలగాలి. అన్నింటిలో*

ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉండాలి. కృషి, పట్టుదల ఉంటే దేన్నయినా సాధించగలం. ఏదీ అసాధ్యం కాదు".

గురువుగారి మాటలు నన్నెంతో ప్రభావితం చేశాయి. ఆ మాటలు ఒక్క చదువు విషయంలోనే కాదు, నా జీవితంలో ఎన్నో సందర్భాలలో నాకెంతగానో ఉపకరించాయి, ఉపకరిస్తున్నాయి.

అలా వారిచ్చిన స్ఫూర్తితో ఇంటర్ మంచి మార్కులతో పూర్తి చేసి, తర్వాత వారి అనుగ్రహంతో బి.హెచ్.ఎమ్.ఎస్. పూర్తిచేయడమే కాక, ఆల్ ఇండియా ఎమ్.డి. ఎంట్రన్స్‌లో 8వ ర్యాంక్ గడించి, ఎమ్.డి. కూడా పూర్తి చేయగలిగాను. ఎమ్.డి.లో చేరే ముందు ఏ సబ్జెక్ట్ తీసుకోమంటారని గురువుగారిని అడిగినప్పుడు వారు "సహజంగా 'ఆర్గనాన్ అండ్ ఫిలాసఫీ' ఎవరూ తీసుకోరు" అని చెప్పారు. గతంలో వారన్న మాటలు గుర్తొచ్చి కష్టమైనా సరే ఆ సబ్జక్టే తీసుకుని వారి ఆశీస్సులతో ఎమ్.డి. పూర్తిచేయగలిగాను.

***భక్తుడు:*** *బాబాకు దగ్గరవడం అంటే...?*

***గురువుగారు:*** *మనమంటూ లేకుండా బాబానే ఉండడం. అదీ నిజంగా బాబాకు దగ్గరవడం. ఎంత దగ్గరా అంటే ఇక దూరము, ఇద్దరు అనేటువంటిది లేకుండా పోయినంత దగ్గరగా! ఒక్కొక్క అడుగు, ఒక్కొక్క అడుగు మనలను దగ్గరకు తీసుకుంటూ పోతారు. అది ఎక్కడకు దారి తీయాలి? మనం అంటూ ఏమీ లేకుండా బాబానే మిగలాలి– అంతగా. అది చెప్పేదానికి బాగుంటుంది, కాని నువ్వు బాబా అవ్వాలి అంటే మళ్ళా దానికి వేదాంత అర్థాలు వస్తాయి, అందుకని అటువంటి అర్థాలు, అటువంటి తర్కములోకి పోకుండా బాబాకు దగ్గరవ్వాలి అనే పదం ఎక్కువ వాడుకలో పెడతారు.*

***భక్తుడు:*** *అంటే మనకంటూ individuality ఉండకూడదంటారా?*

***గురువుగారు:*** *నిజానికి చెప్పాలంటే 'మనమంటూ ఉండకూడదు, మనలో individuality ఉండకూడదు. ఈ 'నేన'నేది ఉండకూడదు. అహాన్ని పోగొట్టుకోవాలి' అని మామూలుగా మనం వేదాంతంలో వింటుంటాం.*

ఈ అహాన్ని పోగొట్టుకోవడం అనేది గమ్యంగా పెట్టుకుంటే మనకు పోదు. మనలో ప్రేమ అనేటువంటి experience వచ్చినప్పుడు అది by-product క్రింద వస్తుంది. వేదాంతంలో ఈ మర్చిపోవడాన్ని ఫోకస్ చేసి, అదే గమ్యంగా చెప్పడం మొదలయ్యింది. ఇక్కడ మన గమ్యం మాత్రం బాబా పట్ల ప్రేమ. దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడం, enjoy చేయడం, fulfil చేయడం. మనకు కావలసింది బాబా. బాబా పట్ల మనకు వచ్చే తరుగులేని ఆనందం కావాలి.

ఆ ప్రేమ యొక్క తత్త్వం, ఎక్కడైనా ఏమవుతుందనంటే మనిషిని merge చేస్తుంది. మామూలు లౌకికమైన ప్రేమలో కూడా ఎలా ఉంటాయి expressions? 'మనమిద్దరం ఒకటి అవుదాం, నన్ను నీలో కలసిపోనీ' అంటే నేను లేకుండా పోవాలి, 'మనమిద్దరం ఏకం అయిపోదాం' అంటే వారి యొక్క అస్తిత్వం పోయినట్టేగా లెక్క. కాబట్టి మామూలు ప్రేమలో కూడా, ప్రేమ యొక్క తత్త్వం ఏమిటంటే మనం లేకుండా పోయి, ఇంకేదో కావడం. కాని అది లక్ష్యం కాదు. అది మనల్ని మనం మర్చిపోవడంగా చేసే ప్రయత్నం కాదది. బాబాను గుర్తుపెట్టుకుంటే ఏం మరచిపోవాలో అది మరచిపోతాము. ఆ గుర్తుపెట్టుకోవడానికి అడ్డంగా ఉండేవి ఏం మరచిపోవాలో అవి మరచిపోతాము.

# ఇంట్లో నేనున్నానుగా

అద్దేపల్లి దివ్య
స్టూడెంట్, చెన్నై
జన్మించిన సం॥ 1984

చెన్నై, ఫిబ్రవరి 2001

గురువుగారు మా అమ్మకు స్వంత అన్నయ్య అంటే నాకు మేనమామ. దాదాపు నాకు అయిదారేళ్ళు వచ్చేవరకు మామయ్య, అత్తయ్య మా ఇంటికి వచ్చేవాళ్ళు, మేమూ ఒంగోలుకు వెళుతుండేవాళ్ళము. ఒంగోలులో మామయ్య స్థాపించిన సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో నేను కొన్నాళ్ళు చదువుకొన్నానని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాను. చిన్నప్పుడు మా మామయ్య నాకెన్ని బహుమతులు కొనిచ్చిందీ, ఎంత ముద్దు చేసిందీ ఇవన్నీ అమ్మ చెపితే వినడమేగాని నాకంత బాగా గుర్తులేవు. 1990లో మేము హైదరాబాదు నుండి చెన్నైకి వచ్చేయడమూ, అంతకు కొన్ని నెలల ముందే మామయ్య వాళ్ళు ఒంగోలు నుండి శిరిడీ వెళ్ళిపోవడంతో దాదాపు ఆరేడేళ్ళు రాకపోకలే లేకుండా పోయాయి.

నాకు బాగా ఊహ తెలిసిన తర్వాత నేను వారిని కలిసింది 1997లో మేము శిరిడీ వెళ్ళినప్పుడే.

మేము మొదటిసారి వెళ్ళినప్పుడు శిరిడీలో పది పదిహేను రోజులున్నాము. నాకూ, మా చెల్లికి శిరిడీ ఎంతగానో నచ్చింది. బాబా మందిరానికి వెళ్ళడం, సత్సంగ హాల్‌లో భజనలో పాల్గొనడం, మామయ్య, అత్తయ్య ప్రేమను పొందడం, శృతి (మామయ్య కూతురు) తోనూ, ఇంకా ఇంచుమించు నా వయసు పిల్లలతోనూ ఆటపాటలతో గడపడం నాకెంతో నచ్చింది. అంతకు మునుపు నేనెప్పుడూ నాకు అన్నయ్యలు, అక్కయ్యలు లేరే అనుకొనేదాన్ని. అటువంటిది సాయిపథంలో నాకన్నా పెద్ద పిల్లలందరినీ అన్నయ్య, అక్కయ్యలుగా పిలిస్తే వాళ్ళందరూ నాతో స్నేహంగా కలిసి మెలిసి ఉండడం కూడా నచ్చింది. సెలవులిస్తే చాలు ఇక మేము ఎప్పుడూ శిరిడీకే వెళుతున్నాము.

మామయ్య దగ్గరకు వెళ్తున్నప్పటి నుండి నాకేం కావాలన్నా మామయ్యనే అడుగుతున్నాను. అది చిన్నదైనా, పెద్దదైనా సరే నేనడిగినవన్నీ సమకూరుస్తున్నారు. నా పదిహేనవ పుట్టినరోజు కానుకగా మా డాడీ చేత బైక్ ఇప్పించారు గురువుగారు.

సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా మామయ్య చేతి మీదుగా బైక్ తాళాలు అందుకోవడం నాకు మరపురాని అనుభూతి.

ఒకరోజు రాత్రి ఏడు, ఏడున్నర సమయంలో ఇంట్లో నేనొక్కదాన్నే ఉన్నాను. మెయిన్ డోర్ వెనుకనున్న నా గదిలో కూర్చొని చదువుకుంటున్నాను. హఠాత్తుగా నాకెందుకో ఇంట్లో ఎవరో ఉన్నట్లు అనిపించింది. ఆ భావం చాలా స్పష్టంగా ఉంది. ఉన్నట్లుండి గురువుగారు మా హాలులో కూర్చొని ఉన్నట్లు తోచింది. అక్కడకు వెళ్ళి చూద్దామన్నా భయంతో ఆ పని చేయలేకపోయాను. ఏదో శక్తి నన్ను బలవంతంగా హాలులోకి తీసుకెళుతున్న భావన కలగడంతో చివరకి నేను బాబా, గురువుగారిని తలచుకుంటూ కళ్ళు మూసుకొని చిన్నగా హాలులోకి వచ్చాను. హాల్లో సోఫాపైన గోడకు బాబా, గురువుగారి పెద్ద పెద్ద పటాలున్నాయి. అక్కడకు వచ్చేవరకు కళ్ళు తెరిచే ధైర్యం చేయలేదు. కళ్ళు తెరిచి చూసేసరికి, అంతకు ముందు నేను జాగ్రత్తగా బాబాకు, గురువుగారికి వేసిన మల్లెపూల మాలలు సోఫాలో పడివున్నాయి. అవి ఊడి కిందపడే అవకాశం ఏ మాత్రం లేదు.

నిజంగా బాబా, గురువుగారు వచ్చారా లేక అంతా నా భ్రమేనా అనుకున్నాను. కానీ తర్వాత కొద్దిరోజులకు గురువుగారు చెన్నై వచ్చినప్పుడు అన్న మాటలు నా అనుభవాన్ని నిజమని నిర్ధారణ చేశాయి.

గురువుగారు చెన్నైకి విశ్రాంతి కోసం వచ్చినప్పుడు ఎప్పుడైనా సత్సంగ సభ్యులందరమూ కలసి వారి దర్శనానికి వెళుతుండేవాళ్ళం. అట్లా ఒక రోజు దర్శనానికి వెళ్ళినప్పుడు నేను గురువుగారికి నమస్కరించి “మా ఇంటికి రండి మామయ్యా” అని ఆహ్వానించాను.

“నేనున్నానుగా మీ ఇంట్లో! లేనా... లేనంటే చెప్పు వస్తాను” అంటూ నవ్వారు.

ఒక్కసారిగా వారట్లా అడిగేసరికి నేను తడబడిపోయాను. “ఆఁ. ఇంట్లో ఉన్నారు మామయ్యా!” అనేశాను.

“ఊఁ” అంటూ ప్రసన్నంగా నవ్వారు మామయ్య.

# వినూత్నాధ్యాయం

పసుపులేటి వినయ్‌కుమార్
స్టూడెంట్, కడప
జన్మించిన సం॥ 1979

వెంకటగిరి, జూన్ 2001

మాటలు రాని పసివాణ్ణి ఒక్కసారి చందమామను గురించి చెప్పమంటే ఏమని చెప్తాడు? నిండుపున్నమినాడు మబ్బుల నడుమ దోబూచులాడే అందమైన జాబిల్లిని చూచి ఆనందించడమే వాడికి తెలుసు. ఊహ తెలిసీ తెలియని పసిగుడ్డును తన అమ్మ గురించి చెప్పమంటే ఏం చెప్పగలదు? అయితే మాటలు రాని పసికందుకు కూడా తనదైన ప్రపంచం తనకుంటుంది. అందులోని ప్రతి వస్తువుకూ తనదైన నిర్వచనం, అవగాహన ఉంటుంది.

గురువుగారు మొదటిసారి మా ఇంటికి వచ్చినప్పుడు నాకు మూడునెలల వయస్సు ఉంటుందట. మా నాన్నగారి స్నేహితులు శ్రీశరత్‌బాబుగారిగా వారు నాకు ఊహ తెలిసినప్పటి నుండి పరిచయం. అప్పట్లో వారు నాకు శ్రీభరద్వాజ మాస్టరుగారి శిష్యునిగా, వెంకటగిరి సాయిబాబా మందిర నిర్వహణకు సంబంధించి ముఖ్య వ్యక్తిగా మాత్రమే తెలుసు. మా నాన్నగారెప్పుడూ ఆయన గురించి గొప్పగా చెప్తుంటే పెద్దగా పట్టించుకొనేవాణ్ణి కాదు. మా నాన్నగారు శిరిడీ వెళ్ళి గురువుగారి వద్ద నెలలకొద్దీ ఉండి వస్తుంటే ఎందుకీయన ఇలా డబ్బు, సమయం వృథా చేసుకొంటారనిపించేది.

కానీ కాలక్రమేణా వెంకటగిరిలో సత్సంగాలకు వెళ్ళడం, ఇంట్లో బాబా గురించి జరిగే చర్చలు వింటూ ఉండడంతో మెల్లగా నాకు బాబా పట్ల, సద్గురువు పట్ల ఒక అభిప్రాయం కలుగసాగింది. మా నాన్నగారు చెప్పేదానిని బట్టి గురువుగారు అటువంటి సద్గురువులై ఉంటారన్న నమ్మకం కలుగసాగింది.

తొమ్మిదవ తరగతి సెలవులలో అమ్మ, అన్నయ్యలతో కలిసి శిరిడీ వెళ్ళినప్పుడు ఆయనను మొదటిసారిగా శ్రీశరత్‌బాబుగారిగా కాక గురువుగారిగా దర్శించినప్పుడు నా నమ్మకం ఇంకా బలపడింది. కాలం గడిచే కొద్దీ వివిధ సంఘటనలు, అనుభవాల వలన ఆ నమ్మకం నేడు స్థిరపడిపోయింది. ఒకరకంగా చెప్పాలంటే నా జీవితంలో నూతనాధ్యాయం అప్పటి నుండే మొదలయిందనిపిస్తుంది. ఈ రోజు ఆయనపై నాకు గల నమ్మకానికి దోహదం చేసిన లీలలు, అనుభవాలు కోకొల్లలు.

నన్ను ఆయన వైపు ఆకర్షించే మొట్టమొదటి శక్తి ఆయన సమక్షంలో లభించే ప్రశాంతత. ఎన్నో చింతలతో, చీకాకులతో ఆయన సన్నిధికి వెళ్ళిన మరుక్షణమే మనసు దానంతటదే తేలికవడం స్పష్టంగా గమనించవచ్చు. మనలో ఆయన పట్ల ప్రేమానురాగాలను పెంచే మరో దివ్యాస్త్రం అమోఘమైన ఆయన రక్షణ. నిరంతరం మనతోనే ఉన్నట్లుగా, తలచీ తలవకముందే మన కష్టాలను తొలగించే ఆయన రక్షణ హస్తం మనకు అనుభవైకవేద్యం. ఒకరోజు రాత్రి శిరిడీలో నేనూ, మాధవ్ సాయియానా ఎదురుగా ఉన్న గుంటలో విస్తరాకులు వేసి తగులబెడుతున్నాము. అడుగున ఉన్న ఆకులను కర్రతో పైకి లేపుదామని నేను ప్రయత్నిస్తుండగా, కర్ర కూరుకుపోయి ఛాతీ వరకు మండుతున్న గుంటలో బోర్లా పడిపోయాను. సరిగ్గా నేను పడబోయే ముందే అంతవరకూ మండుతున్న ఆకులు ఆరిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

ఒకసారి శిరిడీలో ఉండగా మా ఊరికి వెళ్ళిపోవాలని తీవ్రంగా అనిపించింది. సాయియానాలో బాబా పటం ముందు ఈ విషయం చెప్పుకుని, సాయిపథంలో గురువుగారి దర్శనానికి వెళ్ళగానే, నన్ను చూసిన వెంటనే గురువుగారు ఆయనంతట ఆయనే *"ఏరా! ఊరికి వెళ్ళాలని ఉందా?"* అని అడిగారు.

బాబాకు, గురువుగారికి తేడా లేదనే విషయం మొదటిసారిగా గాఢంగా మనసుకు హత్తుకుపోయింది.

నాకెప్పుడు మనసు చికాగ్గా ఉన్నా, ఏదైనా సమస్య వచ్చినా, గురువుగారికి ఉత్తరం వ్రాసుకొన్నా లేక వారి ఫోటో ముందు చెప్పుకున్నా ఆ చీకాకు లేక సమస్య తొలగిపోయేది.

నా వరకు నాకు తీవ్రంగా తపించిపోయిన కోర్కెల నుండి అతి సాధారణ విషయాల వరకు ఆయన అడిగిందే తడవుగా లేదనక తీరుస్తున్నారు. నా విషయంలో నాకు పదవ తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడవడం, హోమియోపతి మెడిసిన్‌లో సీటు రావడం దగ్గర నుండి, రద్దీగా ఉన్న బస్సులో కిటికీ ప్రక్కన సీటు దొరకడం, క్లాస్‌లో ఫ్రెండ్‌తో పెట్టుకున్న గొడవ సమసిపోవడం వరకు ఆయన నాకు ఇవ్వనిదిలేదు.

ఆ అనంత శక్తిస్వరూపుని గొప్పదనానికి ఇలా తార్కాణాలివ్వడం సూర్యునికి దివిటీ పెట్టి చూపడమే అవుతుంది. భక్తజనావళిని ఉద్ధరించడానికి ప్రేమ అనే దివ్యపాశుపతాస్త్రాన్ని ధరించి ఇలకు దిగి వచ్చిన పావనమూర్తి ఆయన. ఆయనను

వర్ణించడం నా తరం కాదని నాకు తెలుసు. కానీ తమ బిడ్డల వచ్చీ రాని ముద్దు మాటలు చెప్పించుకొని విని మరీ ఆనందించే తండ్రిలాంటి గురుదేవులను నా ఈ ప్రయత్నంలోని లోపాలను క్షమించమని ప్రార్థిస్తున్నాను.

***భక్తుడు:*** *ఒక పని చేయాలా వద్దా అనేది తేల్చుకోలేకపోతే చీటీలు వేసి నిర్ణయించుకుంటారు కదా! దాన్ని ఎంత వరకు సమర్థించవచ్చు?*

***గురువుగారు:*** *దానిలో తప్పేమీ లేదు కానీ, దాన్ని ఎక్కువగా ఎంకరేజ్ చెయ్యటం మాత్రం సరి అయినది కాదు. మనం ఒక డెసిషన్ తీసుకోలేని సంఘటన వచ్చి, మనకై మనం నిర్ణయాన్ని చేయలేనటువంటి వీక్‌నెస్ మనలో ఉన్నప్పుడు ఈ చీటీలు మనకు ఉపయోగపడతాయి. ఆ చీటీలో వచ్చినదాన్ని ఇక వేరే ఆలోచన లేకుండా పర్‌ఫెక్ట్‌గా చేసుకుంటే మంచిది. కానీ దానికంటే కూడాను, మనం సరైన నిర్ణయానికి రానప్పుడు, 'ఆ నిర్ణయం తీసుకునేటట్లు చెయ్యి బాబా' అని ప్రార్థన చేయడం ఇంకా మంచిది. నా బుద్ధిని సరైన మార్గంలో నడిపించండి. 'ఏది సరైనదో, ఆ నిర్ణయం నేను తీసుకోవాలి, ఆ శక్తిని నాకివ్వండి' అని ప్రార్థించండి. లేకపోతే ఏమవుతుంది అంటే, ఒక్కోసారి బలంగా దేనిమీదైనా ఒకదాని మీద మనకు కోరిక ఉందననుకో, అది వచ్చేదాకా చీటీలు వేస్తూ ఉంటాం. మన డెసిషన్ వచ్చేదాకా చీటీలు వేస్తూనే ఉంటాం. అది వచ్చిన తరువాత ఇది బాబా చెప్పింది అనుకుంటాం, ఊరుకుంటాం. అది ఆత్మవంచనకు దారి తీస్తుంది.*

# కళ్ళజోడు వద్దు

అద్దంకి సిద్ధార్థ
స్టూడెంట్, చెన్నై
జన్మించిన సం॥ 1997

చెన్నై, ఆగష్టు 2004

నా పేరు సిద్ధార్థ. నాకు పేరు పెట్టింది గురువుగారే. నాకు ఏది కావాలన్నా గురువుగారికి చెప్పుకుంటే చాలు వెంటనే డాడీకి చెప్పి ఇప్పిస్తారు. ఈ సమ్మర్ హాలిడేస్ తరువాత స్కూలుకు వెళ్ళాను. నాకు బోర్డు మీద వ్రాసింది ఏమీ కనిపించలేదు. నేను ఇంటికి వచ్చి మమ్మీకి చెప్తే ఏం లేదులే అని చెప్పి మళ్ళీ స్కూలుకు పంపించింది. టీచర్ బోర్డు మీద వ్రాసినవి ఏవీ నాకు కనిపించట్లేదు. బుక్‌లో వ్రాసుకోకపోతే టీచర్ అరుస్తుంది. ఇంటికి వెళ్తే మమ్మీ 'ఏం లేదు' అంటుంది. నాకు భయం వేసి నా బ్యాగ్‌లో ఉన్న గురువుగారి ఫోటో చేత్తో పట్టుకొని ఏడుస్తుంటే, టీచర్ వచ్చి మమ్మీకి ఫోన్ చేసి నన్ను ఇంటికి పంపించారు. సాయంత్రం కంటి హాస్పిటల్‌కు వెళ్ళాము. నాకు కళ్ళు టెస్ట్ చేసినప్పుడు బోర్డు మీద ఉన్న మొదటి నాలుగు లైన్లు నేను చదవలేకపోయాను. డాక్టరు చూసి ఇన్‌ఫెక్షన్ బాగా ఉంది, పదిరోజులు మందులు వాడిన తరువాత టెస్ట్ చేసి కళ్ళజోడు ఇస్తామన్నారు. మమ్మీ పదిరోజులు స్కూలుకు పంపకుండా ఎట్లా అని అడిగితే 'ఎట్లా పంపిస్తారు? సరిగ్గా కనిపించకపోతే చదవడం, వ్రాయడం చెయ్యలేడు కదా' అని డాక్టరు అన్నారు. అప్పుడు డాడీ గురువుగారికి ఈ విషయం చెబితే గురువుగారు "మెడిసిన్ వద్దు. పది రోజులు ఆయిల్ మసాజ్ చేసి తలంటి పోయండి" అన్నారట.

నేను నరేంద్ర అంకుల్‌తో నాకు కళ్ళజోడు లేకుండానే కళ్ళు బాగా కనిపించేటట్లు చెయ్యమని గురువుగారికి చెప్పమని ఏడ్చాను. గురువుగారు చెప్పినట్లుగానే రోజూ నూనె అంటుకొని తలస్నానం చేస్తూ స్కూల్‌కు కూడా వెళ్ళేవాడిని. రోజురోజుకు బాగా కనిపించడం మొదలై గురువుగారు చెప్పినట్లు పదిరోజుల్లో నాకు పూర్తిగా బాగయింది. ఆ విధంగా నాకు కళ్ళజోడు అవసరం లేకుండా బాగా కనిపించేటట్లు చేశారు గురువుగారు.

మా ఫ్రెండ్స్ అందరూ ఫ్లయిట్ ఎక్కారు. వాళ్ళు ఎప్పుడూ దాని గురించి చెప్తూ, ఫ్లయిట్ ఎక్కలేదని నన్ను వెక్కిరించేవారు. సమ్మర్ హాలిడేస్ అయ్యేలోపు

నన్ను ఫ్లయిట్ ఎక్కించమని, స్కూలుకు వెళ్ళగానే ఫ్రెండ్స్‌కు చెప్పాలని గురువుగారిని ప్రార్థించుకున్నాను. సెలవుల్లో హైదరాబాదు నుండి చెన్నై తిరిగి వచ్చేటప్పుడు డాడీ నన్ను ఫ్లయిట్‌లో తీసుకెళ్ళారు. నాకు చాలా చాలా సంతోషమేసింది.

నాకు ఎప్పుడైనా భయం వేస్తే బాబా, గురువుగారు నాతోనే ఉన్నారనుకొంటే వెంటనే భయం పోతుంది. అందుకే నాకు గురువుగారంటే చాలా ఇష్టం.

*శ్రీసాయిబాబా ఇలా అన్నారు: "నేను శరీరాన్ని వదలినా, నా మాటలు ప్రమాణంగా తీసుకోండి. నా ఎముకలు, నా సమాధి నుంచి మీకు ధైర్యాన్నిస్తాయి. నేనే కాదు, నా సమాధి కూడా మీతో మాట్లాడుతుంది. దానికి అనన్యంగా శరణు చెందే వారితో అది ఉంటుంది. నేను మీ కంటికి కనిపించనని మీరు చింతపడవద్దు. నా ఎముకలు మాట్లాడటాన్ని, మీకు కబుర్లు చెప్పటాన్ని మీరు వింటారు"*

*... శ్రీసాయిసచ్చరిత్ర, 25వ అధ్యాయం*



అనుక్షణం శిక్షణం

# బాబాపై కోపం

సంకా మోహన్‌రావు గుప్తా
కాంట్రాక్టర్, ఒంగోలు
జన్మించిన సం॥ 1950

శిరిడీ, జనవరి 2001

1990లో నేను పని చేసిన ఒక గవర్నమెంటు సివిల్ కాంట్రాక్టుకు గాను నాకు 35,000 రూపాయలు టాక్స్ రిఫండ్ రావాల్సి ఉంది. కానీ, మా ఆడిటర్ టాక్స్ రిటర్న్స్‌లో చేసిన పొరపాటు వలన, ఆ రిఫండ్ రాకపోగా ఇంకా నేనే డబ్బు కట్టాల్సి వచ్చింది. అంతేకాదు, డబ్బు కట్టినా జైలుకు వెళ్ళే పరిస్థితి ఏర్పడింది.

ఇటువంటి పరిస్థితుల్లో నా కేసును ఏ ఆడిటర్‌కు చూపినా దీనిలో బలం లేదు, మేము తీసుకోమని నిరాకరించారు. చివరకు ఒక రిటైర్డు ఇన్‌కంటాక్స్ ఆఫీసరు "అప్పీలు చేసి ప్రయత్నం చేద్దాం, కానీ గెలిచే అవకాశాలు చాలా తక్కువ" అన్నారు.

అట్లా సమస్యలో చిక్కుకుపోవడంతో, ఓరిమి కోల్పోయి నేనొక రోజు బాబా పటం ముందు నిలబడి కోపంగా "నువ్వు నన్నీ సమస్యలో పడేసి మనశ్శాంతి లేకుండా చేశావు. నువ్వు కలిగించిన ఈ కష్టాన్ని నువ్వే తొలగించేవరకు నీకు నమస్కారం చేయను. నీ ఊదీ తాకను" అనుకున్నాను. అన్నట్లుగానే ఆ రోజు నుండి బాబాకు నమస్కరించడం, ఊదీ పెట్టుకోవడం మానేశాను.

ఇక నాకు గురువుగారే దారి చూపించాలి అనుకొని శిరిడీ వెళ్ళి విషయమంతా గురువుగారికి చెప్పుకున్నాను. గురువుగారు అది వినగానే నన్నిలా అడిగారు: *"బాబాతో పోట్లాడినట్లు కోపంగా మాట్లాడటం తప్పు కదా?"*

"మన ఇంట్లో పెద్దవాళ్ళ మీద కోపం వచ్చినప్పుడు వాళ్ళతో పోట్లాడడం తప్పేమీ కాదు కదా! అలాగే మన పెద్ద దిక్కైన బాబా మీద కోప్పడడంలో తప్పేముంది?" అన్నాను నేను. గురువుగారు నేను చేసింది తప్పు అన్నట్లు తలాడించారు.

నేను బాబా పట్ల అంత తిరస్కారపూర్వకంగా మాట్లాడినా, దయతో క్షమించి వారు నన్ను ఆ కేసులో నుండి బయటపడేసారు. ఆ కేసు కోర్టులో రెండు సంవత్సరాలు నడిచినా చివరకు నేనే గెలిచాను.

అందరూ ఆశ వదిలేసిన అంత జటిలమైన కేసు గెలవడం అంటే కేవలం బాబా, గురువుగారి ఔదార్యమే.

***భక్తుడు:*** *బాబాకు సాధ్యం కానిదేదీ లేదు కదా? కానీ నా సమస్య విషయంలో ఎందుకు ఆయన లేట్ చేస్తున్నారు? ఏమైనా కారణముంటుందా?*

***గురువుగారు:*** *బాబా నీ సమస్యలు తీర్చకపోవడానికి కారణం ఉందనుకున్నా, నువ్వెప్పటికీ అదేంటో తెలుసుకోలేవు. ఎందుకంటే నువ్వు- బాబావు కాదు కాబట్టి. కాని, కనీసం నీ సమస్య తీర్చనందుకు ఆయనకొక కారణముందనే విషయం తెలిస్తే చాలు.*

*నీకు ఎన్నో అనుభవాలున్నాయి, ఎన్నోసార్లు నిన్ను గట్టెక్కించారు. నువ్వు అనుకొన్నట్లుగా మార్చారు. మరి ఈసారి ఎందుకు మార్చలేదు? చేతకాక కాదు, ఎందుకో చేయలేదు. ఎందుకు చెయ్యలేదో మనకు తెలియదు. దానికి ఆయనకు వెయ్యి కారణాలు ఉంటాయి. అవి చెబితే నీకు అర్థమవుతుందా? అన్నిసార్లు సహాయం చేసినాయన ఈ ఒక్కసారి చేయకపోతే, నా మీద బాబాకు ప్రేమ లేదు, ఆయనెప్పుడూ నాకు సహాయం చేయలేదు, ఆయనసలు చేయలేరు అనుకోవడం కరెక్ట్ కాదు.*

గురువుగారు శిరిడీకి నివాసం మార్చిన తొలి రోజులలో, అంటే సుమారు 1991లో నేను, నా భార్య 'సాయిపథం'లో కొద్దిరోజులున్నాము.

ఒకరోజు గురువుగారు నాతో "నువ్వు సివిల్ కాంట్రాక్టరువి కదా, వాటర్ పైపులు బిగించడం, నీళ్ళ కనెక్షన్ తీసుకోవడం వంటివి నీకు బాగా తెలిసుంటాయి. కాబట్టి ఇక్కడ సాయిపథంలో వాటర్ కనెక్షన్ పని చూడు" అన్నారు.

నేను వెంటనే కోపర్‌గాం వెళ్ళి పైపులు, వాటికి కావాల్సిన సామాన్లన్నీ కొనుక్కొచ్చి గురువుగారు అప్పగించిన పని పూర్తి చేశాను. అయితే ఆ పైపు కనెక్షన్‌లో లీకేజి ఉండి గాలి పోతుండడంతో నీరు ధారగా రావడం లేదు. ఆ రోజే నేను ఊరికి వెళ్ళాల్సి ఉన్నందున ఆ లీకేజి సరిచేసే పని మరొక గురుబంధువు, ఇంజనీరు అయిన భానుమూర్తిగారికి అప్పగించి, గురువుగారితో చెప్పి నేను గుంటూరుకు బయల్దేరాను. నా భార్య శిరిడీలోనే ఉంది. నేను రెండు గంటలు బస్‌లో ప్రయాణం చేసి మన్మాడు చేరుకున్నాను. లగేజి ఎక్కువగా ఉండడంతో మెల్లగా మెట్ల పైకి మోసుకొంటూ వెళుతున్నాను. అంతలో చూస్తుండగా నేను ఎక్కాల్సిన అజంతా ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్ పైకి రావడం, వచ్చినంత వేగంగా వెళ్ళిపోవడం జరిగింది.

నేను షుగరు పేషంటును. శ్రమపడి లగేజీ అంతా మోసుకొని బ్రిడ్జి ఎక్కడం, రైలు తప్పిపోవడంతో నాకు ఒక్కసారిగా నీరసం ఆవరించేసింది. రైలు టిక్కెట్లు, మన్మాడు దాకా బస్సులో రావడం, ఈ లగేజీ మోయడం అంతా వృథా అయింది. మరలా మరునాటి వరకు నాకు రైలు లేదు. ఉన్నా, అసలు రిజర్వేషన్ దొరుకుతుందో, లేదో? అయినా రేపటి దాకా ఇంత లగేజితో ఒంటరిగా ఎక్కడ ఉండాలి? ఇవన్నీ ఆలోచించుకొనేసరికి నిస్సత్తువ నుండి నిస్సహాయత, బాధ, కోపం అన్నీ కలిగాయి. అక్కడే ఉండి చేసేదేంలేదని ఆ రాత్రికి తిరిగి శిరిడీ వచ్చేశాను. నీరసంగా సాయిపథం చేరేసరికి రాత్రి పదిగంటలయింది.

ఇంటికి చేరడమే ఆలస్యం నా భార్యతో "ఇంక మనకు బాబా లేడు, శిరిడీ రానక్కరలేదు, బాబాకు దణ్ణం పెట్టనక్కరలేదు. అనవసరంగా నా చేత మన్మాడు దాకా ప్రయాణం చేయించి రైలు అందకుండా చేసి, మళ్ళీ శిరిడీ రప్పించుకున్నాడు. నువ్వూ నీ పెట్టె సర్దుకో, రేపు మనిద్దరం వెళ్ళిపోదాం" అని పెద్ద గొంతుతో కోపంగా అరిచాను. నేనలా కోప్పడడం గురువుగారి దాకా వెళ్ళింది.

స్నానం, భోజనం అయిన పిమ్మట గురువుగారి దగ్గరకు వెళ్ళి కూర్చున్నప్పుడు వారు బాబా పుస్తకం చేతికిచ్చి దానిలోని ఒక ఆర్టికల్ చదవమన్నారు నన్ను. అది రఘువీర పురందరే బాబా పల్లకీ కోసం మసీదులో గది కట్టాలనుకొన్న వృత్తాంతం. బాబా ఎంత వద్దని చెపుతున్నా పురందరే పట్టుబట్టి పల్లకీ గది నిర్మిస్తాడు. అంతా అయి ఒక తలుపు మాత్రం బిగించవలసి ఉంటే, ఆ పనిని తాత్యాకు పురమాయించి వెళ్ళబోతే, పురందరేను చేయదలుచుకొన్న పనిని పూర్తిచేసి ఊరికి వెళ్ళమంటారు బాబా.

ఆ లీల చదివిన తరువాత నాకు రైలు అందకుండా చేసి బాబా ఎందుకు తిరిగి శిరిడీకి రప్పించారన్నది అర్థమయింది. గురువుగారు నాకప్పగించిన పైపు లైన్ కనెక్షన్ పని పూర్తి చేయకుండానే, ఆ పని నేను మరొక గురుబంధువుకు అప్పగించి ఊరు వదిలిపెట్టాను. అట్లా అనుకోగానే నాలో అప్పటిదాకా ఉన్న అశాంతి, కోపం, చిరాకు మటుమాయమయ్యాయి.

నా ఆలోచనలు చదివినట్లుగా గురువుగారు "*నువ్వు ఎందుకు శిరిడీకి తిరిగి రావలసి వచ్చిందో తెలిసింది కదా! నీకు గుర్తుందా? అంతకు ముందు ఇన్‌కమ్‌టాక్స్ సమస్య వచ్చినప్పుడు బాబాకు నమస్కారం చేయనని అలిగావు. నీ లెక్క ప్రకారం అప్పుడు నువ్వు చేసింది సరైందని సమర్థించుకొన్నావు. మరి ఇప్పటి సంగతేమిటి?*

నువ్వు చేసింది తప్పు కాదా? బాబా నీకు పాఠం నేర్పేందుకే నిన్నిలా రప్పించారు!" అన్నారు. అప్పటికే బాబాపై అలక వహించినందుకు సిగ్గుపడుతున్న నేను చిన్నగా "నా తప్పు తెలిసింది. ఇంకెప్పుడూ బాబాపై అలగను, అలా మాట్లాడను" అన్నాను.

ఈ గుణపాఠాన్ని నేనెన్నటికీ మర్చిపోలేను. బాబా ఏం చేసినా మన మంచికే చేస్తారు. ఆయనపై కోపం తెచ్చుకోవడం తప్పని, ఎటువంటి పరిస్థితుల్లోనయినా ఒప్పుకొన్న పనిని బాధ్యతాయుతంగా చేయాలని, అసంపూర్ణంగా వదిలి వెళ్ళకూడదని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

మరునాడు ఉదయమే పైపుల లీకేజీలు జాగ్రత్తగా చూసి సరిచేశాను. ఆ పని పూర్తయ్యాక గురువుగారి ఆశీర్వాదం తీసుకుని ఊరికి బయలుదేరాను. ఎక్కడా ఏ ఇబ్బంది లేకుండా ప్రయాణం సుఖంగా జరిగింది.

***గురువుగారు:*** *ఉచ్ఛిష్టం అంటే మామూలుగా మనకు స్ఫురించేది మహాత్ములు తినగా మిగిలిన పదార్థం అని. నిజానికి ఏ ప్రసాదమైనా ఉచ్ఛిష్టమే. ఎందుకంటే అది మొదట బాబాకు సమర్పిస్తాము కాబట్టి. అయితే ఉచ్ఛిష్టానికి అసలు అర్థం వాచా వారు బోధించేది. ఆయన ఉచ్ఛరించిన ప్రతి పదము ఉచ్ఛిష్టమే. గురు ముఖతా బయటకు వచ్చిన పదాలను ఆస్వాదించు! ప్రసాదంలా భావించి ఆచరణలో పెట్టు! అప్పుడది గురు ఉచ్ఛిష్టం తీసుకున్నట్లే.*

# అపరిగ్రహంతోనే అనుగ్రహం

బెజ్జారం చంద్రకుమార్
డిస్ట్రిక్ట్ జడ్జి, అనంతపూర్
జన్మించిన సం॥ 1953

అనంతపూర్, జనవరి 2003

1993లో నేను డిస్ట్రిక్ట్ జడ్జిగా నియమించబడ్డాను. అది కేవలం బాబా, గురువుగారి కృప వల్లనే జరిగింది. ఆ కృతజ్ఞతాభావంతో గురువుగారికి కానుకగా ఇద్దామని బంగారు ఉంగరం తీసుకుని శిరిడీ వెళ్ళాను.

"గురువుగారు ఎవ్వరి దగ్గర నుండి ఎటువంటి దక్షిణలు, కానుకలు స్వీకరించరు" అనే విషయం నాకు తెలుసు. గురువుగారి సందర్శనార్థం వచ్చే భక్తులు సమర్పించే స్వీట్లు, పండ్లు ఏవైనా వారికే ప్రసాదంగా పంచిపెట్టేస్తారు. అయినా ఏ మూలో చిన్న ఆశ, వారు నా కానుక తీసుకోవాలని.

వారితో ఏకాంత దర్శనం దొరికినప్పుడు, ఉంగరం వారి పాదాల వద్ద ఉంచి స్వీకరించమని ప్రార్థించాను. గురుదేవులు *"దీన్ని వెనక్కి తీసుకోండి!"* అన్నారు.

"మీ కోసమనే ప్రత్యేకంగా కొన్నానిది. దయచేసి అంగీకరించండి"

*"నేను ఎవ్వరి దగ్గర నుండి ఏమీ తీసుకోనన్న సంగతి మీకు తెలుసు కదా?!"* అన్నారు గురువుగారు.

"నిజమే. కానీ నా కృతజ్ఞతను నేనేవిధంగా తెలిపేది? దయచేసి ఈ ఒక్కసారికి స్వీకరించండి గురువుగారూ!" నేను పట్టువదలకుండా బ్రతిమాలుతూనే అన్నాను.

*"ఊహు. మీరు ఏ కృతజ్ఞత చూపాలనుకొన్నా బాబాకే చూపండి. మీకంతగా దీనిని ఇవ్వాలనుంటే, తీసుకెళ్ళి సమాధి మందిరంలోని బాబా హుండీలో వేయండి. ఒక్క బాబాకు మాత్రమే దక్షిణ తీసుకునే దక్షత, సామర్థ్యం ఉన్నాయి!"* అన్నారు వారు ఖచ్చితంగా. వారంత నిశ్చయంగా అన్నాక ఇక చేసేదేముంది? అందుకని అటు నుండి అటే నేరుగా సమాధి మందిరానికి వెళ్ళి ఉంగరాన్ని బాబా హుండీలో వేశాను.

***భక్తుడు:*** *గురువుగారూ! బాబా అడిగి మరీ దక్షిణ స్వీకరించేవారు కదా. మరి ఫకీరు దక్షిణ స్వీకరించవచ్చా?*

***గురువుగారు:*** *ఆయన కేవలం ఫకీరు ధర్మంగానే దక్షిణ తీసుకోలేదు. "నేను నీ నుండి ఒక రూపాయి తీసుకొంటే నీకు పదిరూపాయలు ఇవ్వాలి" అని అన్నారు. దాన్ని బట్టే దక్షిణ స్వీకరించేవారు. బాబాకి ఆ అర్హత ఉంది. ఆయన జీవితంలో అలా స్వీకరించిన దానికి ఎన్నో రెట్లు తిరిగి ఇచ్చిన సందర్భాలు కోకొల్లలు.*

***భక్తుడు:*** *గురువుగారూ! మేము మీకు ప్రేమతో ఏదైనా ఇచ్చినప్పుడు, మీరు అది స్వీకరిస్తే తప్పేమిటి?*

***గురువుగారు:*** *ఏదైనా నాకు ప్రేమతో ఇస్తే నేను ఆ వెనుకనున్న ప్రేమను స్వీకరిస్తాను. ఆ ప్రేమ భావనను ఆస్వాదిస్తాను. దానిని అంగీకరిస్తాను. కాని భౌతికంగా ఆ వస్తువును స్వీకరించలేను. అది మంచి పద్ధతి కాదు. దాని వల్ల ఆరోగ్యకరమైన వాతావరణం కలుషితం అవుతుంది. ఉదాహరణకు మీరు నాకు కొంచెం కాఫీ తెచ్చారు. నేను అది వాడితే, పరోక్షంగానైనా మిమ్మలను ఇంకా తెమ్మని ప్రోత్సహించినట్లుంటుంది, దాని సహజ పర్యవసానం మీకు ఆదేశం ఇవ్వడం, కాఫీ తీసుకుని రాకపోతే నీవు మంచి భక్తుడివి కావు.. (నవ్వులు) అలా ఇంకా ఇంకా పెంచుకొని పోతాము. దానికి అంతం ఏది? అందుకని అది నా పద్ధతి కాదు కాబట్టి ఏదీ, బిస్కెట్లు అయినా, ఫలం అయినా, ఏదైనా సరే నేను తీసుకోను.*

*స్వామి ప్రకాశానంద 'వార్తాలాపము'లో "అపరిగ్రహం నియమంగా పాటించు" అనేవారు. ఆయన ఎవరి వద్ద నుండి ఏమీ తీసుకునేవారు కాదు. ఒక భక్తుడు వచ్చి "మేము మీలాంటి మహాత్ముల దర్శనం చేసుకొన్నప్పుడు దక్షిణగా ఏదో ఒకటి అర్పించడం ధర్మం కదా? మేము మీకు ప్రేమతో దక్షిణ సమర్పించుతున్నాము. మీరు ఎందుకు తీసుకోరు?" అని అడిగారు.*

*దానికి శ్రీప్రకాశానందస్వామి "అవును, హిందూ ధర్మం ప్రకారం మహాత్ములకు దక్షిణ ఇవ్వడం ధర్మమే. అలానే దానిని నిరాకరించడం మహాత్ములకూ ధర్మమే" అన్నారు.*

ఒక డిస్ట్రిక్ట్ జడ్జిగా నాకొచ్చే జీతం నా ఖర్చులకు బొటాబొటిగా సరిపోయేది. చాలీచాలని బడ్జెట్‌తోనే జీవనం సాగించాల్సి వచ్చేది. పిల్లల ఫీజులు వగైరాలు కూడా

తలకు మించినవిగానే ఉండేవి. కాబట్టి నేను అంతకు ముందు చేసిన అప్పులు, వాటి వడ్డీలు నెల జీతంతో తీర్చడానికి కష్టమయ్యేది. మా సొంత ఊరిలో ఉన్న ఒక ఇల్లు తప్ప స్థిరాస్తులు అంటూ ఏమీ లేవు. నాకు లంచాలు తీసుకునే అలవాటు లేదు. ఒకసారి శిరిడీ వెళ్ళినప్పుడు గురువుగారితో నా ఆర్థిక ఇబ్బందులు, అప్పులు అన్నీ చెప్పుకున్నాను. నాకున్న ఒక్కగానొక్క ఆస్తి అయిన ఇంటి గురించి కూడా చెప్పాను.

*"ఇంటిని అమ్మేసి అప్పులన్నీ తీర్చేయండి. ఆదర్శాన్ని వదులుకోవడం కన్నా ఆస్తిని వదులుకోవడమే మంచిది"* అన్నారు వారు.

నేను అలాగేనని ఊరికి వచ్చి ఇంటిని అమ్మకానికి పెట్టాను. అయితే ఆ ఇంటిని న్యాయమైన ధర ఇచ్చి కొనుక్కునే వారు కనిపించలేదు.

కొద్దిరోజుల తరువాత శిరిడీ వెళ్ళి, నా ఆర్థిక ఇబ్బందులన్నీ మళ్ళీ గురువుగారి ముందు ఏకరువు పెట్టాను. అప్పుడే ఒకరు నాకు పెద్ద మొత్తంలో డబ్బు ముట్ట చెప్పబోయారని, నేను నిరాకరించానని కూడా చెప్పాను. అది విని గురువుగారు మొదట కాసేపు గంభీరంగా, మౌనంగా ఉండిపోయారు.

*"మన మార్గం ఇది కాదని మీకు తెలుసు కదా! బాబానో, అన్యాయార్జితమో (లంచమో) ఏదో ఒక్కటే. రెండూ అంటే కుదరదు"* అన్నారు.

తర్వాత పదిహేను నిమిషాలపాటు గురువుగారు అపరిగ్రహం (ఇతరుల నుండి ఏమి స్వీకరించరాదు అన్న నియమం), పరిగ్రహం (ఇతరుల నుంచి సొమ్ము ఆశించడం, తీసుకోవడం) అంటే ఏమిటో, అపరిగ్రహం అనే ధర్మాన్ని వదులుకోవడం ద్వారా బాబా అనుగ్రహానికి ఎలా దూరమవుతామో విడమరచి చెప్పారు.

గురువుగారి మాటలు వింటూనే, నేనెన్నడూ లంచాలు తీసుకోనందుకు నన్ను నేను అభినందించుకున్నాను. అప్పుడే నాకున్న మరో సందేహాన్ని కూడా గురువుగారి ముందుంచాను. "చిన్న చిన్న కానుకల సంగతేమిటి? అవి లంచం అనే ఉద్దేశ్యంతో ఇచ్చేటటువంటివి కాదు కదా!" అన్నాను. ఎందుకంటే నాకు పండ్లు, స్వీట్స్, డైరీ వంటివి కొన్ని పండుగల్లోను, జనవరి ఫస్ట్‌లాంటి ప్రత్యేక సందర్భాల్లోను వచ్చేవి.

దానికి గురువుగారిలా చెప్పారు. *"ఊహూ౦! ఉదాహరణకు మీ క్రింద పనిచేసే ఇద్దరు వ్యక్తులున్నారు. ఒకతను మీకు పుట్టినరోజు బహుమతిగా ఓ కానుకను తెచ్చిచ్చాడు. రెండో వ్యక్తి ఏమీ ఇవ్వలేదనుకుందాం. నిజానికి మీరు ఇద్దరి దగ్గర నుండీ ఆశించలేదు, అయినా మొదటివాడు చిన్నదో, పెద్దదో ఓ కానుక అంటూ*

ఇచ్చాడు. దాంతో మీకు తెలియకుండానే మొదటి వ్యక్తి పట్ల మొగ్గు చూపించడం మొదలుపెడతారు. ఇది మానవ సహజం. అయినా ఎవరి నుండీ ఏమీ స్వీకరించక పోవడం మంచిది. ఎందుకంటే ఇచ్చిన వాడి సంస్కారాల ప్రభావం తీసుకొన్న వానిపై తప్పక ఉంటుంది. రేపు ఆ వ్యక్తి, ఉద్యోగ విధుల్లో ఏదైనా పొరపాటు చేసినా మీరు అతడిని గట్టిగా మందలించేందుకో, అతనిపై చర్య తీసుకొనేందుకో తటపటాయిస్తారు. అతన్నుంచి మీరు ఒక కానుక స్వీకరించి ఉన్నారు కాబట్టి మీకక్కడ మొహమాటముంటుంది. అతనిపట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించే స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకొన్నవారవుతారు".

"సాటి గురుబంధువుల నుండి కూడానా?" నేను ఈ విషయంలో పూర్తిగా సమాధానపడదలచి మళ్ళీ అడిగాను. "గురుబంధువుల నుండి భోజనం వరకైతే ఫరవాలేదు. అదీ పండుగలు, వేడుకల వంటి ప్రత్యేక సందర్భాల్లోనే. వాళ్ళు అందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తుంటే అందరితో పాటు అక్కడ భోంచేయవచ్చు. ఎప్పుడూ ఒకటి గుర్తుపెట్టుకోండి. మీరు బాబాకు చెందిన వారు. సాయిపథం (బాబాను చేరే బాట)లో పయనించే మీరు ఒక ఆదర్శవంతమైన జడ్జి అంటే ఎలా ఉంటారో సమాజానికి ఉదాహరణగా చూపండి" అన్నారు గురువుగారు.

గురువుగారి ఆ అమూల్యమైన మాటలు నేనెన్నటికీ మర్చిపోలేను. అవి నాపై ఎంతటి ప్రభావాన్ని చూపాయంటే ఎక్కడో ఏ మూలో రెపరెపలాడుతున్న ప్రలోభాలన్నీ సమసిపోయాయి. ఆ రోజు నుండి ఏ చిన్న ఆకర్షణకు నా మనసులో తావివ్వలేదు. చిన్న చిన్న కానుకలే కదా స్వీకరించండి అని నా దగ్గరకు వచ్చేవారిని సున్నితంగానే, వారు నొచ్చుకోకుండా అది నా పద్ధతి కాదు అని నచ్చచెప్పి పంపేయడం అలవడింది. నా గురుదేవుల దగ్గర్నుండి నేర్చుకున్న అపరిగ్రహం అన్న ధర్మాన్ని పాటించడం వలన నేను బాబా, గురువుగారి ఆశీస్సులు మరింతగా పొందగలిగాను.

ఈ సందర్భంలోనే మరో విషయాన్ని ఇక్కడ తప్పక చెప్పుకోవాలి. ఎంత ఉదాత్తమైన పనికైనా సరే, దాని పేరు చెప్పి జనం నుండి చందాలు, విరాళాలు ప్రోగు చేయడాన్ని గురువుగారు పూర్తిగా వ్యతిరేకిస్తారు. అందుకే సాయిపథం సత్సంగ హాల్లోను, ఆఫీసు అనబడే ఆ చిన్నగది ముందు "ఇచ్చట విరాళాలు స్వీకరించబడవు" అన్న బోర్డులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. 'విరాళము' అన్న పదాన్ని 'గరళము'లాగా భావిస్తారు గురువుగారు.

ఉన్నతమైన ఆశయాలను బోధించడమే కాదు, వాటిని తు.చ. తప్పక ఆచరిస్తూ తనని ఆశ్రయించిన వారందరికీ తమ జీవితమే ఆదర్శంగా చూపే మహోన్నత మూర్తిని సద్గురువుగా కొలుచుకోగలగడం, వారి సన్నిధిలో ఉండగలగడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను.

***భక్తుడు:*** *నాకు సాయిబాబా మందిరం కట్టించాలని ఉంది. అయితే నా దగ్గర మందిరం కట్టించేంత ధనం లేనందువలన, అందులో అందరి శ్రేయస్సు కూడా ఉన్నందున సాటి సాయిభక్తుల నుంచి చందాలు వసూలు చేయడం సరి అయినదేనా?*

***గురువుగారు:*** *ఎందుకు ఎవరినైనా అడగడం? ఆశయం, ఉద్దేశ్యం ఎంత గొప్పవయినా కావచ్చు, కానీ భిక్షాపాత్రతో ఊరిపై పడి విరాళాలు అనే ముసుగులో బాబా పేరు చెప్పి డబ్బు అడుక్కోవడమే అవుతుంది కదా? అది ఏ పేరైనా కావచ్చు. ఎవ్వరి నుంచి ధనం తీసుకోరాదు అంతే! ఎవరి డబ్బుకో నువ్వు కాపలాదారు అవడం దేనికి? ఇట్లా చందాలు ప్రోగు చేసి కట్టించిన మందిరాల్ని, ఆలయాల్ని నువ్వు చూస్తూనే ఉన్నావు కదా! డబ్బిచ్చిన దాతలు తమ పేరున శిలాఫలకాలు ఆ మందిరం గోడలపై చెక్కించమంటారు. ఇంకా పెద్ద మొత్తం ప్రోగవడంతో దాని కోసం ఓ సంస్థ ఏర్పడుతుంది. ఆ మొత్తంపై ఆధిపత్యానికి పోటీలు, కీచులాటలు మొదలవుతాయి. మందిరానికి బ్యాంక్ బాలెన్స్ పెరిగిందంటే మాత్రం సమస్యలు తప్పవు. అక్కడ బాబా ఉండకుండా పోయి, మనకు ఉండేటటువంటి ఇవే మిగులుతాయి.*

*ప్రజలందరి కోసం ఓ మంచి పని తప్పక చేయాలని మీకు అంతగా కోరిక ఉంటే, మీకు పరిచయమైన వారందరికీ బాబాతో మీకున్న అనుబంధాన్ని, అనుభవాలను చెప్పండి. బాబా తత్త్వాన్ని చాటేలా, బాబా మార్గంలో బాబాకెలా దగ్గరవ్వాలో చెప్పండి. అందరూ కలిసి బాబా నామం చెప్పండి. భజన చేయండి, సచ్చరిత్ర చదువుకోండి. భక్తుల అనుభవాలు పంచుకోండి. ఇట్లా అందరూ కలిసి ఒకచోట సత్సంగమంటూ జరుపుకుంటూండగా, అందరికీ బాబా మందిరం అవసరమని అనిపిస్తే వారే ప్రేమతో తలా ఒక పని చేపట్టి మందిరాన్ని కట్టుకోవచ్చు.*

నిజానికి బాబా మందిరం అట్లా నిర్మింపబడటమే సరి అయిన పద్ధతి. బాబా మందిరం బాబానే నిర్మించుకుంటారు. బాబానే కనుక తనకొక చోట మందిరముండాలని నిర్ణయిస్తే, అది సహజాతి సహజంగా నిర్మాణమైపోతుంది. అందరూ తమంతట తామే వచ్చి మందిర నిర్మాణం చేపడతారు. 'మేమసలు అడగాల్సిన పనిలేదు. సాయిమందిరం అంటే ప్రజలందరూ ఎంతో ఉత్సాహంగా డబ్బిస్తారు' అంటారేమో? ఆ ఉత్సాహాన్ని డబ్బు రూపేణా కాదు, మందిర నిర్మాణంలో వారినే స్వయంగా భాగం పంచుకోమనండి. ఉదాహరణకు స్థలం కొనివ్వచ్చు. కొంతవరకు గోడలు కట్టవచ్చు. తలుపులు, కిటికీలు కొనివ్వచ్చు, గచ్చు పరిపించవచ్చు. అట్లా ఎవరి శక్త్యానుసారం వారు మందిరానికి కావలసిన మెటీరియల్ సమకూర్చడం, తామే దగ్గరుండి ఆ మేరకు కట్టించి ఇవ్వడం, అట్లా చేయడం మంచిది. అంతే తప్ప ఈ చందాలతో కట్టే మందిరాలు, సంస్థలను నేను సమర్థించను. ఇట్లా అందరూ చందాలు వసూలు చేయడం అన్నది తప్పు అని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. ప్రజలు ఎవరికి నచ్చిన రీతిలో వారు ప్రవర్తిస్తుంటారు. కానీ నా పద్ధతి అది కాదు. నాకలా ఇష్టం ఉండదు. అది ఇతరులకి నచ్చినా, నచ్చకపోయినా సరే నేను నా మార్గాన్నే అనుసరిస్తాను. నా వారు అనుకున్న వారు, నా పద్ధతులు నచ్చినవారు నా మార్గాన్నే అనుసరిస్తారు. నా పద్ధతుల్నే పాటిస్తారు. కాదనుకుంటే వాళ్ళు నా మార్గం నుంచి తప్పుకున్న వాళ్ళవుతారు!

# భక్తి గానం

బొనిగం సుబ్బారావు
గవర్నమెంట్ ఉద్యోగి, చెన్నై
జన్మించిన సం॥ 1950

చెన్నై, జూన్ 2002

1999, మే నెలలో నా పెళ్ళిరోజున ఆశీస్సులు పొందాలని తిరుమలలో ఉన్న గురువుగారి దర్శనానికి నా కుటుంబంతో సహా వెళ్ళాను. దర్శనానంతరం సత్సంగం జరిగింది. సత్సంగంలో గురువుగారు అకస్మాత్తుగా నావైపు చూచి "*ఎందుకలా కళ్ళు ఆర్పకుండా బాబాను చూస్తూ ఉండడం. కంటికి శ్రమ కదా! హాయిగా కనురెప్పలాడిస్తూ బాబాను కంటి నిండా చూసుకోవచ్చునే! మన హృదయంలో, ఆలోచనల్లో ఎల్లప్పుడు బాబా రూపాన్ని నిలుపుకోవడమే ముఖ్యం*" అన్నారు.

ఆ మాట గురువుగారి నోటి నుండి రావడం యాదృచ్ఛికంగా అనిపించినా, నా వంక చూసి అలా ఎందుకన్నారో అన్నది గ్రహించగానే, నా శరీరం రోమాంచితమైంది. కారణం నాకో అలవాటుండేది. బాబా ఫోటోను రెప్పలార్పకుండా చూస్తూ ఉండే వాడిని. ఒక్కోసారి కళ్ళు మంటగా ఉండేవి. అయినా అలా చేయడం నా భక్తిని అధికం చేస్తుందనుకునేవాడిని. కళ్ళ వెంట నీరు కారితే నా భక్తి పరిపక్వానికి వస్తుందని తలచేవాడిని. దాన్ని గురువుగారు స్వయంగా చూచినట్లు చెప్పడం నాకు చాలా ఆశ్చర్యమేసింది. నేనెన్నడూ ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. కనీసం మా ఇంట్లో వారికి కూడా తెలియదు. గురువుగారికి అంతా తెలుసు, మనం ఆయన నుండి ఏమీ దాచలేమని గ్రహించాను. అంతేకాదు, భక్తిని పెంపొందించుకోవడానికి ఎటువంటి అసహజమైన పద్ధతులు గురువుగారికి ఇష్టముండవని కూడా అర్థమైంది. ఏ పనైనా సహజంగా చేయడమే వారికిష్టం. సాయిబాట మనకు ఆనందదాయకంగా ఉండాలని వారెప్పుడూ అంటారు.

నా భార్య లక్ష్మిది మంచి కంఠస్వరం. బాబాపై గురువుగారు వ్రాసిన పాటలను సత్సంగాలలో ఆమె పాడుతుంటుంది. ఒకసారి సత్సంగంలో ఆమె యాంత్రికంగా పాడుతున్నట్లు అనిపించి "నీ స్వరం బాగుంటుందని నీకు గర్వం. అందుకే బాబా పాటలను నిర్లక్ష్యంగా పాడుతున్నావు" అని ఆమెపై కోప్పడ్డాను. అప్పుడు నా మాటలకు ఆమె ఏం మాట్లాడలేదు కానీ, గురువుగారి ఫోటో వద్దకు వెళ్ళి ఏడుస్తుండగా చూశాను.

ఆ మరుసటి రోజే గురువుగారిని చూడడానికి తిరుమల వెళ్ళేందుకు మా కుటుంబానికి అవకాశం లభించింది. పని ఒత్తిడి మూలంగా నేను వెళ్ళేందుకు వీలుపడలేదు కానీ నా భార్య, ఇద్దరు కుమార్తెలు తిరుమల వెళ్ళి ఒక వారం అక్కడే ఉన్నారు. ఒకరోజు అమ్మగారు (గురువుగారి భార్య) నా భార్యను పిలిచి గురువుగారు వ్రాసిన 'దేవుడే పుట్టితే సాయి రూపం...' అనే పాట పాడమని అడిగారు. నా భార్య ఆ పాటను పాడగా విని అమ్మగారు మెచ్చుకున్నారు. అంతే కాకుండా అమ్మగారు "లక్ష్మిని పిలిచి ఆమె పాటను వినమని గురువుగారు నాతో చెప్పారు" అన్నారట. గతంలో తమ ఫోటో వద్ద వెలిబుచ్చిన బాధను తీర్చేందుకే గురువుగారిలా అమ్మగారి ద్వారా ఆమె పాట విని మెచ్చుకున్నారని తలచి నా భార్య ఎంతో ఆనందించింది.

ఈ విషయం విన్న నేను ఆశ్చర్యపోయాను. గురువుగారు, నా భార్య స్వరంలోని ప్రేమను, భక్తిని గ్రహించారు. కానీ నేను మాత్రం అర్థం చేసుకోలేకపోయాను. పైగా బాధపెట్టాను. నా కోపాన్ని, తొందరపాటుతనాన్ని, ఇతరులను విమర్శించే స్వభావాన్ని తొలగించమని గురువుగారిని ప్రార్థిస్తున్నాను.

***భక్తుడు:*** *సచ్చరిత్రలో ఒకరు చేస్తున్న సేవను ఇంకొకరు విమర్శించారని, బాబా కడుపులో సటకా పెట్టుకొని గుచ్చేసుకొని అందరూ బెదిరి పోయేటట్లుగా చేశారు. ఆ సందర్భంలో వాళ్ళు కూడా ప్రేమ కొద్దీనే కదా చెప్పింది! ఎందుకు ఆయన అంత తీవ్రంగా స్పందించారు? ఒకరు చేసిన దానిని ప్రేమగా విమర్శిస్తే తప్పు ఏంటి?*

***గురువుగారు:*** *ప్రేమగా విమర్శించారో, లేదంటే 'వీళ్ళకే ఎక్కువగా ఆయనమీద భక్తి ఉన్నట్లు, అవతలి వాళ్ళు ఏదో భక్తి లేకుండా చేస్తున్నట్టు' అనే భావంతో చెప్పారో! ఆ చెప్పినటువంటివారి భావానికి అనుగుణంగా ఆయన రియాక్ట్ అయ్యుంటారు.*

***భక్తుడు:*** *అంటే విమర్శించడమే తప్పు అంటారా?*

***గురువుగారు:*** *బాబాకు దూరం అవుతాము. బాబా మాటల్లో చెప్పాలంటే విమర్శించడం అనేది "పంది పెంటను తినడం వంటిది". ప్రక్కవాళ్ళను విమర్శించేటటువంటివాడు నాలుకతో మానసికంగా వాడి మలాన్ని తింటున్నాడు. ఇద్దరూ చేసేటటువంటి పని ఒక్కటే. ప్రతి ఒక్కరిలోనూ*

లోపాలు ఉన్నాయి. బలహీనతలూ ఉన్నాయి. అవి మన మనస్సులో ఉండేటటువంటి మాలిన్యంలాంటిది. ఉందని తెలిసినా మనంతట మనం పోగొట్టుకోలేకున్నాము. దాని కోసమే సద్గురువు దగ్గరకు వచ్చాం. ఎదుటివారిని విమర్శించడం మనమెందుకు చేయాలి? బాబాకు ఇష్టం లేనటువంటి పని చేయడం వలన బాబాకు దగ్గర కాలేము.

వేరే వాళ్ళని విమర్శించడం ద్వారా తెలియకుండానే, తనకు ఈ బలహీనతలు లేనట్టు, ఎదుటివాడికే ఆ బలహీనతలు ఉన్నట్లు తాను చాలా గొప్పవాడు అయినట్టు ఫీలింగ్ రాదూ? అసలు విమర్శల జోలికి పోవద్దు. వాళ్ళు అట్లా చేస్తున్నారు. వీళ్ళు ఇట్లా చేస్తున్నారు. అవి మనకి వద్దు. వాళ్ళలో లోపం ఉంటే బాబా చూసుకుంటారు. మనల్ని బాగు చేయడానికి బాబా ఉన్నట్లు, వాళ్ళని బాగు చేయడానికి బాబా ఉన్నారు. ఆ లోపాలు మన మనస్సుకిగానీ వస్తే, అవి మనలో ఉన్నాయా లేదా అని చూసుకోవాలి. మనలో లేకుండా జాగ్రత్తపడాలి.

# ఎటుక మరపుల హేల

మజ్జిగ నరేంద్రనాథ్
హోమియో వైద్యులు, నెల్లూరు
జన్మించిన సం॥ 1965

తిరువణ్ణామలై, జూన్ 2004

నెల్లూరులోని సాయిబాబా సత్సంగమందిరంలో పనులు చూసుకునేందుకుగాను భరత్ అనే యువకుడుండేవాడు. మందిరాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచడం, పూల అలంకరణ నుండి బాబాకు జరిగే సేవలు, మందిరంలో రోజూ నిర్వహించబడే సాయినాథుని ఉచిత వైద్యశాలకు సంబంధించిన విషయాలు మొదలైనవన్నీ ఎంతో బాధ్యతాయుతంగా ఎక్కడా ఏ లోపం జరుగకుండా చక్కగా నిర్వర్తించేవాడు. మందిరం నుండి అతనికొచ్చే జీతం తక్కువైనా, ఒక ఉద్యోగిలా కాక ఎంతో సేవాభావంతో పని చేసేవాడు. కానీ, కుటుంబంలో డబ్బు అవసరం బాగా ఉండడంతో మంచి ఉద్యోగం వచ్చేలా అనుగ్రహించమని గురువుగారికి చెప్పవలసిందిగా నన్నెప్పుడూ కోరేవాడు.

ఇట్లా ఉండగా గురుబంధువువైన హరి, నెల్లూరులో ఒక సెల్‌ఫోన్ షాపు ప్రారంభించదలచి అందులో పని చేసేందుకుగాను చురుకైన వ్యక్తి ఎవరైనా ఉంటే చెప్పమని నన్నడిగాడు. వెంటనే నా మనసులో భరత్ పేరే మెదిలింది. హరితో అతని గురించి చెప్పాను. మళ్ళీ వెంటనే ఇంకో ఆలోచన కలిగి, హరితో “భరత్ మందిరం పనులు ఎంతో బాధ్యతగా చేస్తున్నాడు. అతనక్కడ లేకపోతే ఇబ్బంది. అదీగాక బాబా సేవలో అతనూ ఆనందం పొందుతున్నాడు. బాబా సేవ చేసుకునే అదృష్టం నుండి అతన్నెందుకు దూరం చేయాలి? నీ షాపులో పని చేసేందుకు అతను కాకపోయినా నమ్మకస్థుడైన మరో వ్యక్తి మన గురుబంధువుల్లోనే దొరక్కపోడులే” అన్నాను.

ఇదంతా జరిగిన తరువాత ఒక రోజు హరీ, నేను మాట్లాడుకున్న విషయం గురువుగారితో చెప్పాను. *“నీ ఆలోచన నచ్చలేదు నాకు. అట్లా చేయడం ఒక వ్యక్తిని ఉపయోగించుకోవటం అవదూ?”* అన్నారు గురువుగారు.

“నేను నా వ్యక్తిగత అవసరాల కోసం భరత్‌ను ఉంచేయాలనుకోవడంలేదు కదా? అతనూ బాబా సేవలో ఉన్నాడు. అతనుండడం వలన మందిరం పనులన్నీ సజావుగా సాగుతున్నాయి. అతనిలా బాధ్యతగా పనిచేసే మరో వ్యక్తి వెంటనే దొరకడం కష్టం!” అన్నాను నేను.

“భరత్ ఎట్లా వచ్చాడు మందిరానికి? మొదట సత్సంగానికి రావడం మొదలుపెట్టి క్రమంగా బాబా పట్ల ప్రేమను పెంచుకున్నాడు. అప్పట్లో ఉద్యోగం లేదు కాబట్టి అతనికి మరో మంచి ఉద్యోగం దొరికే వరకు మందిరంలో పని చేస్తున్నాడు. అవునా? ఇప్పుడు అతను కోరుకుంటున్నట్లు ఎక్కువ జీతం పొందే ఉద్యోగానికి అవకాశం వచ్చింది. బాబానే అతన్ని మన దగ్గరకు పంపించారు. ఇప్పుడు బాబానే అతనికి ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం ఇప్పించబోయారు. భరత్ వెళ్ళిపోతే అతని స్థానాన్ని భర్తీ చేయడానికి బాబా మరొకర్ని పంపిస్తారు” అని నా వంక నిశితంగా చూస్తూ అన్నారు గురువుగారు.

ఆ మాటలతో ఒక్కసారిగా వాస్తవం నాకర్థమయ్యింది. నేనెంత మాయలోపడి అట్లా ఆలోచించానో? గురువుగారు చెప్పిన కోణంలోంచి చూడగానే, ఏమరపాటులో నేను చేసిన పొరపాటుకు నివ్వెరబోయాను. ప్రతి విషయాన్ని బాబా పరంగానే ఎట్లా ఆలోచించాలన్నది ఈ సంఘటన ద్వారా తెలిపారు గురువుగారు. మనం మన వైపు నుండి కాక ఎదుటివారి గురించి ఆలోచించడమే గురువుగారికిష్టం. అంతేకాదు, సంస్థలకన్నా వ్యక్తి శ్రేయస్సుకే వారి దృష్టిలో ప్రాముఖ్యత.

మన వల్లనే (మానవ శక్తి) ఒక సంస్థ నిర్వహణ అంతా చక్కగా జరుగుతున్నది అన్న ఆలోచనే నన్ను ఆ సంఘటనలో యథార్థాన్ని గమనించకుండా చేసింది. కరుణామూర్తి అయిన బాబా మన పనులు, అవసరాలు చూస్తూ అన్నివేళలా అంతటా మనని శ్రద్ధగా గమనిస్తుంటారు. కానీ బాబా పనులు, అవసరాలు మన వల్లనే జరుగుతున్నాయి అని అనుకోవడం అవివేకం.

***గురువుగారు:*** *నాకు సంస్థలు ముఖ్యం కాదు, వ్యక్తికే ప్రాముఖ్యతనిస్తాను నేను. నాతో సంబంధం ఎవరికైనా వ్యక్తిగతంగానే ఉంటుంది. వారివారి ఇష్టాలు, సంస్కారాలు, స్వభావాన్ని బట్టి నేను సలహా ఇస్తాను. నాకు ప్రతి ఒక్కరూ ముఖ్యమే. ఎవరికివారు నాకు కావాల్సిన వారే, ప్రత్యేకమైనవారే.*

2000 సంవత్సరం నుండి నేను గురువుగారి దగ్గరే ఉంటున్నాను. వారికి భక్తుల సమస్యలు, విన్నపాలు తెలియచేసే అవకాశం నాకు లభించింది. నిజానికి

గురుదేవులకు భక్తుల మనస్సుల్లోని కోరికలు, ప్రార్థనలు వేరుగా తెలియజేయాల్సిన అవసరమే లేదు. అయినా ఆ అవకాశం నాకు కలిగింది అంటే, అది నన్ను నేను ఎప్పటికప్పుడు ఎఱుకలో ఉంచుకునేందుకు, మరింతగా తోటివారిపై ప్రేమభావాన్ని పెంపొందించుకొనేందుకే అని నా నమ్మకం. దేశవిదేశాల నుండి గురుబంధువులు ఫోన్‌కాల్స్ ద్వారా వారి సమస్యలు, కోర్కెలు తెలియచేస్తారు. అయితే ఒక్కోసారి వెంటనే ఆ విషయం గురువుగారి సముఖానికి తీసుకెళ్ళే అవకాశం లేకో, పని వత్తిడిలో ఏ ఒక్కరి విషయాన్నో నేను చెప్పడం మర్చిపోయినా, "గురువుగారికి తెలియచేయండి" అని వారు ఫోనులో చెప్పిన వెంటనే వారి సమస్య తీరిపోయేది. ఆ విషయం తర్వాత ఆ భక్తులే మళ్ళీ కృతజ్ఞతాంజలి చెపుతూ ఫోన్ చేసి తెలియజేసేవారు.

దాన్ని బట్టి వాస్తవానికి గురువుగారికి, భక్తులకు మధ్య అనుసంధానకర్త అంటూ ఎవ్వరూ ఉండాల్సిన అవసరమే లేదు అని నాకర్థమయ్యింది. అయినా బాహ్య ప్రపంచానికి ఇక్కడో వ్యక్తి ఉండాలి. ఆ పాత్ర నిమిత్తమాత్రమే అయినా ఆ మిషతో గురువుగారి ప్రత్యక్ష సన్నిధిలో ఉండే అవకాశం నాకు కలగడం గురుదేవులు నాకు ప్రసాదించిన వరంగా భావిస్తున్నాను.

ఒకసారి గురువుగారు శిరిడీ నుంచి తిరువణ్ణామలైకు వెళుతున్నారు. వారు బయలుదేరి వెళ్ళిన తర్వాత గురువుగారి లగేజీ అంతా అంటే పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు (కంప్యూటర్‌కి సంబంధించినవి) మొదలైనవన్నీ ప్యాక్ చేయించి వ్యాన్‌లో సర్ది దాన్ని పంపించి ఆ తరువాత నేను బయలుదేరడం అలవాటు. గురువుగారి ప్రయాణం సంగతి తెలియగానే ప్యాకింగ్ పనులు మొదలుపెట్టేవాడిని.

గురువుగారెందుకో రెండు, మూడుసార్లు "పుస్తకాలు జాగ్రత్త" అన్నారు మాటల మధ్య. నేను వారు చెప్పినప్పుడల్లా "అట్లాగే సార్! జాగ్రత్తగా తీసుకొస్తాను" అని చెప్తూనే ఉన్నాను.

ఉదయం గురువుగారు ఊరికి బయలుదేరి వెళ్ళిన తరువాత, తీసుకెళ్ళాల్సిన వస్తువులన్నీ ఇతర గురుబంధువుల సహాయంతో ప్యాక్ చేయించి వాటిని వ్యాన్‌లో ఎక్కించి, నేనూ ఆ రోజు సాయంత్రం రైలులో హైదరాబాదుకు వెళ్ళాను. అక్కడ పనులు చూసుకొని బయలుదేరుదామని అనుకొంటూండగా తిరువణ్ణామలై నుండి ఫోన్ వచ్చింది. శిరిడీ నుండి వచ్చిన గురువుగారి సామాన్లలో పుస్తకాల పెట్టెలు రాలేదని! మిగిలినవన్నీ ఉన్నాయి, అవి మాత్రం ఎట్లా మిస్సయ్యాయన్నది నాకర్థం

కాలేదు. ఇంతలో శిరిడీ నుండి అమ్మగారు ఫోన్‌లో మాట్లాడారు. గురువుగారి లగేజీలో వెళ్ళవలసిన రెండు పెట్టెలు అక్కడ సాయియానాలోని ఆఫీసులో ఉన్నాయి అని. ముందు ఒక్క నిమిషం అర్థం కాకపోయినా, తర్వాత బోధపడిన విషయం ఏమిటంటే వస్తువులన్నీ ప్యాక్ చేయించాను కానీ హడావుడి, పని వత్తిడిలో అన్నీ వ్యాన్‌లో ఎక్కించారా, లేదా అన్నది చూసుకోలేదన్నమాట!

అవి మళ్ళీ తెప్పించుకునే ఏర్పాటు చేసి, నేను గురువుగారి దగ్గరకు వెళ్ళిన తర్వాత, పుస్తకాలు రాలేదన్న ప్రస్తావన రాగానే, నేను గురువుగారితో "సార్! నేను అన్నీ దగ్గరుండి ప్యాక్ చేయించాను, వాళ్ళను వ్యాన్‌లో పెట్టమన్నాను. పెట్టడం మర్చిపోయినట్లున్నారు" అన్నాను, "ఆ పొరపాటు నాది కాదు" అని పరోక్షంగా సూచిస్తూ. నా సంజాయిషీ వినగానే గురువుగారు నా వంక ఒకసారి చూశారంతే! ఆ తర్వాత రెండురోజులు నాతో సరిగా మాట్లాడలేదు. నేను తట్టుకోలేకపోయాను. మూడవరోజు గురువుగారి ముందు మోకరిల్లి "క్షమించండి. నిజానికి అన్నీ సరిగా సర్దించడము, ఎక్కించడము చూసుకోవాల్సిన బాధ్యతంతా నాదే. నా వల్లే పొరపాటు జరిగింది" అన్నాను.

అప్పుడు గురువుగారు *"ఏదైనా ఒక పని చేస్తే దాని పూర్తి బాధ్యత నీదే అవుతుంది. పని చక్కగా జరిగితే దానికి కారణం నీ శ్రద్ధ, సామర్థ్యం అనీ, పని సర్గ్గా జరగకపోతే దాని వైఫల్యానికి కారణాలు చూపుతూ ఇంకెవరి మీదన్నా తప్పు నెట్టేయడం సరికాదు. ఎవరైనా ఒక పని చేస్తే దాని విజయానికి, వైఫల్యానికి రెండింటికీ వాళ్ళే బాధ్యత వహించాలి! తప్పు జరగడం సహజమే. అదేమంత పెద్ద విషయం కాదు. అయితే చేసిన తప్పును ఒప్పుకోకుండా మరొకరి మీద నెట్టేయడమే పెద్ద తప్పు"* అన్నారు.

***భక్తుడు:*** *బాబా తన భక్తులెవరైనా రెండు రూపాయలు ఇద్దాము అని మనసులో అనుకొని పొరపాటున ఒక రూపాయి ఇవ్వడం మర్చిపోయినా, బాబానే వారికి గుర్తుచేసి మరీ తీసుకునేవారెందుకు?*

***గురువుగారు:*** *ఆ అనుభవం వల్ల బాబా ఆ భక్తుడికి ఏమి చెప్పదలచారు? బాబాకు ఆ రూపాయి ముఖ్యం కాదు. సద్గురువు పట్ల అతని వైఖరి ఎలా ఉంది అనేదే ముఖ్యం. ఆ రూపాయి అడిగి తీసుకోవడంలో బాబా అతనికి*

*ఇచ్చే అనుభవంలో గుణపాఠం–"సద్గురువు పట్ల మనం ఎంతో జాగ్రత్త వహించాలి. ఆయన పట్ల అశ్రద్ధ వహించకూడదు" అని. ఆయన పట్ల మన మనస్సులోని భావనలు కూడా ఆయనకు తెలుసు. ఆయన వాటికీ రియాక్ట్ అవుతారు. అందుకే అటువంటి అనుభవాలనిచ్చి బాబా వారిలో ఆ ఎఱుకను పెంచుతారు. ఒకసారి ఆ భక్తుడి స్థానంలో మిమ్మల్ని ఊహించుకొని చూడండి. "నేను ఆయనకు ఒక రూపాయి ఇద్దామని casual గా అనుకొని, దాని గురించి మర్చిపోయాను. నేను బాబా దర్శనానికి వెళ్ళినపుడు బాబానే దాని గురించి గుర్తు చేశారు" చూశారా! ఎంత జాగ్రత్తగా ఉండాలో. దానినే శ్రద్ధ అంటారు. శ్రద్ధ అంటే ఎఱుక, బాబా పట్ల ప్రేమపూర్వకమైన focus, care.*

2004 జూలై 7, బుధవారం రాత్రి ఎనిమిది గంటల నలభై అయిదు నిమిషాలు కావస్తోంది. సాయియానాలో భక్తులందరూ చేస్తున్న సాయినామ సంకీర్తనలో తామూ పాల్గొనేందుకుగానూ, గురువుగారు (తమ నివాసమైన) గురుచరణ్ నుంచి విచ్చేయబోతున్న సమయం...

"గురుచరణ్" వద్ద గురువుగారి రాకకై నిరీక్షిస్తూ బారులు తీరి వేచి ఉన్న భక్త బృందం చెంత నేనూ నిలబడి ఉన్నాను. అంతలో గురువుగారి దగ్గర్నుండి పిలుపు వచ్చింది. నేను వడివడిగా వెళ్ళి గురువుగారి ముందు నిలుచున్నాను.

"నరేంద్రా! ఈ దారిలో వెహికిల్స్‌ను ఏమైనా ఆపుతున్నారయ్యా?" అని అడిగారు. ఒక్క క్షణం హఠాత్తుగా వారెందుకు అలా అడుగుతున్నారో తెలియక "లేదు సార్!" అన్నాను.

"వెహికిల్స్‌ను ఆపకండి, వాటి దారిన వాటిని పోనివ్వండి" అన్నారాయన. గురువుగారు ఎందుకు చెబుతున్నారో కొంచెం కూడా అర్థం కాకపోయినా "అలాగే సార్!" అని తల ఊపాను. కాని ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుందనిపించింది.

ఇక్కడ గురువుగారిలా అడిగారు, అక్కడ సాయియానా వద్ద ఇదే సంఘటన జరుగుతూ ఉంది. సాయియానా గేటు దగ్గర ఉండే వాచ్‌మేన్, మరికొద్దిసేపట్లో గురువుగారు ఇటు రానున్నారు కాబట్టి "గురుచరణ్" వైపు వెళుతున్న ఒక ఆటోను ఆపి అందులోని ఒక ప్రయాణీకుని దిగి నడిచి వెళ్ళమన్నాడు. ఆ ఆటోలో ఉన్నది

అటువైపు హోటల్‌కు వెళుతున్న తెలుగు వ్యక్తి. వాచ్‌మేన్ మరాఠీ వాడు. అతనికి తెలుగు తెలియదు. అతనేదో చెప్తాడు ఇతనికి అర్థంకాదు.

అతను కోపంగా "ఎవరో వస్తారని నన్ను ఇక్కడ ఆపేస్తారా?" అని పోట్లాటకు దిగాడు. అప్పుడక్కడ ఉన్న భక్తబృందంలోని కొందరొచ్చి అతనికి సర్దిచెప్పారు. అంతలో గురుచరణ్ నుండి గురువుగారు వచ్చే సమయం కావడంతో అంతటితో ఆ విషయం సద్దుమణిగింది. ఇక్కడ జరిగిన విషయమంతా విన్న తర్వాత, గురువుగారు ఇంతక్రితం నన్ను పిలిచి అట్లా ఎందుకడిగారో అర్థమయింది నాకు.

*"ప్రతిదీ మనవైపు నుండే ఆలోచిస్తాము. మీ అందరికీ మీ గురువుగారంటే ప్రేమ, గౌరవం కాబట్టి ఏమన్నా దారిలో అంతరాయం, అసౌకర్యం కలుగుతుందేమో అని ఆలోచించారు. కానీ, నిజానికి అతనివైపు నుండి ఆలోచించి చూడండి. ఆ ఆపే వెహికిల్స్‌లో స్త్రీలు, పిల్లలు ఉండవచ్చు. లగేజి ఎక్కువ ఉండవచ్చు. వాళ్ళెంతో దూరం నుండి ప్రయాణం చేసి వచ్చి ఉండవచ్చు. అట్లాంటిది అక్కడ ఆపేసి ఫర్లాంగు దూరం నడిచి వెళ్ళమంటే ఎలా వెళతారు? దారిలో వెహికిల్స్ వస్తే రానివ్వండి. మనం ప్రక్క నుండి వెళతాం అంతే కదా! అంతేకానీ మన వలన ఎవరైనా ఇబ్బందిపడడం సరైన పద్ధతా? ఒక్కసారి నిన్నే అలా ఆపేశారనుకో ఎలా ఉంటుందో ఊహించుకో! ఇంకెప్పుడూ అలా ఆపకండి"* అన్నారు.

***భక్తుడు:*** *బాబా చరిత్రలో గంగగిర్ మహరాజ్ బాబాను కలవడానికి మసీదుకు అడ్డత్రోవ ద్వారా వస్తే బాబా 'అడ్డత్రోవ గుండా రావద్దు' అని గంగగిర్‌ను మందలించినట్లుగా ఉంది. బాబాను చూద్దామనే ఆత్రుతతోనే కదా, గంగగిర్ దగ్గర దారిలో మసీదుకు వచ్చారు. దానిలో తప్పేముంది? ఎందుకు బాబా వారిని అలా వారించారు?*

***గురువుగారు:*** *బాబా గంగగిర్‌కు ఇచ్చిన హెచ్చరిక మసీదుకు వచ్చే అడ్డ త్రోవ గురించి కాదు. ఆధ్యాత్మిక రంగంలో సాధారణంగా జరుగుతుండే దాని గురించి ఆయన తనదైన నిగూఢరీతిలో హెచ్చరించారు. ఆధ్యాత్మిక సంస్థలలో ఉండేవారు కొంతకాలమైన తర్వాత 'మా దృక్పథం సరైనది, మా ఉద్దేశ్యాలు ఉదాత్తమైనవి అయినప్పుడు ఏ త్రోవనైనా వెళ్ళవచ్చు.*

*గమ్యం ఉదాత్తమైనది కాబట్టి దానికి మేము వాడే సాధనాల గురించి పట్టించుకోనవసరం లేదు' అని ఆలోచించడం మొదలవుతుంది.*

*ఉదాహరణకు వారు ఏదో విధంగా డబ్బు సమకూర్చాలనుకుంటారు. ఈ డబ్బు బాబాకేగా మనం వాడేది. ఎలాగైనా ప్రోగు చేయవచ్చునంటారు. గమ్యం ఉదాత్తమైనది అయినప్పుడు దానిని చేరటానికి వాడే మార్గాలు ఎటువంటివైనా ఫర్వాలేదు అని ప్రజలను నమ్మించడానికి చూస్తారు. కానీ ఆ గమ్యం ఎప్పుడూ మన ఆధీనంలో ఉండదు. చివరకు ఏం జరుగుతుందో మనకు తెలియదు, మన చేతిలో ఉన్నది మార్గమే. మనం గమ్యం త్వరగా చేరతామా అనేది కాదు ముఖ్యం. మనం వెళ్ళే మార్గం ఎలా ఉంది అనేది సరిచూసుకోవాలి. నిజానికి గమ్యం కంటే మార్గమే ముఖ్యమైనది ఎందుకంటే ఉదాత్తమైన గమ్యాన్ని నికృష్టమైన మార్గాలు వాడి చేరలేము.*

*గంగగిర్ మహరాజ్‌కు చాలామంది శిష్యులుండేవారు. ఇక్కడ బాబా వారిని అడ్డదారిలో వెళ్ళవద్దని, మార్గం యొక్క పవిత్రత మీద దృష్టి ఉంచమని, హెచ్చరిస్తున్నారు. అంతేకాని లెండీ వనం నుండి మసీదుకు వెళ్ళే దగ్గర దారి గురించి కాదు.*

గురువుగారు చెన్నైలో ఉన్నారు. ఒకరోజు నేను గురువుగారు చెప్పిన కొన్ని సామాన్లు కొనడానికి సిటీకి బయలుదేరాను. వెళ్ళేముందు గురువుగారు *"ఎనిమిది గంటలకు సత్సంగం మొదలవుతుంది కదా నరేంద్రా అప్పటికొచ్చేసెయ్!"* అన్నారు.

నేను అలాగేనని వెళ్ళాను. కానీ షాపింగు అంతా ముగించుకొని వచ్చేసరికి తొమ్మిదైంది. త్వరత్వరగా స్నానం కానిచ్చుకొని నేను తెచ్చిన వస్తువులన్నీ పట్టుకొని గురువుగారి గదిలోకి వెళ్ళాను. గురువుగారు ఆ సామాను వంకే చూడలేదు. *"నేను సత్సంగం టైముకి వచ్చేయమన్నాను కదా. సత్సంగం మానేసి కొనుక్కొచ్చినవి నాకక్కరలేదు. అవి నువ్వే వాడుకో"* అన్నారు.

ఇంకోసారి శిరిడీలో సాయియానాలో గురువుగారి దర్శనానంతరం ఆరతి జరుగుతూ ఉంది. నేను ఏదో వస్తువు కోసం గురువుగారి ఇంట్లో ముందు గదిలో వెతుకుతున్నాను. అక్కడ నన్ను చూసిన గురువుగారు *"ఏం చేస్తున్నావిక్కడ అక్కడ ఆరతి జరుగుతుంటే? మన పద్ధతులు నలుగురికీ ఆదర్శంగా ఉండాల్సింది పోయి,*

నా దగ్గర ఉంటూ కూడా ఇలా చేస్తే ఎలా? ఆరతి అయిపోయిన తరువాత ఆ పని చూసుకోవచ్చు కదా!" అని మందలించారు.

*__గురువుగారు:__ మా గురువుగారు నన్ను విద్యానగర్‌లో సత్సంగం చూసుకోమన్నప్పుడు ఆరు సంవత్సరాలుగా నేను ఒక్క సత్సంగం కూడా మానలేదు. వాకాడుకు, కోటకు మధ్య ఏరు ఒకటి ఉండేది. దానికి వరదలొచ్చినా నేను పడవలో దానిని దాటి సత్సంగానికి వెళ్ళేవాడిని. నేనెప్పుడూ దానిని సాకుగా తీసుకుని సత్సంగం మానలేదు. నేను నాలుగైదు వారాలు వెళ్ళనిది ఒకే ఒక్కసారి – పూండీలో ఉన్నప్పుడు. ఒక్కసారి చెన్నైలో రైల్వేవారి పరీక్ష వ్రాయడానికి వెళ్ళాను. నేను ఉదయం చెన్నై వెళ్ళి పరీక్ష వ్రాసి వెంటనే వచ్చి సత్సంగంలో పాల్గొన్నాను. 'ఇవాళ నాకు ఆ పని ఉంది. సత్సంగం స్కిప్ చేద్దాము' అని నేను ఏనాడూ అనుకోలేదు. మాస్టరుగారు నాకు అంత గొప్ప అవకాశం ఇచ్చారు. నేను అక్కడికి నా కోసం, నా బాగోగుల కోసం వెళతాను.*

*అక్కడ జనం నన్ను పిచ్చివాడి క్రింద జమకట్టేవారు. "ఏమిటి ఇతనికి పిచ్చా? మరీ అంత పట్టుదల ఏమిటి? సత్సంగం పట్ల మరీ అంత సీరియస్‌గా ఎందుకుంటాడు? పడవ కట్టించి వరదలో ఉన్న నదిని కూడా దాటి సత్సంగానికి వస్తాడేమిటి?" అని. వారి దృష్టిలో నేనొక మూర్ఖుడినే. నేను ఆ నియమం పెట్టుకున్నాను. ఏ రోజైనా వెళ్ళకపోతే ఏదో కోల్పోతానని అనిపించేది. నా నియమాన్ని నేను పాటించాలి గదా!*

# గ్రహబలమా? సద్గురు అనుగ్రహమా?

గ్రంథి పద్మజ,
గృహిణి, విజయవాడ
జన్మించిన సం॥ 1964

విజయవాడ, జనవరి 2002

"నువ్వెన్నయినా అనుకోవచ్చు, ఆశించవచ్చు, కానీ బాబా లెక్కలు మాత్రం వేరుగా ఉంటాయి" అని గురువుగారు అంటారు. తరతరాలుగా మన నరనరాలలో పాతుకుపోయిన కొన్ని అర్థరహిత ఆచారాలు, మూఢనమ్మకాలు తొలగించి మనలో సరైన అవగాహన కల్పించేందుకు గురువుగారు ఎన్నుకొనే మార్గాలు ఎంతో వినూత్నంగా, ప్రబోధాత్మకంగా ఉంటాయి.

మా మూడవ అమ్మాయి హర్షితకు, మా చెల్లెలిగారమ్మాయి స్నేహితకు దాదాపు ఒకే వయసు. వాళ్ళిద్దరికి నాల్గవ ఏడు రాగానే, 1993లో గురువుగారి చెంత అక్షరాభ్యాసం జరిపించాలని అడిగాము. మా అమ్మగారి నమ్మకాన్ని, ఆమె మాటను కాదనలేక, సిద్ధాంతిగారినడిగి అక్షరాభ్యాసానికి మంచి ముహూర్తం పెట్టించాము. ఆ సమయంలో గురువుగారు పూండీలో ఉన్నారు. పిల్లల్ని తీసుకుని మేమందరము పూండీ వెళ్ళాము. గురువుగారు, పూండీస్వామి సశరీరంతో ఉండగా నివసించిన చిన్న పెంకుటింటిలోని వెనుక గదిలో ఉన్నారు. సిద్ధాంతిగారు పెట్టిన ముహూర్తంలోనే గురువుగారు పిల్లలకు అక్షరాభ్యాసం చేయాలని మా కోరిక. గురువుగారి గది బయట వారి పిలుపు కోసం ఎదురు చూస్తున్నాము. లోపలికి చాలామందిని పిలుస్తున్నారు, మాట్లాడి పంపిస్తున్నారు. కానీ మమ్మల్నెంతకూ పిలవడం లేదు. మాకు ఏ విషయమూ చెప్పడం లేదు. "నిర్ణయించుకొన్న ముహూర్తం దాటిపోతోంది. రేపు అస్సలు మంచిది కాదు" అని మా అమ్మగారు ఒకటే ఆందోళన పడుతున్నారు.

లోపలకు వెళ్ళే వారి చేత గురువుగారికి ఎన్నిసార్లు మనవి పంపించినా మాకు ఏ పిలుపూ రాలేదు సరికదా అసలు మాకారోజు దర్శనమే కాలేదు. ముహూర్తమూ దాటిపోయింది. ఎన్నో ఊహలతో ఆశలతో వచ్చిన మేము హతాశులమయ్యాము. బాగా పేరున్న సిద్ధాంతిగారి దగ్గర దక్షిణ ఎక్కువైనా ముహూర్తం దివ్యంగా ఉండాలని నిర్ణయించుకొని వస్తే ఇదేమిటి ఇలా అయిందే? అని మేము ఎంతో బాధపడ్డాము. ముఖ్యంగా మా అమ్మగారు.

ఆ మరునాడు గురువుగారు మమ్మల్ని రమ్మన్నారన్న కబురు వచ్చింది. అందరం వెళ్ళి వారి సన్నిధిలో కూర్చున్నాము. గురువుగారు మాతో మాట్లాడుతూ ఉండగా, ఒకతను గురువుగారికివ్వడానికి బాబా క్యాలండర్లు (పెద్ద సైజువి) పట్టుకొని లోపలికి వచ్చాడు. గురువుగారు ఆ క్యాలండర్లు తీసుకుని బాబాకు నమస్కరించి "*బాబా వచ్చారు. ఇదీ బాబా నిర్ణయించిన అసలైన ముహూర్తం!*" అంటూ పిల్లల్ని దగ్గరకు రమ్మని పిలిచి వాళ్ళకు అక్షరాభ్యాసం చేశారు.

అక్షరాభ్యాసం తరువాత పద్ధతి ప్రకారం పంచిపెట్టడానికని తీసుకెళ్ళిన పప్పు బెల్లాలు, పెన్నులు, పెన్సిళ్ళు, పుస్తకాలు, బట్టలు, గురువుగారి పాదాల వద్ద ఉంచి మేము నమస్కరించుకొన్నాము.

ఆ సమయంలో అక్కడ ఒంగోలు స్కూలు ప్రిన్సిపాల్, టీచర్లు, కొందరు కాలేజీ లెక్చరర్లు, ఇంకా శ్రీపూండీస్వామి సశరీరులై ఉండగా వారితో సన్నిహితంగా ఉన్న వారందరూ ఉన్నారు. ఆ వస్తువులన్నింటినీ గురువుగారు మా పిల్లలచేత వాళ్ళందరికీ ఇప్పించారు. "*పప్పుబెల్లాలు, పలకలు, పుస్తకాలు అందుకొన్న వాళ్ళందరూ పిల్లల్ని ఆశీర్వదించండి*" అన్నారు గురువుగారు నవ్వుతూ.

మామూలుగా అయితే సీరియస్‌గా ఒక తంతులా జరిగిపోయే ఆ అక్షరాభ్యాస కార్యక్రమం, అలా మేము ఊహించని రీతిలో ఆహ్లాదకర వాతావరణంలో ఎంతో సంతోషంగా జరిగింది.

***గురువుగారు:*** *సమాధి మందిరానికి శంఖుస్థాపన జరిగేటప్పుడు అందరూ బాబా వద్దకు వచ్చి "బాబా! ఇక్కడ 'వాడా' కట్టుకుని మురళీధరుని విగ్రహాన్ని పెట్టుకోవాలనుకున్నాము. అది ఎప్పుడు చేసుకోమంటారు. శంఖుస్థాపనకు మంచి ముహూర్తం చెప్పండి" అని అడిగారు.*

*"ముహూర్తమా! నీ మొహమా! మంచి సంకల్పం జరిగిందే ముహూర్తం. అది ఇప్పుడే చేసేయండి" అన్నారు. నిజానికి ఆయనప్పుడు కాలకృత్యాలు తీర్చుకోవడానికి లెండీకి వెళుతున్నారు. ఈలోగా ఎవరో టెంకాయ తెచ్చి బాబా చేతికిచ్చారు. ఆ టెంకాయ కొట్టి వెళ్ళిపోయారాయన. అదే ముహూర్తం. ఇప్పుడున్న సమాధి మందిరానికి శంఖుస్థాపన అలా జరిగింది.*

తర్వాత ఇంకొకరితో "ఈ జాతక చక్రాలు, సాముద్రికాలు అవన్నీ తుంగలో తొక్కు" అన్నారు. హస్త సాముద్రికుడు వస్తే ఏం చెప్పారు? చెయ్యి చూపించమన్నప్పుడు "వాడు నా వాసాలు లెక్కబెట్టడానికొచ్చాడు" అన్నారు. పైగా చెయ్యి చూపించలా. మరి ఇన్ని సంఘటనలలో కూడాను ఆయన జ్యోతిషాన్ని కానీ, ముహూర్తాన్ని కానీ వద్దనే చెప్పారు. అయినా ఈ వాస్తు, జ్యోతిషాలు రైటో, కాదో మనకొద్దు. మన జీవితాన్ని నడిపించేటటువంటివాడు బాబా. "నా శరీరాన్ని కోసి నీకు బిడ్డనిచ్చా. ఈ గ్రహాలు నిన్నేం చేయగలవు" అని బాబానే అన్నారు. "ఎవరైతే భక్తిగా ద్వారకామాయిలో అడుగుపెడతారో వారి కర్మ నశిస్తుంది" అన్నారు. "ఇక నుంచి వాడి భారమంతా నాదే" అన్నారు. సద్గురువును ఆశ్రయించనంతవరకే మిగతావేవైనా సరే. సద్గురువును ఆశ్రయించిన తరువాత ఇక వాటి యొక్క ప్రభావం మనమీదేమీ ఉండదు.

కాబట్టి సాయిభక్తుడి జీవితాన్ని నియమించేటటువంటిది బాబానే. బాబా వంటి సద్గురువును ఆశ్రయించిన తర్వాత మిగతా వాటి గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఇవన్నీ సామాన్యంగా ఎందుకు చేస్తాం అంటే భయానికి. మళ్ళీ చెపుతున్నాను చూడు – జ్యోతిషాలు, వాస్తులు – ఇవన్నీ ఏంటంటే భయం. మన శక్తి మీదే కాదు, బాబా శక్తి మీద కూడా నమ్మకం లేకపోవడం.

# అహం వదిలేయుటే బాబా హితం

బావన కొండయ్య
గవర్నమెంట్ ఉద్యోగి, నెల్లూరు
జన్మించిన సం॥ 1947

నెల్లూరు, నవంబర్ 2002

గురువుగారు 1989లో ఒంగోలు నుండి శిరిడీకి నివాసం మార్చిన తరువాత వీలున్నప్పుడల్లా నేను శిరిడీ వెళ్ళి కొద్దిరోజులుండి వస్తుండేవాడిని. ఒకసారి శిరిడీ వెళ్ళినప్పుడు మాటల మధ్య గురువుగారు "నీకు డబ్బు మీద చాలా వ్యామోహం ఉంది. అది పోవాలి" అన్నారు.

నాకేమీ అంత వ్యామోహం లేదన్నాను నేను. గురువుగారు "మంచిదే" అన్నారు.

హఠాత్తుగా వారలా ఎందుకన్నారో నాకర్థం కాలేదు. నాలో అంత పిసినారితనం ఉందని నాకు అనిపించలేదు. అనవసరంగా గురువుగారు నన్ను తప్పుబట్టారని అనుకున్నాను. ఆ మరునాడు నేను ఊరికి వెళుతున్నాను. వెళ్ళే ముందు "గురువుగారి దర్శనం చేసుకోవడానికి అవకాశముంటుందా" అని అమ్మగారిని అడిగాను.

"అవును. మీరీరోజు బయలుదేరుతున్నారనీ, మిమ్మల్ని పిలుస్తాననీ చెప్పారు గురువుగారు" అన్నారు అమ్మగారు.

ఆ రోజంతా ఎదురుచూస్తూనే గడిపాను గురువుగారు పిలుస్తారని. కానీ గురువుగారు పడుకొని ఉన్నారని తెలిసింది. బస్ బయలుదేరేందుకు ఇక ఇరవై నిమిషాలే ఉంది. అక్కణ్ణుంచి బస్‌స్టాండుకు వెళ్ళేందుకు ఎంతలేదన్నా పదినిమిషాలు పడుతుంది. అంతవరకూ ఎదురుచూసినా గురువుగారి నుండి పిలుపేమీ రాలేదు. నేనక్కడే కూర్చొని నిమిషాలు లెక్కపెట్టుకుంటున్నాను. ఇంతలో కరెంటు పోయింది. "హమ్మయ్య! నా మొర విని బాబానే ఇలా కరెంటు పోయేలా చేశారు" అనుకున్నాను. ఫ్యాన్ ఆగిపోతే గురువుగారు ఎంత నిద్రలో ఉన్నా లేచేస్తారని నాకు తెలుసు.

అనుకొన్నట్లుగానే పదినిమిషాల తరువాత అమ్మగారు బయటకు వచ్చారు. 'లేచారా అమ్మా' అని ఆత్రుతగా ఆమె దగ్గరకెళ్ళి అడిగాను. "అవును. కరెంటు పోగానే లేచారు. కానీ టీ తాగి మళ్ళీ పడుకున్నారు" అని చెప్పిందామె. నేను హతాశుణ్ణయ్యాను.

ఇదంతా చూస్తున్న నారాయణరావుగారు నాతో "కొండయ్యా, ఎందుకింత ఆందోళన? రాత్రి నువ్వు ఎటూ గురువుగారి దగ్గర సెలవు తీసుకొన్నావు కదా!

బయలుదేరి వెళ్ళిపో. గురువుగారు లేచిన తరువాత నువ్వెళ్ళిపోయావని నేను చెప్తానులే" అన్నారు.

నేనేం చేయాలో నిర్ణయించుకోలేకపోయాను. గురువుగారు నన్ను పిలుస్తానని చెప్పిన తర్వాత కూడా వారిని కలవకుండా, నా దారిన నేను ఊరికి ఎలా వెళ్ళి పోయేది? వెళ్ళకపోతే బస్‌కు రిజర్వు చేసుకున్న టికెట్ డబ్బులు రు.275/- వృథా అయిపోతాయి. ఏం చేయాలి?

నేనిలా తర్జన భర్జనలు పడుతుండగా నారాయణరావుగారు "సరే. పోనీ వెంటనే శివశంకర్‌గారి కారులో బస్టాండుకి వెళ్ళు. నీ టికెట్ ఎవరన్నా తీసుకుంటారేమో చూడు. అట్లా ఎవరూ దొరక్కపోతే వెళ్ళిపో" అన్నారు.

నేను బస్టాండుకి వెళ్ళి విచారించాను. బస్‌లోని వారందరూ అప్పటికే టికెట్లు కొనుక్కొని ఉన్నారు. డబ్బులిక వృథా అవుతాయని నేను మథనపడుతుంటే, లాస్ట్ మినిట్‌లో ఒక యువకుడు వచ్చాడు బస్‌లో వెళ్ళేందుకు. అతనింకా టికెట్ తీసుకోలేదు. నేను కండెక్టరుతో మాట్లాడి నా టికెట్టు అతనికిచ్చేందుకు ఒప్పించాను.

ఆ రాత్రి దర్శనమప్పుడు, గురువుగారు నా వంక చూసి చిరునవ్వు నవ్వారు. *"వెళతానన్నావుగా వెళ్ళలేదేం? నేను నిన్న నీకు డబ్బు గురించి వ్యామోహమంటే నువ్వేమన్నావు? లేదన్నావు. చూశావా! మూడు వందల రూపాయల దగ్గరే ఎంత తపనపడ్డావో? నాకన్నా నీకు డబ్బే ముఖ్యమై పోయింది. నీ టికెట్ అక్కడ ఎవరూ తీసుకోకపోతే నువ్వు వెళ్ళిపోయేవాడివి కదూ!"* అన్నారు.

ఇక నేనేం మాట్లాడగలను? నిజమే! ఆ కాసిని రూపాయలు వదులుకునేందుకు నేనెంతో తటపటాయించాను. కానీ ఆ నిజాన్ని ఒప్పుకునేందుకు మొదట నా మనసు అంగీకరించలేదు. మనలోని లోపాలు బయటపడవేసుకునేందుకు మనమంతగా ఇష్టపడము. కానీ వాటిని కాదనలేని రీతిలో ప్రత్యక్షంగా మన ముందుంచుతారు గురువుగారు!

***గురువుగారు:*** *కృష్ణుడు అర్జునుడికి భగవద్గీతలో చేసిన బోధ ఎంతో మంది గురువులు ఎన్నో పర్యాయాలు చేసినదే. కృష్ణుడు చెప్పాడు: "నేను నీకు బోధించింది అంతా ఉపనిషత్తుల సారమే" అని. కాని గీతకు ఉన్న ప్రత్యేకత ఏమిటి అంటే అది ఒక ప్రాక్టికల్ సన్నివేశంలో బోధింపబడింది.*

అర్జునుడికి గీత వినడానికి ఒకే ఒక్క అవకాశం దొరికింది. మనకు కొన్ని లక్షల అవకాశాలు. మనకు ప్రతి నిమిషం కురుక్షేత్రమే. ప్రతిచోట బాబా మనకు నేర్పిస్తూనే ఉంటారు. ఆయనే ఒక సన్నివేశాన్ని కల్పించి, మనం ప్రాక్టికల్‌గా నేర్చుకొనేట్లు చేస్తారు. అంతేకాని కూర్చొని ఇచ్చే ఆధ్యాత్మిక ప్రసంగాలు నీ మనసుకెక్కవు. నా దృష్టిలో అదే నిజమైన బోధనా పద్ధతి. అదే బాబా విశిష్టత.

ఎప్పుడయితే మనం "నేనీ బలహీనత పోగొట్టుకున్నాను, నాకిక ఈ భావోద్వేగం కలుగదు" అని అనుకుంటుంటామో, వెంటనే ఆయనొక సంఘటనను కల్పించి, మనలో ఇంకా ఆ బలహీనత ఉందని చూపిస్తారు. ఇక నీకు తప్పించుకోలేని పరిస్థితి వస్తుంది. దాన్నుంచి మళ్ళీ మనం నేర్చుకుంటాం. ఆ విధంగా మన జీవితం మొత్తం 'బోధ' అవుతుంది. "బాబా బోధించరు, నేర్చుకొనేలా చేస్తారు". అదే బాబా "దివ్య గీతాబోధ".

# నివేదనతో తీరిన వేదన

ఇక్కుర్తి శారద
గృహిణి, తిరుపతి
జన్మించిన సం॥ 1962

తిరుపతి, మార్చి 2002

ప్రఖ్యాత హిందీ సినిమా 'శిరిడీ కే సాయిబాబా' చూసి ప్రభావితం చెంది మొదటిసారి 1989లో నేను మా కుటుంబంతో కలిసి శిరిడీ వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాను. అప్పటి నుండి తిరుపతిలోని బాబా మందిరానికి వెళుతుండేవాళ్ళం. ఆ విధంగా బాబా మా జీవితాలలో ప్రవేశించారు.

మా వారు కార్పొరేషన్ మీటింగ్‌కని హైదరాబాద్ వెళ్ళినప్పుడు అక్కడ వారి సహోద్యోగులైన నారాయణరావుగారిని, భానుమూర్తిగారిని కలవడం జరిగింది. వారి ద్వారా 'సాయిపథం' మాసపత్రిక గురించి తెలుసుకొని వెంటనే దానికి చందా కట్టారు. ఆ పత్రిక మా ఇంటిల్లిపాదికీ ఎంతో నచ్చింది. ముఖ్యంగా సాయినాథుని శరత్‌బాబూజీ గారి వ్యాసాలు! సాయిబాబా గురించి తెలుసుకునేందుకు ఆ వ్యాసాలు ఎంతో దోహదపడ్డాయి.

1992లో గురువుగారు తిరుమలకు వచ్చారు. మా వారు గురువుగారి వద్దకు వెళుతూ, వారితో పాటు వచ్చిన నారాయణరావుగారు తదితరులకు ఇంటి నుండి ఫలహారం చేయించి తీసుకెళ్ళారు. త్వరగా వంట కూడా చేసేస్తే భోజనం పట్టుకెళ్తానని చెప్పారు. మామూలుగా వంట చేయడం నాకు ఇష్టమైన పనే. కానీ ఆ రోజెందుకో ఒంట్లో నలతగా ఉండడం మూలాన ఇంతమందికిలా హఠాత్తుగా చేయమంటే ఎట్లా అని విసుక్కున్నాను. మా వారు చెప్పి వెళ్ళారు కనుక తప్పనిసరై చిరాకుపడుతూనే మూడు నాలుగు రకాల వంటకాలు చేసి క్యారేజీలలో సర్ది పంపించాను.

ఆ సాయంకాలం మా వారు వచ్చి నారాయణరావుగారు ఇక ఇంటి దగ్గర్నుండి ఏమీ తీసుకొని రావద్దన్నారని చెప్పారు. అది వినగానే నాకు చాలా బాధ కలిగింది. గురువుగారిలా ఎందుకు వద్దని ఉంటారో అర్థమయింది. నేనెంత పొరపాటు చేశానో కూడా తెలిసి వచ్చింది. గురువుగారికి, గురుబంధువులకు చేసే ఏ పనైనా మనస్ఫూర్తిగా సంతోషంగా వారికి నచ్చేట్లు చేయాలి కానీ అయిష్టంతో నసుగుతూ చేయకూడదన్న విషయం బోధపడింది.

ఒక వారం తరువాత మా వారు మళ్ళీ ఒకరోజు "గురువుగారికి భోజనం తయారుచేసి తీసుకెళ్దాము" అన్నారు. ఆ అవకాశం కోసమే ప్రార్థిస్తున్న నేను ఆ మాట వినగానే సంతోషపడ్డాను. గురువుగారికి ఇష్టమయ్యే రీతిలో వంటలు కుదరాలి అని బాబాను, గురువుగారిని ప్రార్థించుకొని శ్రద్ధగా చేశాను. వంట పూర్తయ్యాక క్యారేజీలో పెట్టుకొని నేను, మా వారు కొండపైకి వెళ్ళాము. టైమ్ అప్పటికే ఒంటి గంట అవుతూంది. గురువుగారి భోజనానికి ఆలస్యం అవుతుందేమోనని కంగారు పడుతూ వెళ్ళాము. అప్పటికి గురువుగారు ఇంకా భోంచేయలేదు. వారికి వడ్డన చేసే భాగ్యం నాకు కలిగింది. గురువుగారు భోజనం చేసి "కూరలన్నీ బాగున్నాయి" అనడంతో అన్ని రోజులుగా నేను పడుతున్న హృదయవేదనంతా తీరిపోయినట్లైంది. చేసే పని ఏదయినా సరే శ్రద్ధగా, మనస్ఫూర్తిగా చేయడం గురువుగారికి ఇష్టమని ఆ రోజు నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

***భక్తుడు:*** *సద్గురువు యాక్టివ్ మిర్రర్ వంటి వారు అని మీరు చెప్తున్నారు. దాని అర్థం ఏమిటి?*

***గురువుగారు:*** *అద్దం కేవలం నువ్వు ఎలా ఉన్నావో దాన్నే చూపించగలదు. యాక్టివ్ మిర్రర్ నిన్ను నీకు చూపించడమే కాకుండా నీ తప్పులను సరిచేయడానికి కూడా ప్రయత్నిస్తుంది. అందుకే దానిని యాక్టివ్ మిర్రర్ అనేది. అది కేవలం "నువ్వు వికారంగా ఉన్నావు, మురికిగా ఉన్నావు" అని చెప్పటమే కాకుండా నిన్ను అందంగానూ, శుభ్రంగానూ మార్చడానికి ప్రయత్నిస్తుంది. నీలో పరివర్తన తీసుకొని రావటానికి ప్రయత్నిస్తుంది.*

***భక్తుడు:*** *సద్గురువు అలా చేయడం వెనుక వారి ఉద్దేశ్యం (మోటివేషన్) ఏమై ఉంటుంది?*

***గురువుగారు:*** *ఎందుకంటే వారు నీలోని మచ్చ కూడా తనలోని మచ్చగా భావిస్తారు. కాబట్టి సద్గురువు వైపు నుండి చూస్తే అది ఆయనను ఆయన శుభ్రపరచుకోవడమే! ఆయన నిన్ను తన నుండి వేరుగా చూడరు. తనలో ఒక భాగంగానే చూస్తారు.*

# సాయి ఊసే - సాయి ధ్యాసే

ఇవాన్ వయర్
మెడిటేషన్ టీచర్, స్విట్జర్లాండ్
జన్మించిన సం॥ 1959

శిరిడీ, జూలై 2003

1993లో నేను, నా భర్త కార్లోస్ గురువుగారిని మొదటిసారి తిరువణ్ణామలైలో కలిశాము. మేము వారి ప్రక్క కాటేజీలో ఉండేవాళ్ళం. గురువుగారు రోజూ సాయంత్రం సత్సంగం చేసేవారు. మేమూ వెళ్ళి అందరితో పాటు కూర్చునేవాళ్ళం. అలా రెండు రోజులు గడిచాయి. మూడవరోజు మేము వెళ్ళగానే, నారాయణరావుగారు మాతో "ఈ రోజు సత్సంగం ఉండదు. గురువుగారు గిరి ప్రదక్షిణకు బయలుదేరబోతున్నారు" అని చెప్పారు.

"మేమూ రావచ్చా" అనడిగాము. "రావచ్చు. కానీ మీరు ఇప్పుడే బయల్దేరడం మంచిది. గురువుగారు చాలా వేగంగా నడుస్తారు. మనం దారిలో కలుసుకోవచ్చు" అన్నారు ఆయన.

మేము గిరిప్రదక్షిణకు సిద్ధమయ్యాము. కార్లోస్ కాళ్ళకు చెప్పులు వేసుకొని బయలుదేరుతుంటే నేనభ్యంతరం చెప్పాను. "మనం స్వామీజీతో కలిసి (గురూజీని కలిసిన తొలిదినాలలో మేమలాగే పిలిచేవారము) వెళుతున్నాము. స్వామీజీ, వారితో ఉన్న భక్తులందరూ మనం చెప్పులు వేసుకొని ప్రదక్షిణ చేస్తుంటే ఏమనుకుంటారు? వాళ్ళెంతో పవిత్రంగా చూసుకొనే ప్రదేశం కదా ఇది" అన్నాను.

చెప్పులు లేకుండా పద్నాలుగు కిలోమీటర్లు నడవడమా? తన వలన అసలు వీలయ్యే పని కాదన్నాడు కార్లోస్. చివరకు ఎలాగో నేను బ్రతిమలాడటంతో ఒప్పుకున్నాడు. చెప్పులు లేకుండా నడవడం అలవాటు లేనందున, మేమిద్దరం ఎంతో కష్టం మీద నడుస్తున్నాము.

కొద్దిసేపటికి గురువుగారు మమ్మల్ని కలుసుకున్నారు. ఎంతో వేగంగా ఉన్న వారి నడక దూరం నుండి చూస్తుంటే వారు గాలిలో తేలుతున్నట్లే ఉంది.

మేమిద్దరం చెప్పులు లేకుండా నడవడం చూచి "*చెప్పులెందుకు వేసుకోలేదు మీరు? గిరిప్రదక్షిణ చెప్పులు వేసుకోకుండా చేయడం చాలా మంచిది. అయితే, చెప్పుల్లేకుండా నడవడం మీకు బాగా కష్టంగా ఉంటుంది కదా. ఇట్లా నడిచి ఏం*

లాభం? అడుగడుక్కీ మీ ధ్యాసంతా పాదాలమీదే ఉంటుందిగానీ అరుణాచలం మీద ఏం ధ్యాస ఉంటుంది?" అన్నారు.

అలా గురువుగారి దగ్గర నుండి మొట్టమొదట నేర్చుకొన్న ఆ పాఠం, ఆచార సాంప్రదాయాల పట్ల ఉన్న అభిప్రాయాలను మార్చుకొనేలా చేసింది. అట్లా అని గురువుగారు ఆచారసాంప్రదాయాలకు వ్యతిరేకి అని కాదు. అయితే ఆచారానికి, చాదస్తానికి ఉన్న తేడాని గమనించమంటారు. మనం ఏర్పరచుకున్న ఆచారాలు, సంప్రదాయాలు మనం చేస్తున్న పూజలు పునస్కారాలు ఇవన్నీ మన ధ్యానమూర్తి పట్ల ప్రేమను సుస్థిరం చేసేందుకు ఉపయోగపడాలిగాని దూరం చేసేందుకు కాదంటారు.

ఒకసారి గురువుగారి గదిలో పుస్తకాలు పెట్టేందుకని చక్కటి కేన్ అల్మైరాను తెచ్చారు. గురువుగారు దానిని అన్ని వైపుల నుండి చూసి, సొరుగులవీ సరిగా వస్తున్నాయా, లేదా అని పరీక్షించి సంతృప్తిగా తల ఊపారు. అటు ప్రక్కనే ఉండి గమనిస్తున్న నాతో "బాగుంది. నా బుక్స్, ఫైల్స్ దీనిలో సర్ది పెట్టు" అని చెప్పి ప్రక్క గదిలోకి వెళ్ళిపోయారు.

నేను అలాగేనని గురువుగారి పుస్తకాలన్నీ క్రమపద్ధతిలో సర్దుతున్నాను. అంతలో గురువుగారు తిరిగి గదిలోకొచ్చి "ఊదీ పెట్టావా దానికి?" అని అడిగారు.

ఆ ఆలోచనే రాని నేను తడబడుతూ మెల్లగా "లేదు" అన్నాను.

నా సమాధానానికి వారు విస్మయంగా చూశారు నన్ను. "ఊదీ పెట్టలేదా? క్రొత్త వస్తువుకు బాబా ఊదీ పెట్టకుండా ఎట్లా వాడుకుంటాము?" అంటూ నా వంక చూసి లోపలికి వెళ్ళిపోయారు. ఆ సమయంలో గురువుగారి ముఖంలో కనిపించిన భావాలు మాత్రం నేనెప్పటికీ మర్చిపోలేను. వెంటనే షెల్ఫ్‌లోంచి సర్దిన పుస్తకాలన్నీ బయటకు తీసేసి, ముందు ఒక్కో అరకు బాబా ఊదీ పెట్టాను.

మామూలుగా నేను తెచ్చుకునే క్రొత్త వస్తువులకి ఊదీ పెట్టి వాడుకోమని గురువుగారు నాకెప్పుడూ చెప్పలేదు. కానీ ఆ రోజు నేను ఒక గొప్ప విషయాన్ని గుర్తించాను. గురువుగారికి సంబంధించినంతవరకు, ఏదైనా క్రొత్త వస్తువు బాబాకు సమర్పించకుండా, బాబాను స్మరించకుండా ఉపయోగించుకోవడమన్నది అసలు ఊహించలేని విషయమే!

గురువుగారి ఇంటికి ఏ క్రొత్త వస్తువు కొనుక్కొని వచ్చినా, ఆఖరికి స్పూన్ అయినా, రుమాలైనా అది బాబా కృపతోనే లభించిందని బాబా ప్రసాదంగానే భావిస్తారు.

అట్లా అణువణువునా వారికి బాబా అనుగ్రహమే కనిపిస్తుంటుందన్నది అక్షర సత్యం. అంతేకాదు వారింటి పనుల్లో సహాయం చేసే భాగ్యం కలిగివున్నందున నేను ఒక అద్భుత విషయాన్ని గుర్తించాను. ప్రతి క్షణమూ, ప్రతి అనుభూతిలోనూ గురువుగారు బాబా స్మరణలోనే ఉంటారు. గదిలోనికి వెళ్ళేటప్పుడైనా, బయటకు వచ్చేటప్పుడైనా, పుస్తకం అందుకున్నా, మళ్ళీ దాన్ని యథాస్థానంలో పెట్టేస్తున్నా, కంప్యూటర్ ఆన్ చేసినా, మూసినా, భోంచేస్తున్నా, ఆఖరుకు కాఫీ గ్లాసు అందుకున్నా సరే "బాబా" అని తలవడమో, క్షణం కళ్ళు మూసుకోవడమో, నమస్కారమన్నట్లు హృదయాన్ని తాకడమో, ఏదో ఒక చర్య ద్వారా వారు బాబాను స్మరించనిదే ఏ పనీ చేయరు.

ఇట్లా అన్నింటా గురువుగారు– బాబాను స్మరించడం, ప్రతి దాన్ని బాబాకు సమర్పించే తీసుకోవడం, ఉచ్ఛ్వాసనిశ్వాసాలంత సహజాతిసహజంగా ఉంటుంది అనడం అతిశయోక్తి కాదు.

***గురువుగారు:*** *ఆయన (బాబా) పాదాలు తాకింది ఆ ధుని! అంటే ఏంటి? ఆయన పాదధూళి అక్కడుంది. మిగతావన్నీ తుడిచేశారు, చిమ్మేశారు, పోయినాయి కాని ఆ ధుని మాత్రం మెయిన్‌టెయిన్ అవుతూనే ఉంది. ఆయన పాదధూళి యొక్క స్పిరిట్ అది కంటిన్యూ చేస్తుంది. మనం పెట్టుకునేటువంటి ఊదీ, ఆయన పాదధూళి. మీరు అడిగారు, ఆ పాద ధూళినే బంగారంగా ఇస్తాను. అదీ మీ పట్ల నాకున్న ప్రేమకు వ్యక్తీకరణే.*

# ఎందుకొచ్చాము?

అద్దంకి మంగారావు
వ్యాపారస్థుడు, తెనాలి
జన్మించిన సం॥ 1959

తెనాలి, ఏప్రిల్ 2001

ఒకసారి శిరిడీలో ఉండగా ఒక గురుబంధువుతో మాట్లాడుతూ అతని విషయంలో నేనొక సలహా ఇచ్చాను. దానికి అతను నాతో మాట్లాడిన తీరు నాకు బాధను కలిగించింది. ఈ విషయమే మరొక గురుబంధువుతో అంటే అతను "గురువుగారికి ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవడం ఇష్టముండదు. మనం శిరిడీ ఎందుకొచ్చాము? బాబా సాన్నిధ్యాన్ని మరింతగా పొందేందుకు. ఇక్కడ ఉన్నన్ని రోజులైనా మాటలు తగ్గించుకుని బాబా ఊసులోనే గడపమంటారు" అని అన్నాడు.

ఆ మాటలతో లోనుండి నన్నెవరో ఛెళ్ళున చరిచినట్లయింది. ఆ మాటలు అంటున్నది ఆ గురుబంధువు కాదు గురువుగారే నేరుగా చెబుతున్నట్లనిపించింది. పరోక్షంగానైనా వచ్చిన ఆ గురుబోధను నేనెన్నటికీ మరువలేను.

***భక్తుడు:*** *సాయిపథంలో మేం ఎట్లా ఉంటే మీకిష్టం సార్? జీవితంలోగాని, సత్సంగంలో గాని...*

***గురువుగారు:*** *సాయిపథమంటే బాబా చుట్టూ, బాబానాధారం చేసుకుని, బాబా కేంద్రంగా మన మనస్సు, హృదయం, ఎమోషన్స్ అల్లుకున్నటువంటి పథం (a way). సాయిపథం అంటే కూర్చొని భజన చేయడం, లేకపోతే నామం చేసుకోవటం, పారాయణ చేసుకోవటం, లేకపోతే లాంగ్ వీకెండ్ సత్సంగాలు చేసుకోవటం మాత్రమే కాదు. మనం ఏం చేసినా, ఏ పని చేసినా ఆ వేసేటటువంటి ప్రతి అడుగు బాబా వైపుకు వేయాలి. ఏ రకంగా వేస్తే బాబా వైపుకు చేరుతామో అది 'సాయిపథం'. అది మన జీవితంలో ఒక భాగం కావటం కాదు, మన జీవితమే దాంట్లో భాగం కావాలి. మనం ఏ పని చేసినా, ఏ ఆలోచన చేసినా అది సోకాల్డ్ ప్రాపంచికం కావచ్చు, ఆధ్యాత్మికం కావచ్చు ఏదయినా సరే బాబాను కేంద్రంగా చేసుకొనుండాలి. అదీ సాయిపథమంటే!*

ఇంకా ఎలా ఉండాలనంటే, ఇప్పుడు మనం ఈ సముద్రం దగ్గర కూర్చొని ఉన్నాం. సముద్ర ఘోష మనకి వినిపిస్తూనే ఉంటుంది కంటిన్యుయస్‌గా. కాని నేను మాట్లాడినంతవరకు నా మాటలు మీరు వింటున్నారు. నా మాటలు ఆపగానే సముద్ర ఘోష వినిపిస్తుంది. అలల శబ్దం వినిపిస్తుంది. మళ్ళా నేను మాట్లాడటం మొదలు పెట్టగానే నా మాటలు వినిపిస్తాయి. బాబా యొక్క స్ఫురణ ఆ సముద్రఘోషలాగా ఉంటే, మనం చేసే ఉద్యోగమూ, మన నిత్య జీవితంలో మనకు ఉండేటువంటి ఫ్యామిలీ వ్యవహారాలు ఇవన్నీ కూడాను నేను మాట్లాడే మాటల్లాగా ఉండాలి. ఇటు వ్యవహారం చేస్తాము. వ్యవహారం చేసి ఆగగానే (ఆ సముద్ర ఘోష వినబడినట్లుగా) మనసు బాబా స్మరణ మీద నిలిచిపోవాలి. అది సరియైన పంథా.

# గుంట త్రవ్వి గుంట పూడ్చు

వెంకట రాజు
హోటల్ ఓనర్, శిరిడీ
జన్మించిన సం॥ 1952

శిరిడీ, జూలై 2004

నాకు మా నాన్నగారు మూడు ఎకరాలు, మా మామగారు రెండు ఎకరాలు పొలం ఇచ్చారు. వ్యవసాయం చేసి నేను మరో మూడున్నర ఎకరాలు కొన్నాను.

ఏ ఒడిదుడుకులు లేకుండా జీవితం హాయిగా సాగిపోతూ ఉంది. 1993లో నా పొలాలకు చుట్టుప్రక్కల పొలాలన్నీ రొయ్యల చెరువులుగా మార్చేశారు. నా పొలాలకు నీరు వచ్చే దారి లేకపోయింది. పోనీ నేను అమ్మేద్దామంటే మంచి ధర రాలేదు. ఇక వేస్తే నేనూ రొయ్యల చెరువులే వేయాలి. అందుకే నేనూ నా పొలాన్ని రొయ్యల చెరువులుగా మార్చాను. మొదట చాలా పెట్టుబడి అవసరమైంది. అప్పులు చేశాను. 1994లో చుట్టుప్రక్కల వారి చెరువులన్నీ పోయాయి. నాకు మాత్రం ఎనిమిదిన్నర లక్షలు వచ్చాయి. అసలు వడ్డీలతో సహా అప్పులన్నీ తీర్చేశాను. మరుసటి సంవత్సరం లాభం రాకపోగా తర్వాత మూడేళ్ళు వరుసగా నష్టాలే వచ్చాయి. అప్పులు పెరిగిపోయాయి. అప్పుల వాళ్ళ ఒత్తిడీ ఎక్కువయింది.

నేను మంగళగిరి రాధాకృష్ణగారి ద్వారా మొదటిసారి గురువుగారి గురించి విన్నాను. శిరిడీ వెళ్ళి గురువుగారికి నా పరిస్థితులన్నీ చెప్పుకున్నాను.

"ఇంక రొయ్యల చెరువులు వేయకండి" అన్నారు గురువుగారు.

"నా అప్పులన్నీ తీరాలంటే వేయాల్సిందేనండి. ఇక వేరే దారి లేదు నాకు" అన్నాను. సద్గురువు హితవు చెప్తున్నా, మన సొంత తెలివి దాన్ని విననివ్వదు కాబోలు. శిరిడీ నుండి వచ్చిన తరువాత కూడా రొయ్యల చెరువులు వేశాను. ఆ సంవత్సరమూ నష్టమే వచ్చింది. అప్పటికి మొత్తం పాతిక లక్షల రూపాయల అప్పులు తేలాయి. అంత అప్పు ఎలా తీర్చడం? నాకేది దారి? మరణం తప్ప మరో మార్గం లేదనే నిర్ణయానికి వచ్చాను.

చివరగా ఒకసారి బాబాను, గురువుగారిని దర్శించుకోవాలనిపించి శిరిడీ వెళ్ళాను. గురువుగారిని చూడగానే ఏదో ధైర్యమూ, ఆశ. వారితో అంతా వివరంగా చెప్పి "పొలం అమ్మేయమంటారా?" అని అడిగాను.

"ప్రస్తుతానికి వద్దు" అన్నారు. మరుసటి సంవత్సరం పొలం అమ్మి, వచ్చినంత వరకు అప్పుల వాళ్ళకు ఇచ్చేయమన్నారు.

1997 గురుపూర్ణిమ నాటికి ఊర్లో నా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దగ్గర బంధువులు కూడా మొహం చాటేయసాగారు. ఇక ఊర్లో తలెత్తుకొని తిరగలేకపోయాను. డిసెంబర్ నెల వచ్చేసరికి ఇక ఊర్లో ఉండడం దుర్భరమనిపించి, నేను మా కుటుంబంతో సహా శిరిడీ వచ్చాను. గురువుగారు శిరిడీలో ఉన్నంతకాలం వారి సన్నిధిలో గడిపి, మరల ఊరికెళ్ళి ఆత్మహత్య చేసుకోవాలని మా ఆలోచన. ఆ సన్నిధి ప్రభావం వలన ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన క్రమంగా పోయింది. మేము అక్కడ నెలరోజులున్న తర్వాత గురువుగారు ఊరికి బయల్దేరుతున్నారని తెలిసింది. అందరితోపాటు మేమూ దర్శనానికి వెళ్ళాం.

గురువుగారి ముందు కూర్చోగానే "ఏం చేస్తున్నావు?" అని అడిగారు. ఘనంగా ఉంటుందని "పారాయణ" చేస్తున్నానన్నాను.

వెంటనే గురువుగారు "అవన్నీ నేను చూసుకొంటాను. నీవు పని చెయ్యి. సమస్యలు వాటంతటవే సమసిపోతాయి. ఏ పనీ లేకపోతే *గుంట తీస్తుండు. దానిని పూడుస్తుండు. ఖాళీగా మాత్రం ఉండవద్దు. మిగతా వాళ్ళందరూ హాయిగా తలా ఒక పని చేస్తుంటే నీవు మాత్రం అల్లుడిలాగా వచ్చి పోతున్నావ్*" అన్నారు. ఆనాటి నుండి గార్డెన్‌లో పనిచేయసాగాను.

ఏడాది తరువాత పొలం అమ్ముదామని ఊరికి వెళ్ళాను. ఎకరా రెండు లక్షల రేటు ఉంటే లక్షన్నరకి అడిగారు. శిరిడీ వచ్చేసి గురువుగారితో చెప్పాను. వారి ఆశీర్వాదం తీసుకుని వెళితే నేననుకొన్న రేటు అంటే పదహారు లక్షలు వచ్చాయి. నేను మా బావమరిదికే రెండు లక్షల పదివేలివ్వాలి. అదిగాక, మిగిలిన వారికి పదహారు లక్షలకు సెటిల్‌మెంటు చేసి శిరిడీ చేరుకున్నాను.

దాంతో మా ఊరితో నాకు ఋణం తీరిపోయిందనుకున్నాను. శిరిడీలో గురువుగారి వద్దే ఉన్నాను. ఆశ్రమంలోనే నేనూ, మా ఆవిడ ఏదో ఒక పనిచేస్తుండే వాళ్ళం. నా భార్యని, పిల్లల్ని అమ్మగారు ఎంతో ప్రేమగా ఆదరించారు. గురువుగారు మమ్మల్ని రోజూ మందిరానికి వెళ్ళి గురుస్థాన్‌లో ప్రదక్షిణలు చేయమని చెప్పారు.

మేము ఎప్పుడు ఊదీ దర్శనానికి వెళ్ళినా, మమ్మల్ని చూడగానే "ప్రదక్షిణలు చేస్తున్నారా?" అని అడిగేవారు గురువుగారు.

కొన్నాళ్ళ తరువాత జీవనోపాధికై ఏం చేయమంటారు? అని అడిగితే "మెస్ పెట్టండి" అన్నారు గురువుగారు. నాకెందుకో ఆ పని అవమానంగా తోచింది. అలాగే ఒకటిన్నర సంవత్సరం గడిచిపోయింది.

మరోసారి వారి దర్శనమప్పుడు గురువుగారు "నేను చెప్పినట్లు చేయండి. మీరేపని చేస్తున్నా లాక్కొచ్చేది నేను. మిమ్మల్ని మళ్ళీ నలుగురిలో తలెత్తుకొని తిరిగేలా చేస్తాను" అన్నారు.

వారికి నాపై ఎంత ప్రేమ ఉంటే ఆ మాట అంటారు? వారలా అన్న తర్వాత కూడా ఊరకుంటే లాభం లేదు. అన్నీ గురువుగారు చూసుకొనేటప్పుడు ఇంక మన తెలివితేటలతో పని ఏముంది? చివరకు వారు చెప్పినట్లుగానే శిరిడీలోనే హోటల్ పెట్టదలుచుకున్నాను. వెంటనే నారాయణ్‌బాబా ఆశ్రమంలో హోటల్ పెట్టాను. హోటల్‌కు పెట్టుబడి మా బావమరిది, మరికొందరు గురుబంధువులు సర్దారు.

ఏడాది పూర్తయ్యేసరికి అప్పులు తీర్చి కొంత డబ్బును మిగిల్చాను కూడా. ఆ విషయం గురువుగారితో చెపితే "అప్పుడేదో సెటిల్‌మెంట్ అయిపోయిందని అప్పులు పూర్తిగా చెల్లించకుండా ఉండొద్దు. ఎవరికివ్వాల్సినవి వాళ్ళకిచ్చేయండి. అప్పుడు ఇంకా బాగుంటుంది" అన్నారు.

మా ఊరికి వెళ్ళి మా బావమరిదికి, మరికొంతమందికి ఇవ్వవలసినవన్నీ ఇచ్చేశాను. అట్లా ఏటా కొందరికి ఇచ్చేస్తున్నాను. ఒక్కోసారి నేను డబ్బివ్వాల్సిన వాళ్ళు ఊరిలో లేకనో మరే ఇతర కారణాల వల్లనో కలవలేకపోయానండి అని వచ్చి గురువుగారితో చెపితే "వాళ్ళ డబ్బు వాళ్ళ కోసం ప్రక్కన పెట్టేయండి" అని చెప్పారు.

ఈ విధంగా ఒకసారి సెటిల్‌మెంట్ అయిపోయిన తరువాత కూడా ఇవ్వాల్సిన వాళ్ళందరి ఇళ్ళకు వెళ్ళి మరలా ఇస్తుంటే ఊరిలోని వారందరూ విడ్డూరపడసాగారు.

"ఇదేమిటి వింతగా ఉందే?" అన్నవారితో "మా గురువుగారు ఇచ్చేయమన్నారు. ఎవరికీ ఋణశేషం ఉండకూడదని చెప్తారు వారు" అని గురువుగారి గురించిన వివరాలు చెపుతుంటే "ఇలా కూడా బోధించేవారున్నారా? అయినా వందలు, వేలు కాదు లక్షలు. సెటిల్‌మెంట్ తర్వాత కూడా ఇవ్వమంటున్నారా?" అని వాళ్ళందరూ విస్తుపోయారు.

కొంతమంది "సంపాదించి ఇట్లా ఇచ్చేస్తుంటే నీకు, నీ పిల్లలకు ఎట్లా?" అని నన్ను అడిగారు.

నేను ఒకసారి గురువుగారితో వాళ్ళన్న మాటలే చెప్తే "మిమ్మల్ని, మీ పిల్లల్ని బాబా చూసుకోరా? ఇంతవరకూ ఇన్ని ఇచ్చినాయనే ఇకపైనా చూసుకొంటారు" అని అభయమిచ్చారు గురువుగారు.

ప్రస్తుతం ఒక్క రూపాయి కూడా అప్పు లేకుండా మొత్తం అంతా తీర్చేశాను. ఒకప్పుడు ఏ ఊర్లో అయితే నేను తలెత్తుకొని తిరగలేననుకున్నానో ఇప్పుడు అదే ఊర్లో సగౌరవంగా నడవగలుగుతున్నాను!

***భక్తుడు:*** *బాబా దగ్గరకు రాని వాళ్ళు కూడా మనకు ఆనందంగా ఉన్నట్టుగానే కనపడతారు. వాళ్ళు పొందుతున్న ఆనందానికి, మనం బాబా దగ్గర పొందుతున్న ఆనందానికి ఏమన్నా తేడా ఉందా?*

***గురువుగారు:*** *ఆనందం అనేది సబ్జెక్టివ్. ఎవరికి వాళ్ళు చెప్పాల్సిందే. బయట ఆ సోకాల్డ్ ఆనందం పొందుతున్నామని అనుకునేటటువంటి వాళ్ళు, అది పోయి బాబా దగ్గరకు వచ్చి, మళ్ళా ఇక్కడ ఆనందం పొందినప్పుడు – అప్పుడు వాళ్ళే చెబుతారు తేడా ఏమిటో!*

*మామూలుగా ఉండేటువంటి ఆనందంలో హ్యాపీనెస్, దుఃఖము లేకపోవడం ఒక ప్లెజర్ సెన్సేషన్ ఉంటుంది తప్పితే, ఒకదాని పట్ల ప్రేమ, తన్ను తాను మర్చిపోవడం, సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ– ఇవి మూడు అక్కడ మిస్ అవుతాయి. బ్యాంక్‌లో ఉండేటువంటి ఏ కోటి రూపాయలో సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ క్రింద పని చేస్తుంటుంది అక్కడ. అది ఎప్పుడైనా ఏమైనా కావచ్చు. షేర్ మార్కెట్ పడిపోవచ్చు. వాడి భద్రతాభావం అప్పుడు పోతుంది. కాని ఇది పోయే సెక్యూరిటీ కాదు. అక్కడ ఏముంది, నీవు పెట్టినటువంటి డబ్బులవి. ఇక్కడ అలా కాదు బాబా ఇచ్చినటువంటిది. ఇక్కడ అక్కడుండే ఆనందమూ ప్లస్ ప్రేమ, సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ ఉంటాయి. ఈ రెండూ ఉన్నాయి చూశావా అవి మాత్రము బయట వాళ్ళకు రావు. ఆ తేడా మాత్రము మనకి, వాళ్ళకి ఉంటుంది.*



# స్వప్నాలలో 'సత్' దర్శనం

## ఏమడిగినా...

శాఖమూరి సీతారావమ్మ
గృహిణి, బుర్రిపాలెం
జన్మించిన సం॥ 1933

బుర్రిపాలెం, జూలై 2001

నేను శిరిడీ వెళ్ళినప్పుడు "సాయిపథం"లో గురువుగారిని దర్శించుకున్నాను. అప్పటినుండి నా మనసుకెంతో ప్రశాంతంగా తోచి, వారి ఫోటో పెట్టుకుని ఇంట్లో నిత్యం పూజించుకోసాగాను. ఒకసారి మా ఇంట్లో బియ్యం నిండుకొన్నాయి. కొందామంటే సమయానికి డబ్బు అందలేదు. నిస్సహాయంగా అనిపించి గురువుగారి ఫోటో వద్ద నా బాధ చెప్పుకున్నాను. ఆ రోజు రాత్రి నాకొక వింత కల వచ్చింది. ఆ కలలో "ఇంట్లో ఉన్న గురువుగారి ఫోటోలో నుండి గురువుగారు బయటకు వచ్చి పాతిక కిలోల బియ్యం సంచి అలమారులో పెట్టి మళ్ళీ ఫోటోలోకి వెళ్ళిపోయారు".

మరునాటి ఉదయం ఎప్పుడో కాస్త ముఖపరిచయం ఉన్న ఒక అబ్బాయి నా దగ్గరకొచ్చి "నేను బియ్యం వ్యాపారం చేస్తున్నాను. మీకు కావాలంటే చెప్పండి, బియ్యం పంపిస్తాను" అన్నాడు.

నేను పంపించమని చెప్పాను. ఏదో మాటవరసకి అడిగాడు కానీ అతనేం పంపిస్తాడులే అనుకున్నాను. కానీ అతను ఆ రోజే పాతిక కిలోల బియ్యం బస్తా తెచ్చి, ఇంట్లో పెట్టి "డబ్బు తర్వాత ఇద్దురులెండి" అని వెళ్ళిపోయాడు.

రాత్రి గురువుగారు కలలో కనిపించి ఇచ్చినంత బియ్యమే తెచ్చివ్వడమేమిటి? అదీ డబ్బు తీసుకోకుండా పంపించడమేమిటి? నాకు వింతగా అనిపించింది.

బియ్యం లేవని నేను ప్రార్థించగానే, మరునాడే అవి నాకు అందేలా చేశారంటే గురువుగారి భక్తవాత్సల్యతను ఏమని పొగడగలం? ఆ రోజు నుండి చిన్నదైనా, పెద్దదైనా నా ప్రతి సమస్య, ప్రతి ఆలోచన గురువుగారి ఫోటో వద్ద చెప్పుకోవడం, వెంటనే అది పరిష్కారమవడం జరుగుతున్నాయి. నా వరకు మా ఇంట్లో ఉన్నది గురువుగారి ఫోటో కాదు సాక్షాత్తు గురువుగారే!

## దయాజలధి

తాతావర్తి శ్రీనివాస గురు ప్రసాద్ గుప్తా
కాంట్రాక్టర్, ఖమ్మం
జన్మించిన సం॥ 1966

ఖమ్మం, నవంబర్ 2000

నేను సివిల్ ఇంజనీర్‌గా ఒక కంపెనీలో పనిచేస్తుండేవాడిని. సీనియర్ ఇంజనీర్‌గా ప్రమోషన్ వచ్చిన తర్వాత, నాకూ ఒక స్వంత కంపెనీ ప్రారంభించాలన్న ఆలోచన కలిగింది. అప్పుడే మా చెల్లెలి వాళ్ళ కుటుంబంతో కలసి నేను శిరిడీ వెళ్ళడం జరిగింది. గురువుగారికి నమస్కరించుకుని, నా ఆలోచన వారికి విన్నవించుకున్నాను. వారు ఆశీర్వదించారు.

నేను మొదటి కాంట్రాక్టు పని మొదలుపెట్టగానే పెద్ద సమస్య వచ్చింది. భూమిలో పునాదులకని త్రవ్విన చోట నీరు అమితంగా ఊరసాగింది. మోటారు పెట్టి ఎన్ని నీళ్ళు తోడించినా నీటి ఊట ఏ మాత్రం తగ్గలేదు. దాంతో పని ఆపివేయవలసి వచ్చింది. ఎలాగైనా ఈ సమస్యను పరిష్కరించమని గురువుగారిని ప్రార్థించాను. ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందామని పడుకున్నాను. అప్పుడో కల వచ్చింది. కలలో గురువుగారు కనిపించి *"దాహంగా ఉంది. మంచినీళ్ళు కావాలి"* అని అడిగారు.

నా భార్య వారికి గ్లాసుతో మంచినీళ్ళు ఇచ్చింది. అంతలో నాకు మెలకువ వచ్చింది. వెంటనే నాకు కలలో గురువుగారు కనిపించిన విషయం ఆనందంతో ఇంట్లో అందరికీ చెప్పాను. ఇది జరిగిన మరునాడే పునాదులలో నీరు ఊరడం తగ్గిపోయింది. ఆ పైన పని ఎంతో చురుగ్గా, వేగంగా సాగింది. మోటార్లతో తోడించినా ఆగని నీటిని, గ్లాసెడు నీరుగా మార్చి, తాను సేవించి నా సమస్యను తొలగించారు. దయాజలధి గురుదేవులు.

***భక్తుడు:*** *గురువుగారూ! కొన్నిసార్లు నాకు మిమ్మల్ని కలిసినట్లుగా, మాట్లాడుతున్నట్లుగా కలలొస్తుంటాయి. అవి నిజమేనా?*

***గురువుగారు:*** *ఇప్పుడు నువ్వు మాట్లాడుతున్నావు. ఇది కలా? నిజమా?*

***భక్తుడు:*** *ఇది నిజంగానే ఫీల్ అవుతున్నాను.*

***గురువుగారు:*** *ఇది నిజమైతే అది కూడా నిజమే. ఇది నిజం కాకపోతే అది కూడా నిజం కాదు. అయితే కలలను విశ్లేషించడానికి ప్రయత్నించవద్దు.*

***భక్తుడు:*** *సద్గురువు కలలో కనిపిస్తే, అది దర్శనమా లేక మామూలు కలా అనేది ఎలా తెలుస్తుంది?*

***గురువుగారు:*** *ఆ కల వలన నీకు కలిగే అనుభవం. చాలా ఆనందంగా, శరీరం తేలికైపోయినట్లుగా ఉంటుంది. ముఖ్యంగా వాళ్ళు మోస్తున్న బరువేదో దింపివేయబడి గొప్ప రిలీఫ్ పొందినట్లుగా అనిపిస్తుంది. దాని వలన చెప్పలేని ఆనందమేదో కలుగుతుంది. అది కొన్ని గంటలే ఉండొచ్చు, ఒక రోజు లేదా ఒక వారం కూడా ఉండొచ్చు. కానీ కల వలన అటువంటి అనుభవం కలిగితే, అది దర్శనమివ్వడమే! అది ఆధ్యాత్మిక అనుభవం.*

# ఏదీ అసంభవం కాదు

ఎ. గౌతమ్
కాలేజీ స్టూడెంట్, పిలాని
జన్మించిన సం॥

పాండిచ్చేరి, జనవరి 2004

2000వ సంవత్సరంలో నేను ట్వెల్త్ స్టాండర్డ్‌లో ఉన్నప్పుడు, మా బంధువు ఇచ్చిన సాయిసచ్చరిత్ర చదివి నేను మొదటిసారిగా బాబా గురించి తెలుసుకున్నాను.

12వ తరగతి జీవితంలోనే ఎంతో ముఖ్యమైన దశ. కానీ నా చదువు అంత బాగా సాగేది కాదు. నేను శ్రద్ధాభక్తులతో సచ్చరిత్ర పారాయణ చేయడం మొదలుపెట్టి శ్రీసాయిబాబా శరణు కోరాను. ఇక ఒకదాని తరువాత ఒకటిగా నా సమస్యలన్నీ తొలగిపోయాయి. అప్పటి నుండి ఇప్పటి వరకు శ్రీసాయిసచ్చరిత్ర నాకెంతో స్థైర్యాన్ని, సంతోషాన్ని ఇస్తూ ఉంది.

12వ తరగతి బోర్డు పరీక్షలు దగ్గరకి వచ్చాయి. పరీక్షల సమయంలో బాబా ఊదీని నీటితో కలిపి సేవించేవాడిని. నాకున్న ఆందోళనలకు, భయాలకు అది ఎంతో గొప్ప మందులా పని చేసింది. బాబా పట్ల ఉన్న నమ్మకం వలన వారి రక్షణ నాకు సదా అనుభవమయ్యేది.

పరీక్షలు అయిపోయాయి. మొదట నుండి బిట్స్ పిలానిలో చదవాలని తీవ్రమైన కోరిక ఉండేది. బాబా దయ వలన నాకు ట్వెల్త్ స్టాండర్డ్‌లో 1200కు 1166 మార్కులు రావడంతో బిట్స్‌లో ప్రవేశం దొరికింది. నాకు సివిల్ ఇంజనీరింగులో అడ్మిషను వచ్చింది. కానీ నాకు అది ఇష్టం లేదు. బాబా కృప వల్ల మళ్ళీ సివిల్ నుండి మెకానికల్ ఇంజినీరింగ్ సీటు వచ్చింది. నేను బిట్స్‌లో చేరాను.

2001లో గురుపూర్ణిమకు నేను మొదటిసారి శిరిడీ వెళ్ళాను. అప్పుడే పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ దర్శనమయింది. అయితే అప్పుడున్న భక్తజన సందోహం వలన నాకు శ్రీబాబూజీ పాదదర్శనం కాలేదు. కానీ సాయినాథుని దర్శనం అయ్యిందనే తృప్తితో నేను తిరిగి మా ఊరు వచ్చాను.

బిట్స్‌లో చేరడం వలన నా జీవితంలో ఒక పెద్ద పరీక్ష అధిగమించగలిగానని అనుకున్నాను. కానీ క్యాంపస్‌లో అడుగిడిన నాకు, మరింత క్లిష్టమైన పరీక్షలు ముందు ఉన్నాయని తర్వాత తెలిసింది. ఇల్లు వదిలి ఉండడం నాకదే మొదటిసారి. బిట్స్‌కు

నాతో మా నాన్నగారు వచ్చారు కనుక మొదట కొద్దిరోజులు బాగానే గడిచాయి. కానీ అక్కడ ర్యాగింగు భయం, ఇంటి మీద బెంగ, చదువు పరంగా అక్కడ ఉన్న క్లిష్టమైన పరిస్థితులు చాలా బాధించాయి. బాగా ఆలోచించి, నేను ఇక్కడ ఇమడలేనని, స్వంత ఊరిలోనే ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలో చేరుదామని నిర్ణయించుకున్నాను.

టి.సి. తీసుకుని తిరిగి వస్తుండగా శ్రీబాబూజీ నాకు ఒక దివ్యమైన అనుభవం ఇచ్చి నా జీవితాన్నే మార్చివేశారు. ట్రెయిన్‌లో పడుకుని ఉన్నాను. సాయంకాలం ఆరుగంటలయింది. ఆ మగతలో.. "నేనొక రోడ్డు మధ్యలో ఉన్నాను. రోడ్డుకి ఒక ప్రక్క బిట్స్ పిలాని గేటు ఉంది. రెండో వైపు పాండిచ్చేరిలో ఇంజినీరింగు కాలేజి గేటు ఉంది. నేను అర్థం కానట్లు చూస్తుండగా అక్కడ గురువుగారు ప్రత్యక్షమయ్యారు. నేను ఎటు వెళ్ళాలి అని వారిని అడిగాను. వారు నా చేయి పట్టుకొని బిట్స్ గేటు వైపు తీసుకొని వెళ్ళారు". అంతలో నాకు మెలకువ వచ్చింది. అప్పుడు నాకు కలిగిన సంతోషాన్ని మీరే ఊహించగలరు. వారం రోజులుగా నేను అనుభవించిన బాధ, భయాలు అన్నీ మటుమాయమయ్యాయి.

వెంటనే బిట్స్ అధికారులను ఫోను ద్వారా సంప్రదించాము. వారు నన్ను మళ్ళీ కాలేజీలో చేర్చుకోవడం వీలుకాదన్నారు. హతాశుణ్ణయ్యాను. వారం తరువాత మళ్ళీ ప్రయత్నించాము. ఈసారి డైరెక్టరుగారితో మాట్లాడాము. వారు మా విభాగం హెడ్స్‌తో సంప్రదించి కంప్యూటర్లో నా రికార్డు చూశారు. మామూలుగా ఏ విద్యార్థి అయినా వెళ్ళిపోగానే అతని రికార్డులు తొలగించబడతాయి. అద్భుతం! గురువుగారి అనుగ్రహం వలన నా రికార్డు ఇంకా నమోదు అయ్యే ఉంది. దానితో మళ్ళీ పిలానిలో చేరడానికి నాకు అనుమతినిచ్చారు. 25ఏళ్ళ వ్యవధిలో ఇలా సీటు వదిలి వెళ్ళిన విద్యార్థిని కాలేజీలో రీ-అడ్మిట్ చేయడం ఇది రెండవసారి అని తెలిసింది. గురువుగారి అనుగ్రహముంటే అసంభవమంటూ ఏమీ లేదని ఋజువైంది.

***భక్తుడు:*** *బాబా పట్ల ఇష్టం, ప్రేమ ఎలా పెంచుకోవాలి?*

***గురువుగారు:*** *మనకు ఒక వ్యక్తి పట్ల, ఒక వస్తువు పట్ల ఎట్లా ఇష్టం పెరుగుతుంది? ఇద్దరు వ్యక్తులు క్రొత్తగా పరిచయమయ్యారనుకొందాం. మొదట్లో వారి మధ్య ఏమీ ఉండదు. నాలుగు రోజులయ్యాక వారిద్దరి*

మధ్య అవగాహన పెరిగి ప్రాణస్నేహితులవుతారు. అది ఎట్లా డెవలప్ అయింది? మీరు ఇంట్లో ఉంటే రోజూ టి.వి. చూడకుండా ఉండలేరు. 15 రోజులు శిరిడీలో ఉన్నారనుకోండి. మొదటి రెండు రోజులు – ఆ సీరియల్ ఏమైందో, ఈ ప్రోగ్రామ్ ఏమైందో అని – మనసు పీకుతుంది. ఆ తరువాత మనసు ఇక వాటి జోలికి పోదు. అంటే, ఒక వ్యక్తి పట్ల గాని, ఒక వస్తువు పట్ల గాని ప్రేమ పుట్టడానికి సులువైన ఉపాయమేమిటంటే constant touch. దాన్నే సాన్నిధ్యం అంటారు. దాని పట్ల అవగాహన కలగాలి. అది మనకి మనమే కలిగించుకోవాలి, పెంచుకోవాలి.

బాబా పట్ల కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. మరి ఆయన అసలు (భౌతికంగా) లేరు కదా? ఎట్లా? దానికి మార్గాలేమిటి? బాబా చరిత్ర చదివామనుకో ఆయన గురించి తెలుస్తుంది. మనం మానసికంగా ఆయన సన్నిధిలో ఉన్నట్లు లెక్క. చదువుతూ, చదువుతూ పోగా ఆయన పట్ల ఇష్టం పెరుగుతుంది. అయితే అదో తంతుగా చేయకూడదు. పారాయణ లక్ష్యమేమిటి? బాబాతో సాన్నిధ్యాన్ని పెంచుకోవడం. మామూలుగా మనవాళ్ళు చేసే పొరపాటు ఎక్కడంటే, పారాయణ ఎందుకు చేస్తున్నాము అనేది మరచి ఒక తంతు క్రింద చేస్తారు. పది పేజీలు చదవాలి, ఐదు అధ్యాయాలు పారాయణ చెయ్యాలి అని ముందుగానే నిర్ణయం చేస్తారు. 40వ పేజీలో ప్రారంభించి 45వ పేజీలో వ్రేలు పెట్టి ఉంచుతాము. అక్కడదాకా చదవాలి కనుక పేజీ త్రిప్పడం, ఎన్ని పేజీలున్నాయో చూసుకోవడం. అంటే మన ధ్యాసంతా ఆ ఐదు పేజీలు పూర్తిచేయడానికి ఎంత సమయం పడుతుందో అనే దాని మీదే కాబట్టి.

బాబా చరిత్ర మనకిచ్చిందేమిటి?

ఆయన ఎందుకొచ్చారు?

ఎలా ఉండేవారు? ఎట్లా జీవించారు?

మనమడిగినవన్నీ ఎందుకు తీరుస్తున్నారు?

ఇలా మన కోరికలు తీర్చాలంటే ఆయన ఏ స్థితిలో ఉండి ఉండాలి?

ఆ స్థితిలో ఉండి – ఇలా ప్రాపంచికంగా ఎందుకు జీవించారు?

అట్లా జీవించడానికి వీలవుతుందా?

మన నుండి ఆయనేమి ఆశిస్తున్నారు?

మనం నమస్కారం పెడితే ఆయనకు ఒరిగేదేమిటి?

ఈ ప్రశ్నలన్నీ వేసుకోవాలి. ఈ ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. అదే పారాయణ అంటే! పై ప్రశ్నలకు ఈ పుస్తకంలో సమాధానం ఏమన్నా దొరుకుతుందా? ఒక్కసారికి దొరకదు. రెండవసారి చూస్తే దొరకదు. మూడవసారి చూసినా దొరకదు. దొరికే దాకా వదలి పెట్టకూడదు. అప్పుడేమవుతుంది? పుస్తకం పట్టుకొన్నప్పుడంతా అది మన అన్వేషణలో భాగమవుతుంది. చేసి చూడండి. నాలుగు రోజుల్లో బాబా పట్ల ఎలా ప్రీతి పెరుగుతుందో?

సచ్చరిత్ర చదివేటప్పుడు ఎప్పుడూ ఒకటి గుర్తుపెట్టుకోండి. ఆ భక్తుల అనుభవాలు చదివేటప్పుడు, వాళ్ళ స్థానంలో మనముంటే ఎలా ఉంటుందా అని! అది సరైన పద్ధతి. అప్పుడు ఆనాడు ఆ భక్తుడికి కలిగినటువంటి ఆ అనుభవం కొంత భాగమైనా మనకు వస్తుంది. ఆ అనుభవం, ఆ ఆనందం, ఆ సన్నిధి రావాలంటే, సచ్చరిత్ర చదివేటప్పుడు ఆ అనుభవం నాకే జరిగితే ఎలా ఉంటుంది అని ఆ క్యారెక్టర్‌లో దూరిపోండి. పరకాయ ప్రవేశం చెయ్యండి (నవ్వులు).

అసలు బాబా పట్ల ఇష్టం పెరగాలని మనం ఎందుకు ప్రయత్నం చేస్తున్నాం? ప్రేమ పెంచుకొనేందుకు ఏం చేస్తున్నాం? మీ పిల్లలున్నారు, పిల్లల మీద కూడా ఉదయం, సాయంత్రం ఒక గంటసేపు కూర్చుని మనసు లగ్నం చేయాలని, ఇష్టం పెరగాలని ప్రయత్నిస్తారా ఎవరైనా? మనమేం చేస్తున్నా, వాళ్ళెక్కడ ఉన్నా – వాళ్ళేం చేస్తున్నారో, వాళ్ళకేదైనా దెబ్బలు తగులుతాయేమో అని మనసు లాగుతూ ఉంటుంది. అటువంటి ప్రీతి, ప్రేమ బాబా పట్ల కలగాలి. దానికి కావలసినది బాబా పట్ల సరైన అవగాహన, అవసరం – ఇవి ఉంటే చాలు.

# కలలో దర్శనం - ఇలలో అనుగ్రహం

కుంచాల వెంకమ్మ
గృహిణి, ఒంగోలు
జన్మించిన సం॥ 1950

ఒంగోలు, జనవరి 2001

నేను తరచూ ఛాతీ నొప్పితో తీవ్రంగా బాధపడేదాన్ని. నేను అప్పటికే డాక్టర్ల చుట్టూ తిరగడానికి మందుల కోసమని 20,000 అప్పు చేసి ఉన్నాను. కానీ వాటి వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. నిజానికి నా స్థోమతకి వెయ్యి రూపాయలు కూడా నాకు చాలా పెద్ద మొత్తం.

ఒక రోజు నొప్పి భరించరానిదిగా మారడంతో నేను ఆస్పత్రికి వెళ్ళాను. అక్కడ నాకు నొప్పి తగ్గడానికి మాత్రలు ఇచ్చి వార్డులో పడుకోబెట్టారు. అక్కడ నాకొక స్వప్నం వచ్చింది.

గురువుగారు కలలో నేను పడుకున్న బెడ్ దగ్గరకు వచ్చి *"నిన్ను ఇక్కడకు ఎవరు వెళ్ళమన్నారు? ఇక్కడ చాలా ఖర్చుతో కూడుకుని ఉంటుంది. రోజుకు ఆరు వందల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇవన్నీ ఎవరికి కావాలి, పద ఇంటికి పోదాం"* అన్నారు.

నేను ఆయనను స్పష్టంగా చూడగలిగాను. ఆ తరువాత కూడా నేను మొత్తం సంఘటనను గుర్తుపెట్టుకోగలిగాను. తరువాత రోజు ఉదయం డాక్టర్లు నన్ను పరీక్షించి అంతా బాగుందని, ఇంటికి వెళ్ళవచ్చునని చెప్పారు. ఆ రోజు నుండి నా ఆరోగ్యంతో పాటు నా ఆర్థిక పరిస్థితి కూడా మెరుగవడం మొదలైంది. నాకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఆదుకోవడానికి గురువుగారు ఉన్నారన్న భరోసా ఏర్పడింది.

# కృపాదృష్టి

శల్లం నరేంద్ర కుమార్
స్టూడెంట్, కందుకూరు
జన్మించిన సం॥ 1977

కందుకూరు, ఆగష్టు 2001

చాలాకాలంగా మా చెల్లెలు ఎప్పుడూ కడుపునొప్పితో బాధపడుతుండేది. మొదట అది మామూలు కడుపునొప్పే కాబోలు అనుకున్నాము. వాంతులు, విరేచనాలు కూడా అవుతుండడంతో డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాము. అక్కడ అన్ని పరీక్షలూ జరిపి, కడుపులో ప్రేగులు మడతపడి క్రుళ్ళిపోయి ఉన్నాయి, వెంటనే ఆపరేషన్ చేయాలి. కానీ బాగవుతుందని మాత్రం ఖచ్చితంగా చెప్పలేము అని చెప్పి హాస్పిటల్లో అడ్మిట్ చేసుకున్నారు డాక్టరు. మా అమ్మ చాలా భయపడింది. కానీ నాకు మాత్రం ధైర్యంగానే ఉంది. "మేము నమ్ముకొని పూజిస్తున్న గురువుగారున్నారు. వారే చూసుకొంటారు, కాపాడుతారు!" అని. అదే మాట అమ్మతో చెప్పాను. మా అమ్మ బాబా, గురువుగారు ఉన్న ఫోటోను మా చెల్లి దిండు క్రింద ఉంచింది.

ఆ తెల్లవారుఝామున మా అమ్మకు ఒక కల వచ్చింది. ఆ కలలో "గురువుగారు మరికొందరితో కలిసి ఒక జీపులో హాస్పిటల్‌కు వచ్చారు. గురువుగారు నేరుగా మా చెల్లి పడుకొని ఉన్న బెడ్ దగ్గరకు రావడంతో, అక్కడ ప్రక్కనే నిద్రిస్తున్న అమ్మ లేచి మా చెల్లిని గురువుగారికి చూపించింది. కొద్దిసేపు గురువుగారు అట్లాగే మా చెల్లి వంక చూసి వెళ్ళిపోయారట".

తెల్లవారిన తర్వాత చూస్తే మా చెల్లెలు ఎంతో కులాసాగా కనిపించింది. రౌండ్స్‌కి వచ్చిన డాక్టరుగారు, అమ్మాయి ఇంత ఉల్లాసంగా ఉండడం చూచి అనుమానంతో మళ్ళీ పరీక్షలు జరిపారు. చిత్రం! ఆమెలో ఏ అనారోగ్యం కనిపించలేదు. దాంతో డాక్టరు "ఈమె ఆరోగ్యంగా ఉంది. ఇంటికి తీసుకుని వెళ్ళవచ్చు" అన్నారు. మేము ఇంటికి వచ్చేస్తుంటే డాక్టర్ల ఆశ్చర్యానికి అంతులేదు. నిన్నటిదాకా ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న అమ్మాయి హఠాత్తుగా అంత ఆరోగ్యంగా ఎలా అయ్యింది? అని.

ఆ రోజు నుండి మా చెల్లెలికి ఇప్పటి వరకు ఏ అనారోగ్యం లేదు. ప్రత్యక్షంగానే కాదు స్వప్నంలో కూడా గురువుగారి కృపాదృష్టికి అంత మహిమ ఉంది.

# ఫలించిన కల

మోదుగుల సూరారెడ్డి
గవర్నమెంట్ ఉద్యోగి, తిరుపతి
జన్మించిన సం॥ 1946

తిరుపతి, జనవరి 2000

ఒకరోజు రాత్రి నాకొక కల వచ్చింది. ఆ కలలో గురువుగారు నాకు ఫోన్ చేశారు. నేను వారితో మాట్లాడుతూ "మీ దగ్గర నుండి ఫోన్ వచ్చినందుకు చాలా ఆశ్చర్యంగా ఉంది" అన్నాను.

గురువుగారు నవ్వుతూ "నేను చెప్పబోయే విషయం వింటే నువ్వు ఇంకా ఆశ్చర్యపోతావు. రేపు నేను మీ ఇంటికి వస్తున్నాను" అన్నారు.

అంతలో నాకు మెలకువ వచ్చేసింది. ఆ కల నాకెంత ఉద్వేగాన్ని, ఆనందాన్ని ఇచ్చిందంటే అప్పటికప్పుడు నా భార్యను లేపి కల విషయం చెప్పాను. "గురువుగారు ఎవరింటికీ రారు కదా! మరి ఈ కలలో చెప్పినది ఎలా సాధ్యమవుతుంది?" అని ఆలోచిస్తూనే మరలా నిద్రపోయాను.

మరునాడు గురువారం. సత్సంగానికి వెళ్ళాం. అక్కడ పూర్ణచంద్రరావుగారు నన్ను పిలిచి, గుప్తాగారు నాకివ్వమన్నారని చెప్పి గురువుగారి ఫోటో ఒకటి నా చేతిలో పెట్టారు. చూస్తే అది శిరిడీలో మా మనవడు సాయిచరణ్‌కు అక్షరాభ్యాసం చేస్తున్న గురువుగారి ఫోటో! ఎంత ఆశ్చర్యం! 'కల ఎలా సాధ్యమవుతుంది' అనుకున్నాను. కానీ గురువుగారు దాన్ని నిజం చేస్తూ ఫోటో రూపంలో వచ్చారు, బాబా హేమాడ్ పంత్ ఇంటికి పటం రూపంలో వచ్చినట్లుగానే! ఈ సంఘటనతో నాకు బాబా, గురువుగారూ ఒక్కరే అన్న విశ్వాసం మరింతగా దృఢపడింది.

# అనుగ్రహ ప్రవంతి

చివుకుల కవితాస్రవంతి
స్టూడెంట్, విజయవాడ
జన్మించిన సం॥ 1978

విజయవాడ, సెప్టెంబర్ 2001

నేను మూడు సంవత్సరాల పాటు గొంతునొప్పితో బాధపడ్డాను. ఈ నొప్పి చాలా ఎక్కువగా ఉండి నేను సరిగా తినలేకపోయేదాన్ని. కనీసం డాక్టర్ ఇచ్చిన మందులు కూడా మ్రింగలేకపోయేదాన్ని. ఆగష్టు నెల, 2000వ సంవత్సరంలో ఒకనాటి రాత్రి, నేను మా స్నేహితురాలు సుష్మ వాళ్ళింట్లో పడుకున్నాను. నాకు ఉదయం 7.30–8.00 గంటల మధ్య కల వచ్చింది. ఆ కలలో గురువుగారు కనిపించారు. గురువుగారు నాతో మాట్లాడి నా గొంతును కాసేపు అలా తాకారు. మెలకువ రాగానే ఈ కల గురించి మా చెల్లెలితో చెప్పాను. మా చెల్లెలు 'నీకు గొంతు నొప్పి ఉంది కదా, అందుకనే గురువుగారు తాకినట్లున్నారు' అన్నప్పుడుగాని నేను నొప్పి తగ్గిపోయిందని గుర్తించలేదు. గురువుగారి అనుగ్రహం వలన నేను మరెన్నడూ గొంతునొప్పితో బాధపడలేదు.

***భక్తుడు:*** *బాబాతో కనెక్ట్ అయి ఉన్నామా, లేదా అన్నదానికి గుర్తేమిటి?*

***గురువుగారు:*** *ఖాళీ సమయంలో మన మనసు అప్రయత్నంగా బాబా స్మరణ చేస్తున్నదా లేదా అనేదే గుర్తు.*

# కల నిజమైన వేళ

బచ్చలి వెంకట రమణ
ఉద్యోగి, కందుకూరు
జన్మించిన సం॥ 1963

కందుకూరు, మార్చి 2000

1995లో ఒకసారి నాకు కలలో, కొంచెం గడ్డం ఉండి సాధువులా ఉన్న ఒక వ్యక్తి కనిపించారు. ఆయనతో పాటు ఇంకా కొంతమంది ఉన్నారు. అందరూ కలసి మా ఇంట్లోకి వస్తున్నారు. నా ప్రక్కన ఒక అమ్మాయి నిలబడి ఉంది. ఆమె ముఖాన్ని నేను స్పష్టంగా చూడలేకపోయాను. మేమిద్దరం కలసి ఆ మహాత్మునికి సాష్టాంగపడి ఆయన పాదాలను తాకాము. ఆయన "సాయిబాబా" అని ఆశీర్వదించారు. నాకు ఆయనగాని, నా ప్రక్కనున్న అమ్మాయిగాని ఎవరో తెలియదు. అప్పటికి ఇంకా నాకు పెళ్ళి కాలేదు.

నాకు మా తల్లిదండ్రులు చూసిన అమ్మాయితో 1996వ సంవత్సరంలో పెళ్ళి జరిగింది. అదే సంవత్సరం నేను, నా భార్య కలసి గురుపూర్ణిమకు బాబాను దర్శించుకుందామని శిరిడీకి వెళ్ళాము. నేను శిరిడీకి వెళ్ళే ముందు నా సోదరుడు గురువుగారి ఫోటో ఒకటి చూపించాడు. వారు శిరిడీలో ఉంటారని తెలుసు. కానీ నాలో ఎటువంటి స్పందన కలుగలేదు. నాకు వారిని దర్శించుకోవాలన్న ఉద్దేశ్యమూ లేదు. మేము శిరిడీకి కేవలం బాబా కోసమే వెళ్ళాము.

శిరిడీకి వచ్చిన మరుసటి రోజు, మేము సమాధి మందిరంలో బాబాను దర్శించుకుని బయటకు వస్తూ ఉంటే, ఒక షాపతను అక్కడ రోడ్డుమీదనున్న వ్యక్తిని చూపిస్తూ "అక్కడ శరత్‌బాబూజీ ఉన్నారు" అన్నాడు.

మేము వారిని కలుసుకోవడానికి పరుగెత్తాము. ఆయన చుట్టూ చాలామంది జనం ఉన్నారు. ఆ జనంలో నేను, నా భార్య విడిపోయాము. నేను గురువుగారిని చూసిన మరుక్షణం, నాకు కలలో కనిపించిన మహాత్ములు వారేనని గ్రహించాను. నేను జనంలో త్రోసుకుంటూ వెళ్ళి గురువుగారి కుడి పాదాన్ని స్పృశించాను. అదే సమయానికి ఆశ్చర్యకరంగా, నా భార్య కూడా ఇంకో వైపు నుండి జనాలను దాటి గురువుగారి దగ్గరకు చేరుకుని వారి ఎడమ పాదాన్ని తాకి నమస్కరించుకుంది. సరిగ్గా నాకు అంతకు ముందు సంవత్సరంలో వచ్చిన కలలో మాదిరిగానే మా

ఇద్దరి నమస్కారాలను గురువుగారు స్వీకరించారు. మేము వారి పాదాలను తాకిన క్షణంలోనే గురువుగారు "సాయిబాబా" అని అన్నారు. అది నాకు జీవితంలో మరచిపోలేని సంఘటన.

***భక్తుడు:*** *భగవంతుని అనుగ్రహం ఉంటేనే మనం ఆధ్యాత్మిక పథంలోకి వచ్చాం కదా?*

***గురువుగారు:*** *అనుగ్రహం ఎప్పుడూ ఉండేదే. మనం ఉపయోగించు కోవడంలోనే ఉంది. మనం పురోభివృద్ధి చెందడం లేదంటే, అనుగ్రహం లేదని అర్థం కాదు. మనం ఉపయోగించుకోవడం లేదని అర్థం. అనుగ్రహం – వర్షం లాగా పడుతుంటే, మనం అహంకారమనే గొడుగును అడ్డం పెట్టుకొంటున్నాం. అహంకారం ప్రక్కకు తొలగిస్తే చాలు, వర్షం మామూలుగా పడుతుంది.*

***భక్తుడు:*** *అది మన కంట్రోల్ లోనే ఉంటుందా?*

***గురువుగారు:*** *ఆ గొడుగు తీయడం మన కంట్రోల్‌లోనే ఉంది. మన ఇష్టాయిష్టాలు, మన అలవాట్లు– ఇవే అనుగ్రహానికి అడ్డం పడేవి. ఏది మంచిదో, ఏది చెడో మనసు చెప్తూనే ఉంటుంది. ప్రొద్దున 4 గంటలకు లేచి– ఆరతికెళ్ళాలని అందరికీ ఉంటుంది. కానీ ఆ టైమ్‌కి– ఆc. ఏం పోదాములే? కాసేపు హాయిగా నిద్రపోదాం. పగలంతా ఏదో చేసుకొన్నాం కదా! అనిపిస్తుంది. ఆరతికి వెళ్ళాలనిపించడమే అనుగ్రహం. మనం బద్ధకంతో పడుకుంటాము. అలా పడుకోకుండా లేచిపోగలిగితే అనుగ్రహ వర్షం అనుభవమవుతుంది. చలిలో మొదటి చెంబు చన్నీళ్ళు పోసుకోవడం లాంటిదది. ఆ మొదటి చెంబు కాస్త ఒణుకుతో పోసుకున్నామనుకోండి, బడ బడ బక్కెటంతా ఖాళీ చేస్తాం. ఆ breaking point లోనే చాలా మంది చలికి భయపడి దిగలేరు. ఒకసారి break చేశామంటే ఇక అనుగ్రహం మనలను overlap చేస్తుంది.*

# ఆ రెండు స్వప్నాలు

శెట్టిపల్లి రమేష్
కాంట్రాక్టర్, శిరిడీ
జన్మించిన సం॥ 1969

శిరిడీ, నవంబర్ 2002

నా నిశ్చితార్థానికి శిరిడీ వెళ్ళినప్పుడు నేను మొదటిసారి శిరిడీలో గురువుగారిని చూశాను. ఆ మొదటి దర్శనంలోనే ఎన్నాళ్ళుగానో నన్ను బాధిస్తున్న సయాటికా నొప్పిని తొలగించి జీవితాంతం వారికి ఋణపడివుండేలా చక్కని అనుభవాన్ని ప్రసాదించారు గురువుగారు.

1996లో నాకొక కల వచ్చింది. ఆ కలలో "నేను ఇంటి నుండి మార్కెట్‌కి వెళుతున్నాను. మా ఇంటికి సమీపంలో ఓ వేపచెట్టు క్రింద గురువుగారు నిల్చొని ఉన్నారు. నేను వారి దగ్గరకు వెళ్ళి నమస్కారం చేసుకొని, మా ఇంటికి రమ్మని ఆహ్వానించాను. గురువుగారు *"తర్వాత వస్తాలే!"* అన్నారు.

నా భార్య సురేఖకు కూడా గురువుగారు కలలో కనిపించారు. కలలో సురేఖ గదిలో పడుకొని ఉంది. గురువుగారు దగ్గరకొచ్చి ఆమె చెంపపై గట్టిగా కొట్టారట. దాంతో తను పడిపోయింది. లేచిన తర్వాత వెలుపలికి వెళ్ళి చూస్తే గురువుగారు, అమ్మగారు, శృతి పాప కారు దిగి నడిచి వస్తున్నారు. సురేఖ వారిని లోపలికి రమ్మని ఆహ్వానించి, ఇల్లంతా దగ్గరుండి చూపించింది. గురువుగారు తిరిగి వెళుతుంటే "మా రూమ్ పైన ఉంది. పైకి రండి మామయ్య" అని పిలిచింది. దానికి గురువుగారు *"ఇంకా టైముంది"* అన్నారు. మా రూమ్ గురువుగారు చూడలేదని తను బాధపడింది.

***భక్తుడు:*** *"మనకు కావల్సిందంతా బాబా చేస్తున్నాడు కదా!" అనే అవగాహన కలిగి ఉండడం, "మనకేమి అవసరమో బాబాకు తెలియదా, మనం కోరడమేమిటి" అనుకోవడం కరెక్టు కాదా సార్?*


***గురువుగారు:*** *అడగకపోయినా నిశ్చింతగా ఉండగలిగితే అడగనవసరం లేదు. అలా లేనప్పుడు అడగడమే కరెక్టు. మనసులో ఉన్నది కావాలని అడగడానికి ఏమిటి అడ్డం? మన మనసులో కోరిక కలిగిందంటేనే ఆయనకు తెలియజేసినట్లు లెక్క. మనం అడగకుండానే ఆయన ఎన్నో*

*చేస్తున్నారు. మన మనసులో సంకల్పం కలగడమే ఆయనకు తెలిసి పోతుంది. అడగాలనిపించింది, అదొక expression (వ్యక్తీకరణ). అడుగుదాం. అడగడంలో తప్పేమిటి? బాబాను కాకపోతే ఎవరిని అడుగుతాం?*

నాలుగు సంవత్సరాల తర్వాత మా ఇద్దరికొచ్చిన కలలను ఫలింపజేస్తూ, గురువుగారు మా ఇంటికి నిజంగానే వచ్చారు.

2001 జూలైలో గురుపూర్ణిమ తర్వాత అంటే 8.7.2001న సాయిబాబా మందిరంలో విగ్రహప్రతిష్ఠాపనకై, గురువుగారు మా ఊరికి (పల్‌సూద్) విచ్చేశారు. గురువుగారి రాక ముందుగానే తెలిసిన మేము, మా ఇంటి మిద్దె పైన గురువుగారి కోసం, మా గది ప్రక్కనే క్రొత్తగా ఇంకో గది కట్టించి ఉంచాము. గురువుగారు పైకి రాగానే ఆ గది తలుపుకి లాక్ పడిపోయింది. ఆ కారణంగా గురువుగారు ప్రక్కనే ఉన్న మా గదికి వచ్చి మంచంపై కూర్చున్నారు.

ఆ విధంగా గురువుగారు, నా భార్య సురేఖకు కలలో కనిపించి చెప్పిన మాటను నిలుపుకున్నారు. మాకు చాలా సంతోషమేసింది. ఆ తర్వాత క్రొత్తగా కట్టిన గది తలుపు గడియ తీయగలిగాము. గురువుగారిని ఆ క్రొత్త గదిలోకి రమ్మని మా నాన్న అభ్యర్థించారు. గురువుగారి రాకతో పునీతమైన ఆ గదిని పూజ గదిగా మలచుకోవాలన్నది మా కోరిక. వారు కరుణించి మా కోరిక మన్నించి, ఆ క్రొత్త గదిలో కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. గురువుగారి ఆగమనంతో మా ఇల్లు పావనమైంది.



*శ్రీబాబూజీ, వారణాసి, 1995*



# మర్మమైన వ్యసనాలు

# బ్రతుకు భిక్ష

కుమార గవర్రాజు
వ్యాపారస్థుడు, భీమిలి
జన్మించిన సం॥ 1962

కందుకూరు, డిసెంబర్ 2000

ముందుగా నా గురించి నేను పరిచయం చేసుకోవాల్సి వస్తే, నన్ను నేనే నిందించుకోవడంగా ఉంటుందేమో కానీ, నిజంగానే గురువుగారి వద్దకు రాక మునుపు నేనొక అహంకారినని చెప్పాలి. నేనేం చేయదలచుకొన్నానో అదే తప్ప ఇంకెవ్వరి మాట వినేవాణ్ణి కాదు. నా మూర్ఖత్వంతో, మొండితనంతో తోచిందల్లా చేసి నా డబ్బు మొత్తం పోగొట్టుకున్నాను. అయినా ఏ జన్మలోని కరుణానుబంధమో కానీ బాబా నన్ను గురువుగారి సన్నిధికి చేర్చారు.

కందుకూరులో జరిగే సత్సంగాలకు హాజరవడం వలన బాబా, గురువుగారి గురించి తెలుసుకొని, శిరిడీ వెళ్ళి గురువుగారిని దర్శించుకోగలిగాను. గురువుగారిని చూడగానే అప్రయత్నంగా నమస్కరించాను. అదే నా జీవితంలో నేను చేసిన మొదటి నమస్కారం అనవచ్చు. ఎందుకంటే ఎవరైనా నాకు నమస్కరించాలే కానీ నేను ఎవరికీ నమస్కరించాల్సిన అవసరం లేదనుకొనే తత్త్వం నాది. గురువుగారికి నేను చేసిన ఆ నమస్కారమే అంధకారమయమైన నా జీవితానికి కాంతి కిరణమయింది.

నేను తిరిగి తీర్చగల వనరుల గురించి ఆలోచించకుండా దొరికిన చోటల్లా లెక్కలేనన్ని అప్పులు చేశాను. ఒకరకంగా అప్పు చేయడమన్నది నాకు వ్యసనంగా మారిందనవచ్చు. ఈ విధంగా అప్పులు చేస్తే తరువాత నా భార్య, పిల్లల గతి ఏమవుతుందోనని కూడా ఆలోచించేవాడిని కాదు.

గురువుగారి వద్దకు వెళ్ళిన తర్వాత వారితో నా సంగతులు చెప్పుకొన్నప్పుడు, "ఇకపై అప్పులు చేయవద్ద"ని వారు హెచ్చరించారు. అయినా నేను వినలేదు. వారు నాకు రెండు మూడుసార్లు చెప్పి చూశారు. కానీ నేను మాత్రం వినే పరిస్థితిలో లేను. దానితో గురువుగారు తమదైన పద్ధతిలో 'శిక్షించకుండా, శిక్షణ ఇచ్చినట్లుగా' ఎక్కడా నాకు అప్పు పుట్టకుండా చేశారు. ఆకలిగొన్న పులిలా ఎవరు దొరుకుతారా, ఎవరు అప్పిస్తారా అని ఎదురు చూసేవాడిని. ఎక్కడా ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టలేదు. పైగా ఇంతకుముందు నాకు అప్పులిచ్చిన వాళ్ళంతా తమ అప్పు తీర్చమని ఒత్తిడి

చేయసాగారు. క్రొత్త అప్పులు చేసి, పాత అప్పులు తీర్చాలన్నా మార్గం కనిపించలేదు. బ్రతుకు పూర్తిగా దుర్భరమవగా, ఒకరోజు రాత్రి గురుదేవుల ఫోటో తీసుకుని మిద్దె మీదకు వెళ్ళాను. వేరే ఎవరితో చెప్పుకొనేది నా బాధ? ఫోటో గుండెలపై పెట్టుకొని వేదన తీరేలా ఏడ్చాను. అట్లా ఎంత సేపు ఏడుస్తుండిపోయానో నాకే తెలియదు.

ఆ ఫోటో వంక చూస్తూ గురువుగారిని "గురుదేవా! మీ అనుగ్రహమే నాకొక మార్గం చూపాలి. నాకు ఏ దారీ కనిపించడం లేదు. నేనీ అప్పులన్నీ ఎలా తీర్చాలి? నా కుటుంబాన్ని ఏం చేయను? నేను చేసిన తప్పుల వలన నేనే కాక నా కుటుంబం కూడా బాధపడుతున్నది. మీ ఆశీస్సులతోనే ఈ అప్పులు తీరాలి. నాపై దయతలచి నన్ను కాపాడండి. మీరే నాకు శరణ్యం!" అని ప్రార్థించాను, ప్రాథేయపడ్డాను.

ఆ కరుణామూర్తి చల్లని ఆశీస్సుల బలంతో మెల్లమెల్లగా నా పరిస్థితులు చక్కబడసాగాయి. భీమిలిలో నాకు కొంత ఆస్తి ఉంది. మొదట దాన్ని అమ్మేద్దామని నిర్ణయించుకున్నాను. కానీ అక్కడే ఉంటున్న మా అన్నయ్య, ఆస్తిని అమ్మవద్దని వారించారు. ఆయన నాలో మార్పు చూసి బిజినెస్‌లో నాకు కొంత వాటా కూడా ఇచ్చారు. నాలుగు నెలలు తిరిగేసరికి నేను రెండున్నర లక్షల అప్పు తీర్చగలిగాను. ఊబిలాంటి అప్పు అనే వ్యసనంలో నుంచి నన్ను బయటపడేసి, నాకు, నా కుటుంబానికి ప్రాణభిక్షే కాదు బ్రతుకుభిక్ష కూడా పెట్టిన దైవం గురువుగారు.

***భక్తుడు:*** *బాబా సమక్షంలోనే దొంగతనం చేస్తే ఎందుకు వదిలేసేవారు?*

***గురువుగారు:*** *వాడికి తరువాత ఎటువంటి అనుభవం ఇచ్చారో ఎట్లా సరిదిద్దారో మనకు తెలియదు కదా? అలా కాకుండా వాడు డబ్బు కొట్టేసేటప్పుడు దివ్య దృష్టితో కనిపెట్టి వాడిని నిలదీయాలంటారా? డబ్బు మీద వ్యామోహం ఉన్న వాళ్ళు అలా చేస్తారు. ఆ డబ్బు మీద ఆయనకు ప్రీతి లేదు కాబట్టి ఎవరేం చేసినా ఆయనకు పట్టదు.*

*ఎవరో విలువైన గడియారం తీసుకొచ్చి భగవాన్ దగ్గర పెట్టారు. "విలువైన వస్తువులు నా దగ్గర పెట్టవద్దండి" అని చెప్పారు భగవాన్. 'లేదు భగవాన్ మీకు సమర్పించాల'న్నారు. ఇంకెవరో దూరపు బంధువు వచ్చి దానిని తీసుకువెళ్ళాడు. చూస్తూ ఉన్నారాయన. ఇచ్చిన వాడొచ్చి*

లబోదిబో అన్నాడు. గడియారం వచ్చినప్పుడు ఎట్లా చూస్తూ ఉన్నారో, తీసుకొని వెళ్ళినప్పుడు అట్లే చూస్తూ ఉన్నారాయన. అది విలువైనదని కాపాడడానికి *scope* ఎక్కడ ఉంది? భగవాన్‌కి పులి చర్మం ఆసనంగా వేశారు. కూర్చోమన్నారు, కూర్చున్నారు. ఇంకెవరో సాధువొచ్చి – "స్వామీ! ఆ పులి చర్మం నాకిస్తారా, తీసుకువెళతాను అన్నారు. "ఎవరైనా చూస్తే ఒప్పుకోరు కానీ, ఎవరూ చూడకుండా తీసుకుపో" అన్నారు భగవాన్. మనకి విలువ కానీ, వాళ్ళకేముంది?

దేవుడి గుడిలో నగలు పోయినాయి. దేవుడేం చేస్తున్నాడు – అని మామూలుగా వచ్చే ప్రశ్న. దేవుడిని మన స్థాయిలో చూస్తే ఎట్లా? ఆయనకవి రాళ్ళ క్రిందే లెక్క. నా నగలు కొట్టేశారు దేవుడో అంటూ వెంటబడతారా ఆయన?

శ్యామా రెండు రూపాయలు దాచిపెట్టిన సంఘటనలో ఎలా సరిదిద్దారో చూశాము కదా! అదే విధంగా ఎవరిని ఎలా సరిదిద్దారో అన్నీ రికార్డు అయివుండకపోవచ్చు. నా భక్తుని నేనెన్నడూ పతనం కానివ్వను అన్నది బాబా ప్రతిజ్ఞ కదా! కాబట్టి బాబా భక్తుడు పతనం అవుతాడని బాధపడడం మన తెలివితక్కువ.

# నాడు వ్యసనానికి బానిస, నేడు గురుచరణాల పైనే ధ్యాస

పెట్టె అరుణ
గృహిణి, నెల్లూరు
జన్మించిన సం॥ 1971

నెల్లూరు, సెప్టెంబర్ 2002

శాంతి, సంతోషము కరువైన వైవాహిక జీవితం నాది. నా భర్త త్రాగుడుకు బానిసై నన్నూ, పిల్లల్ని అసలు పట్టించుకొనేవారు కాదు. నేను 1990 నుండి ప్రతి సంవత్సరం శిరిడీ వెళ్ళి గురువుగారిని దర్శించుకొనేదాన్ని. గురువుగారి మహిమను గూర్చి నా భర్తకు ఎప్పుడు చెప్పబోయినా వినిపించుకొనేవారు కాదు. నేను శిరిడీ వెళ్ళేటప్పుడు ఎన్నిసార్లు పిలిచినా రాననేవారు. నేను మాత్రం గురువుగారి దర్శనం చేసుకొన్న ప్రతిసారీ నా భర్తలో పరివర్తన కలిగించమని ప్రార్థించేదాన్ని.

1997లో విజయదశమికి శిరిడీ వెళ్ళినప్పుడు గురువుగారి పాదాలు పట్టుకొని ఏడ్చాను. 'నా భర్తకున్న వ్యసనాన్ని పోగొట్టి అతన్ని మీ పాదాల చెంతకు చేర్చుకోమ'ని ప్రాథేయపడుతూ అడిగాను. వచ్చే విజయదశమి నాటికి ఆయన మారి మీ చెంతకు రావాలని అభ్యర్థించాను. నా జీవితాన్ని నిలబెట్టమని, నన్ను అనుగ్రహించమని కన్నీళ్ళతో వేడుకున్నాను. గురువుగారు తల ఊపుతూ ఊదీనిచ్చి ఆశీర్వదించారు.

తర్వాత 1998 ఏప్రిల్ 5వ తేదీ శ్రీరామనవమి రోజున నా భర్త ఉదయం నిద్రలేవగానే నా దగ్గరకొచ్చి "నా బట్టలు సర్ది ఉంచు. నేనివాళ శిరిడీ వెళతాను" అన్నారు. ముందు నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. ఏదో అన్నారు కానీ నిజంగానే శిరిడీ వెళతారా అని నాకు అపనమ్మకంగానే ఉంది. అయితే ఆయన శిరిడీ వెళ్ళారు. మా అదృష్టం, ఆయనకు ఆ రోజే గురువుగారి పాదదర్శనం దొరికిందట.

నా భర్త గురువుగారి పాదాలు పట్టుకొని "నేను త్రాగుడుకు బానిసనై పోయాను. నన్నందరూ అసహ్యించుకొంటున్నారు. నేనూ సమాజంలో గౌరవంగా బ్రతకగలగాలి. నన్ను ఆ చెడు అలవాటు నుండి కాపాడండి" అని వేడుకొన్నారట. గురువుగారు ఆయన నుదుట ఊదీ పెట్టి ఆశీర్వదించారట.

గురువుగారి పాదాలు తాకి వేడుకొన్న మరుక్షణం నుండి ఆయనలో అనూహ్యమైన మార్పు వచ్చింది. త్రాగుడంటేనే విరక్తి ఏర్పడింది. కుటుంబం పట్ల శ్రద్ధ కనపరచసాగారు. రెండవసారి విజయదశమికి మళ్ళీ శిరిడీ వెళ్ళి గురువుగారి

దర్శనం చేసుకొని "నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. జీవనానికి ఏదైనా  ఆధారం చూపెట్టమ"ని ప్రార్థించారు.

"నెల్లూరులోనే రోజూ సత్సంగ మందిరానికి వెళుతుండు. ఆధారం అదే ఏర్పడుతుంది" అని దీవించారు గురువుగారు.

నా భర్త అలాగే సత్సంగమందిరానికి వెళ్ళసాగారు. గురువుగారు ఆ విధంగా చెప్పిన ఒక సంవత్సరానికి అదే తేదీన సాయిబాబా సత్సంగ మందిరంలో ఒక చిన్న షాపు పెట్టుకోగలిగాము. షాపులో మేము మందిరానికి వచ్చే భక్తులకు టెంకాయలు, పువ్వులు అమ్ముతాము. బాబా మందిర ప్రాంగణంలో బాబా సన్నిధిలోనే మా జీవనోపాధి ఏర్పడడం మాకెంతో ఆనందాన్ని కలుగజేసింది. ఇద్దరు మగపిల్లలను మంచి స్కూల్లో చేర్పించగలిగాము. ఆర్థికంగా ఏ లోటు లేకుండా ఆనందంగా జీవనం గడిచిపోతున్నది.

బాబా సేవ చేసుకుంటూ, గురువుగారినే స్మరించుకుంటూ సంతోషంగా, గౌరవంగా బ్రతుకుతున్నాము. నా కన్నీటి మొర ఆలకించి, చెడు వ్యసనానికి బానిసగా ఉన్న మా వారి మనసులో భక్తి, ప్రేమలను కలుగజేసి మాకు క్రొత్త జీవితాన్ని ప్రసాదించారు గురుదేవులు. ఈ జీవితం గురువుగారిచ్చినదే.

***భక్తుడు:*** *అసలు మనమెందుకు పుట్టాం?*

***గురువుగారు:*** *అది ఎవరికి వారు వేసుకోవాల్సిన ప్రశ్న. ఎందుకు పుట్టామో మనకు తెలియదు - పుట్టడం మన చేతుల్లో లేదు గనుక పుట్టేశాము. ఎందుకు బ్రతుకుతున్నామనంటే మాత్రం ఇంకా చావలేదు కనుక అని మాత్రం చెప్పవచ్చు. అంతకంటే ఇంకేమైనా సమాధానం చెప్పగలరా? ఎందుకైనా పుట్టనివ్వండి. 'ఎందుకు బ్రతుకుతున్నాము?' అనేదే కావలసింది. ఈ ప్రశ్న ఎవరికి వారు వేసుకోండి.*

*బాబా చాలా స్పష్టంగా చెప్పి ఉన్నారు "ఎందుకు పుట్టినట్లు - పిడకలు ఏరుకోవడానికా? సద్గురువును తెలుసుకో" అని. ఈ జీవితమనే పుస్తకం మన చేతికి ఇవ్వబడింది. ఏమి వ్రాసి ఉందో మాత్రం మనకు తెలియదు. కాని తెలుసనుకొంటుంటాం మనం. అదెట్లా ఉంటుందంటే ఇక్కడ ఒక ఉదాహరణ చూడండి. నేనెప్పుడూ పుస్తకం ముందేసుకుని*

చదువుతుంటాను కదా! శృతి ఇంకా స్కూల్లో చేరలా అప్పటికి. వాళ్ళ అమ్మ తనకు *abcd* వరకూ నేర్పించింది. నేను చదువుకొంటుంటే వచ్చి నా ముందు కూర్చొనేది. పుస్తకం వంక, నా మొహం వంక మార్చి మార్చి చూసేది. అట్టా చూసి చూసి ఒక రోజున సీరియస్‌గా అడిగింది. *"ఏం డాడీ, ఎంతసేపూ abcdలు చదువుతుంటావు? పుస్తకంలో ఎటు త్రిప్పినా abcd లే కదా ఉంటాయి"* అని. నేను ఒక రోజులో నేర్చుకున్నాను కదా! డాడీ ఏమిటి ఇన్ని రోజులు చదువుతున్నారని శృతి ఆలోచన.

అలాగే భాష తెలియని పుస్తకాన్ని చాలా సీరియస్‌గా చదివేస్తున్నాం అన్నమాట మనం. పేజీలు తిరిగిపోతున్నాయి. అర్ధం తెలీదు. ఈ అర్ధం చెప్పగలిగేటువంటి సద్గురువంటూ మనకు కావాలి. బాబా చెప్పినట్లు సద్గురువును తెలుసుకోకపోతే *'The whole life is a preparation for death. A helpless preparation'* అవుతుంది.

# కిళ్ళీ వద్దు మళ్ళీ

పద్మనాభుని శివశంకర్
వ్యాపారస్థుడు, హైదరాబాద్
జన్మించిన సం॥ 1952

హైదరాబాద్, జూన్ 1999

అప్పట్లో నాకు బాగా కిళ్ళీలు తినే అలవాటుండేది. అందునా హైదరాబాదీ కిళ్ళీలు. ఆ పిచ్చి ఎంత ఉండేదంటే, నేను వేరే ఊర్లో ఉన్నా అంటే పని మీద మద్రాసు, బొంబాయి ఇలా ఎక్కడున్నా, హైదరాబాదు నుండి వచ్చేవారితో ఫ్లైట్‌లో కిళ్ళీలు తెప్పించుకునేవాడిని. నా అలవాటు తెలిసిన గురువుగారు ఒకసారి "శివశంకర్‌గారూ, మీరు నాతో శిరిడీలో ఉన్నప్పుడు మాత్రమే కిళ్ళీ వేసుకోవాలి" అన్నారు.

ఒక్కసారిగా వద్దు, మానెయ్యమంటే నేను ఇబ్బందిపడతానేమోనని కాబోలు గురువుగారు అలా హెచ్చరించారు. ఇక నేను ఒక్కోసారయితే కిళ్ళీ కోసమే శిరిడీ వెళ్ళడం మొదలుపెట్టాను.

ఒకసారి నేను హైదరాబాదులో ఉండగా గురువుగారికి చెవిపోటు, తీవ్రమైన జ్వరం వచ్చిందని తెలిసి, వారిని చూసి వద్దామని శిరిడీ వెళ్ళాను. శిరిడీలో దిగి భోజనం చేసి, పాన్ నములుతూ 'సాయిపథం'కు వెళ్ళాను. అంతలో గురువుగారు నన్ను లోపలకు రమ్మంటున్నారన్న కబురు వచ్చింది. నేను లోపలికి వెళ్ళాను.

నన్ను చూడగానే గురువుగారు "ఇంకా మీరు పాన్ మానలేదా!" అన్నారు. "ఒక ప్రక్క చెవిపోటు, తీవ్ర జ్వరంతో బాధపడుతూ కూడా వారు నా బాగోగుల గురించి, నా అలవాటు గురించి విచారిస్తున్నారే?" అలా అనుకోగానే వారి ప్రేమ, ఆప్యాయతలకు నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అదే రోజు బస్సులో నేను హైదరాబాదుకు తిరుగు ప్రయాణమయ్యాను. బస్సులో కూర్చొని ఉన్నానన్న మాటే కాని గురువుగారి ప్రేమపూరితమైన పలకరింపు, తోటివారి పట్ల వారి శ్రద్ధ గుర్తుకు వచ్చి కళ్ళు చెమ్మగిల్లుతూనే ఉన్నాయి. ఆ ఆలోచనలతో ఎప్పుడు నిద్రపోయానో తెలియదు. బస్ హైదరాబాద్ చేరుతుండగా మెలకువ వచ్చింది. మెలకువ రావడంతోనే నా నోటిలో నుండి ఏదో వెళ్ళిపోయినట్లు అనిపించింది. అంతే ఆ రోజు నుండి మళ్ళీ ఎప్పుడూ కిళ్ళీ వేసుకోవాలనిపించలేదు!

# చిరునవ్వే ఆయుధం

బచ్చలి వెంకటరమణ
ఉద్యోగి, కందుకూరు
జన్మించిన సం॥ 1963

కందుకూరు, మార్చి 2000

నాకు సిగరెట్లు ఎక్కువగా కాల్చే అలవాటుండేది. ఆ వ్యసనం మంచిది కాదని తెలిసినా మానలేకపోయేవాడిని. ఒకసారి గురువుగారిని దర్శించుకున్నప్పుడు, వారిని "నాకు సిగరెట్ మానేసే శక్తిని ప్రసాదించండి" అని అడిగాను. వారు దానికి చిరునవ్వు నవ్వారు తప్ప ఏం మాట్లాడలేదు. విచిత్రమేమిటంటే గురువుగారినలా అడిగినప్పటి నుండి నాకు తెలియకుండానే ఆ అలవాటు మరింత ఎక్కువైపోయింది. అలా ఎందుకయిందో నాకర్థం కాలేదు. అది నన్ను మరింత కలవరపరిచింది. ఒకరోజు ఛాతీలో బాగా నొప్పి రావడంతో డా॥ శ్రీనివాసులురెడ్డిగారి దగ్గరకు వెళ్ళాను. ఆయన పరీక్షించి "భయపడాల్సింది ఏమీ లేదు కానీ సిగరెట్లు మానేస్తే మంచిది" అన్నారు.

రాబోయే ఉగాది నుండి పూర్తిగా మానివేస్తానని ఆయనతో చెప్పాను. అట్లా అని మనసులో నాకు నేను గట్టిగా నిశ్చయించుకున్నాను. 1998 మార్చి 18వ తేదీన శిరిడీ వెళ్ళాను. బాబా, గురువుగారి దర్శనం చేసుకున్నాను. కానీ ఆ రోజు కూడా ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు సిగరెట్ త్రాగుతూనే ఉన్నాను. లోలోన అపరాధభావంగా ఉన్నా సిగరెట్ కాల్చకుండా నన్ను నేను నిగ్రహించుకోలేకపోయాను. గురువుగారి దర్శన సమయంలో 'మాట నిలుపుకోలేకపోతున్నందుకు క్షమించమని, ఇక నాకు మీరే సహాయం చేయాలి' అని మనసులో చాలాసార్లు ప్రార్థించుకున్నాను.

19వ తేదీ ఉదయం మామూలుగా సిగరెట్ కాల్చబోయాను. ఒక్కసారిగా తల తిరిగినట్లనిపించింది. నాలోని శక్తి పూర్తిగా హరించుకుపోయినట్లనిపించి నిలబడడానికి కూడా ఓపిక లేకపోయింది. వాంతి వచ్చేలాగ అనిపించింది. వ్రేళ్ళ మధ్య సిగరెట్ దానంతటదే జారి క్రింద పడిపోయింది. అంతే. అదే నేను కాల్చిన ఆఖరి సిగరెట్. మళ్ళీ ఆ కోరిక కలుగలేదు సరికదా ఆ వాసనంటేనే వెగటైపోయింది. నేనెంత ప్రయత్నించినా మానివేయలేని దుర్వ్యసనాన్ని గురువుగారు "చిరునవ్వు" అనే ఆయుధంతో తొలగించేశారు.



బాబా చూసుకుంటారు

# మోడల్ స్కూల్

నంబూరి గీత
గృహిణి, హైదరాబాద్
జన్మించిన సం॥ 1970

హైదరాబాద్, సెప్టెంబర్ 2001

మా పాప వ్యూహకు మూడేళ్ళు వచ్చేటప్పటికి, ఏ స్కూల్లో చేర్పించాలి అనే సమస్య ఎదురయింది. మా బాబు గౌతమ్‌ను స్కూల్లో చేర్పించేటప్పుడు అందర్నీ విచారించి, ఎంతో గొప్పగా ఊహించి, చేర్పించిన స్కూల్లో బోధన అంతంత మాత్రంగానే ఉంది. ఆ స్కూల్ విద్యావిధానము, ఆ వాతావరణం మాకు సంతృప్తినివ్వకపోవడంతో ఇక పాపను ఎక్కడ చేర్పించడమన్నది పెద్ద సమస్య అయిపోయింది. ఇటువంటి పరిస్థితి ఎదుర్కోని వారికి ఇదసలు సమస్యగానే తోచకపోవచ్చు కానీ, మాకు మాత్రం ఏం చేయాలా అని అదే ఆలోచనైపోయింది.

ఆ పరిస్థితుల్లో మా వారు శిరిడీ వెళ్ళి, విషయాన్ని గురువుగారికి విన్నవించారు. గురువుగారు ఆ సందర్భంగా అసలు నేటి విద్యావిధానమెలా ఉన్నదీ, పలురకాల విద్యాబోధనలు, దానికి తగ్గ బోధనా ప్రమాణాలెలా ఉండాలి అన్న అంశాల గురించి వివరిస్తూ, ఆదర్శవంతమైన పాఠశాల అంటే ఎట్లా ఉంటుందో చెప్పారట.

***గురువుగారు:*** *వ్యక్తిలో తెలుసుకోవడం, నేర్చుకోవడం మొదలైన సహజ గుణాలు సంస్కరింపబడడంవల్ల వారిలో నిద్రాణంగా ఉండే సామర్థ్యాలు మేల్కొంటాయి. ఆ సంస్కారమే “విద్య”. అవగాహన చేసుకోవడం, నేర్చుకోవడం అనేవి విద్య యొక్క ప్రధాన లక్ష్యాలైతే, దానికి బదులు ఈనాటి విద్యావిధానం జ్ఞాపకముంచుకోవడం, జ్ఞాపకముంచుకొన్న విషయాన్ని తిరిగి యథాతథంగా పరీక్షలో కక్కడం అనే దానికి పరిమితమవుతోంది. దానికి కారణం పిల్లలలో విద్యాసక్తి (లవ్ ఆఫ్ లెర్నింగ్)ని, జిజ్ఞాసను పెంపొందించే విద్యాప్రణాళిక లేకపోవడమే.*

*అది కొరవడడంతో పిల్లలు భయభక్తులతో చదువుకుంటున్నట్లు కనిపించినప్పటికీ, విద్యపట్ల ఆసక్తిని, ఇతరుల పట్ల ప్రేమను, సమాజం పట్ల మానవత్వాన్ని కోల్పోతున్నారు.*

*వారి మనస్సునెరిగి తగు రీతిన చెప్పగలిగేవారు దొరకాలేగానీ ఆ వయస్సులో నేర్చినంత విద్యను మరే వయసులో నేర్వలేరనే చెప్పాలి. వారికి ప్రత్యేకంగా పాఠాలు చెబుతున్నట్లు తెలియకుండా, విద్యను ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా అందించగల విధానం కావాలి. పిల్లలకు వారి ఇష్టప్రకారం వారు చేస్తున్నట్లు అనిపించాలే తప్ప, తప్పనిసరిగా చెయ్యాలి కాబట్టి చేస్తున్నాము అనిపించకూడదు. స్కూల్‌లో అటువంటి వాతావరణం ఇవ్వగలిగి ఉండాలి.*

అదంతా విన్న మా వారికి, మేము ఆశించే విధంగా పనిచేసేటటువంటి స్కూలే కనిపించడం లేదు కదా, ఇక గురువుగారు చెప్పిన ప్రమాణాలున్న స్కూల్ అసలు ఎక్కడైనా ఉంటుందా అనే అనుమానం వచ్చింది. శిరిడీ నుండి తిరిగి వచ్చాక మా ఊహలు, ఆశలు ప్రక్కన పెట్టి గురువుగారు సూచించిన ప్రకారం ఉండే స్కూలుకై అన్వేషణ ప్రారంభించారు మా వారు.

సరిగ్గా అదే సమయంలో ఒకరోజు నా చిన్ననాటి స్నేహితురాలు కనిపించింది. ఆమె, నేనూ కూర్చుని కబుర్లన్నీ కలబోసి మాట్లాడుకుంటూండగా, టాపిక్ పిల్లల చదువుల దగ్గరకొచ్చింది. మా సమస్య విని ఆమె ఒక స్కూల్ పేరు చెప్పింది. ఆ స్కూల్ గురించి వింటున్న నాకు, గురువుగారు సూచించిన స్కూల్ అదే అనిపించింది. ఎంతో ఉత్సాహంతో స్కూల్ వివరాలన్నీ వింటున్న నేను ఆమె చివరగా చెప్పిన విషయంతో నీరసపడిపోయాను. వాళ్ళబ్బాయికి ఆ స్కూల్లో సీటు కోసం ప్రయత్నిస్తే అప్పటికే సీట్లన్నీ అయిపోయాయని చెప్పారట. క్షణాలలో ఉవ్వెత్తున ఎగసిన ఉత్సాహము, సంతోషము అంతే వేగంగా చల్లారిపోయాయి. సీట్లు లేకపోయాక, ఎంత మంచి స్కూల్ అయితే ఏం లాభం? అనిపించింది.

మా వారు మరల శిరిడీ వెళ్ళి ఇదంతా గురువుగారికి చెప్పారు.

*“ఆ స్కూల్లోనే ప్రయత్నించండి. నిజంగా మంచిదే అయితే బాబా సీటు ఇప్పిస్తారులే”* అన్నారట గురువుగారు.

మా వారు గురువుగారి ఆశీర్వాదం పొంది, శిరిడీ నుండి రాగానే బాబా ఊదీ, ప్రసాదం, శ్రీసాయిసచ్చరిత్ర తీసుకుని, మేము ఆ స్కూల్ డైరెక్టరును కలిసేందుకు వెళ్ళాము. మేము వెళ్ళేటప్పటికి, ఆమె స్కూల్‌కు వచ్చి వెళ్ళిపోయారని, ఇక మళ్ళీ

రారని చెప్పారు. చేసేదేం లేక మేము తీసుకెళ్ళిన ప్రసాదం, ఊదీ, సచ్చరిత్రతో పాటు మా వారి విజిటింగ్‌కార్డ్ డైరెక్టర్‌గారికి అందజేయవలసిందిగా అక్కడున్న వారికి ఇచ్చి ఇంటికి వచ్చేశాము. ఆ స్కూల్లో సీటు దొరికే సూచనలేవీ కనిపించకపోవడంతో దాదాపు అది ఒక వృథా ప్రయత్నమని, ఇక మేము ఆ స్కూల్ గురించి మరచిపోవచ్చని అనుకొన్నాము. కానీ ఎవరు మరచిపోయినా గురువుగారు మనల్ని మరచిపోరుగా! ఆ మరునాడే మేమూహించని విధంగా డైరెక్టరుగారే ఫోన్ చేసి మమ్మల్ని స్కూలుకు రమ్మని ఆహ్వానించారు.

మేము స్కూల్‌కి వెళ్ళాము. ఆమె మమ్మల్నెంతో ఆప్యాయంగా ఆహ్వానించి, వారికి కలిగిన అనుభవాన్ని ఈ విధంగా చెప్పారు: "నేను మా ఇంట్లో నిన్న మొదటిసారిగా సాయిబాబా సత్సంగాన్ని ఏర్పాటు చేసుకొని బంధువులను పిలుచుకున్నాను. సరిగ్గా అదే సమయంలో స్కూల్ నుండి అటెండర్ వచ్చి, ఎవరో శిరిడీ నుండి వచ్చి ఈ బాబా ప్రసాదాన్ని మీకు అందజేయమన్నారని చెప్పి, నాకు మీరు ఇచ్చిన ప్రసాదాన్ని ఇచ్చి వెళ్ళాడు. నాతో సహా అక్కడున్న మేమందరమూ విభ్రాంతి చెందాము. ఇది బాబా అనుగ్రహంగా భావించి చాలా సంతోషించాము. నేనిది బాబా ఆనతిగా భావించి మీ ఇద్దరి పిల్లలకు స్కూల్‌లో సీట్లు ఇస్తాను".

మా ఆనందానికి అవధుల్లేకపోయాయి. నిజానికి ఒక్క సీటు కోసమే ముందు ప్రయత్నించాము. గురువుగారు మా ఇద్దరు పిల్లలకీ ఒకేసారి అంత మంచి స్కూల్లో సీట్లు ఇప్పించారు. అంతే కాకుండా ఈ సంఘటనతో ఆ డైరెక్టరు వాళ్ళ కుటుంబాన్ని తమ అనుగ్రహ పరిధిలోకి చేర్చుకున్నారు. ఈ సంఘటన ద్వారా సద్గురువు అనుగ్రహాన్ని పొందిన భక్తులకు, వారిలోని భక్తివిశ్వాసాలు మరింత ఇనుమడించి, సద్గురువు యొక్క ప్రేమను వారు ఎలా ఆస్వాదిస్తారనేది అవగాహన చేసుకోవడానికి నాకు ఒక సదవకాశం కలిగింది.

# సాయి అనుగ్రహ ప్రతిష్ఠ

హరిశ్చంద్ర. డి. గవారే
గవర్నమెంట్ ఉద్యోగి, శిరిడీ
జన్మించిన సం॥ 1960

శిరిడీ, నవంబర్ 2000

మా కుటుంబానికి షోలాపూర్ ప్రాంతంలోని సర్పదోహ్‌లో కొంత వ్యవసాయ భూమి ఉంది. మేమక్కడ 1993లో సాయిబాబా మందిర నిర్మాణాన్ని ప్రారంభించాం. మందిరం పూర్తవడానికి ఐదు సంవత్సరాలు పట్టింది. మందిరంలో ప్రతిష్ఠించడానికి జైపూర్‌లో రూపుదిద్దుకున్న సుందరమైన సాయిబాబా పాలరాతి విగ్రహం 1997 నాటికి సిద్ధమైంది. విగ్రహప్రతిష్ఠను తమ చేతుల మీదుగా జరిపించమని పలుమార్లు గురువుగారికి విన్నవించుకున్నాను. ప్రతిసారీ గురువుగారు అంగీకారసూచకంగా తలూపేవారు.

జనవరి 3, 2000 సంవత్సరంలో మహారాష్ట్ర మరియు ఆంధ్రప్రదేశ్ నుండి వేలాదిమంది భక్తులు ఆ గ్రామానికి తరలివచ్చారు. ఆ చిన్న గ్రామం మిగతా గ్రామాలకు బాగా దూరంగా ఉండేది. కానీ అది భక్తుల రాకకు పెద్ద అడ్డంకి కాలేదు. విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవంలో పాలుపంచుకుని, గురువుగారి దర్శనం చేసుకోవడానికి బస్సుల్లో, కార్లలో, సైకిళ్ళ మీద ఇంకా ఎడ్లబండ్ల మీద అసంఖ్యాకంగా ప్రజలు విచ్చేశారు. భక్తులు "సాయిబాబా సాయిబాబా" అని నామాన్ని ఆలపిస్తుండగా, పూజ్య గురుదేవులు ఆ నూతన మందిరంలో సాయినాథునికి ప్రథమ ఆరతినిచ్చి, విగ్రహాన్ని ఆవిష్కరించారు. అది మహోన్నతమైన అనుభూతి. ఆ క్షణాలు ఎంతో విశిష్టమైనవి.

మేము 3000 మంది భక్తులు వస్తారని అంచనా వేసి, దానికి తగినట్లు ఏర్పాట్లు చేశాము. కానీ 6000 మంది భక్తులు వచ్చారు. గురువుగారి అనుగ్రహవిశేషంగా అన్నప్రసాదం అందరికీ సరిపోయింది. నా స్వప్నం సాకారమైన అద్భుతమైన రోజు అది. ఆ మధుర జ్ఞాపకాలను నేనెన్నటికీ మరువలేను.

## ఆ కరుణామయుని చూపు - కష్టాలను రూపుమాపు

పన్నం శ్రీనివాసులు
టెలిఫోన్ బూత్ ఓనర్, నెల్లూరు
జన్మించిన సం॥ 1953

నెల్లూరు, జూన్ 2001

తోటపల్లిగూడూరు హైస్కూలులో చదువుకొనే రోజుల్లో నేను గురువుగారికి సహాధ్యాయిని. ఆ రోజుల్లో గురువుగారితో నాకు వ్యక్తిగత పరిచయం లేకపోయినా కాలేజీలో మంచి పేరున్న విద్యార్థిగా వారు నాకు తెలుసు.

30 సంవత్సరాల తరువాత వారిని నేను శిరిడీలో కలుసుకున్నాను. అక్కడ గురువుగారిని దర్శించిన క్షణంలోనే ఏదో తెలియని భావావేశం నన్ను చుట్టుముట్టింది. చాలాసేపు ఏడుస్తుండడమే తప్ప నేనేం మాట్లాడలేకపోయాను.

ఆ తర్వాత, కొంతకాలానికి నేను ఆర్థికపరమైన ఇబ్బందులలో చిక్కుకొని, అప్పులపాలై, కుటుంబాన్ని ఎలా పోషించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడ్డాను. ఆ పరిస్థితుల్లో అప్పులు తీర్చడానికి నాకున్న షాప్‌ని అమ్మడం ఒక్కటే పరిష్కారంగా తోచింది. శిరిడీ వెళ్ళి నా హృదయవేదనంతా గురువుగారికి నివేదించుకొని, షాప్ ఫోటో ఒకటి వారి చేతిలో పెట్టాను.

గురువుగారు ఆ ఫోటో వైపు తదేకంగా చూస్తూ, రెండు నిమిషాలు దృష్టి నిలిపారు. తర్వాత "బాబా చూసుకొంటారు. షాపు అమ్మవద్దు" అన్నారు.

ఆ ఆశీర్వాదంతో నాకు కొంత ప్రశాంతత చిక్కినా, ఆందోళన పూర్తిగా పోలేదు. గురువుగారెలా అనుగ్రహిస్తారో అని ఆలోచించుకొంటూ నెల్లూరుకు తిరిగి వచ్చాను.

శిరిడీ నుండి వచ్చిన పదిరోజులకు నేను టెలిఫోను డిపార్టుమెంటుకు వెళ్ళాను. అప్పటికి చాలారోజుల క్రితం ఒక ఫోన్ కనెక్షన్ కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. నేను ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆ పని కాలేదు. అక్కడ ఒక వ్యక్తి నాకు ఎదురుపడి, విచారంగా ఉన్న నన్ను చూసి "ఏమిటి విషయం?" అని అడిగాడు. నా ఫోన్ అప్లికేషన్ సంగతి అతనితో చెప్పాను.

అసలు అంతకు ముందు ఏ మాత్రం ముఖపరిచయం కూడా లేని ఆయన వెంటనే చిన్న కాగితం మీద తన పేరు, పర్సనల్ ఫోన్ నెంబరు వ్రాసిచ్చి, వారం తరువాత తనకు ఫోన్ చేయమని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ పేరు, ఫోన్ నెంబరు

చెప్పి ఆ ఆఫీసులో విచారించగా ఆయనక్కడ సబ్ డివిజనల్ ఆఫీసర్ అని తెలిసింది. ఒక వారం తర్వాత, అంత పెద్ద ఆఫీసర్‌తో ఫోన్‌లో మాట్లాడడం కంటే నేరుగా కలవడం బాగుంటుందనిపించి వెళ్ళి కలిశాను. ఆయన నన్ను లోపలికి పిలిచి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. నా వివరాలన్నీ విని తానూ సాయిబాబా భక్తుణ్ణనీ, గురువుగారిని తాను చాలాసార్లు దర్శించానని, వారి గురించి గౌరవంగా మాట్లాడారు. నా పరిస్థితి విని, యస్.టి.డి. బూత్ పెట్టుకోమని సలహా ఇచ్చారు.

వారి మాట సాయంతో మరో మూడువారాలలోపు నాకు క్రొత్త టెలిఫోన్ కనెక్షన్ వచ్చింది. కంప్యూటర్, కాన్ఫరెన్స్ కాల్ సౌకర్యం అన్నీ సమకూరినాయి. క్రొత్త యస్.టి.డి. షాపుకు "సాయినాథుని ప్రజా టెలిఫోన్" అని పేరు పెట్టుకొని మొదటి కాల్ శిరిడీకి చేశాను. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే నాకున్న బాకీలన్నీ తీర్చేయగలిగాను. అంతేగాక నా కుటుంబాన్ని ఈనాడు సంతృప్తిగా పోషించుకోగలుగుతున్నాను.

నేను మా షాప్ ఫోటో ఇచ్చినప్పుడు, గురువుగారి నోటి వెంట వచ్చిన ఆశీర్వాదమే నాకు రక్షణ కవచమై ఆర్థికంగా చితికిపోయిన నన్ను నిలబెట్టింది. వారి అనుగ్రహధారలలో నా కష్టం కరిగిపోయింది.

***భక్తుడు:*** *గురువుగారూ! ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ సద్గురువుంటారా?*

***గురువుగారు:*** *అవును ఉంటారు. కానీ ఏ రూపంలో ఉన్నారనేది తెలియపరచడానికి సద్గురువు తగిన సమయం ఎన్నుకొంటారు. ఇక్కడ సద్గురువుని తెలుసుకొనే సమయం మన ఇష్టానుసారం ఉండదు. నీ ఎఱుకలో లేకపోయినా, సద్గురువు యొక్క ప్రభావం నీ పట్ల ప్రసరిస్తూనే ఉంటుంది.*

***భక్తుడు:*** *సార్! ప్రతి ఒక్కరికి సద్గురువు ఉంటారా? ఈ జన్మలోనేనా? లేక వేరే జన్మలోనా?*

***గురువుగారు:*** *ప్రతి ఒక్కరికీ ఉండవలసినదే. ఈ జన్మలో కానీ లేక ఏ గత జన్మలోనైనా కానీ. జన్మ, మరుజన్మ అనేవి నీ అనుభవాలే కానీ సద్గురు దృష్టిలో అవన్నీ ఒకే దాని క్రింద లెక్కకు వస్తాయి, ఒకరోజు.*

***భక్తుడు:*** *ఇక్కడ మేం చదువుతున్న చాలా మంది అనుభవాల్లో, ఆ భక్తులకు*

చాలా సంవత్సరముల నుండి ఉన్న సమస్యలయినా, వాళ్ళు అడిగిన తర్వాతనే ఆ సమస్య తీర్చబడుతుంది. ఎందుకు?

**గురువుగారు:** వారికి ఆ అనుభవం ఆ సద్గురువు ద్వారానే వచ్చినది అని తెలియాలి. అది తెలుసుకొన్న తరువాత దాని ద్వారా వచ్చే అనుబంధం, పెరిగే ప్రేమ వారిలో పరివర్తనకు దారి తీస్తుంది. ఇక్కడ బాబా ముఖ్య ఉద్దేశ్యం మీ కోరికలు తీర్చడం కాదు. ఆ తీర్చడం ద్వారా మీలో కలిగే పరివర్తనే (transformation).

**భక్తుడు:** కానీ భక్తుల దృష్టి మాత్రం ముఖ్యంగా కోరిక తీరడం పట్లే కేంద్రీకృతమై ఉన్నట్లుంటుంది.

**గురువుగారు:** వారికి అలానే ఉంటుంది. కానీ నేను బాబా వైపు నుండి చూస్తున్నాను. అడిగే వారికి కోరిక తీరడమే కావలసింది. వారికి పరివర్తన పైన ఆలోచనే ఉండదు. కానీ బాబా తీర్చేది పరివర్తన కోసమే. వారికి ఆ పరివర్తన జరుగుతోంది అనేది తెలియకపోవచ్చు. కానీ దాని వల్ల ఏమీ లోటు లేదు. వారికి ఆ అనుభవం బాబా ఇచ్చారని తెలిస్తే అదే చాలు.

# పవిత్ర స్పర్శ

సురేష్‌భాయ్ లోక్‌చందాని
వ్యాపారస్థుడు, శిరిడీ
జన్మించిన సం॥ 1963

శిరిడీ, జూన్ 2001

నేను 1996లో గురువుగారిని ప్రథమంగా దర్శించుకున్న ఆ క్షణాలను నేను ఎన్నటికీ మరచిపోలేను. నా నుదుటి మీద గురువుగారు ఊదీ పెట్టినప్పుడు నేను చాలా తేలికై పోయి తేలిపోతున్న అనుభూతి కలిగింది. అప్పటి నుండి గురువుగారు శిరిడీలో ఉన్నప్పుడు నేను వారిని క్రమం తప్పకుండా దర్శించుకునేవాడిని.

ఆరునెలల పాటు నేను విపరీతమైన వెన్నునొప్పితో బాధపడ్డాను. నిలుచున్నా, కూర్చున్నా, పడుకున్నా ఏం చేసినా సరే బాధ దుర్భరంగా ఉండేది. చివరికి భరించలేక దీని గురించి, దర్శనసమయంలో గురువుగారికి చెప్పుకున్నాను. గురువుగారు నన్ను వెనుకకు తిరగమని చెప్పి, నా వెన్నుపూసను స్పృశించారు. తరువాత బాబా చిత్రపటం వైపుకు చూసి నమస్కరించి, నా నుదుటి మీద ఊదీ పెట్టారు. నేను గురువుగారి పాదాలకు నమస్కరించి సులభంగా పైకి లేవగలిగాను. నొప్పి ఏమాత్రం లేకపోవడంతో అది సాధ్యమయింది. నొప్పి పూర్తిగా తగ్గిపోయింది. తరువాత అది నన్ను ఎన్నడూ బాధించలేదు.

***గురువుగారు:*** *"ఋణానుబంధం లేక ఎవరూ నీ వద్దకు రారు. నీ దగ్గరకు వచ్చిన వారిని ఆదరించి నీకున్నది వారితో పంచుకోమని" బాబా అన్నారు. అలానే నేను ఎవరినీ ఆహ్వానించను. ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వను. కానీ వారంతట వారే వస్తే, వారిని బాబానే పంపారు అని భావిస్తాను. నాకు వారు బాబా ప్రసాదం. బాబా ప్రసాదంగానే వారిని భావించి, వారిని అలా గౌరవించి, నాకున్నది వారితో పంచుకొంటాను.*

# సాయి నిలయం

జొన్నగడ్డల సుబ్బయ్య
గవర్నమెంట్ ఉద్యోగి, చంద్రగిరి
జన్మించిన సం॥ 1968

చంద్రగిరి, జూన్ 2002

చాలారోజులుగా నాకు ఇల్లు కట్టుకోవాలన్న కోరిక ఉండేది. దానికి కావలసిన ఏర్పాట్లు చేసుకొని, కట్టదలచుకొన్న ఇంటికి "సాయినిలయం" అన్న పేరు నిర్ణయించుకొని, బాబాకి, గురువుగారికి పూజ చేసి పని మొదలుపెట్టాము. ఇంటి నిర్మాణం వేగంగానే జరుగుతోంది. అయితే నేనొక పెద్ద పొరపాటు చేశాను. నాకున్న ఉత్సాహంలో ముందూ వెనుక చూసుకోకుండా అనాలోచితంగా రెండు ఇళ్ళు కట్టే పని ఒకేసారి పెట్టుకున్నాను. దాంతో డబ్బు సరిపోలేదు. ఇళ్ళ నిర్మాణం మధ్యలో అర్థాంతరంగా ఆపేయవలసి వచ్చింది. ఇంక ఆ సమస్యను గురువుగారే తీర్చాలి అనుకున్నాను. గురువుగారికి చెప్పుకుందామని శిరిడీ బయలుదేరి వెళ్ళాను. వెళ్ళేటప్పుడు కట్టడం ఆగిపోయి ఉన్న రెండు ఇళ్ళ ఫోటోలు తీయించి, వాటిని కూడా పట్టుకెళ్ళాను.

శిరిడీలో గురువుగారి దర్శనానికి కొద్దిగంటల ముందు, 1997లో నేను వారిని మొదటిసారి దర్శించుకొన్న సంఘటన ఎందుకో గుర్తుకు వచ్చింది. అప్పుడు గురువుగారు నన్ను మా ఊరిలో సాయిబాబా సత్సంగం చేసుకోమన్నారు. ఊరికి వచ్చిన తర్వాత సత్సంగం మొదలుపెట్టాను కానీ దానికి సరైన స్థలమూ, సౌకర్యమూ లేక కొన్నాళ్ళకే ఆగిపోయిందది. ఇప్పుడా విషయం గుర్తుకు రావడంతో, మా ఇంటిపైనే హాల్ ఒకటి నిర్మించుకొని, అందులో సత్సంగం నిర్వహించుకోవాలని మనసులో నిశ్చయించుకున్నాను.

దర్శన సమయంలో గురువుగారికి నమస్కరించుకొని, ఇళ్ళ ఫోటోలు వారి ముందు పెట్టి "గురువుగారూ! డబ్బు సరిపోక కట్టుబడి ఆగిపోయింది. పని పూర్తయ్యేలా మీరే అనుగ్రహించాలి. అంతేకాదు పైన సత్సంగం హాల్ కూడా కట్టాలనుకొంటున్నాను. దానికి మీ ఆశీస్సులు కావాలి" అనడిగాను.

గురువుగారు ఫోటోల వంక దృష్టి సారించి "*కట్టు!*" అన్నారు.

"డబ్బు విషయమే భయంగా ఉందండి" అన్నాను.

"భయం లేదు. బాబా చూసుకొంటారు. నువ్వు కట్టు" అన్నారు.

నేను వారి ఆశీస్సులు అందుకొని ఊరికి తిరిగి రాగానే తలవని తలంపుగా అప్పుడే లండన్ నుండి వచ్చిన నా భార్య అక్కగారు, మా ఇంటి పని ఆగిపోయిన సంగతి తెలుసుకుని వెంటనే రెండు లక్షల రూపాయలు సర్దుబాటు చేశారు. ఇంటి పని తిరిగి మొదలుపెట్టాను. శరవేగంగా పని జరిగి అనుకున్న దానికన్నా అందంగా అన్ని హంగులతో మార్బుల్ ఫ్లోరింగ్‌తో సహా చేయించగలిగాను. 2000వ సంవత్సరం విజయదశమికి గురువుగారి ఆశీస్సులతో 'సాయినిలయం'లో గృహప్రవేశం చేసుకోగలిగాను. ఆ సందర్భంగా సత్సంగం, సాయిప్రసాద వినియోగం నిర్వహించాము. ఆనాటి నుండి ప్రతి గురువారం క్రమం తప్పకుండా "సాయి నిలయం"లో సత్సంగం జరుగుతోంది.

***భక్తుడు:*** *సత్సంగాలు జరుపుకోవడానికి గైడ్‌లైన్స్ ఏమైనా చెప్పండి గురువుగారూ!*

***గురువుగారు:*** *అన్నింటికంటే ముఖ్యమైన గైడ్‌లైన్ ఒకటే. సత్సంగాలు ఎందుకు చేసుకుంటున్నాం అనేటువంటి లక్ష్యాన్ని గుర్తు పెట్టుకోండి. సత్సంగం– బాబా స్మరణలో ఉంటూ, బాబాకు మనల్ని మనం దగ్గర చేసుకునేటువంటి ప్రయత్నం మాత్రమే అనే విషయం గుర్తు పెట్టుకుంటే ఏ గైడ్‌లైన్స్ అవసరం లేదు. అది మరచిపోయినపుడు వంద సమస్యలు వస్తాయి. వంద గైడ్‌లైన్స్ వస్తాయి. వంద గైడ్‌లైన్స్ అయిన తర్వాత నూట ఒకటో సమస్యా వస్తుంది. నూట ఒకటో గైడ్‌లైన్ కావల్సి వస్తుంది. ఈ ఒక్క గైడ్‌లైన్ గుర్తుపెట్టుకుంటే ఇంకేమీ అవసరం లేదు.*

*మనకు బాబా పట్ల ఉండేటువంటి ప్రేమ ఎటువంటిది? చిన్న గుడ్డి దీపంలాంటిది. అది ఈ ప్రపంచం అనేటువంటి గాలికి త్వరగా ఆరిపోతుంది. కాబట్టి దానిని ఆరిపోకుండా ఉంచే చిమ్నీలాంటిదే సత్సంగం. అది బాబా ప్రచారానికి కాదు. ఎవరినీ ఉద్ధరించడానికి కాదు. దీని ద్వారా ఇంకేదో సాధించాలని కాదు. బాబా యొక్క స్మరణలో ఉండడానికి, బాబాను గుర్తుపెట్టుకోవడానికి, బాబా పట్ల మన ప్రేమను పెంచుకోవడానికి, బాబాకు మరింత దగ్గర కావడానికి ఒక సాధనం*

మాత్రమే అని గుర్తుపెట్టుకుంటే ఏ సమస్యలు రావు. అది మరచి పోయినప్పుడే అన్ని సమస్యలు వస్తాయి.

మనం చిన్న మొక్కలా ఉన్నాం. అలా కంచె లేకుండా వదిలేస్తే ఏ మేకలయినా తినేస్తాయి. కాబట్టి కంచె కట్టుకోవాలి. ఈ కంచె లాంటిదే సత్సంగం. అది మనం సరిగ్గా చేస్తున్నామా లేదా అనే దానికి, సత్సంగం బయట మనం చేసేటువంటి పనులు చెప్తుంటాయి. ఇక్కడ సత్సంగం చేస్తే బయట మనలో మార్పు రావాలి. మన ఆలోచనావిధానంలో, మన ప్రవర్తనలో, మన ఆచరణలో మార్పు రావాలి. ఆ మార్పు రాకుండా అయితే మాత్రం మీరు సరైన పద్ధతిలో సత్సంగం చేయడం లేదనే చెప్పాలి. మనలో పరివర్తన తేనటువంటి సత్సంగాలు అవసరం లేదు.

మీలో ఉండే ప్రేమను మీరు వృద్ధి చేసుకొని, ఈ ప్రేమ అనేటువంటి అగ్నిలో మనలో ఉండే బలహీనతలనన్నింటినీ భస్మం చేసుకొనే ప్రక్రియ మాత్రమే. ఎప్పటికప్పుడు మనలను మనం దృష్టిలో పెట్టుకొని, మనల్ని మనం ఆత్మ పరిశీలన చేసుకొంటూ చేస్తే, సత్సంగం కరెక్టుగా ఉంటుంది. మనకింకా బాబా యొక్క రక్షణ, బాబా యొక్క మహిమ అనుభవమౌతుంది.... లేకపోతే చాలామందికేమిటంటే మొదట మొదట కొంత అనుభవమవుతుంది. ఆ తర్వాత మాకు అనుభవం కావడం లేదు అంటారు. ఎందుకు కావడం లేదో ఆలోచించుకోండి.

# శుభం

అద్దంకి ఝాన్సీ
గృహిణి, తెనాలి
జన్మించిన సం॥ 1967

తెనాలి, ఫిబ్రవరి 2001

మేము గురువుగారిని మొదటగా 1984లో మా గుప్తా మామయ్య ద్వారా కలిశాము. అప్పటి నుండి మా కుటుంబమంతా గురువుగారి దగ్గరకు తరచుగా వెళుతూ ఉండేవాళ్ళం. వారూ మా పట్ల ఎంతో ఆదరాభిమానాలను కనబరచేవారు.

1988వ సంవత్సరం విజయవాడలో, గురువుగారి సమక్షంలోనే నా వివాహం జరిగింది. అప్పట్లో మా వారు శివరాంగారికి గురువుగారి గురించి ఏమీ తెలియదు. నేను చెప్పబోయినా ఆయనేమీ ఉత్సాహం చూపేవారు కాదు. అందుకే వివాహమైన మూడేండ్ల వరకూ మా వారు నన్ను గురువుగారి దగ్గరకే తీసుకెళ్ళలేదు.

ప్రతిరోజు నేను బాబా ఫోటో ముందు "బాబా! మా వారిని కూడా గురువుగారి దగ్గరకు చేర్చు" అని ప్రార్థించేదాన్ని. నా ప్రార్థనలు ఫలించాయి. ఇప్పుడు మా వారికి గురువుగారంటే ప్రాణం!

నాకు తొలి కాన్పులో అమ్మాయి పుట్టింది. తర్వాత బాబు పుట్టాలని గురువుగారిని అడిగాము. వారు చిరునవ్వుతో "శుభం" అన్నారు.

రెండవసారి ప్రెగ్నెంట్ అయినప్పటి నుండి నేను రోజూ శ్రీసాయి సచ్చరిత్ర చదివి, క్రమం తప్పకుండా మధ్యాహ్న ఆరతి ఇచ్చేదాన్ని. మేము కోరుకున్నట్లుగానే గురువుగారు మాకు బాబును ప్రసాదించడమే కాదు, నాకు ప్రసవ సమయంలో అద్భుతమైన అనుభవాన్ని కూడా అనుగ్రహించారు. మొదట డాక్టర్లు చెప్పిన తేదీ దాటిపోతున్నా నాకు డెలివరీ కాలేదు. డాక్టర్లు నాలుగు రోజులు ఆగి అయిదవ రోజు రమ్మన్నారు. నేను గురువుగారిని నాకు ఆపరేషన్ లేకుండా నార్మల్ డెలివరీ కావాలని వేడుకున్నాను. అయిదవ రోజు ఉదయమే నన్ను హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. ఆ రోజంతా కూడా నొప్పులు రాకపోయేసరికి సెలైన్ పెట్టారు.

ఆ రోజు రాత్రి నేను గురువుగారిని "గురువుగారూ! మీరేం చేస్తారో నాకు తెలియదు. ఇంక అయిదు నిమిషాల్లో ఏ బాధ లేకుండా కాన్పు అయిపోవాలి" అని గట్టిగా ప్రార్థించుకున్నాను.

గురువుగారు నా మొర ఆలకించారు. నేను గోడ మీద గడియారంలో సెకండ్ల ముల్లు చూస్తూనే ఉన్నాను. ఆశ్చర్యం! అయిదు నిమిషాల్లోనే నాకు ఏ నొప్పులు లేకుండానే ప్రసవమై బాబు పుట్టాడు. ఆ టైమ్‌లో కూడా నేను ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయాను. నర్సు బాబుని చూపించగానే అప్పటిదాకా నేను పెట్టుకున్న బాబా, గురువుగారు ఉన్న బ్యాడ్జ్ వాడి గుండె మీద పెట్టి, బాబా జరీతీర్థం నోటిలో పోశాము. గురువుగారి చేతుల మీదుగా తీసుకొన్న శాలువాలోనే బాబుని పడుకోబెట్టాము. ఇదంతా జరిగేటప్పుడు నేను బాబా నామం చెప్పుకుంటూనే ఉన్నాను. గురువుగారి దయ వలన, నేను బాబు పుట్టినప్పుడు ఎలా అయితే జరగాలనుకొన్నానో అంతా అలాగే జరిగింది.

కాన్పు రాత్రి రెండున్నర గంటలకయింది. అప్పుడు గురువుగారు వారణాసిలో ఉండడంతో మా వారు వెంటనే అక్కడకు తెలియపరుద్దామని ఫోన్ చేశారు. కానీ అక్కడ ఎవరూ ఫోన్ తీయలేదట. మరలా ఉదయం ఆరు గంటలకు ఫోన్ చేస్తే డా॥ నరేంద్ర ఫోన్ తీశారట. మా వారు విషయం చెప్పకముందే "ఝాన్సీకి నొప్పులేమీ లేకుండా డెలివరీ అయింది. అవునా?" అని అడిగారట.

మా వారు ఆశ్చర్యంగా "మీకెలా తెలుసు?" అని అడిగితే "రాత్రి రెండు గంటల దాకా గురువుగారి సత్సంగం జరిగింది. తర్వాత అందరినీ పంపించి వేశారు. ఉన్నట్లుండి వారు విపరీతమైన కడుపునొప్పితో దాదాపు అరగంటసేపు బాధపడ్డార"ని ఆయన అన్నారట.

అంటే నేను పడాల్సిన బాధంతా గురువుగారు స్వీకరించి, నాకు నొప్పులు లేకుండా ప్రసవమయ్యేలా చేశారు. డెలివరీ తరువాత నాకు థైరాయిడ్ ప్రాబ్లమ్ వచ్చింది. డాక్టర్లు దానికి జీవితాంతమూ మందులు తీసుకుంటూ ఉండాల్సిందే అన్నారు. నేను గురువుగారి దగ్గరకెళ్ళి "నేను ఏ మందులూ వేసుకోను. నన్ను కరుణించి మీరే దీన్ని తగ్గించాలి" అని వేడుకున్నాను. గురువుగారి అనుగ్రహంతో నాకు పూర్తిగా తగ్గిపోయింది. నేనిప్పుడు ఏ మందులూ వేసుకోవడం లేదు. ఇంత వరకూ ఏ బాధా లేకుండా హాయిగా ఉన్నాను.

గురువుగారు తిరుమలలో ఉండగా, మా కుటుంబంలోని వారందరమూ వారి దర్శనానికి వెళ్ళాము. ఒకరోజు మధ్యాహ్నం మేమంతా కూర్చొని మాట్లాడుకొంటూ ఉండగా, నేను మా మూర్తి మామయ్యతో "గురువుగారి దగ్గరకెళ్ళిన వాళ్ళందరమూ

ఎప్పుడూ డబ్బు, వ్యాపారాలు, ఆరోగ్యాలు ఇట్లా ప్రాపంచికమైన వాటి గురించే అడుగుతుంటాము. అంతటి మహాత్ముల్ని అడగవలసిన ఆధ్యాత్మికత గురించి అసలేమీ అడగము!" అన్నాను.

మా మామయ్య "మనందరం గురువుగారి రక్షణలో ఉన్నాము. మనం ఎలా అడిగినా, ఏమడిగినా అన్నీ వారే చూసుకుంటారు" అని చెప్పారు.

ఆ సాయంత్రమే మాకు గురువుగారి దగ్గర ఊదీ దర్శనం ఉండడంతో అందరమూ ఒకేసారి వెళ్ళాము. గురువుగారు మాతో మాట్లాడుతూ మధ్యలో "ఒకసారి *బాబాకు శరణాగతి చెందిన తర్వాత ఇక అన్నీ ఆయనే చూసుకుంటారు. వ్యాపారము, డబ్బు వంటి కోరికలే కాదు అన్ని విషయాల్లోనూ అటూ ఇటూ బ్యాలన్స్ చేసుకుంటూ పైకి తీసుకెళతారు*" అని ప్రత్యేకంగా నా వంక చూస్తూ చెప్పారు!

*బాబా ఎన్నడూ ఇహాన్ని నిరసించలేదు. తన భక్తుల పారమార్థిక జీవితం పట్ల మాత్రమే తన బాధ్యత అంటూ, వారి ఐహిక(ప్రాపంచిక) జీవితాన్ని పట్టించుకోక నిర్లక్ష్యం చెయ్యలేదు. తన భక్తుల ఇహపరాల భారం తామే వహిస్తూ వివిధ తరగతుల ప్రజలను, వారి వారి సంస్కారాలకు పరిణతికి అనుగుణంగా లాలించి, బుజ్జగించి, బోధించి, తీర్చిదిద్దడమే బాబా యొక్క ప్రత్యేకత.*

*... శ్రీబాబూజీ విరచిత 'సాయిభక్తి సాధన రహస్యం' నుండి*

# జీవనాధారం

మాగంటి మనోజ శ్రీరామ్
టీచర్, కందుకూరు
జన్మించిన సం॥ 1973

కందుకూరు, మార్చి 2001

నేను ఒక స్కూల్‌లో టీచర్‌గా పనిచేసేదాన్ని. మా వారు పచ్చళ్ళ దుకాణంలో పనిచేసేవారు. మా ఆదాయం మా ఖర్చులకు కూడా సరిపోయేది కాదు. మాకు కందుకూరులో కొంత వ్యవసాయ భూమి ఉంది కానీ దానిలో కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి దిగుబడి లేదు. మాకు ఒక పాత ఇల్లు కూడా ఉంది కానీ దానిని కొనడానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు.

మేము 2000వ సంవత్సరం గురుపూర్ణిమకు శిరిడీ వెళ్ళి, దర్శనసమయంలో డైరీఫాం పెట్టుకోవడానికి గురువుగారి ఆశీస్సులర్థించాము. గురువుగారు ఆశీర్వదించారు. మేము శిరిడీ నుండి వచ్చిన నాలుగు రోజులకే మా వారికి బజార్లో ఎవరో క్రొత్త వ్యక్తి కనబడి, రెండు మంచి గేదెలు అమ్ముతానన్నాడు. అతను గేదెలను మా ఇంటికి తీసుకొచ్చి, డబ్బులు పదిరోజుల తర్వాత ఇవ్వొచ్చునని చెప్పి వెళ్ళిపోయాడు. ఈ విధంగా మా డైరీ ఫాం ప్రారంభమయింది. తర్వాత మేము ఇంకా కొన్ని మంచి గేదెలను కూడా కొనగలిగాము. మా ఈ క్రొత్త వ్యాపారానికి గురువుగారి ఆశీస్సులున్నట్లు స్పష్టమయింది.

కానీ పాలు ఎలా అమ్మడం? మేము గురువుగారి ఫోటోకు నమస్కరించుకుని పాల కొనుగోలుదారులను పంపమని ప్రార్థించాము. ఒక రోజు సత్సంగం తరువాత, ఒక గురుబంధువు మా దగ్గర మంచి నాణ్యమైన పాలు దొరుకుతాయని మైక్‌లో తెలియజేయడంతో, అప్పటి నుండి మాకు సరిపడా కొనుగోలుదారులు లభించారు. గురువుగారి అనుగ్రహంతో మేము ఇప్పుడు రోజుకు 30 లీటర్ల వరకు పాలు అమ్మగలుగుతున్నాము.

ఒకసారి మా వారు బజారుకెళ్ళి తిరిగి వచ్చేలోగా మా గేదెలు కనిపించకుండా పోయాయి. మా వారు అప్పటికప్పుడే వెతకడం ప్రారంభించినా, అవి ఎక్కడా కనిపించలేదు. మేము చాలా ఆందోళన చెందాము. ఆ గేదెల విలువ సుమారు 25,000 రూపాయలు. అంతే కాకుండా అవే మా జీవనాధారం కూడా.

నేను గురువుగారికి నమస్కరించుకుని "గురుదేవా! ఈ గేదెలు మీరు ఎంతో దయతో అనుగ్రహించినవి. అవి వెళ్ళిపోయాయి. వాటి కోసం ఏం చేయాలో, ఎక్కడ వెతకాలో మాకు తెలియడం లేదు. దూడలు కూడా వాటి కోసం అరుస్తున్నాయి. దయచేసి అవి దగ్గరలోనే దొరికేటట్టు అనుగ్రహించమ"ని ప్రార్థించాను.

తరువాత రోజు ఎవరో సత్సంగం దగ్గరకు వచ్చి, అక్కడున్న ఒక భక్తునితో మా గేదెలు కందుకూరు శివారు ప్రాంతంలో కనిపించాయని, ఎవరో పాలు తీసుకుంటున్నారని చెప్పాడు. మేము వెంటనే అక్కడకు చేరుకుని వాటిని ఇంటికి తోలుకుని వచ్చాము. ఈ సంఘటన ద్వారా బాబా, గురువుగారు మమ్మల్ని కనిపెట్టి ఉన్నారని, మాకు ఏ ఆపదా రాకుండా కాపాడుతారని మాకు మళ్ళీ నిరూపితమైంది.

గేదెలను కొనడానికి మేము చేసిన అప్పు కట్టాల్సి ఉంది. మాకున్న మెట్ట భూమిని, చిన్న ఇంటిని అమ్మడమే మాకున్న ఏకైక మార్గం. కానీ వీటిలో దేనినీ కొనడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. ఇంతలో ఒకరు మా భూమిని కొనడానికి ఆసక్తి చూపడం, మంచి రేటుకు దానిని కొనడం జరిగిపోయింది. ఇది జరిగిన కొద్దికాలానికే మా ఇంటిని కొనడానికి మొదట ఒకరు వచ్చారు. అదే సమయంలో వేరొకతను కూడా ఇంటిని కొనడానికి ముందుకు వచ్చాడు. అంతవరకు ఎవ్వరూ కొనడానికి ముందుకు రాని ఆ ఇంటిని కొనడానికి ఇద్దరు పోటీపడటంతో, మేము ఏమీ చెయ్యలేక వీరిద్దరి మధ్య నలిగిపోయేవాళ్ళం.

ఈ విషయం తెలిసిన ఒక గురుబంధువు గురువుగారికి ఉత్తరం వ్రాసుకోమని చెప్పాడు. మేము ఉత్తరం వ్రాయడానికి ముందే గురువుగారు తిరుమలలో ఉన్నారని తెలిసింది. గురువుగారిని దర్శించుకోవడానికి పర్మిషన్ తీసుకుని తిరుమల వెళ్ళాము. గురువుగారి దర్శనంతోనే చాలా ఆనందం కలిగింది. మరేమీ చెప్పలేకపోయాను. మనస్సులోనే మాకున్న సమస్యలను వారికి నివేదించుకున్నాను.

మేము ఇంటికి వచ్చిన కొద్దిరోజులలోనే ఆశ్చర్యంగా ఇల్లు కొనాలనుకుంటున్న ఆ ఇద్దరి మధ్యనున్న వివాదం సామరస్యంగా సమసిపోయింది. గురువుగారి అనుగ్రహానికి, నిరంతం వారు మాకు చేసే సహాయానికి మేము జీవితాంతం గురువుగారికి ఋణపడి ఉంటాము.

# సాధ్యమైన అసాధ్యం

హరిశ్చంద్ర. డి. గవారే
గవర్నమెంట్ ఉద్యోగి, శిరిడీ
జన్మించిన సం॥ 1960

శిరిడీ, నవంబర్ 2000

నేను శిరిడీలో జూనియర్ టెలికామ్ ఆఫీసరుగా పనిచేస్తుండేవాడిని. గురువుగారు నాకు 1992 నుండే తెలుసు. వారు సాయిబాబాకు గొప్ప భక్తులు అని మాత్రం అనుకొనేవాడిని. ఎప్పుడన్నా వారి వద్దకు వెళుతుండేవాడిని కానీ, 1997 వరకు నేనంతగా పట్టించుకోలేదు.

1997లో నాకు సబ్ డివిజనల్ ఇంజనీర్‌గా ప్రమోషన్ ఇచ్చి, శిరిడీకి 80కి.మీ. దూరంలో ఉన్న అహ్మద్‌నగర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ ప్రమోషన్ నాకేమాత్రం సంతోషాన్నివ్వలేదు. ఎందుకంటే శిరిడీలో నాకు స్వంత ఇల్లు, భార్యాపిల్లలున్నారు. పిల్లలు శిరిడీలోనే చదువుకుంటున్నారు. కుటుంబాన్ని అప్పటికప్పుడు అహ్మద్‌నగర్‌కు తరలించడమంటే వీలు కాదు. అసలు శిరిడీ వదిలి వెళ్ళడమన్న ఊహే నాకు భరించరానిదిగా ఉంది. శిరిడీలోనే నా అర్హతకు సరిపోయే ఏదో ఒక పోస్ట్‌లో ఉండాలని నా పరిధిలో సాధ్యమైనంతవరకు ప్రయత్నించాను. కానీ, గత ఏడు సంవత్సరాలుగా నేను శిరిడీలోనే ఉన్నందువలన క్రొత్త పోస్ట్‌లు వచ్చినా ఎట్టి పరిస్థితులలోను నన్ను శిరిడీలో ఉంచడం సాధ్యం కాదని మా జనరల్ మేనేజర్ నిక్కచ్చిగా చెప్పడంతో గత్యంతరం లేక అహ్మద్‌నగర్‌లో జాయినయ్యాను.

శిరిడీ వదలలేక కుటుంబాన్ని శిరిడీలోనే ఉంచి, నేను రోజూ బస్‌లో నగర్‌కు పోయి వస్తుండేవాడిని. రోజూ నాలుగు గంటలు అలా బస్‌లో పోయి రావడం ఎంతో కష్టంగా ఉండేది. ఇదిట్లా ఉండగా డిపార్ట్‌మెంట్ తరఫున ఏదైనా లైన్స్ ప్రాబ్లమ్ వస్తే అప్పుడప్పుడూ సాయిపథంకు వెళ్ళాల్సి వచ్చేది. అక్కడ నారాయణరావుగారితో అవీ ఇవీ మాట్లాడుతూ ఒకరోజు మాటల సందర్భంలో నా ఇబ్బందిని చెప్పాను. "పదిహేను రోజులు క్రమం తప్పకుండా గురువుగారి దర్శనానికి రండి. గురువుగారు దయ తలిస్తే మీకు ట్రాన్స్‌ఫర్ జరుగుతుంది" అని చెప్పారాయన. ఆయనతో మాట్లాడింది జూలై 14వ తేదీ. ఆ రోజు నుండి పదిహేను రోజుల పాటు దర్శనానికి వెళ్ళి ఊదీ తీసుకునేవాడిని. వారి సాన్నిధ్యంలో ఏదో తెలియని ఆనందం, ప్రశాంతత కలిగేవి.

ఒకరోజు ఏదో అనివార్య కారణాల వలన దర్శనానికి వెళ్ళలేకపోయాను. మరుసటిరోజు దర్శనమప్పుడు గురువుగారితో, ముందు రోజు నేను ఎందుకు రాలేకపోయానో చెప్పి క్షమించమని వేడుకున్నాను. గురువుగారు చిరునవ్వు నవ్వారు. ఆ చల్లని చిరునవ్వుతో నా చీకాకులన్నీ తీరిపోయినట్లనిపించాయి.

సరిగ్గా నేను అట్లా దర్శనానికి వెళ్ళడం ఆరంభించిన పదహారవ రోజు మా ఆఫీసుకు ఢిల్లీ కార్పొరేట్ ఆఫీసు నుండి ఫాక్స్‌లో ఆర్డర్స్ వచ్చాయి. కోపర్‌గాం పరిధికి 'సబ్ డివిజనల్ ఇంజనీరు' అనే క్రొత్త పోస్ట్ సృష్టించి, శిరిడీని దానికి హెడ్ ఆఫీస్‌గా చేస్తూ, ఆ పోస్టుకు నన్ను మారుస్తున్నట్లు ఆ ఉత్తర్వు సారాంశం. అంతకు ముందు కోపర్‌గాం పరిధిలో ఆ పోస్టే లేదు. గురువుగారి అనుగ్రహంతో కేవలం అది నా కోసమే, నేను శిరిడీలో ఉండడం కోసమే సృష్టించబడింది. ఈ అపూర్వ సంఘటన నా జీవన విధానాన్నే మార్చివేసిందని చెప్పాలి. నా జీవితానికి క్రొత్త వెలుగునిచ్చి ఒక గొప్ప సద్గురువు సన్నిధికి నన్ను చేర్చింది. ఎందరో గురుబంధువులను నాకు ఆత్మీయులుగా చేసింది.

***భక్తుడు:*** *గురువుగారూ! ఒకే సమయంలో బాబా వేలాది, లక్షలాది మంది అవసరాలను ఎలా తీరుస్తున్నారు?*

***గురువుగారు:*** *కోట్ల కణాలున్న నీ శరీరాన్ని 'నీవు'గా ఎలా గుర్తిస్తున్నావు? నీ శరీరంలో కోట్ల కణాలున్నాయి కదా, జీవకణాలు! అన్ని కణాలున్న నీ శరీరాన్ని 'ఇది నేను' అని గుర్తించగలిగినప్పుడు, కోట్ల జీవులను తాముగా సద్గురువు గుర్తించలేరా? బాబాకు ఈ విశ్వమంతా ఆయన దేహం క్రింద లెక్క.*

***భక్తుడు:*** *కానీ, కోట్ల కణాలలో ఒక్కొక్క కణానికి ఒక్కొక్క అవసరం, కోరిక ఉండదు కదా!*

***గురువుగారు:*** *ఎందుకు లేదు, వాటికి వేరు వేరు అవసరాలు, కోరికలు ఉంటాయి. అందుకే నీవు భోంచేస్తున్నావు, విశ్రాంతి తీసుకుంటున్నావు. ఒక విధంగా కూర్చుంటున్నావు. సంబంధిత కణాలు 'నొప్పిగా ఉంది ఇలా కూర్చో' అని నీకు చెబుతాయి. అప్పుడు నీవు ఆ కణాలు చెప్పిన విధంగా కూర్చుంటావు. దోమ నీపై వాలి కుట్టిందనుకో, అక్కడి కణాలు*

'ఇబ్బందిగా ఉంది. ఇక్కడ గీరు' అని చెబుతాయి. నీవు వెంటనే గీరుకుంటావు. ఇలా నీ శరీరంలోనున్న వివిధ కణాల యొక్క అవసరాలను నువ్వు గుర్తిస్తున్నావు కదా.

అదే విధంగా బాబా, ఆయన దేహం అనబడే ఈ విశ్వంలోని సకల జీవకోటిని కనిపెట్టుకుని ఉన్నారు. దీనికి సరియైన ఉదాహరణ ఏంటంటే, ఒకసారి ఒక భక్తుడు బాబా దర్శనానికొచ్చి తిరిగి వెళ్ళేటప్పుడు బాబా అతనికి ఒక ఊదీ పొట్లాం ఇచ్చి "ఎవరైనా వచ్చి నీ కొడుకును ఒడిలో కూర్చోబెట్టుకొని, నాకు కొంచెం స్థలమివ్వు అని అడిగితే వారికి ఈ ఊదీ పొట్లం ఇవ్వు" అని చెబుతారు.

అతను, అతని కొడుకు బాబా దగ్గర సెలవు తీసుకుని రైలులో తిరిగి వెళుతుండగా, ఒక పెద్దమనిషి వచ్చి బాబా చెప్పినట్లే చోటివ్వమని అడిగాడు. అతడు ఆ పెద్దమనిషికి ఊదీ ఇచ్చి "నేను శిరిడీ నుంచి వస్తున్నాను, బాబా మీకు ఈ ఊదీ ప్యాకెట్ ఇవ్వమన్నారు" అని చెప్పాడు. అతను అప్పటివరకు బాబా గురించి విన్నాడు కానీ అతని ఆర్థిక పరిస్థితుల వల్ల శిరిడీకి వెళ్ళలేకపోయాడు. అతనెప్పుడూ "నేను శిరిడీ వెళ్ళి బాబా చేతుల మీదుగా ఊదీ ఎలా తీసుకోగలను" అనుకునేవాడు. అతడు బాబాను ఎప్పుడూ చూడలేదు. అన్ని వందల, వేలమందిలో బాబా అతనికి ఊదీ ఎలా పంపారో ఆలోచించు.

# అంధకార జీవితంలో అనుగ్రహ దీపం

తుమ్మల పద్మారవీంద్రనాథ్
స్కూల్ హెడ్ మిస్ట్రెస్, హైదరాబాద్
జన్మించిన సం॥ 1955

హైదరాబాద్, జూన్ 2001

నేను 1993లో తొలిసారి మా అన్నయ్య ద్వారా హైదరాబాద్‌లో గురువుగారి దర్శనం చేసుకున్నాను. అప్పుడు నేను ఒక వైపు మానసికంగాను, మరో వైపు ఆర్థిక పరంగాను ఎన్నో సమస్యలతో సతమతమవుతూ ఎంతో ఒత్తిడికి గురై, పూర్తిగా నిరాశానిస్పృహలతో ఉన్నాను.

మాకు ఒక ప్రైవేట్ స్కూల్ ఉంది. దానికి వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ అయిన మా వారు హఠాత్తుగా చనిపోయారు. ఒక్కసారిగా నా జీవితంలో చీకటి అలముకుంది. టీనేజ్‌లో ఉన్న ఇద్దరు అమ్మాయిలు, ఏడు సంవత్సరాల వయస్సున్న బాబుతో నేను ఒంటరిగా మిగిలాను. ఒక్కసారిగా, అన్ని బరువుబాధ్యతలు నా భుజస్కంధాలపై పడ్డాయి. పిల్లల్ని చూసుకోవడం, స్కూల్ మేనేజ్‌మెంట్, నా అనారోగ్యం, ఇవే కాకుండా ఏ మాత్రం సహకరించని అత్తగారు. ఇలా అసహాయంగా, ఒంటరిగా మిగిలిన నాకు జీవితంలో ఎదురైన ఈ ఎదురుదెబ్బలు తట్టుకోలేననిపించేది.

అటువంటి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న నాకు గురువుగారి దర్శనం చిమ్మచీకటిలో చిరుదీపంలాగా అనిపించింది. గురువుగారి దర్శనం తరువాత నుండి నేను నూతన ఉత్తేజం పొందాను. మానసిక స్థైర్యం పెరిగింది. ఒక్కసారిగా మా జీవితాల్లో సరిక్రొత్త కాంతి పొడసూపింది. అది ఒక రకంగా నాకు పునర్జన్మే. గురువుగారు నా పరిస్థితిని అర్థం చేసుకోవడమే కాదు, వారి అనుగ్రహం, శక్తితో నా పరిస్థితులను కూడా సరిదిద్దారు.

గురువుగారు నాతో "*వారం రోజులు శిరిడీలో ఉండి ప్రతిరోజూ గురుస్థాన్‌లో ప్రదక్షిణలు చేయమ*"ని చెప్పారు.

దాని ప్రభావం అంతా ఇంతా అని చెప్పనలవి కాదు. కొంచెం కొంచెంగా, నా ప్రమేయం లేకుండా అన్ని పరిస్థితులలోను మార్పు రాసాగింది. ఇబ్బందికరమైన పరిస్థితులు, సమస్యలు ఒక్కొక్కటిగా అవే పరిష్కారంకాసాగాయి. నాకు జీవితం చాలా సాఫీగా జరిగిపోనారంభించింది.

మా స్కూల్‌లో ఎప్పుడూ ఏదో ఒక సమస్య ఎదురవుతూ ఉండేది. గురువుగారు దీనిని కూడా సరిచేశారు. డిసెంబర్ 1997లో, నారాయణరావుగారు స్కూల్‌లో సత్సంగం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పెద్దదిగా ఉన్న గురువుగారి ఫోటో స్కూల్‌లో పెట్టాము. ఆ క్షణం నుండి నాకు ఎలాంటి ఆందోళన లేదు. గురువుగారు చూపించిన ప్రేమ మరియు రక్షణ వారి పట్ల మాలో సడలని నమ్మకాన్ని ఏర్పరచాయి. ఇప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదురైనా గురువుగారు మనల్ని చూసుకుంటారు, కాపాడతారు అనే విశ్వాసం ఉంది. గురువుగారే మాకు సర్వస్వం.

***గురువుగారు:*** *బాబా తగిన సన్నివేశాన్ని, పరిస్థితులను కల్పించి మనలోని ఉద్వేగాలను బయటకు వచ్చేట్లు చేస్తారు. వాటిని అణగత్రొక్కడమో లేక మరపున పడేయడమో కాకుండా అవి వాటంతటవే సహజాతిసహజంగా సమాధానపడేట్లు చేస్తారు. ఒక్కసారి ఆ ఎమోషన్స్ సమాధానపడినట్లయితే వాటి ప్రభావాన్ని కోల్పోయి అవి మళ్ళీ తలెత్తవు. కానీ ఇక్కడ ఒక తేడా ఉంది. మన కోరికలు, ఎమోషన్స్ మనకి మనంగా సంతృప్తి పరుచుకుంటే అవి మళ్ళీ మళ్ళీ తలెత్తి ఇంకా దృఢంగా బలపడతాయి. శ్రీసాయి యొక్క బోధలోని కీలకం ఇదే.*

*ఆయన "కోరికలే దుఃఖానికి కారణం. అందుకని కోరికలు త్యజించు" అని చెప్పలేదు. మనస్సే అజ్ఞానానికి మూలం. అందుకని మనసుని చంపు. దానిని అణిచేయి అని చెప్పలేదు. ఇవన్నీ మనం చేయగలిగితే, మనస్సుని చంపగలిగితే, కోరికలు వదిలిపెట్టగలిగితే మనకు ఆయన దగ్గరకు వెళ్ళే పనేమిటి? మనం ఇవన్నీ చేయలేము కాబట్టే ఆయన మనకు అవసరం. ఆయన మనలను చేయిపట్టి, మనకు వారి శక్తినిచ్చి, మనలను ఆ దారిలో చివరికంటా తీసుకొని వెళ్ళాలి.*

*ఆయనకు మన బాధలు, కోరికలు వారికి తన వద్దకు చేర్చు కోవడానికి మిషలు మాత్రమే. వాటిని తీర్చి ఆ భక్తుల హృదయాలలో తన పట్ల ప్రేమను రగుల్చుతారు. ఆ కోరికలు తీర్చడం ద్వారా వారికి వివిధమైన అనుభవాలను క్రమపద్ధతిలో ఇస్తూ వారిలో ఒక stage వచ్చేటప్పటికి "నాకేది మంచిదో నాకంటే బాబాకే తెలుసు. నేను ఎందుకు*

వారిని అడగాలి?" అనిపించేలా చేస్తారు. అయినా వారిలో ఇంకా ప్రాపంచికమైన కోరికలు పూర్తిగా పోవు. అది ఒక stage.

తరువాత మెల్లగా వారికి బాబా పట్ల ఉన్న ప్రేమ అనే జ్వాలాగ్ని పెరిగి పెరిగి దావానలమై, వారిలో ఉన్న ఇతర భావనలు, ఎమోషన్స్‌ని దహించి వారు నడిచే బాట పరిపూర్ణత (fulfilment)కు వెళ్ళే బాటగా మారుతుంది. ఆయన మన మనస్సుకుండే సహజగుణాలనే వాడి తన బాటలోకి తీసుకొని వెళ్తారన్నమాట. సహజాతి సహజంగా, ఏ బాధ లేకుండా సునాయాసంగా మనం ఆ బాటకు లాగబడతాం. గమ్యంలాగానే మార్గం కూడా సంతోషంగా, ఉల్లాసంగా, ఆనందంగా ఉంటుంది.

కానీ ఇదంతా ఏదో వేదాంతానికి, ఆధ్యాత్మికతకు వ్యతిరేకంగా తోస్తుంది. "ఏమిటి ప్రాపంచికమైన వాటినేమి వదలనక్కరలేదా? ఇదేమి ఆధ్యాత్మికత" అనిపిస్తుంది? ఆధ్యాత్మికత అంటేనే ప్రాపంచికాన్ని వదలడమని అనుకునేట్లయితే బాబా బాట ఆధ్యాత్మికమే కాదు.

## నలుగురికి కాదు, నలభై మందికి

అట్లూరు లక్ష్మీప్రసాద్
వ్యాపారస్థుడు, చెన్నై
జన్మించిన సం॥ 1958

చెన్నై, మార్చి 2004

చెన్నైలో నాకు ఒక బ్రౌజింగ్ సెంటర్ మరియు వీడియో షాపు ఉన్నాయి. నేను మొదటిసారి శిరిడీ వెళ్ళి, దర్శన సమయంలో నా వ్యాపారం అభివృద్ధి చెందాలని గురువుగారిని ప్రార్థించాను. తర్వాత కొన్నాళ్ళకు నా షాపులో దొంగతనం జరిగింది. పోయిన వస్తువుల విలువ 30,000 రూపాయలు. నువ్వు గురువుగారిని పూజిస్తున్నా ఇలా జరిగిందేమిటని అందరూ విమర్శించారు.

ఒక వారం లోగా పోయిన వస్తువులన్నీ దొరికి ఆయన మహిమ ప్రకటమవ్వాలని ప్రార్థించుకొంటూ, గురువుగారికి ఒక ఉత్తరం వ్రాసి పోస్ట్ చేశాను. నేను ఉత్తరం వ్రాసిన ఇరవై రోజుల్లోనే ఆ వస్తువులన్నీ దొరికాయి. దొంగిలింపబడిన వస్తువుల్ని గుర్తులు చెప్పి తెచ్చుకునేందుకు వెళ్ళినప్పుడు, ఆ వస్తువుల మీద నేను అంటించిన బాబా, గురువుగారు ఉన్న స్టిక్కర్లను చూడగానే ఒక్కసారిగా చెప్పలేని ఆనందోద్వేగం కలిగింది. "నీ ప్రార్థన విన్నాను" అని గురువుగారు చెబుతున్నట్లనిపించింది. మళ్ళీ యథాప్రకారం వ్యాపారం చేసుకోసాగాను. కానీ అంత బాగా జరగలేదు. రానురాను ఆదాయం చాలక కుటుంబ పోషణే కష్టమయింది. ఇక ఆ వ్యాపారం లాభం లేదని షాపు మూసేసి ఏదైనా ఉద్యోగం చూసుకొందాం అనుకున్నాను.

ముందు ఒకసారి వెళ్ళి పరిస్థితులన్నీ గురువుగారితో చెప్పుకుని వారెట్లా చేయమంటే అట్లా నడుచుకోవడం మంచిదని, తెలిసిన గురుబంధువులు చెప్పారు. అప్పటికే షాపును అమ్మివేసేందుకని పేపర్లలో ప్రకటన కూడా ఇచ్చాను. నేను గురువుగారి వద్దకెళ్ళాను. గురువుగారి వద్ద ఊదీ దర్శనం దొరకడం నా అదృష్టం. అప్పుడు నేను నా బాధలు, సమస్యలన్నీ మనసు విప్పి వారితో చెప్పుకున్నాను. "షాపు క్లోజ్ చేసేసి ఉద్యోగం చూసుకోమంటారో లేక మరేం చేయమంటారో మీరే దారి చూపాలి" అని ప్రార్థించాను.

గురువుగారు "వ్యాపారమే చేసుకో" అన్నారు. నాకు రావలసిన 'టచ్‌టెల్' కాంట్రాక్టు ఆగి ఉంది. ఆ కాంట్రాక్టు వచ్చేలా ఆశీర్వదించండి అని అడిగాను. ఇంకా

"ఆ బిజినెస్ వలన నేను బ్రతకడమే కాదు. మరో నలుగురికి ఉద్యోగం ఇచ్చేలా ఉండాలి" అని కోరుకున్నాను.

గురువుగారు తలూపారు. నాకు వారేమంటున్నారో అర్థంకాక "గురువుగారూ! నాకు మీరేం చెప్తున్నారో సరిగా తెలియడం లేదు" అన్నాను మెల్లగా.

ఈసారి గురువుగారు నా వంక చూస్తూ స్పష్టంగా సెలవిచ్చారు "నువ్వు నలుగురికి కాదు, నలభైమందికి పని ఇస్తావు!"

ఆ ఆశీర్వాదం ఎంత అమోఘంగా పని చేసిందంటే, నేను చెన్నైకి వచ్చిన ఇరవైరోజుల్లోనే టచ్‌టెల్ కంపెనీ వాళ్ళే ఫోన్ చేసి వాళ్ళ కాంట్రాక్టు కొనసాగించమని అడిగారు. అంతే! నేనిక బిజినెస్‌లో తిరిగి చూసుకోవాల్సిన పనే లేకపోయింది. మొదట నలుగురితోనే ప్రారంభించాను. ఈ రోజు అరవైమందికి ఉద్యోగం ఇచ్చి చెన్నై సిటీలోనే బెస్ట్ కాంట్రాక్టర్స్‌లో సెకెండ్ ప్లేస్‌లో ఉన్నానంటే ఇదంతా గురువుగారు పెట్టిన దయాభిక్షే!

***గురువుగారు:*** *బాబా ఏమంటున్నారు? "నా భక్తులు నా వద్దకు వివిధ మిషల మీదనే వస్తారు. ఆరోగ్యం, ధనం, ఉద్యోగం, ప్రమోషను, సంతానం, ఇలా ఎన్నో విషయాల కోసం. వీటన్నింటినీ ఒక మిషగా చేసుకొని నేనే వారిని నా దగ్గరకు లాగుతాను" అని. ఆయనకు ఆ బాధలు, కోరికలు ఒక మిష మాత్రమే. భక్తులకు మాత్రం శిరిడీ వెళ్ళటానికి అవే ముఖ్య కారణాలు. బిడ్డకు స్కూలుకు వెళ్ళాలని ఉండదు. కానీ మనకు ఆ బిడ్డ బాగా చదవాలనీ, పైకి రావాలనీ ఉంటుంది. 'స్కూలుకు వెళ్ళు' అని మనం బిడ్డను పట్టుబడితే తను చాక్లెట్లు కావాలని మారాం చేస్తుంది. "సరే, ఇదిగో ఈ చాక్లెట్ తీసుకో. నీవు స్కూలుకు చక్కగా వెళితే ఇంకా బోలెడు చాక్లెట్లు ఇస్తాను" అంటాము.*

*మనకు మన జీవితంలో ఎన్నో కావాలి. ఉద్యోగం, దానిలో సాఫల్యత etc., అవన్నీ చాక్లెట్లే. ఆ సమయంలో అది అతని అవసరం. అతనికి దానికంటే ఇంకా ఏదో ఉన్నదని తెలుసు. కానీ దానికి అతను ఇంకా తయారుగా లేదు అప్పటికి. బిడ్డకు బొమ్మలు కావాలి. ఆ బిడ్డకు మనం "ఈ బొమ్మలు అంతా మాయ. వీటితో ఎందుకు ఆడుకుంటావు.*

నీవు ఇంకా ఎదగాలి. వాటితో ఆడడం అర్థం లేని పని" అని చెప్తామా? లేదు. ఇంకా ఎక్కువ బొమ్మలు కూడా తెస్తాం, బిడ్డ పట్ల మన ప్రేమను వ్యక్తపరచడానికి. ఆ బిడ్డ ఆనందం చూసి మనమూ ఆనందిస్తాం. ఆ బిడ్డకు తగిన వయసు వచ్చిన తర్వాత సహజంగానే, తనంతట తానే వాటితో ఆడుకోవటం మాని వేరే వాటి కోసం అడుగుతుంది. మనకు తెలుసు ఆ బొమ్మలు నిజం కాదని. అయినా ఆ వయసులో అవే ఇవ్వాలి.

మనం ఈ డబ్బు, కోరికలు అడగడం కూడా సాయిబాబా వంటి సద్గురువులకు బొమ్మలాటే. అలా అందరి అవసరాలను తీరుస్తూ, వారి వారి స్థాయిలో సమాధానపరచేవాడే నిజమైన సద్గురువు.

# సాయి రచన

ఇక్కుర్తి శైలజ
గృహిణి, తిరుపతి
జన్మించిన సం॥ 1978

తిరుపతి, జనవరి 2002

"నా మనుష్యులు ఎంత దూరాన ఉన్నప్పటికీ, పిచ్చుక కాలికి దారము కట్టి లాగినట్లు నా వద్దకు లాక్కుంటాను" అని బాబా చెప్పారు. ఆ విధంగా పెళ్ళి అనే మిషతో బాబా నన్ను తమకు మరింత దగ్గరగా చేర్చుకున్నారు. పెళ్ళికాక ముందు "శ్రీసాయిలీలామృతం చదివేటప్పుడు సద్గురువు ఎక్కడ లభిస్తారు? అలాంటివారు ఈ రోజుల్లో ఉన్నారా! ఉన్నా మనకు అంతటి భాగ్యం లభిస్తుందా" అనుకొనేదాన్ని. బాబాను ప్రార్థించేదాన్ని 'బాబా! నాకు అటువంటి గురువును ప్రసాదించు' అని. బాబా నా మొర ఆలకించి నా వివాహంతో ఆ కోరిక తీర్చారు. నా భర్త, వారి అన్నగారి కుటుంబం మొత్తం ఒక గొప్ప సద్గురువును కొలుచుకుంటూ, వారి సన్నిధానానికి వెళుతుంటారని విన్న నాకు ఎంతో ఆనందం కలిగింది. మొదటిసారి గురువుగారిని చూడగానే, వారి మీద పూజ్యభావం, నమ్మకం ఏర్పడ్డాయి నాకు.

***భక్తుడు:*** *సద్గురువు నన్ను ఎన్నుకునే వరకు నేను వేచి ఉండాలా?*

***గురువుగారు:*** *ఆయన నిన్ను ఇంతకు పూర్వమే ఎన్నుకున్నాడు. నీవు ఎన్నుకోబడ్డావు అన్న విషయం తెలుసుకోవాలంతే. అంతేకాని, ఆయన ఒక ప్రత్యేక సమయం, నిమిషంలో నిన్ను ఎన్నుకుంటారని కాదు. నీవు పుట్టక ముందే, ఆయన నిన్ను ఎన్నుకుని ఉంటారు. నీకు అది తెలియదు. నీవు నీ సద్గురువును వెంటనే తెలుసుకోవాలంటే, ఆ ప్రక్రియను మరింత త్వరితం చేయాలని కోరుకుంటే, అప్పుడు నీకు సమాధానమిచ్చే దైవాన్ని "నాకు సద్గురువు రూపాన్ని చూపించు. నేనా రూపాన్ని ధ్యానించాలి, నా ప్రేమను వ్యక్తపరచాలి" అని ప్రార్థించు. వెంటనే నీకు సమాధానం లభిస్తుంది.*

***భక్తుడు:*** *బాబానే మనల్ని ఎన్నుకొంటారా?*

***గురువుగారు:*** *అవును బాబానే ఎన్నుకుంటారు.*

***భక్తుడు:*** *కానీ మనమే ఎన్నుకున్నట్లనిపిస్తుంది కదా?*

*__గురువుగారు:__ బాబా మనల్ని ఎన్నుకొన్నప్పుడు మనమే ఆయనను ఎన్నుకొన్నామనే భావన కలిగించి మనలను తృప్తిపరుస్తారు. అది మన ఎన్నిక అయినప్పుడు దానిని మనం ఇంకా ఎక్కువగా ఎంజాయ్ చేస్తాము. ఆయన వారి ఎంపికను మన ఎంపికగా చేస్తారు.*

*మామూలుగా ఏ విషయమైనా మంచిదో, చెడ్డదో మన ఎంపిక కాకపోతే అది మనకు అంత నచ్చదు. మన ఎంపిక అయితేనే నచ్చుతుంది. అందుకే ఆయన తన ఎంపికను మన ఎంపికగా చూపిస్తారు. దానిని మనం ఎంజాయ్ చేస్తాము.*

వారి సంకల్పం లేకుండా వారిని దర్శించగలిగే భాగ్యం నాకు కలిగేదా? గురువుగారిని చూసిన క్షణం నుండి వారి చిరునగవు మోము నా మనసులో స్థిరంగా ముద్రించుకొనిపోయింది. అలాగే చూస్తూ ఉండాలి అనేట్లు నన్ను కట్టిపడేసింది వారి చిరునవ్వే. గురువుగారి పాదాలు తాకితే అవి చిన్నపిల్లల పాదాలకంటె సుతిమెత్తగా ఉంటాయి. ఒక్కొక్కసారి గురువుగారిని చూసినప్పుడు, అప్పుడే స్నానం చేయించి తెచ్చిన చిన్న పాపవలె ఒక విధమైన తేజస్సుతో ఉంటారు. అప్పుడు బాబానే గుర్తుకొస్తారు. బాబా దేహచ్ఛాయ కూడా అరటిపోచ మీద బంగారుకాంతి పడినట్లు ఉండేదట. గురువుగారు మాకు సాక్షాత్తు బాబానే. బాబాను దర్శించలేని లోటు గురువుగారి దర్శనంతో తీరిపోయింది. అంతకంటే మాకేం కావాలి?

నేను ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు, పురిటినొప్పుల గురించి చాలా భయపడేదాన్ని. రోజూ నమస్కారం చేసుకునేటప్పుడు 'నాకు ఆపరేషన్ జరిగినా ఫర్వాలేదు కానీ ఆ నొప్పులు మాత్రం భరించలేను' అనుకొనేదాన్ని.

నాకు ప్రెగ్నెన్సీ నిర్ధారణ అయింది శిరిడీలోనే. గురువుగారు అప్పుడు "*అంతా శుభమే జరుగుతుంది, వెళ్ళిరండి*" అని చెప్పారు.

ఇంట్లో పెద్దవాళ్ళు ఎవరూ లేకపోయినా ఆ తొమ్మిది నెలల్లో నేను ఎప్పుడూ ఏ చిన్న సమస్యనూ ఎదుర్కొనలేదు. ప్రసవించవలసిన తేదీ వచ్చినా నొప్పులు రాకపోయే సరికి, డాక్టర్ స్కానింగ్ రిపోర్టు చూసి వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. వెంటనే ఆపరేషన్ చేయడం, పాపాయి పుట్టడం జరిగింది. రెండవ రోజు నుండే లేచి నా పనులు నేను చేసుకోగలిగాను కూడా. సిజేరియన్ మూలాన అసలు పురిటి

నొప్పుల బాధే నాకు కలగలేదు. పాపకు గురువుగారే నామకరణం చేసి "సాయి రచన" అన్న పేరు పెట్టారు. రచనకు అన్నప్రాసన కూడా గురువుగారి అమృత హస్తాల మీదుగానే జరిగింది.

రచనకు చిన్నతనం నుండి పట్టుదల ఎక్కువ. మనం అడ్డు చెప్పనంతవరకు తనతో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఎప్పుడైనా తనకు ఇష్టం లేనిది ఏమైనా జరిగితే ఇక దాని కోపాన్ని, ఏడుపును అదుపు చేయడం చాలా కష్టం. ఒక్కోసారి గంటసేపు కూడా గుక్క త్రిప్పుకోలేకపోయేది. ముఖమంతా నీలంగా మారిపోయి కళ్ళు తేలవేసేది. ఎంతోసేపటిగ్గానీ మళ్ళీ మామూలుగా అయ్యేది కాదు. ఈ పరిస్థితి చూసి మాకు భయాందోళనలు కలిగేవి. ఈ విషయం చెప్పుకోవడానికి గురువుగారు తిరువణ్ణామలైలో ఉండగా, మేము వారి దర్శనానికి వెళ్ళాము. గురువుగారు పాపను దగ్గరకు తీసుకుని పాపాయి వీపు మీద, గుండెల మీద మృదువుగా చేత్తో నిమిరారు. ఆ కరస్పర్శ ప్రభావం ఏమిటో కానీ ఆ రోజు నుండి రచన ఎప్పుడూ మునుపటిలా గుక్కపట్టి ఏడవలేదు.

# చూపుతోనే స్వస్థత

చెన్నాడి బాలకృష్ణారావు
గవర్నమెంట్ ఉద్యోగి, హైదరాబాద్
జన్మించిన సం॥1946

హైదరాబాద్, జూన్ 2001

మా రెండో అమ్మాయి స్మిత తరచుగా గొంతునొప్పితో బాధపడుతుంటే, ఇన్‌ఫెక్షన్ అనుకొని తగిన మందులు వాడాము కానీ మా అమ్మాయికి నొప్పి నుండి ఉపశమనం లభించలేదు. ఒకసారి శిరిడీలో గురువుగారి దర్శనానికి వెళ్ళినప్పుడు స్మిత గొంతు నొప్పి గురించి గురువుగారికి చెప్పాను. గురువుగారు పరీక్షించడానికా అన్నట్లు మా అమ్మాయిని నోరు తెరవమన్నారు. అది రాత్రి సమయం కావడంతో అక్కడ వెలుతురు సరిగా లేదు. గురువుగారు టార్చ్ అడుగుతారనుకున్నాను. కానీ వారు అడగలేదు. గురువుగారు అలా స్మిత గొంతు పరిశీలించారు. ఆ చీకట్లో ఆయనకు ఎలా కనిపిస్తుందా అనుకున్నాను.

గురువుగారు స్మితకు మందు ఇస్తానన్నారు. కానీ మా అమ్మాయికి గల నొప్పి పూర్తిగా తగ్గిపోవడం వలన ఆ అవసరం లేకుండా పోయింది. మళ్ళీ తిరిగి ఎన్నడూ తను ఆ నొప్పితో బాధపడలేదు. గురువుగారు మా అమ్మాయి రుగ్మతను కేవలం తమ దయార్ద్రమయిన చూపుతోనే నయం చేశారు. గురువుగారు పరీక్షించినా లేదా మందిచ్చినా అది కేవలం మనకు ధైర్యాన్నివ్వడం కోసమేగాని నిజంగా నయం కావడానికి కారణం గురువుగారి కృప మాత్రమే!

# అపార మహిమ

పాలెం అమరావతి
గృహిణి, నరసింగాపురం
జన్మించిన సం॥ 1951

నరసింగాపురం, సెప్టెంబర్ 2001

నాకు గత కొద్దికాలంగా ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. తిరుపతిలో ఒక డాక్టరు పరీక్షించి, యుటెరస్ స్కానింగ్ తీయించమని చెప్పారు. అందులో నాకు ఫైబ్రాయిడ్ సిస్ట్ ఉందని తేలింది. ఆ సిస్ట్ మరింత పెద్దది కాకుండా తొందరగా ఆపరేషన్ చేయించుకోమని చెప్పారు. నేను మరోసారి పరీక్ష చేయిద్దామని, చెన్నైలోని అపోలో ఆసుపత్రికి వెళ్ళాను. అక్కడ కూడా అదే పరీక్ష చేసి అదే సలహా ఇచ్చారు. కానీ నాకు ఆపరేషన్ చేయించుకోవడానికి వీలుపడదు. ఎందుకంటే నా భర్త బ్యాంక్‌లో పనిచేస్తున్నారు, పిల్లలు చదువుకుంటున్నారు. ఇంటి బాధ్యతలను, అప్పుడే ప్రారంభించిన డైరీ ఫాంను నేను ఒక్క దానినే చూసుకోవాల్సి ఉంటుంది.

అప్పట్లో నాకు సాయిబాబా గురించి పెద్దగా తెలియదు. కానీ మా అమ్మాయి సాధన మాత్రం 1994 నుండి సత్సంగానికి పోతూ ఉండేది. బాబా గురించి, గురువుగారి గురించి ఎంతో ప్రేమగా చెప్పేది. నేను కూడా సత్సంగాలకు పోవడం మొదలుపెట్టాను. అక్కడ ఎందరో భక్తుల అనుభవాలను విని నేను సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేదాన్ని.

1996లో ఒకసారి దర్శనం సమయంలో, మా అమ్మాయి సాధన నా ఆరోగ్య సమస్య గురించి గురువుగారికి చెప్పింది.

"అమ్మను డాక్టరును కలసి ఆయన చెప్పినట్టు చేయమను" అని గురువుగారు సమాధానమిచ్చారు.

మళ్ళీ డాక్టరు దగ్గరకు వెళితే ఆయన ఏమని చెప్తారో, ఏమి చేయమంటారోనని భయపడి, నేను వెనువెంటనే డాక్టరు దగ్గరకు వెళ్ళలేదు.

దాదాపు ఆరునెలల తర్వాత– గురువుగారు తిరుమల వస్తున్నారని తెలిసి, వారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని భావించాము. అందువలన సాధన నన్ను ఇంకోసారి స్కానింగ్ తీయించుకోమని పట్టుబట్టింది. గురువుగారి ద్వారా పొందిన ఎన్నో అనుభవాల వలన, సాధనకు గురువుగారి పట్ల అచంచలమైన

భక్తివిశ్వాసాలున్నాయి. నాకు గురువుగారు అప్పటికే నయం చేసేసి ఉంటారని ఆమెకు నమ్మకం. అలా కాకపోతే ఆపరేషన్‌కు గురువుగారి ఆశీస్సులు అడుగవచ్చునని అనుకున్నాము. నాకిక తప్పలేదు. రెండవసారి స్కానింగ్ చేయించుకున్నాను. అసలు ఎటువంటి సిస్ట్ ఉన్న ఛాయలేవీ కనబడలేదు. గురువుగారి రక్షణకు, కరుణకు నేను చలించిపోయాను.

తరువాత రోజు దర్శనంలో నేను గురువుగారికి నా పాత రిపోర్టులను, క్రొత్త రిపోర్టులను చూపించాను. గురువుగారు బాబా వైపుకు తిరిగి నమస్కరించుకున్నారు. బాబా పట్ల వారికున్న వినమ్రభావం నా మనస్సును గాఢంగా తాకింది. దేనికి సంబంధించినదైనా సరే ఆ గొప్పతనాన్ని వారు తనదిగా భావించరు. వారి నుండి మనకందే అనుగ్రహాన్నంతా అవధులు లేని బాబా కృపకే ఆపాదిస్తారు.

***భక్తుడు:*** *మనం బాబాకే చెందినవారమని, ఆయనే మన తండ్రి అని మనకు ఎలా తెలుస్తుంది?*

***గురువుగారు:*** *ఆయన నుంచి మనం పొందే రక్షణ ద్వారా. మనకేదన్నా సమస్య వచ్చినప్పుడు, ఎవరు తీరుస్తారనేది మన అనుభవం ద్వారా తెలుసుకుంటాం. బిడ్డను చూసుకొనే ఆయనకు మాత్రం బాగా తెలుసు, వీడు నా బిడ్డే అని! ఉదాహరణకు తల్లీ, బిడ్డల సంగతే తీసుకో. నీకు తెలుసు నీ బిడ్డని. నీ బిడ్డకేం తెలుసు నువ్వు తల్లివని. పోను పోను బిడ్డ ఎట్లా తెలుసుకుంటాడు? నువ్వు వాళ్ళను ప్రేమించే తీరును బట్టి. వాళ్ళ అవసరాలను తీర్చే పద్ధతిని బట్టి. ఏడిస్తే పాలిస్తున్నావు, లాలిస్తున్నావు. దీనిని బట్టి "ఓహో! ఈమే నా తల్లి" అని చెప్పుకుంటాడు. అంతేకదా? అలాగ మన అవసరాలను తీర్చే దానిని బట్టి ఆయనే మన తండ్రి అని తెలుసుకుంటాము.*

# బాధలు బాపిన భవరోగ వైద్యులు

చంద్రకాంత్ అచ్యుతరావ్ గోర్కర్
పూజారి, శిరిడీ
జన్మించిన సం॥ 1963

శిరిడీ, జూన్ 2002

నేను శిరిడీలోని సాయిబాబా మందిరంలో పూజారిగా పనిచేస్తున్నాను. 1991లో నాకు నోటిలో పుండ్లు వచ్చాయి. నాలుకంతా కూడా పుండ్లు ఉండడంతో, నాలుకకు ఇంజక్షన్ తీసుకొంటేగానీ ఆహారం తినలేకపోయేవాడిని, అదీ అతి కష్టం మీదనే. అట్లా రెండు సంవత్సరాల పాటు బాధపడ్డాను. ఆ పరిస్థితిలో నన్ను చూసి నా మిత్రులు తోరత్, సురేష్‌భాయ్‌లు శ్రీబాబూజీ గురించి చెప్పారు. వాళ్ళ అనుభవాలు చెప్పి, నన్ను వెళ్ళి గురువుగారి దర్శనం చేసుకోమని సలహా ఇచ్చారు. నేను సాయిపథంలో గురువుగారిని దర్శించుకొని నా జబ్బు గురించి చెప్పుకున్నాను.

గురువుగారు వారి ప్రక్కనే ఉన్న సాయిబాబా ఫోటో వైపు చూస్తూ "బాబా చూసుకుంటారు" అంటూ ఊదీ ఇచ్చారు.

అంతే! కొన్నిరోజులలోనే నా నోటిలోని పుండ్లన్నీ పూర్తిగా తగ్గిపోయాయి. ఇప్పుడు అన్నీ హాయిగా తినగలుగుతున్నాను. ఈ సంఘటనతో నాకు గురువుగారిపై ఎనలేని గౌరవం, భక్తి కలిగాయి. అప్పటి నుండి గురువుగారు ఎప్పుడు శిరిడీలో ఉన్నా, మందిరంలో నా పూజావిధులు పూర్తిచేసుకొని, వారి దర్శనానికి తప్పక వెళుతున్నాను.

***భక్తుడు:*** *బాబా "నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు, అలా వీలు కాకపోతే నా ఈ రూపాన్ని ధ్యానించు" అన్నారు కదా. మరి ఆనంద స్వరూపం అంటే ఏమిటండీ?*

***గురువుగారు:*** *ఆనందస్వరూపం అంటే ఏమిటో మనకు తెలీదు కాబట్టి, ఆయన చెప్పిన మాట ప్రకారం ఆయన రూపాన్ని ధ్యానం చేసుకోవాలి. ఆయన వెంటనే మళ్ళా రెండోదాని గురించి చెప్పారు. నా యొక్క అసలు స్వరూపం ఆనందమేను అని.*

ఆయన రూపాన్ని ధ్యానం చేసుకుంటూ ఉంటే ఆనందస్వరూపం అనుభవమవుతుంది. 'ఆనందస్వరూపం ఇది' అని ఎవరు మాత్రం ఎట్లా చెప్తారు? అందుకని రెండోది చేసుకో. చేసుకుంటూ ఉంటే నీకు అనుభవం అవుతుంది. అపుడు నువ్వే నాకొచ్చి చెప్తావు– "ఇది గురువుగారూ! ఆనందస్వరూపం" అనేసి.

***భక్తుడు:*** *గురువుగారూ! బాబాకు నామం ఇష్టమా, ధ్యానం ఇష్టమా?*

***గురువుగారు:*** బాబాకు ఇష్టం అంటూ ఏమీ కాదమ్మా. అది మనకు ఇష్టం కాబట్టి మనం చేసుకోవాలి. బాబా పట్ల మనకు ప్రేమ ఉంటే, ఆ ప్రేమను మనం వ్యక్తం చేసే రూపంలో నామం గుర్తు వస్తే నామం చేసుకోవచ్చు. ధ్యానం గుర్తు వస్తే ధ్యానం చేసుకోవచ్చు. ధ్యానానికి, నామానికి మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. మనకు ఏది ఇష్టమో, ఏది సులువో, ఏది మనకు బాబాను ఎక్కువ గుర్తు పెట్టుకునేటట్లు చేస్తుందో అది చేసుకోవచ్చు.

# అభయవరం

గోపవరపు శివ
వ్యాపారస్థుడు, గుంటూరు
జన్మించిన సం॥ 1960

గుంటూరు, జూలై 2000

మాకు గురువుగారితో పరిచయం వారు ఒంగోలులో ఉన్నప్పటి నుండి ఏర్పడింది. అప్పట్లో మా అన్నయ్య గుప్తాగారు ఒంగోలు ఆర్.టి.సి.లో ఉద్యోగం చేస్తుండేవారు. 1983లో ఆయనకు గురువుగారితో పరిచయమైంది. తర్వాత నేనెప్పుడు అన్నయ్యను కలిసినా ఆయన మాటల్లో ఎక్కువగా గురువుగారి ప్రస్తావనే ఉండేది. వారి గొప్పతనాన్ని, వ్యక్తిత్వాన్ని ఎంతో విశిష్టంగా చెప్పేవాడు. వారి పట్ల వ్యక్తమయ్యే ఆయన ఆరాధనాభావం నాలో తెలియకనే ఎంతో కుతూహలానికి కారణమైంది. ఈయనను ఇంతగా ఆకర్షించిన ఆ మహనీయుణ్ణి తప్పక చూడాలనిపించింది.

ఒకరోజు మా అన్నయ్య నన్ను గురువుగారి దగ్గరకు తీసుకెళ్ళారు. అంతవరకు నేనూహించుకొన్న దానికన్నా ఎంతో ఉన్నతంగా తోచారు గురువుగారు. వారి సన్నిధిలో పైకి చెప్పలేని రక్షణ భావం కలిగింది. అందువలన వారితో, అప్పుడు నన్ను అమితంగా బాధిస్తున్న నా పిల్లల అనారోగ్యం, వైకల్యం గురించి చెప్పుకున్నాను. నా వివాహం మేనరికం. అంటే మా అక్కయ్య కుమార్తెతో నాకు పెండ్లి జరిగింది. మా మొదటి సంతానం వినయ్‌కి మానసికమైన ఎదుగుదల లేదు. రెండవసారి పుట్టిన అమ్మాయి హరితకు శారీరకంగా పెరుగుదల లేక చాలా పొట్టిగా ఉండేది. ఇద్దరినీ అనుక్షణం ఎవరో ఒకరు ప్రక్కన ఉండి గమనించుకోవాల్సిందే. నాకూ, నా శ్రీమతికి నిత్యం పిల్లలదే చింతగా ఉండేది. నా దిగుళ్ళు, బాధలన్నీ ఎంతో ఓపిగ్గా విన్న గురువుగారు అనునయంగా *"బాధపడవద్దు. బాబా ఉన్నారు. అన్నీ ఆయనే చూసుకుంటారు. మీరు నిశ్చింతగా ఉండండి!"* అని సాంత్వన చెప్పారు.

గురువుగారి అమోఘమైన వాక్కు మహిమ ఏమిటోగానీ ఆ క్షణాన్నుండే నాకు ఎంతో ఊరట లభించింది. మా పిల్లలిద్దర్నీ గురువుగారి దగ్గరకు తీసుకొచ్చి చూపించాము. వినయ్‌కి గురువుగారు హెూమియోపతి మందు ఇచ్చారు. వాడిలో చాలా మార్పు వచ్చింది. చెప్పిన మాట అర్థం చేసుకోవడమూ, శాంతమూ వచ్చింది. మా అమ్మాయి హరిత ఏడాది తర్వాత చనిపోయింది. పాప చనిపోయినందుకు

బాధ కలిగినా, ఆ బాధలోనే బాధాకరమైన జీవితం నుండి ఆ అమ్మాయికి విముక్తి కలిగింది కదా అన్న ఓదార్పు కలిగింది.

అందరివలె మాకు చక్కని ఆరోగ్యవంతమైన బిడ్డ కావాలని నాకూ, నా భార్యకు ఎంతో కోరిక ఉన్నా, మూడవసారి కూడా ఏదో ఒక లోపంతో ఉన్న బిడ్డ పుడితే ఎలా? అని మరలా బిడ్డను కనే ధైర్యం చేయలేకపోయాము. అయితే గురువుగారి సన్నిధికి వచ్చిన తర్వాత జీవితంలోని భయాలన్నీ తొలగిపోయాయి. అందుకే మా మనసులోని కోరికను వారితో చెప్పుకొన్నాము.

గురువుగారు మాకు అభయమిచ్చి, మమ్మల్ని శిరిడీలో మూడురోజులు గడిపి రమ్మన్నారు. మేమలాగే చేశాము. ఏడాది తిరిగేసరికి మాకు ఆరోగ్యవంతమైన చక్కని మగపిల్లవాడు పుట్టాడు. బాబుకి సాయిచైతన్య అని పేరు పెట్టాము. మా జీవితాలలో కూడా ఇటువంటి ఆనందం లభిస్తుందా అని తపించే మాకు చురుగ్గా, తెలివితేటలతో, ఆరోగ్యంగా పెరిగి పెద్దవుతున్న సాయిచైతన్యను చూస్తున్నప్పుడల్లా, గురువుగారి అభయానుగ్రహం గుర్తుకు వస్తుంది. మా మనసుల్లో చింతలను, చీకట్లను తొలగించి ఆనందపుకాంతులు ప్రసాదిస్తున్న గురువుగారికి మేమెన్ని జన్మలెత్తినా ఋణపడి ఉంటాము. ఈనాడు గురువుగారి అనుగ్రహపు నీడలో దాదాపు వందమంది దాకా ఉన్న మా కుటుంబసభ్యులమందరం ఆనందంగా జీవిస్తున్నాము.

***భక్తుడు:*** *బాబాకు ఎప్పుడు ఏమి జరగబోయేది తెలుసు కదా?*

***గురువుగారు:*** *ఆయన విశ్వమంతా నిండి ఉన్నారు కాబట్టి ఆయనకు అన్నీ తెలుసు. బాబాకు మన భవిష్యత్తు తెలుసు అనేది మనకు తెలిస్తే, మన జీవితాన్ని భద్రంగా ఆయన చేతిలో ఉంచగలం.*

***భక్తుడు:*** *ఆయన భవిష్యత్తును కూడా మార్చడానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపిస్తుంది కదా?*

***గురువుగారు:*** *అవసరమైతే. "జ్యోతిష్కులు జరగబోయేది చెప్పగలరేమో, కాని నేను చెప్పింది జరుగుతుంది" అని బాబా చెప్పారు. కాబట్టి బాబా చెప్పింది జ్యోతిషం కాదు. మనకు ఆయన పట్ల నమ్మకం ఉంటే, శరణాగతి చాలా సులభమవుతుంది. లీలలు నిన్ను శరణాగతి పథంలో త్వరితగతిన ముందుకు నడిపించడానికి దోహదం చేస్తాయి. మనము మన మనస్సుని*

*మన ప్రయత్నంతో గురువుకి అప్పగించలేము. "నీ మనస్సును నాకు అప్పగించు. నేను దానిని నడుపుతాను" అని భగవాన్ చెప్పారు. కాని మనం మన మనస్సును అంత తేలికగా అప్పగించలేము. ఆయన మీద విశ్వాసం లేకపోతే ఎలా లొంగిపోగలం? ఈ లీలలు మన మనస్సును ఆనందంగా ఆయనకు లొంగిపోయేట్లు, ప్రభావితం అయ్యేట్లు చేస్తాయి.*

***భక్తుడు:*** *ఒక వ్యక్తి సమస్యలను తీర్చడానికి మహాత్ములు ప్రపంచాన్ని మార్చాల్సిన అవసరమేముంది?*

***గురువుగారు:*** *దాని వలన వారికి విశ్వాసం మరింతగా పెంపొంది, మరింతగా శరణాగతి చెందగలుగుతారు. వారు శరణాగతి చెందగలిగితే, మహాత్ముల వలె విశ్వచైతన్యంతో ఒకటి కాగలరు. అందరినీ తనంతటి వారిగా చేయాలని బాబా ఆశయం. ఎందుకంటే బాబా తన ఆత్మనే ప్రతి ఒక్కరిలో చూస్తారు. వారిలోని ప్రతి భాగాన్ని, వారి ఆత్మను సంపూర్ణం చేసుకునే ప్రక్రియ అది. వారి స్థితి అలా ఉంటుంది. కాని మనకు, మనం వారి (బాబా)లో ఒక భాగమనే జ్ఞానం లేదు కాబట్టి, మనము, అన్ని జీవరాశులు ఒకటే అని అర్థం చేసుకోలేం కాబట్టి, వారు మనలను వారిలాగా తీర్చిదిద్దాలని ప్రయత్నించినా, మనం వేరే విధంగా ఆలోచిస్తుంటాము.*

ఇక గురువుగారి సన్నిధిలో ఉండగా జరిగిన అద్భుతమైన అనుభవాల విషయానికొస్తే ఎన్నో ఉన్నాయి.

ఒకసారి మే నెలలో గురువుగారితో కలిసి కర్ణాటక ఎక్స్‌ప్రెస్‌లో బెంగుళూరు నుండి శిరిడీ వెళుతున్నాము. మాకు సెకెండ్ క్లాసులో స్లీపర్‌లో బెర్తులు ఉన్నాయి. అది వేసవి కావడం వలన బోగీలో విపరీతమైన వేడిగా ఉంది. రైలంతా ఎంతో రద్దీగా ఉండడంతో కనీసం గురువుగారికైనా ఎ.సి.లో ఒక బెర్తు దొరికితే బాగుండునని నేనెంతో ప్రయత్నించాను. కానీ దొరకలేదు. ఆఖరికి టి.సి. తన బెర్త్ యిస్తానన్నాడు.

నా ప్రయత్నాలు, ఫలితాలు అన్నీ గమనిస్తున్న గురువుగారు *"ఎందుకయ్యా అదంతా! అందరం ఇక్కడే ఉందాం. అంతగా అవసరమైతే ఈ వాతావరణాన్ని బాబా చల్లగా మార్చలేరా ఏం!"* అన్నారు. వారలా అన్న పది నిమిషాలకే వాతావరణమంతా

ఆహ్లాదకరంగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చల్లని గాలి వీచసాగింది. నిప్పులు చెరిగే మండు వేసవి క్షణాలలో చల్లని శీతాకాలంలా మారిపోయినట్లయింది. మహాత్ములను సేవించుకొనేందుకు ప్రకృతి కూడా కైమోడ్పుతో వేచి ఉంటుందని నేను విన్నది ఆ రోజు కళ్ళారా చూడగలిగాను.

***భక్తుడు:*** *అన్నదానం చేసేటప్పుడు ఏ భావంతో చేయాలి సార్?*

***గురువుగారు:*** *అన్నదానం అనే మాట రానివ్వద్దు. మనం బాబాకు ఎలా నైవేద్యం పెడుతున్నామో, దీన్ని అలా నైవేద్యంగానే పెట్టాలి. పెట్టేవారికి నేను బాబాకు నైవేద్యం పెడుతున్నాను అనే భావం ఉండాలి. తినేవారు మేము బాబా ప్రసాదం తింటున్నామనుకోవాలి. పెట్టేవారు బాబా ఏ రూపంలో తింటున్నారో అనుకోవాలి. అందుకే అన్నదానం అనకూడదు. అది బాబా నైవేద్యం. బాబా ప్రసాద వినియోగం అనవచ్చు. తినేవాళ్ళను చూసి 'రెండవసారి అడగబాకండి' అనడం, 'తిన్నది చాల్లే, ఇంకెంత తింటావు' అనడం చేయకూడదు. బాబాకు నైవేద్యం పెడుతున్నామనే భావనే ఉంటే ఇలా వ్యవహరించము గదా?*

***భక్తుడు:*** *మనం తినగా పారవేసినవి వేస్ట్ కావడం లేదు గదా. జంతువులు, సూక్ష్మజీవులు తింటున్నాయి కదా. అదీ అన్నదానమే కదా?*

***గురువుగారు:*** *అదెలా అన్నదానమవుతుంది. మనం పారవేశాము. అవి సంపాదించుకొన్నాయి.*



*శ్రీబాబూజీ, శిరిడీ, 2007*



*శ్రీబాబూజీ, శిరిడీ, 1992*



బాబా పథంలో...

# పరివర్తనాక్రమంలో...

పొన్నవోలు శైలజ
గృహిణి, చెన్నై
జన్మించిన సం॥ 1963

చెన్నై, ఆగష్టు 2004

మేము గురువుగారి దగ్గరకు ప్రాపంచికమైన కోరికలతో, సమస్యలతో వచ్చినా, వారు వాటిని తీర్చడంతో పాటు మానసిక పరివర్తన, శాంతి, ఆనందాలు ప్రసాదించారు. వారు వాచా ఏమీ బోధించకపోయినా, ఆయన సన్నిధి ప్రభావంతోనే మనలో పరివర్తన వస్తుందని మాకు కొంత కాలానికిగాని అర్థంకాలేదు. వారితో మాకు ఉన్న జన్మజన్మల అనుబంధమేమిటో మాకైతే తెలియదు కానీ మా వారు, నేను, మా పాప, బాబు అందరం, ఆయన దగ్గరకు చేరిన మరుక్షణం నుండి ఆయన పరివారంలో భాగమైపోయాము. మేము అలా అయ్యాము అనేకంటే వారి ఆదరణ, ఆప్యాయతలే మమ్మల్ని వారి దరికి చేర్చాయి అనాలి.

నేను చాలా రోజుల నుండి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుండేదాన్ని. ప్రతి చిన్న విషయానికి విపరీతంగా ఆందోళన చెందేదాన్ని. గురువుగారికి చెప్పుకొంటే "కంప్యూటర్ వర్క్ నేర్చుకో, సచ్చరిత్ర తెలుగులో టైపు చెయ్యమ్మా" అని చెప్పారు. అప్పుడు వారు చెప్పిన దాన్ని ఆచరించాలని కూడా నాకు తెలియదు. చేయాలని ఉన్నా వారు చెప్పిన రెండు సంవత్సరాల వరకు ఏమీ చేయలేకపోయాను. ఆ తర్వాత చాలా కష్టపడి ఇంగ్లీషులో సచ్చరిత్ర టైపు చేశాను. ఆ తరువాతే తెలుగు టైపు నేర్చుకున్నాను. అలా కంప్యూటర్ వర్క్ మొదలుపెట్టిన తర్వాత క్రమంగా నాకు తలనొప్పి, ప్రతి చిన్న విషయానికి ఆందోళన చెందడం తగ్గుతూ వచ్చాయి. అప్పుడుగాని వారు చెప్పిన మాట యొక్క ప్రాముఖ్యత ఏమిటో తెలియలేదు. తర్వాత ఒకసారి గురువుగారి దగ్గరికి వెళ్ళినప్పుడు "నేను ఎలాగో కష్టపడి టైపు నేర్చుకుని వర్క్ చేస్తున్నాను. నేను తిరిగి వెనక్కి వెళ్ళకుండా చేయండి" అని అడిగాను. దానికి వారు పకపకా నవ్వారు. చాలారోజులు గురువుగారు అలా ఎందుకు నవ్వారా అని ఎంత ఆలోచించినా నాకు అర్థమయ్యేది కాదు. కొంచెం అవగాహన వచ్చిన తర్వాత ఇప్పుడు తెలుస్తోంది. ఒక్కసారి సద్గురువు దగ్గరకొచ్చిన తర్వాత మనం వెళ్ళాలన్నా వెళ్ళలేము. 'నువ్వు వెళ్ళాలనుకొన్నా నేను వెళ్ళనిస్తే కదా' అని ఆ నవ్వుకు అర్థమేమో!

అంతకు ముందు పెద్ద పెద్ద కష్టాలుగా, ఇబ్బందులుగా తోచేవన్నీ ఇప్పుడు గురువుగారి సాన్నిధ్యంలో తేలిగ్గా అనిపిస్తున్నాయి. జీవితంలో ప్రతి సంఘటన మనకేదో నేర్పించడానికే అనిపిస్తోంది. కష్టం వచ్చినప్పుడు కృంగిపోవడం, సుఖంలో పొంగిపోవడం కాకుండా జీవితాన్ని ప్రశాంతంగా బాబా ప్రసాదంలా గడిపేలా ప్రయత్నించడం గురుసన్నిధి నాకు అనుగ్రహించిన వరం.

గురువుగారి దగ్గరికి వచ్చిన తరువాత నా జీవితగమనమే మారిపోయింది. సామాన్యమైన జీవితంలో నుండి పూర్తిగా ప్రేమతో నిండిన మరో ప్రపంచంలోకి ప్రవేశించినట్లుంది. తిరిగి ఆ పాత ప్రపంచంలోకి వెళ్ళాలనిపించదు. నిజానికి ఇక్కడ ఆధ్యాత్మికత అంటూ సిద్ధాంతాలేమీ ఉండవు. కానీ ఆనందప్రదమైన మార్గంలో నడవటమేమిటో మాత్రం అనుభవమవుతుంది. గురువుగారి చుట్టూ అందరూ ఒక పెద్ద కుటుంబంలాగా అల్లుకుంటే, ఆ కుటుంబంలో అందరినీ గమనించుకునే కుటుంబ పెద్దలా, వాత్సల్యమూర్తి అయిన తండ్రిలాగా అనిపిస్తారు.

ఎలాగోలా బ్రతికేయడం కాకుండా జీవించడమంటే ఏమిటో నేర్పించారు గురువుగారు. మేమంతా వారిపై ఎంతగా ఆధారపడిపోయామంటే వారికి చెప్పకుండా ఏదీ చేయలేము, ఎక్కడికీ వెళ్ళలేము. పిల్లలు ఏమన్నా కొనుక్కోవాలన్నా గురువుగారి ఫోటో దగ్గర ప్రార్థించుకోవడమో లేక అవకాశముంటే నేరుగా అడగడమో చేస్తుంటారు. అన్నిటికి ఆయన మీద ఆధారపడవచ్చు అనేది చెప్తే ఎలా వస్తుంది? ప్రతి చిన్న విషయానికి అది చిన్నదిగానీ, పెద్దదిగానీ వారే చూసుకుంటారు అనే భరోసా మనకుంటేనే కదా!

"ఓ భగవంతుడా! నువ్వు ఎప్పుడూ నాతోనే నడుస్తావని నాకు అభయమిచ్చావు. కానీ నేను సమస్యల్లో ఉన్నప్పుడు నేను నడిచే దారిలో రెండు పాదాల గుర్తులే చూశాను. నీ పాదాల గుర్తులు నాతో లేవు" అని ఒక భక్తుడు అడిగిన దానికి భగవంతుడు "ఆ పాదాల గుర్తులు నీవి కావు, నావే. నీవు సమస్యల్లో ఉన్నప్పుడు నేను నిన్ను ఎత్తుకుని నడిచాను" అని సమాధానమిచ్చాడు. ఏదో పుస్తకంలో చదివిన ఈ విషయం గురువుగారి రక్షణలో నాకు అనుభవమయ్యింది.

## అనుభవాలు కావవి అండదండలే

అమరంబేడు భానుమూర్తి
గవర్నమెంట్ ఉద్యోగి, తిరుపతి
జన్మించిన సం॥ 1948

తిరుపతి, మార్చి 2000

నాకు తల్లీ తండ్రీ, సర్వస్వం నా గురువే! నా తండ్రి గురించి నేనేం చెప్పగలను? నేను వారిని గురించి ఏం చెప్పినా ఎంత వ్రాసినా అది తక్కువేనన్నది నా అభిప్రాయం. ప్రథమంగా వారి దర్శన భాగ్యం పొందినది మొదలు నా జీవితంలోని ప్రతి రోజూ, ప్రతి క్షణం, ప్రతి సంఘటన వారి అనుగ్రహమే. అందుకే నాకు గుర్తున్నంతవరకు నా అనుభవాలన్నింటినీ మీ ముందుంచే ప్రయత్నం చేస్తున్నాను.

1985వ సం॥లో నాకు ఒంగోలుకి బదిలీ అయింది. ఒకరోజు నా మిత్రులు బాలకృష్ణ గుప్తా నన్ను సాయిబాబా మందిరానికి, శ్రీభరద్వాజ మాస్టరు గారి దగ్గరకు తీసుకెళ్ళారు. అప్పుడే డా॥ శ్రీనివాసులురెడ్డి కూడా పరిచయమయ్యారు. ఆయనతో నా భార్య అనారోగ్యం గురించి మాట్లాడాను. తర్వాత గుప్తాగారు నన్ను సాయిబాబా సెంట్రల్ స్కూల్‌కి తీసుకెళ్ళారు. అక్కడ అప్పుడే మేడ మెట్లు దిగి వస్తున్న ముప్పై ఏళ్ళ యువకుణ్ణి చూపుతూ "వీరే శరత్‌బాబుగారు" అని వారిని నాకు పరిచయం చేశారు గుప్తాగారు. వారితో ఆ ప్రథమ సందర్శనంలోని కొద్దిసేపు సంభాషణే నన్నెంతో గాఢంగా ప్రభావితం చేసింది. అప్పటి నుండి శ్రీసాయి సచ్చరిత్ర పారాయణ చేయడం ప్రారంభించాను.

1985వ సంవత్సరాంతంలో నాకు ఒంగోలు నుండి అనంతపూర్‌కు బదిలీ అయింది. నా ఉద్యోగ నిర్వహణలో పుట్టపర్తి కూడా నా పరిధిలోకే వచ్చేది కాబట్టి తరచూ నేను అక్కడికెళ్ళేవాడిని. చిన్నప్పట్నుండీ భక్తి వాతావరణంలో పెరిగాను. సుబ్రహ్మణ్యస్వామికి కావడి తీసుకెళ్ళడం (తమిళుల సంప్రదాయం), ఏటా అయ్యప్ప స్వామి మాల వేసుకుని శబరిమలై వెళ్ళడం చేసేవాడిని. అలాగే పుట్టపర్తికి కూడాను. అవి అందరూ చేస్తున్నారు కదా అని నేను చేయడమేగాని ఆధ్యాత్మికత పట్ల, గురువులు, వారి సంప్రదాయాల పట్ల అవగాహన ఉండి కాదు.

1988లో గన్నవరంలో డిపార్టుమెంటు ట్రయినింగ్ కోర్సులో శ్రీయస్.వి.యల్. నారాయణరావు కలిసారు. నిజానికి 1977 నుంచీ నాకు నారాయణరావుగారు

తెలుసు. అయితే అంతకు మునుపు నాకు తెలిసిన నారాయణరావు వేరు, ఈయన వేరు. ఆయన అలవాట్లు, స్వభావమూ పూర్తిగా మారి ఉండడం గమనించాను. అక్కడ ఆయన నాకు బాబా, గురువుగారి గురించి ఎన్నో విషయాలు చెప్పారు. అది విన్న తరువాత నాకూ శిరిడీ వెళ్ళాలనిపించింది. ఇక ముందు ఎప్పుడు శిరిడీ వెళ్ళినా నన్ను కూడా పిలవమని మరీ మరీ చెప్పాను. ట్రైనింగ్ పీరియడ్ పూర్తవడంతో ఎవరి ఊర్లకి వాళ్ళం వచ్చేశాము.

ఉద్యోగరీత్యా నేనెప్పుడూ చాలా బిజీగా ఉండేవాడిని. అట్లా విసుగు, విరామం లేకుండా పని చేయడంలోనే నాకు ఆనందంగా ఉండేది. పని... పని... పని తప్ప వేరే ధ్యాస ఉండేది కాదు. ఒకరోజు నేనలా పనిలో తలమునకలుగా ఉన్నప్పుడు నారాయణరావుగారి దగ్గర నుండి ఫోన్ కాల్ వచ్చింది. తాను శిరిడీ వెళుతున్నాననీ, నేనూ వచ్చేటట్లయితే నాక్కూడా టికెట్ బుక్ చేస్తాననీ అడిగారు. పనులు వదిలేసి ఎలా వెళ్ళడమా అని కొద్దిసేపు తటపటాయించినా, వెళదామనే అనిపించి 'వస్తున్నాను' అని చెప్పాను. అదే నా మొదటి శిరిడీ సందర్శనం.

***భక్తుడు:*** *ఎవరూ శిరిడీకి యాదృచ్ఛికంగా రారా? ఎప్పుడూ ""ఈ గురువు నాకు సరైన గురువేనా?" అనే ప్రశ్న ఉదయించదా?*

***గురువుగారు:*** *జీవితకాలంలో మనిషి వివిధ రకాల రూపాలు, మనుష్యులతో మెలిగి తన abstract sense of fulfilment ని స్పష్టం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. ఈ మహాత్ముని ద్వారా నాకు fulfilment వస్తుందా? లేక ఆ మహాత్ముని ద్వారానా? అనుకొంటూ ప్రయత్నం చేస్తూ పోగా ఎంతో కొంత స్పష్టత వస్తుంది. అప్పుడు అతనికి ఇంకా వేరే ఏదైనా ఉందేమోనని తోచి ముందుకు సాగిపోవచ్చు. అలా పోయి పోయి అతనికి చివరికి "ఇదిగో, ఈయనే నాకు సరైన గురువు" అనిపించి, ఆ అన్వేషణ ఆపవచ్చు. ఆ అన్వేషణలో అప్పటివరకు తటస్థించిన రూపాలు, మనుష్యులు, ఆ అన్వేషణ ప్రేరేపించినవన్నీ సద్గురువే. అందుకనే నేను సరైన గురువును ఎన్నుకున్నానా? అని మనం భయపడవలసిన పనే లేదు. అది మామూలుగా జరిగే ప్రక్రియ. ప్రతి ఒక్కరు వారిలో అవ్యక్తంగా, అస్పష్టంగా ఉన్న ఆనందానుభవాన్ని నిర్దిష్టం చేసుకోవడానికి, నిజం*

*చేసుకోవడానికి మార్గాలు వెతుకుతూనే ఉంటారు. అది డబ్బు, ఆరోగ్యం, భార్య, భర్త ఏదైనా కావచ్చు. అన్ని సందర్భాలలోనూ సద్గురువే మీకు దారి చూపించి ఆ నిర్దిష్టత, స్పష్టత తీసుకునిరావడానికి సహాయం చేసి తన దగ్గరకు లాక్కొని వస్తారు. ఆ విధంగా ఈ పయనంలో, అన్వేషణలో నీకు సంభవించే సన్నివేశాలన్నింటికీ ఆయనే కారకులు. వారు మిమ్మల్ని ఎన్నుకొంటారు. మిమ్మల్ని పిలుస్తారు. మిమ్మల్ని కూడా తీసుకుని వెళ్తారు.*

శిరిడీ నుండి తిరిగి వచ్చిన కొన్నాళ్ళకు మళ్ళీ నారాయణరావుగారు ఫోన్ చేసి గురువుగారు హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. ఎందుకో తెలియదు, ఎంతో పని వత్తిడిలో ఉన్నప్పటికీ వెంటనే బయలుదేరి హైదరాబాద్ వెళ్ళాను. నేను గురువుగారి గదికి వెళ్ళేసరికి అక్కడ డాక్టర్ రెడ్డిగారు, గుప్తాగారు, నారాయణరావుగారు తదితరులున్నారు. అప్పుడే నేను ప్రథమంగా గురువుగారి పాదాలకు నమస్కారం చేసుకున్నాను. వారి పాదాలు తాకిన మహత్తర క్షణాలెలాంటివోగాని అప్పటి నుండి వారితో దృఢమైన అనుబంధం పెనవేసుకుంది. వారి సేవ చేసుకుంటూ నిరంతరం వారితోనే ఉండిపోవాలనిపించేది. వారి సాన్నిధ్యంలో ఒక విధమైన ప్రశాంతత, అపరిమితమైన ఆనందం కలిగేది. ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోవడంకన్నా వేరే ఏమీ అడగాలని అనిపించేది కాదు. గురువుగారితో పరిచయం, అనుబంధం నా జీవితాన్నే మార్చివేసిందని చెప్పాలి. ఆ తర్వాత నుండి వీలున్నప్పుడల్లా తరచుగా వారిని కలుసుకునేందుకు వెళ్ళేవాడిని.

అప్పట్లో నా కుటుంబంలోని రెండు సమస్యలు నన్నెంతో బాధించేవి. అవి నా కుమారుల చదువులు, నా భార్య అనారోగ్యం. మా పెద్దబ్బాయి పదవ తరగతి పాసయ్యాడు. ఇంటర్‌లో వాడిని ఏ గ్రూప్‌లో చేర్పించాలని గురువుగారినడిగాను. "సైన్స్‌లో చేర్పించమ"న్నారు గురువుగారు. అయితే నేను ఇంటికి వెళ్ళిన తరువాత అబ్బాయికి ఏ గ్రూప్ బాగుంటుందని వాడితోనూ, నా స్నేహితులతోనూ చర్చించాను. వాళ్ళంతా మాథ్స్ అన్నారు. శిరిడీలో గురువుగారు సైన్స్‌లో చేర్పించమన్నా, వారికి ఈనాటి చదువులు, వాటి పోకడ పెద్దగా ఏం తెలిసుంటాయిలే అన్న అవివేకపు ఆలోచనతో, నా స్వంత తెలివితేటలను, విశ్లేషణలను నమ్మి పెద్దవాడిని ఇంటర్ మాథ్స్‌లో చేర్పించాను. ఈ విషయం గురువుగారితో చెప్పలేదు. ఇవన్నీ ప్రస్తావించి

వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకులే అని నాకు నేను సర్ది చెప్పుకున్నా. అసలు కారణం మాత్రం వారు చెప్పినది చేయలేదన్న విషయాన్ని బయటపెట్టడం ఇష్టం లేకనే.

ఇంటర్ మొదటి సంవత్సరంలో వాడు అన్ని సబ్జెక్ట్స్‌లోనూ ఫెయిలయ్యాడు. అప్పుడు గురువుగారి దగ్గరకు వెళ్ళి పిల్లవాడు ఫెయిలయ్యాడని చెప్పుకున్నాను. *"ఏ గ్రూప్‌లో చేర్పించారు"* అనడిగారు.

సైన్స్‌లో చేర్పించమన్న విషయం వారికేం గుర్తుంటుందిలే అనుకొంటూ "మాథ్స్ సార్" అన్నాను. *"నేను సైన్స్‌లో చేర్పించమన్నాను కదా. మాథ్స్‌లో ఎందుకు చేర్పించారు"* అనడిగారు గురువుగారు.

సిగ్గుతో తలదించుకున్నాను. మెల్లగా ధైర్యం కూడదీసుకుని ఏ సబ్జక్టు అయితే వాడు బాగా చదవగలడు అని అడిగాను. అప్పటికే ఒక సంవత్సరం మాథ్స్ చదివి ఉన్నాడు కాబట్టి గురువుగారదే కొనసాగించమంటారని లోలోన చిరు ఆశ. అయితే గురువుగారు మాత్రం *"వాడిని గవర్నమెంటు కాలేజీలో సైన్స్ గ్రూప్‌లో చేర్పించండి!"* అని చెప్పారు. ఇక చేసేది లేక ఊరికి వచ్చి వాడిని ఇంటర్ ఫస్ట్ ఇయర్ సైన్స్ గ్రూప్‌లో చేర్చాను. కానీ గురువుగారన్నట్లు గవర్నమెంటు కాలేజీలో కాక, మంచి పేరున్న ప్రైవేటు కాలేజీలో చేర్పించాను. మూడు నెలలు గడిచిన తరువాత పిల్లవాడి చదువు ఎలా సాగుతుంది అని కనుక్కునేందుకు ప్రయత్నిస్తే తెలిసిన విషయం నన్ను హతాశుణ్ణి చేసింది. గవర్నమెంటు కాలేజీలో శిక్షణ బాగుండదేమోనన్న ఆలోచనతో ప్రైవేటు కాలేజీలో చేర్పించడమన్న నా ఆలోచన పొరపాటని మరోసారి ఋజువైంది. ప్రైవేటు కాలేజీల్లోని చదువుల వత్తిడికి తట్టుకోలేక వాడు ఆ కాలేజీకి సరిగా వెళ్ళడం లేదనీ, వాడికసలు ఆ కాలేజీయే నచ్చలేదని తెలుసుకున్నాను.

మరలా గురువుగారి దగ్గరకెళ్ళి ఈ విషయం చెప్పుకున్నాను. *"ఎక్కడ చేర్పించారు?"* అనడిగారు గురువుగారు.

ప్రైవేటు కాలేజీ పేరు చెప్పి, వాడు కాలేజీకి సరిగా పోవడం లేదని చెప్పాను. *"నేను వాడిని గవర్నమెంటు కాలేజీలో చేర్పించమని కదా చెప్పాను. ప్రైవేటు కాలేజీలో ఎందుకు చేర్పించారు?"* అన్నారు వారు.

వారి మాటలతో నాకెందుకో దుఃఖం కలిగింది. వెక్కి వెక్కి ఏడుస్తూ కన్నీళ్ళతోనే గురువుగారిని "నేను ఇంజనీరింగ్ చదివాను. కానీ మా అబ్బాయిల చదువుల తీరు చూస్తుంటే డిగ్రీ అన్నా చేస్తారా అని దిగులుగా ఉంది. నా అవివేకం వలన ఇంత

గందరగోళం జరిగింది. నన్ను మన్నించి వాళ్ళని బాగా చదువుకొనేలా దీవించండి" అని అడిగాను. "వెంకూకు పుస్తకాలిచ్చి శిరిడీ పంపించండి" అన్నారు గురువుగారు.

నాకు బాగా తెలుసు శిరిడీలో వాడు అసలు చదవడని. అయినా పంపించాను. వాడక్కడ ఒక సంవత్సరమున్నాడు. గురువుగారు వాడిని ఫైనల్ పరీక్షలకు పంపమన్నారు. గురువుగారిపై భారం వేసి నేనలాగే చేశాను. కానీ వాడు పరీక్షలో పాసవుతాడు అన్నది అపనమ్మకమే. వాడసలు అక్కడ చదవడంగాని, క్లాసెస్‌కి అటెండవ్వడంగాని, ట్యూషన్‌గాని ఏమీ లేదు. ఇక వాడు పాసవడమంటే అదేదో దైవకృప తోడవ్వాల్సిందే అనుకున్నాను.

నిజంగా గురువుగారి అనుగ్రహం ఎంత గొప్పదంటే వాడు పరీక్షలకు వెళ్ళడం, మంచి మార్కులతో పాసవ్వడం కూడా జరిగింది. గురువుగారు వాడి ఆసక్తి ఏమిటని అడిగి వాడిని హోమియోపతి చదివించమన్నారు. ఆ విషయంలోనూ గురువుగారి ఆశీర్వాద బలంతోనే వాడికి అతి తక్కువ ఫీజుతో మంచి కాలేజీలో హోమియోపతి మెడిసిన్‌లో సీటు వచ్చింది. వాడు అది చక్కగా పూర్తి చేసి ఈనాడు డాక్టరయ్యాడంటే ఇదంతా గురువుగారి మహిమే తప్ప వేరే కాదని నా విశ్వాసం. మా రెండవ అబ్బాయిని బి.డి.ఎస్. లో చేర్పించడం కూడ గురువుగారి కృపతోనే సాధ్యమయ్యింది. మా ఇద్దరబ్బాయిల చదువులు అట్లా గురువుగారి చలువతోనే చక్కబడ్డాయి. ఇద్దరూ డాక్టర్లుగా వారి వృత్తుల్లో రాణిస్తారన్న నమ్మకమూ, తృప్తి నాకు ఈనాడు ఉన్నాయంటే దానికి కారణం గురువుగారే.

ఇక నా భార్య అనారోగ్యమూ అప్పట్లో నన్ను బాగా బాధపెట్టేది. సంవత్సరాల పర్యంతం ఆమె ఉబ్బస వ్యాధితో తీవ్రంగా బాధపడేది. ఎందరో వైద్యుల వద్ద ఎన్నో రకాల వైద్యాలు చేయించినా, ఎన్ని మందులు వాడినా ఆమెకు ఏమీ నయం కాలేదు. ఇంత ముదిరిపోయిన దశలో ఉన్న ఆమె వ్యాధిని గురువుగారు మాత్రం ఏం చేయగలరులే అనుకుని మొదట్లో ఆమె అనారోగ్యం గురించి వారికి ఏమీ చెప్పుకొనేవాడిని కాదు. ఆమెకు ఆ విధంగా ఒంట్లో బాగలేక హాస్పిటల్స్ చుట్టూ, డాక్టర్ల చుట్టూ తిరుగుతూ ఉండడం వలన ఇంట్లో నాకు, పిల్లలకి ఎంతో ఇబ్బందిగా ఉండేది. ఆమె వైద్యానికయ్యే ఖర్చు నన్ను ఆర్థికంగా కూడా బాగా కృంగదీసింది.

గురువుగారు ఆ రోజుల్లో హోమియోపతి వైద్యం చేసేవారు. ఏ రోగి దగ్గరా ఒక్క పైసా కూడ తీసుకునేవారు కాదు. ఉచితంగా వైద్యసేవలందించే వారి దగ్గరకు

రోజూ ఎందరో వ్యాధిగ్రస్తులు వచ్చేవారు. అందరూ చక్కగా నయమై వెళ్ళేవారు. నా భార్య అనారోగ్యాన్ని చూస్తూనే ఉన్నారు కాబట్టి వారంతట వారే ఏదో ఒక మందో, వైద్యమో సూచిస్తారేమోనని కొన్ని రోజులు చూశాను.

గురువుగారు అడగనిదే ఎవరికీ ఉచిత సలహాలు ఇవ్వరు అని తెలుసుకొన్న నేను, ఒకసారి వేసవి సెలవుల అనంతరం శిరిడీ నుండి ఊరికి బయలుదేరి వెళ్ళే ముందు గురువుగారికి నమస్కారం చేసుకుని నా భార్య అనారోగ్యం గురించి ఏకరువు పెట్టి, ఎట్లా అయినా నయం చేయమని వేడుకున్నాను. నా భార్య కూడా ఇకపై గురువుగారిచ్చే మందులు తప్ప మరే మందులూ వాడనని గట్టిగా ప్రమాణం చేసుకొన్నది.

గురువుగారిపై ఆమె పెట్టుకున్న నమ్మకమే ఆమెకు రక్షణ కవచమైంది. ఆ తర్వాత ఆమె ఎంత తీవ్రంగా ఉబ్బసంతో బాధపడుతున్నా గురువుగారు ఇచ్చిన మందులే తప్ప తాత్కాలిక ఉపశమనానికి కూడా ఏ మందులూ వేసుకొనేది కాదు. గురువుగారు ఒంగోలులో ఉండగా వారికి ఫోన్ చేసి, వారు సూచించిన ప్రకారమే మందులు వాడేవారము. అయితే ఎప్పుడైనా అర్ధరాత్రి సమయంలో ఆమెకు వ్యాధి తిరగబెడితే మాత్రం ఆ సమయంలో ఫోన్ చేసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకని నేను ఊరుకున్నా, అవసరమైనప్పుడు గురువుగారే స్వయంగా ఫోన్ చేసి ఆమె ఆరోగ్యం గురించి విచారించేవారు.

ఆ తర్వాత వారు ఒంగోలు నుండి శిరిడీకి నివాసం మార్చినప్పటికీ, డాక్టరు శ్రీనివాసులురెడ్డిగారి ద్వారా నా భార్యకు మందులు ఇప్పించేవారు. ఆమెకు అనారోగ్యం తీవ్రంగా ఉంటే పిల్లల్ని అనంతపూర్‌లో బంధువుల దగ్గరుంచి నేనూ, నా భార్య వైద్యం కోసమని డాక్టరు రెడ్డిగారి ఇంట్లో కొన్ని రోజులున్నాము. నిజానికి ఆ రోజుల్లో ఆ దంపతులిద్దరూ చూపించిన ఆదరణ, ఆప్యాయతలను నేనెప్పటికీ మరువలేను. జీవితంలో మొట్టమొదటిసారిగా గురుబంధువుల ప్రేమ, ఆత్మీయతలు ఎంత తీయనివో మాకు అర్థమయ్యాయి. ఆ తర్వాత నా భార్యకు వ్యాధి కొంతవరకు నయమయింది కానీ మరో మూడేళ్ళు బాధపడింది.

ఒకరోజు ఆమె ఆయాసంతో పడుతున్న బాధ చూడలేక నేను గురువుగారితో "సార్! ఇంకా ఎంతకాలం ఆమె ఇలా బాధపడాలి? ఆమె బాధ చూడలేకపోతున్నాను. ఆమె ఇలా ఇబ్బంది పడేకన్నా చనిపోవడమే మేలేమో అని అనిపిస్తున్నది ఒక్కోసారి" అన్నాను వేదనగా.

"నువ్వు బాహ్యంగా ఆమె అనుభవిస్తున్న వ్యాధిని, బాధను చూస్తున్నావు. కానీ నేనామె అంతరాంతరాళాల్లో పాతుకొని ఉన్న రుగ్మతల్ని, మానసిక సమస్యల్నీ నయం చేయవలసి ఉంది. బాహ్యంగా జబ్బు నయం చేసేయవచ్చు కానీ, లోన ఉన్న రుగ్మతలన్నీ అలాగే మిగిలిపోతాయి. ముందు వాటి మూలాలను తొలగించాలి" అన్నారు గురువుగారు.

ఆ కరుణామూర్తి జవాబు విన్న తర్వాత నా భార్య ఆరోగ్య విషయాన్ని వారి పాదాల చెంత అప్పగించి నేను ధైర్యంగా ఉండసాగాను. తర్వాత నా భార్య ఆరోగ్యం క్రమంగా మెరుగవుతూ వచ్చింది.

వైద్యం కోసమని ఒంగోలులో డాక్టరు రెడ్డిగారి ఇంట్లో ఉండే రోజుల్లో డాక్టరుగారు ఒంగోలు స్కూలు పనులు చూస్తుండేవారు. నేను వారికి స్కూలు పనుల్లో సహాయంగా ఉండేవాడిని. సహాయం చేశాననేకంటే విద్యార్థిగా ఎన్నో నేర్చుకున్నానంటే బాగుంటుందేమో! సమాజంలో అందరితో స్నేహంగా, మంచిగా మెలగడం నాకు చేతనయ్యేది కాదు. బాధైనా, సంతోషమైనా నలుగురితో పంచుకోవడమూ నాకు తెలియదు. మానసికంగా ఒంటరి వాడిననవచ్చు. తోటివారిని నమ్మడం, ప్రేమించడం నాలో మొదటి నుండీ లేదు. నిజానికీనాడు గురువుగారి ద్వారా పొందుతున్న ఇంతటి ప్రేమాభిమానాలకు నేనసలు కించిత్తయినా అర్హుణ్ణేనా అనిపిస్తుంటుంది నాకు. కోపం, అపనమ్మకం, ఈర్ష్యాసూయలు వంటి ఎన్నో వ్యతిరేకభావాలను పుట్టుక నుండి ప్రోగు చేసుకున్న నా నుండి మెల్లమెల్లగా ఆ భావాలన్నింటినీ పోగొట్టి అవ్యాజ ప్రేమానురాగాలు కురిపించి నన్నొక మంచి మనిషిగా తీర్చిదిద్దుతున్నారు వారు.

నా అంతరంగాన్ని సరిచేసి, నా జీవితంలోని సమస్యలన్నింటినీ తొలగించి నిశ్చింతగా నన్ను సాయిపథంలో నడిపిస్తున్న నా తండ్రి, నా గురుదేవుల ఋణం నేను ఎన్ని జన్మలెత్తినా తీరనిది, తీర్చుకోలేనిది.

# ప్రేమను పెంచుకో

సంకా చిన్ని బాలకృష్ణ గుప్తా
గవర్నమెంట్ ఉద్యోగి, హైదరాబాద్
జన్మించిన సం॥ 1943

హైదరాబాద్, జూన్ 2001

1983లో నేను ఒంగోలులో ఆర్.టి.సి. ఇంజనీరుగా పనిచేస్తున్న రోజులలో శ్రీభరద్వాజ మాస్టరుగారిని కలిశాను. పైల్స్ వ్యాధితో బాధపడుతున్న నేను ఆయన సలహాపై డాక్టరు శ్రీనివాసులురెడ్డిగారి దగ్గరకు వెళ్ళాను.

డాక్టరు రెడ్డిగారి దగ్గరకు ట్రీట్‌మెంట్ కోసం వెళ్ళిన ప్రతిసారీ వెనుకనున్న గదిలో ఒక వ్యక్తి కూర్చొని ఎప్పుడూ ఏదో వ్రాసుకొంటూ కనిపించేవారు. గాలికి కర్టెన్ తొలగినప్పుడల్లా వారి వంక కుతూహలంగా చూస్తుండేవాడిని. ఒకరోజు "అక్కడ వ్రాసుకొనే వారెవరు" అని డాక్టరుగారిని అడిగాను.

"వారు శరత్‌బాబుగారు. రండి మీకు పరిచయం చేస్తాను" అని, వారిని నాకు పరిచయం చేశారు. వారితో మాట్లాడుతుంటే వీరిలో ఏదో ప్రత్యేకత ఉందనిపించింది. నా ప్రాణస్నేహితుడైన నారాయణరావును కూడా వారి దగ్గరకు తీసుకెళ్ళాను. నారాయణరావు కూడా గురువుగారి వలన ఎంతో ప్రభావితుడయ్యాడు. మేమిద్దరమూ తరచూ వారి వద్దకు వెళ్ళేవాళ్ళం. వారి దగ్గర కూర్చుంటే మాకు కాలగమనమే తెలిసేది కాదు. మాటల మధ్య ఏదైనా ఒక టాపిక్ వస్తే దాన్ని వారు వివరించే విధానం సరళంగా, స్పష్టంగా మనసుకు హత్తుకుపోయేలా ఉండేది. గురువుగారితో సాన్నిహిత్యం పెరిగేకొద్దీ నా ప్రవర్తనలో లోపాలు స్పష్టంగా కనిపించసాగాయి. నేను నా బాధ్యతలను ఎదుర్కొనలేక తప్పించుకోవడానికి ప్రయత్నించేవాడిని. ఈ విషయం కూడా గురువుగారు ఎత్తి చూపిస్తేనే గ్రహించుకోగలిగాను.

గురువుగారు నాకు చాలాసార్లు *"ఇతరులను ప్రేమించాలి. అంతేకాక మనం చేస్తున్న పని ఇతరులకు ఉపయోగకరంగా ఉందా, లేదా అని మనను మనం పరీక్షించుకోవాలి"* అని చెప్పేవారు. *"ఎవరైనా సత్యాన్ని పాటించాల్సిందేనని, అలా సత్యాన్ని నమ్ముకొన్న వారికి ఎప్పుడూ ఏ ఇబ్బందులు కలగవని, సత్యానికి అంటిపెట్టుకుని ఉండకపోతే తాత్కాలికంగా బాగున్నట్లు అనిపించినా తర్వాత అంతా సమస్యలమయంగానే ఉంటుంది"* అని నొక్కి వక్కాణించేవారు.

అప్పుడే ఉద్యోగంలో నా ప్రమోషన్ కోసం కోర్టులో కేసు వేసి ఉన్నాను. గురువుగారికీ విషయం చెప్పి నాకు న్యాయం జరగడం లేదని వాపోతే వీటన్నింటికి కారణం నేనేనని, బలంగా వ్రేళ్ళూనుకుని ఉన్న నా ప్రవర్తనేనని నిష్కర్షగా చెప్పారు. ఆ కేసు అయిదేళ్ళు కొనసాగి చివరకు ఫైనల్ హియరింగ్‌కు వచ్చింది. నాకు ఏం చేయాలో తోచక గురువుగారి దగ్గరకు వెళ్ళి ఏం చేయమంటారని భోరున ఏడ్చాను. గురువుగారు కంగారుపడనవసరం లేదని కేసులో ముఖ్యమైన విషయాలన్నీ నారాయణరావు చేత పేపరులో వ్రాయించి మా లాయర్‌కు తీసికెళ్ళి చూపించమన్నారు. నేను అలాగే చేశాను. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే జడ్జిగారు సరిగ్గా గురువుగారు చెప్పిన పాయింట్స్ గురించే ప్రశ్నలు అడిగారు. మా లాయర్‌గారికి ఆ విషయాలన్నీ ముందే చెప్పి ఉండడం వలన ఆయన వాటన్నింటికి సంతృప్తికరంగా వెంటవెంటనే సమాధానాలు చెప్పగలగడంతో మాకు అనుకూలంగా తీర్పునిచ్చారు.

1991లో మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్నాను. ఒకరోజు నా ఎడమకన్ను ఎర్రబడి నొప్పి మొదలైంది. రోజు రోజుకి నొప్పి ఎక్కువ కాసాగింది. కంటి డాక్టరు దగ్గరకెళితే ఆయన పరీక్షించి కంటి తెల్లగ్రుడ్డుపై గుల్ల లేచిందని, అది పగలడానికి మందులు వ్రాసిచ్చారు. గడ్డ కరగడానికి మందులు లేవు. కానీ పగిలితే ఒక్కోసారి కనుగ్రుడ్డుకి ప్రమాదమై కంటి చూపు కూడా పోవచ్చు అన్నాడు. భయపడిపోయిన నేను ముందు నా మిత్రుడు నారాయణరావుకి చెప్పగా "మనం గురువుగారి దగ్గరకు వెళదాం పద" అని వెంటనే నన్ను శిరిడీ తీసుకెళ్ళాడు.

శిరిడీలో గురువుగారి సన్నిధిలో కూర్చోగానే అసలు నేను నా కంటి బాధ విషయం మరచిపోయాను. నొప్పి కూడా తెలియలేదు. అది యిది మాట్లాడుతూ కొంతసేపటికి గురువుగారే *"మీ కన్నుకేమైంది?"* అని అడిగారు.

అప్పుడు విషయమంతా చెప్పాను. హెూమియో మందు ఇచ్చి వేసుకోమన్నారు గురువుగారు. ప్రొద్దునకల్లా కంటి ఎరుపు పోయి, నొప్పి కూడా తగ్గింది. తర్వాత వారం రోజులకి కన్ను మామూలుగా అయిపోయింది.

*"బాబా మీకు కన్ను ప్రసాదించారు!"* అన్నారు గురువుగారు.

బాహ్యంగా కంటి చూపు నిలవడమే కాదు, మానసికంగా కూడా నా కళ్ళు తెరుచుకొన్నట్లయ్యాయి ఆ సంఘటనతో. గురువుగారు ఒక అనంత శక్తి స్వరూపమని, నా కన్ను బాగవడమనే సంఘటనతో నాకు అనుభవమయినా, ప్రపంచం పట్ల

వ్యామోహమనే ప్రభంజనంలో కొట్టుకుపోతున్న నేను సరిగ్గా ఆపద ఎదురైనపుడు వారు హెచ్చరిస్తున్నా దాన్ని అర్థం చేసుకోలేకపోయాను.

ఒకసారి, నా భార్య లక్ష్మిని తీసుకుని నన్ను వెంటనే శిరిడీ రమ్మని గురువుగారు కబురు చేశారు. నేను హఠాత్తుగా శిరిడీ ప్రయాణమంటే వ్యయప్రయాసలతో కూడినదని భయపడి ఆఫీసులో చేయవలసిన పనులు చాలా ఉన్నాయన్న సాకుతో వెళ్ళలేదు. మనం ఆయన మాటను వినిపించుకోకపోయినా ఆయన ప్రేమమూర్తి కనుక *"లక్ష్మిని తీసుకుని శిరిడీ రండి"* అని మరోసారి కబురు పంపించారు. అయినా నేను చాలా బాధ్యతాయుతమైన వ్యక్తిలా మాట్లాడుతూ "ఇంట్లో బంధువులున్నారు, పిల్లలకు పరీక్షలు, ఇప్పుడు ప్రయాణమంటే ఎట్లా" అని కుంటి సాకులన్నీ చెప్పి శిరిడీ వెళ్ళలేదు. నా భార్యను కూడా పంపలేదు. వారం రోజులలోపే నా భార్యకు విపరీతమైన కడుపునొప్పి వచ్చింది. ఓర్చుకోలేక గిలగిలలాడిపోతుంటే వెంటనే హైదరాబాదులో డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాను. డాక్టరు పరీక్ష చేసి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, అప్పటికప్పుడు ఆమెకు ఆపరేషన్ చేయాలన్నారు. కంగారుపడిన నేను అప్పుడు శిరిడీకి ఫోన్ చేసి గురువుగారికి చెప్పాను.

*"భయపడాల్సిన పనిలేదు. డాక్టర్లు చెప్పినట్లు చేయండి"* అన్నారు గురువుగారు. ఆపరేషన్ జరిగింది. ఆమెకు బాగయింది కానీ చాలా డబ్బు ఖర్చయింది. ఆ తర్వాత గురువుగారిని కలిసినప్పుడు "మీ దయవల్ల లక్ష్మికి బాగయింది. కానీ ఎంతో డబ్బు ఖర్చయింది" అన్నాను.

సమాధానంగా గురువుగారు *"నేనేం చేసేది గుప్తాగారు! ఎన్నిసార్లు కబురు చేసినా మీరు వినిపించుకుంటే కదా"* అన్నారు అనునయంగా.

గురువుగారి మాట ప్రకారం శిరిడీ వెళ్ళి ఉంటే ఆపరేషనూ, డబ్బు ఖర్చు, ఆమెకంత బాధ ఉండేవి కావు. ఆ బాధ తప్పించాలని గురువుగారు రెండుసార్లు చెప్పినా నేను నా మూర్ఖత్వంతో గ్రహించలేకపోయాను. నా నిర్లక్ష్యానికి నేను చాలా మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

***భక్తుడు:*** *గురువు చెప్పింది చేయకపోతే ఆయన అనుగ్రహం కోల్పోతామా?*

***గురువుగారు:*** *గురువు అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. కానీ గురువు చెప్పినట్లు చేస్తే ఆ అనుగ్రహం మనకు అనుభవమవుతుంది.*

*శిష్యుడు తను చెప్పింది వినకపోయినా, గురువే ఏదో విధంగా తను చెప్పింది ఆచరించేటట్లుగా చేస్తారు. అప్పుడు శిష్యునికది అనుగ్రహం అనిపించకపోవచ్చుగానీ, అదీ అనుగ్రహమే!*

1992లో నా ఎడమకాలి మోకాలిపై ఒక కురుపు జల్లెడలా లేచింది. అది మెల్లమెల్లగా పెరిగి పెద్దదై భరించలేనంత బాధ కలగసాగింది. దాన్ని పరీక్షించిన డాక్టర్లు అది రాచపుండు (కార్బంకుల్) అని తేల్చారు. నేను అప్పటికే ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిక్ పేషెంటును కనుక ఆ కురుపు తగ్గడం చాలా కష్టమని, ఎనిమిది నెలలు ట్రీట్‌మెంట్ తీసుకుంటే తగ్గవచ్చని, అదీ గ్యారంటీగా చెప్పలేమన్నారు. ఒక వంక భరించలేని బాధ, ఏమవుతుందోనన్న భయం. నేను దిగులుతో రోజురోజుకి కృంగిపోసాగాను. అప్పుడు గురువుగారు ఏకాంతంలో ఉన్నందువలన ఎక్కడున్నారో తెలియలేదు. గురువుగారు శిరిడీలో ఉంటే వెంటనే వారి దగ్గరకు వెళ్ళడమో, ఫోన్ ద్వారా తెలియచేయడమో చేసి ఉండేవాడిని. కానీ ఇప్పుడా అవకాశం లేకపోవడంతో నా భయాందోళనలు మరింత ఎక్కువయ్యాయి.

వెంటనే నారాయణరావు దగ్గరకెళ్ళాను. సత్సంగానికి వెళ్ళి బాబా, గురువుగారి సహాయం అర్థించమని చెప్పాడు. నేనట్లాగే బాబా, గురువుగారి ఫోటోల దగ్గరకు వెళ్ళి కన్నీటితో "గురువుగారూ! నన్ను కాపాడండి" అని వేడుకున్నాను. నా నొప్పి కొద్దిగా తగ్గినట్లనిపించింది. కానీ ఆ రాత్రి నిద్రపోయేంతగా మాత్రం తగ్గలేదు. ఉన్నట్టుండి ఆ అర్ధరాత్రి ఫోన్ మోగింది. నారాయణరావు ఫోన్‌లో "గురువుగారు ఉదయానికల్లా హైదరాబాదు వచ్చేస్తున్నారు" అన్న చల్లని కబురు చెప్పాడు. ఆపద్బాంధవుడైన గురువుగారు నా మొర ఆలకించారని నాకు నిశ్చింత కలిగింది. నేనెప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని చూస్తుండగా ఉదయమైంది. గురువుగారు వచ్చారు. గురువుగారిని చూడగానే నా బాధంతా చెప్పుకున్నాను. "మీరే నన్ను కాపాడాలి. నేనూ మీతో శిరిడీ వస్తాను సార్!" అన్నాను.

*"శిరిడీలో సరైన వైద్య సదుపాయం ఉండదు. హైదరాబాదులో అయితే స్పెషలిస్టులైన డాక్టర్లు ఉంటారు. మంచి ట్రీట్‌మెంట్ ఉంటుంది. ఇక్కడే ఉండండి"* అన్నారు గురువుగారు.

"లేదు సార్! నేను మీతో శిరిడీ వస్తాను. దయచేసి ఎలాగైనా నన్నీ బాధ నుండి తప్పించండి" అని ప్రాధేయపడ్డాను.

గురువుగారు "సరే పదండి" అన్నారు. వారితో ప్రయాణిస్తున్నప్పటి నుండి శిరిడీ చేరేంతవరకు నాకు ఎటువంటి నొప్పి లేదు. శిరిడీకి చేరి రూమ్‌కి వెళ్ళాక మళ్ళీ నొప్పి మొదలైంది. గురువుగారు నాకొక సీసాలో హోమియోపతి మందు ఇచ్చారు. మసీదుకు వెళ్ళి ముందు బాబాకు సమర్పించి, బాబాను ప్రార్థించి మందును వేసుకోమన్నారు.

నేనట్లాగే ద్వారకామాయికి వెళ్ళి, బాబా ఫోటో ముందు కూర్చొని ప్రార్థిస్తూ, మందు సీసా బాబా పటానికి తాకించబోయాను. చేయిజారి ఆ సీసా కాస్తా అప్పుడు పటానికి దాని గ్లాసుకు మధ్యనున్న సందులో పడిపోయింది. ఆ క్షణంలో నాకు కలిగిన భయం, బాధ అంతా ఇంతా కాదు. చీకట్లో ఉన్న నాకు బయటపడేందుకు ఉన్న దారులన్నీ ఒక్కసారిగా మూసుకుపోయినట్లనిపించింది. నాకు ఈ వ్యాధి తగ్గదని బాబా ఇలా సూచించారా? అయ్యో బాబా ఇలా జరిగిందేమిటి? అని దీనంగా నేనక్కడ వెతుక్కొంటుంటే అటుగా వచ్చిన పూజారి నా వాలకం చూసి "ఏమైంది?" అని అడిగాడు. నేను నా దయనీయ పరిస్థితి చెప్పాను. కంగారుపడవద్దని ఆయన గ్లాసు పలకను ప్రక్కకు తీసి ఆ బాటిల్ తీసిచ్చాడు. సీసా దొరకడంతో నాలో మళ్ళీ ఆశలు చిగురించాయి. ఆ సీసాలోని మందును వేసుకుని సాయిపథంకు వచ్చాను.

గురువుగారు రోజూ సాయిపథం నుండి మందిరానికి నడిచే వెళ్ళమన్నారు నన్ను. నేను మోకాలి బాధను పళ్ళబిగువన ఓర్చుకొంటూ, కుంటుకుంటూ, దారిలో అక్కడక్కడా కూర్చుంటూ, మధ్యమధ్య రక్తంతో తడిస్తే బాండేజి మార్చుకొంటూ అలాగే మెల్లగా రోజూ మందిరానికి వెళ్ళి వస్తూండేవాడిని. ఇదంతా గమనిస్తూ మా ప్రక్క ఇంట్లో ఉండే 'షా కాకా' (సువిధ హోటల్) నన్ను వాళ్ళ ఆటోలో వెళ్ళమన్నారు.

అయితే నాకు గురువుగారు చెప్పిన మాట మందిరానికి నడిచి వెళ్ళమని. వారెందుకు చెప్పారో మనకేం తెలుస్తుంది? అది నా మంచి కొరకు కాకపోతే, నేనంత బాధపడుతున్నా అలా ఎందుకు చెప్తారు? అందుకని నేను ఆటోలో కాకుండా నడిచే వెళ్ళసాగాను. మరునాడు గురువుగారి దర్శనానికి వచ్చిన 'షా' నేను ఆటోలో వెళ్ళమన్నా వెళ్ళడం లేదని గురువుగారితో చెప్పారు. "గుప్తాగారూ, మీరుగా అడగలేదు కదా! బాబానే పుష్పకవిమానం పంపారు. అందులో వెళ్ళండి" అన్నారు గురువుగారు.

వారలా అన్న తర్వాత ఆటోలోనే వెళ్ళసాగాను. రోజూ మందిరానికి వెళ్ళి బాబా దర్శనం చేసుకోవడం, సాయంత్రం గురువుగారి దర్శనం చేసుకోవడం, ఊదీ తీసుకోవడంతో క్రమంగా నొప్పి, నెత్తురు కారడం ఇరవై రోజులలో తగ్గాయి. నేను ఎప్పుడైనా గురువుగారి ముందు కురుపు కట్టు విప్పి చూపించబోతే “అవసరం లేదు. కట్టు విప్పకండి” అంటూ అది ఎంతవరకు తగ్గిందో చూడకుండానే సరిగ్గా చెప్పేవారు.

కొన్ని వారాల తర్వాత గురువుగారు శిరిడీ నుండి బెంగుళూరు, అక్కడ నుండి తిరువణ్ణామలై వెళ్ళారు. నేను కూడా రైలులో వారితో ప్రయాణం చేశాను. ఆ రాత్రి గురువుగారు పై బెర్తులో పడుకున్నారు. నేను క్రింద బెర్తులో ఉన్నాను. అర్ధరాత్రి అటు ప్రక్కనున్నాయనెవరో బాత్‌రూమ్‌కనో దేనికో తన బెర్తు నుండి దిగబోతూ చీకటిలో చూడక కాబోలు సరిగా నా కురుపున్న చోటే కాలు వేశాడు. అప్పుడు నాకు కలిగిన నొప్పిని మాటల్లో చెప్పలేను. “బాబా” అంటూ పెద్దగా కేక పెట్టాను నొప్పికి గిలగిలలాడుతూ. అప్పుడే తగ్గుతూ వస్తున్న కురుపు ఇప్పుడేమవుతుందో దేవుడా! అని భయంతో వణకసాగాను. నా కేకకు గురువుగారు ఒక్క ఉదుటున లేచి “భయపడకండి. ఏం కాదు” అంటూ ప్రేమగా నన్ను ఓదార్చారు. తరువాత నన్ను డా॥ నరేంద్ర దగ్గరకు వెళ్ళమన్నారు.

నేను నెల్లూరులో డా॥ నరేంద్ర దగ్గరకు వెళ్ళి పదిరోజులున్నాను. వారి ఆదరణ, రోజూ నెల్లూరు గురుబంధువుల సత్సంగంతో అక్కడున్నన్ని రోజులు హాయిగా గడిచి పోయాయి. మొత్తం మీద ముప్పై ఏడు రోజులలో నా కురుపు పూర్తిగా మానిపోయింది. డాక్టరు కనీసం ఏడెనిమిది నెలలు పడుతుందన్నది గురువుగారి అనుగ్రహంతో నెలకే తగ్గిపోయింది. ఇక్కడ కూడా గురువుగారు నాకిచ్చిన మందు కేవలం నా తృప్తి కొరకే. అదో మిష మాత్రమే. వారి కరుణే నన్ను అంతటి మహా బాధ నుండి కాపాడింది.

ఇక్కడితో నా శారీరక బాధలు అంతరించలేదు. మళ్ళీ 1993లో ముఖం కడుక్కొంటుంటే నోట్లో నుండి రక్తం పడింది. టి.బి. ఏమోనని భయపడిపోయాను. నారాయణరావుతో కలిసి వారి తమ్ముడైన డా॥ విజయరామారావుగారి దగ్గరకెళ్ళాను. ఆయన రకరకాల పరీక్షలు జరిపించి నన్ను వెంటనే హాస్పిటల్లో చేరమన్నారు.

ఆసుపత్రిలో చేరవలసిన రోజు ఉదయమే అనుకోకుండా గురువుగారు శిరిడీ నుండి హైదరాబాద్ వచ్చారు. నేను వారి వద్దకు వెళ్ళి “ఈ రోజు ఉదయం నేను టి.బి. ఆసుపత్రిలో చేరాలి. మీరు అనుమతించి ఆశీర్వదిస్తే వెళతాను” అని అడిగాను.

"*ఏమిటండీ తొందర, కొద్దిసేపు కూర్చోండి వెళుదురుగానీ*" అని గురువుగారు అన్నా కూడా, డాక్టర్ల అపాయింట్‌మెంట్ సమయం దాటిపోతుంది, సమయానికి పోకపోతే ఇబ్బంది అవుతుందనుకున్నాను. అంతకుముందు గురువుగారు నాకెన్నో అనుభవాలనిచ్చి నన్ను కాపాడినా నేను డాక్టర్ల దగ్గరకెళ్తానన్నానే కానీ, గురువుగారి దగ్గరకొస్తాననిగాని, నాకు మీరే నయం చేయాలనిగాని అనలేకపోయాను. నాకు వచ్చినది మామూలు జబ్బు కాదు కాబట్టి హాస్పిటల్‌లో డాక్టర్ల దగ్గర ఉంటేనే నయమవుతుందనుకున్నాను.

హాస్పిటల్లో చేరానే కానీ అది నాకు నరకంలా తోచింది. అక్కడ రోజుకొక రోగి చనిపోతూ ఉన్నాడు. నా తమ్ముడు, గురుబంధువులు ఎప్పటికప్పుడు నా పరిస్థితిని గురువుగారికి తెలియజేసేవారు.

"*ఏం భయపడాల్సిన పని లేదు. నాలుగు హాస్పిటల్స్ తిరిగి ఇంటికి వస్తారులే*" అన్నారట గురువుగారు. అంతే కాకుండా, గురువుగారు హఠాత్తుగా ఒకరోజు శిరిడీ నుండి బయలుదేరి నేరుగా హాస్పిటల్‌కి వచ్చి నన్ను చూసి "*ఏం భయపడవద్దు. అంతా బాగవుతుంది*" అని ఆశీర్వదించి నాకు అభయమిచ్చి వెళ్ళారు.

ఆ తరువాత నాకు ఆరోగ్యం కొంత మెరుగవుతున్నట్లు అనిపించింది. డాక్టర్లు మరొక వారం అబ్జర్వేషన్‌లో ఉంచితే మంచిదన్నారు. మరలా కొన్ని రోజుల తర్వాత ముక్కులో నుండి రక్తము కారడం మొదలైంది. డాక్టర్లు స్కానింగ్‌కని మరో హాస్పిటల్‌కి పంపించారు. అక్కడ స్కానింగ్ చేస్తుండగానే రక్తస్రావం ఎక్కువైపోయి నేను స్పృహ తప్పాను. స్కానింగ్ మధ్యలోనే ఆపేసి ఆక్సిజన్ పెట్టారు. ఏవేవో ఇంజక్షన్లు చేశారు. నేనలా స్పృహ లేని స్థితిలో చాలాసేపు ఉండిపోయాను. మరో ప్రక్క రక్తం ఎక్కించ సాగారు. గురువుగారికి ఫోన్‌లో ఇదంతా తెలియచేశారు.

"*భయపడవద్దు. ప్రమాదం లేదు*" అన్నారట గురువుగారు.

డాక్టర్లు యాంజియోగ్రాం చేయాలనుకున్నారు. పరికరాలు లేకపోవడంతో వేరే హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. ఊపిరితిత్తుల్లో రెండు నరాలు తెగిపోవడం వలనే రక్తం కారుతుంది. వాటిని కాల్చి మొద్దుబారేట్లు చేయాలని చెప్పారు. సరిగ్గా ఆ ఆపరేషన్‌కు ముందు డాక్టరు నా దగ్గరకు వచ్చి "ఇటువంటి ఆపరేషన్ నేనింతకు ముందు చేయలేదు. కానీ విజయవంతమవుతుందనే అనుకొంటున్నాను. మీ ఇష్టం. చేయమంటారా?" అని అడిగాడు. చేయవద్దని చెప్పి మాత్రం చేసేదేముంది?

అనుకుని, గురువుగారిని నాతో ఉండమని ప్రార్థించుకుని "గురువుగారి ఇష్టం ఎట్లా ఉంటే అట్లా జరుగుతుంది. మీ పని కానివ్వండి" అన్నాను.

మత్తుమందు ఇచ్చి తెగిన నరాలను కాల్చినపుడు భరించలేని నొప్పితో కేకలు పెట్టాను. అంతటి నొప్పి, బాధ ఇంతకుముందు నేనెప్పుడూ పడలేదు. గురువుగారినే తలచుకున్నాను. ఆపరేషన్ విజయవంతమైంది. రక్తం కారడం తగ్గిపోయింది. అయితే ఆ నరాలు గట్టిపడేంతవరకు హాస్పిటల్లో ఉండాలన్నారు. మళ్ళీ నన్ను గవర్నమెంట్ చెస్ట్ హాస్పిటల్‌కి పంపించారు. అక్కడ 15 రోజులున్నాను. నా జబ్బు తగ్గి ఇంటికి తిరిగి వచ్చేసరికి గురువుగారన్నట్లుగానే నాలుగు హాస్పిటల్స్ మారాను.

నాకు హాస్పిటల్లో ఆపరేషన్ జరిగినప్పుడు శిరిడీలో గురువుగారికి విపరీతమైన జలుబు చేసిందని, చీదినప్పుడల్లా ముక్కు నుండి రక్తం వచ్చేదని, నాకు రక్తం పడటం తగ్గిన తర్వాత గురువుగారికి కూడా రక్తం రావడం ఆగిపోయిందని, నాకు తర్వాత తెలిసింది. అది విని వారి ప్రేమకు నాకు కన్నీళ్ళు ఆగలేదు.

నాకు జరిగిన అన్ని అనుభవాలనూ గమనించుకొంటూ వస్తే– సద్గురువు అంటే కేవలం పారమార్థిక విషయాలలోనే మనని నడిపిస్తారని కాకుండా, ప్రాపంచికంగా కూడా తనను నమ్మికొన్న వారిని అనుక్షణం అడుగడుగునా కాపాడుతూనే ఉంటారని అర్థం చేసుకున్నాను.

ఈనాటికీ నేనెంత దూరాన ఉన్నా సరే నా గురుదేవులు నాకిచ్చిన వరం, నా మనసుకు కష్టంగా అనిపించి కన్నీటితో వారి పటం దగ్గర ప్రార్థించుకొంటే వెంటనే ఎలాగోలా గురువుగారి దర్శనం అవుతుంది. ఆ వరమే నాకు కొండంత అభయం.

గురువుగారెప్పుడూ నాకు ఆదేశాలిచ్చి "ఇలానే చేయండి" అని చెప్పలేదు "ఇలా చేస్తే బాగుంటుంది" అన్నట్లు చెప్పేవారు. నన్నెప్పుడూ "మీరు ప్రేమను పెంచుకోండి. అన్ని సమస్యలు చక్కబడతాయి" అనేవారు. నేను ఎన్నోసార్లు అసలు వారేం చెబుతున్నారన్నది అర్థం చేసుకోకుండా ప్రవర్తించిన సందర్భాలున్నాయి. అయినా గురువుగారి ప్రేమ, శాంతమూ అనంతం కాబట్టి వారు నా చేయి వదలక నన్ను నడిపిస్తూనే ఉన్నారు.

# సవ్యమార్గంలో...

తూములూరు సుబ్రహ్మణ్యం
హెడ్‌మాస్టర్, ఒంగోలు
జన్మించిన సం॥ 1966

చెన్నై, జూన్ 2002

అత్యంత నిష్ఠాగరిష్ఠులు, వేదశాస్త్ర పరాయణులైన మా నాన్నగారు నాకు పన్నెండో ఏట ఉపనయనం చేసి వేదం నేర్పించారు. అప్పటి నుండి నిత్యం సంధ్యా వందనం, అగ్నికార్యం వంటి పూజావిధులన్నింటిని 1988లో ఎమ్.ఎస్‌సి. పూర్తయ్యి నాకు రైల్వేలో ఉద్యోగం వచ్చేవరకు క్రమం తప్పక ఆచరించేవాడిని. 1991లో సికింద్రాబాదు రైలు నిలయంలో విజిలెన్స్ బ్రాంచ్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్న రోజులలో ఆరోగ్య పరంగా, కుటుంబపరంగా, వృత్తిపరంగా నేను అనేక సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. వాటిని తట్టుకోలేక మానసికంగా, శారీరకంగా బాగా కృంగిపోయాను.

ఆ ఆందోళనలో సాయిబాబా మందిరానికి వెళ్ళడం, శ్రీసాయి సచ్చరిత్ర చదవడం అలవడింది. అవి నా సమస్యలకు పరిష్కారం చూపలేదు కానీ, వాటివలన మనసుకి కొంత సాంత్వన లభించేది. అయినా రోజురోజుకి ఎక్కువవుతున్న సమస్యల సుడిగుండాలలో ఈ లోకమే నరకంలా తోచసాగింది. ఇక ఈ బాధలు భరించడం నా వల్ల కాదనుకొని జీవితాన్ని అంతం చేసుకొందామని నిర్ణయించుకుని 1992 జూన్ 29వ తేదీన శిరిడీ వెళ్ళాను. మధ్యాహ్నం 2 గంటలకు పురుగులమందు తాగి సమాధి మందిరంలో బాబా చరణాల చెంత ప్రాణాలు వదులుదామని నా ఆలోచన.

దానికి మానసికంగా నన్ను నేను సిద్ధం చేసుకొంటూ ఉదయం పది గంటల సమయంలో సంస్థాన్ వారి లాకర్లున్న హాలులో కూర్చొని ఉండగా ఒక తెలుగు వ్యక్తితో పరిచయమయ్యింది. ఇద్దరం మధ్యాహ్న ఆరతిదాకా కలిసి తిరిగాము. మాటల మధ్య తన స్వంత ఊరు తెనాలి అనీ, హైద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాననీ, అక్కడ నుండి గుంటూరుకు బదిలీ కొరకు గత ఐదారు సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తున్నా కావడం లేదనీ, శిరిడీలో శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ అనే గొప్ప మహాత్ములు ఉన్నారని, వారిని కలిసి చెప్పుకొంటే పని అవుతుందని ఎవరో చెప్పగా విని శిరిడీ వచ్చానని, నేనడగకపోయినా తన వివరాలన్నీ చెప్పాడు. అంతా విని లోలోన అతని అమాయకత్వానికి నవ్వుకున్నాను.

"అక్కడ అయిదేళ్ళ నుండి ప్రయత్నిస్తున్నా కానిది ఇక్కడెవరికో చెప్పుకోగానే అవుతుందా? ఎంత పిచ్చితనం?" అనుకున్నాను కానీ పైకి ఆ మాట అనలేదు.

నేను నిర్ణయించుకొన్న సమయం సమీపిస్తున్నది. ఇతనెవరో ఇలా పట్టుకున్నాడేమిటి? ఇతని బారి నుండి బయటపడేదెలా? అని ఆలోచిస్తుంటే అతను, "నిన్న నేను గురువుగారి దగ్గరకు వెళ్ళాను. వారు గురుస్థాన్ చుట్టూ ప్రదక్షిణలు చేయమన్నారు. రాత్రి అలాగే చేశాను. ఈ రోజు మధ్యాహ్నం వారి దగ్గరకు వెళ్ళి సెలవు తీసుకుని ఊరికి వెళదామనుకొంటున్నాను. ఎందుకో తెలియదు కానీ కొద్దిగా బెరుగ్గా ఉంది. దయచేసి మీరూ నాతో వస్తారా? నాకు కాస్త తోడుగా ఉంటుంది" అని బ్రతిమాలుతున్నట్లు అడిగాడు. నాకేమాత్రం అతనితో అక్కడకు వెళ్ళాలనిపించలేదు. ఎందుకంటే అప్పట్లో నాకు స్వామీజీలంటేనే ఒక విధమైన అపనమ్మకం, తేలికభావం ఉండేది. పేరున్న స్వామీజీ ఒకరు మా అమ్మగారిని ఏడాదిపాటు గడప దాటొద్దని చెప్పారు. ఆమె తనకు తీవ్రమైన జబ్బు చేసినా ఆ నియమాన్ని పాటిస్తూ ఏ వైద్య సహాయం పొందక అలాగే ఉండడంతో చివరకు చనిపోయింది. నాకు అప్పటి నుండి స్వామీజీలంటేనే విశ్వాసం పోయింది. నేను యిట్లా ఆలోచించుకొంటుంటే ఆ తెనాలి అతను బలవంతం చేయగా తప్పనిసరై అతని వెంట వెళ్ళాను.

విచిత్రమేమిటంటే నేను ఏ సమయంలో బాబా సన్నిధిలో ప్రాణాలు వదలాలని నిర్ణయించుకొన్నానో సరిగ్గా అదే సమయానికి శ్రీబాబూజీ సన్నిధిలో కూర్చుని ఉన్నాను. వారి చెంతకు వెళ్ళగానే వారు నావైపు చూసి నవ్విన చిరునవ్వుతో నన్ను నేను పూర్తిగా మర్చిపోయాను. నన్ను తన వెంట తీసుకొచ్చినాయన గురువుగారితో మాట్లాడిన తర్వాత, ఊదీ ఇచ్చి "శుభం" అంటూ గురువుగారు నా వంక తిరిగి "చెప్పు" అన్నారు.

ఆ మాట కొరకే వేచి ఉన్నట్లు ఆవేశంగా నా హృదయంలోని ఆవేదనంతా వెళ్ళబోసుకోవడమే కాదు, శిరిడీ ఎందుకొచ్చానో కూడా చెప్పేశాను. అంతా విని ఒక నిమిషం పాటు నిశ్శబ్దంగా ఉండి నన్ను దగ్గరకు రమ్మని పిలిచారు. నేను దగ్గరకు వెళ్ళి కూర్చోగానే ఊదీ తీసుకుని బొటనవ్రేలితో నా నుదుటన ఉంచి, దాదాపు రెండు మూడు నిమిషాలు తమ వ్రేలిని అలాగే ఉంచారు. అంతే కొన్ని వేల వాట్ల కరెంటు నాలో ప్రవహిస్తున్నట్లనిపించింది. వారి నుండి ఏదో శక్తి నాలోకి ప్రవహిస్తోంది. ఆ విద్యుత్తరంగాలకు శరీరం తట్టుకోలేక వణకసాగింది. అదే సమయంలో నేను

పొందిన ఆనందానుభూతి మాటలలో వర్ణించలేనిది. నూతన చైతన్యమేదో నరనరాల్లోనూ ఉత్సాహాన్ని నింపుతున్నట్లయింది. ఇక జీవితం చాలిద్దామనుకొన్న నేను ఆ అనుగ్రహ ధారలలో క్రొత్త జీవితాన్ని పొందినట్లయింది. అందుకే ఆ క్షణం నుండి నా జీవితం గురువుగారు ప్రసాదించిన వరమే.

గురువుగారి వద్ద నుండి వచ్చేసేటప్పుడు హైదరాబాద్‌లో నారాయణరావుగారి ఇంట్లో ప్రతి గురువారం సత్సంగం జరుగుతుందనీ, నన్ను ఆ సత్సంగానికి వెళ్ళమనీ చెప్పారు. నేను హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత, నన్ను గురువుగారి దగ్గరకు తీసుకెళ్ళిన వ్యక్తి ట్రాన్స్‌ఫర్ ఏమయిందని వాకబు చేశాను. శిరిడీ నుండి వచ్చిన మూడు రోజుల్లోనే అతనికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయని తెలిసింది. దాంతో గురువుగారి శక్తి పట్ల నా నమ్మకం బలపడింది. ప్రతి గురువారం సత్సంగానికి వెళ్ళడం మొదలుపెట్టాను. అయితే మరో ఇరవై రోజులకు నా సమస్యలు మరింత జటిలమై నేనింక హైదరాబాదులో ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. నారాయణరావుగారి సలహాపై నేను వెంటనే శిరిడీ బయలుదేరి వెళ్ళాను. గురువుగారెంతో దయతో నన్ను సాయిపథంలోనే ఉండమన్నారు. నలభై రోజులక్కడే గడిపాను. ఆ నలభై రోజుల్లో ఎన్నో అపురూపమైన అనుభవాలు చవిచూశాను. గురువుగారు నా సందేహాలెన్నింటికో సమాధానం చెప్పేవారు. ఆ రోజుల్లోనే దీర్ఘరాత్రులు వారి సన్నిధిలో కూర్చొని ఎన్నో సత్సంగాలు వినే అవకాశం కలిగింది.

గురువుగారు 1983లో ఒంగోలులో సాయిబాబా సెంట్రల్ స్కూలు స్థాపించారని, అటు పిమ్మట దాన్ని సాయిబాబా ఫౌండేషన్‌కు అప్పగించి 1989లో వారు శిరిడీకి వచ్చేశారని తెలుసుకున్నాను. ఒకరోజు ద్వారకామాయిలో కూర్చొని గురువుగారు స్థాపించిన స్కూల్‌లో పనిచేసే అవకాశం లభిస్తే బాగుంటుంది కానీ అక్కడ పని చేసేందుకు నా అర్హతలు ఏమిటని ఆలోచిస్తూ చాలాసేపు గడిపాను. సాయిపథంకు తిరిగి రాగానే నన్ను గురువుగారు పిలుస్తున్నారని తెలిసింది. వారి గదిలోకి వెళ్ళగానే నేను ద్వారకామాయిలో కూర్చొని నా గురించి ఎట్లా అనుకొన్నానో అవే మాటలు యథాతథంగా చెప్తూ *"ఎలాగూ నీ రైల్వే ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టావు కదా, కొన్ని రోజులు ఒంగోలు స్కూల్లో ప్రిన్సిపాల్‌గా ఎందుకు పని చేయకూడదు?"* అని అడిగారు. ఒక్క క్షణం నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. కొద్దిసేపటి క్రితమే ఆ విషయం అనుకోవడమేమిటి, వెంటనే గురువుగారు దాన్ని నిజం చేయడమేమిటి?!

ఆ విధంగా నేను గురువుగారు స్థాపించిన స్కూల్‌కి ప్రిన్సిపాల్‌గా 1992 సెప్టెంబరులో ఒంగోలు రావడం జరిగింది. గురువుగారు నివసించిన ఆ భవనంలోనే ఉండగలగడం, ఆ ఉద్యోగము నాకు లభించిన అరుదైన అద్భుతావకాశంగా నేను భావిస్తున్నాను. నేను సేవగా భావించి పని చేస్తానన్నా నాకు గురువుగారు జీతమిచ్చి ఉద్యోగంలో నియమించడం ఎవరి దగ్గరా ఉచిత సేవ పొందకూడదన్న వారి ఆదర్శానికి నిదర్శనం.

*బాబా ఒకనాడు మిట్టమధ్యాహ్నము, రాధాకృష్ణమాయి ఇంటి సమీపానికి వచ్చి "నిచ్చెన తీసుకుని రమ్మ" అన్నారు. ఒకడు పోయి దానిని తెచ్చి ఇంటికి చేరవేశాడు. బాబా వామనగోండ్‌కర్ ఇంటి పైకప్పు ఎక్కి రాధాకృష్ణమాయి ఇంటి పైకప్పును దాటి, ఇంకొక ప్రక్క దిగారు. బాబా అభిప్రాయమేమో ఎవరికీ తెలియలేదు. దిగిన వెంటనే, నిచ్చెన తెచ్చిన వానికి బాబా రెండు రూపాయలు ఇచ్చారు. నిచ్చెన తెచ్చినంత మాత్రాన వానికి రెండు రూపాయలు ఇవ్వాలా అని ఎవరో బాబాని అడిగారు. "ఒకరి కష్టము ఇంకొకరు ఉంచుకోరాదు. కష్టపడువాని కూలి సరిగాను దాతృత్వముతోను ధారాళముగా ఇవ్వాల"ని బాబా చెప్పారు.*

*... శ్రీసాయిసచ్చరిత్ర, 18&19వ అధ్యాయములు*

1993 జూన్ నెలలో గురువుగారు ఒక నెల రోజుల పాటు ఒంగోలు స్కూల్లో గడిపారు. ఆ నెల రోజులలో గురువుగారితో కలిసి ఉండడం వలన స్కూల్ నిర్వహణలో ఏ అనుభవం లేని నేను ఎన్నో విషయాలు నేర్చుకోవడమేగాక, నా మానసిక ప్రవర్తనలో కూడా ఎంతో మార్పు వచ్చింది.

ప్రతి రోజూ సాయంత్రం స్కూల్ అవర్స్ అయిపోగానే గురువుగారు మేడపైన అటూ ఇటూ నడుస్తూ నాతో మాట్లాడుతుండేవారు. ఎన్నో విషయాలు చెప్పేవారు. వారి దివ్య సన్నిధిలో గంటలు క్షణాల్లా దొర్లిపోయేవి. కానీ నాలో ఉన్న కొన్ని అవగుణాల వలన ఆ శిక్షణను సరిగా ఉపయోగించుకోలేకపోయాను. గురువుగారు ఒంగోలు వచ్చిన రోజునే తాము వచ్చినట్లు ఎవరికీ తెలియచేయవద్దని పిలిచి మరీ చెప్పారు. కానీ నేను అంతకు ముందు రోజే మా స్టాఫ్‌లో ఇద్దరు ముగ్గురికి వారు

వస్తారని చెప్పేశాను. ఆ విషయం వారితో చెప్పే సాహసం చేయలేకపోయాను. గురువుగారే "నేను వచ్చినట్లు ఎవరికైనా చెప్పావా?" అని రెండు మూడుసార్లు అడిగినప్పటికీ నేను ఆ విషయం చెప్పలేదు.

అంతలో డాక్టరు శ్రీనివాసులురెడ్డిగారు వచ్చి నువ్వు చెప్పావట కదా, గురువుగారి దర్శనం కోసం టీచరు వచ్చింది అని గురువుగారి ముందే నాతో అన్నారు. దోషిలా తల దించుకోవాల్సి వచ్చింది. బెరుగ్గా గురువుగారి వంక చూశాను. వారు చిన్నగా నవ్వి ఊరుకున్నారు. నన్నేమీ అనలేదు కానీ "నువ్వు నిజం దాచినా నా దగ్గర దాగదు" అన్నట్లనిపించింది ఆ చిరునవ్వు. ఆ తర్వాత నేను ఎప్పుడూ నిజాన్ని దాచడానికో, అబద్ధం చెప్పడానికో సాహసించలేదు. ఆ విధంగా నాలో ఉన్న ఓ పెద్ద అవలక్షణాన్ని గురువుగారు చిన్న అనుభవంతో రూపుమాపారు.

ఒకరోజు గురువుగారు ప్రత్యేకించి పిల్లల తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను బడిలో చేర్పించడానికి వచ్చి ఏమేమి ప్రశ్నలు వేస్తారో, వాటికి మన స్పందన ఎలా ఉండాలి అన్న విషయం చాలా విపులంగా వివరించారు. ఆశ్చర్యం! మర్నాడు కొందరు తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల్ని స్కూల్లో చేర్పించడానికి వచ్చినప్పుడు సరిగ్గా గురువుగారు ఏ ప్రశ్నలు అడుగుతారని చెప్పారో అవే అడిగారు. ముందే సమాధానాలు ఎలా ఉండాలో గురువుగారి దగ్గర్నుండి విని ఉన్నాను కనుక నేను సమాధానం చెప్పగలిగాను. ఆ వచ్చిన వారికి నా సమాధానాలు ఎంతో సంతృప్తిని కలిగించాయి.

జూన్ నెలంటే స్కూల్లో క్రొత్త పిల్లలు చేరుతుంటారు. ఒక రోజు గురువుగారు నాతో "క్రింద మెయిన్ గేటు వద్ద ప్రత్యేకంగా ఒక ఆయాను పెట్టమని, ఎట్టి పరిస్థితులలో స్కూల్ అవర్స్‌లో ఆయా గేటు దగ్గర నుండి ఒక్క క్షణం కూడా అటు ఇటు పోకూడద"ని నొక్కి చెప్పారు. నేను అలాగే అని ఒక ఆయాను గేటు దగ్గరపెట్టాను. కాని ఉదయం పదిగంటల సమయంలో ఒక బల్ల పైన పెట్టి రమ్మన్నాను. పదిన్నర ప్రాంతంలో నర్సరీ క్లాసు టీచర్ నా దగ్గరకు ఆందోళనగా వచ్చి, క్రితం రోజు స్కూల్లో క్రొత్తగా చేరిన మూడు సంవత్సరాల నర్సరీ పిల్లవాడు కనిపించడం లేదన్నది. నాకు చాలా భయం వేసింది. ఉదయం పది గంటల వేళ ఆయాను బల్ల తీసుకెళ్ళి పైన పెట్టమని చెప్పడంతో ఆమె అటు వెళ్ళింది. ఆయా బల్ల పైన పెట్టి వచ్చే ఆ కొద్ది నిమిషాల వ్యవధిలో కారిడార్‌లో ఆడుకొంటున్న పిల్లవాడు బయటకు వెళ్ళిపోయినట్లున్నాడు. అరగంట సేపు ఆ చుట్టుప్రక్కలంతా వెతికించాను కానీ ఫలితం లేకపోయింది.

గురువుగారు ప్రత్యేకించి చెప్పినా నేను శ్రద్ధ తీసుకోలేదే అని నన్ను నేను నిందించుకున్నాను. గురువుగారికి ఈ విషయం చెబుదామని పైకి వెళ్ళాను కానీ రాత్రంతా మేలుకుని పని చేస్తున్న వారు అంత క్రితమే విశ్రాంతి తీసుకొంటున్నారు. లేపేందుకు ధైర్యం చాలక పైకి క్రిందకి నాలుగైదు సార్లు తిరిగాను. సమయం గడిచే కొద్దీ ఆందోళన ఎక్కువైంది.

చివరకు ప్రిన్సిపాల్ రూములో ఉన్న బాబా ఫోటో వద్ద నమస్కారం చేసుకుని ఎలాగైనా ఈ సమస్య నుండి బయటపడేయమని ప్రార్థించాను. అప్పటిదాకా ఏం చేయాలో దిక్కుతోచక విపరీతమైన ఆందోళన పడుతున్న నేను ఒక్కసారిగా రిలీఫ్ ఫీలయ్యాను. బాబాను ప్రార్థించి మళ్ళీ గురువుగారి గది వద్దకు వెళ్ళాను. నేను వెళ్ళగానే గురువుగారు నిద్ర నుండి లేచి కూర్చొని "ఏమిటయ్యా" అని అడిగారు. ఎవరో లేపితే లేచినట్లున్నాయి అప్పుడు వారి ముఖకవళికలు. నేను మెల్లగా విషయం చెప్పాను.

*"నేను చెప్పాను కదా గేటు దగ్గర నుంచి కదలకుండా ఉండేలా మనిషిని పెట్టమని. చెప్పింది చెప్పినట్లు చేయకపోతే ఇలాగే ఉంటుంది"* అని ఒక్క నిమిషం ఆగి, *"సరేలే, ఆ అబ్బాయి వాళ్ళ ఇంటి దగ్గరకెళ్ళి చూడండి"* అనేసి మళ్ళీ వెంటనే పడుకున్నారు.

పిల్లవాని ఇంటికి వెళ్ళి విచారిస్తే ఒకవేళ వాడక్కడ లేకపోతే గొడవవుతుంది కదా అని అంతవరకూ ఆ అబ్బాయి ఇంటికి ఎవరినీ పంపించలేదు. అయితే గురువుగారు చెప్పాక ఆ అబ్బాయివాళ్ళ ఇంటికి మనిషిని పంపించాను. పిల్లవాడు ఇంట్లోనే ఉన్నాడు. అబ్బాయి గేటు వద్ద ఆడుకోవడం చూసి, అటుగా వెళుతున్న వాళ్ళ తాతయ్య పిల్లవాడిని తనతో ఇంటికి తీసుకెళ్ళిపోయాడని తెలిసింది.

గురువుగారు చెప్పింది చెప్పినట్లుగా చేయడం నాకు అలవడడానికి ఆ మరునాడే మరొక సంఘటన జరిగింది. ఆ రోజు గురువుగారు నాతో మాట్లాడుతూ *"సాయంకాలం పూట పిల్లలు గ్రౌండులో ఆడుకొనేటప్పుడు ప్రక్కన టీచర్లు ఎవ్వరూ ఉండడం లేదు, ఒక టీచరును పిల్లల్ని గమనిస్తుండమని చెప్పు"* అన్నారు.

నేను 'అలాగే' అన్నాను. మర్నాడు సాయంత్రం పిల్లలతో పాటు టీచర్‌ను ఉండమను అని ఆయాకు చెప్పాను. కానీ ప్రత్యేకించి నేను ఏ టీచరుకు చెప్పలేదు. సరిగ్గా ఐదు నిమిషాల తరువాత టీచర్లు ఒక చిన్న పిల్లను చేతుల మీద మోసుకుంటూ పైకి తీసుకొచ్చారు. ఆటలలో పరుగెత్తుతున్నప్పుడు చూడక జారుడుబండకు సపోర్ట్‌గా

ఉన్న పెద్ద ఇనుప స్తంభానికి కొట్టుకుని ఆ పాపకు నుదుట రెండు అంగుళాల మేర చీలిపోయి రక్తం ధారలుగా కారిపోతోంది. ఆ పాపనలా చూస్తుంటే నాకు భయమేసింది ఏమవుతుందోనని. గాభరాపడుతూ వెళ్ళి విషయాన్ని గురువుగారికి చెప్పాను.

"నిన్ననే కదా అక్కడ పిల్లల దగ్గర టీచర్లను ఉంచమని చెప్పాను. చెప్పింది నిర్లక్ష్యం చేస్తే ఎలా?" అంటూనే "సరే, సరే! త్వరగా పాపని హాస్పిటల్‌కు తీసుకెళ్ళి చికిత్స చేయించు" అన్నారు.

నేను ఉరుకులు పరుగుల మీద పాపను హాస్పిటల్‌కు తీసుకెళ్ళాను. ఆ అమ్మాయికి కుట్లు కూడా వేశారు. అయితే ఆశ్చర్యం! సరిగ్గా మూడు రోజుల్లో అంత గాయమూ మానిపోవడమే కాదు, కుట్లు వేసిన మచ్చ కూడా లేకుండా పోయింది. అదే నా క్రింద పనిచేసే వారు నేను చెప్పింది చేయకుండా అలాంటి పరిస్థితిని తీసుకొస్తే నేనైతే కోపంతో వారిపై కేకలేసేవాడిని. కానీ గురువుగారెంత శాంతమూర్తులో, దయార్ద్రహృదయులో నాకు అప్పుడర్థమయ్యింది.

***

***భక్తుడు:*** *గురువుగారూ! చెప్పింది చేయడం అంటే, సొంత తెలివి అసలు ఉపయోగించకూడదనా?*

***గురువుగారు:*** *సొంత తెలివి అంటే గురువు ఇచ్చిన instruction violate చేయడం. సొంత తెలివి ఉపయోగపెట్టమన్నప్పుడు పెట్టు. అది వేరే విషయం. మా గురువుగారు పుస్తకాలు పార్సెల్ చేసేటప్పుడు 'నువ్వు ఇట్లాగే పార్సెల్ చేయాలి' అని చెప్పేవారు. ఇంతకంటే మేలైన టెక్నిక్స్ తెలిసినా, నేను చేసేవాడిని కాదు. ఎందుకంటే మాస్టరుగారు అలా చెప్పారు. అలాగే చేయాలి. అంతే! ఆలోచిస్తే, ప్రాపంచికంగా చాలా పొరపాటుగా కనిపించవచ్చుగాక, కాదనను. కానీ నేను అట్లాగే చేసేవాడిని. దాంట్లో ఒక సౌలభ్యం ఉంది. ముందు నీ అహంకారం పోతుంది.*

*సొంత తెలివి అంటే ఏమిటి? మన యొక్క ఇష్టాయిష్టాలు, మన మంచి చెడ్డలు, మన నిర్ణయాలు. చెప్పింది చెప్పినట్లు తు.చ తప్పకుండా పాటించడం చాలా కష్టమయిన విషయం. దాంతో – అసలు మనము అనేటువంటిది పోయి – ఎదురుగా చెప్పేటువంటి instruction మన ద్వారా యాక్ట్ చేస్తూ పోతుంటుంది. తెలీకుండా కర్తృత్వం పోయింది కదా!*

*నాది, నేను చేస్తున్నాను అనే భావం పోయింది కదా! అంటే ego పోయింది కదా! పగ్గాలప్పగించటం అంటే ఏముంది అంతకంటే!*

ఒంగోలుకు వచ్చిన క్రొత్తల్లో నేను హోటల్‌లో భోజనం చేసేవాడిని. ఒకరోజు నేను భోజనం చేసి వద్దామని బయలుదేరుతుంటే గురువుగారు నాకు ఒక చిన్న టేప్‌రికార్డరును ఇచ్చి "భోజనం చేసి వచ్చేటప్పుడు ఫలానా ఎలక్ట్రికల్ షాపుకు వెళ్ళి వైరు సోల్డరింగ్ చేయించుకు రా" అన్నారు. నేను నా భోజనందేముంది ముందు గురువుగారి పని ముఖ్యం కదా అనుకుని మొదట ఎలక్ట్రికల్ షాపుకు వెళ్ళాను. అక్కడ మెకానిక్ భోజనానికి వెళ్ళాడని చెప్పారు. అతని కోసం గంట సేపు ఎదురు చూశాను. ఆ వ్యక్తి ఎంతకీ రాకపోయేసరికి అతను వచ్చే లోపల భోజనం చేసి వద్దామని హోటల్‌కు వెళ్ళాను. అక్కడ బాగా జనం ఉండడంతో నేను భోంచేసి బయటపడేసరికి మరో గంట పైగా పట్టింది. తిరిగి ఎలక్ట్రికల్ షాపుకు వెళ్ళి టేప్‌రికార్డర్ సోల్డరింగ్ చేయించుకుని స్కూలుకు చేరుకునేసరికి మొత్తం రెండున్నర గంటల సమయం పట్టింది. "చిన్న పనేగా ఇంతసేపయిందేం?" అని అడిగారు గురువుగారు. నేను జరిగింది చెప్పాను. "నేను నిన్ను భోజనం చేసి షాపుకు వెళ్ళమన్నాను కదా? ముందు షాపుకెందుకెళ్ళావు? చెప్పింది చెప్పినట్లుగా చేయరు మీరు!" అన్నారు. నేను మౌనంగా తలదించుకున్నాను. గురువుగారు ఎంతో ఓపిగ్గా ఎన్నిసార్లు నాకిలాంటి అనుభవాలనిచ్చారో. "గురువును గుర్తించు, గురువే సర్వస్వం. గురువునే విశ్వసించు!" అని అడుగడుగునా ఒక్కో సంఘటన ద్వారా ఏ శిక్ష లేకుండా శిక్షణనిస్తున్నా పరిపూర్ణంగా వారిని నమ్ముకోవడం నాకెన్నటికి అలవడుతుందో!

నాకు బద్ధకం ఎక్కువ. ఏ విషయంలోనూ పెద్దగా శ్రద్ధ ఉండదు. ఒకరోజు గురువుగారి గదిలో ఫిక్స్ చేయడానికని సీలింగ్ ఫ్యాన్ తెచ్చిపెట్టారు. దాన్ని ఆఫీసు రూమ్‌లో పెట్టించి ఆ విషయం చెబుదామని పైన గురువుగారి దగ్గరకు వెళ్ళాను. వారప్పుడు సాయిప్రసాద్‌గారితో మాట్లాడుతున్నారు.

నేను వెళ్ళి ఫ్యాన్ గురించి చెప్పగానే, "ఏ కంపెనీ ఫ్యాన్ అది?" అని అడిగారు. నేను దాన్ని గమనించలేదు. క్రిందకెళ్ళి చూసివచ్చి ఏ కంపెనీదో చెప్పాను.

"ఎన్ని రెక్కలు?" అనడిగారు గురువుగారు.

నేనదీ గమనించలేదు. వెళ్ళి చూసొచ్చి చెప్పాను.

ఈసారి "దాని స్పాన్ ఎంత?" అని అడిగారు. మళ్ళీ క్రిందకు పరుగెత్తవలసి వచ్చింది. ఇట్లా దాదాపు ఏడెనిమిదిసార్లు వారు ఒక్కొక్కటి అడగటం, నేను "చూడలేదు సార్" అంటూ గబగబా పరుగెత్తుకెళ్ళి చూసి వచ్చి ఆ విషయం చెప్పడం జరిగింది.

చివరగా అక్కడే ఉన్న సాయిప్రసాద్‌గారి వంక తిరిగి గురువుగారు "ఎవరికీ పని పట్ల శ్రద్ధ ఉండదు. పనంటే పరిపూర్ణంగా చేయాలి. అట్లా పరిపూర్ణత రావాలంటే శ్రద్ధ ఉండాలి. దానిని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి" అంటూ మొత్తం ప్రపంచంలో ఎన్ని రకాల ఫ్యాన్‌లు ఉన్నాయి, ఏఏ కంపెనీలు, వాటి పనితీరు, మంచి ఫ్యాన్‌ను ఎలా ఎన్నుకోవాలి? మొదలైనవన్నీ విపులంగా వివరించారు. ఆ విధంగా ఆ రోజు పనిపట్ల శ్రద్ధ, అంకితభావం ఉండాలని నేర్పించారు.

***భక్తుడు:*** *శ్రద్ధగా పనిచేయడం అంటే?*

***గురువుగారు:*** *శ్రద్ధ అంటే ఒక పని చేసేటప్పుడు ఆ ఒక్క పని పైననే దృష్టి, ఏకాగ్రత నిలపడం. ఒక పనిని కొరత లేకుండా సంపూర్ణంగా చేయాలి. ఒక పని చేసేటప్పుడు దాని అవశేషాలేమీ ఉండకూడదు. పశువులు నెమరువేసే విధంగా పనులు చేయకూడదు. ఆవు కాని, గేదె కాని ఏం చేస్తుంది? దొరికిన గడ్డిని ముక్కలు ముక్కలుగా చేసి నమలకుండానే త్వరత్వరగా మింగేస్తుంది. అదలా ఎందుకు చేస్తుంది? అప్పుడు దొరికిన గడ్డి తర్వాత దొరకదని దాని భయం. తర్వాత నింపాదిగా కూర్చుని ఆహారాన్ని తిరిగి నోటిలోనికి తెచ్చుకుని బాగా నమిలి మ్రింగుతుంది. మనమూ అలాగే చేస్తుంటాము. మనకెదురవుతున్న చింతలు, ఆతురతలు, భంగపాట్లు, భయాల వల్ల ఇలా జరుగుతుంది. ఇలా ఆవు, గేదె వలె తొందరపాటుతో అన్ని పనులు ఒకేసారి చేయకండి. నెమ్మదిగా తిని రుచిని ఆస్వాదించి, మానవునిలా జీవించండి.*

గురువుగారు నాకెప్పుడు ఏం కావాలో అన్నీ సమకూరుస్తున్నారు. ఒకసారి శిరిడీ వెళ్ళి తిరిగి వస్తున్నప్పుడు వారితో "హొటల్ భోజనం చేయలేకుండా ఉన్నాననీ,

వంట చేసుకొందామంటే చాలా సమయం వృథా అవుతోంది, దాని వలన స్కూల్లో నా పనులకు ఇబ్బంది అవుతుందేమోనని" చెప్పాను. వెంటనే గురువుగారు "ఒక ఎలక్ట్రికల్ కుక్కర్ కొనుక్కోవయ్యా, స్కూల్‌కు వెళ్ళే ముందు బియ్యమదీ పెట్టేస్తే దానంతటదే ఆఫ్ అవుతుంది, వేడిగానూ ఉంటుంది" అని చెప్పారు.

నేను ఊరికి వచ్చి విచారిస్తే, ఎలక్ట్రికల్ కుక్కర్ అంటే రూ. 1950 అవుతుంది అని తెలిసింది. అప్పుడు నా దగ్గర రూ. 1200 ఉన్నాయి. ఏం చేయాలో తోచక గురువుగారికి ఒక ఉత్తరం వ్రాసుకుని నా గదిలో వారి ఫోటో ముందు పెట్టాను. ఆ రోజు ఉదయమే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో తెలిసినవాళ్ళు వస్తుంటే రైల్వేస్టేషనుకు వెళ్ళాను. ఆ రైలు వచ్చే లోపల గురువుగారికి బాగా పరిచయమున్న జె.వి.సుబ్బయ్యగారు కనిపిస్తే ఇద్దరం గురువుగారి గురించి మాట్లాడుకొంటున్నాము. ఇంతలో ఆయనకు పరిచయస్తులొకరు కనిపించగా అతనికి నన్ను పరిచయం చేశారు.

ముగ్గురమూ మాట్లాడుకొంటుండగా, ఆ మూడవ వ్యక్తి తన దగ్గర ఒక ఇంపోర్టెడ్ ఎలక్ట్రిక్ కుక్కర్ ఉందనీ, ఆఫర్‌లో వచ్చిందనీ మీకేమైనా కావాలా అని సుబ్బయ్యగారిని అడిగాడు. ఆయన తనకవసరం లేదని నావైపు చూస్తూ "ఏమయ్యా నువ్వు బ్రహ్మచారివి కదా, నీకవసరం ఉంటుందేమో?" అన్నారు. "అవును కావాలి కానీ, ఎంతవుతుందది?' అని అడిగాను. అతను రూ. 1200 అన్నాడు. అంతే....

నాకు ఆశ్చర్యంతో ఒక్క క్షణం నోట మాట రాలేదు. సరిగ్గా నా దగ్గరున్న మొత్తం! గురువుగారికి నేను విషయమంతా ఉత్తరం వ్రాసుకోవడమేమిటి? వెంటనే ఆ వస్తువు, సరిగ్గా నా దగ్గర ఉన్న మొత్తానికే నన్ను వెతుక్కుంటూ రావడమేమిటి? ఆ మధ్యాహ్నానికల్లా ఆయన స్కూల్‌కి కుక్కర్ తెచ్చిచ్చాడు. నేను అతనికి గురువుగారికి వ్రాసుకున్న ఉత్తరాన్ని చూపించాను. భక్తుని అవసరాలు భగవంతుడు తీరుస్తాడన్నది ముమ్మాటికీ నిజమైనా అందులో గురువుగారి విధానం అపూర్వమైనది. మన అవసరం తీర్చడమే కాదు, ఆ కోరిక తీర్చే పద్ధతిలో కూడా గురువుగారి అంతులేని ప్రేమ మనకు అవగతమవుతుంది.

గురువుగారి అనుగ్రహం నా ఒక్కడిపైనే కాదు, నాతో పాటు మా కుటుంబమంతా ఆ అనుగ్రహాన్ని పొందుతున్నారు. మా చెల్లెలుకు 1992 నుండి వివాహప్రయత్నాలు చేస్తున్నా ఏదీ కలిసిరాలేదు. ఒకసారి గురువుగారి దగ్గరకెళ్ళి ఆశీర్వాదం తీసుకోండి అని మా నాన్నగారికి ఎన్నోసార్లు చెప్పాను.

కానీ వైదిక సాంప్రదాయానుబద్ధులైన ఆయనకు బాబా సంప్రదాయానికి రావడం ఇష్టం లేదు. సంవత్సరాలుగా బ్రతిమాలుతున్నా ఆయన గురువుగారి దగ్గరకు రాలేదు. చివరకి పెళ్ళీడు దాటిపోతున్న కూతురి కోసం, వేరే మార్గం లేక ఆ ప్రయత్నమూ చేద్దామని మా నాన్నగారు 1998 మేలో శిరిడీ బయలుదేరి వచ్చారు. మా నాన్నగారితో మా చెల్లెలు, తమ్ముళ్ళిద్దరూ కూడా శిరిడీ వచ్చారు. ఆయన బయట వండిన ఆహారాన్ని భుజించరు. తాను శిరిడీలో ఉన్న రెండు రోజులు కేవలం పండ్లే తన భోజనంగా సరిపెట్టుకున్నారంటే ఆయన ఎంత నిష్ఠాగరిష్టులో వేరే చెప్పనక్కరలేదు. మే 27, ఆ రోజు గురువుగారి పెళ్ళి రోజు. గురువుగారిని దర్శించుకుని మా నాన్నగారు "గత ఏడేళ్ళుగా మా అమ్మాయికి వరుని కోసం చూస్తున్నాను. ఏదీ కుదరడం లేదు. అమ్మాయికి మంచి సంబంధం కుదిరేలా ఆశీర్వదించండి" అని అడిగారు.

గురువుగారు చిరునవ్వుతో "శుభం" అన్నారు ప్రసన్నంగా. వెంటనే మా నాన్నగారు శిరిడీ నుండి బయల్దేరారు. మరునాడు ఉదయం ఇంటికి రావటంతోనే ఫోన్ రింగయింది. అంతకు ముందు అన్ని విధాలా బాగుందని ప్రయత్నించి అన్ని ఆశలు వదులుకొన్న ఒక పెళ్ళిసంబంధం వారి నుండి ఫోన్ వచ్చింది. "మీ అమ్మాయి మాకు బాగా నచ్చింది. వెంటనే వస్తే అన్ని విషయాలు మాట్లాడుకొందాము" అని ఆ ఫోను సారాంశం. సంవత్సరాల తరబడి తాము ఎంత ప్రయత్నించినా కుదరనిది గురువుగారి ఒక్క ఆశీర్వాదవచనంతోనే ఎట్లా జరిగిందని ఆశ్చర్యపోవడం మా నాన్నగారి వంతయింది.

మా నాన్నగారికి జాతకాల పట్టింపు చాలా ఎక్కువగా ఉన్నా అవేవీ చూడకుండా మా చెల్లెలు వివాహానికి అంగీకరించారు. ఆ తర్వాత నుండి మా నాన్నగారిలో ఎంతో మార్పు వచ్చింది. మేం పాటించాల్సిన ఆచార వ్యవహారాల పట్ల కఠినంగా ఉండే వారి ప్రవర్తనలో మృదుత్వం వచ్చింది.

2000వ సంవత్సరం అక్టోబరులో, ఫస్ట్ టర్మ్ పరీక్షలు అయిపోయిన రోజు రాత్రి నాకు కుడివైపు పొత్తికడుపులో విపరీతమైన నొప్పి ప్రారంభమైంది. డాక్టరు శ్రీనివాసులురెడ్డిగారి మందులతో కూడా తగ్గకపోవడంతో, ఒకవేళ అది అపెండిసైటిస్ ఏమో అన్న అనుమానంతో ఆయన నన్ను హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. మరునాడు ఉదయం పరీక్ష చేయించగా కిడ్నీలో రాళ్ళున్నాయని చెప్పారు. భరించలేని నొప్పితో గిలగిలలాడిపోయేవాడిని. అదే రోజు రాత్రి విజయదశమికని గురుబంధువులందరూ

శిరిడీ బయలుదేరుతుంటే నేనూ వాళ్ళతో కలసి శిరిడీ వెళ్ళాలనుకున్నాను. అడుగుతీసి అడుగువేయటమే నరకంలా ఉంది. అంత దూరప్రయాణం, అదీ రెండు రైళ్ళు మారి వెళ్ళాలి. అయినా ధైర్యం చేశాను. హైదరాబాదులో యూరాలజిస్టుకు చూపిస్తే ఆయన కిడ్నీలో ఉన్న రాళ్ళను సరిగ్గా లొకేట్ చేయలేకపోయినా, అల్ట్రా బ్లాస్ట్ ద్వారా వాటిని కరిగించవచ్చనీ, హాస్పిటల్‌లో జాయిన్ అవ్వాలని సలహా ఇచ్చారు.

నేనింక ఆ చికిత్సలేవీ చేయించదలుచుకోలేదు. పెయిన్ కిల్లర్స్ మాత్రం వేసుకొంటూ శిరిడీ చేరుకున్నాను. అక్కడ గురువుగారికి నా బాధంతా నివేదించాను. అప్పుడక్కడున్న ఇంగ్లాండు గురుబంధువు డాక్టరు లూక్‌బాల్ దగ్గర చూపించుకోమని చెప్పారు గురువుగారు. ఆయన చాలా స్ట్రాంగ్ పెయిన్ కిల్లర్ ఇచ్చారు. కానీ నా బాధ ఏ మాత్రం తగ్గలేదు. అలా శిరిడీలో నాలుగు రోజులు సాయిపథం ప్రక్కనే ఉన్న శివశంకర్‌గారి ఇంట్లో ఉంటున్నా గురువుగారి దర్శనానికి సత్సంగహాలుకు కూడా వెళ్ళలేకపోయేవాడిని.

విజయదశమి రోజు ఎలాగైనా గురువుగారి దర్శనం చేసుకోవాలని సాయిపథం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన స్టేజి ముందు కూర్చొన్నాను. మధ్యాహ్నం పదకొండున్నర, పన్నెండు గంటల మధ్యలో గురువుగారు స్టేజి మీదకు వచ్చారు. ఆ సమయంలో వారిని చూస్తున్న ఆనందంతోను, నా నొప్పితోను విపరీతంగా ఏడుపు వచ్చేసింది. గురువుగారు కరుణాదృష్టితో నాపై ప్రేమ వెన్నెలలు కురిపిస్తూ చూశారు. అంతే. వారు డయాస్ దిగి వెళుతుండగా అందరితో పాటే నేనూ లేచి నిల్చున్నాను. కానీ నాకేమీ బాధ కలుగలేదు. పది నిమిషాల ముందు బాధతో వంగిపోయి మెలికలు తిరిగిన వాడిని అట్లా సునాయాసంగా ఎట్లా నిలుచోగలిగానా అని నాకెంతో ఆశ్చర్యంగా అనిపించింది. బాధ పూర్తిగా మటుమాయమయినట్లుగా తోచింది. ఎక్కడ నుంచి వచ్చిందో ఆ శక్తి నేరుగా గురుస్థానానికి వెళ్ళి దాదాపు మూడుగంటలు పైగా ప్రదక్షిణలు చేసి సాయంత్రం సాయిపథానికి వచ్చాను. బాత్‌రూమ్‌కి వెళ్ళాలనిపించింది. యూరిన్ పాస్ చేస్తుంటే దగ్గర దగ్గర డజను రాళ్ళు బయటకు వెళ్ళిపోయాయి. నన్ను అన్నాళ్ళూ పట్టి పీడిస్తుండిన బాధ పూర్తిగా తొలగిపోయింది.

గురువుగారి కరుణాదృష్టి సోకితే పాషాణాలవంటి మనసులే కరుగుతాయి. ఇక ఈ రాళ్ళేపాటివి? ఆ విధంగా ఒకటి కాదు, రెండు కాదు గురువుగారు నాకు అడుగడుగునా అనుభవాన్ని, రక్షణను ప్రసాదిస్తూ నా జీవితాన్ని నడిపిస్తున్నారు!

***భక్తుడు:*** మనకు వచ్చే కోపానికి, బాబా కోపానికీ తేడా ఏమిటి?

***గురువుగారు:*** అది తెలుసుకోవాలంటే మొదట మనకి కోపం ఎందుకు వస్తుందో ఆలోచించాలి. సాధారణంగా మన అహం దెబ్బతిన్నప్పుడు కోపం వస్తుంది. అసలు అహం అంటే ఏమిటి? మనం అవతలి వారి దృష్టిలో మనం ఎలా ఉండాలని ఆలోచిస్తామో, అదే అహం. అందరూ "మన గురించి ఇలా అనుకుంటున్నార"ని మనం ఆలోచిస్తుంటాము. ఈ అహం దెబ్బతిన్నప్పుడు నీకు కోపం వస్తుంది.

అంతేకాదు, అవతలివారి నుండి నీవు ఏదైనా ఆశించినప్పుడు, ఉదాహరణకు గౌరవం– నీ గురించి నీవు గొప్పగా అనుకుంటావు లేదా అందరూ నిన్ను గొప్పగా అనుకుంటున్నారని నీవు భావిస్తున్నావు. వారు ఆ విధంగా గౌరవించకపోతే నీకు కోపం వస్తుంది. నీ మర్యాద, దర్జా మొదలైనవాటికి భంగం కలగకూడదు. ఇంకా ఇతరులు నిన్ను శారీరకంగా బాధ కలిగించకూడదని ఆశిస్తావు. ఇవన్నీ నెరవేరకపోతే నీకు కోపం వస్తుంది. కాదా? ఆలోచించు.

దైనందిన జీవితంలో మనకెందుకు కోపం వస్తుందో చూడు. బాబా చరిత్రలో, బాబా కోపం చూపిన సంఘటనలను గమనించు. ఇదే బాబాకు అన్వయించు. నూనె వర్తకులు నూనె ఇవ్వక అవమానించినపుడుగాని, నానావలి వచ్చి తనను గద్దె దిగమని గద్దించినపుడుగాని– ఇటువంటి ఏ విషయంలోనూ బాబాకు కోపం రాలేదు. ఆయనకు బాగా కోపం వచ్చిన ప్రతిసారీ, తనకు బాధ కలిగిందనో, తానాశించింది జరగలేదనో కోపగించిన ఒక్క సందర్భం చూపెట్టు. షామాను పాము కరిచినపుడు మాత్రం షామాను కోపంగా గద్దించారు. అయితే అక్కడేం జరిగింది? పాము విషం దిగిపోయింది. నిజానికాయన అక్కడ చూపింది దయ, ప్రేమ, అభిమానమే. వివేకంతో, వినూత్న దృష్టితో బాబా చరిత్ర చదివితే, ఏ ఒక్క సందర్భంలో కూడా ఆయన కోపాన్ని చూపించలేదని మనకు అర్థమవుతుంది. అందుకే బాబానే అన్నారు "నాకెపుడూ కోపం రాదు" అని. మరి ఈ తిట్లన్నీ ఏమిటి బాబా! అని ఒక భక్తుడు అడిగితే "నేను తిట్టడం లేదు, ఆశీర్వదిస్తున్నాను" అన్నారు.

**భక్తుడు:** ఎందువలన ఈ తేడా వస్తుంది? మనం అట్లా ఎలా అవగలం?

**గురువుగారు:** మనం గుర్తింపు కోసం అడుక్కుంటాము. ఎదుటివారు మన ఇష్టానుసారం ఉండాలని ఆశిస్తాము. ప్రేమ, ఆప్యాయత, అభిమానము ఇలా అన్నింటికి ఇతరులను దేబిరిస్తాము. వారది చూపకపోతే మనకు కోపం వస్తుంది. ఈ కోపం వెనుకనున్న ఆంతర్యం (అంతరార్థం, మెకానిజమ్) అర్థమయితే కోపం పోతుంది. కానీ మళ్ళీ వస్తుంది. మళ్ళీ దాన్ని మనం అర్థం చేసుకోగలిగితే మెల్లగా అది మాయమవుతుంది. ఇది చాలా సులభమైన విషయం. "కోపాన్ని జయించేందుకు మనం బాబాలా అవక్కరలేదు" అని అందుకే చెప్పాను. మనం మనుషుల్లా ఆలోచించగలిగితే అది చాలు.

**భక్తుడు**: సార్, బాబా కోప్పడడానికి కారణమేమిటి?

**గురువుగారు:** ఎదుటి వ్యక్తి యొక్క దుష్టసంస్కారాన్నిగాని, వాడిలో ఉండే ఒక కీడుగాని, వారికి జరగబోయే హానిగాని– దాన్ని తీసివేసేటటువంటి ప్రాసెస్‌లో బయటకి వ్యక్తమయ్యేటటువంటిదే ఆ చిరాకు. అలాగే మహాత్ములు మనకో పద్ధతిలో ఏదైనా నేర్పించేందుకు కూడా కోపాన్ని ప్రదర్శిస్తారు. రామాయణంలో వాల్మీకి రాముడిని– కోపం లేనివాడు, 'జితః క్రోధః' అని అంటాడు. కానీ రామాయణంలో మనకు ఎన్నోసార్లు రాముడు విపరీతంగా కోప్పడిన సందర్భాలు కనిపిస్తుంటాయి. కానీ జాగ్రత్తగా చూసినట్లయితే వాల్మీకి చెప్పింది– "క్రోధాన్ని జయించినవాడు, క్రోధాన్ని ఆయన అదుపాజ్ఞలలో పెట్టుకున్నవాడు" అని అర్థమవుతుంది.

కోపం అనేటువంటిది ఒక ఎమోషన్. అవసరం వచ్చింది, ఒక అస్త్రప్రయోగం చేయాలి రాక్షసుల మీద. వారి మీద ప్రేమగా, శాంతంగా ఉంటే అస్త్రం వేస్తారా ఎవరన్నా. కాబట్టి "కోపమావహయామి" అన్నారు. వారిని చంపాల్సి వచ్చినపుడు ఆయనే కావాలని కోపాన్ని ధరిస్తాడట, చొక్కాలాగా! పని అయిపోగానే ఆ చొక్కాను తీసి ప్రక్కన పడేస్తాడు.

అలానే బాబా కూడా మనలోని రాక్షసగుణాలను చంపడానికి 'కోపమావహయామి' అంటారు.

# శిక్ష కాదిది శిక్షణ

సాయినాథుని నారాయణరావు
రిటైర్డ్ గవర్నమెంట్ ఉద్యోగి, శిరిడీ
జన్మించిన సం॥ 1945

శిరిడీ, నవంబర్ 2003

నేను సనాతన బ్రాహ్మణ కుటుంబం నుండి వచ్చాను. మా తాతగారి కాలం నుండి మా కుటుంబంలోని వారందరూ భగవాన్ శ్రీరమణమహర్షి భక్తులు. భగవాన్ చేతుల మీదుగా నాకు అక్షరాభ్యాసం జరిగింది.

నా చిన్నతనం నుండి పెద్దవాళ్ళు చెప్పారని సాంప్రదాయానుసారం జపతపాలు, సంధ్యావందనం వంటివి ఆచరించేవాడిని. కాని వాటి పట్ల నాకేమాత్రం ఆసక్తి ఉండేది కాదు.

మా నాన్నగారు హెడ్‌మాస్టర్. క్రమశిక్షణకెంతో ప్రాధాన్యతనిచ్చేవారు. పి.యు.సి. వరకు నా విద్యాభ్యాసమంతా ఆయన పనిచేస్తున్న స్కూల్‌లోనే జరిగింది. ఆ తరువాత తిరుపతిలో ఇంజనీరింగ్ కాలేజీలో సీటు లభించడంతో స్వేచ్ఛాజీవినయ్యాను. అక్కడ నన్నడిగేవారు లేరు. ఏం చేసినా నా ఇష్టం. దాంతో నాలో నిద్రాణంగా ఉన్న కోరికలన్నీ ఒక్కసారిగా పురివిప్పాయి. స్వతహాగా చదవడమన్నా, వ్రాయటమన్నా నాకు ఇష్టం ఉండేది కాదు. నా శ్రద్ధ అంతా చదువు మీద తప్ప మిగతా కార్యక్రమాలపైనే. ఎదుటి వారిని ఆకట్టుకోగల నేర్పు, వాక్చాతుర్యం ఉండడంతో నేను విద్యార్థి నాయకుడిగా కాలేజీ రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషించేవాడిని. చుట్టూ పదిమంది స్నేహితులతో కులాసాగా పట్టపగ్గాల్లేకుండా జల్సారాయుడిలా తిరిగేవాడిని. అట్లా చలామణి అయిన నాకు ఎంతో అహంభావం ఉండేది. నేను చెప్పినట్లు వినకపోతే నా కోపానికి ఆనకట్ట ఉండేది కాదు. నా దృష్టిలో జీవితాన్ని అనుభవించడమంటే ఎదుటివారిని లోబరుచుకుని వారిపై అజమాయిషీ చెలాయించడం. క్రమంగా నేను త్రాగుడు, జూదం లాంటి వ్యసనాలకు కూడా బానిసనయ్యాను. అయితే సాంప్రదాయబద్ధమైన మా కుటుంబానికి ఇవేవి తెలియకుండా జాగ్రత్తపడేవాడిని. అలా ఐదు సంవత్సరాలలో పూర్తి కావలసిన నా ఇంజనీరింగ్ దాదాపు ఎనిమిదేళ్ళు కొనసాగింది.

నాకు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.లో డిప్యూటీ ఇంజనీరుగా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ రీత్యా ఒంగోలులో ఉంటున్న నా మిత్రుడు బాలకృష్ణ గుప్తా తనకు పరిచయమైన

ప్రముఖ సాయిభక్తులు శ్రీఆచార్య భరద్వాజగారి గురించి, వారి శిష్యులైన శ్రీశరత్ బాబుగారి గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తుండటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. జీవితాన్ని తేలిగ్గా, వినోదంగా గడిపే మా మిత్రబృందంలో ఒకడైన గుప్తా ఆ విధంగా చెప్తూ ఉంటే నాకు కూడా వారిని కలుసుకోవాలనే కుతూహలం కలిగింది.

నేను, గుప్తా కలిసి శరత్‌బాబుగారిని చూడడానికి వెళ్ళాము. నాకంటే పది సంవత్సరాలు చిన్నవారైనా కూడా శరత్‌బాబుగారిని మొదటిసారి చూడగానే ఏదో తెలియని ఇష్టం ఏర్పడింది. ఎంతసేపైనా అలా వారినే చూస్తుండిపోవాలనిపించింది. వారి మధురమైన చిరునవ్వు, చూడగానే అయస్కాంతంలా ఆకర్షించే వారి విలక్షణమైన కళ్ళు, వారి సరళమైన, స్థిరమైన ప్రవృత్తి నన్నెంతగానో ప్రభావితం చేసాయి. అనిర్వచనీయమైన ఆకర్షణ ఏదో వారి వైపు పట్టిలాగుతూ నిరంతరం వారి సాంగత్యంలోనే ఉండాలనిపించేలా చేసింది. శరత్‌బాబుగారి పరిచయం నా జీవన గమనాన్నే పూర్తిగా మార్చివేసింది.

నేను తరచుగా వారిని చూడడానికి ఒంగోలు వెళ్ళేవాడిని. సాయంత్రం ఆరు, ఏడు గంటల మధ్య వెళ్ళి తిరిగి రాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో బయల్దేరి గుంటూరు వచ్చేవాడిని. వారి సమక్షంలో కాలం ఎలా గడిచిపోయేదో తెలిసేది కాదు. వారి మాట తీరు, సన్నిధి అంత ఆత్మీయంగా ఉండేవి. వారి మాటలు ఎంతో మధురంగా, హాస్యభరితంగా ఉండేవి. అపారమైన విజ్ఞానం, పాండిత్యం, ప్రతిభాపాటవాలు, ఎంత జటిలమైన విషయాన్నైనా ఎదుటివారికెంతో సులభంగా అవగాహన కలిగేలా చెప్పడం వారిలోని ప్రత్యేకతలు.

గురువుగారు నాతో ఒకరోజు *“రమణమహర్షి గురించి, మీ కుటుంబానికి వారితో గల అనుభవాల గురించి చెప్పండి”* అన్నారు.

నిజానికి నాకు భగవాన్ గురించి పెద్దగా తెలియకపోయినా పైకి అంతా తెలిసినట్లు వ్యవహరించేవాడిని. అడిగారు కనుక వారికంత అవగాహన లేదనుకుని ఏవేవో కోతలు కోశాను. గురువుగారు రమణమహర్షి గురించి పుస్తకం వ్రాసారని తర్వాత తెలిసింది. వారు ఆంగ్లంలో తాను వ్రాసిన భగవాన్ చరిత్ర కాపీ నా చేతికిచ్చి, *“మీరు చదివి ఇంగ్లీషులో ఎక్కడైనా తప్పులుంటే సరిచేయండి”* అన్నారు. నా ఆంగ్ల పాండిత్యంపై నాకెంతో విశ్వాసం, అహంకారం ఉండేవి. ఆ పుస్తకాన్ని చదివిన తరువాత నాలోని అహంభావమంతా అణగిపోయింది. వారి ఆంగ్లభాషా పరిజ్ఞానంతో

పోలిస్తే నాకొచ్చిన ఇంగ్లీషు సున్న అని స్పష్టంగా తెలిసింది. వారి భాషాపటిమను, భగవాన్ చరిత్ర, బోధలపై వారికున్న అవగాహన చూసి అవాక్కయ్యాను. వారు అంతా తెలిసి కూడా ఏమీ తెలియని వారిలా ఉండగలుగుతున్నారు, ఏమీ తెలియకపోయినా అన్నీ తెలిసినట్లు వ్యవహరిస్తున్నానని నాపై నాకే చిన్నతనం వేసింది.

క్రమంగా వారి ఔన్నత్యం తెలిసేకొద్దీ వారిపట్ల నాకు గౌరవాభిమానాలు మరింతగా పెరగసాగాయి. వారిలోని మహనీయతను గుర్తించే కొద్దీ వారిపట్ల నాకున్న అభిమానం ఆరాధనగా మారిందని చెప్పాలి. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని అంశాలలో నేను వారికి పూర్తిగా వ్యతిరేకం. నిరాడంబరత వారికి పెట్టని ఆభరణం. ఆత్మీయత వారి సహజ గుణం. జీవితంలో అన్నింటా రాజీపడడానికి మనమెప్పుడూ సిద్ధం, వారికది నిషిద్ధం. వారు ప్రతి విషయాన్ని కూలంకషంగా శోధించి దానిలో పరిపూర్ణత్వాన్ని సాధిస్తారు. ఇతరులేమనుకొన్నా సరే వారు తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఎవరికోసం మార్చుకొనేవారు కాదు. నేను ఎవరైనా తప్పు చేస్తే వారిపై విరుచుకుపడి నానా దుర్భాషలాడి వారిని అవమానించేవాడిని. కాని వారు ఎవరెంత పెద్ద పొరపాటు చేసినా సరే పల్లెత్తుమాట అనకుండా, చిరునవ్వుతోనే తమ తప్పు తామే తెలుసుకొనేట్లు చేసి, మరల అటువంటి పొరబాటు ఎన్నడూ చేయకుండా ప్రతి వారిలోను మౌలిక పరిణామం తీసుకురాగలరు. మన అభిరుచులకు, సంస్కారాలకు తగినట్లుగానే వారు మనతో వ్యవహరిస్తూ సరైన సమయంలో సరైన సంఘటనలు కూర్చి మనలను తీర్చిదిద్దుతారు.

వారు ఎప్పుడూ నా చెడు అలవాట్లను మానుకోమని వాచా బోధించకపోయినా, పరోక్షంగా నా మనసుకు అవి కూడనివి అని తోచేలా చేశారు. వారి సమక్షంలో దొరికే సంతృప్తి, ప్రశాంతత నాకు ఆ అలవాట్ల వల్ల లభించే తాత్కాలిక ఆనందం కన్నా ఎన్నో రెట్లు అధికంగా అనిపించడంతో వాటికి క్రమంగా దూరమయ్యాను. ఒకసారి వారు *"మీరెందుకు ఆల్కహాలు తీసుకుంటారు?"* అని అడిగారు. 'దాని వలన ఎంతో మంది పలుకుబడి, అధికారం ఉన్నవారితో నాకు పరిచయాలేర్పడతాయి' అని నేను సమాధానమిచ్చాను. *"మీరు త్రాగుడు మానివేసినట్లయితే ఇంకా గొప్పవాళ్ళతో మీకు పరిచయం కలుగుతుంది"* అని అన్నారు.

అప్పటి నుండి నేను త్రాగడం ఆపేశాను. నిజానికి నాకు ఆ రుచి అంతగా నచ్చకపోయినా అదిచ్చే మత్తు గమ్మత్తుగా ఉండేది. అయితే జీవితంలో మద్యం

మత్తును వదిలించుకున్నా అధికారమిచ్చే మత్తును మాత్రం నేను అంత త్వరగా వదులుకోలేకపోయాను.

1987లో నా ముగ్గురు కుమారులలో ఇద్దరు కుమారులు ఆడుకుంటూ ఒకేసారి నీటిగుంటలో పడి చనిపోయారు. ఈ హఠాన్మరణాలు నన్ను, నా శ్రీమతిని విషాదంలో ముంచివేశాయి. అప్పుడు గురువుగారిచ్చిన ఓదార్పు వలనే మళ్ళీ మేము మామూలు మనుషులమయ్యాము. ఈ సంఘటన తరువాత ఈ పరిసరాలు, మనుషుల నుంచి ఎక్కడికైనా దూరంగా వెళ్ళాలని ఉంది అని గురువుగారితో అంటే "పదండి. మీరెక్కడికి వెళ్ళాలనుకుంటారో, నేనూ అక్కడికి వస్తాను" అన్నారు.

వెంటనే తిరువణ్ణామలై గుర్తుకు వచ్చింది. కానీ అక్కడ అందరు తెలిసిన వాళ్ళుంటారు. అందుకని శిరిడీ వెళదామన్నాను. అందరం కలిసి శిరిడీ వెళ్ళాము. భవిష్యత్తులో గురువుగారు, సాయిబాబా నా సర్వస్వం కావడానికి ఆ మొదటి శిరిడీ యాత్ర నాంది అయింది.

ఆ తరువాత కాలంలో వేదనాభరితమైన ఆలోచనలతో నిస్తేజమవుతున్న మనస్సుకు వారి సహచర్యం ఎంతో ఓదార్పునిచ్చింది. నా హృదయంలోని శూన్యాన్ని తమ అవ్యాజ ప్రేమతో నింపుతూ వచ్చారు. ఆ సమయంలోనే గురువుగారు నాకెన్నో పనులు చెబుతూ ఆ పనులలో నన్ను నిరంతరం ఎంతో బిజీగా ఉంచేవారు. నాకు ఆ పని కాలేదే అన్న ఆలోచన తప్ప ఏ ఇతర విషయాలకు తావు లేకుండా పోయింది.

ఒకరోజు గురువుగారు "*మీరు పూర్తిగా బాబా పనిలో ఇలా నిమగ్నమవడం మీకెంతో మేలు చేసింది. మీ పిల్లలు చనిపోయిన దుఃఖాన్నుంచి మీ మనసు మరల్చ గలిగింది. లేదంటే మీరు మతిస్థిమితం కోల్పోవడమో లేక పక్షవాతం బారిన పడటమో జరిగి ఉండేది. బాబా మిమ్మల్ని కాపాడారు*" అన్నారు.

గురువుగారు ఒకసారి మహల్సాపతి చరిత్రను, శ్రీధరకవి రచించిన 'శ్రీరామ విజయం' గ్రంథాన్ని మరాఠీ నుండి తెలుగులోకి అనువాదం చేయమన్నారు. నాకు మరాఠీ తెలియదు కనుక హైదరాబాద్‌లో ఉండే నిత్యానంద విజాపూర్‌కర్ అనే తెలుగు బాగా తెలిసిన మహారాష్ట్రీయుని సహాయంతో ఆ అనువాద కార్యక్రమాన్ని ప్రారంభించాను. అనువాదం విషయం ఎలా ఉన్నా, దాని వంకతో గురువుగారు నాకు సహనాన్ని నేర్పించారు. అనువాదం కోసం వస్తానని నేను నిత్యానంద్‌గారిని ఫోన్‌లో అడిగినప్పుడల్లా రమ్మని, తీరా వారి వద్దకు వెళ్ళిన తర్వాత ఎవరితోనో

సంభాషిస్తూ "ఒక గంట తర్వాత రా!" అనేవారు. నేను గంటసేపటి కోసం దూరంగా ఉన్న మా ఇంటికి వెళ్ళి తిరిగిరాలేను. అందువలన అక్కడే దగ్గరలో ఉన్న హనుమాన్ మందిరంలో గడిపి గంట తర్వాత మళ్ళీ వెళ్ళేవాడిని. మేము అనువాదం చేస్తున్నప్పుడు మధ్యలో ఎవరైనా వస్తే 'ఇక మీరు వెళ్ళి రేపు రండి' అనేవారు. నాకు ఉస్సూరుమనిపించేది. అంతదూరం నుండి వస్తే పట్టుమని పదినిమిషాలు కాకుండా పంపించి వేస్తున్నాడని కోపం వచ్చేది. కానీ ఏం చేసేది? గురువుగారు చెప్పిన పని కదా! అందుకని మౌనంగా సహించి ఉండడం నేర్చుకున్నాను. అలా ఆరునెలలు గురువుగారు నాకు రకరకాల పరీక్షలు పెట్టారు.

ఆ తరువాత ఆయనలో గురువుగారు ఏం మార్పు కలుగజేసారో ఏమో అనువాదం జరిగేటప్పుడు ఎవరు వచ్చినా వారిని తర్వాత రమ్మనేవారు, నేను లేవబోతే కూర్చోమనేవారు. వారి ఇంట్లో ఏది ప్రత్యేకంగా చేసినా అది నాకూ పెట్టేవారు. అలా వారి ఇంట్లో ఒక సభ్యునిగా నన్ను ప్రేమించేవారు.

శ్రీరామవిజయం అనువాదం నాల్గవ వంతు పూర్తవుతూండగా శ్రీనిత్యానంద్ విజాపూర్‌కర్‌గారు కన్నుమూయడంతో నా పని మొదటికొచ్చింది. తర్వాత నేను ఎంత ప్రయత్నించినా మరాఠీ, తెలుగు భాషలు రెండూ తెలిసిన వారెవ్వరూ కనిపించలేదు. గురువుగారు "*మీరే చేయండి, అంతా బాబా చూసుకుంటారు*" అన్నారు.

నాకు మరాఠీ రాకపోయినా గురుకృప వలన ఓవీ ఛందస్సులో ఉన్న ఆ మరాఠీ పద్యాలు బోధపడేవి. శిరిడీలోని మరాఠీ గురుబంధువుల వద్ద కూర్చొని తెలియనివి చెప్పించుకొనేవాడిని. ఆరు సంవత్సరాలకు ఆ పని పూర్తయింది. పూర్తయినదాన్ని గురువుగారు మరల సరి చూడమంటూ రెండుసార్లు నాతో సరిచేయించారు. మూడవసారి కూడా గురువుగారు నన్ను మరలా చూడమనడంతో "ఏమిటిది? గురువుగారు ఒక్కసారి కూడా చదవకుండానే నన్ను మళ్ళీ మళ్ళీ చూడమంటున్నారు" అనిపించింది. వెంటనే వారు "చివరి రెండు పేజీలు చూడండి. మీకే తెలుస్తుంది" అన్నారు. నేనా పేజీలు తీసి చూద్దును కదా అంతకుముందు గోచరించని ఎన్నో తప్పులు కనపడ్డాయి. గురువుగారు చదవాల్సిన పనిలేదని, చదవకుండానే తప్పులు కనపడేటట్లు చేయగలరని అప్పుడు అర్థమయ్యింది.

వెంటనే గురువుగారి పాదాలపై పడి, "సార్! మీకు తృప్తి కలిగేంతవరకు ఎన్నిసార్లయినా సరిగా వ్రాసుకొస్తాను" అని చెప్పి బయటకొచ్చాను.

ఆ విధంగా మరాఠీలో ఓనమాలు రాని నాచేత శ్రీరామవిజయం వంటి గొప్ప గ్రంథాన్ని తెలుగులో అనువదింపజేసారంటే, అది వారి మహిమకు, శక్తికి తార్కాణమే తప్ప అందులో నా ప్రతిభ అణువంత కూడా లేదు.

ఒకసారి గురువుగారు, నేను వెంకటగిరి వెళ్ళాము. అక్కడ మిత్రులందరితో మాట్లాడి మరికాసేపటిలో బయల్దేరుదామనగా తెలుగు లెక్చరర్ సాయివరప్రసాద రావుగారు వచ్చారు. గురువుగారు, ఆయన భాగవతం గురించి చర్చ మొదలుపెట్టారు. మేము ముందుగా అనుకొన్న ప్రకారం మా తిరుగు ప్రయాణంలో నెల్లూరులో ఆగి ఒక వ్యక్తిని కలవాలి. అప్పటికే అరగంట ఆలస్యమవడంతో గురువుగారికి ఒకసారి గుర్తు చేశాను. వారు నా మాట పట్టించుకోలేదు. మరికొంతసేపు వేచి ఉండేసరికి నాలో అసహనం పెరగసాగింది. "మనకిప్పటికే ఆలస్యమైంది" అన్నాను.

గురువుగారు పదునుగా *"అంత అవసరమైతే మీరు బయల్దేరండి. నేను తర్వాత వస్తాను"* అన్నారు.

కొద్దిసేపటికి వారి చర్చ పూర్తయింది. *"బయలుదేరుదామా"* అన్నారు గురువుగారు. నేను అనుసరించాను. బస్సెక్కిన తరువాత *"కోపం వచ్చిందా!"* అని అడిగారు మృదువుగా. వారు అలా ప్రేమగా అడిగేసరికి నా ముభావమంతా ఎగిరి పోయింది. లేదన్నాను. అప్పుడు *"మనం చేస్తున్న పని మధ్యలో వదలి వెళ్ళకూడదు. ఆ పని పూర్తయిన తర్వాతే మరో పని గురించి ఆలోచించాలి. మనం ఎప్పుడు వెళ్ళాలో బాబానే నిర్ణయిస్తారు"* అని చెప్పారు.

1989 ఏప్రిల్ 12వ తేదీ నాడు శ్రీభరద్వాజ మాస్టరుగారు దివంగతులైనారని ఫోను వచ్చింది. వెంటనే నేను ఒంగోలు వెళ్ళాను. గురువుగారు అంతులేని దుఃఖంలో ఉన్నారు. అదే వారు కంటతడిబెట్టగా చూడడం. మాస్టరుగారితో ఆయనకు గల అనుబంధాన్ని, ఆనాటి మధురస్మృతులనెన్నింటినో గుర్తుచేసుకున్నారు. వారికి వారి గురువుపట్ల గల ప్రేమానురాగాలు ఎంతటివో నాకు ఆ రోజే తెలిసింది.

ఆనాటి రాత్రి గురువుగారు *"ఒంగోలులో నాకు ఇక పని లేదు. ఇక ఇక్కడ ఏముందని ఉండాలి?"* అన్నారు.

స్కూల్‌ను సాయిబాబా ఫౌండేషన్‌కు అప్పగించి తమ నివాసం శిరిడీకి మార్చారు. నాకు హైదరాబాద్‌కు బదిలీ అవడంతో నేను ప్రతి వారం శిరిడీ వెళుతుండేవాడిని. 1992లో గురుపూర్ణిమ మహోత్సవాలకు గురుబంధువులందరం శిరిడీ వెళ్ళాము.

గురుపూర్ణిమ మరునాటి రాత్రి గురువుగారి వద్ద కూర్చునే అవకాశం మాకు లభించింది. అప్పుడు మా అందరిని పరికించి చూసి "ఈ రోజు మీరెవ్వరూ బాబా మందిరానికి వెళ్ళినట్లు లేదు" అన్నారు.

అందరం ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నాము. నిజమే! మాలో ఎవ్వరూ మందిరానికి పోలేదు. "మీరు మందిరానికి వెళితే మీ నుదుట బాబా ముద్ర ఉంటుంది" అన్నారు గురువుగారు. అందరం సిగ్గుతో తలదించుకున్నాము.

మరో రోజు మేమందరం గురువుగారి వద్ద కూర్చొని ఉండగా ఒక భక్తుడు "బాబా నామం ఎలా చేసుకోవాలి" అని అడిగాడు. అప్పుడు "నామం చెప్పడమంటే *బాబాను ఎలుగెత్తి పిలవడం. మన గుండెలోతుల్లో నుండి పిలవగలిగితే బాబా తప్పక పలుకుతారు. అంతేకాదు ఆ పిలుపు విని సమాధి మందిరం నుండి బాబా లేచి రావాలి"* అంటూ *'సాయిబాబా! సాయిబాబా!'* అని బాబా నామాన్ని గురువుగారు దాదాపు అరగంటసేపు చెప్పారు. ఆ నామంలోని మాధుర్యం చెప్పనలవికాదు. ఆ పారవశ్యంలో మమల్ని మేము మర్చిపోయాం. నామం ఎలా చెప్పాలన్నది ఆ రోజే మాకు తెలిసింది. సరిగ్గా అదే సమయంలో పొరుగున ఉండే శ్రీభరత్ పాటిల్ గురువుగారికొక బాబా ఫోటోను తెచ్చి ఇచ్చారు. గురువుగారు ఆ ఫోటోను చూపుతూ *"చూశారా! బాబా వచ్చారు"* అన్నారు ఆనందంగా.

గురువుగారంతటి మహాత్ములు ఎలుగెత్తి 'సాయిబాబా' అని పిలిస్తే బాబా రాకుండా ఉండగలరా అనిపించింది మాకందరికీ. ఆ రోజు నుండి 'సాయిబాబా' అన్న నామం సకల శుభములనొసగు దివ్యమంత్రమై సాయిపథగాములకు ఒక వరమయ్యింది. గురువుగారి కృపవల్ల ఈనాడు సాయిభక్తుల సంస్కృతిలోనే గొప్ప మార్పు వచ్చింది. వివాహమైనా, గృహప్రవేశమైనా, ఇంటిలో జరిగే ఏ శుభకార్యమైనా సాయినామ సంకీర్తన వాటిలో ఒక భాగమైపోయింది. తమ ఆనందాన్ని తోటివారితో పంచుకోవాలి అనుకున్న ప్రతివారూ వేడుకల సమయంలో సాయిబాబా భజన చేసుకొంటున్నారు.

***భక్తుడు:*** *గురువుగారూ! కొంతమంది సాయిబాబా నామం ముందు 'ఓం' అని చేర్చి చెప్పుకుంటారే?*

***గురువుగారు:*** చెప్పుకోవచ్చు. *'ఓం సాయి'* అని చెప్పుకోవచ్చు. ఏమైనా

*చెప్పుకోవచ్చు. నన్ను అందరూ "సాయిబాబా" అంటారు అని ఆయనకు ఆయన చెప్పుకున్న మాట. కాబట్టి అలానే పిలుస్తాం. 'ఓం' అన్నారు, ఓం అనే దానికి అర్థం తెలియకుండా, ఆ ప్రణవ సాధన మనం చేయకుండానే ఊరకనే ఓం, ఓం అనటంలో అర్థం ఏంటి? శాస్త్రంలోనే చెప్పబడి ఉంది. ప్రణవం చేసేటప్పుడు దాన్ని తెలుసుకుని, దాని కీలకం అడిగి తెలుసుకుని చేయాలి అని! ఎట్లా పడితే అట్లా ఓంకారాన్ని చెప్పకూడదు.*

*ఓంకారం చెప్పటం వల్ల ఏ ఫలితమయితే వస్తుందో, అది మాకు "సాయిబాబా సాయిబాబా" అనడం వల్ల వస్తుంది. మాకు సాయి నామమే ప్రణవం. మేము 'సాయి' అంటే ఆయన "ఓ" అంటున్నారే అదే మాకు ఓంకారం. అదే నేను వ్రాసింది. "నాలో ప్రణవమై పలుకుము సాయి" అని. నువ్వు సాయి అంటే ఆయన "ఓ" అని పలుకుతాడే అదే మాకు కావలసింది, అదే మా ఓంకారం. కాబట్టి మాకు అది చాలు.*

అన్య దేవతానామాలతో జతపరచి పలికే బాబా నామం, అట్లా కాకుండా "సాయిబాబా సాయిబాబా" అని 'బాబాను బాబాగా' పిలుచుకొనే దివ్యమంత్రమై సాయి సత్సంప్రదాయానికి ఒక శుభారంభమైంది.

గురువుగారి సందర్శనార్థం వచ్చే భక్తులు రోజురోజుకీ పెరిగేకొద్దీ నాకు బాధ్యతలు ఎక్కువకాసాగాయి. గురువుగారి ఆశీస్సుల కోసం వచ్చే వారికి వసతులు ఏర్పాటు చేయడం, వచ్చిన వారితో మాట్లాడడంతోను ఎక్కువ సమయం గడిచి పోయేది. నేను గురువుగారికి సన్నిహితంగా ఉండడంతో, గురువుగారి దగ్గరకు రాలేని భక్తుల కోరికలను, సమస్యలను గురువుగారికి విన్నవించే ప్రధాన వ్యక్తిగా అందరూ గుర్తించసాగారు. ఇవన్నీ నాలో తెలియకుండానే అహంకారాన్ని రేకెత్తించాయి. నేను చుట్టూ ఉన్న వారి పొగడ్తల మాయలో పడిపోయాను. గురువుగారు పదే పదే *"మీరు జనం మాట నమ్మకండి. మీ ముందు మిమ్మల్ని పొగుడుతారు, వెనుకజేరి మిమ్మల్ని విమర్శిస్తారు. మీకు వారిచ్చే గౌరవం మీరు నా దగ్గర ఉండబట్టే. జాగ్రత్త!"* అని ఎన్నిసార్లు హెచ్చరించినా నేను వారి హితవచనాలను పెడచెవినపెట్టాను. గురువుగారు చెప్పినంతసేపు బాగా అర్థమైనట్లే ఉండేది. కానీ బయటకు వచ్చిన తరువాత అంతా మామూలే! ఆ మాయలో పడిపోయేవాడిని.

మొదట్లో గురువుగారు ఏ పని చెప్పినా నేను సమర్థవంతంగా సాధించు కొచ్చేవాడిని. ఆ పని వెనుక నుండి చేయించేది గురువుగారేనని, ఆ విజయానికి కారణం గురువనుగ్రహమే తప్ప మన ప్రతిభ కాదని అనుకొంటున్నంత వరకు అన్నీ సజావుగా సాగిపోయేవి. క్రమేణా ఎప్పుడైతే ఆ ఎఱుక నాలో మరుగున పడిందో నేను చేసే ప్రతి పనిలో వైఫల్యాలు మొదలయ్యాయి. కానీ అవి ఎందుకు అలా జరుగుతున్నాయా అని నేను వాటివైపు దృష్టి సారించలేదు. కనీసం గురువుగారినడిగి తప్పేమిటో తెలుసుకోలేదు. తెలుసుకోవాలని కూడా నాకు తోచలేదు.

"ఎవరితోనూ ఏ సేవా చేయించుకోవద్ద"ని ఎన్నోసార్లు గురువుగారు చెప్పారు. *"వారంతా నీ గురుబంధువులు. నీతో సమానమైన వాళ్ళు. వాళ్ళని గౌరవించాలి కానీ సేవలు పొందకూడదు"* అని చెప్పేవారు. కాని నేను వద్దంటున్నా వాళ్ళు సేవ చేస్తానని పట్టుబట్టడంతో లొంగిపోయేవాడిని. ఇదంతా నేను గురువుగారితో ఉన్నాను కాబట్టే వాళ్ళు చేస్తున్నారు. దానికి ప్రతిఫలంగా వాళ్ళ సమస్యలు నేను గురువుగారితో చెప్తాననో లేక గురువుగారితో ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఏర్పాటు చేయిస్తాననో వారి ఆశ. అందుకోసం చేతులెత్తి నమస్కరించేవారు. మరికొందరు పాదాలు తాకటానికి ప్రయత్నించేవారు.

నా జీవితమంతా ముఖ్యంగా విద్యార్థి దశ నుంచి అధికారం చుట్టూనే తిరుగసాగింది. అధికారం చెలాయించటం లేదా అధికార వ్యామోహం అన్నది ఒక రకంగా నా కళ్ళకు పొరలు కట్టసాగింది. ఆ చీకటి పొరలు దట్టమయ్యేకొద్దీ వాస్తవాలను గమనించే దృష్టి మందగించింది. గురువుగారు ఎంతగా ఆ పొరలు తొలగించి వాస్తవాలను నాకు చూపించే ప్రయత్నం చేస్తున్నా ఆ మాటలు నా తలకెక్కనంత మాయలో నేనుండిపోయాను. గురువుగారి హితవచనాలు ఎప్పటికప్పుడు నాకు "నిజం కదా" అనిపిస్తున్నా మళ్ళీ వాటినంత సీరియస్‌గా పట్టించుకోలేకపోయాను (అనుసరించలేకపోయాను). సంస్థలు, వాటి నిర్వహణ, అధికారం చెలాయించటం ఇంకా చెప్పాలంటే అందర్నీ గడగడలాడిస్తూ దర్పం చూపెట్టడం, వీటి మధ్య నాలోని భక్తుడు క్రమేణా మరుగునపడిపోయాడు. అసలు ఎందుకొచ్చాను? గురువుగారి దగ్గర నేనెందుకున్నాను, నా గమ్యమేమిటి అన్నది మరచిపోయాను. గురువుగారి ప్రేమని, కరుణని కూడా కమ్మేసేంతగా నా అధికార వ్యామోహం, అహంకారం పెరిగిందంటే అవి నాలో ఎంత ఉధృతంగా ఉన్నాయో ఇక చెప్పనవసరం లేదు.

అధికారం చెలాయించడంలో భక్తి అంతరించి, నాలోని భక్తుడు చనిపోవడంతో మెల్లమెల్లగా గురువుగారికి దూరమవడం మొదలయ్యింది.

మొదటిరోజుల్లో నేను గురువుగారి వద్ద నుండి సెలవు తీసుకుని వెళ్ళేటప్పుడు నా ప్రతి పొరపాటును, నా చేతకానితనాన్ని వారికి చెప్పుకుని క్షమించమని ప్రార్థించే వాడిని. కానీ క్రమంగా ఆ అలవాటు మారి నా తప్పును కప్పిపుచ్చుకోవడం, ఆ తప్పుల్ని వేరే వాళ్ళకి ఆపాదించడం మొదలయ్యింది.

ఒకసారి నేను తెనాలి సత్సంగానికి వెళ్ళాను. సత్సంగంలో గురువుగారితో నేను పొందిన అనుభూతులను చెప్పాను. అనంతరం బాబాకు నైవేద్యం, ఆరతినిమ్మన్నారు. ఆరతినిచ్చి తిరిగి చూసేసరికి నా పాదాలకు ఎవరో నమస్కరిస్తున్నారు. ప్రక్కనే ఒకరు ఊదీ పట్టుకుని నిలుచొని ఉన్నారు. నాకేం చేయాలో తోచలేదు. అనాలోచితంగానే గురువుగారెట్లా చేస్తారో అట్లాగే వారికి ఊదీ ఇచ్చి నుదుట కూడా పెట్టాను. అదే విధంగా నమస్కారం పెట్టిన వారందరికీ యిచ్చాను. గదికి వచ్చిన తర్వాత నుండి ఒకటే వాంతులు, విరేచనాలు అవసాగాయి. విపరీతమైన నీరసం. వెంటనే గురువుగారికి ఫోన్ చేసి నా పరిస్థితిని, జరిగినదంతా కూడా వారికి నివేదించాను. అంతా విన్న తర్వాత గురువుగారు *"ఒకరి చేత నమస్కారం పెట్టించుకోవాలంటే తిరిగి ఆ నమస్కారాన్ని బాబాకు సమర్పించడం ఎలాగో చేతకావాలి. లేకపోతే దాని ఫలితం ఇలాగే ఉంటుంది"* అన్నారు.

నేను చేసిన తప్పు చెప్పుకోవడంతో గురువుగారి దయవలన ఉదయానికి ఆ వాంతులు, విరేచనాలు తగ్గాయి.

అప్పటి నుండి ఎవరైనా నమస్కారం పెట్టడానికి వస్తే మనసులో ఇష్టమున్నా పై అనుభవం గుర్తుకు వచ్చి వారిని వారిస్తున్నాను.

నేను ఒకరోజు ఆఫీసుకు బయలుదేరుతూ తొందరగా ఏదో సర్దుకొంటూ క్రిందికి వంగాను. అంతే ఒక్కసారిగా నడుము పట్టేసింది. ఆర్.టి.సి. హాస్పిటల్‌కు వెళ్ళాను. ఏవో మందులిచ్చారు కానీ వేసుకోలేదు. గురువుగారికి చెప్పాను. అట్లాగే 15 రోజులు గడిచిపోయాయి. నేను పడక మీదే ఉంటున్నాను. ఎవరైనా గురుబంధువులు వచ్చినప్పుడు, సత్సంగం చేసే సమయంలో లేచి పద్మాసనంలో కూర్చోగలిగేవాడిని. అప్పుడు ఏ నొప్పి ఉండేది కాదు. కానీ తరువాత మళ్ళీ కనీసం అటు నుంచి ఇటు దొర్లాలన్నా గగనమయ్యేది. నెల్లూరు నుండి డా॥ నరేంద్ర కూడా వచ్చి మందులు

ఇస్తున్నాడు. కానీ ఏదీ పని చేయడం లేదు. నా బాధ చూడలేక గుప్తా, గురువుగారికి ఫోన్ చేసి "సార్! నారాయణరావు పరిస్థితి ఏమీ బాగలేదు. వెంటనే నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించాలి" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. ఫోన్ నరేంద్రకిమ్మని గురువుగారు నా ఆరోగ్య పరిస్థితి అడిగారు. నేనా ఫోన్‌లోనే గురువుగారితో "సార్, నాకీ శిక్ష సరిపోతుందనుకొంటే నేను వెంటనే శిరిడీ వస్తాను" అన్నాను.

*"నిలబడే పరిస్థితిలో లేరంటున్నారుగా. ఎలా వస్తారు?"* అనడిగారు గురువుగారు.

"మీరు సరేనని ఆశీస్సులిస్తే చాలు. నేను బయలుదేరగలను" అన్నాను.

*"అయితే కారులో బయలుదేరి రండి"* అన్నారు గురువుగారు.

అప్పటికప్పుడు కారు ఏర్పాటయింది. నేనూ, నా భార్య శిరిడీ బయల్దేరాము. నన్ను చూడడానికి వచ్చిన గురుబంధువులు ఇలాంటి పరిస్థితిలో శిరిడీ వెళుతున్నాడే అని అయోమయంతో చూస్తుండగా నేను మాత్రం శిరిడీకి, గురువుగారి దగ్గరకు వెళ్ళబోతున్నానన్న ఆనందంలో వెనుక సీటులో పడుకున్నాను. మేము శిరిడీ చేరి కారు దిగిన వెంటనే అమ్మగారు బయటకొచ్చి కనిపించారు. "ఎలా ఉందండి" అని ఆప్యాయంగా అడిగారు.

"చూడమ్మా" అంటూ లేచి నిలబడగలిగాను. మేము వచ్చామనగానే గురువుగారు నన్ను పిలిచి రెండు గంటలు దగ్గర కూర్చోబెట్టుకున్నారు. తర్వాత *"మీరు ఎక్కువ విశ్రాంతి తీసుకోవడమే ఈ జబ్బుకు కారణం. వెంటనే నడిచి మందిరానికి వెళ్ళి ఓపికున్నంతసేపు కూర్చొని రండి. తగ్గిపోతుంది"* అన్నారు. నాకంత శక్తి ఎక్కణ్ణుంచి వచ్చిందో, నా నీరసమంతా ఏమైందో తెలీదు. ఆనందంగా అప్పుడే అలాగే మందిరానికి వెళ్ళాను. దాదాపు అక్కడ రెండు గంటలు గడిపి తిరిగి వచ్చాను. నా నడుము నొప్పి అంతా తగ్గిపోయింది. కొన్ని గంటల ముందు నన్ను చూసిన వారంతా ఎంతో ఆశ్చర్యపోయారు.

ఒకరోజు నేను హైదరాబాదు నుండి శిరిడీ బయలుదేరబోతున్నాను. అంతలో గురుబంధువైన శివశంకర్‌గారు ఫోన్ చేసి "నేనూ శిరిడీకే వెళ్ళబోతున్నాను. కారులో వెళదాం" అన్నారు. *"శిరిడీకి బయలుదేరదలచుకుంటే ఎవ్వరి కోసం ఆగవద్దు. అనుకొన్న సమయాన్ని, రోజును వాయిదా వేసుకోకండి"* అని చెప్పారు గురువుగారు. అందుకే నేను శివశంకర్‌తో "నేను మధ్యాహ్నం రెండు గంటల బస్‌కి బయలు దేరదలచుకున్నాను. మీరు ఆ లోపు వస్తే వస్తాను. లేకపోతే బస్‌లోనే వెళతాన"న్నాను.

"అంతదాకా ఎందుకు సార్ మనం పన్నెండు గంటలలోపే వెళ్ళిపోదాం" అన్నారు శివశంకర్. అన్నారే కానీ అయిదు నిమిషాలు, పది నిమిషాలలో వచ్చేస్తున్నానంటూ రెండున్నరకు వచ్చారు. మేము మూడు గంటలకి బయలుదేరాము. కారులో గదా బస్సుకంటే ముందే వెళ్ళిపోవచ్చు అనుకొన్నాము. కానీ మేము ఆ రోజు శిరిడీ చేరేసరికి బస్సుకంటే గంట ఆలస్యమయింది. నేను వెంటనే స్నానం చేసి 'సాయిపథం'కి వెళ్ళి, అక్కడ అమ్మగారికి కనిపించాను. అప్పటివరకూ నేను శిరిడీ చేరగానే గురువుగారు వెంటనే నన్ను లోపలకు పిలిచేవారు. ఈసారి ఎంతసేపు బయట వేచివున్నా గురువుగారి నుంచి పిలుపురాలేదు.

అంతలో అమ్మగారు వచ్చి "గురువుగారు దర్శనమిస్తున్నారు" అన్నారు.

నాకు మతిపోయింది. వెళ్ళి దర్శనంకొరకు నేనూ క్యూలో నిలుచున్నాను. నేను గురువుగారి దగ్గరకు వచ్చిన తర్వాత అదే ప్రథమం అట్లా క్యూలో వెళ్ళి గురువుగారిని దర్శించుకోవడం. అంతవరకూ వారి దర్శనార్థం వచ్చే వేలాదిమందికి దర్శనం ఏర్పాట్లు చూసుకొనేవాడిని. అట్లా నేనూ క్యూలో వెళ్ళవలసి రావడంతో చెప్పరాని బాధకు లోనయ్యాను.

నేను గురువుగారి చెంతకు వెళ్ళగానే నాకు అప్రయత్నంగానే కళ్ళ వెంట నీళ్ళొచ్చేసాయి. "నన్ను క్షమించండి!" అన్నాను వారి పాదాలకు నమస్కరించుకుంటూ.

"నేను చెప్పినట్లు నడుచుకోవడం లేదు మీరు" అని మాత్రం అన్నారు గురువుగారు.

"మళ్ళీ ఇటువంటి పొరపాటు చేయను" అన్నాను. ఆ సంఘటన, నేను అందరిలాంటి వాడినేనా, గురువుగారి వద్ద నాకు ఎటువంటి ప్రత్యేకత లేదా? అనే అసంతృప్తి నాలో రేకెత్తించింది.

1998లో గురువుగారు ఉత్తర భారతానికి బయలుదేరుతున్నారు. శిరిడీ నుండి మన్మాడు దాకా కారులో వెళ్ళి అక్కణ్ణుంచి రైలులో వెళ్ళాలని నిర్ణయమైంది. ఆ రోజు ఉదయం గురువుగారు నాతో "కొండయ్య కూడా మన్మాడుకు వచ్చేందుకు ఏర్పాటు చూడండి" అన్నారు. నేను "అలాగే సార్!" అన్నాను కానీ, మిగిలిన పనుల హడావుడిలో ఆ విషయం మర్చిపోయాను. నేను బయలుదేరే ముందు చూస్తే అన్నీ కార్లలో అందరూ ఎక్కి కూర్చొన్నారు. కొండయ్య ఒక ప్రక్క నిలబడి ఉన్నాడు. ఏ కారులోనూ అతనికి చోటు లేదు. నేను అదే మాట కొండయ్యతో చెప్పి "నువ్వు బస్సులో వచ్చేసెయ్" అన్నాను.

గతంలో జరిగిన కొన్ని సంఘటనలతో కొండయ్య పట్ల నాకు కొంత అసంతృప్తి ఉండేది. వాటి నేపథ్యమో ఏమో కొండయ్యను కారులో పంపించడానికి నేను మనస్ఫూర్తిగా ప్రయత్నించలేదు.

గురువుగారు కారు ఎక్కుతూ *"కొండయ్య ఎలా వెళ్ళాడు?"* అని అడిగారు. నేను "బస్సులో" అని చెప్పాను. గురువుగారి ముఖంలో అసంతృప్తి! *"మీ చోటు కొండయ్యకిచ్చి కారులో రమ్మని, మీరు బస్సులో వచ్చి ఉంటే నేనెంతో సంతోషించేవాడిని"* అన్నారు.

దాంతో నా పొరపాటేమిటో నాకర్థమైంది. గురువుగారినప్పుడే క్షమించమని అర్థించాను. ఆ తర్వాత మన్మాడులో కొండయ్యకూ క్షమాపణలు చెప్పుకున్నాను. అందరికీ ఎన్నోసార్లు సత్సంగాలలో గురువుగారి మాట తూ.చ. తప్పకుండా పాటించాలి అనే చెప్పేవాడిని. కానీ నేనది ఆచరణలో పాటించలేకపోయాను. ఈ సందర్భంలో నేను ప్రవర్తించిన తీరు నాకే సిగ్గుగా అనిపించింది.

గురువుగారు అందరిని ఒకేలా ప్రేమించమని చెప్తారు. ఒకరిని ఒక విధంగాను వేరొకరిని మరో విధంగా పక్షపాత వైఖరితో చూస్తే వారు సహించరు. *"నా దగ్గరకు వచ్చేవారంతా బాబా పంపిస్తేనే వస్తారు. నేనందరినీ బాబా ప్రసాదంగా చూస్తాను"* అంటారు గురువుగారు.

1998లో నేను గురువుగారితో తిరువణ్ణామలైలో ఉన్నాను. నాకు ఆఫీసులో అవసరమైన పని ఉండడంతో వెంటనే హైదరాబాదుకు వెళ్ళవలసి వచ్చింది. విమానంలో వెళితే తప్ప ఆఫీసుకు అందుకోలేమని గురువుగారి ఆశీర్వాదం తీసుకుని హైదరాబాదుకు విమానం టికెట్టు రిజర్వేషన్‌కు ప్రయత్నించాను. వెయిటింగ్ లిస్ట్ 32వ నెంబరు వచ్చింది. నాకు తెలిసిన వాళ్ళ ద్వారా ఫోనులో ప్రయత్నించాను.

అప్పుడక్కడే ఉన్న గురుబంధువైన రాంబాబు "నేను వెళ్ళి నాకు తెలిసిన వారి ద్వారా ప్రయత్నిస్తాను" అని వెళ్ళాడు. గురువుగారు దర్శనమిచ్చే సమయానికి తిరిగి రాలేకపోయాడు. దర్శనం తరువాత గురువుగారు నన్ను *"రాంబాబు ఎక్కడ?"* అని అడిగారు. నేను పనిపై బయటకు వెళ్ళాడని చెప్పాను.

*"ఏం పని?"* అని అడిగారు వెంటనే.

"నా విమానం టికెట్టు కన్ఫర్మ్ చేయించేందుకు" అని చెప్పక తప్పలేదు.

*"సత్సంగం సమయంలో ఎవరినీ ఏ పని పైనా పంపించవద్దు. అది ఎంత ముఖ్యమైన పనైనా సరే! నేను ప్రత్యేకించి చేయమంటే తప్ప. నేను చెప్పిన పనైనా*

ఆ సమయంలో చేయవద్దు. వాళ్ళు రోజంతా ఇక్కడ ఉండేది దేనికోసం? సాయంత్రం నేను బయటికి వస్తే ఆ కాసేపు నాతో కలసి ఉందామని. ఆ విషయం మీకు తెలియదా? నా దగ్గర రోజంతా ఉన్నా సత్సంగం సమయంలో లేకపోతే రోజంతా లేనట్లే."

కొంతసేపాగి "మీ విమానం టికెట్టు గురించి ఎందుకంత ఆందోళన చెందుతూ ఉన్నారు. మిమ్మల్ని విమానంలో వెళ్ళమన్న తర్వాత ఆ ఏర్పాటు దానంతటదే జరగదా? మీరందరికి చెప్తుంటారు కదా? మనకేం కావాలన్నా గురువుగారు చూసుకొంటారు, ఆందోళనపడాల్సిన పని లేదని. మరి మీరెందుకది అన్వయించుకోక ఇంత హైరానా పడుతున్నారు?" అని అడిగారు. నేను తలవంచుకున్నాను.

ఇలా జరిగిన సంఘటనలను చాలా చిన్న విషయాలుగా భావించి అశ్రద్ధ చేసినవే, నాకూ గురువుగారికి మధ్య అడ్డుగోడలవుతున్నాయని గ్రహించలేకపోయాను.

క్రమంగా గురువుగారంటే ప్రేమకు బదులుగా భయం చోటు చేసుకోసాగింది.

వారి దగ్గరకు వెళితే ఏం తప్పులు పట్టుకొంటారో, ఏమంటారోనన్న భయం నాకు ఏర్పడసాగింది. ఆ కంగారులో నాకు తెలియకుండానే నిజాన్ని దాచిపెట్టడం మొదలైంది. ఆ విషయం గురువుగారు ఎత్తి చూపినప్పుడు గాని నాకు తెలిసేది కాదు.

అంతా గురువుగారి ఇష్టమే అయినప్పటికి, 1998 వరకు నేను లేకుండా ఏ ప్రయాణంగాని, కార్యక్రమంగాని తీర్మానించేవారు కాదు. క్రమక్రమంగా అన్ని విషయాలలోను నా ప్రమేయం తగ్గిపోసాగింది. ఇదంతా చూస్తుంటే నాకెంతో అసహనంగా ఉండేది. నేను గురువుగారి వద్దకు వెళ్ళిన ప్రతిసారి వారి ముందు దోషిగా నిలబడాల్సిన పరిస్థితులు ఎదురయ్యేవి. ఒకసారి "మీరు వదిలితే నేను ఇక్కడ నుండి వెళ్ళిపోతాను" అని కూడా నోరు జారాను.

వెంటనే గురువుగారు "వెళ్ళండి. నేనేమన్నా మిమ్మల్ని కట్టిపడేశానా? మీరు మీ కోసమే ఇక్కడ ఉన్నారు తప్ప నాకోసం కాదు. గుర్తుంచుకోండి" అని తీవ్రంగా అన్నారు.

"నేనేం మాట్లాడుతున్నానో తెలియని ఆవేశంలో మాట్లాడాను. దయచేసి నన్ను క్షమించండి" అని వారి పాదాలపై పడి క్షమాభిక్షనర్థించాను. కన్నతల్లిలా వారు నన్ను క్షమించారు. వారి చెంతనున్నప్పుడు బాగానే ఉండేది. నేను మంచిగా నడుచుకోవాలనుకునేవాడిని. ఆ మాటే గురువుగారికి చెప్పేవాడిని. కానీ అదేం ఖర్మో బయటకు వస్తే మనసు మోసం చేసేది. నేను చేసేదంతా కరెక్టుగా తోచేది.

శిరిడీలో ఉన్నప్పుడు, గురువుగారు నన్ను మందిరానికి వెళ్ళి రోజంతా అక్కడే గడపండి. అవసరమైతే నేనే మిమ్మల్ని పిలుస్తానని చెప్పేవారు. కానీ నేను ఆ మాటలు లెక్క చేయక నేను గురువుగారి దగ్గరే ఉన్నాను కదా, అంతకన్నా కావల్సిందేముంది అనుకుని ఫోన్లు రిసీవ్ చేసుకొంటూ వచ్చిన వారితో మాట్లాడుతూ కాలం గడిపేవాడిని. ఇక ఆ పని ఎవ్వరూ చేయలేనట్లు, నాకు నేనే అనవసర ప్రాధాన్యతను ఆపాదించుకుని పలుకుబడికై ప్రాకులాటలో పడి క్రమంగా బాబాకు దూరమవసాగాను. గురువుగారి మాటను విస్మరిస్తున్నాననే విషయం నాకు తట్టనేలేదు.

గురువుగారు *"మందిరానికి వెళ్ళి తిరిగివచ్చేదాకా ఎవరితో మాట్లాడవద్దు. కనీసం ఆ సమయంలోనైనా పూర్తిగా బాబా ధ్యాసలో ఉండండి"* అని నాతో అనేవారు. నేను ఎప్పుడు మందిరానికి వెళ్ళినా ఇద్దరు ముగ్గురితో పిచ్చాపాటి మాట్లాడుతూ వెళ్ళి వచ్చేవాడిని. *"నేను మందిరానికి బయలుదేరినప్పటి నుండి తిరిగి వచ్చేదాకా ఎవరితో మాట్లాడను. మీరు చూస్తున్నారు గదా!"* అని గురువుగారు తన విషయాన్నే ఉదాహరణగా కూడా చెప్పారు. నిజమే! ఒక్కసారిగా పాత రోజులను అవలోకించి చూస్తే గురువుగారు మందిరానికి వెళ్ళి రావడమంటే వెన్నంటి వెళ్ళే మాకు ప్రతిరోజూ ఒక అనుభవమే!

గురువుగారు శిరిడీకి నివాసం మార్చిన తొలిరోజుల్లో ప్రతిదినం మందిరానికి వెళ్ళేవారు. ఆ రోజుల్లో ద్వారకామాయిలో అంత రద్దీ ఉండేది కాదు. గురువుగారు బాబాకు నమస్కరించుకుని తదుపరి నింబార్ ప్రక్కన కొలంబా ఎదురుగా కొంతసేపు ధ్యానంలో కూర్చునేవారు. తరువాత బాబాకు నమస్కరించి సమాధి మందిరానికి వచ్చేవారు. అక్కడ క్యూలో నిలబడి బాబా దర్శనం చేసుకొనేవారు. పాసు ఉపయోగించి దర్శనం చేసుకోవడంగాని, మందిర నిర్వాహకులే పిలిచినా వి.ఐ.పి. దర్శనం చేసుకోవడంగాని గురువుగారు ఎన్నడూ చేయలేదు.

"వారు అంతగా పిలుస్తుంటే వెళితే ఏం సార్" అని ఒకసారి నేను అడిగితే, దానికి గురువుగారు *"మనమేమన్నా బాబా దగ్గర వి.ఐ.పి.లమా అలా దర్శనం చేసుకోవడానికి? మనం బాబా సేవకులం. అలా క్యూలో నిలబడి బాబా ధ్యాసలో ఉండి బాబాను దర్శించుకుంటే ఆ ఫలితం వేరు. బాబా ముందు వి.ఐ.పి.గా నిలబడి, ఆ గుర్తింపుతో బాబా వద్ద ఉంటే వచ్చేది వేరు"* అన్నారు. ఎవరైనా పాసు మీద గాని, వి.ఐ.పి.గా గాని దర్శనానికెళితే గురువుగారు ఇష్టపడేవారు కాదు.

ఆ రోజుల్లో గురువుగారు గురుస్థాన్‌కు వస్తే వారు ప్రదక్షిణలు చేసే పద్ధతి చూసి తరించవలసిందే. వారు చేతులు జోడించి ఒకే వేగంతో ఎన్ని గంటలైనా నడిచేవారు. ఆ చేతులు అలాగే ఉండేవి. కదిలించేవారు కాదు. రెండు మూడు గంటలు అలానే ప్రదక్షిణలు చేసేవారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువుగారు "*మందిరానికి పోతే మన ధ్యాస బాబాపై ఉండాలేగానీ, మందిరం దగ్గర ఎవరు కనబడతారా? ఎవరు దర్శనం చేయిస్తారా అని దేబిరించుకొని చూస్తూ ఉండడం, ఎవరూ కనపడకపోతే సంస్థాన్ ఆఫీసులోకి పోయి వారితో ఆ మాట ఈ మాట చెప్పి వారిచే దర్శనం చేసుకొన్నారా? అని అడిగించుకొని, దర్శనానికి వెళ్ళడం కన్నా దౌర్భాగ్యం ఇంకొకటి ఉండదు. తీరా చూస్తే మన సమయాన్ని అక్కడా ఇక్కడా వెచ్చించే బదులు, నేరుగా క్యూలో వెళితే ఆ సమయం లోపలే దర్శనం కూడా అయిపోతుంది. వి.ఐ.పి. పాసుల వద్ద క్యూ అంటే కొంతమంది చేసే పని అదే. తీరా మందిరంలోకి వెళ్ళాక వారి దృష్టి బాబా పైన ఉండదు. అక్కడ తెలిసిన పూజారి ఎవరు కనబడతారా అని చూడడం, వారు కనబడగానే వారి చూపుకై ప్రాకులాడడం, అక్కడకు వెళ్ళి వారిని పలకరించి వారిచ్చే ప్రసాదానికి ఆరాటపడటం. ఇక అలాంటివారికి బాబా మహిమ ఏం కనబడుతుంది? ఆ విధంగా దర్శనం చేసుకొన్నా ఒకటే, చేసుకోకపోయినా ఒకటే. మందిరానికి వెళ్ళినప్పుడు మన ధ్యాస అంతా బాబాపై పెట్టి, చక్కగా బాబా స్మరణలో ఉంటే బాబా ఇచ్చే ప్రసాదమే వేరు. దానికి ఆ అర్చకుల కృపాదృక్కులు అవసరం లేదు*" అన్నారు.

అప్పటికిగానీ నేను చేస్తున్న తప్పేమిటో నాకు బోధపడలేదు. ఇన్నాళ్ళూ మందిరానికి పోతున్నాను కానీ నా దృష్టంతా బాబా మీద కాకుండా పూజారుల మీద, తెలిసినవాళ్ళు కనబడతారా లేదా, మనకు ప్రసాదం ఇస్తారా లేదా అనే దాని మీద ఉండేది. నిజానికి అది బాబా కృపవల్ల లభిస్తుందనీ, దాన్ని పొందడంలో ఉన్న ఆనందాన్ని నేను కోల్పోయానన్న పచ్చి నిజం నాకు తెలిసివచ్చింది. ఆ రోజు నుండి నేను నా పద్ధతిని మార్చుకున్నాను. వీలయినంతవరకు ఎవరినీ తోడు తీసుకోకుండా ఒంటరిగా మందిరానికి పోవడం, బాబాను తప్ప పూజారుల పైకి దృష్టి మళ్ళించడం తగ్గించుకున్నాను.

గతంలో రోజూ నన్ను ఉదయం అరగంట, సాయంత్రం అరగంట బాబా దగ్గర కూర్చోమని చెప్పారు. ఇంతకుముందు బాబా దగ్గర అరగంట కూర్చోవడమంటే

తెలియకుండా గడిచిపోయేది. క్రమంగా ఆ అరగంట కూర్చోవడం కూడా గగనమైంది. కళ్ళు మూసుకొన్నా బాబా, గురువుగారి రూపాలు స్మృతిపథంలోకి వచ్చేవి కావు. ధ్యానంలో కూర్చొని చాలాసేపై ఉంటుందని కళ్ళు తెరచి చూస్తే ఐదు నిమిషాలు కూడా అయ్యేది కాదు. కనీసం బాబా దగ్గర కూర్చోవాలని కూడా అనిపించేది కాదు. అలాంటి దుర్భర పరిస్థితి ఎదురయ్యింది. ఏదైనా నిర్ణయం తీసుకోవలసి వచ్చినప్పుడు నలుగురితో చర్చించి నిర్ణయం తీసుకోవలసిందిగా గురువుగారు పదేపదే చెప్పేవారు. కానీ, నేనెప్పుడు దానిని పాటించలేదు. గురువుగారు ఏ నిర్ణయం తీసుకొన్నా ఎవ్వరూ కాదనరు! అయినా వారు ఆ నియమాన్ని తప్పక పాటిస్తూ ఎంత చిన్న నిర్ణయమైనా నలుగురిని పిలిపించి వారందరి అభిప్రాయం తీసుకుని చేసేవారు.

ఒకసారి స్థలం కొనుగోలు విషయంలో ఒక గురుబంధువుకు, శిరిడీలోని వ్యాపారికి నేను మధ్యవర్తిగా ఉండి వాళ్ళిద్దరి మధ్య ఒప్పందంలో సహకరించవలసి వచ్చింది. వారిద్దరి మధ్య ఒప్పందం కుదిర్చినందుకు అవతలి వ్యక్తి నాకొక ఆశ చూపాడు. నేను ప్రలోభానికి లోనయ్యాను. గురువుగారి దగ్గర ఆ విషయాలన్నీ విన్నవిస్తూ మధ్యలో నాకు అనుకూలంగా ఉన్న పాయింటుని మాత్రం కప్పిపుచ్చాను.

అంతా విన్న గురువుగారు నా వంక తీక్షణంగా చూస్తూ *"అప్పట్లో మీ రిపోర్టింగ్ ఉన్నదున్నట్లు నిజాయితీగా ఉండి నాకెంతో నచ్చేది. మీరేదీ దాచేవారు కాదప్పుడు. కానీ ఇప్పుడా పద్ధతి మారిపోయింది. కొంతకాలంగా మీరు చెప్తున్న వాటిలో నిజాయితీ లోపించింది. నేనేదయినా సహిస్తాను కానీ అబద్ధాల్ని సహించలేను. అసత్యాన్ని చెప్పేవారికి నా వద్ద స్థానం లేదు. సత్యాన్ని మరుగుపరచడమంటే అబద్ధం చెప్పడం కన్నా దారుణమైంది"* అన్నారు.

నా పొరపాటుకు నన్ను నేను నిందించుకొంటూ గురువుగారిని క్షమించమని వేడుకున్నాను. అప్పటిదాకా నేను వారికి చెప్పుకొన్న ఎన్నో క్షమాపణలలో అదీ ఒకటిగా, వారు నన్ను ఎన్నోసార్లు మన్నించిన సందర్భాలలో ఒక సంఘటనగా ఉంటుందిలే అనుకున్నానే కానీ దానితో వచ్చే తీవ్రమైన పరిణామాన్ని ఆ రోజున ఊహించలేకపోయాను. ఆ రోజు నుండి గురువుగారు మెల్లగా నన్ను తమ దగ్గరకు పిలవడం తగ్గించేశారు.

ఒక మహాత్ముని సన్నిధిలో ఉంటూ ఆయనకు అతి సన్నిహితంగా ఉండగలిగి ఎన్నో పొరబాట్లు చేశాను. వారి సన్నిధిని సరైన రీతిలో ఉపయోగించుకోలేకపోయాను.

అన్నింటికి మూలం నా అహంకారం అనేది నా విషయంలో ఋజువైంది. గురువుగారు ఏం చెప్తున్నారు, వారికేది ఇష్టం అనేది నేను గ్రహించుకోలేకపోయాను. వారికి అందరూ సమానమే. దగ్గరగా ఉన్నామా, దూరంగా ఉన్నామా అని కాదు. బాబాకు దగ్గరైతే ఎంత దూరాన ఉన్నా గురువుగారి సన్నిధిలో ఉన్నట్లే. బాబాకు దూరమైతే గురువుగారి ప్రత్యక్ష సన్నిధిలో ఉన్నా వారికి దూరంగా ఉన్నట్లే. శిరిడీకి మనమెందుకొచ్చామనేది మరచిపోయి నిరంతరం ప్రాపంచిక వ్యవహారాలలో మునిగితేలితే సద్గురుకృపకు దూరంగాక మరేమవుతాము? నా పొరపాట్లతో ఒక్కొక్క మెట్టుగా వారి సాన్నిధ్యానికి దూరమవుతూ, గురువుగారితో మాట్లాడే అవకాశమే అరుదైపోయింది.

ఇంతకుముందు రోజంతా గురువుగారి సన్నిధిలో గడిపే నాకు రానురాను ఎప్పుడో పిలిపిస్తే గాని లోపలకు వెళ్ళలేని స్థితి. అదీ పోయి అందరితో పాటు దర్శనం వేళలో తప్ప వారిని చూడలేకపోయే పరిస్థితికొచ్చాను.

ఇంతకు ముందువలె గురువుగారి వద్దకు పోకుండా అందరితోపాటే బయట కూర్చోవడం భరించలేకున్నాను. గురువుగారి దగ్గరకు వెళ్ళకపోతే వెళ్ళలేదే అనే బాధ, వెళ్తే నన్ను పిలవడం లేదన్న బాధ. ఈ మాత్రం దానికి ఎందుకు ఇక్కడ ఉండడమనే భావన! ఇలా మథనపడుతుంటే ఒకరోజు గురువుగారు నన్ను పిలిచారు. "ఎందుకు సార్! నన్నిలా దూరం చేస్తున్నారు?" అని అవేదనగా అడిగాను.

*"నేను దూరంచేస్తున్నానా? లేదే! ఇంతకుముందు ఎలాగున్నానో ఇప్పుడూ అలాగే ఉన్నాను. అలాగే మాట్లాడుతున్నాను. నా ప్రేమలో వీసమెత్తుకూడ మార్పు లేదు"* అన్నారు. అనంత ప్రేమమూర్తి! వారి ప్రేమలో మార్పేముంటుంది? మన ప్రవర్తనలో ఉంటుంది కానీ అనుకున్నాను. "మరి ఇంతకు ముందులాగా పిలవడం లేదు కదా!" అన్నాను.

*"అప్పుడు మీరు ఏదో ఒక బాబా పనిలో నిమగ్నమై ఉండేవారు. బాబా పని చేస్తున్నారు కాబట్టి ఆ పని గురించి మాట్లాడటానికి మిమ్మల్ని పిలిచేవాడిని. ఇప్పుడు మీరు అట్లా ఉండడం లేదు. ఎవరు బాబాకు దగ్గరవుతుంటారో వారు నాకు దగ్గరవుతుంటారు. మీకెన్నో సార్లు చెప్పాను మందిరానికి పొమ్మని. మరి మీకు శిరిడీలో ఉండి బాబా మందిరానికి గూడా పోలేనన్ని వ్యవహారాలు, పనులు పెరిగి పోయాయి. ఒక్కసారి వెనక్కి తిరిగి చూడండి, మీరు శిరిడీకి వచ్చిన క్రొత్తల్లో ఎంత*

ఎక్కువ సమయం మందిరంలో గడిపేవారో. ఇప్పుడు ఎలా ఉంటున్నారో! తేడా మీలో వచ్చిందేగానీ నాలో రాలేదు. ఎదుటి వ్యక్తి పట్ల నా ప్రేమ రెండురకాలుగా ఉంటుంది. నాకు వారికి గల వ్యక్తిగత సంబంధం ఒకటి, రెండవది బాబాతో వారికున్న అనుబంధం. మొదటిదాని వలన వారికి నేను చేయవలసిందల్లా చేస్తుంటాను. రెండవది, బాబా స్మరణవల్ల వారు నాకు దగ్గరవుతుంటారు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. చక్కగా మందిరానికి వెళ్ళి బాబా సన్నిధిలో గడపండి. బాబా స్మరణలో ఉండండి. బాబా చరిత్ర చదవండి" అని అనునయంగా అన్నారు.

మరో సందర్భంలో "బాబా నా భక్తుణ్ణి పతనం కానివ్వనన్నారు కదా! మరెందుకు నాకు ఇలాంటి దుస్థితి కలిగింది?" అని అడిగాను.

"మీరు పతనమయ్యారని ఎవరన్నారు? జరిగేదంతా మీ మంచికోసమే! మీకు జరిగిన మార్పు మీ అధికారం పోవడం మాత్రమే! నాతో మీకున్న అనుబంధంలో ఏ మార్పూ లేదు. ఇతరులు మీ పట్ల వ్యవహరించే తీరులో మార్పు ఉన్నది. అందరూ మీ పట్ల చూపే ఆదరభావం, నాకు మీరు దగ్గరగా ఉండడం వల్లనేగానీ, మీరు స్వయంకృషితో సంపాదించుకొన్నది కాదని ఎన్నిసార్లు చెప్పినా మీరు విన్నారా? అదంతా మీ సామర్థ్యమేనని భ్రమపడ్డారు. ఇప్పుడు వాస్తవం చూసి తట్టుకోలేక పోతున్నారు. మన ప్రవర్తనతో, ప్రేమతో, వినయంతో అందరి మెప్పు పొందాలి. అదే సరైన పద్ధతి. ఒకరిని బాగు చేయాలన్న ధోరణి మాని మిమ్మల్ని మీరు బాగుచేసుకోవడానికి ప్రయత్నించండి. అందరినీ ఉద్ధరించేది బాబా మాత్రమే! దీన్ని గుర్తుపెట్టుకోండి. బాబా కృప మీకు ఎప్పుడూ ఉంటుంది. నా ప్రేమ ఆనాడు ఈనాడు మీపట్ల అలాగే ఉంది. నాకు మీలో మార్పు ముఖ్యం. అందుకు ఇంతకన్నా వేరే మార్గం లేదు" అన్నారు.

"మార్పులు, పరివర్తన నాకేమీ వద్దు. నాకు కావలసింది మీరే" అన్నాను.

"మీలో మార్పు మీకు అక్కరలేకపోయినా నాకు కావాలి" అన్నారు గురువుగారు. ఆలోచించేకొద్దీ నాలో పొరపాట్లు అన్నీ నాకు తెలియసాగాయి. అంతకుముందు గురువుగారిని నా సొంతంగా భావించాను. వేరెవరన్నా ఎక్కువ సేపు గురువుగారితో ఉంటే అసహనంగా ఉండేది. గురువుగారు అందరి కొరకు కదా అన్న భావన క్రమంగా కలగసాగింది. అందరూ వారికి సమానమే. వారికి ఒకరు దగ్గర ఒకరు దూరమన్నది లేదు. అదంతా నా భావన అన్నది బోధపడింది.

ఇప్పుడు 'నేను గురువుగారి దగ్గర లేనే' అని అనిపించినా బాధపడడం లేదు. నాకు ఏది మంచిదో వారికి తెలుసు. వారు చెప్పినట్లుగా చేద్దామన్న నిర్ణయానికి వచ్చాను.

నేను 2003 ఫిబ్రవరిలో ఉద్యోగం నుండి రిటైరయ్యాను. గురువుగారి ఆశీర్వాదంతో ఎక్కువ కాలం శిరిడీలోనూ, గురువుగారి వద్ద గడపగలుగుతున్నాను. మరాఠీ 'సాయిలీల' మ్యాగజైన్ నుండి వ్యాసాలను తెలుగులోకి అనువదించే పని మొదలుపెట్టాను. మనసులోని వ్యాకులత, ఆవేదనలన్నీ తగ్గుతూ వస్తున్నాయి. మనసు ప్రశాంతమయ్యే కొద్దీ మెల్లగా బాబా దగ్గర కూర్చోవడం, ఎక్కువ కాలం బాబా ధ్యాసలో ఉండడం చేయగలుగుతున్నాను. గురువుగారు ఉన్నచోటే ఉండగలుగుతున్నాను. ఇప్పుడు నాకు గురువుగారి దగ్గరే కూర్చోవాలన్న ఆలోచన లేదు. అంతా వారికి తెలుసు. నాకేది మంచిదో అదే జరుగుతుంది అన్న అవగాహన కలిగింది. సదా బాబా స్మరణలో, గురుచరణాల సన్నిధిలో ఉండగలిగితే చాలు!

***గురువుగారు:*** *మన జీవితగమ్యమేమిటి? మనం ఎందుకు ఇక్కడికి వచ్చాము? మనం చేయవలసినదేమిటి? చేస్తున్నదేమిటి? మనమేం పొందాలి? పొందుతున్నదేమిటి? అనే విషయాలు నిరంతరం గుర్తుంచుకోవాలి. వీటిని ఎప్పుడూ మరచిపోకూడదు. ఒక మహాత్ముడిని ఒకసారి ఒకరు 'చావు' అంటే ఏమిటని అడిగితే 'మరపే చావు' అని చెప్పాడట. ఈ చావును తప్పించుకుందాం. దానిని తప్పించుకోవాలంటే సంపూర్ణ ఎఱుక అవసరం. ఏం చేస్తే గమ్యానికి చేరువవుతామో గ్రహించాలి. మన కార్యకలాపాలు, మనస్సు, బుద్ధి, చిత్తం, మన మార్గాలు అన్నీ ఆ గమ్యం వైపుకి మళ్ళించాలి. లేని పక్షంలో మనమిక్కడ ఉండడం అర్థరహితం.*

# ఆ చల్లని ముంగిట - తీరిన అలసట

చెన్నాడి బాలకృష్ణారావు
గవర్నమెంట్ ఉద్యోగి, హైదరాబాద్
జన్మించిన సం॥ 1946

హైదరాబాద్, జూన్ 2001

1997 మే ఒకటవ తేదీ ఉదయం నారాయణరావుగారు పండరిపురం నుండి ఫోన్ చేసి, గురువుగారు ఆ రోజున అక్కల్‌కోటకు వెళుతున్నారని చెప్పారు. ఆ కబురు వినగానే నాకు వెంటనే అక్కల్‌కోటకు వెళ్ళాలనిపించింది. అయితే ఆ సమయంలో ఆఫీసుకి ఒక్క పూటయినా సెలవు పెట్టడం వీలయ్యే పని కాదు. అప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల నిర్వహణాధికారులకు, వారి సిబ్బందికి రవాణా సౌకర్యం కల్పించేందుకుగాను ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. నుంచి దాదాపు 400 బస్సులు పంపవలసిన బాధ్యత అధికారరీత్యా నాపై ఉండడం వలన ఎటూ కదలలేని పరిస్థితి. అయితే గురువుగారి దగ్గరకు వెళ్ళాలన్న కోరిక తీవ్రంగా ఉండడంతో బాబాపై భారం వేసి ఎలాగో వీలు చేసుకుని, ఆ రోజు ఉదయం పదిగంటలకు అక్కల్‌కోటకు బయలుదేరాను. రోహిణీకార్తె కావడంతో ఎండలు మండిస్తూ వాతావరణమంతా వేడిసెగలతో నిప్పులు చెరుగుతోంది. పైగా అక్కల్‌కోటకు వెళ్ళే దారి కూడా సరిగ్గా తెలియక అక్కడక్కడా ఆగుతూ అందరినీ అడుగుతూ, ఆ ఊరు చేరేసరికి పూర్తిగా అలిసిపోయినట్లనిపించింది.

శారీరక అలసట అటుంచి, ఆ ఊరిలో గురువుగారెక్కడ విడిది చేశారో కనుక్కొని వారి దర్శనం చేసుకోవాలన్న ఆకాంక్ష తీవ్రంగా ఉంది. గురుబంధువులు ఎవరన్నా కనిపిస్తారేమోనని చూస్తూ అక్కల్‌కోటస్వామి మందిరానికి వెళ్ళాను. అక్కడ స్వామి సమాధి మందిరంలో శ్రీమతి ఇవాన్ ధ్యానం చేసుకొంటూ కనిపించారు.

నేనటు వెళ్ళడం, అప్పుడే ఆమె కళ్ళు తెరిచి నన్ను చూచి నవ్వుతూ పలకరించింది. “గురువుగారెక్కడ ఉన్నారు?” అని నేనడగ్గానే మందిరం పైఅంతస్తు చూపుతూ “గురూజీ ఇక్కడకు వచ్చినప్పటి నుండి ఎవరికీ దర్శనం ఇవ్వలేదని” చెప్పారు. మందిరం వద్దే ఉన్న వసతిగృహంలో గురుబంధువులు ఉన్నారనీ, తానటు వెళుతున్నానని చెప్పి నన్నూ రమ్మన్నారు. వస్తాను కానీ, ముందు గురువుగారి గది దాకా వెళ్ళి బయటనుండైనా నమస్కారం చేసుకుని వస్తానన్నాను. ఇవాన్ కూడా

వస్తానన్నది. ఆ రోజు తన పుట్టినరోజని, గురువుగారి దర్శనం ప్రసాదించమని అంత వరకూ తాను అక్కల్‌కోటస్వామిని ప్రార్థిస్తున్నానని అన్నది. ఇద్దరం పైకి వెళ్ళాము. గురువుగారి గది గుమ్మం వద్ద వంగి నమస్కారం చేసుకొంటుండగా అంతలో హఠాత్తుగా గది తలుపులు తెరుచుకొన్నాయి. గురువుగారి అమ్మాయి శృతి బయటకు వచ్చి నన్ను చూచి పలకరించింది. మా గొంతులు విన్నారేమో, గదిలోంచి గురువుగారు నన్ను లోపలికి రమ్మని పిలిచారు.

ఆనందంగా లోపలికి వెళ్ళాను. ఎండకు వాడి, దస్సిపోయివున్న నా వాలకం చూడగానే వారు ప్రేమగా, *"మంచి ఎండవేళ ప్రయాణం చేసి వచ్చినట్లున్నారు"* అన్నారు.

వారలా అడగడంతో, ఆ చల్లని చూపుల మహిమ వల్ల ఒక్కసారిగా నా ప్రయాణ బడలికంతా చేత్తో తీసేసినట్లుగా మాయమైపోయింది. క్షణాలలో ఎంతో ఉత్సాహంగా, హాయిగా అనిపించింది. అయితే ఇంతలో గురువుగారి ముఖంలో ఎంతో అలసట, బడలిక కనిపించింది. నా అలసటంతా వారు తీసుకొన్నారా? అని అనిపించింది నాకు.

అప్పుడే శ్రీమతి ఇవాన్‌కు కూడా దర్శనం లభించింది. పుట్టినరోజున తన మొర ఆలకించినట్లు గురువుగారు దర్శనం ఇవ్వడంతో ఆమె ఎంతో ఆనందించింది.

# దర్శనమా? వారి కరుణకు నిదర్శనమా?

శెట్టిపల్లి వీరాస్వామి
కాంట్రాక్టర్, పల్‌సూద్
జన్మించిన సం॥ 1944

పల్‌సూద్, ఫిబ్రవరి 2001

1995 మార్చిలో గురువుగారు త్వరలో శిరిడీ నుండి బయలుదేరుతున్నారని తెలిసి వారి దర్శనం చేసుకుని వద్దామని నేను పల్‌సూద్ (మధ్యప్రదేశ్) నుండి శిరిడీ వెళ్ళాను. నేను ఎప్పుడూ మా ఊరి నుండి బయలుదేరి శిరిడీకి రాత్రి తొమ్మిది గంటలకల్లా చేరేటట్లుగా ప్రయాణం పెట్టుకొంటాను. ఎందుకంటే గురువుగారు ఎక్కువగా రాత్రిపూట దర్శనమిస్తుంటారు. శిరిడీ చేరగానే మొదట గురువుగారి దర్శనం చేసుకుని, తర్వాత బాబా దర్శనానికి మందిరానికి వెళుతుంటాను. అయితే ఆ రోజు నేను పనులన్నీ చూసుకుని రాత్రి పన్నెండు గంటలకుగాని బయలుదేరలేకపోయాను. అప్పుడు బయలుదేరితే శిరిడీ చేరేసరికి వేకువఝామవుతుంది. ఇక రాత్రి వరకు గురువుగారి దర్శనముండదు. నాకెలాగైనా శిరిడీ వెళ్ళగానే గురువుగారి దర్శనం కావాలి అన్న కోరికతో స్థిమితంగా ఉండలేకపోయాను. సమయం గడిచేకొద్దీ ఆ కోరిక తీవ్రమై ప్రార్థనగా మారింది. “గురుదేవా! నేను శిరిడీ చేరగానే మొదట మీ దర్శనం కావాలి. బాబా! నాకెలాగైనా గురువుగారి దర్శనం కలిగించు” అని రాత్రంతా అదే కోరిక కోరుకుంటూ దాదాపు జాగరణ చేశానని చెప్పొచ్చు.

ఉదయం ఐదున్నరకి శిరిడీ చేరుకున్నాను. బస్ దిగి రూమ్ కోసం గురుస్థాన్ వరకూ నడుచుకొంటూ వెళ్ళాను. అక్కడ గురుస్థాన్ వెనుక వైపు కొద్ది దూరంలో నారాయణరావుగారు వెళుతూ కనబడ్డారు. నేను వడివడిగా నడుస్తూ వారి దగ్గరకు వెళ్ళాను. అప్పుడు గురువుగారు, ప్రక్కన అమ్మగారు నారాయణరావుగారి ముందు నడుస్తూ కనబడ్డారు. నా కళ్ళేమీ పొరపాటు పడలేదు కదా అని కళ్ళు విప్పార్చుకు చూశాను. అక్కడ సాక్షాత్తూ గురువుగారే ఉన్నారు. ఆ క్షణంలో నాకు కలిగిన ఆనందానుభూతిని చెప్పేందుకు మాటలు చాలవు.

వారి వెంట నేనూ నడిచి వెళ్ళి సాయిపథంకు చేరగానే, ఇక ఆగలేక దొరికిన పెన్నిధి చేయి జారుతుందేమో అన్నంత ఆతురతగా గురువుగారి పాదాలు తాకి సాష్టాంగ నమస్కారం చేసుకున్నాను. వెంటనే గురువుగారు అక్కడ క్రిందకి

వంగి, ఏదో తీసుకుని చిరునవ్వుతో నా చేతిలో పెట్టారు. చూస్తే అది చాక్లెట్. నా కోరిక ప్రకారం నాకు ఆ వేళలో దర్శనమివ్వడమే కాదు ప్రసాదాన్ని కూడా ఇచ్చారు గురువుగారు. వారి అపురూప దర్శనంతోనే మనసు నిండిపోయి ఉన్న నేను ఆ ప్రసాదంతో మరింత పొంగిపోయాను. ఈ సంఘటన వారి పాదాలయందు నా విశ్వాసాన్ని మరింత దృఢతరం చేసింది.

***భక్తుడు:*** *సాయిబాబా నామ జపం చేస్తూ ఉంటే యాంత్రికంగా నోటికి వస్తుంది. 'సాయిబాబా! సాయిబాబా!' అని మనస్ఫూర్తిగా ఆయనను పిలవాలంటే ఎలాగ?*

***గురువుగారు:*** *నామం చేసేటప్పుడు నెంబర్ ముఖ్యం కాదు. 'సాయిబాబా! సాయిబాబా!' అని రొప్పవద్దు పరీక్షలకు essayలు రొప్పినట్లు. మీ హృదయాలలో ఉన్న బాబాను పిలవండి. 'బాబా! బాబా!' అన్న ప్రతిసారి మీ ప్రేమ, మీ ఎమోషన్, మీ ఆర్తి, మీ ఆవేదన, మీ ఆనందం అన్నీ దానిలో వ్యక్తం అవ్వాలి. పిలిచిన ప్రతిసారి హృదయాంతరాళంలో నుంచి బాబా వింటున్నారు, మనం పిలుస్తున్నాం అనే భావనతో చేయాలి. అప్పుడు రొటీన్ కాదు. శ్రద్ధ ఎక్కడికీ పోదు. పిలవాలి. వెయ్యిసార్లు పిలవాలి. లక్షసార్లు పిలవాలి. ఆయన పలికినా మళ్ళీ మళ్ళీ పిలుస్తూ ఉండాలి. చిన్నపిల్లలుంటారు. ఊరికినే 'మమ్మీ మమ్మీ' అంటుంటారు. ఏంటి రా అంటే మళ్ళీ 'మమ్మీ మమ్మీ' అంటుంటారు. పిలవటం వారికి ఆనందం. అట్లాగే పిలవండి. ఆ పిలిచేటప్పుడు ఎన్నిసార్లు పిలిచినా చాలు. ఎన్నిసార్లు అనేది లెక్క కాదు. మనం పిలిచిన ప్రతిసారీ బాబా వింటూనే ఉంటారు.*



*శ్రీబాబూజీ, తిరుమల, 1995*



జ్ఞాపకాల పెన్నిధులు

# తరలి వచ్చెను గురువే

సక్కూరు సాధన
గృహిణి, నరసింగాపురం
జన్మించిన సం॥ 1973

నరసింగాపురం, జనవరి 2001

నేను 1994వ సంవత్సరంలో మొదటిసారిగా శిరిడీ వెళ్ళడం, బాబా, గురువుగారి దర్శనం చేసుకోవడం జరిగింది. అప్పటి నుండి అవకాశం ఉన్నప్పుడల్లా విజయదశమి, గురుపౌర్ణమి వంటి పర్వదినాలకు శిరిడీ వెళుతుండేదాన్ని. ఆ పండుగలప్పుడే గురువుగారి సన్నిధిలో గురుబంధువులకు పెళ్ళిళ్ళు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన వంటి వేడుకలు జరుగుతుండడం చూస్తుండేదాన్ని. నాకు కూడా అలాగే ఏ చిన్న ఫంక్షనైనా సరే, గురువుగారి సన్నిధిలో జరుపుకోవాలనే తీవ్రమైన కోరిక ఉండేది.

ఇంట్లో మా పెద్దవాళ్ళు నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. ఏ సంబంధం వచ్చినా అది నాకు మంచిదయితేనే బాబా, గురువుగారు కుదిరేలా చేస్తారన్న విశ్వాసంతో నిశ్చింతగా ఉండేదాన్ని. అంతలో ఒక సంబంధం నిశ్చయమయింది. నిశ్చితార్థమయినా, వివాహమైనా ఏదో ఒకటి గురువుగారి సమక్షంలో చేయాలని పట్టుబట్టాను. అయితే పెండ్లికొడుకు తరఫు వారు ఆ రెండింటికీ ఒప్పుకోలేదు. మా అమ్మ, నాన్న బంధువులందరూ నువ్వు ఎక్కడ ఉన్నా గురువుగారి ఆశీస్సులు తప్పక ఉంటాయని చెప్పి నన్ను ఒప్పించటానికి ప్రయత్నించారు.

చేసేదిలేక నేను పెద్దవాళ్ళ ఇష్టానికి తలఒగ్గాల్సి వచ్చిందే కానీ మనసులో మాత్రం అది తీరని వెలితిగానే కలతపెట్టసాగింది. “నాకేమో నా వివాహం కాని, నిశ్చితార్థం కాని మీ సమక్షంలో జరగాలని కోరికగా ఉంది. మీకు ఏది మంచిదనిపిస్తే అలా చేయండి” అని గురువుగారి ఫోటో ముందు కన్నీళ్ళతో నా బాధనంతా చెప్పుకొనేదాన్ని. విచిత్రం! ఏమయిందో ఏమో మగపెళ్ళివారు నిశ్చితార్థాన్ని శిరిడీలో జరుపుకొనేందుకు అంగీకరించారు. నా ఆనందానికి అవధులు లేకపోయింది. గురువుగారు నా మొర ఆలకించి నా కోరికను తీర్చారు.

2000వ సంవత్సరం గురుపూర్ణిమ పర్వదినాన గురువుగారి సన్నిధిలో, వేలాది గురుబంధువుల మధ్య, మరో గురుబంధువుల వివాహంతోపాటు, మా నిశ్చితార్థం

(దండలు మార్చుకోవడం) కూడా ఎంతో ఆనందంగా జరిగింది. ఇంక నా పెళ్ళి గురువుగారి సమక్షంలో జరిగేది కాదులే అని సర్దిచెప్పుకున్నాను.

కానీ సరిగ్గా నా పెండ్లి రోజు, నా ప్రార్థన ఫలించి గురువుగారు శిరిడీ నుండి తిరుమల వచ్చినట్లు తెలిసింది. కళ్యాణ మంటపంలో నాకు పెళ్ళిపీటల మీద గురువుగారు ఇచ్చిన ప్రెజెంటేషన్ "మా కుటుంబసభ్యులందరికి ఆ రోజు రాత్రి గురువుగారి దర్శనం ఉంటుంది" అనే కబురు.

అది విన్న నా ఆనందాన్ని మాటలలో వర్ణించలేను. ఆ సాయంత్రం మా పెళ్ళి బృందమంతా కొండమీద గురువుగారు ఉన్న కాటేజీకి వెళ్ళాము. అక్కడున్నవారు ముఖ్యంగా విదేశీ గురుబంధువులు నాకు చెప్పిన మాట: ఆ ముందు రోజు సత్సంగం జరిగిందని, గురువుగారు ప్రత్యేకంగా "రేపే కదా సాధన పెళ్ళి!" అని గుర్తుచేసుకొన్నారని!

నీ పెళ్ళికే గురువుగారు ఇంత హఠాత్తుగా శిరిడీ నుండి ఇక్కడికి వచ్చారు సుమా! అని అందరూ అంటుంటే "నాపై గురువుగారికింత ప్రేమ ఉందా? నేనింతటి అనుగ్రహానికి నోచుకొన్నానా?" అని నా మనసు ఆనందంతో పొంగిపోయింది.

తర్వాత గురువుగారి గదిలోకి మేమందరం వెళ్ళాక, నేను వంగి వారి పాదాలు తాకి నమస్కరించుకొంటుంటే "*ఊఁ మొత్తానికి నన్ను ఇక్కడికి రప్పించావ్*" అన్న గురువుగారి మాటలతో వారు పిలిస్తే పలికే వరదైవమే కాదు, పరుగుపరుగున వచ్చే భక్తపరాధీనులు అని ఋజువైంది.

***భక్తుడు:*** *భక్తజన హృదయాబ్జ భృంగమై అంటే ఏమిటి సార్?*

***గురువుగారు:*** *భక్తుల హృదయమనే పద్మం చుట్టూ తిరిగేటువంటి తుమ్మెద వంటి వాడు బాబా అని అర్థం. మామూలుగా భగవంతుని చంద్రునితో పోలుస్తూ, భక్తులు చకోరాల్లాగా చూస్తున్నారని చెప్తారు. కానీ ఇక్కడ బాబానే చెప్పారు "నేను నా భక్తుల కోసం వచ్చాను. నా భాండాగారాన్ని తెరచి నేను మీ కోసం కాచుకోనున్నాను" అని. మనం ఆయన కోసం పడేటువంటి ఆర్తి కంటే కూడాను, ఆయన మన పట్ల పడేటువంటి ఆర్తి ఎక్కువ. ముందు మనల్ని ఆయనే చూస్తారు. ఆ తరువాతే మనం ఆయనను చూస్తాము. ఆయన అనుగ్రహ దృష్టే మన మీద పడుతుంది.*

మన గురించి మనకంటే ఎక్కువ ఆయనే తాపత్రయపడుతున్నాడు. కాబట్టి మన హృదయమనే పద్మం చుట్టూ తిరిగేటువంటి తుమ్మెదలాంటి వాడు ఆయన అని చెప్పాలన్నమాట.

ఆయన తుమ్మెద. మనం కాదు తుమ్మెదలం (నవ్వులు). బాబా యొక్క ప్రేమ తత్త్వం అటువంటిది. ఆయన అవతారకార్యం కూడా అదే. ఆయన ఎందుకోసం వచ్చారు అని అన్నప్పుడు "స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతం" అని ఉపాసనీ బాబా ఎంత చక్కగా, ఎంత గొప్పగా వ్రాశాడో! భక్తుల యొక్క అవసరం, వాళ్ళ యొక్క కోరిక, వాళ్ళ తపన, వాళ్ళ ఆర్తికి సమాధానంగా సాయి అనేటువంటి ఆ రూపం అట్లా ఉద్భవించింది. దానికై దానికేం లేదు. మన యొక్క ఆర్తికి చిహ్నమే ఆయన. అది చెప్పడానికి కూడా అర్థమది. ఆయన యొక్క అస్తిత్వం ఏమిటయ్యా అనంటే భక్తుల యొక్క హృదయం చుట్టూ తిరిగేటువంటి భృంగంలాంటి వాడాయన. ఆయనకు ఇష్టమైనదేంటి? భక్తి అనేటువంటి మధువు. దానినే ఆయన ఆస్వాదిస్తారు, ఆనందిస్తారు. దీని కోసంగా మన హృదయం చుట్టూ తిరుగుతూ ఉన్నారు, మన హృదయాలేవీ విచ్చుకోవటం లేదు. మూసుకుపెట్టుకోనున్నాం. ఆయనేమో తుమ్మెదలా "ఊఁ ఊఁ ఊఁ" అని తిరుగుతున్నాడు చుట్టూ (నవ్వులు). అది దానర్థం.

# నమస్కారమండీ!

లక్కరాజు హనుమంతరావు
రిటైర్డ్ ఉద్యోగి, తెనాలి
జన్మించిన సం॥

తెనాలి, ఆగష్టు 2004

1993లో గురువుగారు శ్రీశైలం వస్తున్నారని తెలిసి, తెనాలి నుండి కొందరు గురుబంధువులం వారి దర్శనానికని అక్కడకు వెళ్ళాము. గురువుగారు కారు దిగి లోపలకు వెళుతుండగా, నేను వారికి నమస్కరిస్తూ "నమస్కారమండి" అన్నాను. ఆ మరునాటి ఉదయం నన్ను గురువుగారు పిలుస్తున్నారన్న కబురు వస్తే వెళ్ళాను.

నన్ను చూసి "రాత్రి రెండు మూడుసార్లు కబురు చేశాను మీ కొరకు" అన్నారు.

నాకోసం వారు మూడుసార్లు కబురు చేశారని వినగానే నాకు చాలా ఆనందం కలిగింది. కానీ వారెందుకు పిలిచి ఉంటారా అని నాలో నేనే ఆలోచించుకొంటున్నాను.

మరల ఇంతలో వారే "నిన్న మీ గొంతు చాలా నీరసంగా ఉంది. ఎందుకలా ఉందా అని అడుగుదామని పిలిచాను" అన్నారు ఆప్యాయంగా.

"నమస్కారమండి" అన్న ఒక్క మాటే అన్నాను వారితో, అదీ జనం మధ్యలో నుండి. ఆ ఒక్క మాటలోనే నా స్వరాన్ని, నీరసాన్ని కనిపెట్టి నాకోసం ఆరాటపడ్డారంటే నిజంగా తమ చుట్టూ ఉన్నవారిపై వారికి ఎంతటి అవ్యాజమైన ప్రేమ ఉందో అర్థమై నా కనులు చెమ్మగిల్లాయి.

ఆ ప్రేమను మనమెలా కొలవగలం? తల్లి మాత్రమే తన బిడ్డని అట్లా కనిపెడుతుందేమో? తల్లి కూడా తనకు దగ్గరగా వచ్చి మాట్లాడితేనే గుర్తిస్తుంది. కానీ, తల్లిని మించిన ప్రేమను మూర్తీభవించుకొన్న సద్గురుమూర్తికే ఆ ఎల్లలు లేని ప్రేమ సాధ్యం. వారి చుట్టూ ఉండే వేలాదిమంది జనసమూహంలోంచి ఎవరికి వాళ్ళం గురువుగారు మన వంక చూడలేదే, మనతో మాట్లాడలేదే, మనమంటే ప్రేమ లేదా అనుకొంటాం. కానీ, వారికందరూ సమానమే. అందరినీ ప్రేమగానే చూస్తారు. భక్తులు వేయిమంది ఉన్నా ఒక్కొక్క భక్తునికి భగవంతుడు వారి స్వంతమే అన్న అనుభూతి కలుగుతుంది. దైవస్వరూపులు కనుకనే గురుదేవులు మనందరినీ ఇంతగా గమనించుకొంటారు! ప్రేమిస్తారు!

# లేదు నీ కరుణకు పోలిక

మజ్జిగ నరేంద్రనాథ్
హోమియోపతి వైద్యులు, నెల్లూరు
జన్మించిన సం॥ 1965

నెల్లూరు, నవంబర్ 2000

1993 జనవరిలో తెనాలిలో శ్రీసాయి పూజోత్సవాలు ఎంతో ఘనంగా జరిగాయి. గురువుగారు శిరిడీ నుండి వచ్చి ఆ పూజోత్సవాల్లో పాల్గొనడంతో ఆ ఉత్సవాల ఉత్సాహాన్ని, వైభవాన్ని తెనాలి పురవాసులు ఏనాటికీ మరచిపోలేరు.

ఉత్సవం ముగిసి గురువుగారు తెనాలి నుండి తిరిగి ఊరికి బయల్దేరుతున్నారు. అప్పుడు ఉదయం ఐదు గంటలై ఉంటుంది. గురువుగారికి వీడ్కోలు చెప్పాలని జనం అక్కడ గుంపులు గుంపులుగా ఉన్నారు. నేను, విజయభాస్కర్ ఆ జనవాహినిలో కలిసిపోయి అక్కడే నిలుచొని ఉన్నాం. మామూలుగా అయితే ఎప్పుడూ గురువుగారు బయలుదేరి వెళ్ళేముందు నాతో కొద్దిసేపైనా మాట్లాడేవారు. ఈ జనంలో ఆ ఆలోచనే గగనకుసుమమై పోయింది. వారితో నేరుగా రెండు మాటలు మాట్లాడుకొనే అవకాశం లేకుండా వారలా వెళ్ళిపోతుంటే నాకు చెప్పలేని బాధ, అసంతృప్తి కలిగాయి. దిగాలుగా చేతులు జోడించి వారి వంకే చూస్తున్నాను. గురువుగారు కారులో కూర్చొంటూ నా వంక చూశారు. "వస్తున్నావు కదా?" అనడిగారు నన్ను.

ఒక్క క్షణం నాకేమీ అర్థం కాలేదు. ఎక్కడికి? 'వస్తున్నావా' అని అడిగారు? అసలు వారెక్కడికి వెళుతున్నారు? నాకేమీ తెలియదు. వారడిగిన దానికి మాత్రం అప్రయత్నంగానే తలాడించాను. కారు కదిలింది. దానికి ముందూ వెనకా ఇంకా కార్లున్నాయి. 'ఆ కార్లలో ఏమన్నా కూర్చోమనా, ఏమిటి గురువుగారు చెప్పింది? ఏదైనా కారులో ప్లేస్ చూసుకుని కూర్చోవాలా వద్దా?'

నేనిలా తర్జనభర్జనలు పడుతుండగానే వరుసగా కార్లన్నీ కదిలిపోయాయి. వెంట వెళ్ళిన కార్లన్నీ ఊరి పొలిమేరలదాకా వెళ్ళి వెనక్కు వచ్చేశాయి. గురువుగారున్న కారు ఒక్కటే ముందుకెళ్ళిపోయిందట. ఇంతకీ గురువుగారు ఎక్కడికి వెళ్ళింది మాత్రం ఎవరికీ తెలియలేదు.

"గురువుగారు ఎక్కడికి వెళ్ళి ఉంటారు? అనుసరించి వెళదామన్నా వారున్న చోటు తెలియడంలేదే?" అని పరిపరి విధాల ఊహాగానాలు చేస్తూ, ఏదీ ఒకదానితో

ఒకటి సమన్వయపడక అయోమయంగా తయారయింది నా మనస్సు. అప్పుడు మా అమ్మా, నాన్నా గుంటూరులోనే ఉన్నారు. తెనాలి నుంచి నేరుగా గుంటూరులో ఇంటికి వెళ్ళి, సాయంత్రానికి నెల్లూరు చేరాము.

అప్పటికింకా నాకు వివాహం కాలేదు. ఇంట్లో నా పనులవీ చూసుకొనేందుకు చిన్న కుర్రాడొకడుండేవాడు. నన్ను చూడగానే పని కుర్రాడు గబగబా నా దగ్గరకొచ్చి "సార్, గురువుగారు ఉదయమనగా మీ కోసం వచ్చారు. ఇంకా ఎవరో చాలామంది ఉన్నారు" అన్నాడు.

వాడన్న మాటలు విని నా చెవుల్ని నేను నమ్మలేకపోయాను. వాడిని దాటుకుని పరిగెత్తుకొంటూ ఇంటిలోకి వెళ్ళి చూశాను.

అక్కడ... సత్సంగం జరుపుకునే విశాలమైన హాల్లో ఓ చాప మీద గురువుగారు నిద్రపోతున్నారు. వారి చుట్టూ ఇంకా కొందరు గురుబంధువులు ఉన్నారు. నేను ఉదయం ఐదు గంటల నుండి ఎవరి గురించయితే ఎక్కడికి వెళ్ళారో తెలియక ఆరాట పడుతున్నానో వారు... నా గురుదేవులు, ప్రొద్దుననగా నా ఇంటికే వచ్చి నా కోసం చూస్తూ, అట్లా కటిక చాప మీద పడుకుని ఉన్నారా? నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

***భక్తుడు:*** *బాబా, రమణమహర్షిలాంటి మహాత్ములకు ఇష్టాయిష్టాలు ఉంటాయా గురువుగారూ?*

***గురువుగారు:*** *వాళ్ళేదీ తమ ఇష్టప్రకారం జరగాలని కోరుకోరు. ముఖ్యంగా స్వవిషయాలపట్ల. ఘటనలన్నీ యథేచ్ఛగా ఎవరి ప్రమేయం లేకుండ వాటికవే జరిగిపోతుంటాయి. వాళ్ళు దాంట్లో కల్పించుకోరు. మనకేదైనా అవసరం ఏర్పడి వారినడిగినప్పుడు, వారి నుండి జవాబు వస్తుంది. అదే వారి సంకల్పం. వారి సంకల్పం నీటి మీద వ్రాసిన గీతలాంటిది. అది అక్కడ ఉందని చెప్పవచ్చు. లేదనీ చెప్పవచ్చు. మన అవసరాలను బట్టి అది మారుతుంటుంది కూడా! వారికి ఒక వ్యక్తిపై స్థిరమైన అభిప్రాయం కానీ, భావన కానీ ఉండవు. "ఈ వ్యక్తి ఇలాంటి వాడు. ఇతనితో ఈ విధంగా మసలుకోవాలి! ఆ వ్యక్తి అలాంటివాడు. అతనితో అలా ప్రవర్తించాలి" అని వారికుండదు. ఒక సంకల్పం కానీ, ప్రతిచర్య కానీ, ప్రవచనం కానీ మన అవసరాలకు అనుగుణంగా వస్తుంటుంది.*

*సత్పురుషులను అర్థం చేసుకోవడంగాని, వారి గురించి మాట్లాడటంగాని బహుకష్టం. వారిని గురించి వివరించడం ఒక విఫలయత్నమే! రమణ మహర్షిలాంటి మహాత్ముడే ఎన్నో సందర్భాలలో "నేనేదీ వివరించలేను. ఆ విషయం గురించి మాట్లాడడానికి నేనెవర్ని?" అన్నారు.*

కొద్దిసేపటికి తేరుకుని మెల్లగా దగ్గరకు వెళ్ళాను. నిద్రపోతున్నవారల్లా చప్పున కళ్ళు తెరచి నన్ను చూసి "వచ్చేశావా?" అంటూ లేచి కూర్చొన్నారు. "నీ కోసమే చూస్తున్నానయ్యా, నువ్వొస్తే మాట్లాడి వెళదామని" అన్నారు.

గురువుగారు లేచిన అలికిడికి మిగిలిన వారంతా కూడా లేచేశారు. నేనింక హడావుడిగా అతిథి మర్యాదల ఏర్పాట్లలో పడ్డాను. గురువుగారు స్నానం చేయడానికి వేడి నీళ్ళు పెట్టమన్నారు. ఆ తర్వాత స్నానం చేసి, టిఫిన్ తిని గురువుగారు మరలా బయలుదేరారు. వారు బయలుదేరుతుంటే నేను వారి పాదాలకు నమస్కారం చేసుకున్నాను. నా నుదుట ఊదీ పెడుతూ, చిరునవ్వుతో గురువుగారు నా వంక చూస్తూ అడిగిన మాట "ఇప్పుడు తృప్తిగా ఉందా?" అని.

ఒకరోజు, గురువుగారు మంచంపై కూర్చొని దీక్షగా ఏదో పుస్తకం చదువుతూ ఉన్నారు. నేను వారికి దగ్గరగా కూర్చొని ఉన్నాను. ఎంతో ఏకాగ్రతతో చదువుతున్న గురువుగారిని తదేకంగా చూస్తూ, నేను మనసులో "నాకు ఎప్పటికీ మీయందు అచంచలమైన భక్తి ఉండేలా నన్ను అనుగ్రహించండి" అని ప్రార్థించుకొంటున్నాను. గురువుగారు వెంటనే పిలిచినట్లుగా నావైపు చూస్తూ "ఏంటి? ఏమంటున్నావు?" అని అడిగారు. నేను మనసులో అనుకొన్నది గురువుగారు నేరుగానే అడిగినట్లు ప్రశ్నిస్తుంటే నోట మాటరాక అలాగే చూస్తుండిపోయాను.

"నువ్వేం ఆలోచిస్తున్నా, చేస్తున్నా నాకు ఇక్కడ తెలుస్తుంది!" అంటూ తమ హృదయం వైపు చూపుతూ అన్నారు గురువుగారు!

1997 నవంబర్ 30వ తేది నెల్లూరులో అఖిలాంధ్ర సాయి సత్సంగ సమ్మేళనం జరిగింది. నెల్లూరు ప్రాంతంలో అక్టోబరు, నవంబరు నెలలు తుఫానుకు నెలవులని చెప్పవచ్చు. ఆ ఏడాదీ అలాగే ఇరవై రోజులుగా వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. నిర్ణయించుకున్న తేదీలో వర్షం తెరిపినివ్వకపోతే ఎంతో ఘనంగా జరపాలనుకొన్న

ఉత్సవమెలా సాగుతుందోనని, కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గురుబంధువులందరికీ ఆందోళనగా ఉంది.

రోజురోజుకి వర్షం ఉధృతమవుతున్నట్లే ఉంది కానీ ఏ మాత్రం తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు. ఫంక్షన్ ఇక అయిదారు రోజులే ఉంది. గురువుగారు అప్పుడు తిరుమలలో ఉన్నారు. నేను తిరుమలకు వెళ్ళి కార్యక్రమం విజయవంతమయ్యేలా గురువుగారిని ఆశీస్సులడిగాను. వర్షం నిలిస్తే తప్ప మేము ఏ ఏర్పాట్లూ చేసుకోలేమని అర్థించాను. గురువుగారి ఆశీర్వాదం తీసుకుని ఇక అన్నీ వారే చూసుకొంటారని నిశ్చింతగా నెల్లూరు వచ్చేశాను. కార్యక్రమం రెండు మూడు రోజుల్లోనే ఉంది. జోరున కురుస్తున్న వాన మాత్రం ఏమీ తగ్గేలా లేదు. నేను మళ్ళీ గురువుగారిని అర్థించాను. *"ఫంక్షన్ రోజుకి ఇబ్బంది లేకుండా ఉంటే చాలును కదయ్యా"* అన్నారు గురువుగారు.

సరిగ్గా వారు అభయమిచ్చినట్లుగానే కార్యక్రమం ముందురోజు రాత్రి నుంచీ వాన ఆగింది. కార్యక్రమానికి ఏర్పాట్లు సజావుగా జరిగేలా ఆకాశం నిర్మలమయింది. ఫెళ్ళున ఎండ కాసింది. కార్యక్రమం అంతా వైభవంగా, నిర్విఘ్నంగా జరిగింది. ఆశ్చర్యమేమిటంటే మళ్ళీ ఆ వేకువఝాము నుండే వర్షం యథాతథంగా కురిసింది.

ఒకసారి నేను శిరిడీ నుండి గురువుగారితో కలిసి తిరుమలకి రావడం జరిగింది. అప్పటికే దాదాపు నేను ఊరు నుంచి బయలుదేరి వచ్చి 20 రోజులవుతుండడంతో నన్ను ఇంటికి వెళ్ళి రమ్మన్నారు గురువుగారు. నేను నెల్లూరుకని ప్రయాణమవుతుంటే, గురువుగారే *"ఇంత దూరం తిరుమలదాకా వచ్చి వేంకటేశ్వరస్వామి దర్శనం లేకుండా ఏం వెళతావు? గుడికి వెళ్ళి దర్శనం చేసుకుని ఊరికి వెళ్ళు"* అన్నారు.

అయితే ఆ రోజు శనివారం కావడంతో స్వామి దగ్గర విపరీతమైన రష్‌గా ఉంటుందని, అప్పుడు వెళితే దర్శనానికి క్యూలో 12, 13 గంటలు వెయిట్ చేయాల్సి ఉంటుందని చెప్పారు అక్కడున్నవారు. నాకేం చేయాలో తోచలేదు. ఆ సంగతే గురువుగారితో చెప్పాను.

*"అలాగా? సర్లే నువ్వెళ్ళి స్నానం చేసిరా"* అన్నారు గురువుగారు.

నేను ఇక గురువుగారి మీదే భారం వేసి స్నానం చేసి సిద్ధంగా వచ్చాను. అప్పుడే శ్రీరాజేంద్రగారని తిరుమల క్యాంప్ కోర్టు జడ్జిగారు గురువుగారి దర్శనానికి

వచ్చారు. ఆయన గురువుగారి దర్శనం రాత్రికి ఉంటుందని తెలుసుకుని, వెళ్ళబోతూ కొద్ది అడుగులు వేసినాయన వెనక్కు తిరిగివచ్చి నాతో "నాకు ట్రాన్స్‌ఫరయింది. నేను రేపు రిలీవ్ అయిపోతున్నాను ఇక్కడ నుంచి. నాకు ఈ రోజు స్వామి దగ్గర స్పెషల్ దర్శనానికి అవకాశం ఉంది. ఇప్పుడు మీరెవరైనా రాదలిస్తే నాతో పాటు రావచ్చు" అన్నారు.

నాకు సునాయాసంగా దర్శనం అయ్యేందుకు గురువుగారు నిమిషాలలో ఎంత చక్కని ఏర్పాటును చేశారు, స్వయంగా ఆఫీసరే దర్శనానికి తీసుకుని వెళ్ళేలా! అని ఆశ్చర్యపోయాను. నేను ఆయనతో పాటు వెళ్ళి హాయిగా దర్శనం చేసుకుని వచ్చి ఇక ఊరికి వెళ్ళేందుకు గురువుగారిని సెలవడిగినప్పుడు "*ఊఁ దర్శనం అయిందా?*" అని ఆప్యాయంగా నవ్వారు గురువుగారు.

# గురుచరణ్

హరిశ్చంద్ర. డి. గవారే
గవర్నమెంట్ ఉద్యోగి, శిరిడీ
జన్మించిన సం॥ 1960

శిరిడీ, ఆగష్టు 2004

గురువుగారికి చేరువగా ఉండాలని శిరిడీలోని సాయిపథం కాలనీలో గురుబంధువులందరితో కలిసి నేను కూడా కొంత స్థలం కొనుక్కున్నాను. ఆ స్థలంలో నేను ఒక చిన్న ఇల్లు కట్టాలనుకుని, గురువుగారి ఆశీస్సులు తీసుకుని నిర్మాణం మొదలుపెట్టాను. ఇల్లు కడుతుండగా నాకు ఒక ఆలోచన వచ్చింది.

అంతకు పూర్వం నేను, మరికొందరు గురుబంధువులం కలసి గురువుగారు అద్దెకు ఉండటానికి ఇల్లు చూడాలని శిరిడీ అంతా తిరిగాం. ఎక్కడా గురువుగారికి అనువైన ఇల్లు దొరకలేదు. అందువలన ఇప్పుడు నేను గురువుగారికి తగినట్టుగా ఒక ఇల్లు కడితే అందులో "గురువుగారు అద్దెకు ఉండవచ్చు కదా" అని అనిపించింది.

వెంటనే గురువుగారి నివాసానికి అనుగుణంగా, వారికి సన్నిహితంగా ఉన్న గురుబంధువులతో చర్చించి, ముందు మొదటి అంతస్తులో ఇంటి నిర్మాణం ప్రారంభించాను. అయితే, గురువుగారు ఆ ఇంట్లో ఉంటారన్న నమ్మకమేమిటని అందరూ అడిగారు. "గురువుగారు ఉండాలన్న ఆకాంక్షతో నేను ఇల్లు కడతాను. మిగతాది బాబా దయ" అని చెప్పేవాడిని.


నేను గురువుగారికి అద్దెకు ఇవ్వాలని ఎందుకు కోరుకొన్నాననే సంశయం ఎవరికైనా కలుగవచ్చు. గురువుగారు శిరిడీలో ఎన్నడూ ఎవరి ఇంటిలోనూ అద్దె ఇవ్వకుండా ఉండలేదు. నా ఇంట్లో ఉండాలంటే నేను కూడా అద్దె తీసుకోవలసిందే. వేరే మార్గం లేదు. ఎలాగైనా వారు నా ఇంట్లో ఉండటమే మహాభాగ్యమనుకున్నాను.

ఒకటికి నాలుగుసార్లు సన్నిహిత గురుబంధువులందరికీ చూపించి నిర్మాణంలో వారి సలహాలు పాటించాను. వెనుకవైపు మెట్లు కూడా అదనంగా కట్టించాను. నిర్మాణం పూర్తయింది. అంతా బాగుంది కానీ, ఇంటి ఎదురుగా ఒక పెద్ద వసతి గృహముంది. అందులోనే గురుబంధువులంతా ఎక్కువ భాగం దిగుతుంటారు. అందుకని గురువుగారు ఇందులో ఉంటారనే దానికి అవకాశాలు చాలా తక్కువ అని అందరూ నిరుత్సాహపరచసాగారు.

నేను చాలా దిగులుపడ్డాను. ఏమీ తోచలేదు. రెండు నెలలపాటు రోజూ మందిరానికి వెళ్ళి బాబాను "గురువుగారు నా ఇంట్లో ఉండేలా చేయమ"ని ప్రార్థించే వాడిని. ఈమధ్యకాలంలో అమ్మగారు కూడా వచ్చి ఇంటిని చూశారు కానీ, సమ్మతి తెలుపలేదు. వేరే ఇంకెవరికైనా అద్దెకు ఇచ్చుకోమని కూడా నాకు సూచించారు. కానీ, నాకు ఏ మూలో గురువుగారు నన్ను నిరాశపరచరు అన్న ఆశ. అందరూ ఆశ్చర్యపోయే రీతిన నాకు ఒకరోజు "గురువుగారు మీ ఇల్లు (మొదటి అంతస్తు) అద్దెకు తీసుకుంటారు" అన్న కబురు వచ్చింది. దాంతో నా ఆనందం వర్ణనాతీతం. గురువుగారు నా మొర విన్నారు. నా నమ్మకం వమ్ముకాలేదని నేను ఎంతో సంబర పడ్డాను. ఇల్లంతా కడిగి, ముగ్గులు వేసి కావలసినవన్నీ అమర్చి నేను, నా భార్య గురువుగారికి స్వాగతం చెప్పే కార్యక్రమంలో నిమగ్నమయ్యాము.

ఆ విధంగా నా ఆశ, ఆశయం నెరవేరాయి. ఇందులో నా స్వార్థమూ ఉంది. అంతకు ముందు గురువుగారు నా ఫ్లాటులో ఆరు మాసాలు అద్దెకు ఉన్నారు. కానీ అప్పుడు నేను 'సాయి ఉద్యాన్'లో మా డిపార్టుమెంటు వారిచ్చిన ఇంట్లో ఉండేవాడిని. కానీ ఇక్కడ ఈ ఇంట్లో, నేను గురువుగారితో కలసి ఉండే భాగ్యం కలిగింది. అదే నేను కోరుకొనేది.

'గురుచరణ్' అని పేరు పెట్టుకొన్న నా ఇంటిని, గురువుగారు వారి చరణ స్పర్శతో పునీతంగావించారు.



*శ్రీబాబూజీ, అలహాబాద్, 1995*